# నరుడు



మధుబాబు

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

# నరుడు-1

సూర్యోదయం అయిన రెండో ఘడియలో తన గుహలో నుంచి బయటికి వస్తుంది ఆ చారల మెకం.

తల దగ్గిర్నించి తోక దాకా దాదాపు తొమ్మిది మూరల పొడవు వుంటుంది అది. పాదాల దగ్గిర మొదలుపెట్టి వెన్ను పైభాగం వరకూ నాలుగు మూరలకు ఇంకో రెండు మూడు అంగుష్టాల ఎత్తును కలిగి వుంటుంది.

చురకత్తుల వంటి కోరలను బయటపెట్టి ఒకే ఒకసారి ఘనగర్జన చేసిందంటే, నిలువుగుడ్లు పడి ఎక్కడివక్కడ నేలకు అతుక్కుపోయినట్లు నిలబడిపోతాయి అడవిలో సంచరించే ఇతర జంతువులన్నీ.

ఛెంగున గాలిలోకి ఎగిరి సూటిగా పోయి మీద పడుతుందా మృగం.కాలయముడి మృత్యుఖడ్గాల మాదిరిగా వుండే వాడి గోళ్ళతో ఒకే ఒక దెబ్బ కొడుతుంది.

తమకు ఏమౌతున్నదో తెలియకముందే ప్రాణాలు వదిలేస్తాయి దాని దెబ్బకు గురైన జంతువులు. ఆ భీకర మృగానికి ఆహారంగా మారిపోతాయి.

తనివితీరా ఆరగిస్తుంది అది. ఆ తరువాత అడుగులో అడుగువేస్తూ తను ఎప్పుడూ దాహం తీర్చుకునే నీటి మడుగు దగ్గరికి పోయి నీళ్ళు తాగుతుంది. ఆ తరువాత నోటిలోని భాగాలన్నీ బయటికి కనిపించేలా ఆవులించి ఆ మడుగు దగ్గిరే వెల్లకిలా పడుకుంటుంది.

గుండెల్ని చిక్కబట్టుకుని చెట్లచాటునా, పుట్టల చాటునా, చెట్లకొమ్మల మాటునా ఒదిగివున్న జంతువులన్నీ అప్పుడు తమ భయాన్నించి తేరుకుంటాయి.

ఒకదాని తరువాత ఒకటిగా తాము దాగుకుని వున్న మదుగుల దగ్గిర్నించి కదిలి వేటిదారిన అవి వెళ్ళిపోతాయి.

దాదాపు ఇరువది సంవత్సరాలుగా ఆ నల్లకొండల మీద దట్టంగా ఎదిగివున్న అడవిలో ప్రతిరోజు కనిపించే దృశ్యం అది.

"పెద్దపులి అంటే పది పదిహేను సంవత్సరాలకు మించి బతకటం అసంభవమని అంటారు. మరి ఈ దుర్మార్గపు జంతువు ఇన్ని సంవత్సరాలు ఎలా జీవించగలిగింది? అసలు ఈపాటికి ముసలిదై ముడుచుకుపోవాలి కదా...." కట్టెలు కొట్టుకోవటానికి తెచ్చుకున్న గొడ్డలిని తడిమి చూసుకుంటూ తన సరసన వున్న మనిషిని అడిగాడు ఆ యువకుడు.

"ఇది మామూలు పులికాదు... మంత్రాలు నేర్చిన పులి... ఇంకో ఇరవై సంవత్సరాల వరకూ బతికేవున్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు...." చిన్నకంఠంతో సమాధానం ఇచ్చాడు ఆ మనిషి.

"మంత్రాలు తంత్రాలు అన్నీ వట్టి కట్టుకథలు. దొరికిన జంతువులన్నిటినీ దొరికినట్లే విరుచుకు తిని తెగబలిసిపోయి వుంటుంది. ఆ బలుపు కారణంగానే ఇంత కాలంగా బతికే వుంటోంది." తన అభిప్రాయాన్ని వెంటనే వెల్లడించాడు ఆ యువకుడు.

"ఏది ఏమయినా అది మంత్రాలు నేర్చిన పులి అయినా కాకపోయినా, మనం దాని కంటపడితే మాత్రం మనకి నూకలు చెల్లిపోయినట్లే...." అతని అభిప్రాయాన్ని విని కోపం తెచ్చుకోకుండా పరమ శాంతంగా చెప్పాడు అతనితో పాటు వచ్చిన మనిషి.

"అడవిలో సంచరించటం నాకు మహబాగా చేతనయిన విద్య... ఎటువంటి జంతువునయినా మనకి వంద ధనువుల దూరంలో వుండగానే గుర్తు పట్టగలను. చేతకాని వాడిమాదిరిగా ఇలా చెట్టుచాటున నిలబడి సమయాన్ని వృధా చేయటం నాకు ఇష్టం లేదు. వచ్చిన పనిని వెంటనే పూర్తి చేసుకోవాలి" అంటూ అంతవరకూ తాను నిలబడి వున్న ప్రదేశాన్ని వదిలి ముందుకు కదిలాడు ఆ యువకుడు.

"వద్దు... వెళ్ళవద్దు... ఆ పులి ఇంకా తన వేటను పూర్తి చేసుకున్న చిన్నెలు కనిపించటం లేదు...." ఆందోళనగా అంటూ అతని చేతిని పట్టుకుని వెనక్కి లాగాడు సరసనే ఉన్న గ్రామస్థుడు.

"అది వేటను పూర్తి చేసుకున్నదీ లేనిదీ నాకెలా తెలుస్తుంది?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ యువకుడు.

"అడవి అంతా నిశ్శబ్దంగా వుంది... చెట్లమీది పిట్టలు కూడా ఎటువంటి సందడి చేయటంలేదు... మనకేకాదు... ఇక్కడి జంతువులు కూడా ఆ దుష్ట జంతువంటే భయమే... దాని వేట పూర్తి అయితే తప్ప ఇవి తమ పనులు మొదలు పెట్టవు" ఓపికగా చెప్పాడు ఆ గ్రామస్థుడు.

"సుతిమతి లేని ఈ జంతువులకు అటువంటి దూరదృష్టి కూడా వుంటుందా? విచిత్రంగా వుంది...." తనలో తాను అనుకుంటూ ఎందుకో తన ఎడమచేతి వైపున వున్న ఒక ముళ్ళపొద వంక చూశాడు ఆ యువకుడు.

చూసిన వెంటనే రక్తం గడ్డకట్టుకు పోయినట్లు అనిపించింది అతనికి. అప్పుడే ఏదో నీటి మడుగులో మునిగినట్లు శరీరమంతా చెమటతో తడిసిపోయింది. చలి జ్వరం వచ్చినట్లు అదేపనిగా వణకటం మొదలు పెట్టాయి అవయవాలు.

"ఏమయింది? నీకు ఏమిటి అయింది??" ఆశ్చర్యం ఆందోళన కలగలిపిన కంఠంతో అడుగుతూ అతని భుజాన్ని పట్టుకున్నాడు సరసన వున్న గ్రామస్థుడు.

"పు...పు.... పులి.... పె... పెద్ద... పు... పులి...." తడబడుతున్న కంఠంతో అస్పష్టంగా అన్నాడు యువకుడు.

తన దగ్గిర వున్న గొడ్డలిని వెంటనే క్రిందికి వదిలేశాడు ఆ గ్రామస్థుడు. ఒకేఒక గంతుతో తాము ఏ చెట్టుచాటున నిలబడి వున్నారో, ఆ చెట్టుమీదికే ఎగబ్రాకాడు.

తను కూడా అదే మాదిరి చేయాలన్న కోరిక యువకుడికి కూడా కలిగింది. కాని అడుగు కదపటం అతనికి అసాధ్యమైపోయింది.

ముళ్ళపొద చాటునుంచి మూడు అడుగులు ముందుకు వేసింది ఆ మహావ్యాఘ్రం... తాచుపాము మాదిరిగా పొడవుగా వున్న తోకను నేలకేసి తాటిస్తూ వున్నట్లుండి గర్జించింది.

యువకుడి చేతుల్లోని గొడ్డలి దానంతట అదే జారి క్రింద పడిపోయింది.... "కా... కాపాడండి. ఎవరైనా వచ్చి నన్ను... ర... రక్షించండి..." జీరపడిన కంఠంతో బిగ్గరిగా అరిచాడు.

"వచ్చేయ్... చెట్టుమీదికి వచ్చేయ్..." బలమైన కొమ్మమీదికి చేరుకుని, అవసరమైతే చేతుల్ని అందించి అతనికి సహాయం చేసేందుకు సిద్ధంగా క్రిందికి వంగుతూ కీచుగా హెచ్చరించాడు పైకి ఎగబ్రాకిన గ్రామస్థుడు.

బండిచక్రాల వంటి కళ్ళను గిరగిరా తిప్పుతూ ఒక్కసారిగా గాలిలోకి ఎగిరింది పెద్దపులి... కన్నుమూసి కన్ను తెరిచేలోగా వచ్చి తన గుండెల మీద పడుతుందనీ, ఒకే ఒక దెబ్బతో ప్రాణాల్ని హరించి వేస్తుందని అర్థమైంది యువకుడికి. భయం రెట్టింపు అయింది. స్పృహ తప్పిపోయింది. నిలుచున్నవాడు నిలుచున్న ప్రదేశంలోనే మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు.

సరిగ్గా అతని తలకు సమీపంలో నేలను తాకి, తన పంజాను పైకి ఎత్తింది ఆ దుష్టమృగం....

ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళను గట్టిగా మూసుకున్నాడు చెట్టుమీదికి చేరుకున్న గ్రామస్థుడు.

ఒకటి... రెండు... నాలుగు... పది క్షణికాలు గడిచిన తర్వాత కూడా క్రింది నుంచి ఎటువంటి అలికిడీ వినరాక పోవడంతో కనులు తెరిచి చూశాడు.

పడిపోయిన యువకుడి తలను పంజాతో పగుల కొట్టబోయిన పెద్దపులి తోకను పట్టుకుని అతిబలవంతంగా వెనక్కి లాగుతున్నది ఒక ఆకారం.

తన వేటకు అడ్డంకిగా మారితే ఆగ్రహంతో కంపించిపోతూ గుండెలు జలదరించేటట్లు శబ్దాలు చేయవలసిన ఆ ముప్వన్నెల మెకం – పెంపుడుపిల్లి మాదిరి వగలు పోతూ వెనక్కి జరుగుతోంది.

"నీకు నీతోపాటు వచ్చిన ఈ పిరికి వాడికి ఎటువంటి ప్రమాదం లేదు. క్రిందికి దిగి అతనికి తెలివి తెప్పించు...." పూర్తిగా వెనక్కిలాగిన పులి తలమీద చెయ్యివేసి ఆప్యాయంగా తడుముతూ చెట్టు మీది గ్రామస్థుడికి చెప్పిందా ఆకారం.

తన చెవుల్ని తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నట్లు విచిత్రంగా చూస్తూ క్రిందికి దూకాడు ఆ గ్రామస్థుడు. తన వీపుకు వేలాడదీసుకున్న తాంబేటికాయలోని నీళ్ళను యువకుడి ముఖంమీద చిలకరించాడు.

"ర... రక్షించండి... కా... కాపాడండి...." అని అరుస్తూ పైకి లేచి, పక్కకు పరిగెత్తబోయాడు ఆ యువకుడు.

"ఈ పని ఆ పులిని చూసిన వెంటనే చేసి వుంటే ఎంతో బాగుండి వుండేది. అప్పుడు బొమ్మలా బిగుసుకుపోయి ఇప్పుడు పెద్ద మొనగాడి మాదిరి పారిపోబోతున్నావు..." వెక్కిరింపుగా అంటూ అతని భుజాలు పట్టుకుని అతి బలవంతంగా ఆపాడు గ్రామస్థుడు.

"అది... ఆ మృగం ఏమైంది..." అడుగుతూ వెనక్కి చూచి మళ్ళీ మూర్ఛమాదిరి బిగుసుకుపోయాడు యువకుడు.

"ఈ కొండల మీద మృత్యువుకు ప్రతిరూపంగా వుండే ఈ పులి సంచరిస్తోందని మీ గ్రామస్థులందరికీ తెలుసు. దాన్ని ఎదిరించటం అసాధ్యమని కూడా తెలుసు. మరి ఇతనేమిటి ఇందాక చాలా ఎక్కువ మాటలు మాట్లాడాడు?" గ్రామస్థుడిని అడిగింది పులిని వెనక్కిలాగిన ఆకారం.

"చిన్నతనంలోనే దూరంలో వున్న మాతామహుడి దగ్గరికి పంపించబడి రెండు రోజుల క్రితమే గ్రామంలోకి వచ్చాడు. ఈ అడవి గురించి మీ వద్దనే వున్న బెబ్బులి గురించి ఏమీ తెలియదు" వినయంగా సమాధానం ఇచ్చాడు గ్రామస్థుడు.

"నా ఈ గారాబాల పులిని ఎదిరించగల మొనగాడు ఎవరైనా కనిపిస్తాడేమోనని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాను. రోజులు గడిచి పోతున్నాయి సంవత్సరాలు వెళ్ళిపోతున్నాయి ఆశ మాత్రం తీరటంలేదు." అంటూ వెనుతిరిగింది ఆ ఆకారం.

"ఆగండి.... ఒక్కక్షణం.. ఒకే ఒక్కక్షణం.. మీరు ఎవరో చెప్పి...." అంటూ బిగ్గరిగా పిలిచాడు గ్రామస్థుడు.

ఆ పిలుపు తనకు వినబడనట్లే అడుగులు వేసిందా ఆకారం. ఒక చెట్టు చాటుకుపోయి అదృశ్యమైపోయింది.

దూరంలో కనిపించిన ఏదో జంతువు మీదికి దుమికి చెవులు చిల్లులు పడిపోయేటట్లు ఆ మహా మెకం చేసిన వికృత గర్జన మాత్రం వినిపించింది.

* * * * *

"...అసంభవం.... ఆ పులిని ఎదిరించి మట్టుబెట్టగలిగిన మొనగాడు ఈ భూమి మీద వుండడం సాధ్యం కాదు...." చీకటిపడిన పావుఘడియకు గ్రామం మధ్యలో వున్న రచ్చబండ దగ్గరికి వచ్చి తన మనసులోని మాటను నిర్మొహమాటంగా బయట పెట్టాడు ఒక గ్రామస్థుడు.

పెద్దపులిని వెనక్కి పిలిచిన విచిత్రపు ఆకారాన్ని అక్కడి వారందరికీ వర్ణించి చెప్పాడు యువకుడితో పాటు అడవిలోకి వెళ్ళివచ్చిన గ్రామస్థుడు. ఆ ఆకారపు మాటల్ని కూడా యధాతథంగా వినిపించాడు.

"అతను ఎవరోగాని మహామాంత్రికుడై వుంటాడు... మాంత్రికులకే తప్ప మామూలు మనుష్యులకు అటువంటి క్రూరజంతువుల్ని మచ్చిక చేసుకోవటం కుదరదు" అన్నాడు మరో గ్రామస్థుడు.

"అతను ఎవరనేది ఇప్పుడు అప్రస్తుతం. అతని ఆశయం తను పెంచుతున్న ఆ బెబ్బులిని ఎదుర్కోగలిగిన మొనగాడిని చూపడం... ఆ పని ఎవరి వల్ల సాధ్యపడుతుంది?" అందరి మాటల్ని ఆలకించి తీరికగా అడిగాడు గ్రామపెద్ద.

"ప్రమథ రాజ్యంలో వున్నాము మనం. వకుళేంద్రభూపతి మనల్ని పరిపాలిస్తున్నాడు. సాహసవీరుడే తను.. అయినాసరే ఈ పులిని..." అంటూ మాటల్ని ఆపాడు ఇంకో గ్రామస్థుడు.

"ఏమయింది? ఎందుకు ఆగిపోయావు?" ఆశ్చర్యంగా అడిగాడు గ్రామపెద్ద.

"ఏదో చప్పుడు... వేగంగా వస్తున్న అశ్వాల అలికిడి..." లేచి నిలబడి గ్రామం పొలిమేరల వైపు చూస్తూ అన్నాడు ఆ గ్రామస్థుడు.

అతని మాటలు ముగిసిన మూడో క్షణికంలో అక్కడ వున్న అందరికీ వినవచ్చాయి ఆ చప్పుళ్ళు. మరో ఆరు క్షణికాల తరువాత దుమ్ముతెరలు రేపుతూ దర్శనం ఇవ్వనే ఇచ్చాయి అశ్వాలు.

కవచాలు శిరస్త్రాణాలు ధరించి, పొడవాటి భల్లేలను బిగించి పట్టుకుని ఆ అశ్వాల మీద వచ్చారు ప్రమధ రాజ్యపు సైనికులు.

"స్వాగతం... అరివీరభయంకరులైన సైనికులకు సైనికాధికారులకు ఘనస్వాగతం... రండి... రండి.. మా రచ్చబండ మీద కూర్చుని మార్గాయాసం తీర్చుకోండి...." గబగబా ఎదురువెళ్ళి వారిని ఆహ్వానించాడు గ్రామపెద్ద.

"అర్ధఘడియ పాటు ఆగగలిగితే రుచికరమైన పదార్థాలను వండించి విందు భోజనాలు ఏర్పాటు చేస్తాము..." అని కూడా చెప్పాడు.

"మీ స్వాగత సత్కారాలు మాకు అవసరం లేదు... మేము వచ్చింది వేరే పనిమీద...." తన అశ్వంమీది నుంచి దిగకుండానే గంభీరమైన కంఠంతో చెప్పాడు ఆ సైనికులకు నాయకత్వం వహిస్తున్న దండనాయకుడు.

"వకుళేంద్ర భూపతుల వారికి మేము సర్వదా విధేయులం. మీరు వచ్చిన పనేమిటో వెంటనే తెలియచేయండి" వినయంగా అన్నాడు గ్రామ పెద్ద.

"ప్రభువులు ప్రవాళ దేశం మీద దండయాత్ర చేయ నిశ్చయించారు... అందుకు ఆహార పదార్థాలు అధికంగా కావాలి.... ధనం కూడా అమితంగా అవసరమౌతుంది" అన్నాడు దండనాయకుడు.

నివ్వెరపోయారు గ్రామస్థులు అందరూ. ఒకరిమొఖం ఒకరు చూసుకుంటూ బొమ్మల మాదిరి నిలుచుండిపోయారు.

"మీ గ్రామం మాకు వెంటనే పదిరెండు పుట్ల ధాన్యం విరాళంగా ఇవ్వాలి... తలకు పది నాణేల చొప్పున మీ గ్రామంలోని వారందరూ ధనం సమర్పించుకోవాలి'' అసలు విసయాన్ని నెమ్మదిగా బయటపెట్టాడు ఆ దండనాయకుడు.

''అయ్యా... దండనాయకుల వారూ... ఇది చాలా అన్యాయం... ఆరుగాలం శ్రమించినా నాలుగైదు పుట్లకు మించిన ధాన్యం మా చేతికి రావటంలేదు. ఉన్న ధాన్యాన్నంతా మీకు అర్పిస్తే మరి మేము ఏమి తిని బ్రతికేటట్లు??" ఆందోళన నిండిన కంఠంతో అడిగాడు గ్రామపెద్ద.

"వట్టిధాన్యం మాత్రమే కాదు... తలకు పది బంగారు నాణేలు కూడా" గుర్తుచేశాడు దండనాయకుడు.

"పది వెండి నాణేలు కూడా మేము ఇచ్చుకునే పరిస్థితిలో లేము. మీరు మమ్మల్ని కరుణించాలి... మాది పేద గ్రామం... అడవి అంచున ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బ్రతుకుతున్నాము...." గబగబా చెప్పాడు గ్రామపెద్ద.

ఎగిరి అశ్వం మీది నుంచి క్రిందికి దూకాడు దండనాయకుడు.... పిడికిలి బిగించి గ్రామ పెద్ద నోటి మీద బలంగా పొడిచాడు.

బాధను భరించడం అసాధ్యమై వెర్రిగా అరుస్తూ వెనక్కి పడిపోయాడు గ్రామపెద్ద. తనతో పాటు అశ్వాల మీది నించి క్రిందికి దిగిన సైనికుల్లో ఒక సైనికుడి చేతిలోని బరిశెను అందుకుని, తనకు దగ్గిర్లో వున్న నలుగురు గ్రామస్థుల మీద రాక్షసుడి మాదిరి విరుచుకు పడ్డాడు దండనాయకుడు.

"దండయాత్రకు ఆహార పదార్థాలు ధనం అవసరమని చాలా మర్యాదగా అడిగితే అధికమైన తెలివితేటలు చూపిస్తున్నారు వాళ్ళు. దొరికిన వాళ్ళని దొరికినట్లు విరగదీయండి... వాళ్ళ ఇళ్ళన్నిటినీ గాలించి విలువైన సామాగ్రినంతా వశపరుచుకోండి. వెళ్ళండి" అంటూ సైనికులకు ఆజ్ఞ ఇచ్చాడు.

అంతకుముందు వరకూ ఎంతో ప్రశాంతంగా వున్న అక్కడి వాతావరణం అరుపులతో ఆర్తనాదాలతో కలుషితం కాసాగింది ఒక్కసారిగా.

ఉలిక్కిపడి కనులు తెరిచాడు శ్యాముడు. రచ్చబండకు దూరంగా గ్రామం పొలిమేరల మీద వున్నది అతను విశ్రాంతి తీసుకుంటున్న ఆ అమ్మవారి ఆలయం.

చీకటి పడకముందే సంధ్య దీపాన్ని వెలిగించి, తూతూ మంత్రాలు రెండు గబగబా చదివి గ్రామంలోకి వెళ్ళిపోయాడు పూజారయ్యా... తిరిగి మరునాడు ఉదయానికిగాని అటుకేసి చూడడు.

"పొద్దుపొడిచే సమయంలో మన దారి ఏదో మనం చూసుకోవచ్చు. అంతవరకూ మన గురించి పట్టించుకునే వారు ఎవరూ వుండరు... నువ్వు నిర్భయంగా నిద్రపోవచ్చు మిత్రమా...." పూజరయ్య వెళ్ళిపోయిన వెంటనే శ్యాముడిని ఆలయ మండపంలోకి తీసుకువస్తూ చెప్పాడు అతని జతగాడు గదాధరుడు.

"మనం సరయిన తిండి తిని ఇప్పటికి మూడు దినాలకు పైనే అయింది. ఆకలి అధికం అవుతున్నప్పుడు నిద్రపోవటం ఎలా?" అడిగాడు అప్పుడు శ్యాముడు.

"నిద్ర పొమ్మని చెప్పింది నిన్ను. నేను కూడా పడుకుంటానని చెప్పలేదు. గ్రామంలోకి వెళ్ళి తినటానికి ఏమైనా లభిస్తే వెంటనే తీసుకు వస్తాను...." అంటూ తను ఆలయం ఆవరణ వెలుపలికి వెళ్ళిపోయాడు గదాధరుడు.

అతను తన ప్రక్కనే వదిలిన ఒక మూటలో నుంచి చిరుగులు పడిన కంబళీ ఒకదాన్ని బయటికితీసి వంటి నిండా కప్పుకున్నాడు శ్యాముడు. రెండు కనుకులే తీయగలిగాడు. మూడవ కునుకు తీయకముందే అతనికి నిద్రాభంగం కావించింది గ్రామంలో చెలరేగిన గందరగోళం.

చిరుగుల కంబళీని పక్కనపెట్టి, మూటలోనే భద్రపరచి వున్న తన పటకా కత్తిని బయటికి తీశాడు అతను.

"ఇప్పుడు దానితో అవసరం లేదు.. ఈ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోవటమే ముఖ్యం...." పరుగుపరుగున ఆవరణలోకి వస్తూ అతనికి చెప్పాడు గదాధరుడు.

"ఎందుకని? ఏం జరుగుతోంది గ్రామంలో?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

రచ్చబండ దగ్గిర వున్న గ్రామస్థులకు, ఆర్భాటంగా వచ్చిన సైనికులకు కనిపించకుండా ఒక ఇంటిచాటున నిలబడి తను విన్న సంభాషణలన్నిటినీ వివరంగా అతనికి వినిపించాడు గదాధరుడు.

"ఈ వకుళేంద్ర భూపతికి రాజ్యకాంక్ష చాలా అధికం అయిపోయింది. తన ఆశయసిద్ధికోసం అమాయకులను పీడించుకు తినటం మాత్రం ఏమీ బాగోలేదు. ఆ సైనికులు ఎంతమంది వున్నారు?" పటకాకత్తిని పక్కన పెట్టకుండా మరింత గట్టిగా బిగించి పట్టుకుంటూ అడిగాడు శ్యాముడు.

"ఎంతమంది వున్నారో నీకు నాకు అనవసరం. ఇప్పుడు ఇక్కడ మనం ఏదైనా గడబిడ చేస్తే చిటికెలో బట్టబయలు అయిపోతాము. మన దారి ఏదో మనం చూసుకోవడం చాలా బాగుంటుంది." శ్యాముడు అవతల పడవేసిన కంబళిని దులిపి తిరిగి మూటలో భద్రపరుస్తూ చెప్పాడు గదాధరుడు.

"అన్నెం పున్నెం ఎరుగని అమాయకులు అవస్తలు పడుతుంటే ఏమీ పట్టనట్లు వెళ్ళిపోవటం బాగుంటుందా?" రెట్టించాడు శ్యాముడు.

"నువ్వు నేను దేవుళ్ళం కాదు మిత్రమా.. పాంచాల, ప్రవాళ, కుంతల, మగధ, జంభార దేశాల్లో బందిపోటు దొంగలుగా ముద్రలు పడిన దేవదిమ్మరులం. ఇప్పుడు గనుక మనం ఎవరిమో ఈ వకుళేంద్ర భూపతికి తెలిస్తే, దండయాత్రకు సిద్ధం చేస్తున్న సైన్యాలన్నిటినీ మన మీదికి పంపకం చేస్తాడు. మన తలల్ని నరికి తన కోట గుమ్మానికి వ్రేలాడదీయిస్తాడు...." విసురుగా అన్నాడు గదాధరుడు.

"మనం ఎవరిమో అతనికి ఎలా తెలుస్తుంది?" పట్టిన పట్టు వదలటం ఇష్టం లేనట్టు మరో ప్రశ్న వేశాడు శ్యాముడు.

"పటకాకత్తి పట్టుకుని నువ్వు ఆ సైనికుల మీదికి ఎగబడిన వెంటనే నీ వేగం నిన్ను పట్టించేస్తుంది. నువ్వు ఎవరివో తెలుసుకోవటానికి నీ చిత్రపటాలు చూడాల్సిన అవసరం లేదు. మంత్రగాళ్ళను పిలిచి అంజనాలు వేయించవలసిన పని లేదు... నీ సాహసమే నీకు శత్రువు" నొసలు ముడిచి చురుకుగా చూస్తూ చెప్పాడు గదాధరుడు.

అతన్ని వెంటనే ఆపకపోతే మరోపావు ఘడియపాటు తనలో ప్రస్ఫుటమయ్యే మార్పుల గురించి అలా చెప్పుకుంటూనే వుంటాడని శ్యామలుడికి తెలుసు.

క్రిందవున్న మూటను భుజానికి తగిలించుకుని వడివడిగా అడుగులు వేస్తూ ఆవరణ వెనుక భాగంలో వున్న ముళ్ళ పొదల దగ్గరికి పోయాడు అతను.

చిమ్మచీకటిలో కూడా అతని అడుగుల చప్పుడును ఆలకించి వెంటనే గుర్తుపట్టేసింది అతని వాహనం. చిన్నగా సకిలిస్తూ ముందుకు వచ్చింది.

అతని దగ్గరికే పోబోతున్న తన వాహనం వంక కోరగా చూస్తూ, కళ్ళేలను చేతిలోకి తీసుకున్నాడు గదాధరుడు.

"పది యోజనాల దూరంలో ఇటువంటి గ్రామమే ఇంకోటి మనకు అగుపిస్తుందిట... అక్కడ కూడా అమ్మవారి ఆలయం ఒకటి గ్రామం వెలుపలే నిర్మించబడిందట. మనం అక్కడికి పోయి విశ్రాంతి తీసుకోవచ్చును...." అంటూ వాహనం మీదికి ఎగిరాడు.

తను తీసుకువచ్చిన మూటను అతనికి అందించి తన అశ్వాన్ని అధిరోహించబోయాడు శ్యామలుడు.

సరిగ్గా అదే సమయంలో పరుగు పరుగున ఆలయం దగ్గరికి వస్తూ అతనికి అగుపించారు కొందరు గ్రామస్థులు.

చేతినిజాచి తన భుజాన్ని పట్టుకోబోయిన గదాధరుడి వంక చురుకుగా చూస్తూ ఆలయం ఎదుటికి పరిగెత్తాడు శ్యామలుడు.

"చంపేస్తున్నారు నాయకా... అడిగినవన్నీ ఇవ్వలేదన్న ఆగ్రహంతో అందరినీ బరిశెలతో పొడిచి ప్రాణాలు తీస్తున్నారు. ఇళ్ళకు నిప్పుపెట్టి నాశనం చేస్తున్నారు" గద్గద కంఠంతో చెప్పాడు ఒక గ్రామస్థుడు.

"కాయకష్టంతో రాటుదేలిన శరీరాలు మీవి. తుప్పుపట్టిన ఆయుధాలతో వచ్చిన ఆ సైనికుల్ని ఎదిరించటం మీకు అసాధ్యమైపోయిందా?" కనుకొలకులు ఎర్రబడుతుండగా అడిగాడు అతన్ని శ్యామలుడు.

ఆడవాళ్ళందర్నీ రచ్చబండ దగ్గరికి చేర్చి కాపలా నిలుచున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే వాళ్ళ తలలు నరికేస్తామని బెదిరిస్తున్నారు...." కన్నీరు బుగ్గల మీదికి జారుతుండగా చెప్పాడు మళ్ళీ ఆ గ్రామస్థుడు.

అరుణవర్ణంలోకి మారిపోయాయి శ్యామలుడి నేత్రాలు.

పక్కలకు కూడా చూడకుండా దట్టీలోని పటకాకత్తిని బయటికి లాగి గ్రామంలోకి పరుగు మొదలుపెట్టాడు అతను.

బరిశెల్ని గాలిలో గిరగిరా తిప్పుతూ, అడ్డుకోబోయిన గ్రామస్థులు కొందరిని తీవ్రంగా హింసిస్తున్న సైనికులు కనిపించగానే – సూటిగా పోయి వారి మీద కలబడ్డాడు.

తమను ఎదిరించే ప్రయత్నం ప్రారంభం అయిందని పది క్షణికాలు ఆలస్యంగా అర్థం అయింది వారి దండనాయకుడికి.

"చంపండి... నరకండి...." అని ఆజ్ఞలు ఇస్తూ వెనుతిరిగి రచ్చబండ దగ్గరికి పరిగెత్తాడు.

"ఒక్కళ్ళని కూడా వదిలి పెట్టకూడదు... అందరినీ హతమార్చేయండి" అంటూ అక్కడి సైనికులకు కూడా చెప్పబోయి... అదిరిపడ్డాడు.

పది మంది సైనికులు వుండాలి అక్కడ... ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడి నేలమీద పడి వున్నారు. తమ బరిశెల్ని క్రింద పడవేసి దూరంగా పారిపోతున్నారు మిగిలిన ఇద్దరూ.

పొడవాటి చెట్టుకొమ్మ నొకదాన్ని పట్టుకుని బ్రహ్మరాక్షసుడి మాదిరి నిలుచుని వున్నాడు గదాధరుడు. పరిగెత్తుకుంటూ వచ్చిన దండనాయకుడిని చూడగానే పెద్దపులి మాదిరి అతని మీదికి దూసుకువచ్చాడు.

ఏ మాత్రం ఆలస్యం చేసినా తను కూడా క్రింద పడిపోవడం తప్పనిసరి అని అర్థమైంది కాబోలు – మహావేగంగా పక్కకు పరిగెత్తాడు దండనాయకుడు. దగ్గిర్లో కనిపించిన ఒక అశ్వం మీదికి ఎగిరి – కాలి మడమలతో దాన్ని గట్టిగా అదిలించాడు.

చెట్టుకొమ్మను గిరాగిరా తిప్పి అతనికేసి విసిరాడు గదాధరుడు. అది వచ్చి తగలకముందే దూరంగా వెళ్ళిపోయిందా అశ్వం... నాలుగే నాలుగు క్షణికాల్లో పొలిమేరల్ని దాటి చీకట్లో కలిసిపోయింది.

*　　　*　　　*　　　*　　　*

"హెచ్చరిక... ప్రమథ రాజ్య పౌరులందరికీ చక్రవర్తి వకుళేంద్రుల వారి హెచ్చరిక...." పెద్ద వృషభ శకటం మీద యుద్ధభేరి వాయిద్యాన్ని నిలబెట్టి, దబదబ మ్రోగిస్తూ నగర వీధుల్లో సంచరించటం మొదలు పెట్టారు పాతికమంది భటులు.

"పాంచాల, ప్రవాళ, కుంతల, మగధ, జంభీర దేశాల్లో దోపిడీలు దొంగతనాలు చేసి అల్లకల్లోలాలు సృష్టించిన గజదొంగ శ్యాముడు మన ప్రమథ రాజ్యంలో అడుగు పెట్టినట్లు సమాచారం అందింది. నగర పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలి. అనుమానం వచ్చిన వెంటనే రాజభటులకు వర్తమానం పంపాలి...." శకటం మీద నిలబడి పెద్ద కంఠంతో వివరంగా అరిచాడు ఒక భటుడు.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు పౌరులు అందరు.

"శ్యామలుడు రానే కూడదు. వస్తే పట్టుకోవటం ఎవరికి సాధ్యపడు తుంది?" చిన్నకంఠంతో తన ప్రక్కనే వున్న మనిషిని అడిగాడు ఒక పౌరుడు.

"మన చక్రవర్తి దగ్గిర వున్న సైనికులు సామాన్యులు కారు. దండనాయకుల సంగతి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరమే లేదు. దండయాత్రల కోసమని చెప్పి కూడ బెట్టుకున్న సొత్తులన్నిటినీ దోసుకుపోతున్నారు. తమ దోపిడీకి అడ్డువస్తే ఆ శ్యామలుడిని ఊరికే వదిలి పెడతారూ??" ఎదురు ప్రశ్నవేశాడు ఆ మనిషి.

"శ్యామలుడు మన నగరంలోకి రావటం మంచిదేనంటారా?" అడిగాడు మొదటి పౌరుడు.

వృషభ శకటం మీది వాయిద్యం మరోసారి పెద్ద శబ్దం చేయడంతో మాటల్ని ఆపి అటు చూశారు వారు ఇద్దరూ.

"పది వేల బంగారు నాణేలు బహుమతిగా ఇవ్వబడతాయి ఆ గజదొంగ శ్యాముడిని పట్టించి ఇచ్చినవారికి. చక్రవర్తి కొలువులో మంచి పదవిలో కూర్చోబెట్టటం జరుగుతుంది. కోరుకున్న గ్రామంలో గ్రామపెద్దగా కూడా నియమించబడతారు.... హెచ్చరికగా వుండండి అందరూ... హెచ్చరికగా..." ఆఖరి సారిగా అందరినీ హెచ్చరించి, మరో వీధిలోకి శకటాన్ని నడిపించారు భటులు.

గుంపుగా నిలబడిన పౌరులు అందరూ ఎవరిదారిన వారు వెళ్ళిపోవటం మొదలు పెట్టారు.

"ఈ దరిద్రపుగొట్టు ప్రమధ రాజ్యంలోకి రావటం మంచిది కాదని చిలక్కి చెప్పినట్లు చెప్పాను... ఇప్పుడు చూడు... వాసన తగిలితే వచ్చి పడే తోడేళ్ళ మందలాగా ప్రవర్తిస్తున్నారు అందరూ... దొరికామంటే కాళ్ళు చేతులు విరగదీసి ఉప్పు పాతరల్లో ఊరవేస్తారు" తల మీద చేతులు పెట్టుకుంటూ వాపోయాడు గదాధరుడు.

రాచవీధిని ఆనుకుని వున్న ఒక చిన్న ఇరుకు స్థలం దగ్గిర నిలుచుని వున్నారు వారిద్దరూ.

"ఎవరు నాయనలారా మీరు? ఎందుకు ఈ ఇరుకుస్థలం దగ్గరే నిలుచుండి పోయారు?" అంటూ వారి దగ్గిరికి రానే వచ్చాడు ఒక పౌరుడు.

"శబరి నగరం నుంచి వస్తున్నాము మేము. విశ్రాంతి తీసుకోవటానికి సరైన ప్రదేశం కోసం వెతుకుతున్నాము..." వెంటనే సమాధానం ఇచ్చాడు గదాధరుడు.

"మా చక్రవర్తి వకుళేంద్రుల వారి పితామహుడు కట్టించిన ధర్మసత్రాలు చాలా వున్నాయిగాని, అవి ఇప్పుడు వ్యాపార సత్రాలుగా మారిపోయాయి. అక్కడ విడిది చేసే వారి దగ్గర్నించి తలకు నాలుగు నాణేలు ముక్కులు పిండి మరీ పుచ్చుకోమని ఆజ్ఞలు..." అన్నాడు ఆ పౌరుడు.

తల తిప్పి తన స్నేహితుడి వైపు చూశాడు గదాధరుడు. సిద్ధం అయి పోతున్నాడు శ్యామలుడు. ఒక్క ఉదుటన తన వాహనాన్ని అధిరోహించి దగ్గిర్లో అటువంటి సత్రం ఎక్కడ వున్నదో అడుగబోతున్నాడు.

"ఇక్కడికి మూడు వీధుల అవతల ముసలి అవ్వ నడిపే పూటకూళ్ళ ఇల్లు వున్నది. అక్కడికి వెళ్ళండి..." అంటూ మాటల్ని ఆపి గబగబా వెనుతిరగ బోయాడు ఆ పౌరుడు.

"చెప్పేది ఏదో వివరంగా చెప్పకుండా ఎందుకా తొందర? ఏమిటా కలవరం?" ఆ వ్యక్తి మొఖంలో ప్రత్యక్షం అవుతున్న ఆదుర్దాని గమనించి, చటుక్కున చేయి పట్టుకుంటూ అడిగాడు గదాధరుడు.

"రాజుగారి బావమరిది శ్యాలకభూపతి తన బలగంతో ఇటే వస్తున్నాడు. తను చూస్తుండగా ఎవరైనా వీధుల్లో నిలబడి మాట్లాడుకుంటుంటే భరించలేడు. రాజద్రోహం చేయటానికే నిలబడి వున్నారని నిందవేసి విచారణ మొదలు పెడతాడు" అంటూ అతని చేతిని విదిలించి కొట్టి వేగంగా అవతలికి వెళ్ళి పోయాడు ఆ పౌరుడు.

"హేయ్... ఎవరు మీరు? ఏం చేస్తున్నారు అక్కడ??" అతని మాటలు ముగిసీ ముగియక ముందే ఉరుము మాదిరి వినవచ్చింది ఆ కంఠం.

చటుక్కున తల తిప్పి చూసిన గదాధరుడికి కనిపించాడు బలిష్టమైన అశ్వం మీద కూర్చుని కోరగా చూస్తున్నాడు చక్రవర్తి బావమరిది శ్యాలక భూపతి.

"ధర్మప్రభువులకు దండాలు... ధర్యసత్రం ఏదైనా కనిపిస్తుందేమోనని వెతుకులాడుతున్నాము..." వినయాతి వినయంగా చెప్పాడు గదాధరుడు.

"విదేశీయులు వస్తే మూడు నాణేలు... వ్యాపారం చేయదలుచుకుంటే ముప్పది నాణేలు. చేస్తే యాబది... ధర్మసత్రాల్లో విడిదికి ప్రత్యేకం... మరి ఇచ్చుకుంటారా??" గంభీరంగా అడిగాడు శ్యాలక భూపతి.

వెనక్కి చూడలేదు గదాధరుడు. చూస్తే శ్యామలుడు ఏం చేయబోతున్నాడో తెలిసిపోతుంది. గుండె ఝల్లుమంటుంది.

"నా జతగాడు వ్యాపారంలో మాకు సహాయం చేసే స్నేహితుడు మార్గాయాసంతో మాట్లాడలేకపోతున్నాడు. తమరు సూచించిన ధనం మొత్తం సత్ర నిర్వాహకుడికి అప్పచెప్పగలను... దయ చూపించండి" మరోసారి నమస్కారం చేస్తూ అర్థించాడు.

"మర్చిపోకండి... మతిమరుపుకు శిక్షలు మా నగరంలో మహాకఠినంగా వుంటాయి..." అంటూ తన అశ్వాన్ని కదిలించబోయి – చటుక్కున ఆగిపోయాడు శ్యాలకభూపతి.

ఎందుకు ఆగాడో గదాధరుడికి అర్థం కాకముందే. "మీ దగ్గిర వున్న అశ్వాలు మహా అందంగా వున్నాయి... అటువంటి జాతిని మేము ఇంతవరకూ చూడలేదు... మీరు మాకు చెల్లించవలసిన ధనానికి బదులుగా ఆ వాహనాలను మాకు అప్పగించండి" అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండా తన భటులకు సైగ చేశాడు.

కంటికి కనిపించనంత వేగంతో కదిలి ఇరుకు స్థలం దగ్గిరికి వచ్చేశారు వాళ్ళు... శ్యామలుడిని పక్కకు నెట్టి ముందుగా అతని వాహనం మీద చేతులు వేశారు.

పరాయి మనుష్యులు వచ్చి తన కళ్ళేలను పట్టుకునే సరికి, విపరీతమైన కోపంతో వెర్రెక్కిపోయింది అది.

వికృతంగా సకిలిస్తూ ముందు కాళ్ళను గాలిలోకి ఎత్తి ఫెడీమని కొట్టింది వారి మొఖాల మీద.

గావుకేకలు పెడుతూ వెనక్కి తూలి వెల్లకిలా పడిపోయారు వారిలో ఇద్దరు. విపరీతమైన భయంతో ఆరడుగుల దూరం అవతలికి గెంతారు మిగిలినవారు.

తన అశ్వం మీది నించి క్రిందికి దూకాడు శ్యాలకభూపతి. పది అంగల్లో ఇరుకు స్థలం దగ్గిరికి వచ్చేశాడు. చేయిజాచి ఆ అశ్వం కళ్ళేలను పట్టుకోబోయాడు.

పిడికిలి బిగించి అతని మొఖం మీద కొట్టనే కొట్టాడు శ్యామలుడు.

చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరవటానికి నోటిని తెరిచాడు శ్యాలక భూపతి. శబ్దం బయటికి రాలేదు. పాదాలలో శక్తి సన్నగిల్లిపోయినట్లు వెనక్కి తూలి వెల్లకిలా పడిపోయాడు... శరీరం నేలను తాకక ముందే తప్పిపోయింది స్పృహ.

తమ కళ్ళను తామే నమ్మలేక పోతున్నట్టు వెర్రిగా చూశారు అతని భటులు.

శ్యామలుడిని అతని వాహనం దగ్గరికి నెట్టాడు గదాధరుడు. తాను తన వాహనం మీదికి లంఘించాడు.

పళ్ళు బిగపట్టి తన ఆవేశాన్ని అణుచుకున్నాడు శ్యామలుడు. పటకాకత్తిని క్రిందికి దించి తన అశ్వం మీదికి ఎగిరాడు.

అప్పుడు వచ్చింది తెలివి రాజభటులందరికీ. "మన శ్యాలక భూపతి వారిని గాయపరిచి పారిపోతున్న ఆ దుర్మార్గుల్ని పట్టుకోండి... బంధించండి" అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ తాము కూడా పరుగులు తీయటం ప్రారంభించారు.

రాచవీధిని అధిగమించారు స్నేహితులు ఇద్దరూ... సన్నగా వంకర టింకరగా ప్రయాణం చేస్తున్న మరో రెండు ఇరుకు వీధులను కూడా దాటి మరో విశాలమైన తెరువు దగ్గరికి పోయారు.

వీధి అంచుమీద నిలబడి వున్న ఒక పౌరుడిని పలుకరించాడు గదాధరుడు.

"నగరానికి కొత్తగా వచ్చాము... ఏ వీధి ఎటుగా పోతుందో తెలియటం లేదు. నగర ద్వారాల దగ్గరికి త్వరగా చేరుకునేటందుకు దగ్గిర మార్గం ఏదైనా వున్నదేమో సూచించగలరా?" వినయంగా అడిగాడు.

"అయ్యా గుండెలు జలదరించేటట్లు ఒక ఘంటానాదం మీ చెవులకు చేరుతోందా లేదా?" విసుగ్గా అడిగాడు ఆ పౌరుడు.

అతను ఆ మాటలు అన్నప్పుడు స్నేహితులిద్దరి దృష్టి అతను చెపుతున్న అంశం మీద కేంద్రీకృతమయింది.

ఆ పౌరుడి మాటల్లో అసత్యం ఏమీలేదు... చెవులు చిల్లులు పడిపోయేటట్లు గుండెలు గుభిల్లు మనేటట్లు వినవస్తోంది పెద్ద ధ్వని.

"నగర ద్వారాల పైభాగంలో మా చక్రవర్తి ప్రతిక్షేపించిన యుద్ధగంట అది. అకారణంగా మ్రోగించబడదు. మ్రోగిందంటే ఏదో పెద్ద ప్రమాదం నగరాన్ని చుట్టుముడుతోందని అర్థం. నగర ద్వారాల్ని మూసేసి, ఆయుధాలతో సర్వసన్నద్ధంగా నిలుచుంటారు సైనికులు. ఈ సమయంలో అటుగాపోయిన వారికి నగరాన్ని విడిచి వెళ్ళదలుచుకున్న వారికి చేటు మూడుతుంది...." వివరించాడు ఆ పౌరుడు.

తమ కోసమే ధ్వనిస్తోంది అది. శ్యామలుడు కొట్టిన దెబ్బ నుంచి తేరుకున్న శ్యాలకభూపతి తాము నగరం విడిచి పారిపోకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ముందుగా ఆ తలుపులు మూయిస్తాడు. తర్వాత నగర వీధులన్నిటినీ–

ఆ మాట గదాధరుడి మనస్సులో మెదులుతూ వుండగానే... వారి ఎదుట వున్న వీధిలో ప్రత్యక్షం అయ్యారు అనేక మంది సైనికులు.

"అరుగో... వచ్చేశారు యమభటులు. ఈరోజు ఎవరికి చేటుకాలం మూడిందో ఏమో..." అంటూ తాను నిలుచున్న ప్రదేశాన్ని వదిలి వెనక్కి తిరిగాడు ఆ పౌరుడు.

"ముందు నుయ్యి వెనుక గొయ్యి అయినట్లుగా తయారయింది మన పరిస్థితి. వెనక్కిపోతే ఆ శ్యాలకుడి భటులు... ముందుకు పోకుండా ఈ సైనికులు... ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుంది?" శ్యాముడిని అడిగాడు గదాధరుడు.

"ఏదో ఒక చెయ్యి... ఇలా వీధుల్లో పరుగులు తీయటం నాకు నచ్చటం లేదు" అన్నాడు శ్యామలుడు.

"మంటల్లో పడేటట్లు నెట్టి వళ్ళు కాలకుండా చూసుకోమన్నాట్ల వెనకటికి నీ వంటివాడు. వద్దు వద్దుంటున్నా వినకుండా ఆ నీచుడి జోలికి పోయావు...." అంటూ తన అశ్వాన్ని పక్కకు తిప్పాడు గదాధరుడు.

బరువైన ఆయుధాలు పట్టుకుని లయబద్ధంగా అడుగులు వేస్తూ వస్తున్న సైనికుల్ని చూసిన వెంటనే ఇళ్ళల్లోకి పరిగెత్తి తలుపులు మూసుకుంటున్నారు నగర వాసులు.

ఇరుకుగా వున్న రెండు సన్నటి వీధుల్ని అధిగమించిన తరువాత స్పష్టంగా తెలిసిపోయింది గదాధరుడికి ఆ సంగతి.

నిర్మానుష్యమైపోయిన వీధుల్లో తాను తన స్నేహితుడు మాత్రమే తిరుగాడుతున్నారు.

తల దాచుకునేందుకు తగిన ప్రదేశం కోసం చుట్టూ చూస్తున్న గదాధరుడికి కనిపించింది ఒక దృశ్యం.

విసుగు విరామం లేకుండా మ్రోగుతున్న ప్రమాద ఘంటిక నాదాన్ని విని తడబడుతున్న అడుగులతో వేగంగా నడవటానికి ప్రయత్నం చేస్తున్నాడు ఒక వృద్ధుడు.

రాచవీధిని అధిగమించి అతను ఇరుకు సందుల వైపు రాకముందే, అతన్ని సమీపించారు సైనికులు.

దగ్గరికి వస్తూనే తన దగ్గిరి బరిశెను తిరగవేసి ఆ వృద్ధుడి గుండెల మీద పొడిచాడు ఒక సైనికుడు.

బాధను భరించటం అసాధ్యమైపోయింది కాబోలు... కీచుగా శబ్దం చేసి, క్రింద పడిపోయాడతను.

తన చేతిలోని బరిశెను మరోసారి గాలిలోకి ఎత్తాడు వృద్ధుడిని పొడిచిన సైనికుడు.

“ఆగండి... ఆగిపోండి....” బిగ్గరిగా అరిచాడు గదాధరుడు.

అదిరిపడి ఆగిపోయాడు ఆ సైనికుడు.

తన అశ్వం మీది నుంచి క్రిందికి దూకి సైనికుల కేసి పరిగెత్తాడు గదాధరుడు.

అతని ఉద్దేశ్యం ఏమిటో తమకు అవగతమై పోయినట్లు భీకరంగా కేకలు పెట్టారు సైనికులు... తమ ఆయుధాలతో అతన్ని కమ్ముకుని నిరాయుధుడిని చేయటానికి చూశారు.

రెండు అడుగులు వెనుకగా వచ్చిన శ్యామలుడిని మాత్రం వెంటనే గమనించ లేకపోయారు వాళ్ళు గమనించి అతన్ని ఎదిరించే ప్రయత్నం మొదలు పెట్టే వ్యవధి మాత్రం వారికి లభించలేదు.

ఈదురుగాలి మాదిరి చెలరేగిపోయాడు శ్యామలుడు. పటకా కత్తిని గిరగిరా తిప్పుతూ దొరికిన వారిని దొరికినట్లే తీవ్రంగా గాయపరిచి నేలకు దొర్లించేశాడు.

మొదలైన మూడే మూడు నిమిషాల్లో ముగిసిపోయిందా పోరాటం. గాయపడి కీచుగా శబ్దాలు చేస్తున్న సైనికుల శరీరాలతో పూర్తిగా నిండిపోయిందా వీధి.

“నా కోసం మీరు ఎదిరించకూడని వారిని ఎదిరించి లేనిపోని కష్టాలను నెత్తిమీదికి తెచ్చుకున్నారు... ఈ సంగతి తెలిసి నగరంలో వున్న సైనిక బృందాలన్నీ మీ కోసం వెతకటం మొదలు పెడతాయి.” చేతిని అందించి తనను లేపి నిలబెడుతున్న శ్యాముడితో అన్నాడు వృద్ధుడు.

“మరేం పరవాలేదు తాతా.... మాకు ఇవన్నీ మామూలే... వాళ్ళతో మాకు విరోధం నీతో మొదలు కాలేదు... ఇంతకు ముందే ఆరంభం అయింది” నవ్వుతూ అన్నాడు గదాధరుడు.

"మీరు ఎక్కడికి పోవాలి?" అతని చేతిని కూడా ఆసరాగా తీసుకుని ఇరుకు వీధి వైపు నడుస్తూ అడిగాడు వృద్ధుడు.

"అది తెలిస్తే ఈపాటికి అక్కడికే పోయి హాయిగా విశ్రాంతి తీసుకుంటూ వుండేవాళ్ళం... ఈ నగరంలో ఎటుపోతే ఎటువంటి దృశ్యం కనిపిస్తుందో తెలియటం లేదు" అన్నాడు గదాధరుడు.

"అయితే మీరు మా ముసలమ్మవ్వ పూట కూటి ఇంటికి పదండి... మీకు అన్ని సౌకర్యాలు అక్కడ లభిస్తాయి...." అంటూ ఒక వీధికేసి చేయి చూపించాడు వృద్ధుడు.

"ఈ పూటకూళ్ళ ముసలమ్మవ్వ ఎవరోగాని చాలా మంది నోళ్ళల్లో నానుతోంది ఆమె పేరు. ఒకసారి వెళ్ళి చూడటం చాలా బాగుంటుంది" చిన్న కంఠంతో స్నేహితుడికి మాత్రమే వినిపించేటట్లు చెపుతూ ఆ వృద్ధుడు చూపించిన దారిలో అడుగులు వేశాడు అతను.

*          *          *          *          *

అదే పనిగా మ్రోగుతున్న ప్రమాద ఘంటికను ఆపమన్నట్లు సైగ చేశాడు స్వయంగా నగర ద్వారాల దగ్గరికి వచ్చిన చక్రవర్తి.

"ఎందుకు మ్రోగుతున్నది ఇది? ఏమిటి కారణం??" నడుముమీద చేతులు వేసుకుంటూ గంభీరంగా అడిగాడు.

వెంటనే ముందుకు వచ్చాడు శ్యాలకుడు. 'శబరి నగరం నుంచి వ్యాపారం చేసుకుంటామని చెప్పి మన నగరంలోకి అడుగుపెట్టారు ఇద్దరు విద్రోహులు. నేను సూక్ష్మగ్రహిని కాబట్టి చిటికెలో బట్టబయలు అయింది వారి గుట్టు. వారిని పట్టుకునేందుకు నేనే ఈ ఆజ్ఞ ఇచ్చాను" తడబడకుండా తను కూడా చాలా గంభీరంగా చెప్పాడు.

"ఘంటికను మ్రోగించి నగరాన్ని అల్లకల్లోలం చేయటం అనవసరం. వెంటనే మన మంత్రవాది మాండలికుడిని సంప్రదించు. వాళ్ళు ఎక్కడ వున్నా చిటికెలో పట్టిస్తాడు" అన్నాడు చక్రవర్తి.

మౌనంగా తల ఊపాడు శ్యాలకుడు.

"చక్రవర్తి చిప్పినది నిజమే ప్రభూ. మాండలీకుడు మహా చతురుడు. అరక్షణికంలో ఆ దుర్మార్గుల జాడల్ని మనకి ఎరుక పరుస్తాడు" అన్నాడు ఒక అనుచరుడు.

"వాళ్ళని మనం దుర్మార్గులుగా ఎందుకు చిత్రీకరించామో కూడా చెప్పేయగలడు. నిజం ఏమిటో చక్రవర్తికి తెలిస్తే మన పరిస్థితి ఎలా వుంటుంది?" చిన్నగా అడిగాడు శ్యాలకుడు.

తమను గాయపరిచి దూరంగా పారిపోయిన యువకులు ఇద్దరూ ఆ పని ఎందుకు చేశారో చక్రవర్తికి తెలిస్తే ఆయన ఎలా ప్రవర్తిస్తాడో ఆ అనుచరుడికి కూడా అవగతం కాలేదు.

"అయితే మనం ఆ నీచుల్ని వదిలిపెట్టవలసిందేనా?" మంత్రవాది దగ్గరికి వెళ్ళటం శ్యాలకుడికి ఇష్టం లేదనే విషయాన్ని గ్రహించి నెమ్మదిగా అడిగాడు అతను.

"మన వారందరినీ హెచ్చరికగా సంచరించమని సూచించండి. ఆ ఇద్దరు దుర్మార్గుల్ని వారి వాహనాలతో సహా పట్టిస్తే వెయ్యి నాణేలు బహుమతిగా ఇస్తామని చెప్పండి. ఈ రాత్రి గడిచి తెల్లవారే లోపల కలుగులో వున్న ఎలుకల మాదిరి దొరికిపోతారు... ఎక్కడికీ పారిపోలేరు...." నమ్మకంగా చెప్పాడు శ్యాలకుడు.

ప్రమాదఘంటిక చప్పుడు ఆగిపోయిన వెంటనే నెమ్మదిగా తెరచుకుంటున్న నగర ద్వారాల వైపు చూపించాడు ఆ అనుచరుడు.

"చీకటిమాటున వాళ్ళు నగరాన్ని వదిలి పారిపోతే?" అని అడిగాడు.

"మీరు కొందరు ఇక్కడే కాపలా నిలబడి నగరంలో నుంచి వెలుపలికి వెళ్ళే వారిని గమనించుకుంటూ వుండండి... అనుమానం వచ్చిన వెంటనే ముందు బంధించి తరువాత వివరాలు తెలుసుకోండి" అన్నాడు శ్యాలకుడు.

తలలు ఊపి వెనక్కితగ్గి నిలుచున్నారు నలుగురు అనుచరులు. అతనితో కలిసి రాజభవనాల వైపు నడిచారు మిగిలిన వారు.

* * * * *

"మిత్రమా... ఒక్కసారి కనులు తెరిచి చూడు... త్వరగా... త్వరగా...." సన్నటి కంఠంతో గదాధరుడు హెచ్చరించటంతో ఉలిక్కిపడి నిద్రలేచాడు శ్యామలుడు.

వృద్ధుడు చెప్పిన ముసలమ్మవ్వ దగ్గరికి వచ్చి వున్నారు వారిద్దరు. విశాలమైన పెద్ద పూరింట్లో తన పూటకూళ్ళ ఇంటిని నడుపుతోంది ఆమె. బరువుగా అడుగులు వేస్తూ వచ్చిన వారిద్దరినీ సాదరంగా ఆహ్వానించింది.

కరచరణాలను శుభ్రపరుచుకుని. ఆమె వడ్డించిన ఆహార పదార్థాలను హాయిగా ఆరగించి ఆ గుడిశెలో నడుములు వాల్చారు ఇద్దరూ.

చీకటిపడిన రెండు ఘడియలు తరువాత గదాధరుడు వచ్చి శ్యామలుడిని హెచ్చరించాడు.

తలగడ ప్రక్కన పెట్టుకున్న పటకా కత్తిని తీసుకుని అతని వెనకే గుడిశెలో నుంచి బయటికి వచ్చాడు శ్యామలుడు.

పూరింటి ముందు భాగంలో వేసిన విస్తళ్ళ ముందు కూర్చుని వున్నారు పది మంది దృఢకాయులు.

"అడవి అంచుమీద వున్న అసురగండి గ్రామంలో చక్రవర్తి సైన్యానికి చుక్క ఎదురయింది. ఇంతకుముందు ఎవరూ చూడని యువకులు ఇద్దరు సైనికుల మీద తిరగబడి చావగొట్టారు గాయపడిన సైనికుల్ని గ్రామంలోనే వదిలి దండనాయకుడు పాదాలకు బుద్ధి చెప్పాడు" విస్తరిలోని ఆహారాన్ని చేతుల్లోకి తీసుకుంటూ చెపుతున్నాడు ఒక దృఢకాయుడు.

"మరి మిగిలిన గ్రామాల సంగతేమిటి?" అడుగుతున్నది ముసలమ్మవ్వ.

"వాటి దగ్గరికి మేము పోలేదు" అన్నాడు ఆ వ్యక్తి.

"ఈ రోజు నగరంలో చెలరేగిన గందరగోళం ఏమిటి." అడిగాడు మరో దృఢకాయుడు.

"అసురగండి గ్రామంలో జరిగినట్టే ఇక్కడ కూడా జరిగింది. చక్రవర్తి బావమరిది శ్యాలకుడిని చావకొట్టారు. ఇద్దరు యువకులు. మన సురకేసి తాతమీద కలబడిన సైనికులను కూడా చెల్లాచెదురు చేసేశారు...." నెమ్మదిగా చెప్పింది ముసలమ్మవ్వ.

"ఎవరు అవ్వా వాళ్ళు?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ దృఢకాయుడు.

"నా ఉద్దేశ్యంలో వాళ్ళు మీరు చెపుతున్న యువకులే అయివుంటారు. అసురగండి గ్రామం దగ్గిర్నించి సూటిగా నగరంలోకి వచ్చారని నేను అనుకుంటున్నాను" అంటూ ఒక పక్కకు చూసి చిన్నగా నవ్వింది ముసలమ్మవ్వ.

"చాటుమాటున నిలబడి ఆలకించవలసిన అవసరం లేదు. ఇక్కడ వున్నది మీకు శత్రువులు కారు. లోపలికి రండి నాయనలారా" అంటూ పిలిచింది మృదుస్వరంతో.

మట్టితో మందంగా నిర్మించబడిన గోడచాటున నిలబడి లోపల జరుగుతున్న సంభాషణను ఆలకిస్తున్న స్నేహితులు ఇద్దరూ ఉలిక్కిపడి అంతలోనే సర్దుకున్నారు.

ఆహారం తీసుకుంటున్న దృఢకాయుల ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. "అయ్యబాబోయ్... వాళ్ళే. అసురగండి గ్రామస్థులు చెప్పిన యువకులు వాళ్ళే.... సందేహం లేదు...." అంటూ విస్తళ్ళ ముందు నుంచి లేవబోయారు.

"తరతరాలుగా ఈ ప్రమధ రాజ్యాన్ని పరిపాలించే రాజవంశాన్ని చెరసాల పాలుచేసి తమ గద్దెని స్వాధీన పరుచుకున్నాడు ఈ వకుళేంద్ర భూపతి. ఇతన్ని సింహాసనం మీది నుంచి క్రిందికి దించి కారాగారంలో వున్న మా సుశాంత చక్రవర్తిని తిరిగి గద్దె నెక్కించడం మా జీవితాశయం" సూటిగా తమ గురించి అతనికి చెప్పింది ముసలమ్మవ్వ.

"అవ్వా... నాకు ఒక అనుమానం వచ్చింది అడగమంటారా?" అడిగాడు గదాధరుడు.

"నగరంలోనే వుంటూ, అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నేను వకుళేంద్ర భూపతికి విరుద్ధంగా ఆలోచనలు చేసేవారికి ఆశ్రయం ఎలా ఇవ్వగలుగుతున్నానని నీ సందేహం. అవునా?" అని అడిగింది.

అవునన్నట్లు తల ఊపాడు గదాధరుడు.

ఒకసారి వీధిలోకి పోయి ఈ ఇంటివైపు చూడండి" అన్నది ముసలమ్మవ్వ. శ్యామలుడితో కలిసి వీధిలోకి పోయాడు గదాధరుడు. వెనుతిరిగి విపరీతమైన ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు.

వంద మంది వచ్చినా కూడా సుఖంగా కూర్చోగలిగేటంత విశాలంగా వున్నది అంతకు ముందు వారు చూసిన మందపాటి గోడలతో ఉన్న పూరిల్లు.

ఇప్పుడు అది అతి చిన్నగా మారిపోయి కనిపిస్తోంది.

"మంత్రాలు చదవటం నేర్చినవారికి ఏదైనా సాధ్యమే... ఈ ముసలమ్మవ్వ ఎవరోగాని మంత్ర తంత్రాల్లో మెలితిరిగిన చేయి అయి వుంటుంది" సాలోచనగా చూస్తూ చెప్పాడు శ్యామలుడు.

"ఎంత మంత్రాల సాని అయినా నగరం నడిబొడ్డు మీద ఇటువంటి ఇంద్రజాలాన్ని ప్రదర్శించటం కష్టం మిత్రమా... మంత్ర తంత్రాలు ఈమెకు ఒక్కదానికే వచ్చివుండవు. ఇతరులు ఎవరైనా ఆ విద్యల్ని అభ్యసిస్తే వారికి తెలిసిపోతుంది – ఈ రహస్యం అన్నాడు గదాధరుడు.

చక్రవర్తి ఆస్థానంలో వున్న మంత్రవాది మాండలీకుడికి అనుమానం రానే వచ్చింది. శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాడు ఈ గుట్టును బహిర్గతం చేయటానికి" తను కూడా వీధిలోకి వస్తూ చిన్నగా చెప్పింది ముసలమ్మవ్వ.

అతని చేతిని పట్టుకుని తిరిగి ఇంట్లోకి తీసుకుపోయింది.

"మీరు ఇక్కడికి వచ్చిన దగ్గిర్నించి చూస్తున్నాను. అన్నిమాటలు నువ్వే మాట్లాడుతున్నావు. అడిగిన వాటన్నిటికీ సమాధానాలు కూడా నువ్వే ఇస్తున్నావు. నీ జతగాడికి ఏమైంది? మాటలు రావా?" అతనికి, శ్యామలుడికి ఇద్దరికీ రెండు విస్తళ్ళు పరిచి, ఆహార పదార్థాలున్న పాత్రలను చేతులకు అందేటంత దూరంలో పెడుతూ అడిగింది ముసలమ్మవ్వ.

తెల్లటి పల్వరుస బయటికి కనిపించేలా పెద్దగా నవ్వేశాడు గదాధరుడు. "నా జతగాడికి సిగ్గు ఎక్కువ అవ్వా. పది పదిహేను మాటలకు కూడా సరిగ్గా సమాధానం చెప్పడు" అన్నాడు.

"నువ్వు ఒక దొంగవి. నీ జతగాడు ఇంకో పెద్ద గజదొంగ. నేను మంత్రాల సానినని తెలిసిన తర్వాత కూడా నన్ను ఏమార్చే మాటలు మాట్లాడటం ఏమీ బాగోలేదు" చిరుకోపంతో అన్నది ముసలమ్మవ్వ.

"మేము ఇద్దరము దొంగలమని నీకు తెలిసిపోయింది కదా. ఇంకా అధికంగా మాట్లాడవలసిన అవసరం లేదు..." ముక్తసరిగా అన్నాడు గదాధరుడు. విస్తరి దగ్గిర పెట్టబడిన పాత్రలలో నుంచి పదార్థాలను ముందు శ్యామలుడి విస్తరిలోను తర్వాత తన విస్తరిలోను వడ్డించుకోవడం మొదలుపెట్టాడు.

ఆరగించటం పూర్తి అయింది కాబోలు - తమ విస్తళ్ళను అడ్డంగా మడిచి పెట్టేశారు అక్కడ భోజనాలు చేస్తున్న దృఢకాయులు.

* * * * *

"నువ్వు ఎంత అడిగితే అంత ధనం ఇస్తున్నాను. నీ పూజలకు పురస్కారాలకు అవసరమైన వసతులు కల్పిస్తున్నాను. ఎందుకు?" ఎర్రబడిన కనులతో తీవ్రంగా చూస్తూ అడిగాడు చక్రవర్తి తన ఎదుటికి వచ్చిన మాండలీకుడిని.

సన్నగా శలాకమాదిరి పొడవుగా వున్నాడు మాండలీకుడు. నల్లటి అంగీని ధరించి వెడల్పాటి ఉత్తరీయాన్ని భుజాల మీద వేసుకుని వున్నాడు. నుదుటిమీద ఎర్రటి కుంకుమను అలుముకుని వున్నాడు.

మూడు మూరల పొడవున్న వెదురుగడ ఒకటి మంత్ర దండం మాదిరి కనిపిస్తోంది అతని చేతుల్లో.

చక్రవర్తి మాటల్ని విన్నవెంటనే అతని పెదవుల మీదికి వచ్చేసింది చిరునవ్వు. "తమరి దయాధర్మ భిక్షల కారణంగా నా అనుష్టానాలు నిర్విఘ్నంగా

సాగిపోతున్న సంగతి నాకే కాదు... నగర ప్రజలకు కూడా తెలుసు. పని కట్టుకుని ఈ రోజు తమ ఔదార్యాన్ని గురించి తమరే బహిర్గత పరుచుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చింది...” కనులు చిట్లిస్తూ సూటిగా అడిగాడు.

“రోజు రోజుకీ విద్రోహులు రెచ్చిపోతున్నారు. అసురగండి గ్రామంలో మా భటుల్ని సర్వనాశనం చేశారు. అక్కడితో ఆగకుండా నగరం నడిబొడ్డులో మా శ్యాలకభూపతిని అతని అనుచరుల్ని గాయపరిచి మమ్మల్ని అవమాన పరిచారు. ఆ పని చేసింది ఎవరో ఇప్పుడు కూడా మాకు అవగతం కావటం లేదు” కోపంగా చూస్తూనే వేగంగా అన్నాడు చక్రవర్తి.

“అసురగండి గ్రామంలో మీ భటుల్ని చెదరగొట్టిన వారు ఇద్దరే ఇద్దరు యువకులు... శ్యాలక భూపతిని ఎదిరించినవారు ఎంతమంది?” ఎదురు ప్రశ్న వేశాడు మాండలీకుడు.

నిజం చెప్పకపోతే అతను అప్పటికప్పుడు అంజనమో, ఇంకేదో వేసి జరిగినదంతా చక్రవర్తికి సాక్ష్యంగా చూపిస్తాడని అనుమానం కలిగింది కాబోలు– “ఇద్దరే... ఆ ఇద్దరిలోను ఒక్కడే మా మీద కలబడి తీవ్రంగా గాయ పరిచాడు. అతను అలా చేస్తాడని ఎదురు చూడకపోవటం వల్ల మేము ఆత్మ రక్షణ చేసుకోలేక పోయాము” గబగబా చెప్పాడు శ్యాలకుడు.

“ఇప్పుడు జరిగి పోయిన దానిని గురించి చర్చించుకోవటం అనవసరం... ఆ పని చేసిన వారిని వెంటనే బంధించి మా ఎదుటికి తీసుకురావాలి. ఆ పని మీకు సాధ్యపడుతుందా లేదా?” ఉన్నట్లుండి తను కల్పించుకుంటూ మాండలీ కుడిని అడిగాడు చక్రవర్తి.

“ప్రయత్నిస్తాను ప్రభూ... ప్రాణాలతో పట్టుకోవడం సాధ్యపడకపోతే శరీరాల నయినా తమరికి చూపిస్తాను” అంటూ గిరుక్కున వెనుతిరిగి సభా భవనంలో నుంచి వెలుపలికి వెళ్ళిపోయాడు మాండలీకుడు.

వెంటనే సింహాసనం వెనుకభాగంలో వున్న పట్టు తెర వెనుక నుంచి చక్రవర్తి దగ్గిరికి వచ్చింది మహారాణి.

“నా సోదరుడిని అవమానిస్తే నన్ను కూడా అవమానించినట్లే. నన్ను అవమానిస్తే అది మీకు కూడా అవమానమే. మీరు ఈ విషయంలో మాండలీకుడి పట్ల జాలి దయ చూపించవద్దు. ఆ దుర్మార్గుల్ని బంధించి తీసుకు రాకపోతే ఊరుకోకూడదు” స్పష్టమైన మాటలతో తన అభిప్రాయాన్ని తెలియచేసింది ఆమె.

"స్పష్టంగా చెప్పి పంపించాము కదా దేవీ... ఏం చేసి చూపిస్తాడో రేపు ఈ సమయానికి తెలిసిపోతుంది. అప్పుడు మాట్లాడుకుందాము" అంటూ సింహాసనం మీది నుంచి లేచాడు చక్రవర్తి.

తలవంచి నమస్కారం చేశాడు శ్యాలకుడు. తన వెనుకే నిలుచుని వున్న అనుచరులతో సహా ఆ మందిరంలో నుంచి వెలుపలికి వెళ్ళిపోయాడు.

* * * * *

తల వంచుకుని తను నివశించే భవనం దగ్గరికి వస్తున్న మంత్రవాది మాండలీకుడిని చూసి గబగబా ఎదురు వెళ్లాడు అతని శిష్యుడు ఒకతను.

"ఏమయింది గురుదేవా? తమరి వదనం కళావిహీనం అయివుంది. చక్రవర్తి సమక్షంలో వినకూడని మాట ఏదైనా చెవుల పడిందా?" ఆదుర్దాగా అడిగాడు.

తన మంత్ర దండాన్ని అతనికి అందిస్తూ భవన ద్వారంలో నుంచి విశాలమైన ఒక మందిరంలోకి పోయాడు మాండలీకుడు.

"ప్రస్తుతం చెరసాలలో వున్న సుశాంత చక్రవర్తి పూర్వీకుల వద్ద ఉప సైన్యాధిపతిగా పని చేసేవాడు ఈ వకుళేంద్రుడి పితామహుడు. నగర ప్రజల ఎదుట మహామంచి వాడిగా పేరు తెచ్చుకునేందుకు ధర్మ సూత్రాలను నిర్మించాడు... అడిగినవారికి అడిగినట్లు ధనసహాయం చేసి తాను కావాలనుకున్న మంచి పేరు సంపాదించుకున్నాడు. ఆ మంచిపేరును ఆసరాగా చేసుకుని తిరుగుబాటు చేసి సింహాసనాన్ని చేజిక్కించుకున్నాడు ఈ వకుళేంద్రుడు..." ఒక ఆసనం మీద కూర్చుంటూ చిన్నగా అన్నాడు.

"చక్రవర్తి తమను అవమానించాడా?" సూటిగా అడిగాడు శిష్యుడు.

"అప్పచెప్పిన పనిని పూర్తి చేయకపోతే ఇప్పుడు మనం పొందుతున్న సౌకర్యాలు ఇక ముందు వుండవని నిక్కచ్చిగా సెలవిచ్చాడు..." నుదురు రుద్దుకుంటూ చెప్పాడు మాండలీకుడు.

"శంబర దేవతను ప్రత్యక్షం చేసుకోవటానికి ఇంకా చాలా సమయం పడుతుందని మీరు చెప్పారు. శంబరశక్తి ఆధీనంలోకి వస్తేగాని ఈ సింహాసనం మీకు వశపడదని కూడా అన్నాడు... వకుళేంద్రుడు ఇప్పుడు సదుపాయాలను నిలిపివేస్తే ఆ ఆశయ సాధనకు అడ్డంకి ఏర్పడుతుంది. ఎలా గురుదేవా?" ఆందోళనగా అడిగాడు శిష్యుడు.

అర్ధ నిమీలిత నేత్రాలతో ఆసనం వెనుక భాగానికి చేరగిలపడి కూర్చుంటూ తల ఊపాడు మండలీకుడు.

"అయితే ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి?" అడిగాడు శిష్యుడు.

"అసురగండి గ్రామంలో రాజభటుల మీద దాడి చేసిన యువకులే ఇప్పుడు నగరంలోకి వచ్చి శ్యాలకుడి మీద తిరగబడ్డారు. వారిని పట్టి బంధించాలి" అన్నాడు మాండలీకుడు.

అప్పటివరకూ ఆ శిష్యుడి వదనంలో కనిపిస్తున్న కుతూహల భావం మటుమాయమైపోయింది. సిగ్గుతో మలిన పడింది ముఖం.

"ఏమిటది? ఏమిటీ అనుమానం?" రెట్టించాడు మాండలీకుడు.

"విద్రోహులకు ఆశ్రయం కల్పించి అందరినీ తికమకకు గురి చేస్తున్న ఆ మంత్రగత్తె నీలమణి ఇప్పుడు ఈ యువకులకు కూడా ఆశ్రయం ఇస్తున్న దేమోననిపిస్తోంది" అన్నాడు శిష్యుడు.

గాఢంగా నిట్టూర్చి ఆసనం మీది నుంచి లేచాడు మాండలీకుడు.

"సాధారణమైన మార్గాల ద్వారా ఆ నీలమణి అనుపానుల్ని గుర్తించి ఆమెను శిక్షించేందుకు వకుళేంద్రుడి అధికారాన్నే ఉపయోగించుకోవాలని అనుకున్నాను. నా శక్తుల్ని వృధా చేసుకోవటం మంచిదికాదని తాత్సారం చేశాను. ఇక మీదట ఉపేక్షించకూడదు. ఆ నీలమణి సంగతి తేల్చిపారేయాలి..." అంటూ ప్రక్కనే వున్న మరో మందిరంలోకి పోయాడు.

వికృత మొఖాలతో విభ్రమాన్ని కలిగించే రకరకాల విగ్రహాలు వరుసలో నిలబెట్టి వున్నాయి అక్కడ.

గబ్బిలం మాదిరి పలుచటి రెక్కలు కలిగివున్న ఒక వికృత రూపం ముందు నిలబడి మంత్ర పఠనం మొదలు పెట్టాడు అతను.

మంత్ర పఠనం మొదలు పెట్టకముందు కదలిక లేకుండా స్థిరంగా వున్న ఆ బొమ్మలో చిన్నగా కదలిక వస్తున్నట్లు కనిపించింది శిష్యుడికి.

"ఈ నగరంలో మంత్ర పఠనం ఎక్కడ జరిగినా వెంటనే కనిపెట్టి మనకు తెలియజేస్తుంది ఈ కరాళి..." శిష్యుడి వదనంలోని భావాలను గమనించి చిన్నగా నవ్వుతూ చెప్పాడు మాండలీకుడు.

"చక్రవర్తిని సింహాసనం మీది నుంచి దించి చెరసాలలో వున్న సుశాంతుడిని తిరిగి గద్దె ఎక్కించటానికి విద్రోహులు తమ ప్రయత్నాలు ప్రారంభించిననాటి నుంచి ఆ మంత్రగత్తె నీలమణి వారికి సహాయం చేస్తూనే వున్నది. ఆమె ఎవరో

నగరంలో ఎక్కడ నివాసం వుంటుందో ఇప్పటివరకూ మనం తెలుసుకోలేక పోయాము... ఇప్పటికిప్పుడు ఆమె జాడలు ఎలా తెలుస్తాయి?" అడిగాడు శిష్యుడు.

విగ్రహం వెనుక భాగంలో కనిపిస్తున్న వెలుగు మటుమాయం అయిపోయింది. బొమ్మ మాదిరిగా వున్న కరాళి సజీవంగా వేదిక మీది నించి క్రిందికి దిగింది.

"వెళ్ళు కరాళీ... నగరంలో ఎక్కడ ఏ విధమైన మంత్ర ప్రయోగం జరుగుతున్నా వెంటనే కనిపెట్టి మాకు తెలియచేయాలి. వెళ్ళు" ఖంగుమంటున్న కంఠంతో ఆ శక్తికి ఆజ్ఞ ఇచ్చాడు మండలికుడు.

తన రెక్కల్ని విశాలంగా తెరిచి రెపరెపలాడిస్తూ గాలిలోకి ఎగిరింది ఆ శక్తి. ఓరగా తెరిచివున్న ఒక గవాక్షంలో నుంచి వెలుపలికి దూసుకుపోయింది.

"మంత్ర పఠనం ఎక్కడ జరుగుతున్నా, ఎక్కడ మంత్ర శక్తులు వినియోగిస్తున్నట్టు కనిపించినా చిటికెలో పసి కట్టేస్తుంది కరాళి. గతంలో ఎప్పుడు ఈ శక్తిని నగరంలోకి పంపించినా అటువంటివేమీ అగుపించలేదు..." అప్పటికి చెప్పాడు మాండలికుడు.

"ఇప్పుడు మాత్రం కనిపిస్తాయా?" అనుమానంగా అడిగాడు అతను.

"కొత్తగా వచ్చిన విద్రోహుల్ని దాచిపెట్టి వుంచటానికి తప్పకుండా ఏదో ఒక మంత్రాన్ని ఉపయోగించాలి. వేరే దారి లేదు. ఎందుకంటే వారిద్దరూ ఈ నగరానికి చెందిన వారు కారు... ఎక్కడినించో వచ్చిన వారు. కరాళి ఈసారి తప్పకుండా మన పని పూర్తి చేస్తుందన్న నమ్మకం నాకు కలుగుతోంది" ఉత్సాహంగా చెప్పాడు మండలికుడు.

ఆ మాటల్ని నమ్ముతున్నట్టు తనుకూడా ఉత్సాహంగానే తల ఊపాడు శిష్యుడు.

* * * * *

"మాండలీకుడి దగ్గిర చిత్రవిచిత్రమైన శక్తులు చాలా వున్నాయి. కరాళి అని పిలవబడే పిశాచశక్తి వాటిలో ఒకటి..." చీకటి పడిన రెండవ ఘడియలో పూరింటి వెనుక భాగంలో ఓ చిన్న అరుగు మీద కూర్చున్న గదాధరుడికి చెప్పింది ముసలమ్మవ్వ.

"నగరంలో ఎక్కడ మంత్రశక్తులు ఉపయోగించబడినా అవి వెంటనే పసికట్టి మాండలికుడికి తెలియచేస్తుంది" అని కూడా చెప్పింది.

"మరి ఇప్పటివరకూ ఈ వసతి గృహం గురించి ఎందుకు తెలుసుకోలేక పోయింది?" వెంటనే అడిగాడు అతను.

"ఇక్కడ వున్న వారందరూ ఈ నగరానికి సంబంధించిన వారే అవటం వల్ల కరాళి కనిపెట్ట లేకపోయింది. మాండలికుడు ఆ శక్తిని ప్రయోగించినప్పుడల్లా నేను నా శక్తుల్ని ఉపసంహరించుకుంటూ వస్తున్నాను. ఇప్పుడు మాత్రం అలా చేయటానికి వీలు పడటం లేదు. మీ కారణంగా" గాఢంగా నిట్టూరుస్తూ చెప్పింది ఆమె.

"మాండలికుడు ఇప్పుడు మళ్ళీ ఆ శక్తిని పంపకం చేస్తున్నాడా?" అడిగాడు గదాధరుడు.

తల ఊపింది ముసలమ్మవ్వ.

వెనుక వున్న మట్టిగోడకు ఆనుకుని కూర్చున్న శ్యామలుడి వైపు చూశాడు గదాధరుడు.

చటుక్కున లేచి నిలుచున్నాడు శ్యామలుడు. కొంచెం అవతలగా వున్న ఒక చిన్న కట్టడం దగ్గరికి పోయాడు.

అందులోనే నిలబడి వున్నాయి వారి వాహనాలు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవటం వల్ల ఉత్సాహంగా తలలు ఊపాయి.

తన వాహనాన్ని కట్టడంలోనుంచి బయటికి తీసుకు వచ్చాడు శ్యామలుడు.

తను కూడా తన వాహనాన్ని అధివసించి వీధిలోకి పోనిచ్చాడు గదాధరుడు.

ఖచ్చితంగా పదిహేను క్షణికాల తరువాత తన పలుచటి రెక్కల్ని వేగంగా కదిలిస్తూ ఆ వీధివైపు వచ్చింది మాండలీకుడు పంపించిన కరాళి.

పడిపోవటానికి సిద్ధంగా వున్న ఒక పూరిల్లు కనిపించింది తీక్షణమైన దాని నేత్రాలకు. ఆ ఇంటి వెనుక భాగంలో నిలుచుని వున్న ఒక వృద్ధురాలు కూడా అగుపించింది.

ఆ వీధి చివరి భాగంలోకి పరుగులు తీస్తున్న రెండు అశ్వాలు, వాటిని అధివసించి వున్న అశ్వికులు కూడా కనిపించారు.

మాండలికుడు ఆదేశించినట్లు మంత్రశక్తులు మాత్రం ఆ ప్రదేశంలో కనిపించక పోవటంతో మరో వీధిలోకి వెళ్ళిపోయింది అది.

బిగపట్టి వుంచిన ఊపిరిని తేలికగా బయటికి వదిలి, పూరింటి వెనుక వున్న మట్టి అరుగు మీద కూలబడింది ముసలమ్మవ్వ.

వీధిలోకి వెళ్ళిపోయిన యువకులు ఇద్దరూ మరో పది పదిహేను క్షణికాల పాటు ఆలస్యం చేసి వుంటే ఏం జరిగి వుండేదో తలుచుకునేసరికి చెమటలు ప్రత్యక్షం అయ్యాయి ఆమె నుదుటిమీద.

*  *  *  *  *

"పూరింటి దగ్గిర వుండగా మన గురించి ఎవరికీ తెలియదు కాబట్టి హాయిగా విశ్రాంతి తీసుకోగలిగాము... ఇప్పుడు ఆ రక్షణ లేదు... రాజభటులు ఎదురైతే చిక్కులు తప్పవు..." శ్యామలుడి ప్రక్కభాగంలో తన వాహనాన్ని నడిపిస్తూ అన్నాడు గదాధరుడు.

ఇప్పుడు మనం ఎక్కడికి పోతున్నామో, ఏం చేయటానికి పోతున్నామో చెపితే చాలా సంతోషిస్తాను" విసుగు నిండిన కంఠంతో అన్నాడు గదాధరుడు.

"ఒక పెద్ద బిల్వవృక్షం... దాని ప్రక్కనే చిన్న చెక్కల కట్టడం. సరిగ్గా వెతుకు... మనం అక్కడికిపోవాలి..." అన్నాడు అప్పుడు శ్యామలుడు.

పూర్తిగా మర్చిపోయిన విషయం సరిగ్గా అప్పుడే జ్ఞప్తికి వచ్చినట్లు నుదుటి మీద అరచేత్తో చరుచుకున్నాడు గదాధరుడు.

మనం ఈ నగరంలోకి వచ్చిందే ఆ కట్టడం లోని పెద్ద మనిషిని కలుసుకోవటానికి. ఆ రాజుగారి బావమరిది దెబ్బకు అసలు విషయాన్ని మరిచి పోయి మాట్లాడుతున్నాను. మతిమరుపు చాలా ఎక్కువైపోయింది నాకు ఈ మధ్యన" అంటూ తన వాహనాన్ని కొంచెం వేగంగా ముందుకు నడిపించ బోయాడు.

చటుక్కున చేతిని జాచి అతన్ని ఆపేశాడు శ్యామలుడు. కనులతోనే ఆ సందు ముందు భాగంలోకి చూపించాడు.

దృఢంగా బంధింపబడి వున్నాయి ఆ సందులో వున్న ఇళ్ళ తలుపులన్నీ. చీకట్లు బాగా ముదిరి పోవడం వల్ల లోపలి భాగాల్లో వుండే దీపాలు కూడా కొండ ఎక్కించబడి వున్నాయి.

దట్టమైన ఆ చీకటిని చీలుస్తూ సన్నపాటి వెలుగు వెలుపలికి ప్రసరిస్తోంది ఆ సందు ముందు భాగంలో వున్న ఒక పెద్ద భవనంలోనుంచి.

అటుకేసి ఆశ్చర్యంగా చూసిన గదాధరుడికి వెంటనే కనిపించింది ఆ భవనంలో నుంచి బయటికి పరిగెత్తుకు వస్తున్న ఒక స్త్రీ రూపం.

తన అశ్వాన్ని ఆ భవనం కేసి వేగంగా పరిగెత్తించబోయిన శ్యామలుడిని వెంటనే ఆపేయటానికి ప్రయత్నించాడు గదాధరుడు.

"మనం ఈ నగరంలోకి ఎందుకు వచ్చామో నువ్వు ఇంతకుముందు నాకు సవివరంగా చెప్పావు. వచ్చిన పనిని వదిలేసి అనవసరమైన గొడవల్లో తలలు దూర్చి ఇప్పటికే చాలా గందరగోళాల్లో చిక్కుపడి వున్నాము... ఇప్పుడు ఒంకో గడబిడని మొదలు పెట్టటం మంచిది కాదు... ఆగిపో మిత్రమా" అంటూ అనునయించబోయాడు.

ఆ మాటలు తనకు నచ్చినట్లు అశ్వాన్ని ఆపి వేయబోయాడు శ్యామలుడు. అంతలోనే సందు మధ్య భాగంలో బోర్లా పడిపోయింది భవనంలో నుంచి బయటికి పరిగెత్తుకు వచ్చిన స్త్రీ రూపం. బాధా సూచకమైన ఆర్తనాదం కూడా ఆమె నోటినుంచి వెలువడింది.

పళ్ళు బిగపట్టి తనను తాను నిగ్రహించుకున్నాడు శ్యామలుడు. తన అశ్వాన్ని కూడా నిలువరించాడు.

"మిత్రమా... మిత్రమా... చూడు... అటుచూడు..." మౌనంగా వుండవలసిన గదాధరుడు ఉన్నట్లుండి ఆందోళన నిండిన కంఠంతో హెచ్చరించటంతో బలవంతంగా ఆపి వుంచిన వాహనాన్ని వేగంగా ముందుకు దూకించాడు.

సన్నపాటి వెలుగు ప్రసరిస్తున్న భవనంలో నుంచి బయటికి పరిగెత్తుకు వస్తున్నాడు ఒక మనిషి సన్నగా పొడవుగా వున్న వెదురు చువ్వ ఒకటి వున్నది అతని చేతుల్లో.

భవనంలో నుంచి బయటికి వచ్చిన వెంటనే నాలుగే నాలుగు అంగల్లో క్రిందపడిపోయిన ఆ స్త్రీ మూర్తిని సమీపించాడు అతను. చేతుల్లో వున్న వెదురు చువ్వను పైకెత్తి ఛటాఛట్‌మని శబ్దం వచ్చేలా ఆమె వెన్నుమీద కొట్టడం మొదలు పెట్టాడు.

బాధను భరించడం అసాధ్యం అయిపోయింది కాబోలు - అంతకు ముందు కంటె బిగ్గరిగా ఆర్తనాదాలు చేయటం మొదలు పెట్టింది ఆ స్త్రీమూర్తి.

"రక్షించండి... కాపాడండి..." అంటూ కేకలు కూడా పెట్టింది.

వేగంగా దూసుకుపోతున్న శ్యామలుడి ప్రక్కకు తన అశ్వాన్ని పోనిచ్చి "మిత్రమా ఒక్క క్షణం ఆగిపో... ఒకే ఒక్క క్షణం... ఆగిపో..." అంటూ అతి బలవంతంగా అతన్ని ఆపేశాడు గదాధరుడు.

అంతకుముందు మాదిరి అతని ఆ మాటల్ని నిర్లక్ష్యం చేయలేదు శ్యామలుడు. తన అశ్వాన్ని ప్రక్కకు నడిపి, ఒక ఇంటి గోడ దగ్గర నిలబెట్టాడు.

వెదురు చువ్వను అవతలికి విసిరి, ఆ స్త్రీమూర్తి జుట్టంతా మెలిపెట్టి పట్టుకున్నాడు ఆ వ్యక్తి. ఇసుకమూటను ఈడ్చినట్లు బలవంతంగా ఈడ్చుకుంటూ తన భవనంలోకి తీసుకుపోయాడు.

కదలకుండా నిలబెట్టి వుంచిన తన వాహనాల్ని మెల్లిగా కదిలించి ఆ భవనం దగ్గరికి తీసుకుపోయారు స్నేహితులు ఇద్దరూ.

తన అశ్వం మీది నుంచి క్రిందికి దూకి, గట్టిగా మూసి వున్న ఆ భవనపు తలుపుల్ని వెనక్కి నెట్టాడు శ్యామలుడు.

"ఎవరు? ఎవరు వీధి గుమ్మం దగ్గిర? ఏం కావాలి మీకు?" ఖంగు మంటూ వినవచ్చింది ఆ ప్రశ్న.

"అయ్యా... చీకటి సమయంలో దారులు తెలియక తల్లడిల్లిపోతున్న పరాయి దేశీయులం... దయచేసి ఒకసారి మా గోడును వినిపించుకోండి..." తడుముకోలేదు గదాధరుడు. తలుపుల దగ్గిర వున్న శ్యామలుడు పెదవులు విప్పకముందే గబగబా తను సమాధానం ఇచ్చాడు.

"పరదేశీయుల గోడును గురించి పట్టించుకోవటానికి ఇది ధర్మసత్రం కాదు. పరువు మర్యాదలు కలిగి వున్న భవనం... చీకటివేళల్లో ఎవరినీ పట్టించుకోము. వెళ్ళిపొండి... వీధుల్లో తిరుగాడే రాజభటులు ఎవరైనా కనిపిస్తే మీ గోడును వారికి వినిపించుకోండి..." వెక్కిరింపుగా వినవచ్చింది సమాధానం.

"మీరు మాకు సహాయం ఏమీ చెయ్యవలసిన అవసరం లేదు. ఒక్కసారి మాకు దర్శనం ఇచ్చి ఒకే ఒక మాటకు సమాధానం ఇస్తే చాలు. వెళ్ళిపోతాము" తలుపుల దగ్గిర్నించి ఒక్క అడుగు కూడా వెనక్కి వేయకుండా అన్నాడు శ్యామలుడు.

ఆ మాటలు అతని పెదవుల్ని దాటి వెలుపలికి వచ్చిన మరుక్షణం విసురుగా తెరుచుకున్నాయి తలుపులు.

అంతకుముందు వీధిలోకి పరిగెత్తుకు వచ్చిన స్త్రీ మూర్తిని వెదురు చువ్వతో హింసించిన మహావీరుడే ఇప్పుడు కూడా స్నేహితుల ముందు ప్రత్యక్షమయ్యాడు. వెదురుచువ్వ కాదు ఇప్పుడు అతని చేతుల్లో వున్నది. పొడవాటి చర్మపు కొరడా.

"చీకటి మాటున మర్యాదస్తుల ఇళ్ళ తలుపులు వద్దన్న కొద్దీ తట్టి తలనొప్పి కలిగించే వారిని క్షమించటం జరగదు. మీకు సరైన శిక్షపడి తీరవలసిందే" అంటూ కొరడాను గాలిలో ఝళిపించి విసురుగా శ్యామలుడి మొఖం మీద కొట్టాడు.

చటుక్కున తలను ప్రక్కకు వంచి ఆ దెబ్బను తప్పించుకున్నాడు శ్యామలుడు. కంటికి కనిపించనంత వేగంతో చేతులు జాచి ఆ పెద్దమనిషి అంగీ ముందు భాగాన్ని పట్టుకున్నాడు.

శ్యామలుడి భుజాల మీది నుంచి తన పిడికిలిని ప్రయోగించాడు గదాధరుడు.

పిడుగువచ్చి తన తల మీద పడిన అనుభూతి కలిగింది కాబోలు – అల్లకల్లోలమై పోయాడు ఆ మనిషి.

రెండు అడుగుల ఎత్తుకు గాలిలోకి లేచాడు... ఈదురు గాలిలో చిక్కుకుపోయిన ఎండుటాకు మాదిరి ఎగురుతూ పది అడుగుల దూరం పోయి వెల్లకిలా పడిపోయాడు.

తల నేలకు పొడుచుకుని ఖంగుమని వినవచ్చింది శబ్దం... మొఖం రంగు మారిపోయింది. స్పృహ తప్పిపోవడం వల్ల కదలిక నశించిపోయింది.

ఆ భవనంలోకి అడుగు పెట్టాడు గదాధరుడు – శ్యామలుడి ప్రక్కనుంచి.

విశాలంగా వున్నది లోపలి భాగం. విలువైన పట్టు తెరలతో, అందమైన ఆసనాలతో బహు సుందరంగా అలంకరించబడి వున్నది.

"మనం ఇందాక చూసిన స్త్రీ మూర్తిని వాడు లోపలి మందిరాల్లోకి తీసుకుపోయి వుంటాడు...." అంటూ ఆ ప్రదేశానికి పది అడుగుల దూరంలో వున్న ఇంకో ద్వారం దగ్గరికి పోయాడు అతను. మూసి వున్న తలుపులకు చెవి ఆనించి దీక్షగా ఆలకించాడు.

"మనం రాకూడని ప్రదేశంలోకి వచ్చామేమోనని ఎందుకో అనిపిస్తోంది. అడుగు ముందుకు వేయటానికి ఏదో సంకోచం అడ్డుపడుతోంది" అంటూ మూసి వున్న ఆ మందిరపు తలుపుల్ని మెల్లిగా వెనక్కి నెట్టాడు.

నెట్టినవెంటనే ఛెంగున ఎగిరి మూడు అంగల దూరం వెనక్కి దూకాడు.

అయినాసరే అతన్ని వదిలిపెట్టలేదు ఆ తలుపుల వెనుక పొంచి వున్న ప్రమాదం.

తల నుంచి పాదాల వరకూ ఇనుప తొడుగులు తొడిగినట్లు కనిపిస్తున్న పెద్ద లోహ విగ్రహం అది. వెయ్యి మిణుగురు పురుగులు ఒకేచోట చేరి తమ కాంతుల్ని ప్రదర్శిస్తున్నట్లు మిలమిల మెరుస్తున్నాయి దాని కళ్ళు.

మర్రిచెట్టు మొదళ్ళ మాదిరి లావుగా బలంగా వున్న బాహువులను ముందుకు జాచి అతని మెడను వడిసి పట్టుకున్నది అది.

తన దట్టీకి బిగించి వున్న కరవాలాన్ని బయటికి తీసి ఆ ఆకారం గుండెల్లో పొడిచాడు గదాధరుడు.

ఇనుప తొడుగులున్న ఆకారం కావడం వల్ల ఆ దెబ్బను అది ఇసుమంతకూడా లక్ష్యపెట్టలేదు. పైపెచ్చు దాని గుండెలకు తగిలిన మరుక్షణం మధ్యకు విరిగి ఎందుకూ పనికిరాకుండా పోయింది అతని కరవాలం.

ఎలుకపిల్లను ఎత్తినట్లు అతని మెడను మరింత గట్టిగా పట్టుకుని గాలిలోకి ఎత్తిందా ఆకారం.

ఊపిరి తీసుకోవడం అసాధ్యమైపోయింది గదాధరుడికి... కనుల ముందు రకరకాల రంగులు ప్రత్యక్షం అవసాగాయి.

"మిత్రమా... మిత్రమా...." శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుని ఆఖరి సారిగా చాలా బిగ్గరిగా అరిచాడు.

చురకత్తుల మాదిరి పొడవుగా వున్న దంతాలన్నీ బయటికి కనిపించేటట్లు నిశ్శబ్దంగా నవ్వుతూ అతన్ని వేగంగా ప్రక్కకు తిప్పి ఒక గోడకేసి కొట్టబోయింది ఆ ఆకారం.

అదిగో... సరిగ్గా అప్పుడే దాని ముందుకు దూకాడు శ్యామలుడు. దగ్గిర్లో వున్న ఒక అందమైన ఆసనాన్ని అమాంతం గాలిలోకి ఎత్తి దాని పాదాల మీద బలంగా మోదాడు.

తుంపులు తుంపులై పోయిందా ఆసనం. అంగుళంలో పదోవంతు దూరం కూడా ప్రక్కకు తూలలేదు ఆ ఆకారం.

అమాంతంగా దాని నడుమును తన బాహువులతో చుట్టేశాడు అతను. పళ్ళు బిగించి ఊపిరి బిగపట్టి పైకి ఎత్తాడు.

ఊపిరి అందక గిలగిలలాడుతున్న గదాధరుడిని వదిలేసిందా ఆకారం. శ్యామలుడి మెడను పట్టుకోవటానికి ప్రయత్నించింది.

ఇసుకమూట పడినట్లు దబ్బున క్రింద పడ్డాడు గదాధరుడు.

"నీ మెడ జాగ్రత్త మిత్రమా" అంటూ ప్రక్కకు దొర్లి వెనుకనుంచి దాని వెన్ను మీదకి ఇంకో ఆసనాన్ని విసిరేశాడు.

ముక్కలు ముక్కలైపోయింది ఆ ఆసనం కూడా... – తల తిప్పి మళ్ళీ అతని వంక చూసిందా ఆకారం.

"వంటిమీద దెబ్బ పడినప్పుడల్లా ఇది గుడ్లు మిటకరించి దెబ్బకొట్టిన వాళ్ళని చూస్తోంది... ఇందులో ఏదో విచిత్రం దాక్కుని వున్నట్లు నాకు

అనిపిస్తోంది" అంటూ ఉన్నట్లుండి గాలిలోకి ఎగిరి రెండు పాదాలతోను దాని నడుము మీద బలంగా కొట్టాడు గదాధరుడు.

ముందుకు తూలిందా ఆకారం.... శ్యామలుడిని వదిలేసి, మళ్ళీ గదాధరుడి వైపు ఒక అడుగు వేసింది.

"కొట్టు మిత్రమా... ఈ సారి నువ్వు దెబ్బకొట్టు" స్నేహితుడిని హెచ్చరిస్తూ దాని చేతులకు అందకుండా వెనక్కి గెంతాడు గదాధరుడు.

క్షణికం కూడా ఆలస్యం చేయలేదు శ్యామలుడు. తను కూడా గాలిలోకి ఎగిరి దాని నడుము మీద కొట్టాడు పాదాలతో.

గదాధరుడి అంచనా యదార్థమేనని వెంటనే అవగతమైంది అతనికి. దెబ్బతగిలినవెంటనే అతని కేసి తిరిగిందా ఆకారం. తిరిగిన మరుక్షణం మళ్ళీ కొట్టాడు గదాధరుడు... అతనికేసి చూడబోతుండగా తాను కల్పించుకున్నాడు శ్యామలుడు.

ఒకరి తర్వాత ఒకరుగా ఆ ఆకారాన్ని రెచ్చగొడుతూ, అది ఏ మందిరంలో నుంచి వెలుపలికి వచ్చిందో, ఆ మందిరానికి దూరంగా తీసుకు పోయారు వారిద్దరూ.

"నువ్వు దాన్ని వీధిలోకి తీసుకుపోగలిగితే చాలా బాగుంటుంది. నేను ఈ లోపల ఈ భవనమంతా పరికించి రావటానికి వీలుంటుంది" ఒకే ఒక తన్నుతో దాన్ని ముఖద్వారం ముందుకు పంపిస్తూ శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

అతను చెప్పిన వెంటనే తను ఆ పనిచేసి చూపించాడు శ్యామలుడు. రెండే రెండు తన్నులతో దాన్ని వీధిలోకి రప్పించాడు.

సరిగ్గా అప్పుడే అవతలి వీధిలో నుంచి అటుగా వచ్చారు రాజభటులు.

"ఎవరు? ఏం జరుగుతోంది ఇక్కడ?" కంచు కంఠాలతో అడుగుతూ అతి వేగంగా శ్యామలుడి దగ్గరికి చేరుకున్నారు.

"రక్షించండి... ఇదేదో రాక్షసి మాదిరిగా వున్నది. ఈ దారి వెంట వస్తుంటే విడవకుండా వెంటాడుతోంది" విపరీతమైన భయాన్ని నటిస్తూ అన్నాడు శ్యామలుడు.

"ఎవరు నువ్వు? ఏమిటి ఈ అవతారం?" కోపంగా అడుగుతూ తన చేతుల్లో వున్న శూలాన్ని వెనక్కి తిప్పి ఆ ఆకారం గుండెల మీద పొడిచాడు వారిలో ఒక భటుడు.

శ్యామలుడి మీది నుంచి తన దృష్టిని వెంటనే మరల్చుకుని, అతనివైపు చూసిందది. నిశ్శబ్దంగా నవ్వుతూ అతని మెడను పట్టుకున్నది.

గిలగిలలాడుతున్న తమ సహచరుడిని కాపాడటం కోసం కలిసి కట్టుగా దాన్ని ఎదిరించటం మొదలు పెట్టారు మిగిలిన భటులు.

అంతవరకే చూశాడు శ్యామలుడు. గిరుక్కున వెనక్కి తిరిగి భవనంలోకి పరుగు తీశాడు.

*    *    *    *    *

లోహపు తొడుగులున్న శరీరం వంటి గట్టి శరీరాన్ని కలిగివున్న ఆకారం ఏ మందిరంలోనుంచి బయటికి వచ్చిందో – ఆ మందిరంలోకి అడుగు పెట్టి అదిరిపడ్డాడు గదాధరుడు ఒక్కసారిగా.

చిత్రవిచిత్రమైన ముగ్గులు రచించబడి వున్నాయి. క్రింద పరిచివున్న పాలరాళ్ళ మీద పసుపు కుంకుమలతో పూజలు చేసిన ఆనవాళ్ళు అగుపిస్తున్నాయి.

మందిరపు గోడల దగ్గిర నిలబెట్టి వుంది ఒక పెద్దపక్షి బొమ్మ.

"ఇది ఏ రకపు పక్షో తెలియటం లేదు. చూపులు గరుడపక్షి మాదిరి – రెక్కలు పికిలిపిట్ట మాదిరిగా ఉన్నాయి. దేవతా రూపమో, దయ్యపు ఆకారమో కొంచెంగాకూడా బోధపడటం లేదు...." తనలో తను అనుకుంటూ ముందుకు అడుగువేశాడు.

మెలికలు తిరుగుతూ క్రింద వున్న ముగ్గులో నుంచి పైకి లేచింది లోహపు తీగె ఒకటి. అతని ఎడమ పాదాన్ని పట్టుకుని క్రిందికి లాగటం మొదలుపెట్టింది.

సరయిన ఆయుధం చేతుల్లో లేకుండా ఆ ప్రదేశంలోకి అడుగు పెట్టడం తప్పయిపోయిందని వెంటనే తెలిసి వచ్చింది గదాధరుడికి. ఎగిరి వెనక్కి దూకటానికి ప్రయత్నం చేశాడు.

ఆరంగుళాల ఎత్తుకు కూడా ఎగరలేకపోయాడు అతను. ప్రాణమున్న చెట్టు తీగ మాదిరి గజగజా అతని పాదం మీదికి పాకి అంతకు ముందుకంటే బలంగా పెనవేసుకున్నది ఆ తీగె. బలంగా క్రిందికి గుంజింది.

"మిత్రమా... మిత్రమా... కొంప మునిగింది. ఇదేదో మంత్రాల మందిరం...." బిగ్గరిగా అరిచాడు అతను.

ఆ అరుపు తనకు విపరీతమైన కోపాన్ని కలిగించినట్లు అతన్ని దూరంగా వున్న పక్షిని విగ్రహం దగ్గరికి దొర్లించసాగిందా లోహపు తీగ.

మతి పూర్తిగా పోయినంత పని అయింది గదాధరుడికి. క్రింది నుంచి పైకి లేవటానికి ప్రయత్నించాడు. చేతుల్ని కూడా ఆ తీగె కదలకుండా చుట్టుకుని వుండటంతో ఆ పని చేయలేకపోయాడు.

"మిత్రమా... త్వరగా రావాలి... ఆలస్యం చేశావంటే నీకు నా ఆఖరి చూపులు కూడా దక్కవు" మరోసారి బిగ్గరిగా అరిచాడు.

గోడల దగ్గిర వున్న పక్షి విగ్రహంలో చిన్నపాటి కదలిక వస్తున్నట్టు కనిపించింది అతనికి. పికిలిపిట్ట రెక్కల మాదిరి చిన్నగా సున్నితంగావున్న దాని రెక్కలు వెడల్పుగా విప్పారటం మొదలు పెట్టాయి.

చెమటలతో తడిసిపోయింది గదాధరుడి వదనం. నడ వీధిలో ఆ లోహపు ఆకారాన్ని అటూ ఇటూ పరుగులు పెట్టించే తన జతగాడిని తిరిగి తను చూడలేమోనన్న అనుమానం కలిగింది అతనికి.

*         *         *         *         *

అడ్డదిడ్డంగా పడి వున్నాడు ఆ భవన యజమాని. అతను తేరుకోవటానికి మరికొంత సమయం పడుతుందని గ్రహించి, అతని ప్రక్క నుంచి ముందుకు పరిగెత్తాడు శ్యామలుడు.

సరిగ్గా అప్పుడే అతని చెవులకి చేరింది గదాధరుడి పిలుపు. "మిత్రమా... వస్తున్నావా? వచ్చేస్తున్నావా?" అంటూ.

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ, ఎట్టఎదుట వున్న మందిరం దగ్గరికి పోయాడు అతను. అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసేసరికి నిర్ఘాంతపోయాడు.

లావుపాటి మోకులతో బంధింపబడినట్లు తల దగ్గిర్నించి పాదాల వరకూ ఏదో లోహపు తీగెతో చుట్టబడి వున్నాడు గదాధరుడు.

అతని తలను కరిచి పట్టుకోవటానికి ముందుకు వంగుతోంది పక్షి ముక్కు. "మిత్రమా... జాగ్రత్త... క్రింద వున్న ముగ్గులవంక సరిగ్గా చూసుకో" మందిర ద్వారం దగ్గిర ప్రత్యక్షం అయిన స్నేహితుడిని చూడగానే బిగ్గరిగా అరిచాడు గదాధరుడు.

అతిగా ఆలోచించలేదతను. ఆలస్యం కూడా చేయలేదు. దట్టీకి బిగించుకున్న పటకాకత్తిని బయటికి లాగి బలంగా ముందుకు విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ పోయింది అది వెడల్పుగా విచ్చుకుంటున్న దాని రెక్క ఒకదానికి తగిలింది.

నిజమైన పిట్ట రెక్క తెగినట్లు మధ్యకు తెగి క్రింద పడిపోయింది ఆ బొమ్మ రెక్క. తెగిపోయిన రెక్కను గుండెలకు అదుముకుంటూ చిందులు వేయటం మొదలు పెట్టింది.

"భళీ మిత్రమా... భలేపనిచేశావు... నన్ను కదలకుండా పట్టుకున్న ఈ పిశాచి తీగెలవంక కూడా ఒకసారి చూడు." ఉత్సాహంగా స్నేహితుడికి చెప్పాడు గదాధరుడు.

అవతలి గోడదగ్గిర పడిపోయిన తన పటకా కత్తి వంక చూస్తూ మరోసారి అడుగు ముందుకు వేశాడు శ్యామలుడు.

మళ్ళీ పాము మాదిరి పైకి వచ్చిందా తీగె.... ఒడుపుగా వెనక్కి దూకి దానికి చిక్కబడకుండా తప్పించుకున్నాడు.

"ఏం చేస్తే ఆ తీగెను నిన్ను వదిలేస్తాయో తెలియటం లేదు మిత్రమా. నాకు అంతా అయోమయంగా వుంది...." అంటూ గిరుక్కున వెనుతిరిగి అడ్డదిడ్డంగా పడిపోయి వున్న పెద్దమనిషి దగ్గరికి పరిగెత్తుకు వచ్చాడు.

అచేతనంగా పడపోయివున్న అతన్ని భుజం మీదికి ఎత్తుకుని వెనక్కి పోయాడు.

చిందులు తొక్కుతున్న పక్షి రూపం మీదికి అతన్ని బలంగా విసిరాడు.

దాని మీది నుంచి సరిగ్గా గదాధరుడి దగ్గర నేలను కరుచుకున్నాడు శ్యామలుడు విసిరేసిన భవన యజమాని.

అతను నేలను తాకిన వెంటనే క్రింద వున్న ముగ్గుల్లో నుంచి వేగంగా పైకి వచ్చాయి తీగెలు. అతని తలను నడుమును, పాదాలను ఆక్రమించుకోవడం మొదలుపెట్టాయి.

నాలుగు అడుగులు వెనక్కి వేసి ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి సూటిగా గదాధరుడి దగ్గిర నేలను తాకాడు.

"తీగెలు... తీగెలు మిత్రమా... ముగ్గుల్లో దాక్కుని వున్న తీగెలు నిన్ను కూడా...." ఆందోళనగా నిండిన కంఠంతో అతన్ని హెచ్చరించబోయి – చటుక్కున ఆ మాటల్ని ఆపాడు గదాధరుడు.

రెండే రెండు ముగ్గుల మీద నిలబడి వున్నాడు శ్యామలుడు. ఆ ముగ్గుల్లో నుంచి రెండు తీగెలు బయటికి వచ్చి అతను విసిరేసిన పెద్ద మనిషి శరీరాన్ని ఆక్రమించుకుంటున్నాయి.

"ఒక్కొక్క ముగ్గుకు ఒక్కొక్క తీగె వస్తున్నట్టు నాకు అనిపించింది. అందుకే ధైర్యం చేస్తున్నాను" అంటూ పక్షి బొమ్మ మీదికి విసిరిన తన పటకా కత్తిని ముందుకు వంగి అందుకున్నాడు శ్యామలుడు. వేగంగా గాలిలోకి ఎత్తి గదాధరుడిని పట్టుకున్న తీగె మొదలు మీద వేటు వేశాడు.

ఖంగుమంటూ వినవచ్చింది శబ్దం... ప్రాణం వున్న పాము మాదిరి మెలికలు తిరుగుతూ గదాధరుడి శరీరాన్ని వదిలి, అతని పాదాలను చుట్టుకో బోయింది అది.

అది తన స్నేహితుడిని వదిలిన వెంటనే, అతని భుజాలు పట్టుకుని వేగంగా పైకి లేపాడు శ్యామలుడు. ఉన్నపళానా గాలిలోకి ఎగిరి మందిర ద్వారం దగ్గిర నేలను తాకాడు స్నేహితుడితో కలిసి.

"చూసేందుకు వెక్కిరింపుగా వేళాకోళంగా వున్నా, ఈ మందిరం నిండా ప్రమాదం నిండి వుంది మిత్రమా... ఈ ఆకారాలు ఏమిటో, ఈ ముగ్గులు ఎందుకో అవగతం కావటం లేదు...." మందిరంలోకి చూస్తూ సాలోచనగా అన్నాడు గదాధరుడు.

"అనవసరమైన ఆలోచనలతో సమయాన్ని వృధా చేస్తే ఇంకో ప్రమాదం వేరే రూపంలో వచ్చి పడుతుంది. మనం వచ్చింది దేనికో గుర్తున్నదా?" అడిగాడు అతన్ని శ్యామలుడు.

"వెదురుచువ్వతో దెబ్బలు తిన్న అమ్మాయిని వెతకటానికి వచ్చాము...." అంటూ అతి బలవంతంగా తన చూపుల్ని మరల్చుకుని ఇంకో మందిరంలోకి పరిగెత్తాడు గదాధరుడు.

నిట్టనిలువుగా పాతి వున్నది ఒక స్తంభం ఆ మందిరం మధ్య భాగంలో. దానికి ఆనించి నిలబెట్టి వున్నది వారు వెతకటానికి వచ్చిన యువతి. చేతులు వెనక్కివిరిచి కట్టేసి వున్నాయి. పాదాలకు బలమైన ఇనుప సంకెళ్ళు బిగించి కనిపిస్తున్నాయి.

*  *  *  *  *

"గురుదేవా... గురుదేవా... కరాళి వచ్చింది. మీరు పంపకం చేసిన కరాళి నగర సంచారాన్ని పూర్తి చేసుకుని తిరిగి వచ్చింది" అంటూ తన శిష్యుడు పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పేసరికి తన పడక మీదినుంచి లేచాడు మాండలీకుడు.

తను ఏ పీఠం మీద ఆశీనురాలై వుంటుందో సూటిగా అక్కడికే పోయి నిలబడింది కరాళి.

"నీకు అప్పచెప్పిన పని ఎంతవరకూ సానుకూల పడింది కరాళీ...." దగ్గరికి పోయిన వెంటనే అడిగాడు అతను.

"నువ్వు ఎవరిని వెతికి పట్టుకోవాలని అనుకుంటున్నావో, ఆ నీలమణి నాకు నగరంలో ఎక్కడా కనిపించలేదు. నీకు వ్యతిరేకంగా ఎటువంటి మంత్ర ప్రయోగాలు జరగడం లేదు... కాని" అంటూ మాటల్ని ఆపింది కరాళి.

అధికమైపోయింది మాండలీకుని అసహనం.

"నాకు ఇప్పుడు నీలమణితో నిమిత్తం లేదు. శ్యాలక భూపతిని ఎదిరించి అవమానించిన ఆగంతకులు ఇద్దరూ నగరంలో సంచరిస్తున్నారు. వారు మా సాధారణ మంత్ర దృష్టికి అందకపోవటం వల్ల, నీలమణి వారికి రక్షణ కల్పిస్తున్నదని భావించాము. మాకు ఆ నీచుల జాడలు కావాలి. అంతే" వేగంగా అన్నాడు.

"నాకు నువ్వు ఇచ్చిన సూచనలు ఏమిటో గుర్తున్నదా...." ఉన్నట్లుండి చురుకుగా చూస్తూ అడిగింది కరాళి.

కోపం తాండవిస్తోంది మాండలీకుడి ముఖంలో కరాళినే స్వయంగా అంపకం చేసిన తర్వాత కూడా ఆ దుర్మార్గుల జాడలు తెలియలేదని బయటికి పొక్కితే అందరి ముందు అవమానాలపాలు కావటం జరుగుతుందన్న భావన అతన్ని కలిచి వేస్తోంది.

చెప్పిన పనిని చెప్పినట్లు చేసి చూపించే కరాళి ఇప్పుడు వున్నట్లుండి తనకు ఎదురు మాట్లాడేసరికి ఒక్క క్షణం పాటు అయోమయానికి గురైనాడు అతను.

"నిజమే గురుదేవా... కరాళికి ఇచ్చిన సూచనలు చాలా భిన్నంగా వున్నాయి నగరంలో ఏవైనా మంత్ర ప్రయోగాలు జరిగితే కనిపెట్టమని చెపుతున్నాము. మనకి కావల్సిన ఆ ఇద్దరి జాడల్ని వెతకమని చెప్పలేదు...." చిన్నగా అన్నాడు శిష్యుడు.

నిలబడటానికి ఓపిక లేనట్లు దగ్గిర్లో వున్న ఒక ఆసనం మీద కూర్చుండి పోయాడు మాండలికుడు.

"పొరపాటు జరిగిపోయింది కరాళీ... నీ మాటలే నిజం. మా సూచనలు మంత్ర ప్రయోగాల్ని కనిపెట్టమనే...." తన పొరపాటును ఒప్పుకున్నాడు.

తన పీఠం మీదికి చేరుకుంటూ చిన్నగా నవ్వినట్లు శబ్దం చేసింది కరాళి. "నీ మనోరథం ఏమిటో నాకు తెలుసు. ఈ నగరానికి చెందని ఇద్దరు యువకులు

నగర వీధుల్లో సంచారం చేస్తున్నారు... నువ్వు వెంటనే కదిలి వారి కదలికల్ని అడ్డుకోకపోతే నష్టం చాలా అధికంగా వుంటుంది” అన్నది.

“నష్టమా? నాకు? ఏమిటది? ఏ విధంగా?” ఆశ్చర్యంగా అడిగాడు మాండలీకుడు.

“శాంబర శక్తిని సాధించటం కోసం నీకు చెరసాలలో వున్న సుశాంత చక్రవర్తి వంశంలోని స్త్రీమూర్తి ఎవరైనా కావాలి. అవునా?” అడిగింది కరాళి.

ఉలిక్కిపడినట్లు ఆసనం మీది నుంచి లేచి చుట్టూ చూశాడు మాండలీకుడు. సుశాంత చక్రవర్తితో సంబంధం వున్న వారందరినీ వధించటమో, చెరసాలలోకి నెట్టి బయటికి రాకుండా బంధించటమో చేశాడు వకుళేంద్రుడు.

అతను అలా వారందరినీ వెతుకుతున్న సమయంలో అతి రహస్యంగా సూశాంతుడి మనవరాలిని బంధించగలిగాడు తను. తనతో పాటు రాజమందిరంలో ఆమెను బంధించి వుంచితే, ఆ గుట్టు బట్టబయలు అవుతుందన్న భయంతో నగరంలోనే ఒక స్నేహితుడి ఇంట్లో ఆమెను దాచి వుంచాడు.

తనకు తన శిష్యుడికి, ఆ యువతిని కాపాడుతున్న తన స్నేహితుడికి తప్ప రెండో కంటివాడికి తెలియని రహస్యం అది. కరాళికి కరతలామలకం అయిపోయింది.

మాండలీకుడి మనసులోని ఆలోచనలు తనకు అవగతం అయినట్లు మరోసారి కువకువ శబ్దం చేసింది కరాళి.

“సుశాంతుడి రక్తసంబంధీకురాలికి అతి సమీపంలోకి పోతున్నారు నగరంలో సంచరిస్తున్న యువకులు ఇద్దరూ. ఆఖరిసారిగా నేను గమనించినప్పుడు వారు ఆ వీధిలోకి అడుగుపెడుతున్నారు....” అంది.

మరోసారి మాండలీకుడిని ఆవరించుకున్నది విపరీతమైన కోపం.

“ఆర్చుకుని తీర్చుకుని ఇప్పుడు తీరికగా ఈ మాటలు చెపుతావా ఇంతకుముందే ఎందుకు చెప్పలేదు?” అడిగాడు.

“చెప్పమని నువ్వు నాకు సూచించలేదు. నువ్వు చేస్తున్న పూజలు నాకు తృప్తిని కలిగించడం వల్ల నీ మీద అభిమానంతో నువ్వు సూచించకపోయినా ఇప్పుడు చెప్పాను. ఇకమీదట చెప్పటం జరుగదు” అంటూ పీఠాన్ని బలంగా అదిమింది కరాళి.

భూకంపం వచ్చినట్లు తీవ్రంగా చలించిపోయిందా మందిరం...

"తప్పు అయిపోయింది కరాళీ. ఆత్రుత పడి అనవసరమైన మాటలు మాట్లాడాను. ఇకముందు ఇలా జరుగదు...." ఆందోళన నిండిన కంఠంతో వేడుకున్నాడు మాండలీకుడు.

ఆ మాటల్ని వినటం తనకు ఇష్టం లేనట్లు విగ్రహ రూపంలోకి మారి పోయింది కరాళి.

పెదవులు బిగించి తలను విదిలించాడు మాండలీకుడు.

"ఈ అమానవీయ శక్తులతో వచ్చిన చిక్కు ఇదే. చిటికెలో సంతోష పడతాయి. వెనువెంటనే ఆవేశానికి లోనవుతాయి. భద్రంగా ప్రవర్తించకపోతే మన తలల్ని నేలకేసి అదిమి ప్రాణాలను హరిస్తాయి" అంటూ వెనుతిరిగి ఇవతలకు వచ్చేశాడు. "కోపాన్ని తగ్గించే ఆరాధనలు వుంటాయి కదా... అవసరం అయితే బలి కార్యక్రమాలు నిర్వహించవచ్చు కదా...." వెనకే నడుస్తూ చిన్నగా అన్నాడు శిష్యుడు.

"అయినదానికి కాని దానికి వాటిని గురించి ఆలోచిస్తూ వుంటే అవి మన తలల మీదికి ఎక్కి చిందులు తొక్కుతాయి. తనంతట తానే తన కోపాన్ని తగ్గించుకుని ముందుగా తానే మాట్లాడేంతవరకూ కరాళి జోలికి పోకూడదు" అంటూ తన ఆసనం మీద చేరగిలబడబోయాడు మాండలీకుడు.

"గురుదేవా... ఆ ఆగంతక యువకుల గురించి ఏం చేయదలుచు కున్నారు?" వెంటనే అడిగాడు శిష్యుడు.

వెన్నుమీద ఎవరో బలంగా చరిచినట్లు అదిరిపడి ఆసనంలోంచి లేచాడు మాండలీకుడు.

"సరైన సమయానికి చక్కగా గుర్తు చేశావు. ఆలస్యం జరిగితే సర్వం నాశనం అయిపోయివుండేది. వెంటనే మనం నా స్నేహితుడి దగ్గరికిపోవాలి...." అంటూ పెద్ద పెద్ద అడుగులతో భవనం వెలుపలికి బయలుదేరాడు.

అతని కంటే ముందుగా పరిగెత్తాడు శిష్యుడు.

* * * * *

మందిరం మధ్య భాగంలోని స్తంభానికి బంధించి వున్న స్త్రీ మూర్తిని చూడగానే పరిశీలనగా చూశాడు గదాధరుడు. ప్రాణాలతోనే వున్నది ఆమె. దెబ్బలు బలంగా తగలటం వల్ల కాబోలు భరించరాని బాధతో గిలగిలలాడి

పోతున్నది. దగ్గరికి వచ్చిన గదాధరుడు తనకు అపకారం చెయ్యటానికి వచ్చినట్లు భావించి గజగజా వణికిపోయింది.

"తల్లీ... మేము నీకు శత్రువులం కాదు. నడి వీధిలో నీకు జరిగిన అవమానాన్ని చూసి భరించలేక ఈ దుర్మార్గపు భవంతిలో అడుగుపెట్టిన పరాయి దేశస్తులం. మావల్ల నీకు అపకారం జరగదు. భయపడవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు...." మరో అడుగు ముందుకు వేస్తూ మృదువుగా అన్నాడు గదాధరుడు.

"మీరు... మీరు వెంటనే దూరంగా పారిపోండి... మాండలీకుడి స్నేహితుడు చూస్తే మీకు కూడా ఇటువంటి గతే పడుతుంది. వాడి వశంలో లోహ పిశాచి వున్నది. దాన్ని పంపకం చేశాడంటే మీ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. పారిపోండి" తడబడుతున్న కంఠంతో అస్పష్టంగా అన్నది ఆమె.

"ఆ వేడుక జరిగిపోయింది తల్లీ. మాండలీకుడి స్నేహితుడు ఎవరోగాని వీరశూర విక్రముడన్న సంగతి మాకు గట్టిగా తెలిసి వచ్చింది. ఆ లోహపిశాచం కూడా మా కంటపడింది" నవ్వుతూ చెప్పాడు గదాధరుడు.

ఆ మాటల్ని తాను నమ్మలేకపోతున్నట్లు అంత బాధలోను కనుల్ని పెద్దవిగా చేసి చూడకుండా వుండలేకపోయింది ఆమె.

"లోహ పిశాచాన్ని చూసిన తర్వాత కూడా మీరు ప్రాణాలతోనే వుండటం ఎలా సంభవించింది?" అని అడిగింది.

వెనక్కి విరిచి కట్టబడి వున్న ఆమె చేతుల్ని ముందుగా వదిలించాడు గదాధరుడు. "మిత్రమా... సిద్ధంగా వుండు" అని శ్యామలుడిని హెచ్చరిస్తూ ఆమె పాదాలకున్న ఇనుప గొలుసుల్ని కూడా తొలగించాడు.

ఆ బంధనాలు బిగపట్టి వుంచటం వల్ల నిఠారుగా నిలువబడి వున్నది ఆ యువతి. అవి తొలగిపోయేసరికి, శరీరంలో ఓపిక లేనట్లు ముందుకు పడిపోబోయింది.

సిద్ధంగా వున్న శ్యామలుడు చటుక్కున చేతులు జాచి పదిలంగా పట్టుకున్నాడు ఆమెను.

అలాగే చేతుల మీద మోస్తూ ముఖద్వారం దగ్గరికి పరిగెత్తాడు.

నాలుగు అడుగులు వెనుగ్గా అతన్ని అనుసరించాడు గదాధరుడు. సభాభవనం వంటి ఆ మందిరంలో ప్రకాశవంతంగా వెలుగుతున్న ఒక నూనె దీపం దగ్గరికి పోయి దాన్ని తన ఎడమ పాదంతో ప్రక్కకు తన్నాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి ఒక గోడకు వ్రేలాడుతున్న అందమైన పట్టుతెర మీద పడింది.

ఆకలి మీద వున్న తాచుపాము నాలుక ఆడించినంత వేగంగా పైకి ఎగ్రబాకింది అగ్నిజ్వాల.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో అక్కడ వున్న ఆసనాలు ఇతర ఉపకరణాలు అన్నీ భగభగలాడటం మొదలు పెట్టాయి.

* * * * *

"మంటలు... గురుదేవా... భయంకరమైన అగ్నిజ్వాలలు... మనముందు ఏదో భవనం నిట్టనిలువుగా దగ్ధమైపోతున్నట్లు కనిపిస్తోంది" మాండలీకుడి ప్రక్కనే తన అశ్వాన్ని పరుగుతీయిస్తూ ఆశ్చర్యం, ఆందోళన కలగలిపిన కంఠంతో అన్నాడు శిష్యుడు.

తన అశ్వాన్ని మరికొంచెం వేగంగా పరిగెత్తించి, తన స్నేహితుడు నివసించే భవంతి వున్న వీధిలోకి పోయాడు మాండలీకుడు.

కనిపించిన దృశ్యం అతన్ని విభ్రాంతికి గురిచేసింది.

ఫెటేల్ ఫెటేల్మని వికృత శబ్దాలు చేస్తూ తగలబడిపోతున్నది అతని స్నేహితుడి భవనం.

గగ్గోలుగా కేకలు పెడుతూ ఆ మంటల్ని అదుపు చేయటానికి కదులుతున్నారు ఆ వీధిలో నివశించే పౌరులు అనేకమంది.

ఒక్కళ్ళు కూడా దాని సమీపంలోకి పోలేకపోతున్నారు. ఇనుప తాటాకులు ధరించి వున్నట్లు కనిపించే ఒక వింత ఆకారం తన ఎదుటికి వచ్చిన వారందర్నీ తీవ్రంగా హింస పెడుతోంది. వారిని అమాంతం గాలిలోకి ఎత్తి మెడలు పిసికి పరలోకానికి ప్రయాణం కట్టిస్తోంది.

"వాళ్ళు మంటల్ని చూసి అరవటం లేదు గురుదేవా? ఆ లోహ పిశాచాన్ని చూసి గోలపెడుతున్నారు...." తను కూడా ఆ దృశ్యాన్ని చూసి చిన్నగా అన్నాడు మాండలీకుడి శిష్యుడు.

"ఆగు... ఆగిపో... మహామంత్రవేత్త మాండలీకుడిని ఆజ్ఞాపిస్తున్నాను. ఎక్కడవుంటే అక్కడే నిలబడిపో...." ఖంగుమంటున్న కంఠంతో ఏదో మంత్రాన్ని చదువుతూ ఆజ్ఞాపించాడు మాండలీకుడు.

లావుగా ఎత్తుగా వున్న ఒక పౌరుడిని పట్టుకుని గాలిలోకి ఎత్తబోతున్న లోహపిశాచం చటుక్కున వదిలేసింది అతన్ని. నిజమైన విగ్రహం మాదిరి ఎక్కడిదక్కడ కదలకుండా నిలబడిపోయింది.

"మహామాంత్రికుడు మాండలీకుల వారు వచ్చేశారు. మీకు మీ ఆస్తిపాస్తులకు ఎటువంటి హాని జరగదు. నిశ్చింతగా వుండండి." అని అరిచి అక్కడి వారందర్నీ హెచ్చరించాడు శిష్యుడు.

లోహపిశాచం నిలబడిపోగానే మరో మంత్రాన్ని ఉచ్చరించాడు మాండలీకుడు.

భగభగలాడుతూ భవనం పైభాగాన్ని కూడా ఆరగిస్తున్న అగ్నిజ్వాలలు దారుణమైన వర్షం మొదలు అయినట్లు చటుక్కున అణిగిపోయాయి.

మాండలీకుడిని చూసిన మరుక్షణం చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకుల మాదిరి చెల్లాచెదురైపోయారు అక్కడికి వచ్చిన పౌరులు అందరూ.

లోహపిశాచం చేతుల్లో చిక్కుబడి ప్రాణాలు కోల్పోయిన వారి శరీరాలు మాత్రమే మిగిలాయి. గాయపడిన వారు సైతం ఎక్కడ లేని ఓపికా తెచ్చుకుని ఆ ప్రదేశంలో నుంచి దూరంగా వెళ్ళిపోయారు.

ఆ పరిణామాన్ని ఏ విధంగా పరిగణించాలో శిష్యుడికి అర్థం కాలేదు.

అశ్వం మీది నించి క్రిందికి దూకి వేగంగా లోపలికి పరిగెత్తాడు. పరిగెత్తిన దానికంటే రెట్టింపు వేగంతో బయటికి వచ్చాడు.

"సుశాంతుడి మనవరాలు మాయమైపోయింది. తమరి స్నేహితుడు పికిలి పిశాచం ముక్కుపోట్లకు అంధుడై అసువులు బాశాడు. ఆకలితో వున్నట్లు ఎగిరెగిరి పడుతోంది ఆ భూతం. ఒక రెక్క తెగిపోవడం వల్ల మందిరంలో నుంచి బయటికి రాలేకపోతోంది గాని, లేకపోతే ఈ పాటికి నగరం మీద పడి బీభత్సం సృష్టించి వుండేది" ఊపిరి తీసుకోవటానికి కూడా ఆగకుండా ఏకబిగిన చెప్పేశాడు.

కనులు మూసుకుని ఏదో మంత్రాన్ని జపించాడు మాండలీకుడు. తన గుప్పిట్లో ప్రత్యక్ష్యమైన ఎర్రటి భస్మాన్ని శిష్యుడి చేతిలోపోసి తల ఊపాడు.

అతని అభీష్టం ఏమిటో తనకు తెలిసినట్లు మళ్లీ భవనంలోకి పోయి, శ్యామల గదాధరుల్ని బంధించబోయిన ముగ్గుల మందిరం ముందు నిలుచున్నాడు శిష్యుడు.

భవనాన్ని కబళించజూసిన అగ్నిజ్వాలలు ఆ మందిర ద్వారాల్ని పూర్తిగా నాశనం చేసి వేశాయి.

మసిబారి వున్నాయి ముగ్గులు. పికిలి పిశాచం నిలబడి వుండవలసిన పీఠం మధ్యకు పగిలి శిథిలం అయిపోయినట్లు కనిపిస్తోంది.

తెగిపోయిన రెక్కవంక చూసుకుంటూ మసిబారిన ముగ్గుల మీద చిందులు తొక్కుతోంది ఆ శక్తి.

"నా నిర్ణయం కాదు ఇది. నా గురుదేవుల నిర్ణయం. నీకు ఈ భూమి మీద గడువు తీరిపోయింది. నీ లోకానికి నువ్వు వెళ్ళిపోవచ్చు" అంటూ మాండలీకుడు ఇచ్చిన భస్మాన్ని ఆ శక్తిమీదికి విసిరి కొట్టాడు శిష్యుడు.

విరిగిన రెక్కలతో విలవిలలాడుతున్న పికిలిశక్తి వికృతంగా అరిచి మటుమాయం అయిపోయింది. వేగంగా వెనక్కి తిరిగి బయటికి వచ్చేశాడు శిష్యుడు.

అతను వీధిలోకి అడుగు పెట్టడం దిక్కులు బ్రద్దలయిపోతున్నట్లు భీకర శబ్దాలు చేస్తూ ఆ భవనం పెద్ద రాళ్ళగుట్టగా మారిపోవటం ఒకేసారి జరిగింది.

అదే సమయంలో ఆ వీధిలోకి వచ్చారు వందమందికి పైగా ఉన్న సైనికులు. "రాత్రి సమయంలో వీధుల్లో కాపలా కాసే మా వాళ్ళను ఎవరో ఎదిరించినట్లు తెలిసింది. వెతకటానికి వచ్చాము" అన్నాడు వారికి నాయకుడి మాదిరిగా కనిపిస్తున్న వ్యక్తి.

"మీ చక్రవర్తి శౌర్యప్రతాపాల ముందు ఓడిపోయి చెరసాలలో వున్న సుశాంతుడి వారసురాలు ఒకర్తె ఆ దుర్మార్గులకు సహాయం చేస్తోంది. ఆమెను వారిని బంధించి చీకటి కొట్లోకి నెడితే గాని నగరంలో ప్రశాంతత వుండదు. వీధులన్నీ వెతకండి" అన్నాడు.

"సుశాంతుడి వారసురాలా? అటువంటి వారు ఎవరూ ప్రాణాలతో వున్నట్లు మాకు తెలియదే!" ఆశ్చర్యంగా అన్నాడు భటుల నాయకుడు.

"ఇప్పుడు తెలిసింది కదా... వీధులన్నీ గాలించండి... వెళ్ళండి" ఖంగుమటున్న కంఠంతో చెప్పాడు మాండలీకుడు.

"సుశాంతుడి వారసురాలు కనిపిస్తే చక్రవర్తికి ఆగ్రహం అధికం అయిపోతుంది... అప్పటి కప్పుడు మరణశిక్ష విధిస్తాడు. మనకు ఆమె ప్రాణాలు అవసరం... ఎలా?" అడిగాడు శిష్యుడు.

"ముందు ఆమెజాడలు తెలియాలి. ఆమెను నేను చూడాలి. ఆ తరువాత చక్రవర్తికి ఎలా నచ్చచెప్పాలో అలా చెప్పవచ్చు...." అన్నాడు మాండలీకుడు.

గురుదేవుడి తెలివితేటలకు మనస్సులోనే నమస్కారాలు చేసుకుంటూ అతని వెనుకే తన అశ్వాన్ని రాచవీధిలోకి నడిపించాడు శిష్యుడు.

* * * * *

"వాడే... దుష్టమాంత్రికుడు మాండలీకుడు అంటే వాడే...." ముందుగా పోతున్న అశ్వం మీది వ్యక్తిని చూపిస్తూ గదాధరుడికి చెప్పింది వారు కాపాడిన యువతి.

అగ్నిజ్వాలలకు గురైన భవనం ఏ వీధిలో వున్నదో అదే వీధిలో ఒక పెద్ద భవంతి చాటున నిలబడి వున్నారు వారు ముగ్గురూ.

అగ్నిజ్వాలల్ని చూసి భయపడిపోయిన తమ అశ్వాలను మెత్తటి మాటలతో లాలిస్తూ నిలబడి – మాండలీకుడు వచ్చిన క్షణం నుంచీ వెనక్కి వెళ్ళిపోయేంత వరకూ మాట్లాడిన మాటలన్నిటినీ శ్రద్ధగా ఆలకించాడు శ్యామలుడు.

"నీ పేరు ఏమిటి?" తన వెనుక నిలబడి వున్న యువతిని అడిగాడు.

"శ్వేత... మహాశ్వేత" చెప్పిందామె.

"నిన్ను ప్రాణాలతో పట్టుకోవాలని మహాతాపత్రయ పడిపోతున్నాడు ఆ మాంత్రికుడు. కారణం ఏమిటి?" మరో ప్రశ్నవేశాడు అతను.

"వాడు ఏదో క్షుద్రశక్తిని ఆరాధిస్తున్నాడట. ఆ శక్తి తన వశం కావటానికి నన్ను బలి ఇవ్వాలట" తడబడుతున్న కంఠంతో చెప్పింది ఆమె.

"చెరసాలపాలయిన సుశాంత చక్రవర్తికి మనవరాలిని. నా పితామహుడు గనుక ఇప్పుడు సింహాసనం మీద వుండి వుంటే నేను ఈ రాజ్యానికి యువరాణిని. కాబోయే మహారాణిని. అందుకే కాబోలు నరబలికి నేను కావాల్సి వచ్చాను" బాధగా అన్నది ఆమె.

"ఈ మాటలన్నీ తర్వాత మాట్లాడుకుందాము. ముందు ఈమెను ఏదైనా సురక్షిత స్థలానికి చేర్చాలి...." అన్నాడు శ్యామలుడు.

"సురక్షిత స్థలం అంటే మాకు తెలిసిన ముసలమ్మవ్వ ఇల్లే... అంతకుమించి వేరే ఏమీ లేదు...." అన్నాడు గదాధరుడు.

తల ఊపి తన అశ్వం మీదికి ఎగిరాడు శ్యామలుడు. ఒక గోడకు ఆనుకొని నిలబడి వున్న యువతిని తన వాహనం మీదికి ఎక్కించి, తను వెనుక కూర్చున్నాడు గదాధరుడు.

రాచవీధిని చేరుకుంటూ వుండగానే వారికి ఆగుపించారు పాతికమందికి పైగా వున్న సైనికులు. భగభగలాడుతున్న కాగడాలను పట్టుకొని వీధికి అటూ ఇటూ వున్న ఇళ్ళనన్నిటినీ గాలిస్తూ ముందుకు వస్తున్నారు.

"వాళ్ళకంట పడితే మన గుట్టురట్టు అయిపోతుంది. వాళ్లకి కనిపించ కుండా ముందుకు పోవటం చాలా కష్టం. ఏం చేద్దాం మిత్రమా?" శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

"చిన్నచిన్న ఉపాయాలు ఈ సైనికుల ముందు పని చేయవు. వీళ్ళు ఆవులిస్తే ప్రేవులు లెక్కబెట్టగలరు. మహాతెలివైన వాళ్ళు" ఉన్నట్లుండి కల్పించు కుంటూ చెప్పింది గదాధరుడి ముందు కూర్చుని వున్న యువతి.

చటుక్కున క్రిందికి దూకాడు గదాధరుడు తన వాహనం మీది నించి.

కాగడాలు పట్టుకుని ఇళ్లన్నిటినీ గాలిస్తున్న సైనికులకు కనిపించనే కనిపించాడు గదాధరుడు.

"ఎవరది? ఎవరు??" అని ప్రశ్నిస్తూ ముందుకు పరుగు మొదలు పెట్టారు వారిలో కొందరు.

"రండి... త్వరగా... త్వరగా రండి... రండి" ఆ వీధి మొత్తం వినబడేటట్లు అరిచాడు గదాధరుడు.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు అతనికి ఎదురు వస్తున్న సైనికులు. "త్వరగా రమ్మంటుంటే తాత్సారం చేస్తున్నారు? అవతల ఆ దుర్మార్గులు నగరద్వారాల దగ్గరికిపోతున్నారు...." మరో అరుపు అరిచాడు గదాధరుడు.

రెండే రెండు క్షణాల్లో అతన్ని సమీపించి వలయాకారంలో అతని చుట్టూ నిలబడ్డారు ఆ సైనికులు.

"ఇద్దరు యువకులు. ఒక యువతి... బంగారుబొమ్మ మాదిరిగా వుంది. కళ్ళు మిరుమిట్లు గొలిపే అందం... నగర ద్వారాల దగ్గరికి...." అంటూ మొదలు పెట్టాడు గదాధరుడు.

తన చేతిలోని కాగడాని అతని ముఖం మీదికి ఊపి ఠక్కున నోటిని మూయించాడు ఒక సైనికుడు.

"నువ్వు ఎవరివి? ఈ సమయంలో బయటికి ఎందుకు వచ్చావు?" సూటిగా అడిగాడు.

"మీలో ఎంతమందికి శ్యాలక భూపతుల వారి సేవకుల్ని గురించి తెలుసు?"

తమకు వచ్చేటటువంటి సమాధానం అతని దగ్గిర్నించి రాకపోతే మీద పడి కాళ్ళు చేతులు కట్టిపడేసేందుకు సిద్ధంగా నిలబడి వున్న ఆ సైనికుల్లో వెంటనే కనిపించింది చిన్న కలవరపాటు.

"కనీసం మా భూపతుల వారు ఏర్పాటు చేసుకున్న గూఢచారులను గురించైనా విన్నారా?"

మరో అడుగు వెనక్కి వేసేశారు ఆ సైనికులు.

అధికం అయిపోయింది గదాధరుడి ఉత్సాహం. వారిలో ఒక్కరికి కూడా రాజు గారి బావమరిది దగ్గిర పని చేసే వారిని గురించిన వివరాలు తెలియవని రూఢి అయిన క్షణం నుంచీ రెచ్చిపోయాడు అతను.

"మా భూపతులవారికి జరిగిన అవమానం సామాన్యమైంది కాదు. నేను, నాతోపాటుగా నియమించబడిన గూఢచారులు గనుక ఆ సమయంలో అక్కడ వుండి వుంటే, ఆ పని చేసిన దుర్మార్గుల తలలు నేలకు పడి దుమ్ము కొట్టుకుపోయి వుండేవి" చాలా గంభీరంగా అన్నాడు.

పైకెత్తి వుంచిన కాగడాల్ని క్రిందికి దించి, వినయంగా నిలుచున్నారు ఆ సైనికులు.

"ఇప్పటికైనా మించింది లేదు. ఇప్పుడే ఇంతకు ముందే ఈ నగరానికి చెందిన ఇద్దరు యువకుల్ని, ఒక యువతిని నేను గమనించాను. గూఢచారిని కాబట్టి నాకు నేనుగా వారిని బంధించకూడదు. మీ వంటి వారిని హెచ్చరించి ముందుకు దూకించాలి...." ఒక్క మాట కూడా తడబడకుండా చెప్పసాగాడు గదాధరుడు.

"వాళ్ళు మా శ్యాలకుల వారిని అవమానించిన వారే అయితే వెంటనే నేను వెళ్ళి మా భూపతులవారికి చెప్పాలి... రండి... వారిని పట్టుకోండి" అన్నాడు.

ఆలోచించుకునే శక్తిని కోల్పోయారు సైనికులు. ఒకరినొకరు హెచ్చరించు కుంటూ నగర ద్వారాల వైపు పరుగు మొదలు పెట్టారు.

"ఆగండి... ఒక్కసారి ఆగి నా మాటల్ని పూర్తిగా ఆలకించండి...." వారిని పాతిక అంగల దూరం పోనిచ్చి, ఉన్నట్లుండి అరిచాడు గదాధరుడు.

దుమ్ముతెరలు గప్పున లేచాయి. వేగంగా వెళుతున్న ఆ సైనికులు అందరూ తమ కాళ్ళకు బంధాలు పడినట్లు ఒక్కసారిగా ఆగిపోయేసరికి...

"ఎందుకు మమ్మల్ని ఆగమని పిలిచారు తమరు? ఏమిటి విషయం??" గబాగబా వెనక్కి వచ్చి గదాధరుడి ఎదుట నిలబడుతూ వినయాతివినయంగా అడిగాడు సైనికుడు ఒకతను.

"మీరు పట్టుకోబోతున్న యువకుల్లో ఒకతను మా శ్యాలకభూపతుల వారి మీద చేయిచేసుకున్నట్టు మాకు తెలిసింది. అతను ఎవరో గుర్తించి వెంటనే మాకు తెలియజేయండి. అర్థం అయిందా" నడుము మీద చేతులు వేసుకుని గంభీరంగా అన్నాడు గదాధరుడు.

తల ఊపాడు ఆ సైనికుడు మౌనంగా. పదేపది క్షణికాల్లో వారందరూ ఆ వీధి చివరికిపోయి ఒక మలుపులో మాయం అయిపోయారు.

"ఏది అవసరమో, ఏది అనవసరమో మీకు తెలిసినట్లు లేదు. అనవసరమైన మాటలు చాలా మాట్లాడుతున్నారు. మీకు శ్యాలకభూపతి గురించి పూర్తిగా తెలిసినట్లు లేదు. కట్లపాము వంటివాడు... అదును చూసి ఎదురుచూడని పద్ధతిలో దెబ్బకొడతాడు...." నెమ్మదిగా నడుచుకుంటూ తమ దగ్గరికి వచ్చిన గదాధరుడిని చూస్తూ వంగ్యంగా అన్నది ఆ యువతి.

"అమ్మడికి ఓపిక ఇంకా బాగా వచ్చింది మిత్రమా... మాటలు సూటిగా వేగంగా వస్తున్నాయి." శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

"ఈమె సంగతి తర్వాత చూసుకుందాము. ముందు మనం ఎటుపోవాలో నిర్ణయించు... ఇందాక కనిపించిన మాంత్రికుడు మన గురించి గట్టిగా ఆలోచించక ముందే తప్పించుకోవాలి" అన్నాడు శ్యామలుడు.

"వాడు మన గురించి గట్టిగా ఆలోచించదలుచుకుంటే ఆ పని ఎప్పుడోచేసి వుండేవాడు. నా అభిప్రాయం ఏమిటంటే వాడి శక్తులకు కూడా ఒక హద్దు అంటూ వుండి వుంటుంది. ఆ హద్దును దాటి వాడు ఏమీ చేయలేడు...." అన్నాడు గదాధరుడు.

"మీరు ఆ మాండలీకుడిని గురించి కొంచెంగా కూడా తెలియదు. శ్యాలకుడు కట్లపురుగు అయితే వాడు పొడలపాము. కాటు వేశాడంటే తట్టుకోవడం కష్టం. వాడి ఆధీనంలో పిశాచశక్తులు చాలా వున్నాయి" తనను అడుగకపోయినా తడుముకోకుండా చెప్పిందా యువతి.

"రాజభక్తి గల వారందరినీ ఈ దుష్ట వకుళేంద్రుడు సంహరించటమో, సంహరిస్తాడన్న భయంతో వారందరూ నగరాన్ని వదిలి దూరదేశాలకు పారిపోవటమో జరిగింది. ప్రస్తుతం నేను అనాధ మాదిరిగా మారిపోయాను. కారాగారంలో వున్న నా పితామహుడు తప్ప నా అన్నవారెవరూ నాకు లేరు" అప్రయత్నంగా బుగ్గల మీదికి జారిన కన్నీటిని అరచేత్తో తుడుచుకుంటూ గద్గద స్వరంతో చెప్పింది.

ఏదో మంత్రశక్తి సాధించటం కోసం మాండలీకుడు "ఈ పిల్లను బంధించటం వల్ల ఈమె ప్రాణాలు దక్కాయి. బాగానే వున్నది. మరి సుశాంత చక్రవర్తిని ఇంకా ప్రాణాలతో వుంచటం ఎందుకు? పగవాడు ప్రాణాలతో వున్నంత

వరకూ పౌరుషవంతుడి కంటి మీద కునుకుండకూడదు కదా! వకుళేంద్రుడు పౌరుషవంతుడు కాదా?" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అన్నాడు గదాధరుడు.

"మా తాత పౌరుషవంతుడు కాకపోవటం ఏమిటీ? ఆయన మహాపరాక్రమవంతుడు" ఉన్నట్లుండి ఉద్వేగంగా అన్నది ఆ యువతి.

"తల్లీ... నేను మీ తాతగారిని గురించికాదు. వకుళేంద్రుడి పౌరుషం గురించి అడిగాను" ఓపికగా చెప్పాడు గదాధరుడు.

"వకుళేంద్రుడు కూడా పౌరుషవంతుడే. భల్ల యుద్ధంలో మహానేర్పరి" అన్నది ఆమె.

"అది సరేనమ్మా... మీ తాతగారిని ఇంకా బంధించి వుంచటం దేనికి? కారాగారం నుంచి ఆయన తప్పించుకోగలిగితే మహాప్రమాదం కదా" మరింత ఓపికగా అన్నాడు గదాధరుడు.

"ఆ మాట నిజమే అయినా అందుకు ఒక కారణం వున్నది" అన్నది ఆ యువతి. "త్వరగా చెప్పు తల్లీ అనవసరమైన మాటలతో కాలక్షేపం బహుప్రమాదకరం" అన్నాడు గదాధరుడు.

"మాండలీకుడు సాధించదలుచుకున్న శంబరశక్తికి మా పూర్వీకులు గతంలో ఎప్పుడో ఒకపెద్ద ఆలయాన్ని నిర్మింపచేశారు. ఆ ఆలయం ఇప్పుడు మరుగున పడిపోయింది. అది ఎక్కడ వున్నదో మా తాతగారికి మాత్రమే తెలుసు" దాని జాడ తెలుసుకోవటం కోసమే ఆయన్ను ఇంకా ప్రాణాలతో వుంచటం జరుగుతోంది" అన్నది ఆ యువతి.

"శంబరశక్తి ఆలయం ఎక్కడ వున్నదో తెలిస్తే ఆ మాంత్రికుడి కోరిక నెరవేరుతుందా?" అడిగాడు శ్యామలుడు.

"సగం తీరుతుంది.... నన్ను తీసుకుపోయి ఆ దేవర విగ్రహం ముందు బలిచేస్తే మిగిలిన సగం పూర్తి అవుతుంది" చెప్పింది ఆమె.

దీర్ఘంగా నిట్టూరుస్తూ తల ఊపాడు గదాధరుడు.

"మాండలీకుడుకి ఈమెను పట్టుకోవటం ఎంత ముఖ్యమో, చెరసాలలో వున్న సుశాంతుడిని క్షేమంగా చూసుకోవటం కూడా అంతేముఖ్యం. ఈ ఇద్దరూ అతనికి అత్యంత అవసరం" అన్నాడు.

తాము కాకమ్మ కథలు చెప్పి నగరం ద్వారాల దగ్గరికి తరిమిన రాజభటులు వెనక్కి రావడం లేదని రూఢి పరుచుకుంటూ, అంతకుముందు ఏ

చీకటి వీధుల్లో నుంచి వచ్చారో తిరిగి అటువైపే తన ఆశ్వాన్ని పరుగు తీయించాడు శ్యామలుడు.

"ఎక్కడికి మిత్రమా? ఎక్కడికి?" అని అడుగుతూనే అనుసరించాడు గదాధరుడు. పావుఘడియ తరువాత ఒక ప్రదేశంలో తన వాహనాన్ని నిలుపుచేసి చుట్టూ చూశాడు శ్యామలుడు.

కనులు నులుముకుని మరీ చూశాడు గదాధరుడు... తాము విశ్రాంతి తీసుకున్న పూరిల్లు కనిపించక పోయేసరికి విపరీతమైన ఆశ్చర్యానికి గురి అయినాడు.

"ఆ మాయలమారి మాండలీకుడు ఒక్కడే పెద్ద మంత్రగాడు అనుకున్నాను గాని, ఈ ముసలమ్మవ్వ ఎవరోగాని అతన్ని మించిన శక్తియుక్తులు కల మాంత్రికురాలి మాదిరిగా కనిపిస్తోంది. మనకళ్ళనే ఏమార్చగలిగివుంటే నిజంగా చాలా గొప్ప మనిషే." మెచ్చుకోలుగా అన్నాడు.

అతను ఆ మాటలు అంటూ వుండగానే అతనికి ఎదురుగా నాలుగు అంగల దూరంలో వున్న ఒక పాతకాలపు భవంతి కాస్తా. చిన్నపాటి పూరిపాక మాదిరిగా మారిపోయింది.

"వద్దు వద్దన్న కొద్దీ వీధుల్లోకి పరిగెత్తి ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. ఇంతకుముందే కొంతమంది సైనికులు ఈ వీధిలోని నివాసాలన్నిటినీ కూలంకషంగా గాలించి అవతలికి వెళ్ళిపోయారు. నా నివాసం నీకు కనిపించక పోవటానికి కారణం అదే" అంటూ నవ్వింది ఆ పాక ముందు నిలబడి వున్న ముసలమ్మవ్వ.

గుండెల మీదినుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూర్చి గదాధరుడికి సైగ చేశాడు శ్యామలుడు.

తన అశ్వం మీద కూర్చోబెట్టుకున్న యువతిని క్రిందికి దించాడు అతను. చేయి పట్టుకుని వృద్ధురాలి దగ్గరికి తీసుకుపోయాడు.

"ఏవరు నాయనా ఈ అతివ? ఎక్కడ తారసపడింది మీకు? ఎందుకు వెంటబెట్టుకు వచ్చారు?" ఆశ్చర్యంగా అడుగుతూ ఒక అడుగు ముందుకు వేసి ఆ యువతి వంక పరకాయించి చూసింది ఆమె.

చూసిన వెంటనే రకరకాల భావాలు ప్రత్యక్షం అయ్యాయి ఆమె వదనంలో "శ్వేత... యువరాణి మహేశ్వేత... తల్లీ... మాండలీకుడి చేతిలో నువ్వు ప్రాణాలు

పోగొట్టుకున్నావని భావిస్తున్నాము మేము. నువ్వు క్షేమంగా వుండటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.” అన్నది.

“అవ్వా... మేము తిరిగి వచ్చేటంత వరకూ యువరాణి వారిని నువ్వేకాపాడాలి... నీదే బాధ్యత....” అంటూ రెండు అంగల్లో ఆ పాకలో నుంచి వెలుపలికి పోయి తన అశ్వం మీదికి లంఘించాడు గదాధరుడు.

చిన్నగా శబ్దాలు చేస్తూ ఆ వీధి చివరి భాగంలోకి వెళ్ళిపోతున్న ఆ రెండు అశ్వాల వంకా పరిశీలనగా చూసి వెనక్కి మరలింది గుమ్మంలో నిలువబడిన వృద్ధురాలు.

“వారిద్దరూ ఎవరు? మాండలీకుడి వంటి మంత్రశక్తులు కలిగిన వాడిని ఎలా ఎదిరించగలరు?” పక్కనే వున్న యువతి ఆమెను అడిగింది.

“నిజమే తల్లీ... కొద్దిగానే అర్థం అయింది. వారిద్దరి గురించి, పూర్తిగా తెలుసుకోవటం కుదరలేదు. నీతో పాటు నేను కూడా తెలుసుకుంటాను. అంటూ యువరాణి చేయి పట్టుకుని పాక లోపలి భాగంలోకి తీసుకుపోయింది వృద్ధురాలు.

బయటినుంచి చూసినప్పుడు చిన్నపాటి గుడిశెమాదిరిగా అనిపించిన ఆ కట్టడం లోపలికి అడుగుపెట్టిన తర్వాత రాజభవనం మాదిరి విశాలంగా కనిపించడం, యువరాణి ఆశ్చర్యాన్ని రెట్టింపుచేశాయి.

మూడు మందిరాలలో నుంచి తీసుకుపోయి ఒక అందమైన పూజా మందిరంలో పెద్ద సిరిచాప మీద ఆమెను కూర్చోబెట్టింది వృద్ధురాలు. బంగారు పళ్ళెం మాదిరి తళతళ మెరిసిపోతున్న ఒక రాగిపళ్ళెం నిండా నీటిని పోసి పసుపు కుంకుమలతో అలంకరించింది.

“సాధారణమైన వీరకుమారుల మాదిరి సంచరిస్తున్న ఆ యువకుల గురించి మాకు తెలియని అంశాలను తెలుసుకోవాలని అనుకుంటున్నాము... దయచేసి తెలియ చెయ్యి....” అంటూ ఆ పళ్ళెరానికి నమస్కారం చేసింది.

తెల్లవారే సమయంలో వీధుల వెంట ప్రత్యక్షం అయ్యే మంచు తెరల మాదిరి పళ్ళెంలోని నీటి మీద ప్రత్యక్షమైంది దట్టమైన పొగ.

ఆ పొగ మధ్యభాగంలో ప్రత్యక్షం అయింది ఒక పెద్ద రాజవీధి. బరిశెలు, కత్తులు పట్టుకున్న భటులు కొందరు ఊపిరి బిగపట్టి పరుగులు తీస్తున్నారు. అశ్వాల మీద వారిని అనుసరిస్తున్నారు మరికొందరు.

"పట్టుకోండి... దొంగలు... దొంగలు... వ్యాపారస్థులందరిలోకి ప్రముఖుడైన సింహబలశ్రేష్టిని నిలువుదోపిడీ చేసి ఎటో పారిపోతున్నారు పట్టుకోండి."

విశాలమైన కాటుక కనుల్ని మరింత విశాలం చేసి చూస్తున్న యువరాణి వదనంలో వెంటనే పొడచూపింది విపరీతమైన ఆశ్చర్యం.

"సింహబల శ్రేష్టికి మన నగరంలో కూడా బంధువులు వున్నారు. అతను నివశించేది శిబిర నగరంలో... మన నగరంలో కాదు..." అస్పష్టంగా అన్నది వృద్ధురాలితో.

"ఇప్పుడు మనకి కనిపించే దృశ్యం ఆ శిబిర నగరంలోనిదే. అధికంగా మాట్లాడితే కనిపించే దృశ్యాలు మటుమాయం అయిపోతాయి. మౌనంగా చూడాలి." అంటూ పెదవుల మీద వేలుంచుకుని హెచ్చరించింది.

మరో అనుమానాన్ని వెల్లడించబోయి, చటుక్కున మౌనం వహించింది యువరాణి. తన దృష్టిని అంతా పళ్ళెరం మీదనే కేంద్రీకరించింది.

*          *          *          *          *

"బహుమతి... పదివేల వరహాలు బహుమతి... కోరుకున్న ప్రదేశంలో కోరుకున్న పరిమాణంలో అద్భుతమైన అధునాతనమైన భవనం నిర్మించి ఇవ్వటం జరుగుతుంది. రాచకొలువులో అర్హతకు తగిన ఉద్యోగం ఇప్పించబడుతుంది" యుద్ధబేరీ వంటి సాధనం మీద దడదడమని శబ్దం వచ్చేటట్లు బలంగా బాదుతూ బిగ్గరిగా అరిచాడు శిబిర నగరం నడిబొడ్డును వున్న ఒక వీధిలో రాజభటుడు ఒకతను.

రకరకాల పనుల మీద హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్న పౌరులు అందరూ ఒక్కసారిగా ఆగి అతనికేసి చూశారు.

"శిబిర నగర పౌరులారా... హెచ్చరిక... రాజ్యాలకు రాజ్యాలను దొగతనాలతో గడడలాడిస్తున్న దోపిడీ దొంగ శ్యామలుడు అతడి జతగాడయిన గదాధరుడితో కలిసి మన నగరంలోకి అడుగుపెట్టిన సమాచారం నగర పాలకుల వారికి అందింది. అతన్ని పట్టించి ఇచ్చినవారిని ఘనంగా సత్కరించటం జరుగుతుంది. హెచ్చరికగా వుండండి. అనుమానంగా అగుపించిన వారు ఎవరయినా సరే వెంటనే రాజభటుల దృష్టికి రావల్సిందే...." తడుముకోకుండా ఏకబిగినచెప్పి, మరో వీధిలోకి పయనమైపోయాడు ఆ భటుడు.

"కొత్తగా ఏమీరాలేదు ఆ శ్యామలుడు. వచ్చి ఒక పగలు ఒక రాత్రి గడిచిపోయాయి. రాత్రి సింహబల శ్రేష్టిని నిలువుదోపిడి చేయడం పూర్తి అయింది. తిరిగి ఈరోజు ఎవరికి చేటు మూడుతుందో తెలియదు. ఆర్చుకుని తీర్చుకుని ఇప్పుడు హెచ్చరికలు చేయటం చాలా విడ్డూరంగా వుంది" తమలో తాము గుసగుసలుగా మొదలు పెట్టారు పౌరులు కూడా.

పసందయిన తీపి పదార్థాలను విక్రయించే దుకాణం దగ్గిర నిలబడి కండ చక్కెరతో తయారు చేయబడిన మోదకాలను తీసుకున్నాడు గదాధరుడు.

సమాధానం ఇవ్వలేదు గదాధరుడు. తల వంచుకుని సూటిగా నడిచాడు. వంద ధనువుల దూరంలో వున్న ఒక చిన్న ఆలయం దగ్గరికి పోయి నిలుచున్నాడు.

ఆలయంలో కొలువున్న దేవతను పూజించటం కోసం ఒకరి తరువాత ఒకరుగా వస్తూ వుంటారు భక్తులు. ఆలయం ఎదుటకూర్చుని వారి జాలిగుణాన్ని, దయార్ధ్ర హృదయాల్ని స్తుతిస్తు పొట్ట పోసుకుంటూ వుంటారు కొంతమంది యాచకులు.

వరుసల్లో కూర్చుని ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఎదురు చూస్తున్న యాచకులకు కొంచెం ఇవతలగా మట్టిలో ఆడుకుంటున్నారు వారి సంతానం.

చాలీచాలని దుస్తులు, దుమ్ముధూళినిండిన శరీరాలు, నూనె ముఖం ఎరుగనట్లు చింపిరిగా తయారయిన కేశాలు – అటుగా వస్తున్న పౌరులందరూ వారిని చూసి దూరంగా జరుగుతున్నారు.

తమను చూడగానే చీదరించుకుని దూరంగా పొమ్మని గదమాయించే వారినే చూసి వున్నారు ఆ బుడతళ్ళు. దగ్గరికి రమ్మని పిలిచేవారిని అంత వరకూ చూసి వుండలేదు.

"వద్దురా... వెళ్ళవద్దు. రమ్మని పిలిచి చింతబరికెలతో వళ్ళు వాచి పోయేటట్లు కొడతారు... తను ఈ వీధిలోకి వస్తుండగా తన రధానికి ఎదురుగా కనిపిస్తే ఊరుకోవటం జరగదని మొన్న సేనాపతి మనల్ని బెదిరించాడు. మర్చిపోయావా?" ముందుకు అడుగువేయబోయిన ఒక బాలుడిని చేయి పట్టుకుని ఆపుతూ హెచ్చరించింది పది వత్సరాల వయసుండే బాలిక.

వివర్ణమైపోయింది ఆ మాటల్ని ఆలకించిన గదాధరుడి వదనం. తడవు చేయకుండా తానే ముందుకు నడిచి వారిని సమీపించాడు.

"భయపడకండి. నేను మీకు అపకారం చేయను. మిమ్మల్ని చింత బరికెలతో వళ్ళు వాచిపోయేటట్లు కొట్టను...." అంటూ తన దట్టీలో వున్న తీపి మోదకాలను వారికి చూపించాడు.

"అమ్మయ్యో... అవి తినాలంటే రాగి నాణేలు కావాలి. లేదా ధనవంతుల ఇళ్ళల్లో సేవకులుగానైనా పనిచేస్తూ వుండాలి" గుండెల మీద చేతులు వేసుకుంటూ అన్నది మొదటగా మాట్లాడిన బాలిక.

"అటువంటి పనులేవీ చేయవలసిన అవసరం లేదు. మీ దగ్గర నాణేలు కూడా వుండవలసిన అవసరం లేదు. తీసుకోండి" అంటూ ముందుకు జాచాడు గదాధరుడు.

అప్పటికీ తొందరపడలేదా పిల్లలు ఎవరూ... "ఇవి మాకు ఎందుకు ఇస్తున్నట్టు?" సూటిగా అడిగిందా బాలిక.

"మొక్కుకున్నాను తల్లీ. ఈ ఆలయంలోని దేవతకు నేను ఒక పెద్ద మొక్కు మొక్కుకున్నాను. నేను తలపెట్టిన కార్యం విజయవంతం అయితే నాకు కనిపించిన పిల్లలందరికీ మోదకాలు పంచిపెడతానని అనుకున్నాను" నవ్వుతూ అన్నాడు గదాధరుడు.

"తలపెట్టిన పని పూర్తి అయిందా?" మరో ప్రశ్న వేసింది ఆ బాలిక.

"సగం అయింది తల్లీ... ఇంకోసగం త్వరగా పూర్తి అవుతుంది" అంటూ దగ్గిర్లో వున్న బాలుడికి ఒక మోదకాన్ని అందించాడు గదాధరుడు.

ఆ దృశ్యాన్ని చూసిన తర్వాత దూరంగా నిలబడటం చేతకాలేదు మిగిలిన పిల్లలకి. గబగబా ముందుకు వచ్చారు. గదాధరుడు అందించిన పదార్థాలన్నిటినీ తీసుకుని మహా సంతోషపడిపోయారు.

"నువ్వు మొక్కుకున్న మొక్కేమిటి?" నెమ్మదిగా అడిగాడు గదాధరుడిని శ్యాములుడు.

"ఈ నగరంలో సాటి మనిషిని మనిషిగా చూడకుండా అహంకారంతో ప్రవర్తించే వారి నామధేయాలు తెలుసుకోవటం" అన్నాడు అతను.

"మరి తెలిసిందా?" అడిగాడు శ్యాములుడు.

"ఒకటి తెలిసింది"

"ఎవరు?"

"సేనాపతి... మంచి చెడులకు అర్థం తెలియని లేత వయసు చిన్నారులను చూసి అసహ్యించుకునే వాడు అహంకారి కాక సాధువు ఎలా అవుతాడు?" ఎదురు ప్రశ్నవేశాడు గదాధరుడు.

"సేనాపతిని గురించి తెలుసుకోవటం నీ మొక్కులో సగభాగమేనని నువ్వే చెప్పావు. మరి రెండో సగభాగం సంగతేమిటి?" చిరునవ్వుతో అడిగాడు శ్యామలుడు.

"ఆ పెద్దమనిషి అలవాట్లు ఎటువంటివో తెలియాలి. వాడి దినచర్యను గురించి తెలుసుకోవాలి" అన్నాడు గదాధరుడు.

సరిగ్గా బారెడు దూరంలోనే నిలబడి వున్నది అతనితో సంభాషించిన బాలిక. సేనాపతుల వారికి చీకటి పడగానే రంగమణి నివశించే బంగారు సౌధానికి విజయం చేయటం మహా అలవాటు. రాత్రినంతా అచ్చటనే గడిపి వేకువఝాము వేళలో వెలుపలికి వస్తారు" తనను అడుగక ముందే వివరంగా చెప్పింది.

"రంగమణి అంటే ఎవరు తల్లీ?" అని ఆమెను అడుగబోయిన స్నేహితుడి చేతిని పట్టుకుని బలవంతంగా అవతలికి లాక్కుపోయాడు శ్యామలుడు.

"మోదకాలు మొక్కులు మొక్కుకోవాల్సిన అవసరం లేదు. పేరు ప్రఖ్యాతులున్న వేశ్యాంగన రంగమణి. సేనాపతుల వారి ఇష్ట సఖి...." అతను అడుగక ముందే వివరించాడు.

"పేరు ప్రఖ్యాతులున్న ఆ రంగమణి దర్శనం చేసుకోవాలి మనం" అన్నాడు గదాధరుడు.

"రంగమణినిగురించి మీరు ఆలోచించకండి. ఆమెతో వ్యవహారం చాలా ప్రమాదంతో కూడిన పని" వెనుకనుంచి వినవచ్చాయి ఆ మాటలు. ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ తల తిప్పి చూశాడు గదాధరుడు. వెంటనే అగుపించాడు అతనికి ఒక వృద్ధ యాచకుడు.

"మోదకాలు నిండుకున్నాయి తాతా నా దగ్గర. తెచ్చినవన్నీ బిడ్డలకు పంచి పెట్టేశాను. ఇంకోసారి వెనక్కివెళ్ళి అంగడి ముందు నిలుచునే ఓపికలేదు. నువ్వే వెళ్ళి తెచ్చుకోవాలి." అంటూ దట్టీలో నుంచి ఇంకో వెండి నాణేన్ని తీసి అతని ముందుకు జాచాడు.

"అభం శుభం తెలియని మా పసిబిడ్డల్ని సాదరంగా పలుకరించి, వారి నోళ్ళను తీపిచేసిన మీకు నా హృదయపూర్వక నమస్కారాలు. నేను మీ ఇద్దరి ముందు చేతులు జాచటానికి రాలేదు. మీరు రంగమణిని గురించి వివరంగా మాట్లాడేసరికి ఉండబట్టలేక వచ్చాను" అన్నాడు.

"నీకు ఆ వన్నెలాడిని గురించి తెలుసా తాతా?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

"సకుటుంబంగా ఈ రోజున నేను ఈ ఆలయాల ముందు కూర్చుని వచ్చేపోయే వారి ఛీత్కారాలను వింటూ కృంగి కృశించిపోతూ వుండటానికి ఆ వగలాడి వయ్యారాలే కారణం–" అన్నాడు వృద్ధుడు.

గదాధరుడి వదనంలో వెంటనే ప్రత్యక్షం అయింది విపరీతమైన ఆశ్చర్యం "తాతా... ఆ రంగమణి మిసమిసలాడే యవ్వనంలో వున్నది. నువ్వు కాటికి కాళ్ళు జాపుకుని వున్న ముదివగ్గువి. నిన్ను కూడా ఆమె తన కాటుక కళ్ళతో గింగిరాలు తిప్పి వీధుల పాలు చేసిందా?" సూటిగా అడిగాడు.

గట్టిగా నిట్టూర్చి తల అడ్డం తిప్పాడు ఆ వృద్ధ యాచకుడు. "నన్నుకాదు. నా కుమారుడిని నవ్వులపాలుచేసి నడి వీధిలో నిలబెట్టింది. వద్దువద్దన్న కొద్దీ వినకుండా ఆమె వయ్యారాలకు వశుడైపోయి మూడు కోట్ల ముప్పది ఆరు లక్షల బంగారు నాణేలు విలువ చేసే వ్యాపారాల్ని నిర్లక్ష్యం చేశాడు నా బిడ్డడు. సర్వనాశనమైపోయాడు. అవమానాలపాలై తన ప్రాణాలు తానే తీసుకున్నాడు. అశ్వశకటాల మీద తప్ప కాలినడకన ఎక్కడికీ పోవటం అలవాటులేని నేను, నా భార్య, నా కోడలు, మనవరాలు ఈ రోజున ఇలా ఈ ఆలయం ఎదుట హీనంగా బ్రతకవలసిన కర్మ పట్టింది." అంటూ మాటల్ని ఆపాడు.

దూరంగా నిలబడి వున్న బాలిక అంతకుముందు అక్కడి చిన్నారులందరికీ మంచిమాటలు చెప్పి ప్రయత్నించిన బిడ్డ – నెమ్మదిగా వచ్చి వృద్ధుడి నడుమును కౌగలించుకుని నిలువబడింది.

"నీ కొడుకును నాశనం చేసినట్లే ఆ రంగమణి ఇంకెందరినీ నిలువునా ముంచి మాటలు కట్టిందో చెప్పగలవా?" అని వృద్ధుడిని అడిగాడు.

"ఎంతమందని చెప్పను? కనీసం ఈ నగరంలో సగం మంది వ్యాపారాలు ఆమె వగలకు వశులై నేలమట్టమై పోయారు...." అన్నాడు వృద్ధుడు.

“మరి మీ సేనాపతుల వారి సంగతేమిటి?” ఉన్నట్లుండి అడిగాడు శ్యామలుడు.

“వాడు క్షేమంగానే వున్నాడు. ఎందుకంటే ఆ రంగమణికి వాడు భాగస్వామి. ఇద్దరూ తోడు దొంగలు” చెప్పాడు వృద్ధుడు.

“వయసు మీరిపోయినట్లు కనిపించినా నీ వంట్లో ఓపిక ఇంకా ఉడిగినట్లు అగుపించటం లేదు.... వయసు చిన్నదే అయినా నీ మనవరాలికి ముందుచూపు అధికమే అనిపిస్తోంది. సరయిన అవకాశం ఇంకొకటి లభిస్తే పోగొట్టుకున్న వైభవాన్ని తిరిగి సంపాదించుకోగలవా? వ్యాపారం చేసి తిరిగి ధనాన్ని సంపాదించుకోగలవా??” ఒకొక్క మాటను వత్తి వత్తి పలుకుతూ అడిగాడు గదాధరుడు.

“వ్యాపారం మా కులవృత్తి. తరతరాలుగా మా వంశీయులు చేస్తున్నది వ్యాపారమే. రెండు బస్తాల ధాన్యం కొనటానికి అవసరమైన ధనం వుంటే చాలు. పదినెనిమిది ఘడియల్లో వంద సంచుల్ని అమ్మకానికి పెట్టగలను...” సగర్వంగా అన్నాడు ఆ వృద్ధుడు.

“మూడు కోట్ల ముప్పది ఆరులక్షల బంగారు నాణేలు విలువ చేసే వ్యాపారాన్ని నడిపిన కుటుంబానికి రెండు బస్తాలను కొనే స్తోమత లేకుండా పోయిందా?” ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

“రెండుబస్తాలు కాదు నాయనా – రెండు కుంచాల ధాన్యం కూడా కొనగలిగేస్తోమత లేదు... ఉదయం వేళనుంచి చీకటి సమయం వరకూ ఆర్తిగా అలమటించినా రెండు రాగి నాణేలు కూడా మా కళ్ళపడటం లేదు. రంగమణి ధాటికి నాశనమైన వారిని చూస్తే మహాలోకువ ఈ నగర వాసులకి... వెక్కిరింపులే తప్ప సహాయ సహకారాలు అందవు.....” తల దించుకుంటూ చెప్పాడు వృద్ధుడు.

“సరే తాతా... నీ గోడు మాకు తేట తెల్లం అయింది. రేపు ఇదే సమయానికి ఈ ప్రదేశంలోనే మనం మరోసారి కలిసి మాట్లాడుకుందాము” అంటూ దట్టీలో నుంచి గుప్పెడు వెండి నాణేల్ని బయటికి తీశాడు గదాధరుడు. వాటిని వృద్ధుడి చేతిలో పోసి ముందుకు నడిచాడు.

నీరు నిండిన కనులతో అతనివంకే చూస్తూ నిలబడిపోయాడు వృద్ధుడు.

*  *  *  *  *

రాజభవనం మాదిరి విపరీతమైన ఆర్భాటంతో నిండి వున్నది రంగమణి నివశించే మహాసౌధం.

ఎర్రటి వెలుగుల్ని విరచిమ్ముతున్నాయి. ఆవరణ నిండా వెలిగింపబడిన కాగడాలు. పొడవాటి బరిశెల్ని పట్టుకుని సౌధం చుట్టూ కాపలా కాస్తున్నారు అనేకమంది భటులు.

"ఒక వెలయాలి ఇంటికి ఇంతటి వైభవమా?" గుండెల మీద చేయి వేసుకుంటూ ఆశ్చర్యపడ్డాడు గదాధరుడు.

"ఇదేదో చాలా వింత వ్యవహారం మాదిరిగానే వున్నది. మనం తప్పకుండా తరిచి చూడవలసిందే. తప్పించుకోవటానికి వీలులేదు" ఖచ్చితమైన కంఠంతో శ్యామలుడికి చెప్పాడు.

"అందరికీ వినిపించేటట్లు రెండు మూడు కేకలు వేస్తే సరిపోతుంది. రంగమణి తనే ద్వారం వెలుపలికి వస్తుంది" నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

"రంగమణి అందాల్నిచూసి పరవశించటానికి దగ్గిర దారులు చాలా వున్నాయి" అన్నాడు గదాధరుడు.

"ఓక్కదారి చెప్పు." అన్నాడు శ్యామలుడు.

"నీకు రంగమణి మీద అభిలాష కలిగింది. నువ్వు ఎవరివి?" అన్నాడు గదాధరుడు.

"నేనా? నేను ఎవరిని?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

"జ్వాలా నగరంలో సముద్ర వ్యాపారి శ్రీయుతుడికి లేకలేక కలిగిన కుమారుడివి. మున్నూరు కోట్ల బంగారు నాణేలు విలువచేసే వ్యాపారం చేస్తున్న వాడివి."

"పొరపాటుపడుతున్నావు మిత్రమా... జ్వాలా నగర వ్యాపారి శ్రీయుతుడు ధర్మానికి ప్రతిరూపం... మచ్చలేని మనిషి మహాదాత.... అతనిపేరు చెడగొట్టకు" కోపంగా అన్నాడు శ్యామలుడు.

"అయ్యో పిచ్చి మిత్రమా... మచ్చవున్న మనిషి రంగమణి మీద మనసుపడితే అది విడ్డూరం అనిపించుకోదు... శ్యామలుడి సంతానం దారి తప్పిందని తెలిస్తేనే అది విశేషం అవుతుంది. రంగమణి వెంటనే ఆకర్షించబడు తుంది" అన్నాడు గదాధరుడు.

*     *     *     *     *

చీకటిపడిన తర్వాత మొట్టమొదటిసారిగా రంగు రంగుమంటూ మ్రోతలు చేసింది రంగమణి సౌధం ఎదుట అమర్చివున్న ఒక పెద్ద గంట.

తాంబూలం సేవనంతో ఎర్రబడిన పెదవుల్ని అందమైన అద్దంలో చూసుకుంటున్న రంగమణి ఉలిక్కిపడింది ఒక్కసారిగా.

"పిలుపుల గంట మ్రోగుతోంది... ఎవరో ఆవరణ ద్వారం దగ్గర నిలబడి అదేపనిగా మ్రోగిస్తున్నారు...." పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పింది ఒక సేవకురాలు.

భుజాల మీది నించి క్రిందికి జారిపోబోతున్న పట్టు పయ్యెదను మునివేళ్లతో సరిచేసుకుంటూ అసనం మీద నుంచి లేచి ఆ మందిరంలోని ఒక గవాక్షం దగ్గరికి పోయింది రంగమణి.

చూసిన వెంటనే శరీరం పులకరించినట్లు మారినట్లు అయింది ఆమెకు. ఠీవిగా నిలుచుని వున్నాడు ఒక యువకమూర్తి. క్రిందికి వేలాడుతున్న ఒక తాడును పట్టుకుని అదే పనిగా గంటను మ్రోగిస్తున్నాడు అతనితో పాటుగా వచ్చిన ఇంకో యువకుడు.

"వెంటనే వెళ్ళి వారికి గంటను మ్రోగించవలసిన అవసరం ఏమొచ్చిందో తెలుసుకో" ఆజ్ఞ ఇచ్చింది రంగమణి.

*           *           *           *           *

"అదిగో వస్తోంది పిలుపు...." నవ్వుతూ చెప్పాడు గదాధరుడు.

గునగునా అడుగులు వేస్తూ వచ్చింది రంగమణి సేవకురాలు. కనుబొమలు ఎగురవేసి నడుము మీద చేతులు వేసుకుని నిలబడింది.

"మీ యజమానురాలి అందం గురించి ఆలకించి అదే పనిగా కలవరింపులు మొదలుపెట్టాడు నా జతగాడు...." చెప్పాడు అతను.

"తమరి పరిచయం తెలుసుకోవచ్చునా?" అడిగింది ఆమె.

"ముప్పది నౌకలు మణిద్వీపానికి, మరో ముప్పది భృగు నగరానికి ఎల్లప్పుడూ ప్రయాణం చేస్తూవుంటాయి... జ్వాలా నగర పాలకుడు ప్రతి దినము స్వయంగా వచ్చి దర్శనం చేసుకుని వెళుతూ వుంటాడు... పేరు చెపితే చాలు... దేశంలోని ఎటువంటి వ్యాపారమైనా క్షణకాలం ఆగి ఊపిరి బిగపట్టేస్తుంది..." అన్నాడు అతను.

"శ్రీయుతుల వారు? జ్వాల నగర వర్తక సామ్రాట్టులేనా?" ఆశ్చర్యం నిండిన కంఠంతో అడిగింది ఆమె.

"కళ్ళల్లో కలికం పెట్టుకున్నట్టు మాట్లాడకు. వయోవృద్ధుడి మాదిరి కనిపిస్తున్నాడా నా జతగాడు?" చిరుకోపంతో అడిగాడు గదాధరుడు.

"అయ్యయ్యో.... ఎంతమాట! మీరు చెప్పింది వారిని గురించే కదా!" గబగబా అన్నది ఆమె.

"కాదు... వారి వారసులవారైన శ్రీకంఠుల వారి గురించి. అందగాళ్ళలో అందగాడని పేరుపొందిన నా జతగాడు ఎట్ట ఎదురుగా కనిపిస్తుంటే గుర్తుపట్టలేని నీ వంటి సేవకురాళ్ళను ఎందుకు పోషిస్తున్నదో ఈ సుందరాంగి?" విసుగునిండిన కంఠంతో అన్నాడు గదాధరుడు.

"శ్రీయుతుడికి ఒకే ఒక కొడుకు వున్నాడని తెలుసు. అతనిపేరు శ్రీకంఠుడని కూడా తెలుసు. కాని అతను అందగాడు మాత్రం కాదు. కొంచెంగా గూని వున్నట్లు...." జతగాడి చెవిలో ఊదబోయాడు శ్యామలుడు.

"నీకు ఏమీ తెలియదు... ధనం చాలని అనుకునే వాళ్ళకి అతను అందగాడే.... కావాలంటే ఇప్పుడు ఏం జరుగుతుందో చూడు...." అన్నాడు గదాధరుడు - అతన్ని మాట్లాడవద్దని సైగ చేస్తూ.

"ఒక్కక్షణం... ఒకే ఒక్క క్షణంలో వచ్చేస్తాను" అంటూ వేగంగా వెనక్కి పరిగెత్తింది సేవకురాలు.

*　　*　　*　　*　　*

"అవును... శ్రీయుతుల వారి కుమారుడు శ్రీకంఠుల వారే. కాని అతను అందగాడు కాదు... గూని వున్నదిట... మొఖం కూడా వికారంగానే వుంటుందిట...." సేవకురాలు వచ్చి చెప్పిన మాటల్ని వినగానే సాలోచనగా అన్నది రంగమణి.

"మరి వాళ్ళు ఎవరై వుంటారో?" అన్నది సేవకురాలు.

"నువ్వు వారిని లోపలికి ఆహ్వానించి, అతిథి మందిరంలో కూర్చోబెట్టు, నేను అలంకరణ పూర్తి చేసుకుని వస్తానని చెప్పు" అంటూ సేవకురాలిని అవతలికి పంపి, మరో చెలికత్తెను పిలిచింది రంగమణి.

"సేనాపతుల వారిని వెంటనే చూడాలి. వెంట బెట్టుకుని ఇక్కడే వున్నట్టు త్వరితంగా వచ్చేయాలి" అని చెప్పింది.

చీరె కుచ్చుళ్ళు పాదాలకు అడ్డు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పరుగు మొదలుపెట్టిందా చెలికత్తె. ఆ భవంతి ప్రక్కభాగంలో వున్న మరో ద్వారంలోనుంచి వీధిలోకి వెళ్ళిపోయింది.

పావుఘడియ కూడా గడవకముందే ప్రక్క ద్వారంలోనుంచి లోనికి వచ్చాడు సేనాపతి ఆ మందిరంలోనే వున్న ఒక రహస్య ద్వారంలో నుంచి అతిధి మందిరంలోకి తొంగి చూశాడు.

బంగారు ఆసనాల మీద చేరగిలబడి కూర్చుని వున్న యువక మూర్తులను గమనించగానే ముడిపడ్డాయి అతని నొసలు.

"శ్రీయుతుడి కుమారుడు వట్టి కూరూపి. గత సంవత్సరం నేను జ్వాలా నగరం వెళ్ళినప్పుడు దూరం నుంచి చూశాను.... కాని–" అంటూ మాటల్ని ఆపాడు.

"ఏమిటి మీ అనుమానం?" ఆశ్చర్యంగా అడిగింది రంగమణి.

"తలుచుకుంటే దేవతల్ని సైతం తన ఎదుటికి రప్పించుకోల ధనవంతుడు శ్రీయుతుడు. తన కుమారుడి అంగవైకల్యాన్ని పోగొట్టేందుకు తప్పకుండా ప్రయత్నాలు చేస్తాడు. హిమాలయాల్లో నుంచి ఏవైనా ఔషధాలను తెప్పించి వుండవచ్చు. మంత్ర తంత్రాల్లో మహిమ చూపించగల వారి ప్రాపకం సంపాదించి వుండవచ్చు...." సాలోచనగా అన్నాడు సేనాపతి.

"ఎలా చెప్పగలరు మీరు?" ఎదురు ప్రశ్నవేసింది రంగమణి.

"వయసులు ఒకటే... శ్రీకంఠుడు కుమారుడే అయివుంటే ఇంతకాలంగా నేను మీరు ఎదురు చూస్తున్న శుభ తరుణం మన దగ్గరికి వచ్చేసినట్లే...." అన్నది రంగమణి.

"ఎలా?" తనకు తెలిసినా తెలియనట్లు అడిగాడు సేనాపతి.

"నా వలలోకి వచ్చిన తర్వాత ఇక తప్పించుకుని అవతలికి పోవటం అసాధ్యం. శ్రీయుతుడి నౌకలు, వ్యాపారం, భవంతులు, తోటలు అన్నీ నావే... ఈ నగరాన్నే కాదు జ్వాలా నగరాన్ని కూడా స్వాధీనం చేసుకుని మహారాణిని అవుతాను...." సగర్వంగా చెప్పింది ఆమె.

"మరి నేను?" వినోదంగా చూస్తూ అడిగాడు సేనాపతి.

"నేను మహారాణిని అయితే మీరు మహారాజే కదా" చిలిపిగా అన్నది ఆమె.

తమకాన్ని ఆపుకోవటం అసాధ్యమైపోయింది సేనాపతికి. చటుక్కున చేతులు జాచి ఆమెను తన బిగి కౌగిలిలో బంధించబోయాడు.

ఛెంగున వెనక్కి దూకి తప్పించుకున్నది రంగమణి. "అతిథి మందిరంలో వున్న వారు మనకి ముఖ్యం... ముందు వారిని గౌరవించాలి" అంటూ అవతలికి వెళ్ళిపోయింది.

కాంతి విహీనం అయిపోయింది సేనాపతి వదనం... ఆ మందిరంలోనే ఒక ఆసనం మీద చేరగిలబడి కనులు మూసుకున్నాడు.

* * * * *

"మిత్రమా.... వస్తోంది సుడిగాలి... వళ్ళు దగ్గిర పెట్టుకోకపోతే మన గుట్టురట్టు అయిపోతుంది జాగ్రత్త" చిన్న కంఠంతో హెచ్చరించి, తన ఆసనంలో నుంచి లేచి నిలుచున్నాడు గదాధరుడు.

శ్యామలుడు కనీసం కదలను కూడా కదలలేదు. మరింతగా చేరగిల బడి పాదాలను విలాసంగా ముందుకు జాచాడు.

"శ్రీకంఠుల వారికి ప్రణయాంజలి...." వయ్యారంగా నిలుచుని నమస్కారం చేసింది రంగమణి.

"నృత్యశాస్త్రంలో నువ్వు దిట్టవట కదా.... దేవతలు కూడా అసూయపడే విధంగా నృత్యం చేస్తావట కదా... చూసిపోదామని వచ్చాను" అంటూ గదాధరుడి కేసి చూసి తల ఊపాడు శ్యామలుడు.

దట్టీకి వ్రేలాడుతున్న ఒక పట్టు వస్త్రపు మూటను తీసి రంగమణి మీదికి విసిరాడు గదాధరుడు.

గాలిలో వుండగానే పట్టుకుని ముడి విప్పిందామె. తళతళ మెరుస్తూ కనిపించిన బంగారు నాణేలను చూడగానే మైమరిచిపోయింది.

"పావుఘడియలో ఏర్పాట్లు పూర్తి అయిపోతాయి. కొద్దిసేపు ఓపిక పట్టండి" అంటూ తిరిగి తన మందిరంలోకి పరుగు తీసింది.

"మూటలోని నాణేలను లెక్కపెట్టుకుంటోందా?" చిన్నగా అడిగాడు శ్యామలుడు తన జతగాడిని.

"కాదనే అనుకుంటున్నాను. బహుశా సేనాపతిని పిలిపించి వుంటుంది. అతన్ని సంప్రదించటానికి వెళ్ళి వుంటుంది" తను కూడా రహస్యంగానే అన్నాడు గదాధరుడు.

ఆ మందిరంలోనే వున్న ఇంకో ద్వారంలో నుంచి వారి ఎదుటికి వచ్చింది రంగమణి చెలికత్తె ఒకత్తె. బంగారు పళ్ళెరంలో తను తెచ్చిన మధురప్రాయపు పాత్రలను వారి ఎదుట పెట్టింది.

"నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు వేగంగా జరిగిపోతున్నాయి. పానీయాన్ని సేవించి సేదతీరండి...." మృదుస్వరంతో చెప్పి వెనక్కిపోతూ పోతూ గదాధరుడికి సైగ చేసింది చిన్నగా.

"నా యజమానురాలి మందిరంలో ఒక రహస్య ద్వారం వున్నది. తను ఆ ద్వారంలో నుంచి మిమ్మల్ని గమనిస్తూ వుంటుంది. కాబట్టి మీరు ఈ మందిరపు అందాల్ని మెచ్చుకుంటున్నట్టు నిలబడండి...." చిన్న కంఠంతో చెప్పింది ఆమె.

"విషయం చెప్పు సుందరీ... మీ యజమానురాలి కంటే నువ్వే అందంగా వున్నావు." అన్నాడు గదాధరుడు.

"మీరు నన్ను ఎక్కువగా పొగడవలసిన అవసరం లేదు. నాట్య ప్రదర్శన మొదలు కాగానే మీకు మధుపాత్రలు అందించబడతాయి. నాట్యాన్ని చూసిన మైమరుపులో మీరు మధుపానం చేస్తే తిరిగి కోలుకోలేరు. ఆ జన్మాంతం రంగమణి పాద సేవకులైపోతారు." అన్నది ఆమె.

"మధుపానం అంత ప్రమాదాన్ని కలిగిస్తుందా?" అడిగాడు అతను.

"ప్రమాదం మధువులో లేదు... అందులో రంగరించిన ఒక మంత్రాల మూలిక మూలకంగా వస్తుంది."

ఝల్లుమన్నది గదాధరుడి శరీరం... "ఎందుకు అలా? మంత్ర తంత్రాలను ఆశ్రయించటం దేనికి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేమిటో నాకు తెలియదు. మంత్రాల మూలికను మాత్రం కలపటం నిజం... నగరం వెలుపల కొండగట్టు మీది దిగంబరస్వామి ఇస్తాడు. ఆ మూలికని...." చెప్పింది ఆమె.

"ఇప్పుడు సిద్ధమైందా ఆ మంత్రాల మధువు దాన్ని సిద్ధం చేయటానికేనా కొద్దిపాటి వ్యవధి అవసరం అని చెప్పింది?" అడిగాడు గదాధరుడు.

"ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలి ఆ మూలికని. ఇప్పుడే రంగమణి నగరం వెలుపలికి బయలుదేరింది. మరి కొద్ది సేపట్లో తిరిగి వస్తుంది. వచ్చిన వెంటనే మధురసం సిద్ధం చేసి తను నాట్యం మొదలు పెడుతుంది. మీరు మాత్రం జాగ్రత్త" అంటూ ద్వారం దగ్గిర్నించి అవతలికి వెళ్ళిపోయింది ఆమె.

సాలోచనగా చూస్తూ శ్యామలుడి దగ్గరికి వచ్చి తను విన్న మాటల్ని అతనికి వివరంగా చెప్పాడు గదాధరుడు.

ఎంతోసేపు ఆలోచించలేదు శ్యామలుడు. "మనం ఇప్పటికిప్పుడు అవతలికిపోతే ఇంక ఎప్పటికీ ఈ దుర్మార్గుడికి బుద్ధి చెప్పటం కుదరదు... నాట్యప్రదర్శన చూద్దాము... మధుపానం చేసినా కూడా మన మనస్సులు తప్పుదారిన పడకూడదు" అన్నాడు.

"అది ఎలా కుదురుతుందని మిత్రమా? మధువు సేవించిన తర్వాత మన ప్రవర్తనలో మార్పురాకపోతే తనకి అనుమానం వస్తుంది కదా...." అడిగాడు గదాధరుడు.

"అనుమానం వస్తే తను ఏం చేస్తుంది?"

"ఆ దిగంబర సాములోరి దగ్గరికిపోయి చెపుతుంది....."

"మనకి కావాల్సింది అదే కదా... ఆ స్వామిని పట్టుకుని రెండు దులుపులు దులిపితే ఇక్కడ జరుగుతున్నది ఏమిటో తెలుస్తుంది కదా....." అన్నాడు శ్యామలుడు.

చిరునవ్వు ప్రత్యక్షం అయింది గదాధరుడి పెదవులమీద.

"నీ సుందరరూపాన్ని చూసి మై మరిచిపోయి మాట్లాడిన ఆ యువతి వ్యవహారం కూడా నాకు అనుమానాన్ని కలిగిస్తోంది" అన్నాడు శ్యామలుడు.

"అదేమిటి మిత్రమా? నేను అందగాడిని కాదూ? నా అందం అతివల్ని ఆకర్షించలేదా?" ఉక్రోషంగా అడిగాడు గదాధరుడు.

"ఆలోచించుకో... ముక్కూమొహం తెలియని వాళ్ళని దగ్గరికి పిలిచి లేనిపోని రహస్యాలన్నిటినీ చెప్పటం ఎక్కడయినా విన్నావా?" అడిగాడు శ్యామలుడు.

తల అడ్డం తిప్పాడు గదాధరుడు.

"రంగమణి వ్యవహారమంతా చిత్ర విచిత్రాలతో నిండి వున్నట్లు కనిపిస్తోంది. మనం మెలకువగా ప్రవర్తించకపోతే చేటు వాటిల్లటం తప్పనిసరి అనిపిస్తోంది" ఆఖరిగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు శ్యామలుడు.

*　　*　　*　　*　　*

ఎత్తయిన నలుచదరపు బండరాయి మీద కూర్చుని వున్నాడు దిగంబర స్వామి. పేరుకు తగినట్లే చిన్నపాటి నూలుపోగు కూడా కనిపించటంలేదు అతని

శరీరం మీద. జడలు కట్టి చిందరవందరగా భుజాల మీదికి పరుచుకుని వున్నాయి కేశాలు. నాభి ప్రదేశం వరకూ విస్తరించి వున్నది గడ్డం. చింత నిప్పుల మాదిరి ఎర్రగా అగుపిస్తున్నాయి కళ్ళు.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆ బండ దగ్గరికిపోయి సవినయంగా నమస్కారం చేసింది రంగమణి.

"గురుదేవులకు వందనాలు...." అంటూ మాటలు మొదలుపెట్ట బోతుండగా, చేయి ఎత్తి నిలుపు చేశాడు స్వామి.

"చీకట్లు దట్టమయ్యాయి.... ఇటువంటి సమయంలో నా దగ్గరికి రావద్దని నీకు చాలాసార్లు చెప్పిన గుర్తు" కనుబొమలు ముడివేసి చూస్తూ క్రూరంగా అన్నాడు.

"అవసరం తరుముకుంటూ వచ్చింది. కొంత కాలంగా నాకు పనిలేకుండా పోయింది. నా గురించి జరుగుతున్న ప్రచారం కారణంగా ఎవరూ నా ఇంటి గుమ్మం వంక చూడను కూడా చూడటం లేదు... ఇప్పుడు అనుకోని విధంగా జ్వాలా నగరం నుంచి శ్రీయుతుడి కుమారుడు..." అంటూ చెప్పటం మొదలు పెట్టిన రంగమణి వైపు ఆశ్చర్యంగా చూశాడు స్వామి.

"శ్రీయుతుడి కుమారుడా? శ్రీకంఠుడేనా?" ఆమె చెప్పకముందే తను అడిగాడు.

"అవును స్వామి... ఆ శ్రీకంఠుడే. కంతావసంత జయంతాదుల్ని మించిన సౌందర్యవంతుడు... తనకు తానుగా నా ఇంటిని వెతుక్కుంటూ వచ్చాడు." చెప్పింది రంగమణి.

"నమ్మను బాలికా... నేను ఈ మాటను పొరపాటున కూడా నమ్మను. శ్రీకంఠుడు అందగాడు కాదు. వట్టి అనాకారి...." తల అడ్డం తిప్పుతూ అన్నాడు స్వామి.

"మీ దగ్గరికి వచ్చిన కారణాల్లో అది కూడా ఒకటి స్వామి...." అన్నది రంగమణి.

"ఏమిటి ఇంకో కారణం?" అడిగాడు స్వామి.

"మంత్రపు మూలిక... ఎప్పటి మాదిరిగా మీరు దయచేసి మూలికను మధువులో కలిపి వారి చేత తాగించవలెను కదా."

"వచ్చింది శ్రీకంఠుడు కాదని తెలిసిన తర్వాత మంత్రాల మూలికతో పని ఏముంటుంది? సేనాపతిని హెచ్చరించి వారిని కారాగారంలోకి నెట్టించ వచ్చును కదా...." అన్నాడు స్వామి.

తన పమిటె చెంగుచాటున పెట్టుకు వచ్చిన మూటను విప్పి అతని ఎదుట పెట్టింది రంగమణి.

తళతళ మెరిసిపోతున్న బంగారు నాణేలున్నాయి ఆ మూటలో.

"ఇంతకూ నువ్వు అడుగదలుచుకున్నది ఏమిటి?" ఆ నాణేల వంక చూస్తూ అడిగాడు స్వామి.

"వచ్చినవారు శ్రీయుతుడికి సంబంధించిన వారు కాకపోయినా, వారి దగ్గిర ఇంతకు మించిన ధనపు మూటలు వుండే వుంటాయి. వాటిని స్వంతం చేసుకోగలిగితే మన అవసరాలు హాయిగా తీరిపోతూ వుంటాయి...." అన్నది ఆమె.

తను కూర్చుని వున్న ప్రదేశం వెనుక భాగంలో నుంచి ఒక ఎండిపోయిన చెట్టుకొమ్మను ఇవతలికి తీసి, ఆ కొమ్మకున్న చిన్నరెమ్మ విరిచి ఆమె చేతికి అందించాడు స్వామి.

"శ్రీయుతుడు ఎవరో, అతని కుమారుడు శ్రీకంఠుడు ఎవరో అందరికీ తెలుసు. అయినాసరే వారిని అనుకరిస్తూ నిన్ను మోసగించటానికి వచ్చిన వారు ఎవరో గాని సామాన్యులు అయి వుండరు. ఎందుకయినా మంచిది కొంచెం హెచ్చరికగా వుండాలి. ఏ మాత్రం పొరపాటు జరిగినా ఇంత కాలంగా నేను పడిన శ్రమ పనికి రాకుండా పోతుంది" అంటూ చేయి ఊపాడు స్వామి.

వెంటనే అతని చేతిలో ప్రత్యక్షమయింది ఒక మృణ్మయ కలశం. దాని మూతిమీద నలుపు రంగు వస్త్రం ఒకటి గట్టిగా బిగించి వుంది.

"స్వామి...." అన్నది రంగమణి చేతుల్ని ముందుకు జాస్తూ.

"త్వరగా చెప్పు...." తొందరపెట్టాడు స్వామి.

"మీరు దయచేస్తున్న మంత్రాల మూలిక సహాయంతో ఇప్పటివరకూ ఎంతో మందిని నా వశం చేసుకుని, వారి వద్ద వున్న ధనాన్ని మొత్తం సంగ్రహించాను. ఆ ధనంలో మీరు ఒక్క నాణేన్ని కూడా ఆశించలేదు. కాని నేను వచ్చిన ప్రతిసారి ఈ మృణ్మయ పాత్రను నాకు ఇస్తున్నారు. తిరిగి ఉదయ సమయంలో తీసుకువచ్చి మీకు అప్పగించమంటున్నారు. ఇందులో ఏముంది?

ఇది దేనికి?" స్వామి ముందుకు జాచిన పాత్రను తాను తీసుకుంటూ అడిగింది రంగమణి.

"నీకు అనవసరమైన విషయం ఇది. నా సహాయ సహకారాలు కావాలంటే ఎదురు ప్రశ్నలు వేయకూడదు. తీసుకువెళ్ళు" కనులు మరింత ఎర్రనవుతుండగా విసురుగా అన్నాడు స్వామి.

మారు మాట్లాడలేదు రంగమణి. ఆ పాత్రను తీసుకుని గబగబా కొండ గుట్ట క్రిందికి వచ్చింది. సిద్ధంగా వున్న అశ్వశకటంలో కూర్చుని శకట చోదకుడికి సైగ చేసింది.

*　　　*　　　*　　　*　　　*

"వస్తోంది. మా యజమానురాలు నగరం వెలుపలికి పోయి మంత్రాల మూలికను తీసుకువస్తోంది. నేను చెప్పిన మాటలు గుర్తున్నాయా?" మరోసారి రెండు పాత్రల్లో శీతల పానీయాల్ని తీసుకువచ్చి స్నేహితుల ఎదుట పెడుతూ చిన్నకంఠంతో గదాధరుడిని హెచ్చరించింది రంగమణి సేవకురాలు.

"నీకు మేము అపరిచితులం. ఇంతకుముందు ఎన్నడూ నువ్వు నన్ను గాని నా జతగాడిని కాని చూసి వుండలేదు. మరి వున్నట్లుండి మా మీద నీకు ఇంత అభిమానం కలగటానికి కారణం ఏమిటి?" సూటిగా అడిగాడు అతను.

"నా యజమానురాలు వట్టి దుర్మార్గురాలు... అమాయకుల్ని ఎందరినో వంచించి బికారులుగా మార్చివేస్తోంది. అది నాకు నచ్చదు" చెప్పింది ఆమె.

"తెలిసితెలిసి బురదలో కాలు పెట్టటానికి వచ్చేవారు అమాయకులు ఎలా అవుతారు? మోసగింపబడటానికి సిద్ధమైన వాళ్ళని మోసం చేయటంలో తప్పేముంది?" అడిగాడు అతను.

ఒక్క క్షణికం పాటు కూడా అక్కడ నిలబడలేదు ఆ యువతి. వెనుతిరిగి పరుగులాంటి నడకతో అవతలికి వెళ్ళిపోయింది.

"ఈమె మన మీద కరుణ చూపించటం కూడా రంగమణి ఎత్తుల్లో ఒక భాగమే...." సాలోచనగా అన్నాడు గదాధరుడు.

అంతవరకూ దృఢంగా మూసి వున్న ఒక ద్వారం నిశ్శబ్దంగా తెరుచుకున్నది. వయ్యారాలు పోతూ నలుగురు సేవకురాళ్ళు మందిరంలోకి వచ్చారు.

"జరిగిన ఆలస్యానికి మా యజమానురాలు ఎంతగానో చింతిస్తున్నారు. అపర కుబేరులయిన శ్రీకంఠుల వారిని రంజింప చేయటానికి సరైన అలంకరణ కావాలి కదా...." అంటూ అవతలి మందిరంలోకి ఆహ్వానించారు.

* * * * *

పాదాలకున్న మువ్వలు చిరుసవ్వడులు చేస్తూ వుండగా రాయంచమాదిరి నడుచుకుంటూ వచ్చింది రంగమణి.

విలాసంగా ముందుకు వంగి ప్రణామం చేసింది. ప్రక్కవాయిద్యాలు మ్రోతలు మొదలుపెట్టిన వెంటనే ఛెంగున ఎగిరి నృత్యం చేయటం ప్రారంభించింది.

"మనిషి ఎటువంటిది అయినా నృత్యం మాత్రం అపురూపంగా వున్నది మిత్రమా. సరయిన దారిని ఎంచుకుని వుంటే జగద్విఖ్యాతిని సంపాదించుకునేది...." ప్రక్కకు వంగి స్నేహితుడి చెవిలో ఊదాడు గదాధరుడు.

బంగారు పాత్రల్లో మధురసాన్ని నింపి తీసుకువచ్చింది ఒక సేవకురాలు. వారి ప్రక్కన నిలబడి వింజామరలు వీయటం మొదలు పెట్టారు మరో ఇద్దరు.

కనుచివరల నుంచి ఆ మందిరం మొత్తాన్ని నిశితంగా గమనించాడు గదాధరుడు.

రంగమణి చిందులు వేస్తున్న ప్రదేశానికి కొంచెం ఆవలగా ఒక పట్టుతెర దగ్గిర నిలబడి వున్నది అతనికి పరిచయమైన పరిచారిక.

వారి ఎదుట పెట్టబడిన మధురస పాత్రలవైపుచూసి తల అడ్డం తిప్పుతోంది తనను ఎవరూ గమనించకుండా.

"ఆర్యపుత్రులు అలా ఊరికే కూర్చోకూడదు. మధురసాన్ని సేవించండి" ఉన్నట్లుండి హెచ్చరించింది వింజామరాలు వీస్తున్న పరిచారిక ఒకర్తె.

మరింత స్పష్టంగా కనిపించేటట్లు తల అడ్డం తిప్పింది పట్టుతెర చాటున నిలబడి వున్న సేవకురాలు.

"ఎదుట వున్న పాత్రల జోలికిపోతే అన్యాయం అయిపోతామని హెచ్చరిస్తోంది. వాటిని పుచ్చుకోకపోతే అందరికీ అనుమానం వచ్చేటట్లుంది. ఏం చేయాలి మిత్రమా?" శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

"కళ్ళతోనే అడుగు." అన్నాడు శ్యామలుడు.

పట్టుతెర వైపు చూసి అతను చెప్పిన విధంగానే కనుబొమలను ఎగురవేశాడు గదాధరుడు.

వారి ఎదుట వున్న బంగారు పాత్రలకు రెండు మూరల దూరంలో అందమైన చందనపు పీటమీద ఉన్నది ఒక మృణ్మయపాత్ర... నల్లటి వస్త్రంతో దాని మూతికి బిగించి కట్టబడి వున్నది.

పట్టుతెర దగ్గర వున్న సేవకురాలు ఆ పాత్ర వైపు కనులు తిప్పి, అక్కడితో తన పని ముగిసిపోయినట్లు ఆవలికి వెళ్ళిపోయింది.

క్షణికంపాటు కూడా ఆగకుండా నృత్యం చేస్తున్న రంగమణిని చూస్తూనే తమకు వింజామరలు వీస్తున్న సేవకురాళ్ళను పలుకరించాడు గదాధరుడు.

"ఆ పాత్రలో ఏముంది?"

"అది యాబది సంవత్సరాల క్రితం తయారు చేయబడిన మధురసం... నిలువ వుంచిన కొద్దీ దాని రుచి రెట్టింపు అవుతూ వస్తుందట. దాన్ని రుచి చూసిన తర్వాత రెండే రెండు నిమిషాలపాటు స్పృహ వుంటుందిట... ఆ తరువాత మూడు రోజుల పాటు నిద్ర పోవటమేనట...." రహస్యం చెప్పినట్లు చెప్పింది వారిలో ఒకర్తె.

"అంతటి శక్తి కలిగిన పానీయాన్ని మాకు దగ్గరగా ఉంచటం దేనికి?" అడిగాడు అతను.

"మధురసాల గురించి తెలిసి వారు ఆ పాత్రను చూడగానే అందులో ఏముందో వెంటనే చెప్పగలరు. ఆ పానీయాన్ని పుచ్చుకోవడం తమ అదృష్టంగా భావిస్తారు అనేకమంది. అటువంటి వారి కోసమే మా యజమానురాలు ఈ పాత్రను అక్కడ పెట్టించింది" చెప్పింది ఆమె.

"మేము ఆ పానీయాన్ని పుచ్చుకోదలిచాము" అన్నాడు గదాధరుడు.

చిన్నపాటి ఆందోళన వెంటనే ప్రత్యక్షం అయింది ఆమె వదనంలో. "వద్దు... ఆర్యపుత్రులకు ఆ పానీయం గురించి తెలియదు కదా... లేనిపోని బాధల్ని ఆహ్వానించటం దేనికి?" అని అడిగింది.

మొండిగా తల అడ్డం తిప్పాడు గదాధరుడు.

అప్పుడే నృత్యం మొదలు పెట్టిన తర్వాత మొదటిసారిగా ఆగింది రంగమణి.

"తల్లీ... మధురస భాండాన్ని చూసి అందులోని పానీయాన్ని అడుగుతున్నారు." వెంటనే చెప్పింది పరిచారిక.

"మన అతిథులు... ఏమి అడిగినా ఇవ్వవలసిందే...." సూటిగా చెప్పింది రంగమణి.

తన చేతుల్లో వున్న వింజామరను క్రింద పెట్టి చందనపు పీటమీద వున్న మృణ్మయ పాత్ర దగ్గరికి పోయింది ఆ పరిచారిక.

"నాకు ఆ పాత్ర మీద ఏదో అనుమానంగా వున్నది మిత్రమా...." అంటూ శ్యామలుడి సమాధానం కోసం ఎదురు చూడకుండా కూర్చుని వున్న ప్రదేశంలో నుంచి లేచాడు గదాధరుడు.

ఒకే ఒక అంగతో చందనపుపీట దగ్గరకిపోయాడు. పాత్ర మాదిరి కట్టి వున్న నలుపు రంగు వస్త్రాన్ని ఊడదీయబోతున్నది పరిచారిక... ఆమెను అవతలకు నెట్టి తను ఆ పని చేయబోయినట్లు నటిస్తూ, పాత్రను పీట మీద నించి క్రిందికి నెట్టాడు గదాధరుడు.

ఠప్పుమని శబ్దం చేస్తూ రెండు ముక్కలు అయిపోయిందా పాత్ర... నిండుగా వున్న అందులోని మధురసమంతా నేలమీద మడుగు కట్టింది.

"వచ్చేయ్ వెనక్కి...." ఖంగుమంటున్న కంఠంతో స్నేహితుడిని హెచ్చరిస్తూ తాను కూడా లేచి నిలుచున్నాడు శ్యామలుడు.

నేలమీద మడుగు కట్టిన మధురసం మీది నించి సుడులు తిరుగుతూ పైకి లేచింది దట్టమైన పొగ....

దగ్గర్లో వున్న పరిచారికను చుట్టుముట్టింది అది.

చక్కటి శరీరచ్ఛాయతో, చూడముచ్చటి ముఖ కవళికలతో ఆకర్షణీయంగా వున్న ఆ యువతి కాస్తా వున్నట్లుండి పరమ వికారంగా మారిపోయింది.

అవయవాలు వంకర టింకరగా మారిపోయాయి. నల్లటి నలుపుగా మారిపోయింది వంటి రంగు...

ఆమెను వదిలేసింది ఆవరించుకున్న పొగ... గదాధరుడి వైపు కదిలింది వేగంగా.

విపరీతమైన భయంతో వణికిపోతున్న రెండవ పరిచారిక చేతిని పట్టుకుని బలంగా ఆ పొగవైపు నెట్టాడు శ్యామలుడు.

వెనక్కి తగ్గుతున్న తన జతగాడి చేతిని అందుకుని, వింటి నించి వెలువడిన బాణం మాదిరి ఆ మందిరంలో నుంచి బయటికి పరుగుతీశాడు.

మృణ్మయ పాత్రలో నుంచి బయటికి వచ్చిన పొగను చూసి భయంతో వణికిపోతున్న రంగమణిలో వెంటనే వచ్చింది చలనం.

"ఆపండి... వారిద్దరినీ ఆపండి..." కీచు కంఠంతో బిగ్గరిగా అరిచింది.

పట్టుతెరల వెనుక నుంచి బయటికి వచ్చాడు అప్పటివరకూ చాటుగా నిలబడి వున్న సేనాపతి. తన కరవాలాన్ని వరలోనుంచి బయటికి లాగుతూ స్నేహితుల వెనుక పరుగు మొదలుపెట్టాడు.

*          *          *          *          *

నిమ్మకు నీరెత్తినట్లు ప్రశాంతంగా వున్న రంగమణి భవనం వున్నట్లుండి దారుణమైన గందరగోళంతో నిండిపోయింది.

అరుపులు కేకలు ఆర్తనాదాలు ఆకాశాన్ని అంటుకోవటం మొదలు పెట్టాయి. "రండి... భటులారా... అందరూ రండి... అతిధులుగా వచ్చి అందరినీ ఏమార్చిన దుర్మార్గుల కాళ్ళు చేతులు కదలకుండా కట్టి పడవేయండి. రండి" అని బొబ్బలు పెడుతూ భవనం ముందు భాగంలోకి వచ్చాడు సేనాపతి.

కాగడాలు పట్టుకుని ఒకరి తర్వాత ఒకరుగా అతని ఎదుట నిలుచున్నారు భవనం చుట్టూ నిలబడివున్న భటులు.

"మేము... మహా మెలకువగా వున్నాం దేవరా... ఆ శ్యామలుడుగాని, గదాధరుడు గాని ఇటుగా రాలేదు... అసలు ఆ పోలికలున్న వారెవరూ ఈ వీధిలో మాకు కనిపించలేదు" వినయంగా చెప్పాడు ఒక భటుడు.

పట్టరాని కోపంతో పళ్ళు పటపటమని కొరుకుతూ అతని చెంప పగిలి పోయేటట్లు కొట్టాడు సేనాపతి.

"మూర్ఖుడా... శ్యామలుడుని గురించి నేను చెప్పటం లేదు. భవనంలోకి వచ్చిన అతిధుల్ని గురించి మాట్లాడుతున్నాను. ముందు వారిని బంధించండి" అని ఆజ్ఞ ఇచ్చాడు.

అంతకు ముందు ఎన్నడూ అటువంటి ఆజ్ఞల్ని విని వుండక పోవడం వల్ల అయోమయంగా చూశారు అందరూ.

"అతిధులుగా నటించి మమ్మల్ని మోసం చేశారు వాళ్ళు. రంగమణిని అవమానించారు... వెతకండి" మరోసారి చెప్పాడు సేనాపతి.

భవనం చుట్టూ పరుగులు మొదలుపెట్టారు ఆ భటుల్లో కొంతమంది. కాగడాలను బిగించి పట్టుకుంటూ లోపలికి పోయారు మిగిలిన వారు.

"కంటపడిన వెంటనే తలలు నరకవద్దు. కాళ్ళు చేతులు కదలకుండా కట్టి పడవేయండి. ప్రాణాలతోనే వుండాలి వాళ్ళు. తిరిగి ఇటువంటి పనులు చేయకుండా తగిన బుద్ధి చెప్పాలి" కటువుగా హెచ్చరించి, తిరిగి నృత్యమందిరం లోకి పోయాడు సేనాపతి.

అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసేసరికి కాళ్ళు చేతులు వణకటం మొదలు పెట్టాయి అతనికి.

నల్లటి నలుపు రంగులోకి మారిపోయి కనిపించింది అతనికి రంగమణి. హరించుకుపోయింది ఆమె అందం. ఆదృశ్యమైంది ఆమెలో అగుపించే ఆకర్షణ.

ఆమె మాత్రమే కాదు. ఆ మందిరంలో వున్న సేవకురాళ్ళు, వాయిద్య కారులు, ఆమె చెలికత్తెలు అందరూ వికృత రూపాలలోకి మారిపోయారు.

మందిర ద్వారం దగ్గరికి వచ్చిన సేనాపతిని చూడగానే భోరున విలపిస్తూ దగ్గరికి వచ్చింది రంగమణి.

"అన్యాయం జరిగిపోయింది. అంతా నాశనం అయిపోయింది. ఆ మధుర పాత్రలో వున్న మధువులో ఏదో పిశాచం దాక్కుని వుంది." అంటూ అతన్ని కౌగలించుకోబోయింది – ఓదార్పుకోసం.

చీమలు పాకినట్లు జలదరించింది సేనాపతి శరీరం. గబుక్కున వెనక్కి దూకాడు అతను. వరలో నుంచి వెలికి తీసివున్న ఖడ్గాన్ని తిరిగి వరలోపెట్టు కుంటూ, రంగమణి చేతులు తన మీద పడకముందే ఆ భవనంలో నుంచి బయటకి పరిగెత్తాడు.

* * * * *

ధగధగ మెరిసిపోతున్న బంగారు ఆభరణాలను వదిలి పెట్టకుండా మూటలు కట్టాడు గదాధరుడు. పెద్దపెద్ద మట్టిపాత్రలో భద్రపరచి వున్న బంగారు నాణేలను కూడా ఆ మూటల్లోకి చేర్చాడు.

"రంగమణి ఇంకా రోదిస్తూనే వున్నది... నృత్య మందిరంలో ఇంకా ఏదో జరిగే వుంటుంది" భవనం వెనుక భాగంలో కోశాగారం మాదిరిగా ఉపయోగించబడుతున్న మందిరంలో ఒక ఆసనం మీద కూర్చుని అన్నాడు శ్యామలుడు.

"ఏం జరిగి వుంటుందో తెలుసుకోవాలన్న కోరిక నాకు లేదు. నీకు వుంటే వెళ్ళి చూసి రావచ్చు. నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు" ఆఖరి మూటను కొంచెంగా పైకి ఎత్తి బరువు చూస్తూ అన్నాడు గదాధరుడు.

"భటులు అందరూ ప్రతి మందిరాన్ని వెతుకుతున్నారు.... ఏ క్షణంలోనైనా ఇటుగా రావచ్చు." మళ్ళీ అన్నాడు శ్యామలుడు.

"కదలకుండా కూర్చుని మాటలు చెప్పటం మహా తేలిక...." కోపంగా అంటూ మందిర ద్వారం దగ్గరికి పోయి బయటికి తొంగి చూశాడు గదాధరుడు.

శ్యామలుడు చెప్పిన భటులు ఎవరూ కనిపించలేదు అతనికి. దూరంగా వున్న మందిరాల దగ్గర్నించి రంగమణి ఏడుపు ఒక్కటే గట్టిగా వినవస్తోంది.

అనుమానం వచ్చేసింది గదాధరుడికి.... "ఏమైపోయారు వాళ్ళు? వెతకటాన్ని ఆపి మన కోసం మాటు వేసి కూర్చున్నారా?" అని అడిగాడు భుజం మీది నుంచి వెనక్కి చూస్తూ.

"నా అభిప్రాయం నీకు నచ్చదు. నన్ను అడగటం వృధా" కూర్చున్న చోటి నుంచి లేవకుండానే అన్నాడు శ్యామలుడు.

"మూటలు కట్టి కట్టి చేతులు నెప్పులు పుడుతూ వుండటం వల్ల ఏదో తొందరపడి అలా విసుక్కున్నాను. నా మీద దయవుంచి నీ అభిప్రాయం తెలియ చెప్పు" మహామర్యాదగా అన్నాడు గదాధరుడు.

"నువ్వు పగల గొట్టిన పాత్రలోని మధురసాన్ని ఏదో దుష్టశక్తి ఆవహించి వుంది. ఆ పానీయాన్ని సేవించిన వారి అదృష్టాన్ని అది హరించి రంగమణికో, ఆ దిగంబర స్వామికో అందిస్తుంది. పానీయాన్ని పుచ్చుకోకుండా ఆ పాత్రను పగుల కొట్టడంతో అది ఆగ్రహించి అందరి మీదా విరుచుకుపడింది" అన్నాడు శ్యామలుడు.

"ఆ పని నృత్యమందిరంలో కదా జరిగింది.... మన కోసం వెతుకుతున్న భటులు ఏమైపోయినట్లు??" అడిగాడు గదాధరుడు.

"జరిగింది ఏమిటో వారికి కూడా తెలిసి దూరంగా పారిపోయి వుంటారు...." అన్నాడు శ్యామలుడు.

సాలోచనగా తల ఊపి ఆ మందిరంలో నుంచి బయటికి బయలుదేరాడు గదాధరుడు.

"ఎక్కడికి?" అడిగాడు శ్యామలుడు.

"ఈ మూటలన్నీ మోసుకుపోవాలి కదా....." అంటూ పెద్దపెద్ద అడుగులు వేశాడు గదాధరుడు.

* * * * *

సూర్యోదయం అయిన వెంటనే కార్చిచ్చు మాదిరి నగరమంతా వ్యాపించింది ఒక మాట.

"రంగమణి భవనాన్ని ఎవరో నిలువుదోపిడీ చేశారట... అడ్డువచ్చిన ఆ వనితామణిని వికృత రూపిణిగా మార్చి మరీ వెళ్ళిపోయారట...."

రాజవీధిలో వున్న ఒక రచ్చబండ దగ్గర గుమికూడిన పౌరుల్లో ఒక పౌరుడు పెదవి విరిచాడు.

"ఏమయింది నీకు? నమ్మబుద్ధి కావటంలేదా?" కోరగా చూస్తూ అడిగాడు ఆ వర్తమానాన్ని అందరికీ వెల్లడిచేసిన పౌరుడు.

"రంగమణిని కొల్లగొట్టింది ఎవరని నీ అభిప్రాయం?" అడిగాడు పెదవి విరిచిన పౌరుడు.

"ఇంకెవరు? గజదొంగ శ్యామలుడే అయి వుంటాడు.... అటువంటి పనులు అతనికి గాక ఇంకెవరికీ సాధ్యపడవు...." నమ్మకంగా అన్నాడు వర్తమానాన్ని వినిపించిన పౌరుడు.

"మరి ఆమె రూపాన్ని మార్చింది?" ఇంకో ప్రశ్నవేశాడు అతన్ని అనుమానించిన పౌరుడు.

"ఇంకెవరు? అది కూడా శ్యామలుడి పనే...." అని చెప్పబోతూ ఆఖరి క్షణంలో ఆగిపోయాడు ఆ పెద్దమనిషి.

"ఆగిపోయావేం? చెప్పు" ప్రోత్సహించాడు మొదటి పెద్దమనిషి.

"శ్యామలుడికి దొంగతనాలు చేయటంలో ప్రజ్ఞవున్న మాట నిజం... అతన్ని మించిన బందిపోటు ఈ భూ ప్రపంచంలో మరెవ్వరూ కనిపించడు, కాని మంత్రాలు తంత్రాలు అతనికి రావు...." ఆ సంభాషణలో కల్పించుకున్నాడు మరో పౌరుడు.

"తొందర ఎందుకు? ఇప్పుడే కదా తెల్లవారింది. మన సేనాపతుల వారు విచారణ ఇంకా మొదలుపెట్టి వుండరు. వారు కల్పించుకుంటే తప్ప జరిగింది ఏమిటో ఎవరికీ తెలియదు" అన్నాడు మరోపౌరుడు.

* * * * *

"ప్రభూ... ప్రభూ...." అంటూ ఒక సైనికుడు తన శయన మందిరపు తలుపుల్ని తట్టేసరికి ఉలిక్కిపడి లేచాడు సేనాపతి.

"ఎవరు అది? ఏమిటి విషయం?" శయ్య మీది నించి దిగకుండానే బిగ్గరిగా అడిగాడు.

"రంగమణి భవనం దగ్గర్నించి వికృతాకారంలో వున్న ఒక ఆడమనిషి వచ్చి తమ దర్శనాన్ని కోరుతోంది...." చెప్పాడు మందిర ద్వారం దగ్గిర వున్న భటుడు.

రంగమణి నృత్య మందిరంలో తాను చూసిన దృశ్యాలు కనుల ముందు మెదిలి శరీరం మరోసారి జలదరించింది సేనాపతికి.

"విషయం ఏమిటో తెలుసుకో...." చిన్న కంఠంతో చెప్పాడు.

పదే పది క్షణికాల్లో తిరిగి మందిర ద్వారం దగ్గరికి వచ్చాడు భటుడు.

"రంగమణి తమరి ఆగమనాన్ని ఆపేక్షిస్తున్నదట. ఎంత త్వరగా రాగలిగితే అంత మంచిదని అంటున్నదట...." చిన్న కంఠంతో చెప్పాడు.

ఇంకోసారి ఝల్లుమన్నది సేనాపతి శరీరం. "మాకు ప్రస్తుతం తీరికలేదని వెల్లడించు. నగరపాలనకు సంబంధించిన విషయాలు చర్చించటానికి మేము నగర పాలకులు దగ్గరికి పోవాల్సి వున్నది" తడుముకోకుండా అన్నాడు.

మందిర ద్వారం అవతల నిలబడి వున్న భటుడి ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది.

ప్రభువుల వారు నేను చెప్పిన మాటల్ని సరిగ్గా వినిపించుకుని వుండరని నాకు అనిపిస్తోంది. వచ్చింది ఎవరో కాదు. తమరు అధికంగా అభిమానించే రంగమణి యొక్క సేవకురాలు...." ఒక్కొక్కమాటను వత్తివత్తి పలుకుతూ మరోసారి మరింత వివరంగా చెప్పాడు ద్వారం వెలుపల నిలుచున్న భటుడు.

ఉన్నట్లుండి వచ్చేసింది కోపం సేనాపతికి. "మా వినికిడి శక్తినే అనుమానిస్తావా? నీకు ఎంతధైర్యం?" పళ్ళు పట్టపటమని కొరుకుతూ అన్నాడు అనటంతో ఆగలేదు. ఒక అడుగు ముందుకు వేశాడు.

ఆలస్యం చేస్తే అతను ద్వారం వెలుపలికి వచ్చి తన అంతు చూస్తాడని అర్థం అయింది కాబోలు – గిరుక్కున వెనుతిరిగి వేగంగా భవనం వెలుపలికి పారిపోయాడు ఆ భటుడు.

అణిగిపోయింది సేనాపతి ఆగ్రహం. ఆందోళన మాత్రం అలాగే అతన్ని కలవర పరుస్తూనే వున్నది.

రంగమణి చేస్తున్న పనులకు సహకారం అందించటం వల్ల ఆమె అభిమానాన్ని సంపాదించుకోవచ్చుననీ, ఆమె మనస్సును కూడా గెలుచుకో వచ్చుననీ భావిస్తున్నాడు అతను.

రాత్రి జరిగిన సంఘటన అతని ఆశల్ని ఆవిరి అయిపోయేటట్లు చేసేసింది. అందాల బొమ్మ ఆ రంగమణి. కనుచివరల నుంచి కూడా చూడటానికి వీలు కానంత వికృత రూపిణిగా మారిపోయింది. ఎంతో మంది ధనవంతుల్ని దాసానుదాసులుగా మార్చుకుని వారందరినీ నిట్టనిలువుగా ముంచి ఆమె సంపాదించిన ధనమంతా మటుమాయం అయిపోయింది.

ఎలా జరిగింది అది? ఎవరు కారకులు??

సమాధానం లభించని ఆ ప్రశ్నలతో సతమతం అవుతూ ఒక ఆసనం మీద చేరగిలబడబోతుండగా మందిర ద్వారం దగ్గిర ప్రత్యక్షం అయ్యాడు మరో భటుడు.

"అత్యవసరమైన ఆలోచన చేస్తున్నాను. నా ఏకాగ్రతను చెడగొట్టే మాటలు మాట్లాడితే అందుకు శిక్ష మరణమే" తలను కూడా తిప్పకుండా కరుకుగా హెచ్చరించాడు సేనాపతి.

"నగర పాలకుల వారు తమరిని వెంటనే వచ్చి దర్శనం చేసుకోవాల్సిందిగా వర్తమానం పంపారు ప్రభూ. తమరి ఏకాగ్రతకు భంగం కలిగివుంటే మన్నించాలి" వినయంగా చెప్పాడు ఆ భటుడు.

"వస్తున్నామని వర్తమానం పంపించు...." అంటూ భటుడికి చెప్పి, నగర పాలకుడి వద్దకు వెళ్ళే సమయంలో తాను ధరించవలసిన దుస్తుల్ని తీసుకుని మరో మందిరంలోకి పోయాడు సేనాపతి.

అంతవరకూ సేనాపతి విశ్రాంతి తీసుకున్న మందిరంలో ఒక గోడకు వ్రేలాడుతున్న పట్టుతెర చాటునుంచి కొంచెం ఈవలకు వచ్చాడు గదాధరుడు.

"రంగమణి మీద వాడు ఆశపడటం వల్ల ఆమె చేసే పనులకు చేదోడు వాదోడుగా వుంటున్నాడు. అంతే తప్ప ఆమె చేస్తున్న పనుల్లో భాగస్వామి కాదు. అసలు ఆమె అలా ఎందుకు చేస్తున్నదో ఇతనికి తెలియను కూడా తెలియదు" అన్నాడు తన వెనుకే వున్న శ్యామలుడితో.

"అంత నిక్కచ్చిగా నువ్వు ఎలా చెప్పగలుగు తున్నావు?" అడిగాడు శ్యామలుడు.

"చూస్తుంటే తెలుస్తున్నది కదా మిత్రమా.... రంగమణి భవనంలో జరిగింది చూసి భయంతో పారిపోయి వచ్చాడు. వచ్చిన క్షణం నుంచీ ఒకటే ఆలోచన...." అన్నాడు గదాధరుడు.

సాలోచనగా తల ఊపుతూ, వున్నట్లుండి చేతులు జాచి అతన్ని మళ్ళీ తెర వెనక్కిలాగాడు శ్యామలుడు.

సాలోచనగా తల ఊపుతూ, వున్నట్లుండి చేతులు జాచి అతన్ని మళ్ళీ తెర వెనక్కిలాగాడు శ్యామలుడు.

"ఏమిటిది? ఏమయింది?" అని అడగబోతూ చటుక్కున ఆ మాటల్ని తనలోనే అదుముకున్నాడు గదాధరుడు.

దుస్తులు మార్చుకోవటానికి అవతలి మందిరంలోకి పోయిన సేనాపతి తిరిగి అటుగా వస్తూ వుండటమే అందుకు కారణం.

తళతళ మెరుస్తున్న కరవాలాన్ని వరలో నుంచి బయటికి తీసి ఒకసారి దాని వంక చూసుకుని తిరిగి వరలో పెట్టుకున్నాడు సేనాపతి.

"కొంపతీసి వాడు నగర పాలకుడి మీద తిరగబడే ఆలోచన ఏదైనా చేస్తున్నాడేమో!" అతని వంకే చూస్తున్న గదాధరుడు ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు.

నిమ్మకు నీరెత్తినట్లు నిదానంగా నిలుచుని వున్న శ్యామలుడు చిరునవ్వుతో తల అడ్డం తిప్పాడు.

"తిరుగుబాటు చేయాలంటే ధైర్యం గుండె దిటవు వుంటే సరిపోదు. అంగబలం వుండాలి. తన ఆజ్ఞల్ని శిరసావహించి అవసరం అయితే పోరాటాలకు సిద్ధపడే బలగం దగ్గిర వుండాలి. వట్టొట్టి మాటలతో ఎవరూ మనల్ని అనుసరించి రారు. అడిగినంత ధనం అప్పణంగా అర్పించాలి. అలా చేయాలంటే అంతకుముందే మన దగ్గిర ఆ ధనం కుప్పలు తెప్పలుగా పడివుండాలి... మరి ఈ పెద్దమనిషి దగ్గిర వున్నాయా ధనపురాసులు?" అన్నాడు చిన్నకంఠంతో.

కనులు చిట్లించి సేనాపతి వంకే చూస్తున్న గదాధరుడి పెదవుల మీదికి పరిగెత్తుకుంటూ వచ్చింది ఒక చిరునవ్వు. "ఒకటి రెండు ధనపురాసులు వుండి వుంటే – ఇంకో పావుగడియలో మటుమాయం అయిపోతాయి అవి. అమితంగా సంపాదించి అత్యధికంగా కూడబెట్టిన రంగమణి ఇప్పుడు నెత్తినోరూ కొట్టుకుంటూ వీధిన పడి వున్నది. ఇతను కూడా ఆమెకు తోడుగా వెళ్ళబోతున్నాడు" అన్నాడు ఉత్సాహంగా.

ఆ మందిరంలో వున్న పెద్ద అద్దం ముందు నిలువబడి తన ఆకారాన్ని ఒకటికి రెండుసార్లు నిశితంగా పరిశీలించుకుంటున్నాడు సేనాపతి.

"ఆడవాళ్ళు అద్దం ముందు నిలబడటంతో అర్థం వున్నది. ఇతను అదేపనిగా అందాన్ని చూసుకోవటం దేనికి?" జతగాడిని అడిగాడు గదాధరుడు.

"నన్ను అడగాల్సిన అవసరం లేదు. సమాధానం నాకు తెలుసు" అన్నాడు శ్యామలుడు.

తల దగ్గిర్నించి పాదాల వరకూ పదే పదే తరచి తరచి చూసుకుంటున్న సేనాపతి మీదనే దృష్టిని కేంద్రీకరించి పది క్షణికాలపాటు ఆలోచించిన తరువాత తెలిసి వచ్చింది గదాధరుడికి.

"అమ్మ నాయనో.... తెలిసింది మిత్రమా... రంగమణి భవనంలో అందరూ వికృతరూపాల్ని పొందారు. ఆ పరిస్థితి తనకు కూడా వచ్చి వుంటుం దేమోనన్న భయం ఇతన్ని ఆవరించుకున్నది" అన్నాడు.

అద్దం ముందు నుంచి సేనాపతి కదిలి మందిర ద్వారం వెలుపలికి పోవటంతో చిన్నగా తల ఊపాడు శ్యామలుడు.

తెరవెనుక నుంచి ఒక్కదుముకు బయటికి దుమికి, ఆ మందిరంలో కలియతిరిగాడు గదాధరుడు.

"ధనాన్ని దాచిపెట్టే వాళ్ళు అందరికీ అగుపించే స్థలంలో ఆ పని చేయరు. రంగమణి మాదిరి ఏదో రహస్య ప్రదేశాన్ని ఎంచుకుంటారు" దగ్గిర్లో వున్న ఒక ఆసనం మీద చేరగిలబడుతూ అన్నాడు శ్యామలుడు.

"చేతనయితే నాకు సహాయం చేయవచ్చు. లేదా మాటల్ని ఆపి మౌనంగా వుండిపోవచ్చు. వెక్కిరింపులు వేళాకోళాలు మాత్రం పనికిరావు" కోపంగా అంటూ వెడల్పుగా వున్న ఒక ఆసనం మీద చేయివేసి, వేడిగా వున్న పాత్రమీద చెయ్యి వేసినట్లు ఉలిక్కి పడ్డాడు గదాధరుడు.

"ఏమిటవి? ఏముంది అక్కడ?" ఛెంగున లేచి నిలబడుతూ అడిగాడు శ్యామలుడు.

"తెలివైనవాడు మగ సేనాపతి...." అంటూ తను ఏ ఆసనం మీద చేయివేశాడో దాన్ని, బలవంతంగా ఆవలికి జరిపాడు గదాధరుడు.

జరజరమని చిన్నపాటి శబ్దాలు చేస్తూ ఆసనంతో పాటుగా ఆవలకి జరిగింది క్రింద వున్న ఒక పెద్ద రాతి పలక. ఇద్దరు మనుష్యులు తేలికగా లోనికి దిగగలిగినంత వెడల్పయిన సొరంగం ప్రత్యక్షం అయింది.

అంతకుముందు ఏ తెర వెనుక తాము దాక్కుని వున్నారో ఆ తెరను ఇవతలికి లాగి చక్కగా మడతలు పెట్టాడు గదాధరుడు. భుజం మీద వేసుకుని గబగబా సొరంగంలో అమర్చివున్న నిచ్చెన మీదుగా క్రిందికి దిగాడు.

* * * * *

"అధికారం మన చేతుల్లో వున్నది కదా అని అహంకరించి ఇష్టం వచ్చినట్లు సంచరించటం మంచిది కాదు. గంగిగోవుల వంటి పౌరులను ఆగ్రహం అంటూ వస్తే మన అధికారాలు మనల్ని కాపాడలేవు...." ఎదుట నిలబడి వున్న సేనాపతి వంక చురచుర చూస్తూ అన్నాడు నగర పాలకుడు.

ఆయన నోటి వెంట అటువంటి కటువైనమాటలు వెలువడతాయని ఊహించలేదు సేనాపతి. "ఇప్పుడు ఏం జరిగింది ప్రభూ? అధికార దుర్వినియోగం చేసింది ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తనవద్దకు వచ్చే అమాయకుల్ని బికారులుగా మార్చే రంగమణికి నీ అండదండలు పుష్కలంగా వున్నాయని మాకు నివేదించబడింది. ఇందుకు నీ సమాధానం ఏమిటి?" చుట్టుదారి మాటల్ని వదిలి సూటిగా ప్రశ్నించాడు నగర పాలకుడు.

రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయింది సేనాపతి వదనం. "అభూత కల్పనలు... నా ఉన్నతిని చూసి ఓర్వలేని వాళ్ళు కల్పించిన కట్టుకథలు" తడుముకోకుండా చెప్పాడు.

"గత రాత్రి రంగమణి భవనం కొల్లగొట్టబడింది ఆ సమయంలో మన భటులు అనేకమంది ఆ భవనం చుట్టూ కాపున్నారు. రంగమణి వంటి ఒక సామాన్యమైన వ్యక్తికి అంతటి విలువ ఇచ్చి అంతమంది భటుల్ని కాపలా పెట్టటం దేనికి?" అడిగాడు నగర పాలకుడు.

తన తడబాటు నుంచి వెంటనే తేరుకున్నాడు సేనాపతి. తాను ఎటువంటి సమాధానం ఇచ్చినా నగర పాలకుడికి తృప్తి కలగదని తెలిసిపోయింది అతనికి.

"నాకు కొద్దిపాటి వ్యవధి ఇవ్వండి. అలా ఎందుకు చేయవలసి వచ్చిందో తమరికి సవివరంగా చెప్తాను..." వినయంగా అన్నాడు తన వదనంలోని భావాలను జాగ్రత్తగా కప్పి పెట్టుకుంటూ.

"ఈరోజు మధ్యాహ్నసమయానికి మాకు నీ సమాధానం కావాలి. అంతకుమించి వ్యవధిని ఇవ్వదలుచుకోలేదు" నిక్కచ్చిగా చెప్పాడు నగర పాలకుడు.

తల ఊపాడు సేనాపతి. సవినయంగా తలవంచి అభివాదం చేశాడు. వెనుతిరిగి సభా భవనం వెలుపలికి వచ్చాడు.

"నగర పాలకుల వారు మీ మీద చాలా ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పుడు చేయవలసింది ఏమిటి ప్రభూ?" ప్రక్కనే అడుగులు వేస్తూ అతన్ని అడిగాడు ఒక దళపతి.

"మధ్యాహ్నం వరకూ వ్యవధి ఇవ్వబడింది గదా..." అన్నాడు సేనాపతి.

"అది మాత్రం ఎంత సేపటిలో వున్నది? కేవలం ఇంకో మూడు ఘడియలు మాత్రమే..." అన్నాడు దళపతి.

"మూడు ఘడియలు కూడా అవసరం లేదు... రెండు ఘడియల్లో నగరంలోని భటులందరినీ నా భవనం ఎదుటికి రప్పించు... నాలుగే నాలుగు

క్షణాలు మాట్లాడతాను. ఐదో క్షణంలో నగర పాలకుడి భవనం మీద దాడి చేసి అతన్ని వధిస్తాను. అధికారం మన హస్తగతం అయిపోతుంది. అప్పుడు ఎవరికీ సమాధానం చెప్పుకోవలసిన అవసరం వుండదు" నమ్మకంగా అన్నాడు సేనాపతి.

"ప్రభూ... భటుల్ని తమ భవనం ఎదుటికి రప్పించటమంటే మాటలతో జరిగే పనికాదు... బంగారు నాణేల మూటలు వెదజల్లాలి..." అనుమానంగా చూస్తూ అన్నాడు దళపతి.

"నాణేల మూటలు సిద్ధంగా వుంటాయి. వాటిని విసిరిన తర్వాతనే మాటలు మొదలు పెట్టటం జరుగుతుంది. నువ్వు ఆ పని మీద వుండు" అంటూ తన అశ్వాన్ని అధిరోహించి వేగంగా తన భవనం వైపు పోనిచ్చాడు సేనాపతి.

*     *     *     *     *

గదాధరుడు మడతలు పెట్టి భుజం మీద వేసుకుని తీసుకువచ్చిన తెర సరిపోలేదు... పెద్ద పెద్ద చెక్కపెట్టెల నిండా వరుసలలో పేర్చి వున్న ధనపు సంచుల్ని చూసేసరికి మతిపోయినంత పని అయింది అతనికి.

"ఈ నగరంలో రంగమణి ఒక్కతే ధనవంతురాలని అనుకున్నాను... నగర పాలకుడు దయతో ఇచ్చే ధనం మీద ఆధారపడి బ్రతికే ఈ సేనాపతి దగ్గిర ఇంతటి ధనం వుంటుందని ఊహించలేదు" అన్నాడు అతను.

"ఇంతకూ ఇంత ధనం ఇతని దగ్గరికి ఎలా వచ్చినట్టు?" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"ఊరికే ఎందుకు వస్తాయి? నగర పాలకుడి కనులు కప్పి ప్రజల దగ్గిర్నించి పన్నుల రూపంలో పిండుకుంటే వస్తాయి..." అన్నాడు గదాధరుడు.

అతను వెలువరించిన అభిప్రాయాల్ని కాదనే అలవాటు శ్యామలుడికి లేదు. కాని ఆ సమయంలో మాత్రం అభ్యంతరాన్ని వెలువరచలేదతను.

"నిజం ఏమిటో తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది. లేకపోతే నాకు మనశ్శాంతి వుండదు" అన్నాడు.

"మరి ఈ ధనం?" చెక్క పెట్టెల్లోని సంచుల వంక చూస్తూ అడిగాడు గదాధరుడు.

"మన కళ్ళపడిన తర్వాత వట్టిగా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. ఒక్కనాణెం కూడా ఈ ప్రదేశంలో వుండకూడదు... మాయం అయిపోవాల్సిందే" అన్నాడు శ్యామలుడు.

పైకి పరిగెత్తి మరికొన్ని తెరలను చింపుకు వచ్చాడు గదాధరుడు. ధనపు సంచులన్నిటినీ ఆ వస్త్రాల మీద పేర్చి మూటలు కట్టాడు. కొన్ని మూటల్ని తన జతగాడి భుజాల మీద పెట్టి మిగిలిన వాటిని తను పైకి చేర్చాడు.

సేనాపతి నగర పాలకుడి దగ్గిరికి పోవటంతో, కొద్దిగా వెసులుబాటు లభించినట్లు అయింది. ఆ భవనం దగ్గిర కాపలా వున్న భటులందరికీ.

వెనుక భాగంలో నిలబడి వుండవలసిన వారిలో కొందరు తమ ఆయుధాల్ని అవతలపెట్టి, ముందు భాగంలోకి వచ్చారు. అక్కడ వున్న తమ సహచరుల దగ్గిర నిలబడి ఊసులాటలు మొదలు పెట్టారు.

వంటరిగా కాపలా నిలబడిన ఒక ఇద్దరు భటులు మాత్రమే కనిపించటంతో సుడిగాలి మాదిరి వారిమీద కలబడి చిటికెలో తెలివి తప్పించేశాడు గదాధరుడు.

భవన ద్వారం దగ్గిరికి చేర్చిన మూటలన్నిటినీ ఒక దాని తర్వాత ఒకటిగా వెలుపలికి తీసుకుపోయాడు.

* * * * *

గుంపులు గుంపులుగా సేనాపతి భవనం ఎదుట వున్న విశాలమైన స్థలంలో పోగు పడటం మొదలు పెట్టారు రాజభటులు.

గుసగుసగా మొదలైన మాటలు క్రమక్రమంగా చాలా పెద్దగా వినబడటం ఆరంభం అయింది. పావుఘడియ కూడా గడవకముందే రణగొణధ్వనుల క్రింద మారిపోయింది ఆ శబ్దం.

వింత చూడటానికి వచ్చిన పౌరులకు మొదట విచిత్రంగానే అనిపించింది. పోగుపడుతున్న భటుల సంఖ్య పెరుగుతూ పోవటాన్ని చూసిన తర్వాత విపరీతమైన భయం ఆవరించుకున్నది.

ఏదో కీడు జరుగబోతున్నదన్న భావం మనస్సులలో మెదిలిన వెంటనే చట్రాతి మీద కొట్టిన చిల్ల పెంకుల మాదిరి చెల్లాచెదురై దూరంగా వెళ్ళిపోయారు అందరూ.

తన భవన ముఖద్వారం దగ్గిర అశ్వాన్ని వదిలి, ద్వారం వద్దనే నిలబడి వున్న సేనాపతి వదనం వింతగా ప్రకాశించటం మొదలుపెట్టింది.

"ప్రభూ... నగరంలోని భటులందరూ పోగుపడ్డారు. చూచాయగా అందరికీ అర్థమైంది తమరి ఆకాంక్ష. ఇక తమరిదే ఆలస్యం" పరుగులాంటి నడకతో దగ్గిరికి వచ్చి అతనికి చెప్పాడు దళపతి.

"పదే పది క్షణికాలు... అంతకుమించి అవసరం లేదు" అంటూ అతన్ని, మరో పదిమంది భటుల్ని వెంట బెట్టుకుని తన మందిరంలోకి తీసుకుపోయాడు సేనాపతి.

మందిరం మధ్యభాగంలో వున్న వెడల్పాటి ఆసనాన్ని తనే ప్రక్కకు జరిపాడు. జరజరమని చప్పుడు చేస్తూ ప్రత్యక్షం అయిన సొరంగాన్ని చూసి కనులు వెడల్పు చేసిన దళపతిని గమనించి చిన్నగా నవ్వాడు.

"అవసరం అయినంత ధనం అడుగు భాగంలో వున్నది. లోపలికి దిగి వెలుపలికి తీసుకురండి" అంటూ ఆదేశించాడు.

లోపలికి దిగారు బటులు. దిగినంత వేగంతోనే బయటికి వచ్చారు. "ప్రభూ... పెట్టెలు..." అంటూ తాము చూసిన దృశ్యాన్ని అతనికి చెప్పారు.

అదిరిపడినట్లు చూసి తనే క్రిందికి దిగాడు సేనాపతి.

భవనం ఎదుట గుమికూడిన భటుల్లో అసహనం అధికమై పోవటం మొదలు అయింది.

* * * * *

"ధనపు మూటలకు ఆశపడి తిరుగుబాటుకు సిద్ధమై వచ్చారు అందరూ... ఇప్పుడు ఏం చేస్తారు?" సేనాపతి భవనం వెనుక భాగంలో వున్న వీధిలో నిలబడి ముందుకు తొంగి చూస్తూ అడిగాడు గదాధరుడు.

"తప్పు చేయటానికి సిద్ధపడిన వారికి నీతి నియమాల మీద ఆసక్తి వుండదు. బహుశా సేనాపతి మీదనే తిరుగుబాటు మొదలు పెట్టవచ్చు" అన్నాడు శ్యామలుడు.

అతని మాటలు పూర్తి అవుతూ వుండగానే అధికం అయిపోయింది భవనం ఎదుట గుమికూడిన వారి ఆగ్రహం. పెద్దపెద్ద గొంతుకలతో సేనాపతి చేతకాని తనాన్ని నిందించడం మొదలుపెట్టారు కొందరు. వెలగకాయలంత వున్న పలుకురాళ్ళను సేకరించి ఆ భవనం మీదికి విసరటం మొదలు పెట్టారు మరికొందరు.

"ఎన్నెన్నో నగరాలను చూశాము... విశ్వాస పరుల్ని, మోసగాళ్ళను ఎందరినో గమనించాము. ఇటువంటి మూర్ఖశిఖామణుల్ని మాత్రం ఇదే మొదటి సారి చూడటం. ఇటువంటి వెర్రిమాలోకాలు నగరాన్ని పరిపాలిస్తూ వుండబట్టే రంగమణి వంటి పిశాచాలు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాయి" అన్నాడు గదాధరుడు.

"నీ అభిప్రాయాల్ని తర్వాత వెలిబుచ్చవచ్చు. ముందు మనం ఇక్కడి నుంచి అవతలికి వెళ్ళిపోవాలి. ఆలస్యం అయితే ఆ భటులందరూ ఇటుగా వచ్చి మనల్ని మన దగ్గిర వున్న మూటల్ని చూస్తారు..." హెచ్చరించాడు శ్యామలుడు.

"ఒకటి రెండు అయితే మనం వెంటబెట్టుకు పోవచ్చును. ఇన్ని మూటల్ని అవతలికి ఎలా చేర్చటం?" తల బరుక్కుంటూ అన్నాడు గదాధరుడు.

అంటూ వుండగానే అతని దృష్టిని ఆకర్షించింది పాతిక అంగల దూరంలో వున్న ఒక బావి.

పది క్షణికాల పాటు కూడా ఆలోచించలేదతను. శ్యామలుడికి సైగచేసి అటుకేసి నడిచాడు... బావి దగ్గర జరుగుతున్నది ఏమిటో ఆ చుట్టుపట్ల నివసించే వారికి అవగతమయ్యేలోపుగా వారు సేనాపతి భవనంలో నుంచి బయటికి తీసుకు వచ్చిన ధనపు మూటలన్నీ బావిలో పడి మునిగిపోయాయి.

ఆఖరి మూటను అవలీలగా ఎత్తి అతి బలంగా నీటిలోకి విసిరి ఆనందంగా నిట్టూర్చబోతూ, అదిరిపడి శ్యామలుడి భుజం తట్టాడు గదాధరుడు.

అతను సైగచేసిన దిశకు తల తిప్పి అప్రయత్నంగా నొసలు ముడివేశాడు శ్యామలుడు.

భవనం ముందు భాగంలో చెలరేగటం మొదలుపెట్టిన ఆందోళన గురించి కొంచెంగా కూడా పట్టించుకోకుండా వెనుక ద్వారంలో నుంచి బయటికి పరిగెత్తుకు వస్తున్నాడు సేనాపతి.

అతని ఆజ్ఞను అంతకుముందే అందుకున్నట్టు అతని అశ్వాన్ని తీసుకు వచ్చి ఎదుట నిలబెడుతున్నాడు అతనికి విశ్వాసపాత్రుడైన దళపతి.

"సాయం సమయంలోగా నేను తిరిగి వస్తాను... ఇటువంటి పరిస్థితి కల్పించినవారి అంతు చూసి తీరతాను...." అతనికి చెపుతూ ఆ అశ్వాన్ని అధిరోహించాడు సేనాపతి.

"ప్రభూ... మధ్యాహ్న సమయానికల్లా తమరు నగర పాలకులు వారికి సమాధానం...." అంటూ గుర్తు చేయబోయాడు దళపతి.

"నన్ను ఎవరూ అదుపు చేయలేరు... నేను ఎవరికీ సమాధానం చెప్పుకోవలసిన అవసరం లేదు... నువ్వు సాయం సమయం వరకూ నిరీక్షించు...." అంటూ అశ్వాన్ని పరుగు తీయించాడు సేనాపతి.

"ఎక్కడికి పోతున్నాడు ఈ సేనాపతి?" గదాధరుడి అభిప్రాయాన్ని తెలుసుకోగోరాడు శ్యామలుడు.

"ఇదే ప్రశ్న ఇంతకుముందు అడిగి వున్నట్లయితే వేశ్యామణి రంగమణి దగ్గిరికి అని చెప్పి వుండే వాడిని... ఇప్పుడు ఆమె ఎందుకూ పనికిరాని మనిషి అయిపోయింది. బహుశా తనకు బాగా మాలిమి అయిన వారెవరినో వెంటబెట్టుకు రావడానికి వెళ్ళి వుండవచ్చు. లేదా ఈ భటులందరినీ సమాధాన పరచగలిగే వారిని కలుసుకోవడానికి వెళ్ళి వుండవచ్చు" అన్నాడు గదాధరుడు.

అతను సమాధానం చెప్పిన వెంటనే తల ఊపవలసిన శ్యామలుడు ఈసారి మాత్రం అలా చేయలేదు.

"రంగమణి భవనంలో వుండగా మనకు దిగంబరస్వామి పేరు వినబడింది. ఇప్పుడు ఈ దుర్మార్గుడు కూడా అతని దగ్గరికే వెళ్ళి వుండవచ్చని నాకు అనిపిస్తోంది" అన్నాడు.

రెండు క్షణికాల పాటు ఆలోచించి తల ఊపాడు గదాధరుడు.

"నగరం వెలుపల ఏదో కొండ గుట్టమీద అతని నివాసమటకదా... వెళ్ళి మనం కూడా అతని దర్శనం చేసుకుందాము" అంటూ ముందుకు కదిలాడు.

నగరంలోకి వచ్చేవారిని, నగరంలో నుంచి వెలుపలికి వెళ్ళేవారిని బహు జాగ్రత్తగా గమనించుకుంటూ వుండవలసిన భటులు ఎవరూ నగరద్వారాల దగ్గిర వారికి అగుపించలేదు. అందువల్ల ద్వారాలను దాటి బయటికి పోవటం చాలా సులభం అయింది.

"మనం కూడా ఏదైనా వాహనాలను సమకూర్చుకుని వుంటే చాలా బాగుండి వుండేది. కాలినడకన పోవటమంటే చాలా సమయం వృధాఅవటమే" అంటూ సాధ్యమైనంత వేగంగా అడుగులు వేయటం మొదలు పెట్టాడు గదాధరుడు.

* * * * *

"సంవత్సరాలకు సంవత్సరాలు నియమ నిష్టలతో సాధన చేసి నేను స్వాధీనం చేసుకున్న ఆకర్షణ పిశాచిని అరక్షణికంతో నాకు ఉపయోగపడకుండా చేశావు. నా జీవితాశయాన్ని సంశయంలో పడవేశావు. నిన్ను క్షమించటం అసంభవం. నీ మొఖం చూడడం కూడా నాకు ఇష్టం లేదు" బండరాయి మీది నించి లేవకుండానే చాలాకోపంగా అన్నాడు దిగంబరస్వామి.

చేతులు జోడించి నిలబడి వున్న రంగమణి బావురుమంటూ ఒక్కసారిగా మోకాళ్ళ మీద కూలబడి పోయింది.

"మీరు ప్రసాదించిన మృణ్మయ కలశం పట్ల ఇంతకు ముందు ఎన్నడు నేను అశ్రద్ధ చూపించలేదు. అందులోని మధు రసాన్ని సేవించిన వారందరూ కళాకాంతుల్ని కోల్పోవడం జరిగింది. కాని ఇప్పుడు అది బ్రద్ధలయిన వెంటనే ఆ గతి నాకు నా చెలికత్తెలకు పట్టింది. దయచేసి నా రూపాన్ని నాకు తిరిగి వచ్చేటట్లు అనుగ్రహించండి. అంతకు మించి నేను ఇంకేదీ కోరను" గద్గద స్వరంతో అర్థించింది.

"మృణ్మయ కలశంతో బంధింపబడి వున్న ఆకర్షణ పిశాచికి స్వాతంత్ర్యం లభించింది. అది తన దారిన తాను వెళ్ళిపోయింది. వెనక్కి పిలవటానికి కనీసం నాలుగు సంవత్సరాలు సాధన చెయ్యాలి. అది అసంభవం...." కటువుగా అన్నాడు దిగంబరస్వామి.

మోకాళ్ళ మీద కూలబడి వున్న రంగమణిలో వున్నట్లుండి వచ్చింది ఒక పెనుమార్పు. ఆగిపోయింది ఆమె దుఃఖం. కన్నీటితో మలినమైవున్న ఆమె వదనం వున్నట్లుండి మరింత మురికిగా తయారయింది విపరీతమైన కోపంతో.

"సిద్ధ సాధకుడివనీ, అనుగ్రహిస్తే అష్టయిశ్వర్యాలు ప్రసాదిస్తావని ఎంతో నమ్మకంతో నువ్వు చెప్పినట్లు ఎంతో మందిని సర్వనాశనం చేశాను... ఫలితంగా నేను నాశనం అయిపోయాను. నాకు ఈ గతి పట్టించిన నిన్ను ఊరికే వదిలి పెట్టను...." కరకరలాడుతున్న కంఠంతో అంటూ వేగంగా పైకి లేచింది. తన దుస్తుల్లో భద్రపరుచుకు వచ్చిన కైజారును బయటికి లాగి బండరాయి మీద వున్న దిగంబరస్వామి మీదికి లంఘించింది.

ఆమె అలా తెగబడుతుందని ఊహించలేదు కాబోలు అదిరిపడ్డాడు దిగంబరస్వామి "ఆగు... ఆగిపో... ఆగిపో...." బిగ్గరిగా అరిచాడు.

ఆగిపోలేదు రంగమణి. ఆకర్షణ పిశాచి దెబ్బకు వికృతంగా తయారయిన తన ముఖం విపరీతమైన ఆగ్రహంతో మరింత వికృతంగా తయారవుతుండగా బండరాయి మీదికి ఎక్కి, కైజారుతో అతని గుండెల మీద పొడవబోయింది.

ఎడమచేతిని ఎత్తి ఆ ఆయుధాన్ని అడ్డుకున్నాడు దిగంబరస్వామి. కుడి చేతిని చిత్రవిచిత్రంగా గాలిలో తిప్పుతూ ఏదో మంత్రాన్ని ఉచ్చరించాడు.

అతని అంతుచూడాలన్న కోరికతో తపించిపోతూ బండ మీదికి ఎగిరిన రంగమణి, కంటికి కనబడని చేయి ఏదో బలంగా తనని వెనక్కి నెట్టినట్లు వెల్లకిలా క్రింద పడిపోయింది.

ఆమె పాదాల దగ్గిర ప్రత్యక్షం అయింది ఒక పెద్ద కొండచిలువ... కొండగుహ మాదిరి నోటిని తెరిచి ఒక్కసారిగా ఆమె శరీరాన్ని ఆక్రమించింది.

గొంతు చినిగిపోయేటట్లు అరిచింది రంగమణి... "రక్షించండి... రక్షించండి" అంటూ కేకలు పెట్టింది.

సరిగ్గా అదే సమయంలో తన అశ్వాన్ని గుట్ట దిగువన వదిలి, కాలినడకన గుట్ట మీదికి వచ్చాడు సేనాపతి.

గిలగిలలాడుతున్న రంగమణిని గుర్తుపట్టే సరికి దిగజారిపోయింది అతని ధైర్యం. గిరుక్కున వెనుతిరిగి గుట్ట క్రిందికి పరుగు తీయబోతుండగా అతన్ని పిలిచాడు దిగంబరస్వామి

"కదలకు సేనాపతీ... కలవర పడవద్దు... నా ఎదుటికి వచ్చి నిలబడు"

ఎండుకుపోయినట్లు తయారయింది సేనాపతి నోరు. వద్దు వద్దు అనుకుంటూనే క్రింద వున్న రంగమణి వైపు చూశాడు అతను.

ఆగిపోయాయి ఆమె అరుపులు... తలతో మొదలుపెట్టి ఆమె శరీరాన్నంతా మ్రింగివేసింది ఆమె దగ్గిర ప్రత్యక్షం అయిన కొండ చిలువ. నాలుకల్ని వేగంగా కదిలిస్తూ బండరాయి మీద వున్న దిగంబరస్వామి వైపు చూసింది.

"పిలిచిన వెంటనే వచ్చి నీకు తోచిన సాయం చేసినందుకు నా కృతజ్ఞతలు... నీ దారిన నువ్వు వెళ్ళిపో... నీతో అవసరం తీరిపోయింది" చిన్న కంఠంతో దానికి చెప్పాడు అతను.

గుప్పున పైకి లేచింది నల్లటిపొగ. ఆ పొగతో పాటు తను కూడా మాయమైపోయింది కొండచిలువ.

ఎండుకుపోయిన పెదవుల్ని నాలుకతో తడిచేసుకుంటూ భయం భయంగా నిలబడి వున్న సేనాపతిని చూసి బిగ్గరిగా నవ్వాడు దిగంబరస్వామి.

మాటలు రాలేదు ఆ సేనాపతి నోటి నుంచి.

"నా వశంలో వున్న చీకటి శక్తుల్లో ఇది చాలా చిన్నది. నేను కోరుకుంటున్నది నాకు లభ్యం అయితే ఈ నగరాన్నే కాదు... ఇటువంటి నగరాలు మరో పదింటిని సైతం గడగడలాడించగల మహత్తర శక్తి నా వశంలోకి వస్తుంది...." అన్నాడు దిగంబరస్వామి.

ఆ మాటలకు కూడా తల ఊపాడు సేనాపతి. ఎంతో ప్రయత్నం మీద గొంతు పెగల్చుకుని "గురుదేవా.... నాకు మీ సహాయం కావాలి" అన్నాడు.

"ఏ విధమైన సహాయం?" నొసలు ముడివేసి చూస్తూ అడిగాడు దిగంబరస్వామి.

"సేనాపతి పదవి లభించిన దగ్గర్నించీ నగరపాలకుడి దృష్టికి రాకుండా పౌరుల దగ్గర్నించి ఎంతో ధనాన్ని ముక్కులు పిండి మరీ సేకరించాను. ఆ ధనాన్ని ఎరగా వేసి భటులనందరినీ నా వైపు తిప్పుకుని తిరుగుబాటు చేయవచ్చని భావించాను" అంటూ మొదలు పెట్టాడు సేనాపతి.

"నగర పాలకుడిని గద్దె దింపి నువ్వే ఆ పదవిని చేపట్టాలని అనుకున్నావా?" అడిగాడు దిగంబరస్వామి.

తల ఊపాడు సేనాపతి.

"మంచి ఆలోచన... నువ్వే గనుక నగర పాలకుడివి అయితే నాకు ఎంతో ఉపయోగంగా వుంటుంది." మెచ్చుకోలుగా అన్నాడు దిగంబరస్వామి.

"కాని అది సాధ్యపడే సూచనలు కనిపించటం లేదు. నేను కూడబెట్టిన సొత్తునంతా ఎవరో అపహరించారు. నా భూగృహ కోశాగారంలో ఒక్క చిల్లినాణెం కూడా లేకుండా మొత్తం దోచుకుపోయారు." విచారంగా అన్నాడు సేనాపతి.

"రంగమణిని నేను చీకటిలోకాలకు పంపివేశాను కదా.. ఆమె నా మంత్రాల పానీయం సహాయంతో సంపన్నులను నిలువు దోపిడీ చేసిన ధనమంతా అనాధ మాదిరి పడి వుంటుంది. వెళ్లి వెంటనే నువ్వు ఆ ధనాన్ని తీసుకో" అన్నాడు దిగంబరస్వామి.

"ఆ ధనం కూడా అదృశ్యమైపోయింది స్వామీ." అన్నాడు సేనాపతి.

బండరాయి మీది స్వామి ముఖంలో ప్రత్యక్షం అయింది అంతులేని ఆశ్చర్యం. "ఎవరు చేసి వుంటారు ఈ పని?" తల విదిలిస్తూ అడిగాడు.

"అది తెలుసుకోవడానికే మీ సమ్ముఖానికి వచ్చాను గురుదేవా. ధనపు సంచుల వాసన సోకగానే నీడ మాదిరి ప్రత్యక్షం అయ్యే దోపిడీ దొంగ శ్యామలుడు ప్రస్తుతం నగరంలో సంచరిస్తున్నట్టు మేము అనుమానిస్తున్నాము. ఇది గనుక అతని పనే అయివుంటే తిరిగి ఆ ధనాన్ని రాబట్టుకోవటం అసాధ్యం...." అన్నాడు సేనాపతి.

"ఎందుకని?" అడిగాడు దిగంబరస్వామి.

"దొంగిలించిన ధనాన్ని తన దగ్గర దాచి పెట్టే అలవాటు ఆ శ్యామలుడికీ లేదని అంటూ వుంటారు అందరూ... ఆర్తులకు పేదలకు అవసరంలో వున్న వారికి తను దోచినదంతా ధారాదత్తం చేసేస్తాడట. అతనే గనుక ఈ దోపిడీ

చేసి వుంటే రేపు ఈ వేళకల్లా నగరంలోని పేద ప్రజలందరూ ఐశ్వర్యవంతులై పోతారు....” అన్నాడు సేనాపతి.

బండరాయి మీద దిగంబరస్వామి వదనం ఆలోచనలతో మలినం అవుతున్నట్లు కనిపించింది అతనికి.

“మీ శక్తిని ఉపయోగించి శ్యామలుడి ఆట కట్టించండి గురుదేవా.... అతను వెంటనే నాకు పట్టుబడేటట్లు అనుగ్రహించండి. నా సమస్యలన్నీ తీరిపోతాయి. మటుమాయం అయిన సొత్తంతా తిరిగి నా స్వాధీనం అవుతుంది. తిరుగుబాటు సఫలం అవుతుంది. నగరం నా వశమౌతుంది. మీ ఈ శిష్యుడు నగర పాలకుడై మీకు ఆజన్మాంతం కృతజ్ఞుడిగా వుంటాడు” అన్నాడు.

“నువ్వు చెబుతున్న పనిని అతి తేలికగా చేయగల శక్తి వుండేది నాకు ఒకప్పుడు. నా దురదృష్టం కొద్దీ ఆ శక్తి నాకు లేకుండా పోయింది. తిరిగి దాన్ని సంపాదించుకోవటం కోసమే నేను ఈ నగరం వెలుపల ఈ స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాను. రంగమణికి మంత్రాల పానీయాన్ని అనుగ్రహించింది కూడా ఆ శక్తిని వెతికి పట్టుకోవటానికే” దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నాడు దిగంబరస్వామి.

“మీరు సర్వశక్తి సమన్వితులు. మీకు చేతకాని పని అంటూ ఒకటి వుంటుందంటే నేను నమ్మను” దృఢస్వరంతో అన్నాడు సేనాపతి.

“బంగారంతో చేయబడిన ఒక ఉంగరం... అత్యంత విలువైన మరకతమణి ఒకటి దానికి పొదగబడి వుంటుంది. ఆ మణి చుట్టూ చుట్టలు చుట్టుకుని పడగవిప్పి నాట్యం చేస్తూ కనిపిస్తుంది ఒక నాగుపాము... దాన్ని ధరించిన వారికి విషయ వాసనలు అధికం... రంగమణి వంటి అందగత్తెలు కనిపిస్తే క్షణకాలం కూడా నిగ్రహించుకోలేరు... ఆ ఉంగరం నాకు కావాలి” అన్నాడు దిగంబరస్వామి.

“అది... ఆ ఉంగరం ఎక్కడ వుంటుంది గురుదేవా? ఎవరి దగ్గర వుంటుంది?” అయోమయంగా చూస్తూ అడిగాడు సేనాపతి.

“ఆ వివరాలు తెలుసుకోవటం కోసమే నేను రంగమణిని ప్రోత్సహించాను. ఆ ఉంగరం ధరించిన వ్యక్తి గనుక ఆమె దగ్గరికి వస్తే ఆమెకు నేను అనుగ్రహించిన మంత్ర పానీయంలోని ఆకర్షణ భూతం వెంటనే నాకు తెలియచేసి వుండేది. తన తెలివి తక్కువ తనంతో ఆ భావాన్నే నాకు దక్కకుండా చేసింది రంగమణి. తగిన శిక్షను అనుభవించింది” కోపంగా అన్నాడు దిగంబరస్వామి.

"నేను నగర పాలకుడిని అయితే నగరమంతా గాలించి మీకు కావాల్సిన ఆ ఉంగరాన్ని సాధించిపెడతాను. కాని ప్రస్తుత పరిస్థితిలో నా కోరిక తీరటం అసాధ్యమని అనిపిస్తోంది" భారంగా అన్నాడు సేనాపతి.

పది క్షణికాల పాటు ఆలోచించాడు దిగంబరస్వామి. ఉన్నట్లుండి తన చేతుల్ని చిత్ర విచిత్రంగా తిప్పటం మొదలు పెట్టాడు.

*    *    *    *    *

"అదిగో... అది ఆ సేనాపతి ఎక్కి వచ్చిన వాహనమే. వాడు కొండగుట్ట మీదికి పోయాడు. సందేహం లేదు." పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వస్తున్న గదాధరుడు... గుట్టక్రింద కనిపించిన అశ్వాన్ని చూడగానే చెప్పాడు శ్యామలుడికి.

"ఈ దిగంబర స్వామి ఎవరోగాని రంగమణికి మాత్రమే కాదు. మన సేనాపతికి కూడా పూజనీయుడే అయివుంటాడు" అంటూ గుట్ట మీదికి బయలుదేరాడు శ్యామలుడు.

"మిత్రమా... ఏం చేయటానికి వచ్చాము మనము? దిగంబరస్వామిని దర్శించి ఆశీర్వాదాలు పొందటానికా?" అతని వెనకే అడుగులు వేస్తూ అడిగాడు గదాధరుడు.

"దిగంబరస్వామి దర్శనం చేసుకోవాలని వాంఛించింది నువ్వు. నేను కాదు. గుర్తుకు తెచ్చుకో...." నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

"నేను ఆ స్వామివారిని దర్శించుకుంటాను. నువ్వు మన సేనాపతుల వారిని కనిపెట్టుకో. ఆ అయ్య ఏం చేయబోతున్నాడో తెలుసుకో...." అన్నాడు గదాధరుడు.

గుట్ట పై భాగానికి చాలా దగ్గరగా పోవటంతో ఆ మాటలకు సమాధానం ఇవ్వలేదు శ్యామలుడు. చీకటితో నిండి వున్న ఒక గుహ వంటి ప్రదేశం ఎదురుగా ప్రత్యక్షం అవటంతో ఎక్కడివాడక్కడ ఆగిపోయాడు.

అతని ప్రక్కనుంచి మూడు అడుగులు ముందుకు వేసి ఆ గుహలోకి తొంగిచూశాడు గదాధరుడు.

*    *    *    *    *

సన్నగా పైకి లేవటం మొదలు పెట్టిన పొగ వున్నట్లుండి మటుమాయమై దాని స్థానంలో ఒక కోతి వంటి ఆకారం ప్రత్యక్షం అయింది.

ఎర్రటి కనులతో సూటిగా చూసింది అది సేనాపతి కనుల్లోకి. అతిగా మద్యం సేవించినట్టు అయోమయంలో పడిపోయాడు సేనాపతి. తనకు తెలియకుండానే రెండు అడుగులు ముందుకు వేశాడు.

సేనాపతివైపే కాదు. ఆ ఆకారం తలతిప్పి గుహముందు భాగంలోకి కూడా చూసింది.

కొంచెంగా ముందుకు వంగి కనులు చిట్లిస్తూ లోపలికి చూస్తున్నాడు గదాధరుడు. తను ఎవరో, ఎక్కడవున్నాడో మరిచిపోయినట్లు తను కూడా ముందుకు కదలబోయాడు.

ఝల్లుమన్నది శ్యామలుడి ఒళ్ళు "నీకేమైనా మతి మందగించిందా! ఎక్కడికి పోతున్నావ్?" కోపంగా అంటూ అతని చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

కనులు చిట్లించాడు గదాధరుడు. "వదులు... నన్ను వదిలేయ్.... నేను నా మర్కటం దగ్గరికి వెళ్ళాలి." అంటూ తన చేతిని వదిలించుకోవటానికి ప్రయత్నం చేశాడు.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండి వుంది ఆ ప్రదేశం. గుహ గోడలకు తగిలి చాలా పెద్దగా ప్రతిధ్వనించాయి అతని మాటలు.

అదిరిపడి తల ఎత్తాడు బండరాయి మీద వున్న దిగంబరస్వామి "ఎవరు? గుహ ఎదుట వున్నది ఎవరు?" అని అడుగుతూ నిఠారుగా లేచి నిలుచున్నాడు.

ఆలస్యం చేస్తే అతను తనను తన జతగాడిని గమనించటం జరుగుతుందని అర్ధమై గదాధరుడి చేతిని మరింత గట్టిగా పట్టుకున్నాడు శ్యామలుడు.

"వదలరా... నన్ను వదులు... వదిలేయ్...." కర్కశ కంఠంతో అంటూ తలతో అతని గుండెల మీద బలంగా పొడవబోయాడు గదాధరుడు.

పిడికిలి బిగించాడు శ్యామలుడు. రెండో ఆలోచన లేకుండా ఫెడీమని శబ్దం వచ్చేటట్లు కొట్టాడు గదాధరుడి ముఖం మీద.

పిడుగు వచ్చి తగిలినట్లు బాధా సూచకంగా శబ్దం చేశాడు అతను. చిటికెలో తప్పిపోయింది తెలివి. మొదలు నరికిన వృక్షం మాదిరి వెనక్కి విరుచుకు పడిపోబోయాడు.

మెరుపు కంటే వేగంగా కదిలి కౌగిలించి పట్టుకున్నాడు శ్యామలుడు.

"ఆగరా ధూర్తుడా... ఆగిపో... అడుగు ముందుకు వేశావంటే అగ్నికీలల్లో ఆహుతి అయిపోతావ్" బండరాయి మీది నించి క్రిందికి దూకుతూ బిగ్గరగా హెచ్చరించాడు దిగంబరస్వామి.

ఆగిపోలేదు శ్యామలుడు. తెలివిని కోల్పోయిన తన జతగాడిని అమాంతంగా భుజాల మీద వేసుకుని, అతి వేగంగా గుట్ట క్రిందకి పరుగుతీశాడు. గుట్ట మీది నించి వినవస్తున్న మాటలు సేనాపతి వాహనాన్ని ఉత్తేజితం చేశాయి కాబోలు, తల విదిలిస్తూ చిందులు తొక్కటం మొదలు పెట్టబోతున్నది అది.

తన భుజాల మీద గదాధరుడిని ఆ వాహనం మీద అడ్డదిడ్డంగా పడవేసి తను కూడా పైకి చేరుకున్నాడు శ్యామలుడు.

"ఆగరా... ఆగు... ఆగిపో...." ఉరుము మాదిరి పై నుంచి వినవచ్చింది దిగంబరస్వామి గొంతు మరోసారి.

ఆ హెచ్చరిక అసలు తన చెవులకు చేరనట్లు సూటిగా ముందుకే పరుగు తీయించాడు శ్యామలుడు. నాలుగే నాలుగు క్షణాల్లో రెండు వందల ధనువుల దూరం వెళ్ళిపోయి, చీకట్లలో కలిసిపోయారు.

*   *   *   *   *

పళ్ళు పటపటమని కొరుకుతూ నేలను అతిబలంగా తన్ని, పిడికిలితో తను కూర్చునే బండరాయిని పొడిచాడు దిగంబరస్వామి.

"కావాలని నిన్ను పిలిచాను. ఏమైపోయింది నీ శక్తి..." గుడ్లు మిటకరిస్తూ అలాగే నిలబడి వున్న మర్కటాన్ని అడిగాడు.

"నన్నే పిలిచావు... ఎందుకో చెప్పలేదు... చెప్పకుండా నేను ఏ పనీ పూర్తి చేయనని నీకు తెలుసు. ఈ మానవుడిని కూడా మధ్యలోనే నిలబెట్టి వుంచాను గమనించావా?" కోపంగా అడిగింది అతన్ని ఆ ఆకారం.

మర్కట రూపంలో ప్రత్యక్షం అయిన పిశాచ రూపాన్ని చూడగానే రెండు అడుగులు ముందుకు వేసిన సేనాపతి మధ్యలోనే ఆగిపోయి వున్నాడు శిలా విగ్రహం మాదిరి చలనం లేకుండా.

"విడుదల... వెంటనే అతనికి విడుదల...." వెంటనే అన్నాడు దిగంబర స్వామి.

ఎర్రటి కనుల్ని ఒకసారి మూసి తెరిచింది మర్కట రూపం. ఉలిక్కి పడినట్లు ఎగిరి వెనక్కి దూకాడు సేనాపతి.

"నీకు సహాయ పడేందుకు నేను ఆవాహన చేసిన పిశాచ శక్తి ఇది. నీ వెంట వస్తుంది. నిన్ను నాయకుడిగా అంగీకరించని వారిని తన చూపులతో స్వాధీనం చేసుకుని నీకు బానిసలుగా మార్చి వేస్తుంది. దాని సహాయంతో నీ తిరుగుబాటును విజయవంతం చేసుకో... నగర పాలకుడివై తిరిగి నా దర్శనం చేసుకో...." బండరాయి మీదికి చేరుకుంటూ అతనికి చెప్పాడు దిగంబరస్వామి.

బీభత్సంగా వున్న కనుల్ని మూస్తూ తెరుస్తూ నిలువబడి వున్న మర్కటం వంక భయం భయంగా చూశాడు సేనాపతి.

"భయం అనవసరం. అది నీకు సహాయం చేస్తుంది. నా ఆజ్ఞ లేనిదే నీ జోలికి రాదు... తీసుకుపో...." నవ్వుతూ చెప్పాడు దిగంబరస్వామి.

చేతులు జోడించి అతనికి నమస్కారం చేశాడు సేనాపతి. వెనుతిరిగి గుహ ద్వారం వైపు నడిచాడు. నిజమైన కోతి మాదిరిగానే ఎగిరెగిరి దూకుతూ అతన్ని అనుసరించింది దిగంబరస్వామి సృష్టించిన పిశాచం.

* * * * *

"తగలబెట్టండి. స్వరనాశనం చేయండి. మాటలకు మాటలు బంగారు నాణేలు ఇవ్వబడతాయన్న ఆశతో వచ్చిన మనల్ని మోసం చేసిన సేనాపతి భవనాన్ని కూలద్రోయండి...." పిచ్చిపిచ్చిగా అరుస్తూ ఆ భవన ద్వారం దగ్గరికి వచ్చారు అనేక మంది భటులు.

మూడు వందల ధనువుల దూరంలో వున్న ఒక పెద్ద భవనం చాటున నిలబడి ఆ మాటల్ని, అరుపుల్ని ఆలకించాడు సేనాపతికి కుడి భుజం వంటి దళపతి.

బంగారు నాణేల మీది ఆశతో రెచ్చిపోతున్న ఆ భటుల్ని శాంతింప చేయటం తనకు చేతగాని పని అని తెలిసిపోయింది అతనికి. పిచ్చిపిచ్చిగా గంతులు వేస్తున్న వారిలో ఎవరైనా తనను గమనిస్తే తన ప్రాణాలు తనకు దక్కవని కూడా అవగతమై, మెల్లిగా ఆ భవనం చాటు నుంచి ఒక సన్నపాటి సందులోకి నడిచాడు. అక్కడికి కొద్ది దూరంలోనే వున్నది అతను నివసించే పెంకుటిల్లు. అందులో వున్న తన భార్యాబిడ్డల్ని హెచ్చరించి వెంటనే నగరం వెలుపలికి పారిపోవటమే ఉత్తమమని అనుకుంటున్న సమయంలో – అతని దారికి అడ్డుగా ప్రత్యక్షం అయ్యాడు సేనాపతి.

"వద్దు సేనాపతీ. ముందుకు పోవద్దు... పరిస్థితి మనకు అనుకూలంగా లేదు. బంగారు నాణేల మూటలు కళ్ళ చూడకపోతే శాంతించరు ఎవరూ..." ఆందోళన నిండిన కంఠంతో అతన్ని హెచ్చరించాడు.

అంతకుముందు గనుక అతను అటువంటి హెచ్చరిక చేసి వుంటే రెండో ఆలోచన లేకుండా తల ఊపేవాడు సేనాపతి. ఇప్పుడు మాత్రం తలను అడ్డం తిప్పాడు.

"బంగారు నాణేలతో మనకి ఇక మీదట ఎటువంటి పనీలేదు. ఒకే ఒక మాటతో అందరినీ మనవశం చేసుకుంటాము. భయపడకుండా నన్ను అనుసరించు" అంటూ ముందుకు నడిచాడు.

విపరీతమైన ఆగ్రహంతో అరిచి కేకలు పెడుతున్న భటులందరినీ అతను శాంతింప చేయగలడన్న నమ్మకం కలుగలేదు దళపతికి. "మీరు వెళ్ళండి. నేను మాత్రం నా దారి నేను చూసుకుంటాను." అంటూ తన ఇంటికేసి పరుగు తీయబోయాడు.

"అతను నాకు అత్యవసరంగా కావాల్సిన వాడు. నా ఆజ్ఞల్ని అందరికీ చేర వేయవలసిన వాడు. వదిలిపెట్టకుండా వెంట తీసుకురావాలి" తన వెనుకే గంతులు వేస్తూ వస్తున్న మర్కటానికి చెప్పాడు సేనాపతి.

తల తిప్పి దళపతి కేసి ఒకేఒక చూపు చూసిందా కోతి. బంధాలు పడినట్లు ఆగిపోయాయి దళపతి పాదాలు. మరమనిషి మాదిరి వెనక్కి తిరిగి సేనాపతి వెనుకే నడవటం మొదలు పెట్టాడు.

* * * * *

కాపలా భటులు అడ్డుకోవటానికి ప్రయత్నం చేస్తే. తాను మాట్లాడవలసిన మాటల్ని, ఇవ్వవలసిన సమాధానాల్ని సిద్ధం చేసుకుంటూ, నగర ద్వారాల్ని సమీపించాడు శ్యామలుడు.

పొడవాటి బరిశెల్ని దారికి అడ్డుగా పెట్టి యమభటుల మాదిరి అడ్డుగా నిలబడవలసిన భటుల్లో ఒక్కడు కూడా అగుపించలేదు అతనికి.

"రాను రాను నువ్వు వట్టి మందమతివైపోతున్నావు మిత్రమా... నగరంలోని భటులు అందరూ సేనాపతి భవనం ముందు గుమి కూడి వున్న సంగతి మర్చిపోయావు...." నెమ్మదిగా వినవచ్చింది అతనికి తన జతగాడి గొంతు.

ఉలికిపాటును నేర్పుగా కప్పి పెట్టుకుంటూ అతనికేసి చూశాడు. అడ్డదిడ్డంగా పడి వున్న గదాధరుడు నెమ్మదిగా కదులుతున్నాడు.

అతను తన అయోమయావస్థ నుంచి బయట పడినట్లు అర్థమయ్యేసరికి విపరీతమైన సంతోషం కలిగింది శ్యామలుడికి. గబుక్కున ముందుకు జరిగి ఇసుక మూటను లాగినట్లు అశ్వం మీది నుంచి క్రిందికి లాగాడు.

"రాను రాను నీకు మోటుతనం అధికం అయిపోతున్నది. ఇందాక ముక్కూ మొఖం ఏకం అయిపోయేట్లు కొట్టావు. ఇప్పుడు క్రిందికి లాగి పాదాలతో మట్టగించటానికి చూస్తున్నావు" కోపంగా అన్నాడు గదాధరుడు.

బలంగా కౌగిలించుకున్నాడు అతన్ని శ్యామలుడు. నేనే గనుక నీ మొఖం పగలకొట్టి వుండకపోతే ఈపాటికి ఆ దిగంబరస్వామి దగ్గర గుహను శుభ్రం చేసే పని వాడిగానో, మర్కట రూపంలో ప్రత్యక్షం అయిన పిశాచానికి ఆహారంగానో మారిపోయి వుండే వాడివి. సంతోషించి నన్ను అభినందించటానికి బదులుగా నిందిస్తున్నావా?" అని అడిగాడు తాను కూడా కోపాన్ని నటిస్తూ.

మర్కట రూపంలో వున్న పిశాచం ప్రసక్తి వచ్చేసరికి మ్లానమైపోయింది గదాధరుడి వదనం. "మన అదృష్టం బాగుండి, అది మనం రంగమణి దగ్గరికి పోయినప్పుడు తారసపడలేదు. దాని కనులు అయస్కాంతాలు. తట్టుకోవటం అసాధ్యం...." శ్యామలుడు దెబ్బకొట్టిన ముఖాన్ని తడుముకుంటూ అన్నాడు.

"ఇప్పుడు ఆ క్షుద్ర మాంత్రికుడు ఆ పిశాచాన్ని ఎందుకు ఆవాహన చేశాడో ఊహించగలవా?" అడిగాడు శ్యామలుడు.

అతనితో కలిసి నగర ద్వారాలను అధిగమించి, ఒక ఇరుకు సందులోకి నడుస్తూ తీవ్రంగా ఆలోచించాడు గదాధరుడు.

వంద ధనువుల దూరం కూడా పోకముందే గుంపులు గుంపులుగా అతనికి ఎదురు వచ్చారు నగర ప్రజలు అనేకమంది.

"ఏమయింది? ఎందుకు ఇలా పారిపోయి వస్తున్నారు?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ఒక పౌరుడిని.

"ఆ సేనాపతి ఎక్కడి నుంచో ఏదో పిశాచాన్ని వెంట తీసుకువచ్చాడు. ఎదురు మాట్లాడిన ప్రతి మనిషి అతనికి బానిసగా మారిపోతున్నాడు...." గబగబా చెప్పి ఇంకా వేగంగా పరుగు తీశాడు ఆ పౌరుడు.

"అయితే మనం త్వరపడక తప్పదు...." అన్నాడు శ్యామలుడు.

గదాధరుడికి కలిగింది విపరీతమైన ఆశ్చర్యం "మనం త్వరపడటం ఏమిటి మిత్రమా? నగరంలో నుంచి దూరంగా పరిగెత్తటానికా?" అని అడిగాడు.

తల అడ్డం తిప్పాడు శ్యామలుడు.

"నగరాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకోవటమే సేనాపతి ఆశయం. ఆ పని చేయాలంటే అతను నగర పాలకుడిని ఎదిరించి మట్టుబెట్టక తప్పదు" అన్నాడు.

"ఆ పని అంత తేలిక కాదేమో మిత్రమా... నగర పాలకుడి దగ్గర విశ్వాసపాత్రులు చాలా మంది వుంటారు. వారు సేనాపతిని తప్పకుండా అడ్డుకోవచ్చు" అంటూ చటుక్కున నాలుక కరుచుకున్నాడు గదాధరుడు.

అసలు విషయం అతనికి గుర్తువచ్చినట్లు గమనించి చిన్నగా నవ్వాడు శ్యామలుడు.

"మర్కట పిశాచం దెబ్బకు ఎటువంటి విశ్వాసపాత్రుడైనా తల్లక్రిందులు అయిపోతాడు. గట్టిగా మాట్లాడితే నగర పాలకుడే స్వయంగా సేనాపతికి లొంగి పొవచ్చు" అన్నాడు.

"అయితే ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి?" అడిగాడు గదాధరుడు.

"ప్రజల మంచిని కోరుతూ న్యాయబద్ధంగా పరిపాలించే పాలకుల జోలికి పోవటం మన పద్ధతి కాదు. స్వార్థపరులు, ప్రజాకంటకులే మనకు శత్రువులు." అన్నాడు శ్యామలుడు.

* * * * *

సేనాపతి నగరంలో అడుగు పెట్టకముందు వరకూ అరుపులతో కేకలతో దద్దరిల్లిపోయిన ప్రదేశం ఇప్పుడు చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండి వున్నది.

జీవంలేని చూపులు చూస్తూ నిలబడి వున్నారు భటులందరూ. సేనాపతిని ఎదిరించే ఆలోచనగాని, అతని మాటలకు ఎదురు చెప్పే ధైర్యం గాని వారెవరి లోనూ ఆగుపించటం లేదు.

"అమితమైన ధనం ఇస్తానని మీకు నేను మాట పంపి వున్నాను. ఇప్పుడు కూడా ఆ మాటకు కట్టుబడి వున్నాను" నిమ్మకు నీరెత్తినట్లు నిశ్శబ్దంగా నిలబడి వున్న వారందరినీ చూస్తూ మహా సంతోషంగా ప్రకటించాడు సేనాపతి.

"ముందుగా మనం నగర పాలకుడి భవనాన్ని స్వాధీనం చేసుకోవాలి. నగర పాలకుడిని బంధించి సింహాసనాన్ని చేజిక్కించుకోవాలి. తర్వాత కోశాగారాన్ని వెతికి పట్టుకోవాలి, అందులోని ధనమంతా మనం పంచుకోవాలి...." చెప్పాడు. కోశాగారంలోని ధనాన్నంతా పంచుకోవచ్చని అతను ప్రకటించిన తర్వాత కూడా మార్పురాలేదు ఆ భటుల చూపుల్లో.

"నీతి నియమాలు లేని గజదొంగ శ్యామలుడు మన నగరంలో అడుగు పెట్టిన సంగతి మీకు అందరికీ తెలుసు. సింహాసనాన్ని చేజిక్కించుకున్న తర్వాత మనమందరం కలిసి అతన్ని వెతికి పట్టుకోవాలి" అన్నాడు సేనాపతి.

అప్పటికి కూడా వారి వదనాల్లో ఏటువంటి మార్పు అతనికి కనిపించ లేదు. "ఏం చేశావు నువ్వు? అందరినీ జీవచ్ఛవాలుగా మార్చేశావా? బిత్తరచూపులు చూడటం మానటం లేదు. పోరాటాలు చేయగల స్థితిలో వున్నారంటావా?" తన వెనుకే నిలబడి వున్న మర్కటాన్ని అడిగాడు.

"అదేమిటో నాకు తెలియదు. వశ పరుచుకోవటం నాకున్న శక్తి. దిగంబర స్వామి ఆజ్ఞ ఇచ్చినట్లు వీళ్ళు నీమీద తెగబడకుండా వశ పరుచుకున్నాను. అంతే" అన్నది ఆ పిశాచి.

"పదండి. అందరూ నగర పాలకుడి భవనం కేసి కదలండి. నడవండి" ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞ ఇచ్చాడు సేనాపతి.

ఒకేసారి వెనక్కి తిరిగారు భటులందరూ. మరమనుష్యుల మాదిరి బరువుగా అడుగులు వేస్తూ నగర పాలకుడి భవనం దగ్గరికి బయలుదేరారు.

* * * * *

"వస్తున్నారు మిత్రమా... వచ్చేస్తున్నారు. ఆలస్యం చేశామంటే మనం కూడా పిచ్చిచూపులు చూస్తూ వాళ్లలో కలిసిపోతాము" భుజం మీది నుంచి వెనక్కి చూస్తూ శ్యామలుడిని హెచ్చరించాడు గదాధరుడు.

నగరపాలకుడి భవనానికి వంద ధనువుల దూరంలో వున్న ఒక చిన్న రాతి మండపం దగ్గిర అశ్వాన్ని వదిలి క్రిందికి దిగారు వారిద్దరూ

సేనాపతి చేయబోతున్న దుష్కార్యం ఏమిటో ఆ అశ్వానికి తెలియదు. అతనితోపాటుగా వస్తున్న మర్కట పిశాచం యొక్క శక్తి ఏమిటో అంతకన్నా తెలియదు. జంతువుల కంటే ఏదో అతీంద్రియశక్తి మాత్రం దాన్ని ప్రాణాలు కాపాడుకోమని హెచ్చరిస్తున్నట్లు పెద్దగా సకిలించింది.

నగర పాలకుడి భవనం వంకే తదేక దీక్షగా చూస్తున్నాడు శ్యామలుడు. పొడవాటి బరశెల్ని పట్టుకొని శిలా విగ్రహాల మాదిరి నిలుచుని వున్నారు ముఖద్వారం దగ్గిర అనేకమంది భటులు.

తళతళ మెరిసిపోతున్న కరవాలాన్ని వరలో నుంచి తీసి వారందరి ముందు నిలబడి వున్నాడు ఒక దళపతి.

"వందమందికి కొంచెం తక్కువగా వున్నారు. చిటికెలో నాశనమైపోతారు వాళ్ళు. ఎంతో సమయం పట్టదు." శ్యామలుడి చెవి దగ్గర గుసగుసలాడాడు గదాధరుడు.

కరవాలాన్ని బయటికి తీసి నిలుచుని వున్న దళపతికి ఆ సంగతి తెలుసో, తెలియదో శ్యామలుడికి అర్థం కాలేదు.

"ఎందుకైనా మంచిది ఒకసారి వాళ్ళను హెచ్చరించారు... పారిపోయి ప్రాణాలు దక్కించుకోమని చెప్పు" అన్నాడు స్నేహితుడితో.

క్షణక్షణానికి అధికం అయిపోతోంది. గదాధరుడు పట్టుకుని వున్న అశ్వపు ఆందోళన. పిచ్చి పిచ్చిగా సకిలించటం ఎక్కువ చేస్తోంది.

"ముందు దాన్ని వదిలేయ్. దానితో మనకి అవసరం తీరిపోయింది" విసుగు నిండిన కంఠంతో అన్నాడు శ్యామలుడు.

వదిలేశాడు గదాధరుడు గట్టిగా పట్టుకుని వున్న కళ్ళేలను, అతను వదిలిపెట్టిన ఒక ప్రక్కకు దూసుకుపోయి, చూస్తూచూస్తూ వుండగానే కనుమరుగు అయిపోయిందా అశ్వం.

శిలా విగ్రహాల మాదిరి నిలబడి వున్న నగర పాలకుడి భవన రక్షకులు చూస్తూనే వున్నారు ఆ దృశ్యాన్ని.

ముందుకు రాలేదు ఎవరూ. కనీసం గొంతులెత్తి బిగ్గరిగా ప్రశ్నించను కూడా ప్రశ్నించలేదు.

"వీళ్ళ ప్రవర్తన నాకు అనుమానాన్ని కలిగిస్తోంది. సేనాపతిని ఎదిరించటానికి వీళ్ళు ఏదో పథకం పన్ని వుంటారనే అనిపిస్తోంది" అన్నాడు గదాధరుడు.

అంతకు ముందుకంటే చాలా దగ్గరికి వచ్చేసినట్లుంది సేనాపతి తీసుకు వస్తున్న భట సమాహం. నేల అదురుతోంది భటుల అడుగుల అదటుకి.

"వెళ్ళు మిత్రమా... త్వరగా వెళ్ళి వారిని హెచ్చరించాలి" మరోసారి గదాధరుడిని హెచ్చరించాడు శ్యామలుడు.

గుండెల నిండా గాలిని పీల్చుకుంటూ ముందుకు అడుగువేశాడు గదాధరుడు. రాతిబొమ్మల మాదిరి నిలుచుని వున్న వారికి పాతిక అంగల దూరంలోకి పోయిన వెంటనే–

"ఆగు... ఆగిపో... అడుగు ముందుకు వేస్తే హతమారిపోతావు...." ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించాడు కరవాలాన్ని దూసి నిలబడివున్న దళపతి.

"నేను ఆగిపోతాను... ఆగిపోవటానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు కాని, నా వెనుక వస్తున్న సేనాపతి మాత్రం ఆగటం జరగదు" ఎక్కడివాడక్కడ నిలబడిపోయి తాను కూడా పెద్ద కంఠంతో అతనికి చెప్పాడు గదాధరుడు.

"సేనాధిపతిని ఏం చేయాలో మాకు బాగా తెలుసు. నీ సహాయ సహకారాలు ఎవరికీ అవసరం లేదు. ముందు నువ్వు వెళ్ళిపో" మరోసారి భీకరంగా హెచ్చరించాడు దళపతి.

"వెళ్ళకపోతే?" కనులు చిట్లిస్తూ రెట్టించాడు గదాధరుడు.

చేతిలోని కరవాలాన్ని పైకెత్తి గట్టిగా ఊపాడు దళపతి.

"వచ్చేయ్... మిత్రమా... వెనక్కివచ్చేయ్" బిగ్గరిగా అరిచి హెచ్చరించాడు శ్యామలుడు.

మిన్నువిరిగి మీదపడినా చలించే తత్వం కాదు శ్యామలుడిది. ఎటువంటి ప్రమాదం ఎదురైనా వెనక్కి తిరగటం గాని, భయపడి పారిపోవటం గాని అలవాటులేని గండరగండడు అతను.

ఆపైన ఒక్క ఆలోచనకూడా చెయ్యలేదు గదాధరుడు. ఊపిరి బిగపట్టి గబుక్కున గాలిలోకి ఎగిరాడు.

ఆరు అడుగులు లేచాడు అతను గాలిలోకి లేస్తూ వుండగానే భూమి బ్రద్ధలైపోయినంత శబ్దం వినవచ్చింది. అంతకుముందు ఒక్కక్షణం వరకూ అతను నిలుచుని వున్న ప్రదేశంలో ప్రత్యక్షమైంది మూడు అడుగుల లోతున్న పెద్దగొయ్యి.

శ్యామలుడి హెచ్చరికను పెడచెవిన పెట్టి తను అలాగే నేల మీద నిలబడి వుంటే ఏం జరిగి వుండేదో తలుచుకునే సరికి చీమలు జెర్రులు పాకినట్లు జలదరించింది గదాధరుడి శరీరం.

తల్లక్రిందులుగా నేలను తాకబోతుండగా – పరుగు పరుగున వచ్చి గాలిలో వుండగానే పట్టుకున్నాడు శ్యామలుడు.

"అయ్యబాబోయ్... రంగమణి వంటి దూర్తావేశ్యాంగన నగరంలో తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంటే తనకు ఏమీ పట్టనట్టు కూర్చున్న ఈ నగర పాలకుడి తెలివిని తక్కువగా అంచనా వేశాను మిత్రమా... ఎక్కడో విదేశాలలో లభించే ప్రేలుడు పదార్థాలను తెచ్చి తన భవనం చుట్టూ అమర్చుకుని వుంటాడని ఊహించలేకపోయాను" ఎండుకు పోయినట్లు తయారైన గొంతుకను అరచేత్తో రుద్దుకుంటూ అన్నాడు గదాధరుడు.

"వందమంది కూడా వెంట లేకుండా ఈ దళపతి ఇంత నిబ్బరంగా నిలబడి వుండటానికి ఇటువంటి కారణం ఏదో వుండే వుంటుందని నాకు అనిపించింది. ఆ అనిపించింది ఏదో కాస్తంత ముందుగా అనిపించి వుంటే బాగుండేది. నువ్వు అనవసరంగా గాలిలో గంతులు వేయవలసిన అవసరం వుండేది కాదు" నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

"సేనాపతి వచ్చేస్తున్నాడు. ఈ భటులు మన హెచ్చరికను పట్టించుకోరు. ఎన్ని ప్రేలుడు పదార్థాలను ఉపయోగించినా ఆ మర్కట పిశాచాన్ని అడ్డుకోలేరు. అన్యాయంగా బలైపోతారు" జాలిగా అన్నాడు గదాధరుడు.

"ఇక్కడ మనం చేయగలిగింది ఏమీలేదు. నగర పాలకుడిని రక్షించడం తప్ప" అన్నాడు శ్యామలుడు.

భవనం చుట్టూ అమర్చి వున్నాయని తాము ఊహిస్తున్న ప్రేలుడు పదార్థాలను దాటుకుని తాము భవనంలోకి వెళ్ళటం ఎలాగో గదాధరుడికి అర్థం కాలేదు.

*    *    *    *    *

మరమనుష్యుల మాదిరి అడుగులు వేస్తున్న భటులందరి ముందు పటాటోపంగా వస్తున్నాడు సేనాపతి. అతనికి కొంచెం వెనుకగా నడుస్తోంది పిశాచమర్కటం. నడుస్తూ నడుస్తూ వున్నట్లుండి అది స్నేహితుల వైపు చూసింది.

ఒకసారి మాత్రమే చూసింది అది. ఆ ఒక్కసారికే ఝల్లుమన్నది శ్యామలుడి శరీరం. మనసంతా అయోమయం అయిపోయింది. ఆలస్యం చేస్తే తాము కూడా సేనాపతి వెనుక వస్తున్న వారి మాదిరిగా తయారయి పోతామని అర్థమై అతివేగంగా పరుగు తీశాడు అతను స్నేహితుడి చేతులు పట్టుకుని.

సేనాపతి దృష్టి మాత్రం నగర పాలకుడి భవనం ముందు భాగం మీదనే కేంద్రీకృతమై వుంది.

"ఆగండి... అడుగుముందుకు వేయకండి" ఖంగుమంటున్న కంఠంతో అక్కడి దళపతి చేసిన హెచ్చరికను విని వెక్కిరింపుగా నవ్వాడు అతను.

"విదేశాల నుంచి ప్రేలుడు పదార్థాలను తెప్పించింది నేను. ఈ సంగతిని నేను మర్చిపోయి వుంటానని అనుకుంటున్నారు" అన్నాడు మర్కట పిశాచంతో.

అతని మాటలు పూర్తి అవటం సేనాపతిని అనుసరించి వస్తున్న భటులు ముందుకు కదలటం ఒకేసారి జరిగింది.

"ఆగండి... ఆగండి.. ఆగిపోండి" అని కేకలు పెడుతూ తన కరవాలాన్ని గాలిలోకి ఊపాడు భవన రక్షకుల నాయకుడైన దళపతి.

గుండెలు అవిసిపోయే స్థాయిలో మొదలైనాయి ప్రేలుళ్ళు. కంటికి కనిపించని రాక్షస హస్తం ఏదో తవ్వితోడుతున్నట్టు తెరలు తెరలుగా పైకి లేచాయి ధూళిరేణువులు.

నల్లటి పొగ సుడులు తిరుగుతూ ప్రత్యక్షం అయింది. ఎర్రటి మంటలు కూడా ఆ పొగల మధ్యలో అగుపించాయి.

ముక్కలు చెక్కలై నలుప్రక్కలకు చెదిరిపోయారు దాదాపు మూడు వందల మంది సైనికులు...

బాధాపూరితమైన ఆర్తనాదాలతో పూర్తిగా నిండిపోయిందా ప్రదేశం.

"మర్కటపిశాచం శక్తి సామాన్యమైంది కాదు... దానికి ఎదురుపడితే మన పరిస్థితి కూడా ఇదే...." ప్రేలుడుకు దూరంగా నిలువబడి వున్న భటులను చూస్తూ అన్నాడు గదాధరుడు.

తమ కనులముందే తమ సహచరులు గుర్తుపట్టటానికి వీలుకానంతగా నాశనం అయిపోతుంటే – చీమలు కుట్టినట్లుగా కూడా చలించటం లేదు వాళ్లు. అసలు తమకు ఆ దృశ్యం కనిపించటం లేదన్నట్లు నిర్వికారంగా నిలబడి వున్నారు.

"ఆశలు ఆశయాలు కోపాలు తాపాలు కోరికలు ఏమీలేకుండా పోయాయి వాళ్ళకి. మర్కట పిశాచంలో దారుణమైన సమ్మోహన శక్తి వుంది" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

ముక్కలు ముక్కలైపోయిన భటుల గురించి తాను కూడా ఆలోచించటం లేదు సేనాపతి.

"ప్రేలుడు పదార్థాలన్నీ పూర్తి అయిపోయాయి. పదండి ముందుకు" అంటూ ముందుకు పరిగెత్తాడు.

*　　*　　*　　*　　*

"అయ్యయ్యో అవ్వా... అవతల సేనాపతి భవనంలోకి వచ్చేస్తున్నాడు. ఆ దుష్ట మర్కటం కూడా అతనితోపాటే నడుస్తోంది. నగర పాలకుడు కూడా దాని క్షుద్రశక్తికి లొంగిపోయి కళ్ళు తేలవేస్తాడేమో...."

ఆందోళన నిండిన కంఠంతో అన్నది యువరాణి.

చటుక్కున మాయం అయిపోయింది పళ్ళెరంలోని నీటిలో కనిపిస్తున్న దృశ్యం....

యువరాణితో పాటుగా తాను కూడా ఆ పళ్ళెరం వైపే చూస్తున్న వృద్ధురాలు చిరాకుగా తల ఎత్తి చూసింది.

"అధికంగా మాట్లాడితే శిబిర నగరంలో జరుగుతున్న సంఘటనలు మనకు కనిపించవని నీకు ముందుగానే చెప్పాను. చెప్పినప్పుడు తల ఊపి ఇప్పుడు నువ్వు చేసింది ఏమిటి?" తీవ్ర స్వరంతో అడిగింది.

"క్షమించాలి అవ్వా... నగర పాలకుడికి పట్టబోయే దుర్గతిని తలచుకునే సరికి ఉగ్గబట్టుకోలేక పోయాను. నాకు తెలియకుండానే మాట్లాడేశాను...." చిన్న ముఖం చేసుకుంటూ అంది యువరాణి.

"ఎదుటివారికి వచ్చే ఆపదల్ని ముందుగానే ఊహించి మనస్సును కష్ట పెట్టుకోవటం నీ తండ్రికి మహా అలవాటు... అవతలి వారి కన్నీటిని చూసి కరిగిపోయే ఆ లక్షణమే మీ కుటుంబానికి చేటుతెచ్చి పెట్టింది. రాజులకు జాలి దయ అనే లక్షణాలు వుండి తీరాలి... కాని అవి అవధులు దాటి వుండకూడదు" అనునయంగా చెప్పింది.

"అది సరేగాని అవ్వా... అక్కడ ఆ రాజభవనంలో ఏం జరిగిందో తెలుసుకోవటానికి వీలుపడదా?" కుతూహలంగా అడిగింది యువరాణి.

చిన్నగా నవ్వింది వృద్ధురాలు.

"ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు మటుమాయం అయితే వాటిని మళ్ళీ మన కళ్ళముందుకు తేవటం కష్టమౌతుంది. ఎప్పుడో జరిగిపోయిన దృశ్యాలు ఇవి. తిరిగి పళ్ళెరంలో కనిపింపచేయటం సాధ్యమే.. అసాధ్యం కాదు...." అంటూ చేతులు ఊపటం మొదలు పెట్టింది.

"ఎక్కడో వున్న శిబిర నగరంలో సంచరించిన ఆ గజదొంగ తన స్నేహితుడితో కలిసి మన నగరానికి ఎందుకు వచ్చారో" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అన్నది యువరాణి.

పళ్ళెరం మీద చేతులు ఊపుతున్న వృద్ధురాలు ఆ పని వదిలేసి మరోసారి కోపంగా చూసింది యువరాణి వైపు.

చిన్నగా నవ్వి తల వంచుకున్నది యువరాణి.

మాయమైపోయింది వృద్ధురాలి ముఖంలోని కోపం. ముద్దుగా యువరాణి తల మీద చిన్న మొట్టికాయ వేసి మరోసారి మంత్ర పఠనం మొదలుపెట్టింది.

పళ్ళెరంలో వున్న నీటి మీద ఇంకోసారి ప్రత్యక్షం అయ్యాయి పొగలు. ఆ పొగల మధ్యలో ప్రత్యక్షం అయింది శిబిర నగర ప్రధాన ద్వారం ఆ తరువాత రాజభవనం... దానిముందు శిలా విగ్రహాల మాదిరి నిలుచుని వున్న భటులు... ప్రాణాలు కోల్పోయిన వారి శరీరాలు... ప్రేలుడు పదార్థాల అదటుకు భవనం దగ్గిర ఏర్పడిన గోతులు... అన్నీ స్పష్టంగా కనిపించటం మొదలు పెట్టాయి.

చిన్నగా వున్న ఒక మందిర ద్వారంలో నుంచి మరో మందిరం వైపు అడుగులు వేయబోయి వున్నట్లుండి ఆగిపోయారు సేనాపతి.

"అవసర సమయంలో శుత్రువులు భవనాన్ని చుట్టుముడితే ప్రాణాల్ని కాపాడుకునేందుకు రహస్యమార్గాల ద్వారా నగరం వెలుపలికి పారిపోయే ఏర్పాట్లు ఇక్కడ కూడా చేయబడి వున్నాయి. మన రాకను గమనించిన నగర పాలకుడు ఆ మార్గాలను అనుసరించి పారిపోయి వుంటాడంటావా?" తన వెనుక వున్న మర్కటాన్ని  అడిగాడు.

"అటువంటి మార్గం ఎక్కడ వున్నదో నాకు చూపించు. వెంటాడి వెతికి పట్టుకుంటాను. తీక్షణమైన నా చూపులతో చిటికెలో వశపరుచుకుంటాను. నాకు తెలిసింది అంతవరకే. అంతకుమించి నా నుంచి నువ్వు ఎటువంటి సహాయమూ పొందలేవు" నిర్మొహమాటంగా చెప్పింది.

నగర పాలకుడు తన ఆంతరంగికులతో సమావేశమై నగర రక్షణకు సంబంధించిన మాటలు మాట్లాడే మందిరం ఒకటి ఆ భవనం మధ్యభాగంలో నిర్మించబడివున్నది. అది ఎటువైపు వున్నదో సేనాపతికి చాలా బాగా తెలుసు. ఆ సమావేశాలకు అతను తప్పనిసరిగా వెళ్ళవలసినవాడు కాబట్టి.

పది క్షణికాల పాటు ఆలోచించి సూటిగా అటుకేసి దారి తీశాడు అతను. అడ్డుగా ఉన్న ఎన్నెన్నో ఆసనాలను అతిబలంగా అవతలికి నెడుతూ మందిరం

మధ్యభాగంలో ఉన్న సింహాసనం వంటి ఆసనాన్ని సమీపించి దాని మీద కూర్చున్నాడు.

"ఆసనాల మీద ఆశీనులైనంత మాత్రాన అధికారం వచ్చి ఒళ్ళోపడదు. నగర పాలకుడు జీవించి వున్నంత వరకూ నువ్వు ఈ నగరానికి నాయకుడివి కాలేవు" వెంటనే హెచ్చరించింది అతని అంతరాత్మ.

తనకు తనే ఉలిక్కిపడి చటుక్కున క్రిందికి దిగాడు సేనాపతి.

"ఏమిటి ఆలస్యం? నిలబడి నిలబడి నాకు విసుగు పుడుతోంది. నీ పని పూర్తి అయిపోయిందని నువ్వు భావిస్తే నన్ను విడుదల చేయ్. నేను వెళ్ళిపోతాను" ఒక ప్రక్కగా నిలబడిన మర్కట పిశాచం వెంటనే అతన్ని హెచ్చరించింది.

ఝల్లుమన్నది సేనాపతి ఒళ్ళు ఆ మాటల్ని ఆలకించేసరికి. విడుదల చేయటం అంటే దాన్ని అవతలకు వెళ్ళి పొమ్మనటం!

అటువంటి మాట తన నోటి నుంచి వెలువడిన మరుక్షణం మాయమై తాను ఎక్కడినుంచి వచ్చిందో తిరిగి అక్కడికి వెళ్ళిపోతుంది అది.

అది వెళ్ళిపోయిన వెంటనే తమ జడత్వాన్నించి కోలుకుంటారు పిచ్చి చూపులు చూస్తున్న భటులందరూ. తమకు తెలివి లేనప్పుడు జరిగిన సంఘటనలు ఎటువంటివో అర్థమైన వెంటనే ఇంకో తిరుగుబాటు చేస్తారు.

"నా పని ఇంకా పూర్తికాలేదు. నగర పాలకుడిని వెతికి పట్టుకోవటమే ఇప్పుడు మనం చేయవలసిన అతి ముఖ్యమైన పని" అంటూ ఆ మందిరం చివరి భాగంలోకి పోయాడు సేనాపతి.

*    *    *    *    *

"లాభం లేదు మిత్రమా... నగర పాలకుడు చాలా తెలివైన వాడి మాదిరిగా కనిపిస్తున్నాడు. తన భటులందరినీ వాళ్ళ కర్మానికి వాళ్ళను వదిలేసి తను మాత్రం తప్పించుకు పారిపోయినట్లు నాకు అనిపిస్తోంది" భవనం వెనుక భాగంలోని ఒక మందిరంలోకి అడుగుపెడుతూ శ్యామలుడితో అన్నాడు గదాధరుడు.

నగర పాలకుడు తప్పించుకు పారిపోయినట్లు నిశ్చయానికి వచ్చేశాడు శ్యామలుడు. "కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చినట్లు అయింది. ఈ సేనాపతి చేతికి చిక్కబడకుండా అతను పారిపోవటం నిజంగానే హర్షణీయం. అయితే" అంటూ మాటల్ని ఆపాడు.

"ఆపావెందుకు? మాటని పూర్తిచెయ్... నీ సందేహం ఏమిటో బయట పెట్టు" వెంటనే అన్నాడు గదాధరుడు.

"ఎటు నుంచి తప్పించుకున్నారో మనకి తెలియాలి. ఏ విధంగా తప్పించుకున్నాడో, తప్పించుకున్న తర్వాత ఎటుగా ప్రయాణం చేశాడో మనం తెలుసుకోవాలి" అన్నాడు శ్యామలుడు.

"ఆ శ్రమంతా మనకి దేనికి? తప్పించుకున్నాడన్న సంగతి ఒక్కటి నికరంగా తెలుసుకుంటే సరిపోతుంది కదా...." అన్నాడు గదాధరుడు.

"సేనాపతి కేవలం తన బాహుబలాన్ని నమ్ముకుని తిరుగుబాటుకు సిద్ధం అయివుంటే నువ్వు చెపుతున్నట్టు మనకు ఆ శ్రమ అవసరం లేదు. సేనాపతి దుష్టశక్తుల్ని వెంటబెట్టుకు తిరుగుతున్నాడు. వాటిని జయించి ప్రాణాలతో వుండడం తేలికకాదు. నగర పాలకుడికి అంతటి తెలివి వుంటుందని నేను అనుకోవటం లేదు" అన్నాడు శ్యామలుడు.

గుట్ట మీది దిగంబరస్వామి గుర్తుకు వచ్చేసరికి గదాధరుడికి విపరీతమైన దాహం వేస్తున్న అనుభూతి కలిగింది.

"ఎంతదూరం వెళ్ళినా" ఆకర్షించి దగ్గరికి రప్పించుకోగల శక్తి వాడికి వున్నట్లు నాకు అనిపిస్తోంది. నీ మాటలు నిజమే మిత్రమా... నగర పాలకుడు నిజంగానే తప్పించుకున్నట్లు మనకు తెలిసి తీరాలి... లేకపోతే ఇప్పటివరకూ పడిన కష్టమంతా మట్టికొట్టుకు పోతుంది" అంటూ ఆ మందిరంలో నుంచి మరోమందిరం వైపు అడుగులు వేయబోయి - అదిరిపడి వెనక్కి దూకాడు గదాధరుడు.

చుట్టూ వున్న గోడల్ని, వాటి మీది అలంకరణలను చూస్తున్న శ్యామలుడికి ఏమీ అర్థం కాలేదు. "ఏమయింది? ఎందుకు తడబాటు." అని అడగబోయాడు.

అతని చేతుల్ని పట్టుకుని వేగంగా వెనక్కి లాగాడు గదాధరుడు. "మాటలు వద్దు... నోటిని గట్టిగా అదుముకో...." చిన్నకంఠంతో హెచ్చరిస్తూ, ఒక పట్టు తెర వెనక్కి అతన్ని లాక్కుపోయాడు.

వారిద్దరూ ఆ తెర వెనుక కదలకుండా నిలబడటం - భయంతో వణికిపోతూ నలుగురు సేవకురాళ్ళు ఆ మందిరంలోకి రావడం ఒకేసారి జరిగింది.

"వాళ్ళని చూసి భయపడటం దేనికి? మన మాదిరిగానే వాళ్ళు కూడా-" అని మాట్లాడబోయిన శ్యామలుడి కేసి చాలా తీవ్రంగా చూశాడు గదాధరుడు.

ఎడమచేతిని ఎత్తి తన నోటిమీద పెట్టుకుని తల ఊపాడు శ్యామలుడు. తల తోనే ఆ మందిర ద్వారంవైపు చూపించాడు గదాధరుడు.

అటుకేసి చూసిన వెంటనే శ్యామలుడికి కనిపించాడు సేనాపతి. పెద్దపెద్ద అడుగులు వేస్తూ వస్తున్నాడు అతను. వెనుకే నడుస్తోంది మర్కటం.

"రక్షించండి... మమ్మల్ని కాపాడండి... మేము మీకు సేవకురాళ్ళం." పారిపోయే మార్గం కనిపించక పరుగును ఆపి, వెనక్కి చూస్తూ వేడుకున్నారు ఆ మందిరంలోకి వచ్చిన సేవకురాళ్ళు.

"నేను మిమ్మల్ని కాపాడతాను. మీరు భయపడవలసిన పనిలేదు. నగర పాలకుడు ఎక్కడ వున్నాడో చెప్పండి నాకు" గంభీరంగా అన్నాడు సేనాపతి.

"అయ్యా. తమరు ఈ భవనాన్ని చుట్టుముట్టిన తర్వాత నగర పాలకుల వారు మాకు కనిపించలేదు. కుటుంబంతో సహా మటుమాయం అయిపోయారు" వణుకుతూ చెప్పింది ఒక సేవకురాలు.

"వాళ్ళ సంగతి చూడు. వాళ్ళ నోటి వెంట నిజం ఏమిటో రప్పించు" వెనుతిరిగి మర్కటం వంక చూస్తూ ఆజ్ఞాపించాడు సేనాపతి.

ఒక అడుగు ముందుకువేసి ఆ సేవకురాళ్ళందరి వంకా తీక్షణంగా చూసింది మర్కట పిశాచం.

భయంతో వణికిపోవటాన్ని మర్చిపోయినట్లు బొమ్మల మాదిరి నిలుచున్నారు వారందరూ.

"చెప్పించు... మనకు కావల్సిన మాటల్ని వారిచేత చెప్పించు" ఆత్రుతగా అన్నాడు సేనాపతి.

"వశపరుచుకోవటమే నా పని. నడిపించమంటే నువ్వు కోరుకున్న ప్రదేశం వైపు నడిపిస్తాను. బుద్ధిని ఉపయోగించకుండా చేతులతో చేయగలిగిన పనిని వాళ్ళతో చేయించవచ్చు. ఆలోచనలు వుండవు. నీకు ఇంతకుముందే చాలా గట్టిగా హెచ్చరిక చేశాను" నిర్మొహమాటంగా చెప్పిందా పిశాచం.

"చెప్పండి. నగర పాలకుడు ఎక్కడ వున్నాడో వెంటనే చెప్పండి" తనే స్వయంగా సేవకురాళ్ళను అడిగాడు సేనాపతి.

వెర్రిగానే చూశారు వాళ్ళు. పెదవులు విప్పి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అధికం అయిపోయింది అసహనం సేనాపతికి.

"అమోఘమైన శక్తి నా చెంతనే వున్నది. అనుకున్న పని మాత్రం పూర్తి కావటం లేదు...." అనుకుంటూ పళ్ళు బిగపట్టి ఎడాపెడా చేతుల్ని విసిరాడు.

చెంపలు ఛెళ్ళుఛెళ్ళుమని మ్రోతలు చేసాయి. సేవకురాళ్ళ మొఖాల్లో ఎటువంటి భావాలు కనిపించలేదు.

"చెప్పండి. నా ప్రశ్నకు సమాధానం చెప్పండి" ఆవేశం అధికమై మరింత కర్కశంగా అడుగుతూ ఇంకోసారి వారిని బాధించాడు సేనాపతి.

భావాలు బయటికి కనిపించకపోయినా బాధను భరించడం అసాధ్యం అయిపోయింది కాబోలు. నిట్టనిలువుగా విరుచుకు పడిపోయారు వాళ్ళు. తెలివి తప్పి కనులు తేల వేశారు.

కోపంగా ఒక చూపు చూసి ఇంకో మందిరం వైపు నడిచాడు సేనాపతి. అతన్ని అనుసరిస్తూ, ఒక్కక్షణం పాటు ఆగి, తలను పైకి ఎత్తి గాలిని వాసన చూసింది మర్కట పిశాచం.

ముందుగా పోతున్న సేనాపతి వున్నట్లుండి వెనుతిరిగి "వస్తున్నావా?" అని బిగ్గరిగా పిలిచాడు.

గాలిని వాసన చూస్తూనే కదిలింది మర్కట పిశాచం.

"దానికి దివ్యదృష్టి కూడా వుండి వుంటే ఇవాళ మన పని నాశనమైపోయి వుండేది మిత్రమా. చిటికెలో మనల్ని పట్టి ఇచ్చేది. చూపులతో వశపరుచుకోవటం మాత్రమే దానికి తెలిసి వుండటం మన అదృష్టం" ముఖం మీద ప్రత్యక్షం అయిన స్వేదబిందువుల్ని అద్దుకుంటూ అన్నాడు గదాధరుడు.

తెలివి తప్పి పడిపోయి వున్న సేవకురాళ్ళ వంక సాలోచనగా చూస్తూ తెర వెనుక నుంచి ఇవతలికి వచ్చాడు శ్యామలుడు.

"నీళ్ళు కావాలి మిత్రమా... వాళ్ళ ముఖాల మీద జల్లి తెలివి తెప్పించ టానికి వెంటనే మనకి నీళ్ళు కావాలి" అన్నాడు.

వెంటనే చుట్టూ చూసి, మరో మందిరంలోకి పోయి పావు ఘడియ తరువాత పడుతూ లేస్తూ పరిగెత్తుకు వచ్చాడు గదాధరుడు.

"ఏదో ఒకటి చేసి ఆ పిశాచాన్ని అడ్డు తొలగించుకోవాలి. అది మనం తిరుగాడిన ప్రతి మందిరంలోను గాలి వాసన చూస్తోంది. బహుశా మన జాడల్ని పసికట్టటానికి కాబోలు" అన్నాడు ఒక పెద్ద కంచుపాత్రను అందిస్తూ.

అందులోని నీటిని పడిపోయివున్న సేవకురాళ్ళ ముఖాల మీద జల్లాడు శ్యామలుడు.

ఒకరి తరువాత ఒకరుగా కనులు తెరిచి లేచి కూర్చున్నారు వాళ్లు. "మిమ్మల్ని వేధించిన సేనాపతి ఇప్పుడు ఇక్కడ లేడు. మీరు ధైర్యంగా మాట్లాడవచ్చును" అనునయంగా అన్నాడు గదాధరుడు.

వెర్రిచూపులు చూస్తున్న సేవకురాళ్ళ ముఖాల్లో వెంటనే వచ్చింది మార్పు. తమకు పూర్తి స్పృహ తెలిసినట్లు చేతుల్లో ముఖాలు దాచుకుని ఏడ్వటం మొదలుపెట్టారు.

అప్పుడు అవగతమైంది గదాధరుడికి. "మిత్రమా... వాళ్ళకి బుద్ధి వచ్చింది. వాళ్ళని ఆవరించుకున్న ఆకర్షణ మైకం మటుమాయం అయింది. ఎలా సాధ్యపడింది?" అయోమయంగా చూస్తూ అడిగాడు.

"సేనాపతికి కృతజ్ఞతలు తెలియచేసుకోవాలి" అన్నాడు శ్యామలుడు.

"వాడికా? వాడికి ఎందుకు?" మరింత అయోమయంగా అడిగాడు గదాధరుడు.

"మైకంలో మునిగిన వాళ్ళ మెదడు అదిరిపోయేటట్లు దెబ్బకొట్టి తిరిగి తెలివి తెప్పిస్తే మర్కట పిశాచం ప్రయోగించిన ఆకర్షణ శక్తి అంతరించి పోతుందని తనకు తెలియదు. ఇందాక వాళ్ళని కొట్టాడు. వాళ్ళకి స్పృహ తప్పింది. తెలివిరాగానే మామూలుగా మారిపోయారు." వివరంగా చెప్పాడు శ్యామలుడు.

"ఈ సంగతి నీకు ఎలా తెలుసు?" అనుమానంగా చూస్తూ అన్నాడు గదాధరుడు. చిన్నగా నవ్వి గుట్ట దగ్గర జరిగిన సంఘటనను అతనికి వివరంగా చెప్పాడు శ్యామలుడు.

"సామాన్యులకు సాధ్యం కాని అమానుష శక్తుల్ని సృష్టించిన భగవంతుడు, ఆ శక్తుల నుంచి రక్షించుకునేందుకు సామాన్యమైన ఉపాయాలనే మనకు అందుబాటులో ఉంచుతాడు. వాటిని కనిపెట్టిన వారికి ఎటువంటి భయము వుండదు" అంటూ ఏదో గుర్తుకు వచ్చినట్లు స్నేహితుడి వైపు చూశాడు గదాధరుడు.

"వాళ్ళకి చికిత్స చేసినట్లుగానే ఆ పిశాచం బెడదను శాశ్వతంగా తొలగించుకునే మార్గాన్ని ఆలోచించు. అది అత్యవసరం. అది ఈ భవనంలో తిరుగాడుతున్నంత వరకూ మనం స్వేచ్ఛగా నగరంలో వెతకటం అసంభవం" అన్నాడు.

"అయ్యా.... మీ మాటలు మాకు ధైర్యాన్ని ఇస్తున్నాయి. నగర పాలకులవారు ఈ మందిరంలోని రహస్య మార్గం ద్వారా నగరం వెలుపలికి పారిపోయారు" తడుముకోకుండా చెప్పింది ఒక సేవకురాలు.

మర్కట పిశాచాన్ని చూసిన తర్వాత కూడా ధైర్యంగా ఆ రహస్యాన్ని తనలోనే దాచుకున్న ఆ యువతిని చూచి ముచ్చట పడ్డాడు శ్యామలుడు.

"మీరు వెంటనే భవనంలో నుంచి వెలుపలికి పారిపోండి. భవనం వెనుక భాగంలో పాడుపడిన బావి ఒకటి వుంది. అక్కడ మాకోసం ఎదురు చూడండి. మేము కొద్దిసేపటి తర్వాత వచ్చి మీతో మాట్లాడుతాము" అంటూ వారిని కలవమని సూచించాడు.

అటువంటి మాటల్ని రెండవసారి చెప్పించుకునే అలవాటు తనకు లేనట్లు ఒకేసారి పరుగు అందుకున్నారు సేవకురాళ్ళు. అర నిమిషంలో ఆ మందిరంలో నుంచి వెలుపలికి వెళ్ళిపోయారు.

*     *     *     *     *

"ఇక పద... ఆ పిశాచం సంగతి ఆలోచిద్దాము" అంటూ శ్యామలుడు చెప్పగానే మందిరం ముందు భాగంలో వున్న ద్వారంవైపు కదిలాడు గదాధరుడు.

"ఎలా ఆలోచిద్దాము?" కుతూహలంగా అడిగాడు.

తెల్లటి పల్వరుస బయటికి కనిపించేలా అందంగా నవ్వాడు శ్యామలుడు.

"మర్కటపిశాచం ఎవరిని చూస్తే వాళ్ళు రాతి బొమ్మల మాదిరి నిలబడి పోతారు. అవునా?" అని అడిగాడు.

"చెప్పిందే చెప్పి నా బుర్ర తినబోకు. కొత్తమాట ఏదైనా వుంటే చెప్పు" మరోసారి అందంగా నవ్వాడు శ్యామలుడు.

"మర్కట పిశాచం మన వంక చూస్తే మనం ఎందుకూ పనికిరాని వాళ్ళం అవుతున్నాము. మరి అది తన వంక తను చూసుకుంటే ఏమౌతుంది?" అని అడిగాడు.

అతను మళ్ళీ పాత మాటనే మొదలు పెడుతున్నాడు కాని, కోపంగా చూడబోయిన గదాధరుడి ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది.

"దుష్టశక్తులను సృష్టించిన భగవంతుడు వాటిని ఎదుర్కొనే ఉపాయాలను కూడా దగ్గర్లోనే సృష్టించి ఉంచుతాడు ఇందాక నువ్వు చెప్పిన ప్రకారం –" అంటూ మాటల్ని ఆపాడు.

తల ఊపాడు శ్యామలుడు. "నిలువుటద్దాలున్న మందిరాన్ని వెతికి ఆ పిశాచాన్ని ఆ మందిరలోకి రప్పిద్దాము. నా ఆలోచన నిజమే అయితే దాని పని పూర్తి అయిపోతుంది" అన్నాడు.

ఆనందంగా తల ఊపటమైతే ఊపాడు గాని, పూర్తిగా విశ్వాసం చూపించ లేకపోయాడు గదాధరుడు.

"అది ఒక పెద్ద దరిద్రపు గొట్టు స్వరూపం. కాళ్ళను కదలకుండా కట్టేసి భగభగమనే మంటల్లో పడవేస్తే తప్ప దాన్ని వదిలించుకోవటం జరగదు" అన్నాడు.

"అయితే నువ్వు దాన్ని కదలకుండా కట్టి పడేసి తీసుకురా. నేను భగభగమండే మంటల్ని సిద్ధం చేస్తాను" అన్నాడు శ్యామలుడు.

విసురుగా ఒక చూపు చూసి నోటిని మూసుకున్నాడు గదాధరుడు. రెండు మందిరాలను వెతికిన తర్వాత మానవ మందిరంలో వారికి అగుపించాయి గోడలకు బిగించి వున్న నిలువుటద్దాలు.

"ఆడవారు అలంకరణలు చేసుకునే అంతఃపుర మందిరం ఇదే అయి వుంటుంది" అక్కడ ఉన్న అలంకరణ సామాగ్రులను చూస్తూ అన్నాడు శ్యామలుడు.

"నువ్వు నీ ఆలోచనను ఎలా కార్యరూపం పెట్టాలో ఆలోచించుకుంటూ వుండు, నేను ఆ దరిద్రాన్ని ఇటుకేసి ఆకర్షిస్తాను" అంటూ మందిరం వెలుపలికి పరిగెత్తాడు గదాధరుడు.

తన ఆలోచన మీద నమ్మకం లేదంటూనే, ఆ ఆలోచనను కార్యరూపంలో పెట్టటానికి చేయవలసిన అతి కష్టమైన పనిని అతను తన తలకు ఎత్తుకోవటాన్ని చూసి తనలో తను నవ్వుకున్నాడు శ్యామలుడు.

ఎటువంటి అపదను ఎదిరించటానికైనా ముందు తనే సిద్ధం అవుతాడు గదాధరుడు. అటువంటి వాడిని స్నేహితుడిగా పొందటం తన అదృష్టం.

తన ఆలోచనలను మధ్యలోనే వదిలేసి గోడలకున్న అద్దాలను తనకు కావాల్సిన పద్ధతిలో అమర్చటం మొదలు పెట్టాడతను.

మందిరంలోని ఆసనాలను అర్ధ చంద్రాకారంలో పేర్చాడు. గోడల మీది అద్దాలన్నిటినీ క్రిందికి దించి, వాటికి ఆనించి నిలబెట్టాడు.

పది పదిహేను క్షణికాల కంటే ఎక్కువ సమయం గడవక ముందే ఒక ఆ ప్రదేశం పెద్ద అద్దాల మందిరంలా మారిపోయింది.

మందిర ద్వారంలో అడుగు పెట్టిన వెంటనే ఆకర్షిస్తాయి ఆ అద్దాలు.

*        *        *        *        *

"నాకు తెలిసి రెండు వందల మంది దాసదాసీ జనం నగర పాలకుడి వద్ద పని చేస్తూ వుండాలి. ఒక్కళ్ళు కూడా కనిపించడం లేదు" తనలోతను గొణుగుకుంటూ వెనుతిరిగాడు సేనాపతి.

అతనితో పాటు తాను కూడా వెనక్కి చూసిన మర్కట పిశాచానికి వెంటనే తెలిసింది ఒక జాడ.

"ఎవరో నీకు నాకు కనిపించకుండా ఈ చుట్టు పట్ల దాక్కుని వున్నారు" అంటూ అది నాలుగు పక్కలకు పరిగెత్తి చూడటం మొదలు పెట్టింది.

సరిగ్గా అదే సమయంలో పక్షుల మాదిరి గాలిలో ఎగురుతూ వచ్చి దాని తలకు, సేనాపతి తలకు తగిలాయి రెండు చిన్నచిన్న కంచుపాత్రలు.

"ఎవరు? ఎవరు వాటిని విసిరింది? ఎవరు?" తీవ్రమైన కోపంతో అడుగుతూ తల తిప్పి చూశాడు సేనాపతి.

కదలిక మాత్రం కనిపించింది అతనికి. ఆకారం అగుపించలేదు. కంచుపాత్ర తగిలిన ప్రదేశాన్ని చేతులతో తడుముకుంటూ శిలా విగ్రహం మాదిరి నిలబడిపోయిన అతని ప్రక్కనుంచి బాణంలా ముందుకు పరిగెత్తింది మర్కట పిశాచం.

*        *        *        *        *

"వచ్చేస్తోంది మిత్రమా... భూతక్కి నా వెనుకే వచ్చేస్తోంది" పళ్ళు బిగపట్టి శరవేగంతో వస్తూ శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

అతని భుజాలు పట్టుకుని ఒక ఆసనం వెనక్కి నెట్టాడు శ్యామలుడు.

"నేను పిలిచేటంతవరకూ తల బయటికి పెట్టకు" అంటూ తాను ద్వారం కేసి చూశాడు.

పది అడుగుల వెనుకగా ప్రత్యక్షం అయింది పిశాచం. మందిరంలో నిలబడి వున్న ఆ మానవుడిని చూడగానే వికృతంగా అరిచి కనుల్ని పెద్దవి చేసింది.

కళ్ళను బండి చక్రాలంత విశాలంగా చేసి తీక్షణాతి తీక్షణంగా చూస్తున్న తన స్వరూపమే దానికి కనిపించింది.

దానికి తెలియకుండానే బాధ సూచకమైన పెద్దశబ్దం దాని నోటి నుంచి వెలువడింది. అవసరం అయితే మీదికి దుమికి తన వాడి గోళ్ళతో శ్యామలుడి

శరీరాన్ని ఛిద్రం చేసేయాలన్నంత దాని కోపం కాస్తా విపరీతమైన భయంగా మారిపోయింది.

గజగజ వణికి పోతూవెనక్కి దూకి మందిర ద్వారం వైపు పరిగెత్తాలన్న కోరిక కలిగింది కాబోలు – కొద్దిగా కదిలింది అది.

"దాని పని అయిపోయింది. దాని శక్తికి అదే లొంగిపోయింది." అంటూ ఒక అద్దం చాటు నుంచి పైకి లేచాడు శ్యామలుడు.

"రమ్మంటావా నన్ను కూడా?" వంచిన తల ఎత్తకుండా కూర్చుని వున్న గదాధరుడు వెంటనే అడిగాడు అతన్ని.

"బొట్టుపెట్టి ప్రత్యేకంగా చెప్పాలా? కనిపించటం లేదా?" చిరుకోపంతో అడిగాడు శ్యామలుడు.

తాను తలవంచుకు కూర్చున్న ప్రదేశంలో నుంచి లేచి ఇవతలకి వచ్చాడు గదాధరుడు.

"కొద్దిగా ప్రక్కకు తిరిగిన పిశాచం అలాగే కదలిక లేకుండా నిలబడి వున్నది. అంతకుముందు వరకూ అతి తీక్షణంగా వున్న దాని కనులు ఇప్పుడు జీవం లేనట్లు పిచ్చి చూపులు చూస్తున్నాయి.

"నీ పని అయిపోయింది. ఇంక నువ్వు నీ సృష్టికర్త దగ్గరికి పోవచ్చును" అన్నాడు శ్యామలుడు.

నిలబడిన ప్రదేశం నుంచి ఒక్క అడుగు కూడా అవతలికి వేయలేదు ఆ మర్కటం.

"నీ మాట వినిపించుకోవటం లేదు. ఇది తేరుకుని మనమీద దాడి చేస్తుందంటావా?" అనుమానంగా అన్నాడు గదాధరుడు.

రెండు క్షణికాల పాటు ఆలోచించి తల అడ్డం తిప్పాడు శ్యామలుడు.

"దిగంబరస్వామి దీన్ని సృష్టించి సేనాపతికి అప్పగించాడు. బహుశా ఇది అతని మాటల్ని తప్ప ఇంకెవరి మాటల్నీ వినిపించుకోకపోవచ్చు" అంటూ మందిరం వెలుపలికి చూశాడు.

"సేనాపతి ఏమైపోయాడు?" అడిగాడు గదాధరుడు.

"వెనుకే వస్తూ వుండి వుండవచ్చు. మనం ప్రక్కకు తప్పుకోవటం మంచిది" అంటూ ఒక గోడ దగ్గరికి పోయి దానికి వ్రేలాడుతున్న తెర వెనుక నిలుచోబోయాడు శ్యామలుడు.

"మిత్రమా.. ఇది చూడు... ఇది... ఇది" ఆత్రుతగా అతన్ని హెచ్చరించాడు గదాధరుడు.

అతను చూపించిన వైపు చూశాడు శ్యామలుడు.

బ్రహ్మాండమైన ఖడ్గాన్ని పట్టుకుని యుద్ధం చేయటానికి సిద్ధంగా వున్న ఒక వీరుడి చిత్రపటం వ్రేలాడుతున్నది ఆ ప్రదేశంలో....

"ఇది కదిలించటానికి అనువుగా వున్నట్లు తోస్తోంది" అంటూ దాన్ని పట్టుకోబోయాడు గదాధరుడు.

చటుక్కున చేతులు జాపి అతన్ని పట్టుకుని తను నిలబడిన ప్రదేశంలోకి లాగాడు శ్యామలుడు.

తన కరవాలాన్ని బిగించి పట్టుకుని సేనాపతి ఆ మందిరంలోకి వస్తూ వుండటమే అందుకు కారణం.

"ఏమయింది? ఎందుకిలా నిలబడిపోయావు?" మందిరంలోకి వస్తూనే మర్కటాన్ని అడిగాడు సేనాపతి.

అప్పుడు వచ్చింది కదలిక ఆ పిశాచంలో. తల తిప్పి అతని వంక చూసింది. అసలు విషయం కొద్దిగా అర్ధం అయిపోయింది కాబోలు, "ఏమిటిది? ఏమయింది నీకు?" ఆందోళనగా అడిగాడు అతను.

యంత్రం మాదిరి ఒక అడుగు ముందుకువేసి శిలా విగ్రహం మాదిరి నిలుచుండిపోయింది ఆ పిశాచం – మరోసారి.

జీవం లేని చూపులు చూస్తూ యాంత్రికంగా కదిలిన మర్కటపిశాచాన్ని మరోసారి పరీక్షగా చూసిన మరుక్షణం సేనాపతికి తెలిసిపోయింది అసలు విషయం.

"మోసం... వంచన... కిరాతకం... కావాలనే ఎవరో ఈ ఘాతుకానికి వడి కట్టారు. దిగంబరస్వామి సృష్టించి ఇచ్చిన ఈ అమోఘశక్తిని తల్లక్రిందులు చేసేశారు. ఎవరు వాళ్ళు? ఎక్కడ వున్నారు?" కోపం భయం కలగలిసిన కంఠంతో చాలా బిగ్గరగా అరిచాడు.

అంతకు ముందు అటువంటి అరుపులే గనుక అతని నోటినుంచి వెలువడి వుంటే – ఏదో ఒక సమాధానం వచ్చి వుండేది ఆ పిశాచం దగ్గిర్నించి.

సామాన్యమైన కోతి మాదిరిగానే కళ్ళను అదేపనిగా మూసి తెరుస్తూ బొమ్మ మాదిరి నిలబడిపోయింది ఇప్పుడు.

"ఎవరు ఈ పని చేసింది? ఎవరు?" ఆగ్రహం చల్లారలేదు కాబోలు మరింత పెద్దగా అరిచాడు సేనాపతి.

"ఎవరు చేశారో తెలిస్తే నువ్వు ఏం చేయాలని అనుకుంటున్నావ్?" శ్యామలుడు తనను వారించే లోపల, పట్టుతెర చాటునుంచి ఈవలికి వస్తూ అడిగాడు అతన్ని గదాధరుడు.

ఉలిక్కిపడ్డాడు సేనాపతి. వెంటనే తనను తను కుదుట పరుచుకుంటూ "నువ్వు ఎవ్వరివి? ఏం చేస్తున్నావ్ ఈ భవనంలో?" కోరగా చూస్తూ అడిగాడు.

"వీడు వట్టి చవట మాదిరిగా వున్నాడు మిత్రమా...." వెనుతిరిగి తన స్నేహితుడి వైపు చూస్తూ అన్నాడు గదాధరుడు.

అధికం అయిపోయింది సేనాపతి ఆగ్రహం.... "నీ సంగతి నేను చెపుతాను. నీ వదరుబోతు నోటిని శాశ్వతంగా మూసివేస్తాను" అంటూ తన దగ్గిర వున్న కరవాలాన్ని ఎత్తి వేగంగా ముందుకు వచ్చాడు.

అపరిమితమైన జాలి కలిగింది ఆ దృశ్యాన్ని చూసిన శ్యామలుడికి, నవ్వుతూ నవ్విస్తూ అమాయకుడి మాదిరి కనిపించే గదాధరుడిలో దారుణమైన యోధుడు దాగుని వుంటాడు.

కత్తి యుద్ధంలోగాని, కుంతల యుద్ధంలో గాని, విలువిద్యలో గాని, ఆఖరికి మల్లయుద్ధంలో గాని అతన్ని గెలువగల మొనగాళ్ళు చాలా అరుదుగా కనిపిస్తారు.

గంగాళం మాదిరి నోటిని తెరిచి, గావుకేకలు పెడుతూ, తాను చేయ వలసిన పనులన్నిటిని సేవకులతో చేయించుకుంటూ వుండే ఆ సేనాపతికి అతన్ని ఎదిరించగల సామర్థ్యం వుండటం కల్ల. కత్తిని ముందుకు విసిరిన మూడవ క్షణికంలో ముక్కు మొగం ఏకం అయిపోయే దెబ్బలు తింటాడు... ఎటువంటి సందేహమూ అవసరం లేదు.

శ్యామలుడి ఆలోచనలే యదార్థం అయినాయి.

"నిన్ను చంపేస్తాను. నిలువుగా నరికి ముక్కలు చేస్తాను" అని ఆర్భాటంగా ప్రగల్భాలు పలుకుతూ ముందుకుపోయి గదాధరుడి మీద కలబడిన సేనాపతి రెండో క్షణికంలోనే తలక్రిందులు అయిపోయాడు.

గింగిరాలు తిరుగుతూ ఎగిరి ఎటో వెళ్ళిపోయింది అతని కరవాలం. భుజం మీద పెద్దగాయం ఒకటి ప్రత్యక్షం అవుతుండగా-వెనక్కి తూలి వెల్లకిలా పడిపోయాడు అతను.

విలాసంగా ముందుకు కదిలి ఎడమ పాదంతో అతని గుండెల్ని అదిమాడు గదాధరుడు.

"చాలు మిత్రమా... నొక్కింది ఇకచాలు. ఇంకా కొంచెం గట్టిగా నొక్కావంటే ఊపిరి అడక కళ్ళు తేలవేస్తాడు" అని అతన్ని హెచ్చరిస్తూ తెర వెనుక నుంచి ఈవలికి వచ్చాడు శ్యామలుడు.

"ఇటువంటి జంబుకాలు కళ్ళు తెరిచి వుండకూడదు. తేల వేయవలసిందే" సేనాపతి గుండెల మీది నుంచి పాదాన్ని తీయకుండా చెప్పాడు గదాధరుడు.

"నువ్వు చెపుతున్నది నిజమే కాని, అనవసరమైన ఆవేశంతో నువ్వు అసలు విషయాన్ని మర్చిపోతున్నావు" తాపీగా అన్నాడు శ్యామలుడు.

"అసలు విషయమా? అదేమిటి?" అనుమానంగా చూస్తూ అడిగాడు గదాధరుడు.

"వాడు గుటుక్కుమంటే గుడ్లు అప్పగించి చూస్తున్న ఈ భూతాన్ని వెనక్కి పంపించటం ఎలాగో నీకు తెలుసునా?" అడిగాడు శ్యామలుడు.

బొమ్మమాదిరి నిలబడి వున్న మర్కట పిశాచం వైపు చూసి, వెంటనే తన తొందరపాటును తనకు తనే సిగ్గుపడ్డాడు గదాధరుడు.

"సరైన సమయంలో సరైన మాట గుర్తుచేసి నన్ను ధన్యుడిని చేశావు. నిజంగా నువ్వు చాలా జ్ఞానవంతుడివి" వెక్కిరింపుగా అంటూ సేనాపతిని మరింతగా గాయపరిచేందుకు గాలిలోకి ఎత్తిన కత్తిని క్రిందికి దించేశాడు గదాధరుడు. గుండెల మీద మోపిన పాదాన్ని మాత్రం వెనక్కి తీయలేదు.

"ముందు మనం ఈ మర్కట భూతం గురించి మాట్లాడుకుందాము. దీని అండ చూసుకునే నువ్వు మహాదారుణానికి ఒడిగట్టావు... దీన్ని వెంటనే దాని సృష్టికర్త దగ్గరికి పంపించు" అని చెప్పాడు గదాధరుడు.

మర్కట... పిశాచం తన ఆజ్ఞల్ని తప్ప మరెవ్వరి మాటల్ని వినిపించుకోదని అతనికి అర్థమైనట్లు తెలిసి, అంత చేతకాని పరిస్థితిలో కూడా సంబరపడకుండా వుండలేకపోయాడు సేనాపతి.

"మీరు వెంటనే మీ ఆయుధాల్ని విసర్జించి, ఇప్పుడు చూసిన ఆ వినయానికి నన్ను క్షమాపణలు కోరుకోవడం చాలా మంచిది" గంభీరంగా అన్నాడు సేనాపతి.

"అబ్బో... మాటలు మహాదర్పంగా వస్తున్నాయి. కారణం ఏమిటో!" వెక్కిరింపుగా అడిగాడు గదాధరుడు.

"మర్కట పిశాచాన్ని నిరోధించగల శక్తి నాకు తప్ప ఇంకెవ్వరికీ లేదు. మీరు ఏంచేశారో నాకు తెలియదు. కాని ఈ భూతాన్ని ఇలా కదలకుండా ఎంతోసేపు నిలబెట్టి వుంచలేను. ఇప్పుడో ఇంకా కొద్దిసేపటికో అది తేరుకుంటుంది. నేను తల ఊపిన వెంటనే మిమ్మల్ని ఎందుకూ పనికిరాని వారిగా మార్చివేస్తుంది" మరింత ఠీవిగా చెప్పాడు సేనాపతి.

"చింతచచ్చినా పులుపు చావలేదని అంటారు పెద్దలు. ఆ మాటకు నిలువెత్తు సాక్ష్యం ఇతనే" శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

"మాటలతో కాలక్షేపం చేయటం దేనికి?" విసుగ్గా అన్నాడు శ్యామలుడు.

"సేనాపతుల వారూ... ముందు ఈ భూతాన్ని వెనక్కి పంపించేయండి. మీ నోటితో మీరే అందుకు అవసరమైన ఆజ్ఞలు ఇవ్వండి" అన్నాడు గదాధరుడు.

"ఇవ్వను గాక ఇవ్వను. నేను మీ బెదిరింపులకు తల ఒగ్గను" మొండిగా సమాధానం ఇచ్చాడు సేనాపతి.

*　　*　　*　　*　　*

ఊపిరి బిగపట్టి పళ్ళెరంలోని నీటి మీద కనిపిస్తున్న దృశ్యాల్నే తదేకంగా చూస్తున్న యువరాణికి నవ్వు ఆగలేదు. తాను అంతకు ముందువరకూ పడిన బాధలన్నీ మరిచిపోయినట్టు పకపకా నవ్వింది.

"బంగారు తల్లివి నువ్వు. ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ వుండాలి" ఆమె శిరస్సు మీద చేయివేసి నిమురుతూ ఆప్యాయంగా అన్నది వృద్ధురాలు.

"చూడు అవ్వా... ఆ సేనాపతి మాట్లాడుతున్న మాటలు కోపాన్ని తెచ్చుకోవాలో వద్దో తేల్చుకోలేక ఎలా సతమతం అయిపోతున్నాడో చూడు" గదాధరుడి వైపు చూపిస్తూ మరింత వినోదంగా అన్నది యువరాణి.

ఆమె నోరు తెరిచిన వెంటనే వృద్ధురాలు చెప్పినట్లు నియమ భంగమై, నీటిమీద కనిపిస్తున్న దృశ్యం మాయం కాబోయింది.

"ఆ నగరంలో జరుగుతున్నది ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక నీకు వుంటే ఇక ముందు మాట్లాడ కూడదు...." అంటూ మళ్ళీ చేతుల్ని ఊపింది వృద్ధురాలు.

మాయం కాబోయిన దృశ్యం తిరిగి నిలకడగా కనిపించసాగింది.

*　　*　　*　　*　　*

"వీడు మహావీరుల్లో కెల్లా మొదటిరకం మహావీరుడు. వట్టొట్టి మాటలతో మనం అడిగిన పని చేయడు" శ్యామలుడి వైపు చూస్తూ చెప్పాడు గదాధరుడు.

"అయితే ఇప్పుడు ఏం చేద్దాం?" అడిగాడు శ్యామలుడు.

"వాడిని చంపేద్దాం...."

"మరి ఆ భూతం సంగతి?"

"వాడు ఆజ్ఞ ఇవ్వకపోతే అది నిలబడిన చోటినుంచి ఒక్క అడుగు కూడా ఆవలకి వేయదు. దాన్ని ఈ మందిరంలోనే వుంచి తలుపులు మూసేద్దాం. తిరిగి ఇంకెప్పుడూ తెరవటానికి వీలు లేకుండా తలుపులకు అడ్డుగా ఒక గోడ నిర్మింపచేద్దాం" అన్నాడు గదాధరుడు.

"అంటే ఈ మందిరంలోనే దాన్ని సజీవ సమాధి చేసేద్దామంటారా?" తనకు ఏమీ తెలియనట్లు అమాయకంగా అడిగాడు శ్యామలుడు.

అవునన్నట్లు తల ఊపాడు గదాధరుడు.

"నీ ఆలోచన చాలా బాగుంది...." అంటూ మందిర ద్వారం వైపు కదిలాడు శ్యామలుడు. "ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

నిజమైన ఆశ్చర్యమే అది. శ్యామలుడి ఆలోచన అర్థం కాలేదు అతనికి.

"భవనం వెనుక ద్వారంలో నుంచి నగరంలోకి వెళ్ళి గోడలు నిర్మించటంలో అనుభవమున్న పని వారిని పిలుచుకు వస్తాను. ఈ భూతాన్ని ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది. ఈ లోపల నువ్వు ఈ మహావీరుడిని పరలోకానికి పంపించి సిద్ధంగా వుండు" అన్నాడు శ్యామలుడు.

కీచుగా శబ్దం చేశాడు సేనాపతి.

"వద్దు... నన్ను చంపవద్దు... నేను మీరు చెప్పినట్లే చేస్తాను...." అంటూ.

అప్పుడు కూడా అతని గుండెల మీది పాదాన్ని వెనక్కి తీసుకోలేదు గదాధరుడు. "వట్టొట్టి మాటలు మాకు అనవసరం. ముందు దాన్ని పంపించి చూపు" అన్నాడు.

తల తిప్పి మర్కట పిశాచం వైపు చూశాడు సేనాపతి.

అతనితో పాటు తను కూడా అటుకేసి చూశాడు గదాధరుడు. మందిరం వెలుపలికి పోబోయినట్లు నటించిన శ్యామలుడు మాత్రం అలా చేయలేదు. తాను సేనాపతి వైపే చూస్తున్నాడు.

"నువ్వు వెంటనే కదిలి –" అని మొదలు పెట్టాడు సేనాపతి.

"నీ సృష్టికర్త దిగంబరస్వామి దగ్గరికి వెళ్ళిపో" అంటాడని భావించిన గదాధరుడికి ఒక్క క్షణికం ఆలస్యంగా అర్థం అయింది ముంచుకు రాబోతున్న ప్రమాదం ఏమిటో.

చూపులతో అవతలివారిని వశపరుచుకునే శక్తిని కోల్పోయిన ఆ పిశాచం యాంత్రికంగా వున్న సమయంలో కూడా సేనాపతి మాటల్ని ఆలకిస్తుందన్న సంగతి గుర్తుకు రావటమే అందుకు కారణం.

ఆ పిశాచి వశపరుచుకున్న వారందరినీ భవన రక్షకుల మీదికి ఉసికొల్పి దారుణమైన విధ్వంసం సృష్టించిన ఘనుడు అతను. ఇప్పుడు వేరే విధంగా ప్రవర్తిస్తాడని అనుకోవటం పెద్ద భ్రమ.

గదాధరుడి కంటే ముందుగా ఆ సంగతిని గ్రహించి చూపుల్ని అతని మీదినించి ప్రక్కకు తిప్పకుండా నిలబడిన శ్యామలుడు మెరుపుకంటే వేగంగా కదిలాడు. తన దగ్గిర వున్న ఆయుధాన్ని అతిబలంగా విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ వచ్చింది అది. ఫెడీమని శబ్దం చేసింది సేనాపతి నోటికి తగిలి.

గావురుమని అరవాలని అనుకున్నాడు సేనాపతి. అప్పుడు కలిగిన బాధను భరించటం చేతకాక, శబ్దం అతని నోటి నుంచి వెలుపలికి రాకముందే స్పృహతప్పిపోయింది. తల వ్రేలాడబడిపోయింది.

"నువ్వు వెంటనే కదిలి–" అని అతను ఇచ్చిన అజ్ఞను ఆలకించి అడుగు కదపటానికి సిద్ధం అయింది మర్కట పిశాచం.

ఆ ఆజ్ఞ అర్థాంతరంగా మధ్యలోనే ఆగిపోవడం వల్ల ఎలా వున్నది అలాగే కదలకుండా వుండిపోయింది.

"వాడిలో మార్పువస్తుందని ఆశించటం వృథా.... వాడు మారడు... వాడి మనసు మంచి మార్గంలోకి మరలదు... ఈ భూతక్కిని ఈ నగరంలో నుంచి అవతలికి పంపే మార్గం మనకి తెలియదు" తెలివితప్పిన సేనాపతి గుండెల మీదినించి పాదాన్ని వెనక్కి తీసుకుంటూ అన్నాడు గదాధరుడు.

సేనాపతి మారకపోతే, అతని మనస్సు మంచి మార్గంలోకి మరలకపోతే జరిగేది ఏమిటో శ్యామలుడికి తెలుసు. తెలివి వచ్చిన వెంటనే మరోసారి ఆ పిశాచాన్ని ఉద్దేశించి ఏవేవో ఆజ్ఞలు ఇస్తాడు. ఆగిపోయిందని అనుకుంటున్న మారణకాండ మళ్ళీ మొదలు అవుతుంది.

"ఆలోచన అనవసరం మిత్రమా. వాడి తలను తెగనరికేస్తే బాగుంటుంది" అన్నాడు గదాధరుడు.

ఆ మాటలు అక్షర సత్యం అని తెలిసినా కూడా తల ఊపలేక పోయాడు శ్యామలుడు. చూస్తూ చూస్తూ అవతలి మనిషి ప్రాణాలను బలితీసుకోవటం ఎంతవరకు సమంజసం!

"ఏదో ఒకటి త్వరగా తెమిల్చి చెప్పు. ఎంతసేపు ఈ మందిరంలో బొమ్మల మాదిరి నిలబడి వుంటాము?" విసుగ్గా అన్నాడు గదాధరుడు.

"ముందు వాడి కరచరణాలను గట్టిగా కట్టేయ్... నోరు తెరిచి ఆజ్ఞలు ఇవ్వకుండా నోటిని కూడా బంధించివేయ్...." అంటూ ఆ మందిర ద్వారం దగ్గరికి పోయి తలుపుల్ని గట్టిగా మూసి గడియలు పెట్టాడు శ్యామలుడు.

"ఇందాక నువ్వు ఏదో చిత్తరువును చూపించి ఇంకేదో చెప్పబోయావు. అదేమిటో ఇప్పుడు చెప్పు...." అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా తానే ఆ చిత్తరువును సమీపించాడు.

అతని చేతులు పడగానే, అటూఇటూ కదిలిందా చిత్తరువు. గట్టిగా పట్టుకుని ఒక ప్రక్కకు లాగేసరికి జరజరమని శబ్దం చేస్తూ జరిగింది. ఇద్దరు మనుష్యులు తేలికగా ప్రవేశించగల రహస్య మార్గం ఒకటి దాని వెనుక ప్రత్యక్షం అయింది.

"నగర పాలకుడు ఈ మార్గం గుండానే అవతలికి పారిపోయి వుంటాడు. సందేహం లేదు" తల ముందుకు వంచి ఆ మార్గంలోని గాలిని వాసన చూస్తూ అన్నాడు శ్యామలుడు.

"ఎలా చెప్పగలవు?" వంచిన తల ఎత్తకుండా సేనాపతి కాళ్ళూ చేతుల్ని ఒక వస్త్రపు పీలికతో కదలకుండా కట్టి పడవేస్తూ అడిగాడు గదాధరుడు.

"నువ్వే వచ్చి చూడు" అన్నాడు శ్యామలుడు.

సేనాపతిని బంధించటం పూర్తి చేసి, మరికొన్ని గుడ్డముక్కల్ని అతి బలవంతంగా అతని నోట్లో కుక్కాడు గదాధరుడు. "దేవుడు దిగి వచ్చి మాట్లాడమని సైగ చేసినా వాడి నోటి వెంట మూలుగులు తప్ప మాటలు రావు" అంటూ అతన్ని ధాన్యపు మూటను ఈడ్చినట్లు ఈడ్చుకుంటూ రహస్యమార్గం దగ్గరికి తీసుకు వచ్చాడు. తాను కూడా తలను ముందుకు పెట్టి ఆ మార్గంలోని గాలిని గట్టిగా వాసన చూశాడు.

సుమధురమైన పరిమళం ఆ ప్రదేశంలో వున్నట్లు తెలిసి వచ్చింది అతనికి. "అంతఃపుర స్త్రీలు అలంకరణలు చేసుకునేటప్పుడు ఉపయోగించే కస్తూరి వాసన...

ఆడవారు ఎవరో ఈ మార్గంలో ప్రయాణం చేసివుంటారు” తాను గమనించిన అంశాన్ని స్నేహితుడికి చెప్పాడు.

ఆ తరువాత ఒక్కక్షణికం పాటు కూడా ఆగలేదు శ్యాములుడు. వేగంగా నడవటం మొదలు పెట్టాడు ఆ మార్గంలో.

సుశిక్షుతులైన పని వాళ్ళు ఎంతో నైపుణ్యంతో మలచిన మార్గం అది. చీకటి మూలకంగా ఇబ్బందులు ఎదురు కాకూడదని, అక్కడక్కడా విలువైన మణి దీపాలను ఆ మార్గపు గోడలకు బిగించి వుంచారు.

వెన్నెల వెలుగుల వంటి వెలుతురును వెలువరిస్తున్నాయి ఆ దీపాలు. ఆ మసక వెలుగులో సూటిగా ప్రయాణం చేసి ఘడియన్నర కాలం గడిచిన తరువాత ఒక ప్రదేశంలో తిరిగి బయటికి వచ్చారు వారిద్దరూ.

“కేశవస్వామి ఆలయం ఇది. నగర పాలకుడికి ఎంతో ఇష్టమైన ప్రదేశం” ఆలయం వెనుక వుండే పూతోటలో ఒక పెద్ద గోరింట పొద దగ్గిర రహస్య మార్గంలో నుంచి బయటికి వస్తూ అన్నాడు గదాధరుడు.

“నీకు తెలియకుండానే ఎవరికీ అంతుబట్టని ఒక పెద్ద రహస్యాన్ని బట్టబయలు చేశావు... గమనించావా?” అతన్ని అనుసరించి తాను కూడా వెలుపలికి వస్తూ అన్నాడు శ్యాములుడు.

“ఏమిటో ఆ రహస్యం?” అడిగాడు గదాధరుడు.

“మన సేనాపతి భావిస్తున్నట్లు నగర పాలకుడు నగరం విడిచి పారిపోయి వుండడు. ఈ మార్గాన్నే అనుసరించింది నిజమే. అయితే అతడు నగరంలోనే వుండి వుంటాడు” అన్నాడు శ్యాములుడు.

“యదార్థం పలికావు. కాని తిరిగి నన్ను సంకటంలోకి నెట్టావు” అన్నాడు గదాధరుడు.

ఆ సంకటం ఏమిటో అతను వివరించి చెప్పవలసిన అవసరం లేక పోయింది. రహస్య మార్గాలద్వారా నగరం విడిచివెళ్ళిన వారు అడవుల్లోకో, రహదారుల్లోకో వెళతారు. వారి జాడల్ని వెతికి పట్టుకోవటం చాలా తేలిక అటువంటి ప్రదేశాల్లో.

అలా చేయకుండా నగరంలోనే వుంటే ఎటుగా వెళ్లినట్లు? ఎవరి దగ్గిర ఆశ్రయం పొందినట్లు... నగరంలోని ఇళ్ళన్నిటినీ వెతికితే తప్ప జాడలు బయటపడవు.

"మనం ముందుగా అనుకుంటున్నట్టు నగరపాలకుడు మందమతి కాదు... తనను అభిమానించే పౌరులు వున్నారని తెలిసి నగరంలోనే తలదాచుకున్నాడని నా అభిప్రాయం...." సాలోచనగా అన్నాడు గదాధరుడు.

"అయితే ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి?" అడిగాడు శ్యామలుడు.

"ముందు ఆ సేనాపతిని తీసుకువచ్చి ఈ ప్రదేశంలోనే పడవేద్దాం, మనం ఈ నగరంలోకి వచ్చిన పని అలాగే వుండిపోయింది. అది పూర్తిచేసిన తర్వాత నగర పాలకుడి గురించి ఆలోచిద్దాము" అన్నాడు గదాధరుడు.

నగరంలోకి వచ్చిన పని అంటే రంగమణి దుర్మార్గులను అడ్డుకోవటం. అధికారుల ఆగడాలకు బలైపోయిన పౌరులను ఆదుకోవడం...

సాలోచనగా తల ఊపుతున్న శ్యామలుడిని అక్కడే వదిలి మరోసారి రహస్య మార్గంలోకి పరిగెత్తాడు గదాధరుడు.

తెలివి వచ్చింది అలంకార మందిరంలో పడి వున్న సేనాపతికి. చిన్నచిన్న శబ్దాలు చేస్తూ శిలా విగ్రహంలా నిలబడి వున్న మర్కట పిశాచం దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాడు అతను.

"నీకు ఈ భూమి మీద నూకలు చెల్లిపోయి చాలా సమయం అయింది. ఎక్కడో ఏదో మూలన దాగుకుని వున్న నీ అదృష్టం నీ ప్రాణాలు పోకుండా కాపాడుతోంది" అంటూ అతన్ని అమాంతం భుజాల మీదికి ఎత్తుకున్నాడు గదాధరుడు.

రహస్య మార్గంలోకి అడుగుపెట్టి, అవతలికి జరిపిన చిత్తరువును తిరిగి యధా స్థానంలోకి నెట్టి ఆ మార్గాన్ని మూసివేశాడు.

భుజాల మీది బరువు కారణంగా రెండు ఘడియలు పట్టింది అతనికి శ్యామలుడి దగ్గరికి చేరుకోవటానికి.

"అధికంగా శ్రమ పడడం వల్ల కాబోలు నాకు ఆకలి చాలా అధికం అయిపోయింది. ఏదో ఒకటి పండో ఫలమో ఆరగించకపోతే నిలబడటం కూడా కష్టమే అనిపిస్తోంది" సేనాపతిని గోరింట పొదలో క్రింద పడుకోబెడుతూ స్నేహితుడికి చెప్పాడు.

"నగరం అంతా నిర్మానుష్యంగా తయారయింది. మనకు ఆహారం ఇచ్చే మనుషులు కనిపించడం కష్టమే అవవచ్చు" అంటూ ఆలయ ప్రాంగణంలో నుంచి వెలుపలికి దారి తీశాడు శ్యామలుడు.

*　　*　　*　　*　　*

"అవ్వా. అసలు వాళ్ళు నగరంలోకి ఎందుకు వచ్చారు? వాళ్ళు ఎవరై వుంటారు?" పళ్ళెరంలోకి చూస్తున్న యువరాణి అడిగింది వృద్ధురాలిని.

"ఎంతో సేపటినుంచి చూస్తున్నావు. ఇంకా అర్థం కాలేదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది వృద్ధురాలు.

పెదవులు విరిచి తల అడ్డం తిప్పింది యువరాణి.

"రాజ్యాలకు రాజ్యాలకు దోచుకునే గజదొంగ శ్యామలుడు. అతని సహచరుడు గదాధరుడు." చెప్పింది వృద్ధురాలు.

కనుల్ని పెద్దవి చేసి యువరాణి వంక చూసి పెద్దగా నవ్వింది.

"మాండలీకుడి వంటి దుష్ట దుర్మార్గుడిని ఎదిరించటాన్ని చూసిన వెంటనే రెండో ఆలోచన లేకుండా వారెవరో గుర్తించి వుండవలసింది. అనుమానం వచ్చింది గాని, ధృవీకరించుకోవాలన్న ఆలోచన రాలేదు. ఇప్పుడు నికరంగా తెలిసింది" అంటూ గాఢంగా నిట్టూర్చింది వృద్ధురాలు.

"వారిద్దరూ వీరకుమారులు. శౌర్యసాహసాలు నిండుగా వున్నటువంటి వారు. మాటలు కూడా బహుమార్దవంగా మర్యాదగా వున్నాయి. తప్పకుండా ఏదో ఒక గురుకులంలో శాస్త్రవిద్యలు అభ్యసించే వుంటారు. అటువంటి ధీరోదాత్తులు అందరూ అసహ్యించుకునేటువంటి బందిపోటు దొంగలుగా మారటం ఏమిటి?" అడిగింది యువరాణి.

"వారెవరో తెలిసిన వెంటనే నాకు కూడా వచ్చింది ఆ అనుమానం" అన్నది వృద్ధురాలు.

"అవ్వా... నీ మంత్రశక్తులను ఉపయోగించి వారి గతం తెలుసు కోవటం కుదరదా?" అడిగింది యువరాణి.

"తల్లీ... నీ మంత్రాలకు శక్తి కొంతవరకే వుంటుంది. గత రెండు మూడు మాసాల క్రితం జరిగిన సంఘటనలను మాత్రమే నేను చూడగలను..." అంతకు మించి వెనక్కి వెళ్ళటానికి ఇప్పుడు నాకు వున్న శక్తి సరిపోదు...." బరువుగా చెప్పింది వృద్ధురాలు.

"మాండలీకుడికి చేతనవుతుందా?" అడిగింది యువరాణి.

"చేతకాదు...." స్పష్టంగా సమాధానం ఇచ్చింది వృద్ధురాలు.

"వాడు నీకంటే శక్తి అధికంగా కలవాడని నువ్వే ఒప్పుకుంటున్నావు. మరి నువ్వు చేయగల పనిని వాడు ఎందుకు చేయలేడు?" ఆశ్చర్యంగా అడిగింది యువరాణి.

"చేయగలిగి వుంటే ఈ పాటికి చేసేసి వుండేవాడు. నిన్ను బంధనాల్లో నుంచి తప్పించి ఇక్కడకు తీసుకువచ్చిన దృశ్యాలను కూడా చూసి వుండేవాడు. ఇంతవరకూ అటువంటి పని జరగలేదు కాబట్టి, నాకున్న ఈ శక్తి వాడికీ లేదని నిశ్చయం అవుతోంది" అన్నది వృద్ధురాలు.

పూర్తిగా సమసిపోలేదు యువరాణి మనస్సులో అడుగుపెట్టిన ఆ సందేహం. అయితే ఎదురు మాట్లాడలేదామె.

"ఎదుట ఏం జరుగుతున్నదో గమనించటాన్ని వదిలేసి మనం వేరే మాటలు మాట్లాడుకుంటున్నాము. ముందు నగరంలో పరిస్థితి ఎలా వున్నదో తెలుసుకోవటం బాగుంటుంది" అన్నది.

మాటల్లో పడి నీళ్ళ పళ్ళెరాన్ని గురించి మర్చిపోయింది వృద్ధురాలు. నీళ్ళమీద అంతకుముందు వరకూ కనిపించిన దృశ్యాలు మాయం అయిపోయి వున్నాయి. కనులు మూసుకుని చేతుల్ని చిత్ర విచిత్రంగా తిప్పుతూ ఏవో మంత్రాలను ఉచ్ఛరించింది ఆమె.

పది క్షణికాల తరువాత కూడా ఫలితం కనిపించలేదు. పళ్ళెరంలోని నీటిలో దృశ్యాలు కనిపించటం కాదు గదా-చిన్నపాటి కదలికకూడా అగుపించ లేదు.

"నా శక్తి యొక్క అవధుల్ని నేను మర్చిపోవడం వల్ల వచ్చిన బాధ ఇది. తిరిగి మనం రేపు ఉదయం మాత్రమే ఆ నిరాకారుల్ని చూడగలం" గట్టిగా నిట్టూరుస్తూ చెప్పింది.

ముఖం మీదికి పడుతున్న ముంగురుల్ని వెనక్కి నెట్టుకుంటూ పళ్ళెరం దగ్గర్నించి లేచింది యువరాణి.

"నాకు నిద్ర వస్తోంది అవ్వా. నిర్భయంగా నిద్దురపోయి ఎంతోకాలం అయినట్లుగా అనిపిస్తోంది" తాను పడిన బాధల్ని గుర్తుచేసుకుంటూ అన్నది.

ఆమె భుజాల చుట్టూ చేతులు చుట్టి ప్రక్కనే వున్న గదిలోకి తీసుకు పోయింది వృద్ధురాలు.

మెత్తటి శయ్య ఉన్నది ఆ ప్రదేశంలో. చలిగాలి ప్రసరించకుండా మందపాటి తెరలు వ్రేలాడుతున్నాయి కిటికీలకు అడ్డంగా.

"హాయిగా నిద్దురపో తల్లీ... తిరిగి నువ్వు లేచేసరికి ఆ మాండలీకుడి ఆట కట్టించే ఉపాయాలను గురించి ఆలోచిస్తాను" సాదరంగా చెప్పింది వృద్ధురాలు.

కృతజ్ఞతా పూర్వకంగా చూసి శయ్యమీద మేను వాల్చింది యువరాణి. కనులు మూసుకున్నది. వెంటనే ఆమె కనుల ముందు ప్రత్యక్షం అయ్యారు శ్యామలుడు, గదాధరుడు.

* * * * *

ఆలయం వెనుక గోరింట పొదలో సేనాపతిని వదిలిన తర్వాత స్నేహితులు ఇద్దరూ రాచవీధిలోకి వచ్చారు.

అంతకుముందు శ్యామలుడు చెప్పిన విధంగానే ఒక్క మనిషి కూడా అగుపించలేదు వారికి. నగర పాలకుడి భవనం మీద దాడి జరగబోతున్నదని తెలిసిన మరుక్షణం ఎవరి ఇళ్ళల్లోకి వారు వెళ్ళిపోయి తలుపుల గడియలు పెట్టుకున్నారు అందరూ.

సగం మాత్రమే మూతపడి కనిపించింది గదాధరుడికి ఒక పండ్ల అంగడి. పూర్తిగా మూసి తలుపు తాళం వేసుకునే ధైర్యం లేక కాబోలు – తన నివాసానికి పారిపోయినట్లున్నాడు అంగడి యజమాని.

మిగల పండిన అరటిపండ్ల గెలను చూసి హాయిగా నిట్టూర్చాడు గదాధరుడు. తాను కొన్ని పండ్లను ఆరగించి, స్నేహితునికి మరికొన్ని అందించాడు.

"నగరం క్షేమంగా వున్నదని తెలిసిన వెంటనే తిరిగి వచ్చి, మనల్ని తిట్టుకుంటాడు ఈ అంగడి యజమాని" అన్నాడు శ్యామలుడు.

"మనం మామూలు మనుష్యులం కాదు. గజ దొంగలం. మనల్ని తిట్టుకోవటం సహజం... ఆ తిట్లే మనకి దీవెనల వంటివి...." అంటూ తన దుస్తులలో నుంచి రెండు నాణేలను తీసి, ఏ గెలలో నుంచి తాము ఫలాలను ఆరగించారో ఆ గెల దగ్గిర పెట్టాడు గదాధరుడు.

అక్కడి నుంచి సూటిగా నగర పాలకుడి భవనం వెనుక భాగంలోకి పోయారు వారిద్దరూ.

భవన రక్షకులనందరిని నిర్ధాక్షిణ్యంగా వధించిన తర్వాత తాము ఏమి చెయ్యాలో చెప్పేవాళ్ళు లేక పోవడం వల్ల పోతపోసిన విగ్రహాల మాదిరి గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు తిరుగుబాటుకు సిద్ధమైన భటులు.

"సేనాపతిని వధించటమూ, ఆ భూతాన్ని అవతలికి పంపించటం చాలా ముఖ్యమని అనుకున్నాను. కాని ఆ రెండు పనులు ఏమంత ముఖ్యమైనవి కావు. ఈ దురదృష్టవంతుల్ని తిరిగి మామూలుగా మార్చటం అత్యవసరం" వారిని చూస్తూ అన్నాడు గదాధరుడు.

"మార్చటం చాలాతేలిక. కాని మారిన తర్వాత వారిని గద్దించి సరైన మార్గంలో నడిపించటం ముఖ్యం. లేకపోతే సేనాపతి మాదిరిగానే అక్రమాలకు పాల్పడతారు... వీరందరూ వట్టి దురాశపరులు అని మర్చిపోకు" అన్నాడు శ్యామలుడు.

"అయ్యలూ... మేము ఇక్కడ వున్నాము...." అంటూ సన్నపాటి గొంతుకలు వినిపించేసరికి ఆగిపోయింది వారి సంభాషణ.

సేనాపతి కొట్టిన దెబ్బల కారణంగా మర్కట పిశాచం యొక్క ఆకర్షణ శక్తి నుంచి బయటపడిన నగర పాలకుడి సేవకురాళ్ళు నిలబడి వున్నారు వంద ధనువుల దూరంలో.

"మర్చిపోయాము మిత్రమా... వారిని మనమే ధనపు సంచులు పడవేసిన బావి దగ్గిర నిలబడి వుండమని చెప్పాము" అంటూ వేగంగా అడుగులు వేసి ఆ బావిని సమీపించాడు గదాధరుడు.

అవసరం అయితే ఎటువంటి ఆధారం కోసం ఎదురు చూడకుండా క్రిందికి దిగేందుకు చిన్నచిన్నసోపానాలు నిర్మించబడి వున్నాయి ఆ బావి గోడల మీద.

తన కరవాలాన్ని బావి గట్టు దగ్గిర వదిలి లోపలికి దిగాడు అతను. ఒక దాని తరువాత ఒకటిగా నీటిలోకి విసిరిన ధనపు సంచుల్ని పైకి తీసుకు వచ్చాడు.

ఒక సంచిని తెరిచి అందులోని బంగారు నాణేలను దోసిటితో తీసి ఆ సేవకురాళ్ళకు పంచాడు శ్యామలుడు.

"మేము ఇక్కడే వుంటాము. మీరు నగరంలోకి వెళ్ళి ఆర్తులు ఎవరైనా వుంటే వారందరినీ పంపించండి" అని వారికి చెప్పాడు.

నీటిలో పడవేసిన ఆఖరి ధనపు మూటను భుజంమీద వేసుకుని పైకి తీసుకువస్తున్న గదాధరుడికి వళ్లు జలదరించింది ఆ మాటల్ని ఆలకించేసరికి.

"వద్దు మిత్రమా... అటువంటి మాటలు మాట్లాడవద్దు" అని అరిచాడు. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

"రండి... అందరూ రండి... ధర్మాత్ములు ఎవరో వచ్చి కోరినంత ధనం దానం చేస్తున్నారు. వచ్చేయండి. అందరూ వచ్చేయండి...." పెద్దపెద్ద గొంతుకలతో కేకలు పెడుతూ రాచవీధిలో పరుగులు మొదలుపెట్టారు వాళ్ళు.

తలుపులు గడియలు పెట్టుకుని ప్రాణాల్ని అరిచేతుల్లో వుంచుకుని భయం భయంగా దిక్కులు చూస్తున్న పౌరుల్లో వెంటనే వచ్చింది కదలిక. గుంపులు గుంపులుగా వీధుల్లోకి వచ్చేశారు అందరూ.

ఎంతో సమయం అవసరం లేకపోయింది అసలు విషయం అందరికీ అర్థం కావటానికి. అర్థమైన మరుక్షణం మొదలయింది తొక్కిసలాట....

"నీకు ముందుచూపు కొద్దిగా కూడా లేదు మిత్రమా... ప్రతి మనిషి నీ కళ్ళకు ఆర్తుడి మాదిరిగానే కనిపిస్తాడు. ఇప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నువ్వు నేను ఆర్తులమైపోతాము...." కోపంగా అంటూ బావి మీదికి ఎగబడుతున్న పౌరులను వెనక్కి నెట్టే ప్రయత్నం చేశాడు గదాధరుడు.

ఫలించలేదు అతని ప్రయత్నం. "బంగారు నాణేలు నాకు కావాలి... అవతల నా కూతురి పెళ్ళి వుంది. ఒకటి రెండు చాలవు. కనీసం వెయ్యి నాణేలయినా నాకు ఇచ్చి తీరాల్సిందే" అంటూ అతన్ని వెనక్కినెట్టి తనే ఒక ధనపు మూటను వశపరుచుకోబోయాడు ఒక పౌరుడు.

"పాచికల ఆటలో సర్వస్వం పోగొట్టి మమ్మల్ని బిచ్చగాళ్ళను చేసి వేశాడు నా మొగుడు. నాకు ఒక సంచి కావాలి" అంటూ తను కూడా అతన్ని వెనక్కి నెట్టింది ఒక మహిళ.

శ్యామలుడు చటుక్కున కదిలి గట్టిగా పట్టుకుని ఉండకపోతే వెనక్కితూలి బావిలో పడిపోయి వుండేవాడు గదాధరుడు.

"అంతా నీ మూలకంగానే వచ్చింది. నీ కళ్ళకు అందరూ మంచిగానే కనిపిస్తారు. అసలు ఈ నగరంలో బంగారు నాణేల పేరు చెవినపడితే పిచ్చెక్కిపోయే జనం తప్ప నిబ్బరంగా నిలబడగల వాళ్ళు ఎవరూ వున్నట్లు నాకు కనిపించటం లేదు" అంటూ బావిగట్టు మీద పెట్టిన తన ఆయుధాన్ని తీసుకున్నాడు గదాధరుడు.

"మంచిమాటలు మీకు పనికి రావు. మీకు సేనాపతి వంటివాడే తగిన నాయకుడు" అంటూ రాక్షసుడి మాదిరి ఆ పౌరుల మీదికి ఎగబడ్డాడు.

గిరగిరా తిప్పుతున్న అతని ఆయుధం తమకు తగిలితే ఏమౌతుందో తెలుసు కాబట్టి. వేగంగా వెనక్కి పరిగెత్తారు జనం.

"వరుసల్లో నిలబడండి. తిరిగి ఇంకోమారు మీదికి వచ్చారంటే మీ తలలు నరికి మీ చేతుల్లోనే పెడతాను" కనులు ఎర్రచేసి, గుండెలు జలదరించే స్థాయిలో  అరిచాడు అతను.

అయిదు క్షణికాల్లో తమ అత్రాన్ని అణుచుకుని అతను కోరినట్లు వరుసల్లో నిలుచున్నారు పౌరులు.

సంచుల మూటలు విప్పి వాటిలోని నాణేలన్నిటినీ బావిగట్టు దగ్గిర గుట్టగా పోశాడు శ్యామలుడు.

ప్రశాంతంగా తన వద్దకు వచ్చిన వారందరి దోసిళ్ళను నాణేలతో నింపాడు గదాధరుడు.

అమాయకంగా చూస్తూ భయం భయంగా వచ్చిన చిన్నపిల్లల మెడల్లో బంగారు పతకాలు వేశాడు. మణిమయ మరకత భూషణాలను నవ్వుతూ అందించాడు.

నగరం నగరమంతా వరుసలో నిలబడి అతని ముందు చేతులు జాచింది. మంచి మంచి దుస్తులు ధరించిన వారు కూడా కటిక పేదవారి మాదిరి నటిస్తూ నాణేలను పుచ్చుకున్నారు.

"రంగమణి ఆటలు అప్రతిహతంగా కొనసాగటానికి కారకులు ఈ నగర పౌరులే... ఇంతటి దురాశపరుల్ని నేను ఇంకే నగరంలోను చూడలేదు." ఆఖరి మూటలోని నాణేలను ఇద్దరు పౌరులకు పంచి చేతులు దులుపుకుంటూ అన్నాడు గదాధరుడు.

"అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లు ఎవరో కూడబెట్టుకున్న సంపద ఇది. నీది కాదు. నీ సంపాదన ధారపోసినట్లు బాధ పడడం దేనికి?" వెక్కిరింపుగా అంటూ చుట్టూ చూశాడు శ్యామలుడు.

"ఎందుకు అలా దిక్కులు చూడటం?" విసుగునిండిన కంఠంతో అడిగాడు గదాధరుడు.

"రంగమణిని గురించి. ఆమెకు సహకరించిన సేనాపతిని గురించి మనకు తెలియ చెప్పిన వృద్ధుడు ఇంతవరకూ నాకు కనిపించలేదు" అన్నాడు శ్యామలుడు.

ధనాన్ని పంచటం మొదలుపెట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా తృప్తి చెందినట్లు తల ఊపాడు గదాధరుడు.

"ఈ నగరంలోని వారందరూ అతి స్వార్ధపరులని ఇందాక నేను చెప్పిన మాటల్ని వెనక్కి తీసుకుంటున్నాను. నిజమే. అతను గాని, అతనికుటుంబ సభ్యులు గానీ ఎవరూ ఇక్కడికి రాలేదు" అంటూ బావిగట్టు దగ్గిర ఒక బండరాయి చాటున పెట్టి వుంచిన పెద్ద మూటను భుజంమీద వేసుకున్నాడు.

"అదేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

"రంగమణి భవనంలో నుంచి మనం తీసుకువచ్చిన ధనపు సంచుల్లో ఇది కూడా ఒకటి. దాన్ని ఆ వృద్ధుడికే ఇవ్వడం సముచితంగా వుంటుంది" అంటూ నడక మొదలుపెట్టాడు.

అతని ఆలోచన ఏమిటో తెలిసిపోవడం వల్ల ఎదురు ప్రశ్నలు వేయకుండా వెంట నడిచాడు శ్యామలుడు.

సూటిగా అంతకుముందు రోజు ఏ ఆలయం దగ్గర ఆ వృద్ధుడిని కలుసుకున్నారో అదే ఆలయానికి కొద్దిసేపటి తర్వాత చేరుకున్నారు వారిద్దరూ.

చింకిపాతల్ని వదిలి, శుభ్రమైన దుస్తుల్ని ధరించి వారి కోసమే ఎదురు చూస్తున్నట్లు నిలబడి వున్నాడు వృద్ధుడు.

స్నేహితులిద్దరికీ అల్లంత దూరంలో వుండగానే గమనించింది కాబోలు పరుగు పరుగున ఎదురు వచ్చింది అతని మనుమరాలు.

ముద్దుగా తల నిమిరాడు గదాధరుడు. బుగ్గల్ని ప్రేమగా పుణికాడు. "ఈ రోజుతో మీ కడగండ్లు దూరమైపోయినట్లే" అంటూ ధనపు మూటను వృద్ధుడికి అందించాడు.

నీటితో నిండి పోయాయి ఆ వృద్ధుడి కనులు. "ఏ తల్లికి పుట్టిన వారోగాని గంధర్వుల మాదిరిగా వున్నారు.... సామాన్య మానవులకి ఇటువంటి విశాల హృదయం వుండదు" అంటూ ముందుకు వంగి వారి పాదాలకు నమస్కరించ బోయాడు.

ఎగిరి వెనక్కిదూకారు ఇద్దరూ. "వయసులో మాకంటె చాలా పెద్దవాడివి. మాకు కూడా పితామహుడి వంటి వాడివే... మేము నీకు నమస్కరించాలి. నువ్వు నమస్కరిస్తే మాకు ఆయుఃక్షీణం" అంటూ అతన్ని వారించారు.

"మా భవిష్యత్తును తిరిగి బంగారుమయం చేసిన మీకు ఏ విధంగా ప్రతి సహాయం చేయగలనో నాకు తెలియటం లేదు. నా వల్ల కాదగిన పని

ఏదైనా వుంటే వెంటనే చెప్పి నా ఋణభారాన్ని తగ్గించుకోనీయండి" అన్నాడు వృద్ధుడు.

"తాతా.. మీ నగర పాలకుడు ఎందుకు ఈ నగరంలో జరుగుతున్న ఇటువంటి ఆకృత్యాలను ఓపికగా భరిస్తున్నాడు?" అని అడిగాడు గదాధరుడు.

"అసలు మీకు మా నగర పాలకుడిని గురించి ఏమి తెలుసు?" ఎదురు ప్రశ్నవేశాడు వృద్ధుడు.

"నీతి నిజాయితీలు నిండుగా వున్నవాడని తెలుసు. నగరంలోని పౌరులందరినీ సమదృష్టితో చూస్తాడని తెలుసు..." అన్నాడు శ్యామలుడు.

గట్టిగా నిట్టూర్చాడు వృద్ధుడు. గదాధరుడికి చాలా ఆశ్చర్యం కలిగింది.

"ఎందుకు తాతా ఆ నిట్టూర్పు?" అని అడిగాడు.

"మా నగర పాలకుడు మీరు విన్నట్లు నిజంగానే మహామంచివాడు– ఒకప్పుడు" అన్నాడు వృద్ధుడు.

"ఆయన కూడా రంగమణి వంటి వారి వలలో పడిపోయాడా?" తడుముకోకుండా అడిగాడు శ్యామలుడు.

తల అడ్డం తిప్పాడు వృద్ధుడు.

"చెప్పు తాతా... నీకు తెలిసిన నిజం ఏమిటో వివరంగా చెప్పు." తొందరపెట్టాడు గదాధరుడు.

"నిజమో కాదో నాకు తెలియదు... ఒక విధంగా మా నగర పాలకుడు అసమర్ధుడిగా మారిపోవటానికి కారకుడు నా కుమారుడేనేమో అని నాకు అనిపిస్తోంది" అన్నాడు వృద్ధుడు.

అయోమయం అయిపోయింది స్నేహితులు ఇద్దరికీ. వృద్ధుడి కుమారుడు రంగమణి వలలోపడి సర్వనాశనం అయిపోవటమే కాకుండా సంపదను కూడా నాశనం చేసి ప్రాణాలు వదిలినట్లు అంతకుముందు ఆ వృద్ధుడి నోటి వెంట తాము వినివున్నారు. మరి ఇప్పుడు నగర పాలకుడి అసమర్థతకు ఆ దురదృష్టవంతుడే ఎలా కారకుడు అయినట్లు?

"నేను చెపుతాను... నాకు ఇంకా బాగా గుర్తుంది" అంతవరకూ మౌనంగా నిలబడి వున్న బాలిక మాట్లాడేసరికి, ఆమె వంక చూశారు వారిద్దరూ.

"రంగమణి పరిచయం కాక ముందు మా నాన్నగారు వ్యాపార నిమిత్తం నగరం వెలుపల వున్న ఒక గ్రామం వెళ్ళి రెండు రోజులు అచ్చట గడిపారు.

అప్పుడు ఆ గ్రామస్థుడు ఒకతను తన వద్ద వున్న బంగారు ఉంగరాన్ని మా తండ్రి దగ్గరికి తీసుకువచ్చాడు.... విలువైన జాతిరాయి దాని చుట్టూ పడగలు కలిగిన నాగుపాము బహుఅందంగా వున్నది ఆ ఉంగరం. అటువంటి అందమైన ఆభరణాన్ని నగర పాలకుడికి బహుమతిగా ఇస్తే భవిష్యత్తులో మంచి గుర్తింపు లభిస్తుందన్న ఆలోచన వచ్చి, నగరానికి తిరిగి రాగానే రాజభవనానికి వెళ్ళిదాన్ని నగర పాలకుడికి అర్పించారు....” చెప్పింది బాలిక.

“ఆ ఉంగరం లభించిన రెండవ రోజునే నా కుమారుడికి రంగమణి పరిచయమై, మా పతనం మొదలయింది. బహుమతిని స్వీరించిన తర్వాత నగర పాలకుడు ప్రజల్ని గురించి పట్టించుకోవటం మానివేశాడు” అన్నాడు వృద్ధుడు.

తల విదిలించి వృద్ధుడి భుజం తట్టాడు గదాధరుడు.

“మనకు కాలం కలిసి రానప్పుడు అన్నీ అనుమానాలే కలుగుతాయి. సామాన్యమైన ఒక ఉంగరం ఒక మనిషిని నాశనం చేస్తుందన్న మాట నిజం కాదు. భ్రమ మాత్రమే.... నువ్వు ఇటువంటి మాటల్ని మనసులో పెట్టుకోకు” అన్నాడు.

తల ఊపి మౌనంగా వుండిపోయాడు వృద్ధుడు.

“మా తాత మాటలు నిజం... ఆ ఉంగరంలో ఏదో దుష్టశక్తి దాక్కుని వుంది” అన్నది బాలిక.

ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు గదాధరుడు.

“నగర పాలకుడి దగ్గరికి దాన్ని తీసుకుపోయే ముందు మా తండ్రికి తెలియకుండా నేను ఒకసారి దాన్ని ముట్టుకున్నాను. పిచ్చిపిచ్చి ఆలోచనలు వచ్చాయి. నేను పెరిగి పెద్దదాన్ని అయిపోయినట్లు, ఎంతో మంది మగవాళ్ళు నన్ను చూడటం కోసం మా ఇంటి ముందు నిలబడినట్లు అనిపించింది. భయంతో దాన్ని వదిలి దూరంగా పారిపోయాను” చెప్పింది బాలిక.

నొసలు విరుస్తూ స్నేహితుడి వైపు చూశాడు గదాధరుడు.

“వదిలేయ్ మిత్రమా... మనకు ఆ ఉంగరంతో అవసరం లేదు. మనకు కావాల్సింది నగర పాలకుడు.” అన్నాడు శ్యామలుడు.

మౌనంగా నిలబడి వున్న వృద్ధుడి వైపు చూశాడు గదాధరుడు.

“నగర పాలకుడి భార్యకు ఇద్దరు స్నేహితురాళ్ళు వున్నారు” తనకు తానే వారికి అవసరమైన మాటను చెప్పాడు వృద్ధుడు.

"ఎవరు వారు?" అడిగాడు గదాధరుడు.

"రాజపురోహితుడి భార్య... ఆమె చెల్లెలు...." అన్నాడు వృద్ధుడు. అక్కడితో ఆగలేదు... పురోహితుడి భవనం ఎటు వున్నదో వివరంగా చెప్పాడు.

మరోసారి అతని మనవరాలిని ముద్దు చేసి క్షణికం పాటు కూడా ఆలస్యం చేయకుండా అటు నడిచాడు గదాధరుడు.

ఒక అర్ధఘడియ తరువాత ఒక చిన్నభవంతి ముందు నిలబడి మూసి వున్న తలుపుల్ని తట్టాడు.

పది క్షణికాల తరువాత వినవచ్చాయి అడుగుల చప్పుళ్ళు "ఎవరు మీరు? ఏం కావాలి?" స్వల్పంగా వణుకుతున్న ఒక స్త్రీ కంఠం ప్రశ్నించింది.

"అమ్మా... మేము పురోహితుల వారితో మాట్లాడాలి. మా అమ్మాయికి వివాహ ముహూర్తం అవసరం...." తడుముకోకుండా అన్నాడు గదాధరుడు.

"పురోహితుల వారికి ఆరోగ్యం సరిగాలేదు. మీరు రెండు మూడు రోజుల తరువాత రావచ్చు...." సమాధానం ఇచ్చింది ఆ కంఠం.

ముఖద్వారం ప్రక్కనే వున్న ఒక గావాక్షపు తలుపులు కొద్దిగా తెరుచుకోవటము, ఒక ముఖం తమవంక తదేకంగా చూడటం శ్యామలుడికి కనిపించింది.

"మన అవతారాలు అనుమానాన్ని కలిగిస్తాయి. నగర పాలకుడు ఇక్కడే వుండి వుంటే – వెంటనే ఇంకో ప్రదేశానికి పారిపోతాడు" పెదవుల కదలిక బయటికి కనిపించకుండా స్నేహితుడికి చెప్పాడు అతను.

వెంటనే ప్రక్కకు తిరిగి ఆ భవనం వెనుక భాగంలోకి పరుగుతీశాడు గదాధరుడు. పది క్షణికాల తరువాత వెనుక వున్న తలుపులు తెరుచుకున్నాయి.

"మిత్రమా... వచ్చేయ్...." బిగ్గరిగా అరిచి ముందుకు దూకాడు అతను.... తెరుచుకున్న తలుపులు తిరిగి మూసుకోకముందే ఎగిరి భవనం లోపల పడ్డాడు.

పదునైన పచ్చల బాకును పట్టుకుని బలంగా అతని గుండెల మీద పొడవబోయింది ఒక మధ్య వయస్కురాలు. బరువైన కట్టెపేడుతో అతని తలమీద మోదటానికి ప్రయత్నించింది మరో మహిళ.

తన కరవాలంతో ఆ కట్టెపేడును అవతలికి నెట్టి, ఎడమ చేత్తో పచ్చల బాకును అడ్డుకున్నాడు వెనుకగా వచ్చిన శ్యామలుడు.

"మేము మీకు అపకారం చేయటానికి రాలేదు. దయచేసి శాంతించండి" అంటూ వారిని వారించాడు.

తమను అడ్డుకోవటానికి ప్రయత్నించిన స్త్రీల వెనుక నిలబడి వున్న నగర పాలకుడిని, అతని భార్యబిడ్డలను, పురోహితుడిని చూశాడు గదాధరుడు.

నిలుచుని వున్న విధానాన్ని బట్టి, ధరించిన దుస్తులను బట్టి నగర పాలకుడే అయి వుంటాడని భావించాడు గాని, యదార్థం ఏమిటో తెలియక పోవటం వల్ల తన స్నేహితుడికి సైగ చేశాడు.

నగర పాలకుడని తాము భావిస్తున్న మనిషి ప్రక్కనే వున్న మహిళ వైపు చూశాడు శ్యామలుడు – ప్రశ్నార్థకంగా.

"విశ్వాసపాత్రులని అనుకున్న సైనికులందరూ స్వార్థపరులుగా మారిపోయారు... మాకు సహాయపడేవారు ఈ నగరంలో నా ఈ స్నేహితురాళ్ళు తప్ప మరెవ్వరూ లేరు...." అన్నది ఆమె.

తమ ఎదుట వున్నది నగర పాలకుడేనని నిశ్చయంగా తెలిసి, తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు శ్యామలుడు.

"సేనాపతి మాటలకు లొంగిపోకుండా మీ భవనాన్ని రక్షింప ప్రయత్నించిన అంగరక్షక బృందం వున్నది కదా... వారిలో ఎవరైనా ప్రాణాలతో మిగిలి వుంటే వారిని రప్పించండి" అన్నాడు ఆమెతో.

కన్నీటితో నిండిపోయాయి ఆమె కనులు.

"ఎంతటి విశ్వాసపాత్రులైనా నా భర్తతో నాలుగు మాటలు మాట్లాడితే పూర్తిగా మారిపోతున్నారు... ఆయన ఎంతమందికి ఆజ్ఞలు ఇచ్చినా అవి అమలు కావడం లేదు" అన్నది.

ప్రాణాలకు తెగించి రాజభవనాన్ని కాపాడిన భటులు కనుల ముందు మెదిలి విచిత్రంగా చూశాడు గదాధరుడు ఆమె వంక.

అతని అనుమానం ఆమెకు అవగతమైంది "నగర పాలకుల వారితో వారిని మాట్లాడనీయకుండా, నేనే వారికి ఆజ్ఞలు ఇచ్చాను" అన్నది.

"మరి ఇక్కడ పరిస్థితి ఏమిటి?" ఆయుధాలతో తమను అడ్డుకోబోయిన మహిళలను, వారి భర్తలను చూస్తూ అడిగాడు గదాధరుడు.

"రాజభవనంలో నుంచి పారిపోయి వచ్చిన క్షణం నుంచీ ఇప్పటివరకూ వారితో సంభాషించనీయలేదు" అన్నది ఆమె.

"తల్లీ... స్వార్థపరులు, దురాశపరులు, అవకాశం లభిస్తే ఎటువంటి పాడు పనినైనా చేయటానికి సిద్ధపడే నీచులు ప్రతి నగరంలోను కనిపిస్తూనే

వుంటారు. మీ సేనాపతి వంటి దుర్మార్గులు కూడా అక్కడక్కడా దర్శనమిస్తూనే వుంటారు. కాని మీ నగరంలో ఎవరో ఒకరిద్దరు తప్ప అందరూ అవగుణాలు కలిగి వున్నవారే కనిపిస్తున్నారు. కారణం ఏమిటో ఎప్పుడయినా ఆలోచించారా?" అడిగాడు గదాధరుడు.

"అంతా మా దురదృష్టం... వద్దు వద్దంటున్న కొద్దీ ఒక వర్తకుడు బహుమతిగా ఇచ్చిన బంగారు ఉంగరాన్ని ధరించాడు నా భర్త. ఆ క్షణం నుంచీ మాకు కష్టాలు మొదలు అయ్యాయి...." తడుముకోకుండా చెప్పింది ఆమె.

పిచ్చినమ్మకమని తాము తేలికగా తీసిపడవేసిన ఉంగరపు మాట మరోసారి బయటికి వచ్చేసరికి మతిపోయినంత పని అయింది స్నేహితులు ఇద్దరికీ.

"ఇప్పుడు అది ఎక్కడ వున్నది?" నగర పాలకుడి చేతుల కేసి చూస్తూ అడిగాడు గదాధరుడు.

"సేనాపతి సైనికులందరినీ తిరుగుబాటుకు ప్రోత్సహించక ముందు ఆ ఉంగరాన్ని ప్రభువుల వద్ద నుంచి బలవంతంగా నేను తీసుకుని ఒక సేవకురాలికి ఇచ్చాను. నగరానికి దూరంగా తీసుకుపోయి ఎక్కడయినా పారవేయమని చెప్పాను..." చెప్పటం మొదలు పెట్టింది ఆమె.

"ఉంగరాన్ని నేను తీసుకున్న వెంటనే ప్రభువుల ప్రవర్తనలో మంచి మార్పు కనిపించింది. సేనాపతిని పిలిపించి రంగమణి వంటి దురాశపరులకు సహాయ పడటాన్ని గురించి కఠినంగా ప్రశ్నించారు. కాని...." అంటూ మాటల్ని ఆపింది ఆమె.

"ఏమయింది తల్లీ? మంచిమార్పే వచ్చింది కదా..." అనునయంగా అడిగాడు గదాధరుడు.

"మార్పు వచ్చిన సంతోషం ఎంతోసేపు నిలువలేదు. సేనాపతి వినయం నటిస్తూనే తిరుగుబాటుకు సిద్ధపడ్డాడు. కారణం ఆ ఉంగరం నేను ఆజ్ఞాపించి నట్లు నగరం వెలుపలికి తీసుకుపోబడలేదు." అన్నది ఆమె.

"ఎక్కడికి తీసుకుపోబడింది?" అడిగాడు శ్యామలుడు.

"నేను పంపిన సేవకురాలు దాన్ని తన ప్రియుడికి ఇచ్చింది. అతను మా మంత్రిగారికి ఇచ్చాడు. ఆ మంత్రి దాన్ని తిరిగి ప్రభువుల వారి దగ్గరికి

చేర్చాడు" కన్నీటిని అద్దుకుంటూ నగరపాలకుడి చేతికి ఉన్న ఉంగరాన్ని చూపించింది ఆమె.

"మిత్రమా... నాకు శిరోవేదన అధికం అయిపోతున్నది. ఈ ఉంగరం ఎటువంటిదో గాని, దాని కథల్ని వింటూ వుంటే నాకు పిచ్చిపట్టేట్లుగా వున్నది" అన్నాడు గదాధరుడు.

"తల్లీ... ఆ ఉంగరాన్ని ప్రభువుల దగ్గర్నించి ఇంకోసారి తీసుకోగలరా...." అడిగాడు శ్యామలుడు.

చేయకూడని పనిని చేయమని అడిగినట్లు భయంతో వెనక్కి జరిగింది నగర పాలకుడి భార్య.

"ఎందుకు తల్లీ అంత భయం?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

"ఆ దుష్ట ఆభరణాల మీద చెయ్యిపడిన వెంటనే అన్ని చెడు ఆలోచనలే వస్తాయి. ఒకసారి అనుభవం అయింది" వణుకుతున్న కంఠంతో చెప్పింది ఆమె.

"వారి మాటల్లో యదార్థం వున్నదో లేదో తెలుసుకోవాల్సిన అవసరం మనకి లేదుగాని, ముందు ఆ ఉంగరాన్ని ఈ నగరంలో నుంచి వెలుపలికి తీసుకుపోవటం అత్యవసరం అది కనిపించినంత వరకూ ఎవరూ సూటిగా ఆలోచించరు" అన్నాడు గదాధరుడు.

చటుక్కున ముందుకు అడుగువేసి నగర పాలకుడి చేతిని పట్టుకున్నాడు శ్యామలుడు.

నిశ్శబ్దంగా నిర్వికారంగా నిలబడి వున్న నగరపాలకుడిలో వెంటనే వచ్చింది ఒక మార్పు. రాక్షసుడి మాదిరి వికృతంగా అరుస్తూ శ్యామలుడి మీద కలబడ్డాడు.

ఆత్మ రక్షణ కోసం ఒక అడుగు వెనక్కి వేశాడు శ్యామలుడు.

మండిపోయింది గదాధరుడికి. "తటపటాయింపు దేనికి మిత్రమా – గట్టిగా ఒక పోటు పొడిస్తే ముప్పది రోజుల పాటు మంచం మీదినించి లేవలేని ఒక అర్భక నగర పాలకుడికి బెదిరి వెనక్కి నడుస్తున్నావా?" కోపంగా అంటూ ఎగిరి ముందుకు దూకాడు.

అతని ఉద్దేశం అవగతమై, "వద్దు... దయచేసి నా భర్తను గాయపరచ వద్దు...." అంటూ అడ్డుకోబోయింది నగర పాలకుడి భార్య.

లక్ష్య పెట్టలేదు గదాధరుడు. పిడికిలి బిగించి బలంగా పొడిచాడు. పిశాచం మాదిరి శ్యామలుడి మీద కలబడుతున్న నగరపాలకుడి ముఖం మీద.

విపరీతమైన బాధ కలిగింది కాబోలు – వెర్రిగా అరిచి చాపచుట్ట మాదిరి విరుచుకు పడిపోయాడు నగరపాలకుడు.

శ్యామలుడిని ప్రక్కకు నెట్టి పడిపోయిన నగర పాలకుడి కుడి చేతి వ్రేలికి వున్న ఉంగరాన్ని అతి బలవంతంగా వశపరుచుకున్నాడు గదాధరుడు.

ఉంగరం మీద చేతులు పడిన వెంటనే అతని కనుల ముందు ప్రత్యక్షం అయింది ఒక వికృతాకారం. "ఆశ్రయించు... నన్ను ఆశ్రయించు... అమితమైన శక్తి ఇస్తాను. అధికారం వశపడేటట్లు చేస్తాను. నన్ను ఆశ్రయించు" పాట పాడినట్లు అదే పనిగా పలకటం మొదలు పెట్టింది.

"ఆశ్రయిస్తాను... మరి శక్తిని ఇచ్చేయ్...." అన్నాడు అతను.

ముట్టుకుంటే కందిపోయే నగరపాలకుడి భార్య, పాలరాతి శిల్పం వంటి పురోహితుడి అర్ధాంగి.. అమరసుఖాలు అనుభవించు'" అన్నది ఆ ఆకారం.

తనకు తెలియకుండానే తల తిప్పి ఆ మహిళల వైపు చూడబోయాడు గదాధరుడు.

కంటికి కనిపించనంత వేగంతో కదిలింది శ్యామలుడి చేయి. గదాధరుడి చేతిలో వున్న ఉంగరం ఎగిరి ఆవల పడిపోయింది.

తలకు ఎక్కిన మత్తు ఒక్కసారిగా తొలగిపోయినట్లు తల విదిలించి నేల మీద చతికిలపడ్డాడు గదాధరుడు.

"వీళ్ళ మాటలు నిజమే కదూ?" అడిగాడు శ్యామలుడు.

తల ఊపాడు గదాధరుడు.

బిక్కమొగంతో నిలబడి ఉన్న పురోహితుడి వైపు చూశాడు శ్యామలుడు. "శాస్త్రాలు చదువుకున్న వారు మీరు... ఈ దుష్టశక్తిని నిర్వీర్యం చేయలేరా?" అని అడిగాడు.

"పూజలు చేయించటమే నాకు తెలుసు. మంత్ర తంత్రాలు తెలియవు. ఇది మంత్రాలకు సంబంధించిన సమస్య" తడబడుతున్న కంఠంతో చెప్పాడు అతను.

ఒక అడుగు ముందుకువేసి క్రిందపడి ఉన్న ఉంగరాన్ని ఎడమ పాదంతో బలంగా తన్నాడు శ్యామలుడు.

పలుకురాయి మాదిరి గాలిలోకి లేచి గింగిరాలు తిరుగుతూ ద్వారంలో నుంచి పోయి భవనం వెలుపల ఉన్న ఆవరణలో పడింది అది.

ఉంగరం భవనంలో నుంచి బయటికిపోయిన మరుక్షణం కదలిక వచ్చింది క్రింద పడిపోయిన నగర పాలకుడిలో.

"ఏమయింది నాకు? ఎక్కడ వున్నాము?" పైకి లేస్తూ అడిగాడు.

బుగ్గల మీది కన్నీటిని తుడుచుకోను కూడా తుడుచుకోకుండా జరిగిన సంఘటనలన్నిటినీ వివరించబోయిన అతని భార్యను మధ్యలోనే ఆపేశాడు గదాధరుడు. ఆలయం వెనుక పడి వున్న సేనాపతిని గురించి చెప్పాడు. అలంకార మందిరంలో నిలబడి వున్న మర్కట పిశాచాన్ని గురించి కూడా చెప్పాడు.

"రాతి బొమ్మల మాదిరి నిలబడి వున్న సైనికులందరినీ తెలివి తప్పేటట్లు కొట్టి మళ్ళీ తెలివి తెప్పించండి... మరోసారి అనవసరమైన భ్రమలకు గురై ఇటువంటి చిక్కుల్లో ఇరుక్కోకండి" అని బోధించాడు.

ఉంగరం తన వ్రేలి నుంచి వేరుపడిన వెంటనే మంచి చెడుల విచక్షణ తెలిసింది కాబోలు తల ఊపాడు నగర పాలకుడు.

"మీరు చెప్పినట్లే చేస్తాను. మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తెలియటంలేదు" అన్నాడు గంభీరంగా.

సేనాపతి వంటి నీచుల్ని రంగమణి వంటి దురాశపరుల్ని తిరిగి నగరంలో అడుగుపెట్టకుండా చూసుకోండి... అంతకుమించి మేము కోరుకునేది ఏదీలేదు." అంటూ శ్యామలుడికి సైగ చేశాడు గదాధరుడు.

అతనితో పాటు భవనంలో నుంచి బయటికి వచ్చాడు శ్యామలుడు. మిలమిల మెరుస్తూ కనిపిస్తోంది గింగిరాలు తిరుగుతూ వచ్చి పడిన ఉంగరం.

"ఇది నిజంగానే శక్తివంతమైనది అయివుంటే తిరిగి ఇంకొకరిని తన దగ్గరికి ఆకర్షించుకుంటుంది. రకరకాల ఆశల్ని కల్పించి చేయకూడని పనులన్నిటినీ చేయిస్తుంది" అన్నాడు గదాధరుడు.

"తీసి దట్టీలో భద్రపరుచు – నగరం వెలుపల ఏదైనా నదిలోకి విసిరి కొడదాము" అన్నాడు శ్యామలుడు.

క్రింద వున్న ఆ ఆభరణాన్ని పట్టుకోవటానికి చేతిని జాచి, తేలు ఏదో కుట్టినట్టు వెంటనే చేతిని వెనక్కి తీసేసుకున్నాడు గదాధరుడు.

"నా వల్ల కాదు మిత్రమా... ఇది ఎటువంటిదో నాకు ప్రత్యక్షంగా తెలిసి వచ్చింది" అంటూ వెనక్కి కూడా జరిగాడు.

రెండు క్షణికాల పాటు ఆలోచించి అటూఇటూ చూశాడు శ్యామలుడు. ఆ రోజు ఉదయం తాము ధరించే దస్తుల్ని శుభ్రపరిచి, ఎండలో ఆరవేసింది పురోహితుడి భార్య... మందంగా వున్న అంగవస్త్రాన్ని అందుకున్నాడు అతను.

గదాధరుడికి అయిన అనుభవాన్ని తలుచుకుంటూ వున్నందువల్ల, మిలమిల మెరుస్తున్న బంగారు ఉంగరాన్ని చేతులతో ముట్టుకోలేదు. అవతలగా కనిపించిన ఒక సన్నపాటి చెట్టుకొమ్మను విరిచి, దాని సహాయంతో అంగవస్త్రం మీదికి దొర్లించాడు. తిరిగి ఆ దుష్ట ఆభరణం తన చేతుల సమీపంలోకి కూడా చేరకుండా వస్త్రాన్ని మడిచి మూటగా కట్టాడు.

ఆ మూటను కూడా తన వంటికి తగిలేటట్లు పట్టుకోలేదతను. తాను విరిచిన చెట్టుకొమ్మకే తగిలించి, దూరంగా ఎత్తి పట్టుకున్నాడు.

"ఈ నగరంలోకి మనం వచ్చిన పని అయిపోయింది. రాజభవనం దగ్గిర పిచ్చిచూపులు చూస్తూ నిలబడిన సైనికులకు మనం సూచించిన చికిత్సను చేసి తిరిగి మామూలుగా మారుస్తుంది నగర పాలకుడి భార్య. ఆలయం వెనుక పడి ఉన్న సేనాపతిని బంధింపచేస్తుంది. అతని నేరాలను విచారించి సరైన శిక్షను విధింపచేస్తుంది." పురోహితుల వారి ఆవరణలో నుంచి ఒక వీధిలోకి నడుస్తూ అన్నాడు గదాధరుడు.

"అలంకార మందిరంలోని పిశాచం సంగతేమిటి...." అడిగాడు శ్యామలుడు.

"సేనాపతి స్వయంగా వెళ్ళి సరయిన ఆజ్ఞలు ఇచ్చేంత వరకూ అది రాతిబొమ్మ మాదిరి అక్కడ నిలుచునే వుంటుంది" అన్నాడు గదాధరుడు.

"నిలుచుని నిలుచుని కళ్ళు తిరిగి క్రిందపడి స్పృహకోల్పోతే?" ప్రశ్నించాడు శ్యామలుడు.

"పీడా వదిలిపోతుంది. ఏదో ఒక విధంగా అది అంతరించిపోవటమే మంచిదికదా!" చాలా తేలికగా చెపుతూ శ్యామలుడి పెదవుల మీద వున్న చిన్నపాటి నవ్వును చూసి ఉలిక్కిపడ్డాడు గదాధరుడు.

తన స్నేహితుడు ఎందుకు నవ్వాడో అవగతం అవటమే అందుకు కారణం.

"మర్కట పిశాచపు సమ్మోహన దృష్టి ఎవరి మీదకి ప్రసరిస్తే వాళ్ళు బానిసలుగా మారిపోతారు. ఆ సమయంలో తెలివి తప్పి క్రిందపడిపోతే – ఆ వశీకరణం నుంచి బయటపడతారు. మంత్ర తంత్రాలు తెలియకపోయినా మన

మిద్దరం మన తెలివితేటలను ఉపయోగించి తెలుసుకున్న విరుగుడు ఇది....” అన్నాడు శ్యామలుడు.

ఆకలి బాధ తట్టుకోలేక తల్లక్రిందులైన మర్కట పిశాచం, తెలివి తెచ్చుకున్న వెంటనే తిరిగి తన పూర్వపు శక్తిని సంపాదించుకుంటుందని అర్ధమైన మరుక్షణం వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది గదాధరుడి నోరు.

“ఏంచేద్దాం మిత్రమా? చూడటానికి చాలా చిన్నదిగానే వున్నా, చాలా బలమైన ప్రమాదం ఇది....” అన్నాడు.

“నగర పాలకుడి భార్యకు ఇటువంటి ఆలోచన వచ్చే అవకాశం లేదంటావా?” సాలోచనగా అడిగాడు శ్యామలుడు.

“పొరపాటున కూడా లేదు. అసలు ఆ ఆలోచన రాను కూడా రాదు. మనం బంధించి వచ్చిన ఆ మందిరం తలుపులకు అడ్డంగా ఒక దృఢమైన గోడను నిర్మింపచేయవచ్చు. అంతకుమించి మరేమీ చేయించదు” తలను తడుముకుంటూ అన్నాడు గదాధరుడు.

“మనం ఆ భవనంలో నుంచి బయటికి రావటానికి ఉపయోగించిన రహస్యమార్గం ఆ మందిరంలో నుంచే మొదలు అవుతుంది. మర్కట పిశాచానికి తిరిగి శక్తి సామర్ధ్యాలు లభించటమే నిజం అయితే అది తప్పకుండా ఆ మార్గాన్ని వెతికి తాను కూడా బయటికి వచ్చేస్తుంది.” చెప్పాడు శ్యామలుడు.

“తనకు ఆజ్ఞలు ఇచ్చే సేనాపతి తన సమీపంలో లేడు కాబట్టి అది అక్కడినుంచి మాయమై తిరిగి దిగంబర స్వామి దగ్గరికి వెళ్ళిపోయే అవకాశం ఏమైనా వుంటుందా?” తలను తడుముకుంటూనే అడిగాడు గదాధరుడు.

తీవ్రమైన ఆలోచన చేస్తున్నప్పుడు అతనికి వున్న విచిత్రమైన అలవాటు ఆ తలను తడుముకోవటం... చుట్టూ వున్న పరిసరాల్ని చూస్తూనే వుంటాడు. ప్రక్కనున్న వారితో సంభాషణ జరుపుతూనే వుంటాడు. మనసు మాత్రం మరెక్కడో వుంటుంది.

చిన్నతనం నుంచీ ఒకేచోట పెరిగి పెద్దవారయి నందు వల్ల శ్యామలుడికి చాలా బాగా తెలిసిన విషయం అది.

అందువల్ల జరుగవలసిన దాన్ని గురించి తన అభిప్రాయాన్ని బయల్పరచ లేదతను. అతను దీర్ఘంగా ఆలోచిస్తున్న విషయం తనకు తెలియనట్లే పొడి పొడి మాటలు మాట్లాడాడు.

నాలుగు వీధులు దాటి నగర ద్వారాల సమీపంలోకి చేరుకుంటున్న సమయంలో వున్నట్లుండి చిటికెవేశాడు గదాధరుడు.

“తెలిసింది మిత్రమా... ఆ మర్కట పిశాచం తిరిగి ఇంకోమారు నగరంలో గడబిడ సృష్టించకుండా అడ్డుకునే ఉపాయం నాకు తెలిసింది” ఉత్సాహంగా చెప్పాడు.

“సంతోషం స్నేహితుడా... వెంటనే చెప్పు... ఏం చేద్దాం? రాజభవనానికి నిప్పు ముట్టించి అగ్నికి ఆహుతి చేసేద్దాము? ఆ దుష్టస్వరూపాన్ని సజీవ దహనం చేసేద్దామా?” అడిగాడు శ్యామలుడు.

“నువ్వు నన్ను వెక్కిరిస్తున్నావు....” మూతిముడిచి చిరుకోపంతో అన్నాడు గదాధరుడు.

“నిన్ను నేను వెక్కిరిస్తే నన్ను నేను వెక్కిరించుకున్నట్లే. లేని పోనిది ఊహించుకోకుండా విషయం ఏమిటో చెప్పు” అన్నాడు శ్యామలుడు.

“మర్కట పివాచాన్ని అదుపు చేయగలిగిన వాడు, దాన్ని అవతలికి పంపించగలిగిన వాడు ఒక్క దిగంబరస్వామి మాత్రమే. వాడు ఇంకా ఆ కొండగుట్ట మీద కూర్చునే ఉన్నాడు....” అన్నాడు గదాధరుడు.

సాలోచనగా తల ఉపాడు శ్యామలుడు.

“దిగంబరస్వామి వల్లనే ఆ నగరానికి ఆపద ముంచుకు వచ్చింది. రంగమణిని, సేనాపతిని ప్రోత్సహించింది అతనే... అతను ఆ చుట్టుపట్ల ఉన్నంతవరకూ నగరవాసులు ప్రశాంతంగా జీవించలేరు...

“వాడు వట్టి జిత్తులమారి. నాలుగు దినాలు గడిచిన తరువాత మరో రంగమణిని తయారుచేయవచ్చు. ఇంకో సైనికాధికారిని మచ్చిక చేసుకుని ఇంకో తిరుగుబాటు దాటి ప్రోత్సహించవచ్చు” తాను కూడా అన్నాడు గదాధరుడు.

“కాబట్టి ఈ నగరం సురక్షితం కావాలంటే దిగంబరస్వామి ఆట కట్టివేయాలి... అంతకు మించి మరో మార్గంలేదు....” అన్నాడు శ్యామలుడు.

నగర ద్వారాలను దాటి ఆవలి ప్రక్కన వున్న మైదానంలోకి అడుగు పెట్టారు వారిద్దరూ.

“పట్టపగలు ఆ దుర్మార్గుడి ఎదుటికి పోవటం నాకు ఇష్టం లేదు. చీకటి పడేంతవరకు ఆగుదాము....” అన్నాడు శ్యామలుడు.

"ఈ మాట మనం నగరంలో వుండగానే చెప్పి వుంటే తినటానికి ఏవైనా పదార్థాలు సేకరించుకు వచ్చేవాడిని. కడుపులో ఎత్తు లేకుండా కాలక్షేపం చేయటం నాకు నచ్చదు" కోపంగా అంటూ చుట్టూ చూశాడు గదాధరుడు.

నాలుగు వందల ధనువుల దూరంలో పెద్దపెద్ద బండరాళ్ళ మధ్యలో నుంచి నిట్టనిలువుగా గాలిలోకి లేస్తూ అతనికి కనిపించింది సన్నపాటి పొగ.

"అదిగో... ఆ బండల దగ్గిర ఎవరో నివశిస్తూ వున్నట్లు నాకు అనిపిస్తోంది. వంటలు చేసుకోవటానికో, చలి కాచుకోవటానికో మంటలు వేస్తున్నారు... అందుకే పొగ కనిపిస్తోంది" అంటూ అటుకేసి అడుగులు వేశాడు వేగంగా.

"చిన్నపిల్లాడి మాదిరి అతిగా ఆత్రపడటం అవివేకం. కాస్తంత నిదానించు... రోజుల తరబడి తిండికి అలమటించిపోతున్నట్లు ఆయాసపడకు" అని హెచ్చరిస్తూ అతన్ని అనుసరించాడు శ్యామలుడు.

* * * * *

ఎవరో మానవులు కావాలనే పెద్దపెద్ద బండరాళ్ళను ఉలులతో చెక్కి వలయాకారంలో నిలబెట్టినట్లు గుంపుగా వున్నాయి స్నేహితులకు కనిపించిన బండరాళ్ళు.

మూడే మూడు మర్రిచెట్లు ఎదిగి కనిపిస్తున్నాయి ఆ వలయం మధ్య భాగంలో... చెమటలతో మలినమై అగుపిస్తున్నాయి ఇప్పుడు ఆ చెట్ల క్రింద కూర్చుని వున్న నలుగురు వ్యక్తుల ముఖాలు.

వేగంగా పరిగెత్తే జాతిగుర్రాల మీద వచ్చారు వాళ్ళు. అవి కూడా పూర్తిగా అలసిపోయినట్లు తలలు క్రిందికి వ్రేలాడేసి నిస్త్రాణంగా నిలుచుని వున్నాయి.

స్నేహితుల కంటే ముందుగా నగరంలో నుంచి బయటికి వచ్చాడు కాబోలు – నగర పౌరుడు ఒకతను ఆ కొత్త మనుష్యుల ఎదుట కూర్చుని వున్నాడు.

సన్నపాటి ఎండు చితుకులను ఏరుకువచ్చి చిన్న చితుకుల మంటవేశారు ఆ వ్యక్తులు. తమ దగ్గిర వున్న ఆహార పదార్థాలను ఆ మంటమీద వెచ్చబెట్టు కుంటున్నారు.

"మనం చూసింది ఈ మంటలో నుంచి వచ్చిన పొగనే. నా దూరదృష్టి అమోఘం. నా పరిశీలనా శక్తి తిరుగులేనిది" అంటూ బండల్ని దాటి వారి దగ్గరికి వెళ్ళబోయాడు గదాధరుడు.

వేగంగా చేయిజాచి అతన్ని కదలకుండా ఆపేశాడు శ్యామలుడు. "ఇప్పుడు నువ్వు వాళ్ళ దగ్గరికి వెళ్ళటం అవసరమా?" అని అడిగాడు.

"అవసరం అంటే అవసరమే అని చెప్పాల్సి వస్తుంది. ఆకలి వేస్తోంది నాకు. నీకు కాదు" కోపంగా చూస్తూ అన్నాడు గదాధరుడు.

"అడుగువేసే ముందు వాళ్ళ సంభాషణను కొద్దిగా ఆలోచించు. వాళ్ళ దగ్గిర కూర్చున్నది వాళ్ళ మనిషికాదు. మనం వదిలివచ్చిన నగర పౌరుడు. గట్టిగా మాట్లాడితే మన దగ్గిర చేతులు జాచి బంగారు నాణేలు పుచ్చుకున్నటు వంటివాడు. దట్టీకి వ్రేలాడదీసుకున్న మూటను చూడు... ఆ మూటలో వున్నది ఏమిటో ఆలోచించు...." ఓపికగా చెప్పాడు శ్యామలుడు.

అప్పటికప్పుడు ముందుకుపోయే ఆలోచనను విరమించుకున్నట్లు, ఎత్తుగా వున్న ఒక బండచాటున మోకరించి కూర్చున్నాడు గదాధరుడు. కనులు మూసుకుని చెవులు రిక్కించాడు.

నెమ్మనెమ్మదిగా అతని కర్ణేంద్రియాలకు చేరటం మొదలు పెట్టింది చితకుల మంట దగ్గిర జరుగుతున్న సంభాషణ.

".... చిటికెలో నగరం మన వశం అయిపోతుందని అనుకున్నాడు మా సేనాపతి... పాపం, అన్యాయమైపోయాడు" అంటున్నాడు నగరంలో నుంచి వచ్చిన పౌరుడు.

"అంతమంది సైనికుల్ని చేరదీసిన తర్వాత కూడా ఎందుకని అలా జరిగింది?" ఆశ్చర్యంగా అడుగుతున్నాడు క్రొత్త మనుషుల్లో ఒకతను.

"ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో ఎవరికీ తెలియదు. సేనాపతి మాయం అయిపోయాడు. వెంటవచ్చిన పిశాచ మర్కటం కూడా కనిపించకుండా పోయింది తిరుగుబాటు మధ్యలోనే ఆగిపోయింది."

"నీ పద్ధతి చూస్తుంటే నువ్వు చాలా తెలివైనవాడి మాదిరిగా కనిపిస్తున్నావు. నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అన్నాడు ఆ కొత్తమనిషి.

ముక్కుముఖం తెలియనివాడు తన తెలివితేటల్ని మెచ్చుకునేసరికి చింపి చేటంత అయిందా పౌరుడి వదనం.

రహస్యం చెపుతున్నట్టు ముందుకు వంగాడు అతను. "ఇక్కడికి దగ్గిర్లోనే ఒక కొండగుట్ట మీద దిగంబరస్వామి అని ఒక మంత్రగాడు నివశిస్తూ వుంటాడు. సేనాపతి అంతర్ధానం వెనక అతని ప్రమేయం వుండి వుంటుంది." చిన్నకంఠంతో చెప్పాడు.

ఎదురు మట్లాడకుండా విన్నాడు ఆ కొత్త మనిషి. అంతా విన్న తర్వాత మాత్రం తల అడ్డం తిప్పాడు.

"నా మాటలు మీకు నచ్చలేదా? నేను చెప్పింది నిజం కాదని అనుకుంటున్నారా?" కోపంగా అడిగాడు నగర పౌరుడు.

"మాకు తెలిసిన దాన్ని బట్టి మీ సేనాపతికి ఆ దిగంబరస్వామి అనుగ్రహం పూర్తిగా వుంది. నువ్వు చెపుతున్న ఆ మర్కట పిశాచం వంటి శక్తుల్ని ఆ దిగంబర స్వామి వంటి మాంత్రికులే సృష్టించగలరు...." అన్నాడు కొత్తమనిషి.

"అయితే సేనాపతి ఎలా మాయం అయిపోయినట్లు?" అంతకు ముందు ఆ మనిషి వేసిన ప్రశ్నలే తాను వేశాడు నగర పౌరుడు.

"అదే ఇప్పుడు మేము తెలుసుకోవాలని అనుకుంటున్నాము" అన్నాడు కొత్తమనిషి.

"మీరు నేను మాట్లాడుకుంటూ కూర్చుంటే తెలిసే విషయం కాదు అది. ఆ దిగంబరస్వామి దగ్గరికి పోతే అదే తెలిసిపోతుంది" అన్నాడు నగర పౌరుడు.

ఉలిక్కిపడినట్లు అయి, అంతలోనే తమను తాము సంబాళించుకున్నారు ఆ పరాయి మనుష్యులు.

"ఈ నగరం మాకు కొత్త. ఆ మంత్రగాడి దగ్గిరికి దారి చూపించగలవా?" మృదువుగా అడిగాడు అప్పటివరకూ మాట్లాడిన మనిషి.

"దగ్గిర వుండి దారి చూపించవలసిన అవసరం లేదు. ఇక్కడి నించే కనిపిస్తుంది ఆ గుట్ట. రండి... చూపిస్తాను" అంటూ మంట ముందు నుంచి లేచాడు పౌరుడు.

కనులు మూసుకుని శ్రద్ధగా ఆలకిస్తున్న గదాధరుడు గబుక్కున పైకి లేచాడు. వేగంగా వెనక్కి అడుగు వేశాడు.

సిద్ధంగానే వున్నాడు శ్యామలుడు. అతని చేతిని పట్టుకుని పది అడుగులు దూరంలో వున్న బండదగ్గరికి నిశ్శబ్దంగా తీసుకుపోయాడు.

గదాధరుడు మోకరించి కూర్చున్న ప్రదేశంలోనే నిలబడి – ఒక దిక్కుకేసి చేయి చూపించాడు నగరపౌరుడు.

"అదిగో గుట్ట... అదే దిగంబరస్వామి నివాసం." అని చెప్పాడు.

"పరదేశీయులమని కూడా సంకోచించకుండా మేము అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పినందుకు నీకు చాలా కృతజ్ఞతలు...." అంటూ

తన ఒరలో నుంచి పదునైన ఖడ్గాన్ని బయటికి తీసి బలంగా వేటువేశాడు ఆ కొత్త మనిషి నగర పౌరుడి మెడమీద.

అటువంటి ప్రమాదం ముంచుకు వస్తుందని ఊహించలేదా పౌరుడు.

ఎర్రటి రక్తం వెలుపలికి వచ్చింది. నిలుచున్న వాడు నిలుచున్నట్లుగానే క్రిందికి వాలిపోయాడు. శరీరం నేలను తాకక ముందే అనంత విశ్వంలోకి ఎగిరి పోయాయి అతని ప్రాణవాయువులు.

రక్తంతో మలినపడిన తన కరవాలాన్ని అతని దుస్తులకే అద్ది శుభ్రం చేసుకున్నాడు కొత్తమనిషి. దట్టీకి వ్రేలాడుతున్న మూటను తీసి గాలిలోకి ఎగురవేశాడు.

వెంటనే వినవచ్చిన గలగల శబ్దాన్ని ఆలకించి పెద్దగా నవ్వారు మిగిలిన వారు.

"ఇటువంటి దుర్మార్గులు జీవించి వుండకూడదు మిత్రమా... వాళ్ళని నిలువునా నరిగి ముక్కలు చేయవలసిందే" పళ్ళు బిగించి చెప్పాడు గదాధరుడు.

"ఎప్పుడు చూసినా నాకు తొందరపాటు ఎక్కువని నిందిస్తూ వుంటావు. కాని ఈ రోజు నీకు ఎక్కువైపోయింది అది...." నెమ్మదిగా అన్నాడు శ్యామలుడు.

"ఏమిటి నీ ఉద్దేశ్యం?" నొసలు ముడిచి తీవ్రంగా చూస్తూ అడిగాడు గదాధరుడు.

"ఈ నగరానికి పట్టిన పీడ విరగడ అవ్వాలంటే ఆ దిగంబరస్వామి వ్యవహారం ఏమిటో తెలుసుకోవటం ముఖ్యం... అవునా కాదా?" అడిగాడు శ్యామలుడు.

తన దూకుడును కొద్దిగా తగ్గించుకుంటూ తల ఊపాడు గదాధరుడు.

"దిగంబరస్వామి గొప్పతనం ఎటువంటిదో తెలిసిన వాళ్ళు ఈ నగరంలోనే కాదు... ఇతర నగరాల్లో కూడా వున్నట్లున్నారు." అన్నాడు శ్యామలుడు.

"ఆ విషయం నీకు ఎలా తెలుసు?" తన కోపాన్ని మర్చిపోయి, ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

"వాళ్ళు వచ్చింది అతన్ని కలుసుకోవడం కోసమే. దిగంబరస్వామి పేరు ప్రతిష్టలు ఈ నగర సరిహద్దుల్ని దాటి నాలుగు దిక్కులకు ప్రసరించినట్లు నాకు అనిపిస్తోంది" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"ఈ దరిద్రం ఇక్కడితో అంతమైపోయిందని అనుకుంటుంటే మళ్లీ ఈ కొత్తకోణం ఏమిటి మిత్రమా?" విసుగు నిండిన కంఠంతో అడిగాడు గదాధరుడు.

"కోణాలైనా దరిద్రాలయినా అన్నీ దిగంబరస్వామి అంతం అయిపోతే తప్ప అణిగిపోవు." అన్నాడు శ్యామలుడు.

"అయితే మరి ఆలస్యం దేనికి? ఆ పనేదో వెంటనే చేసేద్దాం" అంటూ శ్యామలుడు క్రింద పెట్టివుంచిన అంగ వస్త్రపు మూట వంక చూశాడు గదాధరుడు.

"దాన్ని ఏం చేద్దాం?" అని అడిగాడు.

బండరాళ్ళ దగ్గరికి బయలుదేరక ముందు దాన్ని ఎక్కడో ఒకచోట ఎవరికీ అగుపించకుండా పారవేయాలని అనుకున్నాడు శ్యామలుడు. బండరాళ్ళ మధ్యలో జరిగిన దురంతాన్ని చూసి, ఆగంతకుల మాటల్ని విన్న తరువాత ఆ ఆలోచనను విరమించుకున్నాడు.

"ఒక్కొక్కసారి దుష్టశక్తుల్ని ఎంత దూరంగా పెట్టినా, ఏదో ఒకవిధంగా అవి ఒకే చోటికి చేరుకుంటూ వుంటాయి. దిగంబరస్వామి వ్యవహారాన్ని పూర్తిగా తేల్చుకునేటంత వరకూ దాన్ని మన దగ్గిర వుంచుకుందాము. ఆ నీచుడికి గనుక ఇది దొరికితే ఇక వాడిని మనం అడ్డుకోవటం కష్టతరం అవుతుంది" అన్నాడు.

"దాన్ని దగ్గిర వుంచుకోవటమంటే మహాపాతకాన్ని మన వెనుక నిలబెట్టుకోవటం వంటిది. పాదాభివందనాలు చేయవలసిన స్త్రీ మూర్తుల గురించి ఇది నా మనస్సులో ప్రవేశపెట్టిన భావాలను బయటికి చెపితే నువ్వు అసహ్యించుకుంటావు" అన్నాడు గదాధరుడు.

"నాకు తెలుసు... ఈ మూటను ముట్టుకోకుండా దూరంగా పెట్టి వుంచిన తర్వాత కూడా ఇది నన్ను కలవర పరుస్తూనే వున్నది..." అన్నాడు శ్యామలుడు.

"మిత్రమా... వాళ్ళు మంటల మీద వెచ్చచేసిన ఆహారాన్నంతా దిగమింగేస్తున్నారు" మంట చుట్టూ కూర్చున్న ఆగంతకుల వైపు చూస్తూ ఆర్తిగా అన్నాడు గదాధరుడు.

"తిండి తినటం కోసమే పుట్టినట్లు మాట్లాడకు. నాకు మహాచిరాకు " అంటూ నిలుచున్న ప్రదేశంలోనే చతికిలబడ్డాడు శ్యామలుడు.

* * * * *

చికాకుగా వున్నాడు దిగంబరస్వామి. ఎప్పటిమాదిరి బండరాయి మీద కూర్చుని ధ్యానసమాధిలోకి వెళ్ళటం సాధ్యపడటం లేదు.

"సేనాపతి ఏమైపోయాడో తెలియటం లేదు. వెంటవెళ్ళిన మర్కట పిశాచం ఎటువంటి సహాయాన్ని అందిస్తున్నదో అర్థం కావటం లేదు...." తనలో తాను అనుకుంటూ బండరాయి దగ్గిర అటూఇటూ తిరగటం మొదలు పెట్టాడు.

చీకట్లు దట్టమైన పావు ఘడియ తరువాత ఉన్నట్లుండి అతని గుహ ఎదుట ప్రత్యక్షం అయ్యారు కొందరు ఆగంతకులు.

"ఎవరు మీరు? ఎవర్రా మీరు?" కనులు ఎర్రబడి క్రూరంగా చూస్తూ బిగ్గరిగా అరిచాడు దిగంబరస్వామి.

గుహలోనికి వచ్చి తలలు వంచి అతనికి అభివాదం చేశారు వాళ్ళు. తమతో తీసుకువచ్చిన ఒక మూటలో నుంచి రెండు పెద్ద పెద్ద సొరకాయ బుర్రల్ని తీసి అతని ఎదుట పెట్టారు.

"ఏమిటవి?" క్రూరంగానే అడిగాడు దిగంబరస్వామి.

"చంచల పుష్పాలను చింతపండులో ఊరవేసి, తేనెతో మరగించి తయారుచేసిన మధుర రసం వుంది ఈ బుర్రల్లో. త్రివిశా నగర పాలకుడు తమ కోసం పంపించిన కానుక...." అంటూ అదే మూటలో నుంచి రెండు పట్టు సంచుల్ని కూడా తీసి సొరకాయ బుర్రల దగ్గిరపెట్టారు వాళ్ళు.

"అవేమిటి?" మళ్ళీ అడిగాడు దిగంబరస్వామి.

"వెయ్యి బంగారు నాణేలు. తమరి అనుగ్రహాన్ని కోరుతూ మా నగర పాలకుడు సమర్పించుకున్న దక్షిణ." వినయంగా అన్నారు వాళ్ళు.

"త్రివిశా నగర పాలకుడు మహాతెలివైనవాడు... అంగబలం అర్థబలం దండిగా కలిగివున్న వీరాధి వీరుడు... అతనికి నా అనుగ్రహం కావాల్సి వచ్చిందా?" కోపం కొంచెంగా తగ్గింది కాబోలు - నెమ్మదిగా అడిగాడు దిగంబరస్వామి.

"తమరు దయ చూపకపోతే మా ప్రభువులు కష్టాల పాలు కావటం తప్పదు... మేము సుఖంగా జీవించాలంటే తమరి సహాయం తప్పనిసరి...." చెప్పాడు ఒక ఆగంతకుడు.

పూర్తిగా అణిగిపోయింది స్వామి ఆగ్రహం. క్రిందవున్న సొరకాయ బుర్రల్లో ఒక దాని మూతతీసి, అందులోని ద్రవాన్ని గొంతులోకి వంపుకున్నాడు.

ఆ రుచి తనకు బాగా నచ్చినట్లు తల ఊపుతూ తన బండరాయి మీద స్థిరంగా కూర్చున్నాడు.

"ఈ త్రివిశా నగర పాలకుడు ఎవరోగాని, ఈ దిగంబరస్వామి చిటికెలో మచ్చిక చేసుకున్నాడు. ఇతగాడి బలహీనతలు బాగా తెలిసినట్లు వున్నది అతనికి" గుహ వెలుపల ఒక ప్రక్కగా నిలబడి శ్యామలుడి చెవిలో చిన్నగా ఊదాడు గదాధరుడు.

"నువ్వు నీ నోటిని గట్టిగా అదుముకో... శబ్దం గుహలోకి వెళ్ళిందంటే మన గుట్టు రట్టు అయిపోతుంది. ఇక్కడ జరుగుతున్నది ఏమిటో తెలియకుండా పోతుంది" చిరుకోపంతో అతన్ని హెచ్చరించాడు శ్యామలుడు.

బండరాయి మీద కూర్చుని, సొరకాయబుర్రలోని మధురసాన్ని మరోసారి రుచి చూస్తున్న దిగంబరస్వామితో వున్నట్లుండి వచ్చింది ఒక మార్పు.

"వచ్చావా? నా దగ్గరికి వచ్చావా? ఎక్కడ? ఎక్కడున్నావ్" పెద్దగా అరుస్తూ ఎగిరి క్రిందకు దూకాడు. సొరకాయ బుర్రను అవతలికి విసిరి అతి వేగంగా గుహద్వారం వైపు కదిలాడు.

క్రింద పెట్టి వుంచిన అంగవస్త్రపు మూటను తిరిగి చెట్టుకొమ్మతో సహా అందుకున్నాడు శ్యామలుడు.

"ఆలస్యం చేయకూడదు. అంతర్ధానం అయిపోవాల్సిందే" అంటూ గుట్ట క్రిందికి పరుగుతీశాడు.

అతను అలా కలవరపడటానికి కారణం ఏమిటో తెలియకపోయినా, ఎదురు ప్రశ్నలు వేయలేదు గదాధరుడు. అతని వెనుకే తను కూడా వేగంగా కదిలాడు.

గుట్టక్రింది భాగంలో కనిపించిన ఒక పెద్ద పల్లపు ప్రదేశంలోకి దుమికి అక్కడ ఎత్తుగా ఎదిగిన ఒక ముళ్ళపొద చాటున మోకరించాడు శ్యామలుడు.

ఆఘమేఘాల మీద గుట్ట సగభాగం వరకూ వచ్చాడు దిగంబరస్వామి. నడుము మీద చేయివేసుకుని చుట్టూ చూస్తూ నిలుచున్నాడు.

"ఏమయింది స్వామి? ఎవరు వచ్చింది?" అతనితో పాటు తాముకూడా గుహ లోపలినించి బయటికి వచ్చి అడిగారు ఆగంతకులు.

"నా శక్తి... మధుపానపు మత్తులో పడి నేను చేజార్చుకున్న మహత్తర సాధనం. ఈ సమస్త జగత్తులో వున్న జీవులందరినీ మభ్యపెట్టి నాకు పాదసేవ కులుగా మార్చివేసే అద్భుత యంత్రం...." అంటూ మాటలు నోటికి రానట్లు వగరుస్తూ... నిలబడిపోయాడు దిగంబరస్వామి.

"మా కళ్ళకు కనిపించే ఎటువంటి వస్తువునయినా మేము వెలికి తీసుకు రాగలము. మీరు చెప్పుతున్నదేమిటో వివరించండి. తీసుకువచ్చి మీ పాదాల దగ్గిర పడవేస్తాను...." అన్నాడు ఆగంతకులకు నాయకుడి మాదిరి కనిపిస్తున్న వ్యక్తి.

కనులు ఎర్రచేసి గిర్రున తిరిగాడు దిగంబరస్వామి అతని వైపు. "మూర్ఖుడా... ఆ మహత్తర సాధనం మహాశక్తి వంతమైంది. శిరస్సున ధరిచవల సింది అది. పాదాల దగ్గిర పడవేయదగింది కాదు... మాటలు బహు జాగ్రత్త...." అంటూ హూంకరించాడు.

"వాడు వట్టి వదరుబోతు... మంత్రశక్తులు తక్కువ... పిడివాదపు మాటలు ఎక్కువ. గొంతు చించుకుని అరవటం తప్ప ఇంకేమీ చేతకాదు...." గాలి వాలున గుట్ట మధ్యభాగంలో నుంచి వినవస్తున్న సంభాషణను ఆలకిస్తూ అన్నాడు శ్యామలుడు.

"ఏదో యంత్రం కాదు మిత్రమా... వాడి మాటల ప్రకారం వాడు తాగిన మత్తులో పోగొట్టుకున్నది ఈ ఉంగరమే అయి వుంటుంది. మనం ఇక్కడికి రాగానే దాని వాసన వాడికి సోకి వుంటుంది. అందుకే అలా గొంతు చించుకుం టున్నాడు" అన్నాడు గదాధరుడు.

నిజమే అనిపించింది శ్యామలుడికి కూడా. చెయ్యివేసిన వెంటనే చెడు ఆలోచనల్ని రేకెత్తించే ఆ ఉంగరం తప్పకుండా దిగంబరస్వామిదే అయివుంటుంది.

"ఎందుకైనా మంచిది మనం దాన్ని దూరంగా తీసుకుపోయి భూమిలో పాతి పెట్టేద్దాం... వాడు అరిచికేకలు పెడుతున్నట్టే ఇది కూడా ఏదైనా చేసి తన ఉనికిని బట్టబయలు చేసిందంటే కష్టాల్లో పడతాము" అని కూడా అన్నాడు అతను.

గుట్ట మధ్యభాగంలో నిలుచుని వున్న దిగంబరస్వామి వట్టి వదరుబోతు అని, మంత్రశక్తుల్ని కలిగి వుండటం కంటే, మాటలు చెప్పటంలో మొనగాడు అనీ అనటం అయితే అన్నాడు కాని, అతని శక్తి ఎటువంటిదో గుర్తు చేసుకునే సరికి చెమటలు ప్రత్యక్షం అయ్యాయి శ్యామలుడి ముఖం మీద.

మర్కట పిశాచం వంటి దరిద్రపు శక్తిని సృష్టించిన వాడు ఎవడూ తక్కువ వాడు కాదు. అటువంటి వాడికి తమ దగ్గిర వున్న ఉంగరం తోడు అయితే వెయ్యింతలు అవుతుంది మహిమ. ఆపైన ఆపటం ఎవరికీ సాధ్యపడక పోవచ్చు.

గుట్ట మధ్యభాగంలో నుంచి గుహలోకి పోయి తిరిగి బండరాయి మీద కూర్చున్నాడు దిగంబరస్వామి. అంతకుముందు అవతలికి విసిరికొట్టిన సొరకాయ బుర్రవైపు చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"రుచికరమైన పానీయం... గొంతు దిగిన వెంటనే సుప్రసన్నమైన భావాల్ని రేకెత్తించింది. ఆత్రపడి అవతలికి విసిరాను" తల విదిలిస్తూ విచారంగా అన్నాడు.

అవతలపడిన మరుక్షణం మూడు ముక్కలుగా పగిలిపోయింది అది. అందులోని మధురసమంతా నేలపాలు అయిపోయింది.

"మహత్తు కలిగిన పానీయమే ఇది. సందేహం లేదు. కాని అలభ్యమైనటు వంటిదికాదు. మళ్ళీ తయారుచేయించి తమకు సమర్పించుకుంటాము. ఈ లోపల రెండవ బుర్ర వుండనే వున్నది. సేవించండి" అంటూ రెండవ బుర్రను అతనికి అందించాడు ఆగంతకుల నాయకుడు.

మరోసారి అందులోని పానీయాన్ని గొంతులోకి వంపుకొని ఆనందంగా తల ఊపాడు దిగంబరస్వామి. "మీ నగర పాలకుడికి నాతో పడిన పనేమిటో చెప్పండి" అని అడిగాడు.

గుహద్వారం దగ్గిర నిలబడిన స్నేహితులు ఇద్దరూ చెవులు రిక్కించారు.

దిగంబరస్వామి మరో రెండు గుక్కల పానీయాన్ని పుచ్చుకునే దాకా ఆగి చిన్నగా గొంతు సవరించుకున్నాడు ఆగంతకుల నాయకుడు.

"మంత్రాల దేవరా... మీకు తెలిసే వుంటుంది. త్రివిశా నగరాన్ని పరిపాలించే మా త్రికుట వర్ధనుల వారికి, మా ప్రక్క నగరమైన వైదర్భి విలాస ప్రభువుకు చాలాకాలం నుంచి వైరం కొనసాగుతూ వస్తోంది" అంటూ మొదలు పెట్టాడు.

మరొక్క మాట కూడా మాట్లాడకముందే చేతిని ఎత్తి అతన్ని ఆపేశాడు దిగంబరస్వామి.

"చీకటివేళల్లో సంచరించే గబ్బిలం మాదిరి ఈ గుహాంతరంలో కాలం గడుపుతున్నానని చెప్పి, నాకు తెలివి తేటలు లేవు అనుకోబోకండి. మధురసపు మత్తులో పడి నా ప్రాణానికి ప్రాణమైన నా శక్తుల్ని పోగొట్టుకున్నానని చెప్పి చేతకాని వాడిగా భావించకండి. తలుచుకుంటే ఇప్పటికిప్పుడు ఇక్కడికిక్కడ

మిమ్మల్ని సజీవ దహనం చేసేయగలను. చూపించ మంటారా?" కనుగుడ్లను గిరగిరా తిప్పుతూ అడిగాడు కోరగా.

విపరీతమైన ఆశ్చర్యంతో శ్యామలుడి వైపు చూశాడు గదాధరుడు. "వాళ్ళ మానాన వాళ్ళు వాళ్ళగోల ఏదో చెప్పుకుంటుంటే మధ్యలో వీడి ప్రతాపాన్ని గురించి మాట్లాడతాడేమిటి? మధురసపు మత్తు నెత్తికి బాగా ఎక్కిపోయిందంటారా?" అని అడిగాడు.

"వాడు వట్టి మంత్రాలనే కాదు. తంత్రాలను కూడా బాగా అభ్యసించినట్టు కనిపిస్తోంది. ఎదుట వున్న వాళ్ళను భయభ్రాంతుల్ని చేసేస్తే ఆ తరువాత తాను ఏం మాట్లాడినా చెల్లుబాటు అయిపోతుందని వాడి అభిప్రాయం... పిచ్చి ప్రశ్నలు వేయకుండా నిలబడు. మన ఉనికి మరోసారి బట్టబయలు అయిపోతే చాలా ఇబ్బంది" చిన్నకంఠంతో అతన్ని హెచ్చరించాడు శ్యామలుడు.

ఎదురు చెప్పలేదు గదాధరుడు. తల ఊపి తిరిగి గుహలోని సంభాషణలను ఆలకించటం మొదలుపెట్టాడు శ్రద్ధగా.

"మంత్రాల దేవరా... మాకు మీ శక్తి ఎటువంటిదో బాగా తెలుసు. తప్పు ఏదయినా మాట్లాడి వుంటే మమ్మల్ని దయచేసి మన్నించండి." అంటున్నాడు ఆగంతకుల నాయకుడు.

గంభీరంగా తల ఊపుతున్నాడు బండరాయి మీది దిగంబరస్వామి. "అయితే చెప్పండి... మీకు మీ ప్రక్క నగర పాలకుడికి వైరం. మీరు చెపుతున్నట్టు అది ఇప్పటిది కాదు... మూడు మూడు ఆరు తరాల నుంచి నడుస్తూ వస్తోంది. వైదర్భి పాలకుడి ఆస్థానంలో చీకటస్వామి అనే మంత్రవాది ఒకడు ఉండేవాడు... అతని అండ చూసుకుని ఆ నగరపాలకుడు మీ ప్రభువును అదే పనిగా అల్లరి పెడుతూ వచ్చాడు మొన్నమొన్నటి వరకూ...." అరమూసిన కనులతో తడుముకోనుకూడా తడముకోకుండా చెప్పాడు అతను.

బండరాయి ఎదుట నిలబడి వున్న ఆగంతకులందరి వదనాల్లో వెంటనే పొడచూపింది విపరీతమైన ఆశ్చర్యం. వారి నాయకుడి మొఖం అయితే రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయింది.

ఆ విషయాన్ని గమనించాడో లేదో తెలియదుగాని, తన మానాన తను చెప్పుకుంటూ పోయాడు దిగంబరస్వామి.

"చీకటిస్వామి అండచూసుకుని అదే పనిగా రెచ్చిపోయిన వైదర్భి పాలకుడి ఆట ఈ మధ్యనే కట్టుబడిపోయింది. నగర పాలకుడితో పాటు అడవిలో వేటకు వెళ్ళిన ఆ మంత్రవాది అనుకోని విధంగా ఒక ప్రమాదానికి గురి అయ్యాడు" అన్నాడు దిగంబరస్వామి.

"అది... ఎటువంటి ప్రమాదం దేవరా?" తడబడుతున్నట్లుగా అడిగాడు ఆగంతకుల నాయకుడు.

"పెద్దపులి బారిన పడలేదు. మదించిన ఏనుగుల మంద పాదాల క్రింద పడలేదు. ఒక పొదప్రక్కగా విశ్రాంతి తీసుకోబోతుండగా అతి సామాన్యమైన ముళ్ళపంది వచ్చి మీద పడింది. మూరెడు పొడవుండే దాని వంటి మీది ముల్లు ఒకటి అతని పాదంలో దిగబడింది. అశ్రద్ధ కారణంగా అది తన ప్రతాపాన్ని చూపించింది. శరీరం విషపూరితమై ఈ ప్రపంచాన్ని వదిలేశాడు. వైదర్భి పాలకుడు బలహీనుడైపోయాడు" చెప్పాడు దిగంబరస్వామి.

"చీకటిస్వామి వంటి మంత్రవాది ఎందుకూ పనికిరాని ఒక సామాన్యమైన ముళ్ళపంది మూలకంగా ప్రాణాలు పోగొట్టుకోవడం చాలా విచిత్రంగా వుంది కదా?" కనులు వెడల్పుగా చేసి మళ్ళీ తానే అడిగాడు.

"దేవర వారు చెప్పింది అక్షరాల నిజం...." వెంటనే అంగీకరించారు ఆగంతకులందరూ వారి నాయకుడితో సహా.

"చీకటిస్వామి కాలం చేశాడని తెలిసిన వెంటనే ధైర్యం వచ్చింది మీ నగర పాలకుడికి... వైదర్భి మీద దాడి చేసి ఆ నగరాన్ని జయించాలని ఆశ పడుతున్నాడు. అందుకే మిమ్మల్ని నా దగ్గరికి పంపించాడు. చీకటిస్వామి ఇంతకు ముందు ఆ నగర పాలకుడికి ఎలా సాయపడ్డాడో అలాగే ఇప్పుడు నేను మీకు సాయపడాలి. అవునా?" అడిగాడు దిగంబరస్వామి.

తాము చెప్పాలని అనుకుంటున్న మాటలన్నీ అతని నోటి వెంటనే వెలుపలికి వచ్చినట్లు తడుముకోకుండా తలలు ఊపారు వాళ్ళు.

"ఎదురు వచ్చిన వాళ్ళందర్నీ తన చూపులతోనే వశం చేసుకుని మర మనుష్యుల మాదిరిగా మార్చి వేసే నా మర్కట పిశాచం ఈ నగరంలోనే ఎక్కడో మటుమాయం అయింది. నగర పాలకుల ఆట కట్టించాలంటే అదే సరయిన

ఆయుధం. కాని అది ప్రస్తుతం నా చెప్పుచేతల్లో లేదు...." నుదురు రుద్దుకుంటూ చెప్పాడు దిగంబరస్వామి.

"అత్యంత సమర్ధులు మీరు... మటుమాయం అయిన ఆ శక్తిని తిరిగి మీ దగ్గరికి రప్పించుకోగలరా... వంచి కొద్దిపానీయాన్ని రుచి చూసి దాన్ని గట్టిగా హెచ్చరించండి...." అన్నాడు ఆగంతకుల నాయకుడు.

"ఎలా హెచ్చరించను? నా చేతులతోనే దాన్ని ఈ నగర సేనాపతికి తోడుగా పంపించాను...." అన్నాడు దిగంబరస్వామి.

"దేవరా... సేనాపతి పని అయిపోయిందని, తిరుగుబాటు అణిచివేయ బడిందని మాకు వివరంగా తెలిసింది. మీ శక్తిని మీరు వెనక్కి పిలుచుకోవచ్చు. ఎటువంటి అభ్యంతరమూ లేదు...." అన్నాడు ఆగంతకుల నాయకుడు.

ఉన్నట్లుండి లేచి బండరాయి మీద నిఠారుగా నిలుచున్నాడు దిగంబర స్వామి... "రావే... త్వరగా వచ్చేయ్... నిన్ను నేను ఆజ్ఞాపిస్తున్నాను... తడవు చేయకుండా నా ఎదుట ప్రత్యక్షమవ్వాలి" ఖంగుమంటున్న కంఠంతో బిగ్గరిగా పిలిచాడు.

"అయ్యబాబోయ్... వాడు మళ్ళీ ఆ దరిద్రాన్ని ఆవాహన చేస్తున్నాడు. అది గనుక ఇప్పుడు ఇక్కడికి వచ్చిందంటే అంతా సర్వనాశనమే...." ఆందోళన నిండిన కంఠంతో శ్యామలుడి చెవిలో ఊదాడు గదాధరుడు.

"నువ్వు అనవసరంగా భయపడకు. వాడు అరిచి జుట్టుపీక్కున్నా అది రాలేదు. తన వశీకరణ శక్తికి తానే వశమైపోయివుంది అది. వాడి అరుపులు దాని చెవులకు చేరవు" నమ్మకంగా చెప్పాడు శ్యామలుడు.

అతని మాటలే యదార్ధమని తేలిపోయింది. బండరాయి మీద నిలబడి గొంతు నెప్పి పుట్టేవరకు అరిచి అరిచి, నిస్త్రాణగా కూర్చుండిపోయాడు దిగంబర స్వామి.

"లాభం లేదు నాయనలారా. నా శక్తి నా మాటల్ని వినిపించుకోవటం లేదు...." నిరాశ నిండిన కంఠంతో చెప్పాడు.

"సర్వశక్తి సమన్వితులు మీరు. అది కాకపోతే మరొకటి... మీరు కాదని అనకుండా మాకు సహాయం చేయమని మా నగర పాలకుడి అభిలాష... దయ

చేసి మరో మార్గం ఏదైనా వుంటే చెప్పండి దేవరా....” వేడుకున్నాడు ఆగంతకుల నాయకుడు.

“ఒకర్ని ఇద్దర్ని గట్టిగా మాట్లాడితే మరో ముగ్గురిని ఏదోఒకటి చేయగలను... నగరాలకు నగరాలను జయించే ప్రతిభ ఇప్పుడు నాకు లేదు. మధురసపు మత్తులో నేను పోగొట్టుకున్న ఉంగరం గనుక ఇప్పుడు నా దగ్గర వుండి ఉంటే–” తను చేయబోయే పనిని ఊహించుకుంటూ మహావికృతంగా అన్నాడు దిగంబరస్వామి.

“మా పాలకుడికి సాయపడండి స్వామి. వైదర్భి నగరం మా స్వాధీనం అయిన వెంటనే మేము అందరమూ మీరు పోగొట్టుకున్న వస్తువును వెతికి మీకు అప్పగిస్తాను” దృఢస్వరంతో మాట ఇచ్చాడు ఆగంతకుల నాయకుడు.

సొరకాయ బుర్రలో వున్న పానీయాన్ని మరికొంచెం పుచ్చుకున్నాడు స్వామి. “గుంపులు గుంపులుగా వచ్చే సైనిక బృందాలను నేను ఏమీ చేయలేను గాని, బుద్ధిబలంతో వైదర్భి పాలకుడిని మట్టుబెట్టేయగలను. ఏమంటారు?” అడిగాడు.

“తమరు ఎలా చెపితే అలాగే... మా సైన్యం మా వనరులు అంతా మీ చెప్పుచేతల్లో వుంటుంది” అన్నాడు ఆగంతకుల నాయకుడు.

సొరకాయ బుర్రను అతనికి అందించి బండరాయి మీదినించి దిగాడు దిగంబరస్వామి.

“పదండి... మీ నగరం వైపు ప్రయాణం ప్రారంభించండి” అంటూ గుహ ద్వారం వైపు నడిచాడు.

“ఓరి వీడి దుంపతెగిపోనూ... ఉన్నట్లుండి కదిలాడు. మనల్ని గమనిస్తే ఇంతే సంగతులు అయిపోతాము.” అంటూ అతి వేగంగా వెనక్కి దూకాడు గదాధరుడు.

అతను హెచ్చరించవలసిన అవసరం లేకపోయింది. అతనితోపాటే తను కూడా కదిలాడు శ్యామలుడు. ఆరే ఆరుక్షణికాల్లో గుట్ట క్రింది భాగంలోకి వెళ్ళిపోయారు వారిద్దరూ.

ఆగంతకుల నాయకుడు ముందుండి దారి చూపిస్తూ వుండగా గుట్ట దిగి నడక మొదలుపెట్టాడు దిగంబరస్వామి.

"మీ నగరం వరకూ నేను కాలి నడకనే ప్రయాణం చేయవలసి వుంటుందా?" పాతిక ధనువుల దూరం పోగానే అడిగాడు.

"బండరాళ్ళ మధ్యన మా వాహనాలు ఎదురు చూస్తున్నాయి. వాటి బడలిక ఈసరికి తీరిపోయివుంటుంది" అన్నాడు ఆగంతకుల నాయకుడు.

అంతకుముందు తాము చితుకుల మంట వేసుకుని. ఆహార పదార్థాలను వెచ్చబెట్టుకున్న ప్రదేశంలోకి దిగంబరస్వామిని తీసుకుపోయారు వాళ్ళు.

అలుపు తీరి ఉత్సాహంగా కనిపిస్తున్న తమ వాహనాలను ఇవతలికి తీసుకువచ్చి దిగంబరస్వామిని ఒక దాని మీద కూర్చోబెట్టారు.

చితుకుల మంటను చూసి ఆ ప్రదేశంలోకి వచ్చి, అన్యాయంగా హతమారి పోయిన నగరపౌరుడి శరీరం అలాగే పడివుంది ఆ బండల మధ్య.

"ఇప్పుడో... ఇంకా కొద్దిసేపటి తర్వాత ఏదో ఒక జంతువు వచ్చి ఈ శరీరాన్ని తనకు ఆహారంగా చేసుకుంటుంది. అనాధప్రేతాలను గాలికి వదిలేయటం మహాపాపం...." దూరదూరంగా నడుస్తూ వారందరినీ అనుసరించి వచ్చిన గదాధరుడు అన్నాడు.

సమాధానం చెప్పలేదు శ్యామలుడు. అడ్డదిడ్డంగా పడిపోయి వున్న ఆ పౌరుడి శరీరాన్ని చేతుల్లో ఎత్తుకుని బండలకు ఆవలగా కనిపించిన ఒక పల్లపు ప్రదేశంలో పరుండబెట్టాడు. దగ్గిర్లో కనిపించిన గులకరాళ్ళను, చిన్నచిన్న బండలను తీసుకువచ్చి ఆ శరీరం మీద పేర్చాడు.

"ఏ గ్రామానికి చెందిన వాడో గాని పాపం అన్యాయంగా హతమారి పోయాడు. ముక్కుమొకం తెలియని వారి మీద ఇంతగా కక్షగట్టే ఆ దుర్మార్గుల్ని నిలువునా నరికి ఉప్పుపాతర వేయాలి. అటువంటి దరిద్రుల్ని తన సైన్యంలో చేర్చుకున్న ఆ నగరపాలకుడిని సింహాసనం మీదినించి లాగి పారేయాలి...." తన అభిప్రాయాన్ని ఘాటయిన మాటలతో వెలిబుచ్చాడు గదాధరుడు.

"తన కుట్రలు కుతంత్రాలు ఎటువంటి అడ్డంకులు లేకుండా సాగిపోయేందుకు అతను మన దిగంబరస్వామిని తన దగ్గరికి పిలిపించుకుంటున్నాడు. సింహాసనం మీదినించి క్రిందికి లాగేయటం మాటలు చెప్పినంత తేలిక కాదు" చేతులకు అంటుకున్న దుమ్మును దులుపుకుంటూ అన్నాడు శ్యామలుడు.

"సరయిన సమయానికి గుర్తుచేశావు. మనం దిగంబరస్వామిని ఏదో చేసెయ్యాలని ఆశపడ్డాము. ఇప్పుడు వాడు మన కనులముందే త్రివిశా నగరం వైపు వెళ్ళిపోతున్నాడు. ఎలా?" ఆత్రుతగా అడిగాడు గదాధరుడు.

"ఆత్రపడినందువల్ల అనుకున్న పనులేమీ త్వరత్వరగా పూర్తికావు. తప్పటడుగు వేస్తే మనకే ప్రాణాపాయం కలుగవచ్చు...." సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"దిగంబరస్వామి పొగరు దిగిపోయే మార్గం చెప్పకుండా నువ్వు వేదాంతపు మాటలు మాట్లాడుతున్నావు...." నిష్ఠూరంగా అన్నాడు గదాధరుడు.

"ముందు మనం ఎక్కడయినా విడిది చేసి కొద్దిపాటి విశ్రాంతి తీసుకోవాలి. కంటి నిండా నిద్రపోయి చాలా రోజులు అయినట్లు అనిపిస్తోంది. మిగిలినవన్నీ విశ్రాంతి తర్వాత...." అన్నాడు శ్యామలుడు.

"ఈ లోపల ఆ దిగంబర సన్నాసి తన అక్రమాలను యధేచ్ఛగా కొనసాగించుకుంటూ వుంటాడు." చిరుకోపంతో ఎత్తి పొడిచాడు గదాధరుడు.

"త్రివిశా నగరం ఇక్కడికి ఎంత దూరం?" అడిగాడు శ్యామలుడు.

ఆకాశంలోని నక్షత్రాల వంకచూసి తల తడుముకుంటూ లెక్కలు కట్టాడు గదాధరుడు. "పాతిక క్రోసుల దూరం... అక్కడినించి వైదర్భి ఆరుక్రోసులు...." అని చెప్పాడు.

"ఎంతవేగంగా ప్రయాణం చేసినా వాళ్ళు రేపు సాయం సమయానికి గాని త్రివిశను చేరుకోలేరు. నగర పాలకుడితో సమావేశమై ఏదో ఒక పథకాన్ని రచించటానికి మరో రెండు మూడు రోజుల వ్యవధి అవసరం అవుతుంది. ఈ లోపల మనం విశ్రాంతి తీసుకోవటం పూర్తి అయిపోతుంది" అంటూ ముందుకు అడుగు వేశాడు శ్యామలుడు.

తాను ఆశించిన సమాధానం అతని దగ్గర్నించి రాకపోవటంతో, విసురుగా తల విదిలించాడు గదాధరుడు. సరిగ్గా పది అడుగులు మాత్రమే వేశాడు అతను. పదకొండో అడుగు వేయకముందే తెలిసివచ్చింది అతనికి విశ్రాంతి తీసుకున్న తరువాత శ్యామలుడు ఏం చేయాలని అనుకుంటున్నాడో...

"మనం వైదర్భి నగరానికి పోతున్నాము... అక్కడి నగర పాలకుడికి దిగంబరస్వామిని ఎదిరించటంలో సాయం చేయబోతున్నాము... అంతేకదూ?" ఉత్సాహంగా అడిగాడు.

బయటికి చెప్పకపోయినా తన అంతరంగంలోని మాటలను అంది పుచ్చుకోగల తన జతగాడిని చూసి చిరునవ్వు నవ్వాడు శ్యామలుడు.

"వైదర్భి నగర పాలకుడు నిజాయితీపరుడు అయితే బాగానే వుంటుంది. కాకపోతే?" ప్రశ్నించాడు గదాధరుడు.

"ముందు దిగంబరస్వామి. తర్వాత వైదర్భి పాలకుడు. అధికంగా ఆలోచించి నీ మెదడును కష్టపెట్టుకోబోకు" చెప్పాడు శ్యామలుడు.

*　　　*　　　*　　　*　　　*

రెండవ ఝాము గడిచిపోతూ వుండగా... ఉన్నట్లుండి నడవటాన్ని ఆపి శిలా విగ్రహం మాదిరి నిలుచుండిపోయాడు గదాధరుడు.

"ఏమయింది? ఆకలి అధికం అయిందా? పాదాలు పని చేయటానికి ఇష్టపడటం లేదా?" తాను కూడా ఆగిపోతూ విసుగునిండిన కంఠంతో అడిగాడు శ్యామలుడు.

"అవేమీ కాదుగాని, ఏదో వాసన సోకుతోంది...." నిలబడిన ప్రదేశంలో నుంచి కదలకుండా తలను మాత్రం కొద్దిగా పైకెత్తి గాలిని వాసన చూస్తూ అన్నాడు గదాధరుడు.

"వాసన అంటే ఏమిటి? ఎటువంటి వాసన?" అడిగాడు శ్యామలుడు.

"పశువుల వాసన... గుంపులు గుంపులుగా వున్న పశువులు... వాటితో పాటుగా కొన్ని మేకలు...." చుట్టూ చూస్తూ అన్నాడు గదాధరుడు.

గుంపులు గుంపులుగా పశువులు వుండటం అంటే... ఏదో గ్రామం ఇక్కడికి సమీపంలోనే వున్నదని అర్థం...

విశ్రాంతి తీసుకోవటానికి అనువైన ప్రదేశాన్ని చేరుకోవటానికి ఎంతదూరం నడవాలో తెలియకుండా మొండిగా అడుగులు వేస్తున్న శ్యామలుడికి ఎంతో హాయిని గొలిపాయి ఆ మాటలు.

"ఎక్కడ వున్నాయో చూడు... ఆలస్యం చేయకు...." అంటూ అతన్ని తొందరపెట్టాడు.

ఎత్తిన తలను ఎత్తినట్టే వుంచి గాలిని వాసన చూస్తూ. ఒక ప్రక్కకు కదిలాడు గదాధరుడు.

వంద ధనువుల దూరం పోయిన తర్వాత లీలగా అతని కర్ణేంద్రియాలకు సోకింది పశువులు చేస్తున్న శబ్దం.

"నువ్వు ఇక్కడే వుండు... చిటికెలో చూసి వస్తాను...." అని శ్యామలుడిని హెచ్చరించి అటుగా పరుగు తీశాడు అతను.

దట్టంగా ఎదిగి వున్న ముళ్ళపొదలు కనిపించాయి మొట్టమొదట. వాటి వెనుక వున్న పెద్ద పల్లపు ప్రదేశం అగుపించింది ఆ తరువాత.

ఆ పల్లపు ప్రదేశంలో నిలువబడి వున్నాయి పశువులు. వాటితోపాటే నిలువబడి వున్న కొన్ని మేకలు కూడా కనిపించాయి అతనికి... నక్షత్రాల వెలుగులో.

"ఎవరు ఇక్కడ? ఈ మందలకు యజమానులు ఎవరు??" పల్లపు ప్రదేశం అంచుమీద నిలువబడి బిగ్గరిగా అరిచాడు అతను.

అరిచిన మరుక్షణం అతని మీదికి ఎగబడ్డాయి నాలుగు ఆకారాలు. నల్లగా వున్న మందపాటి గొంగళ్ళను వంటి మీద కప్పుకుని వున్నాయి అవి. పొడవాటి కర్రల్ని రెండు బరిశెల్ని పట్టుకుని అతన్ని తల్లక్రిందులు చేయటానికి ప్రయత్నించాయి.

"నేను మీకు శత్రువును కాదు... విశ్రాంతి తీసుకోవటానికి అనువైన చోటును వెతుక్కుంటూ వచ్చిన బాటసారిని...." అంటూ అడ్డుకోవటానికి ప్రయత్నించాడు అతను.

ఆ మాటలు వినబడనట్లు మరింతగా రెచ్చిపోయాయి అవి... కర్రలతో అతని భుజాలను విరగగొట్టటానికి, బరిశెలతో గుండెల మీద పొడవటానికి చూశాయి.

తన దట్టీకి వ్రేలాడుతున్న కరవాలాన్ని వేగంగా బయటికి లాగి, తన వంటి మీద దెబ్బపడకుండా కాచుకున్నాడు గదాధరుడు.

"అయ్యలూ... నిజం చెబుతున్నాను... నేను బాటసారిని... శత్రువును కాదు... దొంగను అంతకన్నా కాదు... దయచేసి కాస్తంత నిదానించండి" అంటూ వేడుకోవాలని అనుకున్నాడు గాని, అందుకు అవకాశం లభించలేదు.

కర్రలతో బరిశెలతో మీదికి ఎగబడిన నాలుగు ఆకారాలకు తోడుగా పల్లంలో నిలబడి వున్న పశువుల మంద వెనుకభాగంలో నుంచి మరో పది ఆకారాలు అతని దగ్గరికి వచ్చేశాయి.

వాటి చేతుల్లో వున్నవి కర్రలు బరిశెలు కాదు. పదునైన కరవాలాలు. వంటికి తగిలిన మరుక్షణం తీవ్రంగా గాయపరిచి, ప్రాణాలను హరించి వేస్తాయి అవి.

వారు ఎవరో, ఎందుకు అలా గుంపుగా వచ్చి పడుతున్నారో అవగతం కాలేదు గదాధరుడికి.

తన కరవాలంతో వారందరినీ ఎదుర్కోగల శక్తి అతనికి వున్నది. అవసరం అయితే దొరికిన వారిని దొరికినట్లే హతమార్చగల నైపుణ్యం కూడా వున్నది.

కాని, అపరిచితులు వాళ్ళు. వివరాలు తెలియని పరిస్థితి. మీదికి వచ్చిన రెండు కత్తులు గాలిలోకి ఎగిరిపోయేటట్లు తన ఆయుధంతో కొట్టి ఒక్కసారిగా వెనక్కిదూకాడు అతను.

భయంతో బెంబేలెత్తిపోతున్న వాడి మాదిరి వేగంగా పరుగు మొదలు పెట్టాడు. పాతిక ధనువులు దూరం వరకూ తోడేళ్ళ మంద మాదిరి అతన్ని వెంటాడాయి ఆ ఆకారాలు.

"నన్ను పట్టుకోవడం మీకు సాధ్యపడదు. పరుగుపందేలు వేయటంలో నన్ను మించిన మొనగాడు ఈ భూ ప్రపంచంలో మరొకడు లేదు. మీరు నన్ను చేరుకోలేరు...." వెక్కిరింపుగా అంటూ వేగాన్ని మరింతగా పెంచాడు అతను. మరో రెండు ధనువుల దూరం తరిమిన తర్వాత అతని మాటలు యదార్ధమని తెలిసింది కాబోలు ఆగిపోయాయి ఆ ఆకారాలు. నెమ్మది నెమ్మదిగా వెనుతిరిగి పల్లపు ప్రదేశం దగ్గరికి వెళ్ళిపోయాయి.

* * * * *

"నువ్వు ఒక పెద్ద బందిపోటు దొంగలకు నాయకుడివని భావించి పదునైన ఆయుధాలతో ఎదిరించటానికి వచ్చారు ఆ పశువుల కాపర్లు. నువ్వు ప్రాణాలు దక్కించుకోవటానికి పారిపోయి వచ్చావు. అంతే కదూ?" తాము అనుసరిస్తున్న దారిలో వున్న ఒక బండరాయి దగ్గిర కూర్చుని వున్న శ్యామలుడు అడిగాడు... రొప్పుతూ రోజుతూ పరిగెత్తుకు వచ్చిన గదాధరుడిని.

"నేను కాబట్టి రాగలిగాను. అదే నువ్వయితే కాళ్ళు మడతబడి క్రింద పడిపోయి వుండేవాడివి. వాళ్ళు పశువుల కాపర్లు కాదు. పశువుల కాపర్ల దగ్గర బరిశెలు వుండవచ్చేమో గాని పదునైన కరవాలాలు వుండవు" తాను గమనించిన విషయాలను గుర్తు చేసుకుంటూ చెప్పాడు గదాధరుడు.

"మరి వాళ్ళు ఎవరై వుంటారని నీ అభిప్రాయం?" అడిగాడు శ్యామలుడు.

"నా కంటే నీకే తెలివితేటలు అధికం... ఆ ప్రశ్నకు సమాధానం నువ్వే చెప్పాలి...." ముఖం మీద ప్రత్యక్షం అయిన స్వేదబిందువుల్ని అద్దుకుంటూ అన్నాడు గదాధరుడు.

"మనం వదిలి వచ్చిన నగరం ఎన్నెన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. ఆ గందరగోళం ఈ చుట్టుపట్ల వున్న గ్రామాలను కూడా అల్లకల్లోల పరుస్తూ వుండి వుంటుంది. ఇదే అదనుగా బందిపోట్లు గ్రామస్థులను దొచుకోవడం మొదలుపెట్టి వుంటారంటావా?" అన్నాడు శ్యామలుడు.

"బందిపోట్ల దగ్గిర పదునైన ఆయుధాలు వుండటం సహజం... కాని నా మీదికి వచ్చిన వారు మాత్రం చాలా చురుకయిన వాళ్ళు... కరవాలాల్ని పట్టుకోవటంలో బాగా శిక్షణ పొందినట్లు నాకు అనిపించింది." జరిగిన గొడవను గుర్తు చేసుకుంటూ చెప్పాడు గదాధరుడు.

పది క్షణికాలు ఆలోచించి బండరాయి దగ్గిర్నించి పైకి లేచాడు శ్యామలుడు.

"ఎక్కడికి మిత్రమా? తిరిగి ప్రయాణం మొదలు పెడదామా?" అడిగాడు గదాధరుడు.

"పల్లంలోని పశువుల మందను నువ్వు చూసి వచ్చావు. మరి నేనుకూడా చూడాలి కదా...." అన్నాడు శ్యామలుడు.

ఒక్క క్షణికం పాటు తీవ్రమైన ఆందోళన గదాధరుడి వదనంలో ప్రత్యక్షం అయింది. "మిత్రమా... ఈసారి వాళ్ళు ముందు జాగ్రత్తలు చాలా తీసుకుని వుంటారు. పారిపోయి రావటానికి అవకాశాలు లభించకపోవచ్చు." అంటూ అతన్ని వారించటానికి ప్రయత్నించాడు.

"ఈ భూమి మీద దొంగలు అని ఎవరినైనా సంభోందించాలంటే అది మన ఇద్దరిని గురించే అయివుండాలి. వేరే వాళ్ళు ఆ విధంగా పిలిపించు కోవటానికి వీలులేదు... అంతే" అంటూ ముందుకు అడుగువేశాడు శ్యామలుడు.

ప్రక్కనే పెట్టుకుని వున్నాడు గదాధరుడు తన కరవాలాన్ని. తిరిగి దాన్ని చేతుల్లోకి తీసుకుంటూ పైకి లేచాడు.

"నేను పారిపోయి వచ్చిన దారి మీద వాళ్ళు ఒక కన్ను వేసి వుంచుతారు... వేరే కోణంలో నుంచి వెళ్ళాలి...." అంటూ అతన్ని అనుసరించాడు.

* * * * *

అర్ధరాత్రి సమీపిస్తున్నా శయనమందిరం వైపు పోలేదు వైదర్భి నగర పాలకుడు. చేతులు వెనక్కి పెట్టుకుని తన భవనం ఎదుట వున్న పూతోటలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

అర్ధరాత్రి అరుగుదెంచినట్లు కోట గోడల మీద వుండే గంట ఒకటి మ్రోగటం మొదలుపెట్టేసరికి... భవనంలో నుంచి తోటలోకి వచ్చింది నగర పాలకుడి సతీమణి.

"సమయం మించిపోతున్నది... ఆలస్యంగా నిద్రిస్తే తిరిగి రేపు నిద్ర మేల్కోవటానికి కూడా ఆలస్యం అవుతుంది. తమ ఆశ్రితులు చాలా ఇబ్బంది పడతారు. తమ ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది." ఆయన దగ్గరికి వస్తూ మృదువుగా హెచ్చరించింది.

"నిద్ర రావటంలేదు దేవీ... కొండంత అండగా వుండే మంత్రవాది మరణించటంతో మాకు చేతులు విరిగిపోయినట్లుగా వున్నది" అటూ ఇటూ తిరగటాన్ని ఆపి ఆమెకు చెప్పాడు నగర పాలకుడు.

"చీకటిస్వామి అకాల మరణం నిజంగా చాలా బాధాకరమైన అంశం. కాని ప్రభూ... రాజ్యాలను పరిపాలించే వారు తమ భుజబలాన్ని, బుద్ధి బలాన్ని నమ్ముకోవాలి. మంత్ర తంత్రాలను నమ్ముకుంటే ఎప్పటికయినా ప్రమాదమే కదా...." మృదువుగా చెప్పింది ఆమె.

"శత్రువు నీతిగా నిజాయితీగా పగ సాధించదలుచుకుంటే నువ్వు చెప్పినట్లు భుజబలాన్ని బుద్ధి బలాన్ని నమ్ముకోవచ్చు. కాని ప్రత్యర్ధి జిత్తులమారి గుంటనక్క చీకటిస్వామి సహాయం చేస్తూ వుండబట్టి ఇప్పటివరకూ అతగాడిని అడ్డుకో గలిగాను. ఇప్పుడు మన బలహీనత అతనికి తెలిసిపోయింది. ఏ క్షణంలో ఏం చేస్తారో ఊహించటానికి వీలు లేకుండా పోతున్నది" అన్నాడు నగర పాలకుడు.

తమ ప్రత్యర్ధి ఎటువంటి వారో బాగా తెలిసి వుండటం వల్ల ఆపైన అధికంగా మాట్లాడలేకపోయింది అతని సతీమణి.

"సాహసవంతులు ఎటువంటి ఆపద ఎదురుగా వచ్చినా ఏదో ఒక విధంగా ఎదిరించటానికే చూస్తారు. మీరు తప్పకుండా మీ శత్రువును కట్టడి చేయగలరు. నాకు నమ్మకం వుంది" అంటూ అతని పాదాలకు నమస్కరించి ఆవలికి వెళ్ళిపోయింది.

తిరిగి అంతకుముందు మాదిరి అటూ ఇటూ తిరగటం మొదలు పెట్టబోయి – చటుక్కున ఆగిపోయాడు నగర పాలకుడు.

కవచ శిరస్త్రాణాలు ధరించిన సేనాపతి ఆ తోట ద్వారం దగ్గరికి రావటమే అందుకు కారణం.

"మా సతీమణి ఇంకా భవనంలోకి పోయినట్లు లేదు. పది క్షణాలు ఆగి నువ్వు చెప్పదలుచుకున్నది ఏమిటో చెప్పవచ్చు" అంటూ తన భార్య వెళ్ళిన వైపు నాలుగు అడుగులు వేశాడు నగర పాలకుడు.

పూపొదల ప్రక్కన గాని, వాటి మధ్యలో వున్న ఒక చలువరాతి మండపంలోగాని ఎక్కడా అగుపించలేదామె.

పది క్షణికాల పాటు చూసి సేనాపతి దగ్గరికి వచ్చాడు అతను. "చీకటి పడిన క్షణం నుంచీ నీ రాకకోసమే ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు చెప్పు" అంటూ దగ్గర్లో వున్న ఒక రాతిమీద కూర్చున్నాడు.

* * * * *

పల్లపు ప్రదేశం చుట్టూ వున్న ముళ్ళ పొదలకు ఆవలివైపు వున్న ఒక బండరాయి చాటున మోకరించి, ముందుకు చూశాడు శ్యామలుడు.

చీకటి సమయమే అయినా ఆకాశం నిర్మలంగా వుండడం వల్ల నక్షత్రాల వెలుగు సరిపోయింది అతను ఎదుట వున్న పశువుల సంఖ్యను అంచనా వేయటానికి.

దాదాపు వేయి రెండు వందలకు మించి వున్నాయి అవి. మూడు వందలకు కొంచెం హెచ్చుగానే అగుపిస్తున్నది మేకల మంద.

"ఇది తప్పకుండా గ్రామం మీదపడి దోచుకువచ్చిన సంపదే. సందేహం లేదు. వాళ్ళెవరో గాని కాకలు తీరిన దొంగలు...." శ్యామలుడి వెనుక కూర్చుని చిన్నగా అన్నాడు గదాధరుడు.

"వచ్చిన క్షణం నుంచీ వెదుకుతూనే వున్నాడు. ఇంతవరకు నువ్వు చెపుతున్న ఆ దొంగల్లో ఒక్కడు కూడా నాకు అగుపించలేరు...." తను కూడా రహస్యంగానే బదులు ఇచ్చాడు శ్యామలుడు.

"బహుశా వాళ్ళు నా కోసం ఎదురు చూస్తూ ముళ్ళపొదలకు ఆవల నిలబడి వుంటారు. పశువుల మధ్యలోకి రప్పించమంటావా?" అడిగాడు గదాధరుడు.

తల ఊపబోయి చటుక్కున ఆగాడు శ్యామలుడు. "మనం ఇక్కడ ఉన్నట్లు వాళ్ళకి తెలియకూడదు... మన జాడలు కనిపించకూడదు. మన గుట్టు రట్టు అవకూడదు" అన్నాడు.

చిన్నగా నవ్వి నేలను తడిమాడు గదాధరుడు. పిడికిలి ప్రమాణంలో వున్న గులకరాళ్ళు రెండింటిని వెతికి చేతుల్లోకి తీసుకున్నాడు.

"వాటితో ఏం చేస్తావు?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

ఒక రాయిని బలంగా పశువుల మీదికి విసిరాడు గదాధరుడు.

సూటిగాపోయి కునికిపాట్లు పడుతున్న ఒక ఎనుబోతు ముఖం మీద పడిందది. బాధ చాలా ఎక్కువగా కలిగింది కాబోలు... బావురుమని అరిచి ప్రక్కకు దూకింది ఆ జీవం. దాని కొమ్ములు పొడుచుకోవటం వల్ల, తాను కూడా శబ్దం చేసింది మరో జీవం.

సిద్ధంగా పట్టుకున్న రెండవ రాతిని ఈసారి మేకల మందలోకి విసిరాడు అతను... ఎనుబోతుల మాదిరి అరవటంతో ఆగలేదు ఆ జీవాలు... ముళ్ళపొదల దగ్గరికి వేగంగా పరుగులు తీశాయి.

"ఆపండి... వాటిని ఆపి ఎందుకు అరిచాయో చూడండి" ఖంగు మంటున్న కంఠంతో ఆజ్ఞలు ఇస్తూ పల్లపు ప్రదేశంలోకి వచ్చాడు ఒక దృఢకాయుడు.

గదాధరుడు రాళ్ళను విసిరిన మూడో క్షణికంలో మొత్తం పదునెనిమిది మంది దృఢకాయులు ప్రత్యక్షం అయ్యారు. తమ ఆయుధాలను గాలిలో ఊపుతూ పొదల మధ్యకు పరుగులు తీస్తున్న మేకల మందను తిరిగి వెనక్కి మళ్ళించే ప్రయత్నం మొదలుపెట్టారు.

"చూశావు కదా... లెక్కసరిగ్గానే వున్నది కదా... తృప్తి అయినట్లేనా?" కనుల్ని పెద్దవి చేసి వారందరినీ చూస్తున్న శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

"వీళ్ళు దొంగలు అయివుండటానికి అవకాశాలు లేవు. వీళ్ళ ఆకారాలు కదలికలు ఆయుధాల్ని పట్టుకున్న విధానం అంతా కొత్తకొత్తగా వుంది. సైనికశిక్షణ పొందిన వారి మాదిరిగా కనిపిస్తున్నారు." కనులు చిట్లిస్తూ అన్నాడు శ్యామలుడు.

"సైనిక శిక్షణ పొందిన వారయితే తాము ఎవరో ఎక్కడినుంచి వచ్చారో అందరికీ తెలిసేటట్టు బహిరంగంగా నిలుచోవాలి. ఇలా పొదలమాటున పిల్లుల మాదిరి నక్కి దాక్కోకూడదు. నా వంటి అమాయకులు ఎవరైనా తమ సమీపంలోకి వస్తే మర్యాదగా మాట్లాడాలి. సగౌరవంగా వెనక్కి పంపాలి. పిశాచాల మాదిరి వెంటపడి తరమకూడదు...." అంటూ ఇంకో రెండు రాళ్ళను క్రిందినించి తీసి అంతకు ముందు కంటె మరింత బలంగా పశువుల మీదికి విసిరేశాడు గదాధరుడు.

శ్యామలుడి సూచనల కోసం ఎదురు చూడలేదతను. అసలు తాను ఏం చేయబోతున్నాడో కూడా అతనికి తెలియ చేయలేదు.

గింగిరాలు తిరుగుతూ వచ్చిపడిన పలుకురాళ్ళ దెబ్బకు తీవ్రంగా గాయ పడ్డాయి రెండు పశువులు. గగ్గోలుగా అరిచి వేగంగా ముందుకు దూకాయి.

పొదల మధ్యకు పారిపోతున్న మేకల్ని ఆపుతున్న దృఢకాయులు రెండు క్షణికాలు ఆలస్యంగా గుర్తించారు ఆ విషయాన్ని.

"ఆపండి... వాటిని కూడా ఆపి వేయండి... అవి కదిలాయంటే అడ్డుకోవటం ఈ సమయంలో అసాధ్యం...." బిగ్గరిగా అరిచాడు ఒక దృఢకాయుడు.

ఆయుధాల్ని ఉపయోగించటంలోనే కాదు – ఆయుధాలతో సంబంధం లేని చిత్ర విచిత్రమైన విద్యలు కూడా చాలా వచ్చు గదాధరుడికి. ధ్వనుల్ని అనుకరించటం అటువంటి వాటిలో ఒకటి.

పశువుల అరుపుల్ని, పక్షుల కూతల్ని, అడవి జంతువుల గర్జనల్ని ఆఖరికి మానవుల గొంతుకల్ని కూడా బహు సహజంగా తన కంఠంలో పలికించగలడు అతను.

తలను పైకి ఎత్తి అరచేతులు రెండింటినీ నోటికి దగ్గిరగా చేర్చి వికృతమైన ధ్వనిని ఒకదాన్ని వెలువర్చాడు.

ఎత్తుగా బరువుగా వుండే యుద్ధగజపు ఘీంకారం అది. శత్రువుల్ని చూడగానే విపరీతమైన ఆగ్రహంతో రగులుకుపోతూ ముందుకు దూసుకు పోయేటప్పుడు సరిగ్గా అదే విధంగా శబ్దాలు చేస్తాయి అవి.

"ఎదిరించండి... ఒక్కళ్ళని కూడా వదిలి పెట్టవద్దు. అందరూ మరణించి మట్టిలో కలిసిపోవాల్సిందే... దూకండి ముందుకు...." ఖంగుఖంగుమంటూ వెలువడ్డాయి ఆ మాటలు అతని నోటిలో నుంచి.

యుద్ధగజాల వెనుకగా రణరంగంలోకి పరిగెత్తుకుంటూ వచ్చే గజ సైనికుల మాటలు అవి.

పొడవాటి శూలాల్ని, పదునుగా వుండే ఖడ్గాల్ని పట్టుకుని గుంపుగా వచ్చి శత్రువుల మీద పడతారు వాళ్ళు. తమ ఏనుగులు ఎటువంటి విధ్వంసాన్ని సృష్టిస్తాయో, అంతకు రెట్టింపు మారణకాండను సృష్టించడం వారికి అలవాటు.

"వేసేయ్... నరికేయ్... నేల మీదికి నెట్టి తొక్కేయ్...." ఒకేసారి రెండు రకాల గొంతుకలు ఒకదాని వెనుక ఒకటిగా అతని కంఠంలో నుంచి బయటికి వచ్చాయి.

దృఢకాయుల ముఖాల్లో ఎటువంటిభావాలు ప్రత్యక్షం అయ్యాయో గమనించే వ్యవధి శ్యామలుడికి లభించలేదు.

యుద్ధగజపు ఘీంకారాన్ని, వెనువెంటనే వినవచ్చిన వెర్రికేకల్ని ఆలకించిన పశువుల భయం పదింతలు అయిపోయింది. గదాధరుడు మొదలుపెట్టిన రగడను మించి శబ్దాలు చేస్తూ పల్లపు ప్రదేశంలో నుంచి పొదలవైపు పరుగు మొదలు పెట్టాయి అవి.

వాటికంటె పది అడుగులు ముందుగా పొదల్ని అధిగమించి మటుమాయం అయిపోయారు దృఢకాయులు అందరూ.

"పద... త్వరగా పద... మనం కూడా వెళ్ళిపోవాలి...." అంటూ స్నేహితుడి చేతిని పట్టుకుని వెనక్కి లాగాడు శ్యామలుడు.

"మనం వెళ్ళిపోవటం దేనికి?" తన గొప్పతనానికి తనకు తనే మురుసుకుంటూ సమాధానమివ్వబోయి... అతను ఎందుకు అలా తొందరపెడు తున్నాడో అర్థమై, అతి వేగంగా కదిలాడు గదాధరుడు.

పల్లపు ప్రదేశంలో నుంచి కదిలిన పశువులన్నీ ఒకే దిశలో పరుగు మొదలు పెట్టలేదు. చట్రాతిమీద కొట్టిన చిల్లపెంకుల మాదిరి తలా ఒక ప్రక్కకు దారి తీశాయి.

పొడవాటి కొమ్ములున్న తలల్ని కిందికి వంచి, కనుగుడ్లను గిరగిరా తిప్పుతూ స్నేహితులున్న పొదల వైపే వచ్చాయి దాదాపు ఒక వందకుపైగా వున్న జీవాలు.

మరో అరక్షణికం పాటు అక్కడే వుండి వుంటే వాటి పాదాల క్రింద పడిపోవటమో, వాటి కొమ్ములకు ఎరగా మారిపోవటమో తప్పకుండా జరిగి వుండేది.

"పరిస్థితుల్ని అంచనా వేసుకున్న తర్వాత మన విద్యల్ని ప్రదర్శించాలి. మనకు వచ్చుగదా అని ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు వాటిని ఉపయోగించకూడదు" మూడు వందల ధనువుల దూరం పోయిన తర్వాత ఒక పెద్ద బండరాయి దగ్గిర నిలబడుతూ గదాధరుడిని వెక్కిరించాడు శ్యామలుడు.

"ఆ దృఢకాయుల్ని బెదరగొట్ట గలిగానా లేదా?" ఎదురు మాట్లాడాడు అతను.

"వాళ్ళు బెదిరి దూరంగా పారిపోయిన మాట నిజమే. కాని పశువుల సంగతి ఏమిటి? భయంతో చెల్లాచెదురైపోయాయి అవి. తిరిగి ఒక చోటికి చేర్చటం చాలా కష్టం...." అన్నాడు శ్యామలుడు.

"వాటిని తిరిగి ఒకచోటికి చేర్చవలసిన అవసరం ఏముంది?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

"అవి ఎక్కడినించి దొంగిలించబడ్డాయో, తిరిగి వాటిని యజమానుల దగ్గరికి చేర్చటం ఎలాగో తెలియాలి కదా" అన్నాడు శ్యామలుడు.

"అంత శ్రమ అవసరం లేదు మిత్రమా... అడవి జంతువులు కావు అవి. పెంపుడు జంతువులు. తమను అదిలించే వాళ్ళు తమ వెనుక లేకపోతే తమంతట తామే తమను పెంచి పోషించే యజమానుల దగ్గరికి వెళ్ళిపోతాయి...." తేలికగా చెప్పి చుట్టూ చూశాడు గదాధరుడు.

చటుక్కున అతని చేతిని పట్టుకుని, పొదల దగ్గిర లాగినట్లుగానే మరోసారి వేగంగా బండరాయి చాటుకు లాగాడు శ్యామలుడు.

"ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

శబ్దం చేయవద్దన్నట్టు పెదవుల మీద వేలు పెట్టుకుని, కనులతోనే ఒక ప్రక్కకు చూపించాడు శ్యామలుడు.

అటుకేసి చూసిన గదాధరుడికి వెంటనే కనిపించారు ఎనిమిది మంది దృఢకాయులు. పల్లపు ప్రదేశంలో ప్రత్యక్షమైన వారే వాళ్ళు. పశువుల పాదాల

క్రింద పడిపోకుండా వేగంగా పరుగులు తీసి, మిగిలిన వారితో వేరుపడి అటుగా వస్తున్నారు.

"పది రోజుల పాటు పడిన కష్టం అంతా చిటికెలో మట్టి కొట్టుకు పోయింది. చెల్లాచెదురైన వాటిని తిరిగి ఒకచోటికి చేర్చటం మహాకష్టం...." సరిగ్గా స్నేహితులు దాగుకుని వున్న బండరాయి దగ్గరికి వచ్చి నిలబడుతూ అన్నాడు వారిలో ఒకతను.

"ఈ చీకటి సమయంలో మనం చేయగలిగింది కూడా ఏమీ లేదు. వెలుగు వచ్చిన తర్వాత చూసుకోవాల్సిందే" అన్నాడు మరో వ్యక్తి.

"ముందు అందరమూ ఒకచోటికి చేరుకోవాలి... ఎవరెవరు ఎటుఎటుగా పరిగెత్తారో అర్థం కావటం లేదు" అన్నాడు మూడో మనిషి.

"యుద్ధగజాన్ని వెంట బెట్టుకుని వచ్చిన సైనికులు ఎవరై వుంటారు? మన గురించి వాళ్ళకు వివరాలు ఎలా తెలిసి వుంటాయి?" అన్నాడు ఆఖరి మనిషి.

"ఇప్పుడు ఆ మాటలు అనవసరం. పరిగెత్తి పరిగెత్తి నా పాదాలు పని చేయటం లేదు. ముందు కాస్సేపు కుదురుగా కూర్చోవలసిందే...." అన్నాడు మళ్ళీ మొదటి మనిషి.

"ఇప్పుడు మాట్లాడుకుని ఏదో ఒక సమాధానాన్ని సిద్ధం చేసుకోలేకపోతే చాలా కష్టం. తెల్లారేసరికి మూడు వందల మందితో మన దళపతి ఇక్కడికి వస్తానని చెప్పాడు. అతను వచ్చేసరికి మనం వట్టి చేతులతో కనిపిస్తే నిలబెట్టి నరికించేస్తాడు...." అన్నాడు రెండో దృఢకాయుడు.

బండరాయిని ఆనుకుని కనులు మూసుకున్నారు వారందరూ. రాయి వెనుక ఒదిగి కూర్చున్న స్నేహితులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ఈ వ్యవహారం ఏదో క్షణక్షణానికి చిత్ర విచిత్రంగా మారిపోతోంది... మూడొందల మందిని వెంటబెట్టుకుని ఎవరో దళపతి ఇక్కడికి రావటం ఏమిటో నాకు తెలియటం లేదు." శ్యామలుడి చెవిలో గుసగుసలాడాడు గదాధరుడు.

"పిలవని పేరంటానికి వచ్చినట్లు చెప్పాపెట్టకుండా వచ్చి వీళ్ల పథకాలకు అడ్డుకట్ట వేశాము... వాళ్ళు ఎవరో పూర్తిగా తెలుసుకోవాల్సిన అవసరం మనకి

లేదు. మన దారి ఏదో మనం చూసుకోవటం చాలామంచిది.” అన్నాడు శ్యామలుడు.

రెండు క్షణికాలు ఆలోచించి అందుకు అంగీకార సూచకంగా తల ఊపాడు గదాధరుడు. కూర్చున్న ప్రదేశంలో నుంచి లేచి, నిశ్శబ్దంగా అవతలికి వెళ్ళిపోయే ప్రయత్నం చేయబోతుండగా మరోసారి అతని చేతిని పట్టుకున్నాడు శ్యామలుడు.

“మళ్ళీ ఏమయింది మిత్రమా?” అసహనంగా అడిగాడు గదాధరుడు. కనులతోనే చూపించాడు శ్యామలుడు.

ఒకరి వెనుక ఒకరుగా కాళ్ళు ఈడ్చుకుంటూ వస్తున్న దృఢకాయులు చాలామంది కనిపించారు అతనికి.

“చీకటిస్వామి బ్రతికి ఉన్నంత వరకూ ఇటువంటి పరిస్థితి ఎన్నడూ ఎదురుకాలేదు... ఇంతటి అవమానాన్ని భరించాల్సిన అవసరం కూడా కలగలేదు... ఒక్క పశువు కూడా ఈ చుట్టుపట్ల కనిపించడం లేదు. మంత్రం వేసినట్లు మాయమైపోయాయి” బండరాయి దగ్గిర వున్న తమ వారిని చూడగానే బరువుగా అన్నాడు వారిలో ఒకతను.

“జరిగిన దాన్ని గురించి తీరికగా బాధపడవచ్చు. ముందుగా మంచి సమాధానాన్ని సిద్ధం చేసి వుంచుకోవటం బాగుంటుంది. తెల్లవారేసరికి మన దళపతి వచ్చేస్తారు. జరిగిందేమిటో చెపితే అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు” అన్నాడు ముందుగా వచ్చి కూర్చున్న వారిలో రెండవ దృఢకాయుడు.

“మిత్రమా- చీకటిస్వామి అంటే” శ్యామలుడి వైపు చూస్తూ మాటను ఆపాడు గదాధరుడు.

“నీ అనుమానమే నిజం. వీళ్ళు వైదర్భి నగరానికి చెందిన వాళ్ళు. తెల్లవారిన తరువాత రాబోయేది వీళ్ళ దళపతి....” అతని మాటను పూర్తిచేశాడు శ్యామలుడు.

“అంటే వైదర్భి నగర పాలకుడు సామాన్యుడు కాదని అర్థమన్నమాట... తన సైనికుల్ని చుట్టుపట్లవున్న నగరాలకు పంపి దోపిడీలు చేయిస్తున్నాడన్న మాట....” అంటున్న గదాధరుడిని... ఇంకోసారి మాట్లాడవద్దని సైగ చేశాడు అతను.

"దళపతి ఇక్కడికి వచ్చిన తర్వాత అతన్ని శాంతింప చేయటం చాలా కష్టం. ఇక్కడికి రాకముందే జరిగింది ఏమిటో చెప్పటం చాలా బాగుంటుంది" సాలోచనగా అన్నాడు కూర్చుని వున్న వారిలో మరో దృఢకాయుడు.

అందరి వంకా ఒకసారి పరిశీలనగా చూసి వయసులో అందరికంటె చిన్న వయసు కల మనిషిని దగ్గిరికి పిలిచాడు వారి నాయకుడు.

"ఎక్కడా ఆగకుండా ఏకబిగిన ప్రయాణం చెయ్యాలి. రాబందుల గుట్ట దగ్గరికి పోయేసరికి తూర్పుదిక్కు తెల్లబడుతుంది. బహుశా మన దళపతి కూడా అదే సమయానికి అక్కడికి చేరుకోవచ్చు. జరిగింది అంతా వివరంగా చెప్పు. మేము చెల్లాచెదరయిపోయిన పశువుల్ని వెతికి మరోసారి గుంపుగా నిలబెట్టి వర్తమానం పంపిస్తామని చెప్పు... వెళ్ళు" అంటూ ఆజ్ఞ ఇచ్చాడు.

మౌనంగా తల ఊపి అప్పటికప్పుడు ప్రయాణం మొదలుపెట్టాడు ఆ పిన్నవయస్కుడు.

"వాళ్ళకి ఇంకా బుద్ధిలేదు మిత్రమా... ఊరికే వదిలేస్తే ఇంకోసారి ఈ చుట్టుపట్ల దోపిడీలు చేసేందుకు సిద్ధపడుతున్నారు" కోపంగా స్నేహితుడి చెవిలో ఊదాడు గదాధరుడు.

తల ఊపటం అయితే ఊపాడుగాని, పెదవులు విప్పి సమాధానం చెప్పలేదు శ్యామలుడు.

"ఏమిటి నీ అనుమానం?" అసహనంగా అడిగాడు గదాధరుడు.

"వాళ్ళని మనం ఎదిరించి వెనక్కి పారిపోయేటట్లు చేసినంత మాత్రాన ఈ దోపిడీలు ఆగిపోవు. ఏదైనా వ్యాధికి వైద్యం చేయదలుచుకున్నప్పుడు వ్యాధి లక్షణాలకు మూల కారణాన్ని కనిపెట్టి అందుకు చికిత్స చేయాలి...." అన్నాడు అతను.

"అంటే మనం వెంటనే వైదర్భి నగరం వైపు ప్రయాణం మొదలుపెట్టాలి. ఆ నగరపాలకుడికి దేహశుద్ధిచేస్తే తప్ప ఈ ఆగడాలు ఆగిపోవు. అంతేనా?" అడిగాడు గదాధరుడు.

తల ఊపాడు శ్యామలుడు.

"మరి మన దిగంబరస్వామి సంగతి ఏమిటి?" ఇంకో ప్రశ్న వేశాడు గదాధరుడు.

"వైదర్భి నగర పాలకుడిని సరయిన దారిలో పెట్టే ప్రయత్నంలో మన దిగంబర స్వామి కూడా తారసపడ్తాడు. పని కట్టుకుని మనం అతన్ని వెతుకుతూ పోవాల్సిన అవసరం లేదు" అన్నాడు శ్యామలుడు.

"అయితే ఇక ఆలస్యం చేయటం దేనికి? ఈ బండరాళ్ళచాటున తల దాచుకోవాల్సిన పనేమీలేదు...." అంటూ మెల్లగా వెనక్కి జరిగాడు గదాధరుడు. బండరాయికి ఆవలి ప్రక్కన వున్న దృఢకాయులు తమను గమనించలేదని నిశ్చయం అయిన వెంటనే పైకి లేచి పరుగులాంటి నడకతో ప్రయాణం మొదలు పెట్టాడు.

పల్లపు ప్రదేశంలో గుంపుగా నిలబెట్టి వున్న పశువుల్ని, వాటిని ఆక్కడకు చేర్చిన దృఢకాయుల్ని చూడక ముందు అతను విశ్రాంతి కోసం వెంపర్లాడిన విషయాన్ని పూర్తిగా మర్చిపోయాడని తెలుసు శ్యామలుడికి. తనలో తను నవ్వుకుంటూ అతన్ని అనుసరించాడు శ్యామలుడు.

* * * * *

పూతోటలో వున్న రాతి దిమ్మ మీద కూర్చుని తన సేనాపతి చెపుతున్న మాటల్ని ఆలకించేసరికి విపరీతమైన కోపం ముంచుకు వచ్చేసింది వైదర్భి నగర పాలకుడికి.

"ఇందులో మన సైనికుల తప్పు ఏమీలేదు ప్రభూ. అనుకోని విధంగా అవాంతరం వచ్చిపడిందిట... అప్పచెప్పిన పనిని పూర్తి చేయటానికి మరి కొద్ది రోజుల వ్యవధి అవసరం అవుతుందట...." చిన్న కంఠంతో మరోసారి చెప్పాడు సేనాపతి.

"కొద్దిరోజులు కాదు. నెలల తరబడి వేచిచూసినా ఆ పని పూర్తి అవటం అసంభవం" పెదవులు బిగించి తీక్షణంగా చూస్తూ అన్నాడు నగరపాలకుడు.

"రాబందుల గుట్ట దగ్గిరకు వెళ్ళిన మన దళపతికి మన సైనికులే ఒక మనిషిని పంపి ఈ సమాచారాన్ని అందించారు. సమర్థులు ప్రభూ వారందరూ... ఎందుకయినా మంచిదని మన దళపతి మరో పాతికమందిని సమాచారం తీసుకువచ్చిన మనిషి వెంట వారి దగ్గరికి పంపించాడు. తను రాబందుల గుట్ట దగ్గిరే స్థావరాన్ని సిద్ధం చేసుకున్నాడు. అతనికి సహాయంగా నేను మరో రెండువందల మంది సైనికుల్ని పంపించాను" చెప్పాడు సేనాపతి.

అప్పటికి కూడా తగ్గలేదు నగర పాలకుడి ఆగ్రహం.

"ఒకసారి తమ పశుధనం దోపిడీకి గురి అయిన తర్వాత ఎవరయినా సరే ముందు జాగ్రత్తలు తీసుకుని తీరుతారు. గ్రామాల చుట్టూ నెగళ్ళు వేసి

ఆయుధాలతో బహు జాగ్రత్తగా కావలి కాసుకుంటారు. నగరపాలకుడికి సమాచారం పంపి సైనికుల సహకారాన్ని అర్థిస్తారు" అన్నాడు అతను.

"తిరుగుబాటుదారుల దాష్టీకాలతో ఆ నగరం అల్లకల్లోలమౌతూ వుందట ప్రభూ. సైనికుల సహకారం గ్రామస్థులకు అందటం బహుకష్టం...." అన్నాడు సేనాపతి.

"ఆ త్రికుట వర్ధనుడి పీచం అణిచి, త్రివిశా నగరాన్ని కూడా మా స్వాధీనంలోకి తెచ్చుకోవాలన్న కోరికతో అవసరానికి మించిన సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాము. కోశాగారంలోని ధనమంతా సైనికుల్ని పోషించటానికి సరిపోయింది. కొత్తగా పన్నులు వేస్తే నగర ప్రజలు తిరగబడతారు." తన కోపాన్ని కొద్దిగా తగ్గించుకుంటూ అన్నాడు నగరపాలకుడు.

"చుట్టుపట్ల వున్న ఇతర నగరాల దగ్గరికి పోయి మనకు ఆవసరమైన ధనం కోసం ప్రయత్నించటంలో తప్పు ఏమీ లేదని గతంలో చీకటిస్వామి ఉపదేశించబట్టే మనం ఈ ప్రయత్నం మొదలుపెట్టాం ప్రభూ. గ్రామస్థుల దగ్గిర వుండేది పశుధనం ఒక్కటే. దాన్నే వశపరుచుకుంటూ వస్తున్నారు. అనుకోని విధంగా ఇప్పుడు అవాంతరం ఎదురయింది. ఆగ్రహించవద్దని నా వేడుకోలు. రెండు మూడు రోజుల్లో సర్వమూ సరి అయిపోతుంది" వినయంగా అన్నాడు సేనాపతి.

మూడు వంతులకు పైగా తగ్గిపోయింది నగరపాలకుడి ఆగ్రహం. గుంభనంగా తల ఊపి రాతి దిమ్మమీద నుంచి లేచాడు అతను.

"పని పూర్తి అయిన వెంటనే మాకు తెలియచేయండి" అంటూ వెనుతిరిగి అంతఃపురం వైపు అడుగులు వేశాడు.

సేనాపతి కూడా ఉద్యానవన ద్వారంలో నుంచి అవతలికి వెళ్ళిపోయిన తర్వాత ఒక దట్టమైన పొదచాటునుంచి ఈవలకు వచ్చింది నగరపాలకుడి సతీమణి.

నీరు నిండిన కనులతో రాతి బొమ్మమాదిరి అలాగ నిలుచుండి పోయింది. "తల్లీ... రాత్రి గడిచిపోతున్నది తమరు ఇక్కడ ఇలా వంటరిగా నిలబడి వుండటం భావ్యం కాదు. మందిరంలోకి పోదాం పదండి" ఆమె వెనుకే నిలబడి మృదువుగా హెచ్చరించింది ఒక పరిచారిక.

"ప్రజల్ని కన్నబిడ్డల మాదిరి పరిపాలించవలసిన ప్రభువులు వారు. దోపిడీలు చేయించటం ఏమిటీ? ఇంతకంటె అన్యాయం మరొకటి వుంటుందా?

తమ ఆస్తిపాస్తుల్ని పోగొట్టుకున్న అమాయక గ్రామీణుల ఉసురు మాకు తగలకుండా వుంటుందా?" గద్గద స్వరంతో అడిగింది నగరపాలకుడి సతీమణి.

"తల్లీ... గత్యంతరం లేని పరిస్థితి. త్రివిశా నగర పాలకుడిని ఎదిరించాలంటే సైనికుల్ని పోషించాలి. వారిని పోషించటానికి ధనం కావాలి... చీకటి స్వామి బ్రతికి వుండి వుంటే ఇటువంటి పనులు చేయవలసి వచ్చేదికాదు...." నగరపాలకుడి చర్యల్ని సమర్ధించటానికి ప్రయత్నం చేసింది పరిచారిక.

"నువ్వు ఎన్నిచెప్పినా ఈ పనిని మెచ్చుకోవడం చాలా కష్టం. దీనివల్ల మా కష్టాలు అధికం అయిపోతాయే తప్ప అణిగిపోవు...." అంటూ అంతకు ముందు నగర పాలకుడు కూర్చున్న రాతి దిమ్మ మీదే కూర్చుని కన్నీరుమున్నీరు అయింది ఆమె.

ఎలా ఓదార్చాలో తెలియక మౌనంగా ప్రక్కనే నిలబడి పోయింది ఆ పరిచారిక.

*     *     *     *     *

సూర్యోదయం అవుతూ వుండగా కనులు తెరిచి అప్పటివరకూ తను పడుకుని వున్న పడక మీదినించి క్రిందికి దిగింది యువరాణి. ఎదురుగా కనిపించిన ద్వారాన్ని అధిగమించి, వెలుపలికి పోబోతూ వుండగా– వేగంగా వచ్చి ఆమెను అడ్డుకున్నది వృద్ధురాలు.

"మంత్రవాది మహీలుడికి ఆత్రుత అధికం అయిపోతున్నది. తన మంత్ర శక్తులనే కాకుండా రాజభటులను కూడా వీధివీధికి పంపించి నీ కోసం వెతికిస్తున్నాడు. ఈ సమయంలో నువ్వు వెలుపలికి పోతే పట్టుబడటం తప్పనిసరి, నాకు తెలియకుండా నువ్వు అడుగు బయటికి పెట్టకూడదు" మృదువుగా చెపుతూ తిరిగి లోపలికి తీసుకువచ్చింది వృద్ధురాలు.

"ఆ గజదొంగ శ్యామలుడు, అతని జతగాడు గదాధరుడు ఇప్పుడు ఏం చేస్తూ వుండి వుంటారో చూడాలని వున్నది. చూపించవా?" గోముగా అడిగింది యువరాణి.

చిన్నగా నవ్వి ఆప్యాయంగా ఆమె తలను నిమిరింది వృద్ధురాలు "ఒకే ప్రదేశంలో కుదురుగా నిలబడటం గాని, కుశలంగా కూర్చోవటం గాని అలవాటు లేని వీరకుమారులు వాళ్ళు. తమకున్న శౌర్యసాహసాలతో కావాలంటే నగరాలకు

నగరాల్ని, రాజ్యాలకు రాజ్యాల్ని జయించి తమ పరిపాలనలోకి తెచ్చుకోగలరు. ఎందుకు దొంగలుగా మారిపోయారో నాకు కూడా అంతు బట్టడంలేదు. వారిని గరించి తెలుసుకోవాలన్న కోరిక నీకు ఒక్కదానికే కాదు. నాకు కూడా కలుగు తోంది" అంటూ అవతలి మందిరంలోకి తీసుకుపోయి గోక్షీరం నింపిన పాత్రను చేతికి ఇచ్చింది.

అంతకు ముందు మాదిరి వెడల్పుగా వున్న పళ్ళెరం నిండా నీరు నింపి, ఏవేవో మంత్రాలను చదివింది.

నెమ్మదిగా నీటిమీద ప్రత్యక్షమయింది దట్టమైన పొగ. ఆ పొగ మధ్యలో యువరాణి దృష్టి పథంలోకి వచ్చాడు శ్యామలుడు.

*　　*　　*　　*　　*

ఒడినిండా మిగలపండిన రేగుపళ్ళను తీసుకువచ్చి స్నేహితుడి ముందు పోశాడు గదాధరుడు.

"రాబందులగుట్ట అంటే ఇదే మిత్రమా... పేరుకు తగినట్టుగా ఎక్కడ చూసినా ఆ పక్షులే కనిపిస్తున్నాయి" అంటూ తను కూడా అతని ప్రక్కనే కూర్చున్నాడు.

"ఎన్నెన్నో గుట్టలు వున్నాయి ఇక్కడ. ఇదే అదని నీకు ఎలా తెలిసింది...." రుచిగా వున్న ఒక రేగి పండును కొరుకుతూ అడిగాడు శ్యామలుడు.

"చీకటి మిగిలి వుండగానే కట్టెలు కొట్టుకోవటం కోసం ఇద్దరు గ్రామస్థులు ఇటుగా వచ్చారు. వాళ్ళు కనిపించేసరికి మాటల్లో పెట్టాను. దాని పేరు ఏమిటో వాళ్ళు చెప్పారు" అమాయకంగా అన్నాడు గదాధరుడు.

"గ్రామస్తులు మాత్రమే కనిపించారు? మరెవ్వరూ కనిపించలేదా?" యధాలాపంగా అడిగినట్లు చాలా సాధారణంగా అడిగాడు శ్యామలుడు.

"కట్టెలు కొట్టుకునే వాళ్ళు తప్ప ఇంకెవ్వరూ ఇటుకేసి రారట. ఈ మాటకూడా వాళ్ళే చెప్పారు...."

"వైదర్భి నించి వచ్చే దళపతి అతని సైనికులు ఎవరూ రాలేదా?" ఈసారి సూటిగా అడిగాడు శ్యామలుడు.

ఆశ్చర్యం కలిగినట్లు కనుబొమ్మలు ఎగురవేశాడు గదాధరుడు.

"భలేగా అడిగావు మిత్రమా... ఆ విషయం నిజంగానే నేను మర్చి పోయాను. మూడు వందల మందికి ఇంకా కొంచెం ఎక్కువ మందినే వెంట

బెట్టుకుని వైదర్భి దళపతి సరిగ్గా గుట్ట ప్రక్కన గుడారాలు వేసుకుని వున్నాడు... వాళ్ళని చూసిన భయంతో కట్టెలు కొట్టుకోకుండానే వెనుతిరిగారట నాకు కనిపించిన గ్రామస్థులు" తడుముకోకుండా చెప్పాడు అతను.

తల ఊపి తన ముందున్న రేగుపండ్లను ఆరగించటంలో నిమగ్నుడై పోయాడు శ్యామలుడు.

"మిత్రమా... నాకు ఒక సందేహం వచ్చింది. అడగమంటావా?" పది క్షణికాల తరువాత మెల్లగా అతన్ని మాట్లాడించాడు గదాధరుడు.

అడగమన్నట్లు తలను ఎగురవేశాడు శ్యామలుడు.

"దిగంబరస్వామి పోగొట్టుకున్న ఉంగరం ఇంకా మన దగ్గిరే వున్నది. మనకు తెలిసిన వివరాలను బట్టి చూస్తే, అది ఎవరి దగ్గిర వుంటే వారికి లేనిపోని బాధలు, పిచ్చి ఆలోచనలు రావాలి... మరి ఇప్పటివరకూ అటువంటి పరిస్థితి ఏదీ మనకు ఎదురుపడలేదు... ఎందుకని?"

"దాన్ని ముట్టుకుంటే నువ్వు చెప్పినట్లు ఏదో ఒకటి జరిగి తీరుతుందని నీకే బాగా అనుభవం అయింది. అంగవస్త్రంలో మూట కట్టి వంటికి తగలకుండా పట్టుకు తిరుగుతున్నావు. అందుకే ఎటువంటి బాధలు మనల్ని వెతుక్కుంటూ రావటం లేదు." దూరంగా పెట్టివుంచిన మూటను చూపిస్తూ అన్నాడు శ్యామలుడు.

"దాన్ని ఒకసారి బయటికి తీసి బహిరంగంగా నేలమీదపెట్టి చూస్తే ఎలా వుంటుంది?" అడిగాడు గదాధరుడు.

అతనికి ఏదో దురాలోచన వస్తున్నట్లు అర్ధమైపోయింది శ్యామలుడికి. "దుష్టశక్తి అని తెలిసిన తర్వాత దానితో ఆటలు ఆడటం మన ఆరోగ్యాలకు ఏమంత మంచిది కాదు. అయినా ఆ కొండగుట్టల మధ్య నీకు ఆ తలంపు ఎందుకు కలిగింది?" అని అడిగాడు.

"వైదర్భి నించి వచ్చిన సైనికులకు గాని, దళపతికి గాని ఇది కనిపిస్తే పిచ్చెక్కి వాళ్ళల్లో వాళ్ళు కొట్టుకుని సర్వనాశనం అయిపోతారని నా ఆశ...." చిరునవ్వుతో చెప్పాడు గదాధరుడు.

"పిచ్చెక్కించేది కాదు ఇది. స్వార్ధపూరితమైన ఆలోచనల్ని రేకెత్తించేది. దాన్ని ఆ దళపతి చేతికి ఇస్తే వెనక్కిపోయి వైదర్భి నగరపాలకుడి మీద తిరుగుబాటును లేవ దీయవచ్చు" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"నా ఆలోచన కూడా అదే మిత్రమా. వైదర్భి నగరంలో అల్లకల్లోలాలు ఉద్భవిస్తాయి. కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చినట్లు అవుతుంది కదా."

తల అడ్డం తిప్పాడు శ్యామలుడు.

"మనం వైదర్భి పాలకుడిని గురించి మాత్రమే ఆలోచించాలి. అమాయకులైన నగర పౌరులకు ఎటువంటి ఆటుపోట్లూ ఎదురు కాకూడదు. అవికాక ఇప్పుడు ఈ సమయంలో ఈ ఉంగరం వల్ల ఆ నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అవతల వున్న దిగంబరస్వామి దృష్టిలోకి వెళ్ళిపోతుంది. అతను తన ఉంగరపు జాడల్ని పసికట్టాడంటే మరోసారి మర్కట పిశాచం వంటి క్షుద్రశక్తుల్ని ప్రయోగిస్తాడు" అన్నాడు శ్యామలుడు.

"ఏడిచాడు. తను అశక్తుడినని తనంతట తానే తనకోసం వచ్చిన వారితో చెప్పుకోవటం నువ్వు విన్నావు, నేనుకూడా విన్నాను" నాలుక చప్పరిస్తూ చాలా తేలికగా అన్నాడు గదాధరుడు.

"అది... ఆ మాటలు తన ఉంగరం ఎక్కడ వున్నదో తెలియకపోవడం వల్ల అన్నటువంటివి. తెలిసిన తర్వాత తనశక్తికి మించిన ప్రయత్నాలు మొదలు పెట్టాడు. శత్రువు బలాన్ని అధికం చేసే వాతావరణాలను కల్పించటం చాలా తప్పు." ఖచ్చితమైన కంఠంతో చెప్పాడు శ్యామలుడు.

"సరే మిత్రమా... నువ్వు ఎలాచెపితే అలాచేయటమే నా పని. ఉంగరాన్ని మూటలో నుంచి బయటికి తీయాలన్న ఆలోచనను నా మనసులో నుంచి నెట్టి వేసాను. మరి ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటో చెప్పు" అన్నాడు గదాధరుడు.

"పారిపోయిన పశువుల్లో అన్నింటినీ కాకపోయినా కొన్నింటిని అయినా వెంట బెట్టుకుని వస్తారు మనం అయోమయానికి గురిచేసి వచ్చిన వాళ్ళు. ఈ దళపతి తన వెంట వచ్చిన సైనికులతో వారికి భద్రతను కల్పించి, తమ నగరానికి తీసుకుపోతాడు" అన్నాడు శ్యామలుడు.

"ఆ సంగతి నువ్వు పనికట్టుకుని చెప్పవలసిన అవసరం లేదు. ఇందాక నేను మాట్లాడిన గ్రామస్థుల్ని అడిగినా తడుముకోకుండా చెప్పేస్తారు" అన్నాడు గదాధరుడు.

"అయితే తరువాత చేయవలసింది ఏమిటో వారిని అడిగి తెలుసుకో. వాళ్ళు చెప్పినట్లే చేద్దాము" అన్నాడు శ్యామలుడు.

తను వెక్కిరింపుగా మాట్లాడిన మాటలకు సరైన సమాధానం వచ్చేసరికి పక్కున నవ్వాడు గదాధరుడు.

"దొరికిన పశువులతో ఆ పిచ్చివాళ్ళు ఇక్కడికి వచ్చిన వెంటనే వాళ్ళకి, వీళ్ళకి తోడుగా వచ్చిన వాళ్ళకి జీవితంలో మర్చిపోలేని పాఠం నేర్పాలి. అది ఎలా వుండాలో బాగా ఆలోచించు" అన్నాడు శ్యామలుడు.

"ఈ గుట్టమీద ఉన్న రాబందుల్ని రెచ్చగొడితే?" తన అలవాటు ప్రకారం తలను తడుముకుంటూ అడిగాడు గదాధరుడు.

మాటలతో సమాధానం ఇవ్వలేదు శ్యామలుడు. కనుబొమ్మల్ని ముడిచి క్రూరంగా చూశాడు ఒకే ఒకసారి.

గబగబా చెంపలు వేసుకున్నాడు గదాధరుడు. "తప్పయిపోయింది మిత్రమా... ఏదో మాటవరుసకు అన్నానే గాని, రాబందుల్ని రెచ్చగొట్టడం అసాధ్యమని తెలియకకాదు. నన్ను క్షమించేయ్...." ఊపిరి తీసుకోవటానికి కూడా ఆగకుండా ఏకబిగిన మాట్లాడేశాడు.

"రాబందులు క్షుద్ర జీవులు – చనిపోయిన ప్రాణుల్ని ఆరగించి తమ కడుపులు నింపుకుంటాయే తప్ప వాటంతట అవిగా ప్రాణుల్ని వేటాడటం చాలా అరుదు.

అటువంటి వాటిని రెచ్చగొట్టటం అంటే వాటి గూళ్ళలో నుంచి దూరంగా తరిమి వేయటమే. తమప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తాయిగాని, ఎదురు తిరిగి పోరాటానికి సిద్ధం కావు."

"కాని మిత్రమా–మరి ఆ గూళ్ళల్లో వాటి సంతానం వుంటుంది కదా. తమ పిల్లలకు ఎటువంటి ఆపద ఎదురైనా అవి వెంటనే ఎదురు తిరుగుతాయి కదా...." తన తెలివి తక్కువతనానికి సిగ్గుపడుతున్నట్టు తలను వంచుకున్న తర్వాత కూడా మరో అభిప్రాయాన్ని వెల్లడించకుండా వుండలేకపోయాడు గదాధరుడు.

"తమ సంతానాన్ని రక్షించుకోవటానికి అవి తప్పకుండా ప్రయత్నం చేస్తాయి. కాని వాటి ఆగ్రహం ఆ ఆపద తొలగిపోయేటంత వరకే. నువ్వు ఆశిస్తున్నట్లు అవి వైదర్భి నించి వచ్చిన సైనికుల మీదికి ఎగబడవు. పిచ్చి ఆలోచనల్ని మానుకుని సూటిగా ఆలోచించు...." క్లుప్తంగా హెచ్చరించాడు శ్యామలుడు.

తలను ఎత్తి ఆకాశం వంక చూస్తూ అతను చెప్పినట్లు సూటిగా ఆలోచించటానికి ప్రయత్నించాడు గదాధరుడు.

"గుట్ట మీది గుండ్రటి బండరాళ్ళని క్రిందికి దొర్లించగలిగితే చాలు. చలిమిడి ముద్దల మాదిరి నేలకు అతుక్కునిపోతారు అందరూ...." ఎత్తుగా వున్న గుట్టకేసి చేయి చూపిస్తూ చెప్పాడు.

"వీళ్ళ గుడారాలన్నీ గుట్టకు కొంచెం ఇవతలగా వున్నాయి. క్రిందికి దొర్లే బండలు వాటికి దూరంగా పడతాయి. మనకు మిగిలేది బండల్ని దొర్లించిన శ్రమ మాత్రమే. ఉపయోగం అంటూ ఏమీ వుండదు" అన్నాడు శ్యామలుడు.

"అరివీర భయంకరుడివి నువ్వు. నీ అంతటి వాడిని కాకపోయినా, ఎంతో కొంత వీరాధివీరుడినే నేను... కత్తులు దూసి మనం వాళ్ళమీద కలబడ్డామంటే జింకలమంద మాదిరి చెల్లాచెదురైపోతారు వాళ్ళు" అన్నాడు గదాధరుడు.

పక్కున నవ్వి తను కూడా ఒక పక్కకు చేయి చూపించాడు శ్యామలుడు. అటుకేసి చూసిన గదాధరుడికి, గుడారాల ప్రక్క భాగంలో నిలబడి వున్న యాబదిమంది ధనుర్ధారులు కనిపించారు.

ఆ సైనికుల్లో భాగంగానే వచ్చారు వాళ్ళు. అయితే మిగిలిన వారి మాదిరి కత్తుల్ని, బరిశెల్ని పట్టుకుని ఉండలేదు. పెద్దపెద్ద ధనుస్సులు వున్నాయి వారి దగ్గిర. పదునైన బాణాలతో నిండి వున్న తూణీరాలు వ్రేలాడుతున్నాయి వారి వెనుక భాగంలో.

"కత్తి తిప్పుతూ నువ్వు నేను ఆ గుడారాల సమీపంలోకి కూడా పోకముందే నీ శరీరంలో వంద బాణాలు, నా ఒంటిమీద ఇంకో వంద సూటిగా వచ్చి దిగబడతాయి. ఏం జరుగుతున్నదో అర్థం అయ్యే లోపల ఇద్దరమూ ప్రేతాత్మలుగా మారి గాలిలోకి ఎగిరిపోతాము" చెప్పాడు శ్యామలుడు.

"ఈ రోజున తిథి వార నక్షత్రాలు ఏవీ నాకు అనుకూలంగా లేవు. నేను ఎటువంటి మాటచెప్పినా నువ్వు వెక్కిరించి వేళాకోళం చేస్తున్నావు" కోపం వచ్చినట్లు మూతి ముడుచుకుంటూ అన్నాడు గదాధరుడు.

"వేళాకోళం సంగతి మర్చిపో... జరగవలసింది ఏమిటో చూడు" హితవు చెప్పాడు శ్యామలుడు.

అతను మాట్లాడుతూ ఉండగానే, తమ గిట్టల చప్పుడుతో రాబందుల గుట్ట మీది పక్షుల్ని బెదరగొడుతూ గుడారాల దగ్గరికి వచ్చేశాయి కొన్ని అశ్వాలు. వాటి మీది సైనికుల్ని చూసేసరికి మతిపోయినంత పని అయింది గదాధరుడికి. "ఇప్పుడు వున్న వాళ్ళు సరిపోరని భావించినట్లు ఆ వైదర్భి పాలకుడు మరికొంత మందిని సాయంగా పంపినట్లున్నాడు. చూస్తూ కూర్చుంటే ఇంకో ఘడియ సేపటి తర్వాత ఇంకా కొంతమంది వచ్చే అవకాశం కనిపిస్తోంది" అన్నాడు అతను.

"ఆ తరువాత మరి కొంచెం సేపు ఆగితే, పారిపోయిన పశువుల్లో తమకు దొరికిన వాటిని వెంటబెట్టుకుని, పల్లపు ప్రదేశంలో మనం చూసిన వాళ్ళు కూడా వచ్చి వాళ్ళతో కలుస్తారు. అప్పుడు పరిస్థితి మరింత జటిలంగా మారి పోతుంది" అన్నాడు శ్యామలుడు.

"ముఖాముఖీన ఎదురుపడి అటో ఇటో తేల్చుకోవటం చాలా కష్టం. చేసే పని ఏదో దూరంలో నుంచి చేయటమే నీకు మాకు క్షేమకరం...." ఇంకో సారి తల తడుముకుంటూ అన్నాడు గదాధరుడు.

ఈసారి అతను నిజంగానే ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించటం మొదలు పెట్టినట్లు అర్థమై, మౌనంగా వుండిపోయాడు శ్యామలుడు.

"ఒకపని చేద్దాం మిత్రమా...." ఉన్నట్లుండి అతని కేసి తిరుగుతూ అన్నాడు గదాధరుడు.

"ఏమిటా పని?" కుతూహలంగా అడిగాడు శ్యామలుడు.

"నిన్న ఎప్పుడనగానో తీసుకున్న ఆహారం. ఆకలి అధికమై ఆలోచనలు సరిగ్గా రావటం లేదు. ముందు తిండి సంగతి చూసుకోవాలి...." అన్నాడు గదాధరుడు.

వినటానికి వెక్కిరింపుగానే వున్నా, అతను అలా మాట్లాడటానికి వెనుక ఏదో బలమైన కారణం వుండే వుంటుందని శ్యామలుడికి తెలుసు.

కాలక్షేపం కోసం తనకు ఏమీ తెలియనట్లు అసందర్భ ప్రేలాపనలు చేస్తూ వుంటాడు అతని జతగాడు. యదార్థం ఏమిటంటే నిద్రలో కూడా చాలా నిశితంగా వుంటాయి అతని ఆలోచనలు.

"నీ మాట కాదనే సాహసం నాకు లేదు. కాని గుడారాల దగ్గర వున్న సైనికులు నిన్ను గమనించకుండా సంచరించాలి. కనిపించావంటే వదిలిపెట్టరు. బాగా ఆలోచించుకో" అని జాగ్రత్తలు మాత్రం చెప్పి మౌనం వహించాడు అతను.

దట్టీకి తగిలించి వున్న కరవాలాన్ని ఒకసారి సవరించుకుని, తాము కూర్చుని ఉన్న ప్రదేశంలో నుంచి ఒక ప్రక్కకు బయలుదేరాడు గదాధరుడు. దట్టంగా ఎదిగివున్న పొదల్ని చాటుచేసుకుంటూ, గుడారాలకు పాతిక ధనువుల దూరంలోకి పోయి, చెవులు రిక్కించాడు.

ఎత్తయిన ఒక బండరాయి మీద ఠీవిగా కూర్చుని కనిపించాడు అతనికి ఆ సైనికులందరికీ నాయకుడైన దళపతి. కాలుమీద కాలు వేసుకుని తన ఎదుట కూర్చుని ఉన్న వారితో మంతనాలు జరుపుతున్నాడు.

తను అక్కడికి రాక ముందు నుంచీ జరుగుతున్న వారి సంభాషణ ఏమిటో, దేన్ని గురించో గదాధరుడికి అవగతం కాలేదు.

"పారిపోయిన పశువుల్లో కొన్నింటినయినా తీసుకుని మనవాళ్ళు ఈ సరికి ఇక్కడికి వచ్చేసి వుండాలి. ఇంతవరకూ రాకపోవటానికి కారణం ఏమై వుంటుంది?" పది క్షణికాలపాటు మౌనంగా వుండి, వున్నట్లుండి అడిగాడు బండరాయి మీది దళపతి.

"గుట్టు రట్టు అయి వుంటుందేమో... ప్రభూ... గ్రామస్థులు ఎవరైనా వెంటబడి తరిమి కొడుతున్నారేమో!" వెంటనే సమాధానం ఇచ్చాడు ఎదుట కూర్చుని వున్న సైనికుల్లో ఒకతను.

"అటువంటి ప్రమాదమే ఏదయినా ఎదురుపడితే సహాయం చేసేందుకే మనం వచ్చాము. మరి మనకు వర్తమానం పంపి వుండాలి కదా...." అన్నాడు దళపతి.

"పగటి సమయంలో మనం ఎవరమూ గ్రామస్థుల కళ్ళ పడడం మంచిది కాదని సేనాపతి ఆజ్ఞ.. ఏ పనిచేసినా మనం ఎవరమో తెలియకుండా చేయమని సూచన...." అన్నాడు మరో సైనికుడు.

"ఇంతదూరం వచ్చిన తర్వాత ఇంకా రహస్యంగా సంచరించటం దేనికి?" అడిగాడు మరో సైనికుడు.

"మనకి శత్రుత్వం ఒక్క త్రివిశా నగర పాలకుడితోనే. ఈ నగరపాలకుడితో ఎటువంటి విరోధము లేదు. ఇప్పుడు మనం ఎవరిమో, ఏం చేయాటానికి వచ్చామో ఈ నగరపాలకుడికి తెలిస్తే, ఇతను కూడా శత్రువు అవుతాడు" అన్నాడు అందరికంటె చివరగా కూర్చుని వున్న ఇంకో సైనికుడు.

"నీ మాటలు నిజమే అయినా, ఇప్పటికిప్పుడు అటువంటి పరిస్థితి రాదు. ఈ నగరంలో తిరుగుబాటు జరుగుతోంది. దాని ఫలితం ఎలా వుంటుందో ఎవరికీ తెలియదు...." అన్నాడు దళపతి.

"నగరానికి దగ్గరగా ఉన్న గ్రామాల మీద పడ్డారట మనవాళ్ళు. తిరుగుబాటు సంగతులు వారికి తప్పకుండా తెలుస్తాయి" అన్నాడు ఆ చివరి సైనికుడు.

"మనల్ని ఇక్కడ విడిది చేయమని వర్తమానం తెచ్చిన భటుడు వెనక్కి వెళ్ళిపోయాడా?" అడిగాడు దళపతి.

"పగటి సమయంలో ఎవరికీ కనిపించవద్దనీ, తాము చేసిన దోపిడీలతో గ్రామసీమలన్నీ గందరగోళంతో నిండి వున్నాయని మనల్ని హెచ్చరించి, వెంటనే వెనక్కి వెళ్ళిపోయాడు" వినవచ్చింది సమాధానం.

సాలోచనగా తల ఊపుతున్న దళపతిని, అతని ఆజ్ఞల కోసం ఎదురు చూస్తున్న సైనికుల్ని, దూరంగా వున్న ధనుర్ధారులను ఒకసారి పరిశీలనగా చూసి, ఆ ప్రదేశంలో నుంచి కదిలాడు గదాధరుడు.

దోపిడికి వచ్చిన వారికి అవసరం అయితే సహాయం చేసేందుకు, దోచుకున్న పశు సంపదను తమ నగరానికి తరలించటంలో సహకారం అందించేందుకు వచ్చింది ఆ గుంపు. అంతకుమించి వారి ద్వారా తాము తెలుసుకోదగిన విశేషాలు ఏమీ లేవు.

పొదల్ని, బండరాళ్ళను చాటుచేసుకుని దూర దూరంగా నడిచాడు అతను... రాబందులగుట్ట ప్రక్క భాగంలోకి పోయిన తర్వాత కూడా తాను తన స్నేహితుడు ఆ సాయుధుల్ని ఎదిరించటం ఎలాగో అర్థం కాలేదు అతనికి.

పశువుల్ని దోచుకోవటం, అమాయక గ్రామీణుల్ని అవస్థలపాలు చేయడం ఎప్పటినుంచో జరుగుతున్న విషయం. ఇప్పుడే మొదలుకాలేదు. కాబట్టి దాన్ని గురించి తాము కలత పడవలసిన పని లేదు. ఆ సైనికుల గురించి పట్టించుకోకుండా సూటిగా వైదర్భి నగరం దగ్గరికి వెళ్ళిపోతే ఎలా వుంటుంది.

వైదర్భి పాలకుడి పీచం అణచటానికి తాము ఎలాగూ నిర్ణయించుకుని వున్నారు. పాలకుడి ఆట కట్టడి అయితే, అతని సైనికుల దౌర్జన్యాలు వాటంతట అవే ఆగిపోతాయి.

పది అడుగులు వేసిన తర్వాత కూడా ఆ మాట తన మనసులో నుంచి చెరిగిపోకుండా స్థిరంగా అలాగే ఉండటంతో, ఆ ప్రకారమే చేయటం మంచిదన్న నిశ్చయానికి వచ్చేశాడు గదాధరుడు.

ముందుకుపోయే ఆలోచన విరమించుకుని, వచ్చిన దారినే వెనక్కి మరలబోతూ వుండగా "అయ్యా, తమరు ఎవరు? ఇటుగా వస్తున్నారేమిటి?" అంటూ వినవచ్చింది ఒక కంఠం.

ఉలికిపాటును నేర్పుగా కప్పి పెట్టుకుంటూ ఆ కంఠం వినవచ్చిన వైపుకు చూశాడు అతను.

దట్టంగా ఎదిగివున్నది ఒక ముళ్ళపొద. ఆ పొద వెనుక నిలబడి వున్నారు నలుగురు వ్యక్తులు.

వెదురు బద్దలతో తయారు చేయబడిన విల్లంబులు వున్నాయి వారి దగ్గిర. కొండరాళ్ల మధ్య తిరిగే కొండ గొర్రెల చర్మాలతో కుట్టబడి కనిపిస్తున్నాయి వారి దుస్తులు.

నాగరిక ప్రపంచంతో సంబంధం లేకుండా కొండల మీద బండల్లో జీవితం గడిపే జాతికి చెందిన వారని వెంటనే తెలిసిపోయింది అతనికి.

"మీరు... కొండ క్రిందికి ఎందుకు వచ్చారు?" వాళ్ళు తనను అడిగిన ప్రశ్నను మరిచిపోయినట్లు ఎదురు ప్రశ్న వేశాడు.

"ఎప్పుడు చూసినా ఒకరో ఇద్దరో కట్టెలకోసం ఇటుగా వస్తారు గ్రామస్థులు. ఈసారి ఏకంగా పెద్ద పటాలమే వచ్చినట్లు తెలిసింది. అది ఎందుకు వచ్చిందో తెలుసుకుందామని కొండ దిగాము." సమాధానం ఇచ్చాడు ఆ వ్యక్తులందరిలోకి పెద్దవాడిగా కనిపిస్తున్న వృద్ధుడు.

"గుట్ట అవతల గుడారాలు దించి కూర్చున్న వారిని గురించేనా మీరు అడుగుతోంది?" అన్నాడు గదాధరుడు.

అవునన్నట్లు తల ఊపాడు వృద్ధుడు.

"మాకు వారితో ఎటువంటి సంబంధం లేదు. వాళ్ళు వచ్చింది మీకు హాని తలపెట్టటం కోసం కాదు." అన్నాడు గదాధరుడు.

తమ మనస్సులను వేధిస్తున్న పెద్దసమస్యకు సమాధానం లభించినట్లు తేలికగా నిట్టూర్చాడు వృద్ధుడు.

"ఒకానొకప్పుడు ఈ చుట్టు పట్ల వున్న గుట్టలన్నీ మా ఆధీనంలోనే ఉండేవి. కట్టెలు కొట్టబడే నెపంతో చెట్లను నరికేసి మూడు వంతులు నాశనం చేసేశారు గ్రామస్థులు. చెట్లతో పాటు జంతుజాలం కూడా నశించిపోయింది.

ఎటువంటి బాధలు లేకుండా హాయిగా జీవించే మాకు కష్టాలు మొదల య్యాయి....” బరువుగా ధ్వనించింది వృద్ధుడి కంఠం.

“ఇప్పుడు మీరు దిగి వచ్చిన ఈ గుట్ట బాగానే ఉన్నది కదా. దాని మీద గ్రామస్థుల దృష్టి పడలేదు కదా” రాబందులగుట్ట పైభాగంలో దట్టంగా ఎదిగి ఉన్న వృక్షజాలం వంక చూస్తూ అన్నాడు గదాధరుడు.

“అందుకు కారణం – గ్రామస్థులకు మా మీద వున్నది జాలి కాదు. ఈ గుట్ట వెనుక భాగంలో ఉన్న పాములడొంక....” అన్నాడు వృద్ధుడు.

అతను ఎటువంటి సమాధానం ఇచ్చినా తడుముకోకుండా సానుభూతి సూచకంగా తలూపి తన దారిన తాను వెళ్ళిపోదలుచుకున్నాడు గదాధరుడు. అనుకోని విధంగా వృద్ధుడి నోటివెంట వెలువడిన మాటల్ని ఆలకించేసరికి ఝల్లు మన్నది అతని శరీరం.

“పాముల డొంక ఏమిటి? తాతా?” ఆశ్చర్యంగా అడిగాడు.

“సామాన్యంగా మేము ఎవరికీ కనిపించకుండా మా బతుకేదో మేము బతికేస్తూ వుంటాము. అమాయకుడి మాదిరి నువ్వు తలకాయని వంచుకుని సూటిగా అటుకేసి పోతూ ఉండటాన్ని గమనించటం వల్లనే నీకు కనిపించాము” అన్నాడు వృద్ధుడు.

తాను అడిగిన ప్రశ్నకు సమాధానం అది కాదని తెలిసి అసహనంగా తల విదిలించాడు గదాధరుడు.

“విషయం ఏమిటో చెప్పు తాతా... ఇక్కడినించి సూటిగా వెళితే పాముల డొంక వస్తుంది. అంతేనా?” అని అడిగాడు.

తల ఊపాడు వృద్ధుడు.

“పాములడొంకలో ఏముంటుంది? పాములు వుంటాయా?” అడిగాడు గదాధరుడు.

“పాములదేముంది నాయనా... గట్టిగా కొడితే చచ్చి ఊరుకుంటాయి. తోకలు పట్టుకుని గిరగిరా తిప్పి అవతలికి విసిరేస్తే వాంటతట అవే చచ్చిపోతాయి. అక్కడ వున్నది పాములు కాదు. వాటి కంటే ప్రమాదకరమైనది” అన్నాడు వృద్ధుడు.

“ఏమిటది తాతా?” ఓపికగా ఇంకోసారి అడిగాడు గదాధరుడు.

అప్పటివరకూ అతనివైపే సూటిగా చూస్తూ మాట్లాడిన ఆ కొండజాతి మనిషి ముఖంలో వెంటనే అడుగుపెట్టింది ఒక విధమైన భయం.

* * * * *

కనురెప్పలు కూడా కదిలించకుండా పళ్ళెరంలోని దృశ్యాన్ని చూస్తున్న యువరాణికి కూడా వచ్చేసింది అనుమానం.

"నిజమే అవ్వా... పాములకంటె ప్రమాదకరమైన జీవులు ఈ భూమి మీద ఏవైనా వున్నాయని అంటారా?" ప్రక్కనే కూర్చుని వృద్ధురాలిని అడిగింది.

"ఉన్నాయి తల్లీ... ఎక్కడోదాక్కుని పోవాల్సిన అవసరం లేదు. నిన్ను తిరిగి బంధించటానికి ప్రయత్నిస్తున్న మన మంత్రవాది ఆ పాముల కంటె కర్కోటకుడు. వాడికంటే అవే వెయ్యిరెట్లు మంచివి" తడుముకోకుండా చెప్పింది.

మంత్రవాది ప్రసక్తి వచ్చేసరికి మలినపడిపోయింది యువరాణి వదనం. "పూర్వజన్మలో నేను ఏదో పాపం చేసుకుని వుండటం వల్లనే ఈ జన్మలో యువరాణిగా పుట్టాను. ఈ దుర్మార్గుడి దృష్టిలో పడి చిత్రహింసలు అనుభవిస్తున్నాను" గద్గద స్వరంతో అన్నది.

"పిచ్చితల్లీ... బాధలు అందరికీ వుంటాయి. నువ్వు పెద్ద వంశంలో పుట్టడం వల్ల అవి ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నాయి." సానుభూతి ధ్వనించే స్వరంతో అన్నది వృద్ధురాలు.

"నువ్వు ఎన్నిచెప్పినా ఏమీ ఉపయోగం ఉండదు అవ్వా. ఈ దుర్మార్గుడు ఇంకోసారి నన్ను వెతికి పట్టుకోవడం నిజం. నా ప్రాణాల్ని హరించటం కూడా నిజమే" అన్నది యువరాణి.

"గజదొంగ శ్యామలుడి కన్నుపడిన చోట బాధలు బరువులు మటుమాయం అయిపోతాయట. అతని దృష్టి పథంలోకి వచ్చినవారు ఎవరైనా సరే నీతి నిజాయితీ కలవారయితే హాయిగా ఆనందంగా జీవిస్తారట. అవినీతి పరులయితే అందుకు తగిన శిక్షను అనుభవిస్తారట." అరమూసిన కనులతో చిరునవ్వు నవ్వుతూ చెప్పింది వృద్ధురాలు.

"నువ్వు భవిష్యత్తులోకి చూసి చెపుతున్నావా?" అడిగింది యువరాణి.

"కాదు. అతన్ని గురించిన కథల్ని గాథల్ని విన్న తరువాత నాకు తోచిన మాటలు చెపుతున్నా" అన్నది వృద్ధురాలు.

"ఈ నగరానికి యువరాణిగా పుట్టటం తప్ప నేను ఎటువంటి తప్పూ చేయలేదు. నీతి తప్పలేదు. మరి శ్యామలుడి దృష్టి నామీద పడిన తరువాత కూడా ఈ కష్టాలు నన్ను విడిచిపెట్టటం లేదు. నీ మాటలు నిజం ఎలా అవుతాయి?" అడిగింది యువరాణి.

"ఒక్కరోజులో సమస్యలకు సమాధానాలు లభించేటట్లయితే ఈ భూమ్మీద కష్టం అనే మాట వినబడదు. ఆ గజదొంగ దృష్టిలో పడ్డావు కదా... కొద్ది రోజుల పాటు వేచి చూడు" అన్నది వృద్ధురాలు.

గట్టిగా నిట్టూర్చి తల అడ్డం తిప్పింది యువరాణి. "అసాధ్యం అవ్వా... వైదర్భి దగ్గిర వున్న ఆ గజదొంగ ఇక్కడికి రావటానికి కనీసం ఒక మాసం వ్యవధి అవసరం అవుతుంది. ఈ లోపల ఈ దుష్ట మాంత్రికుడు నన్ను తన ఆధీనంలోకి తీసుకుని తీరతాడు" నిరాశ నిండిన కంఠంతో వాపోయింది.

ఫక్కున నవ్వింది వృద్ధురాలు. "పిచ్చితల్లీ...." అంటూ యువరాణి తలను నిమిరింది.

"ఎందుకు నవ్వావు?" ఆశ్చర్యంగా అడిగింది యువరాణి.

"శ్యామలుడు వైదర్భి దగ్గిర లేడు. మన నగరంలోనే వున్నాడు. మనం చూస్తున్నది అతని గతం... ఎప్పుడో జరిగిపోయిన సంఘటనల్ని. అతన్ని అర్థం చేసుకోవటానికి, అతన్ని గురించిన పూర్తి వివరాలు తెలుసుకోవటానికి చూస్తున్నాము...." అన్నది వృద్ధురాలు.

తన బాధల్ని తలుచుకుని కృంగిపోతూ, తాను చేస్తున్న పనిని గురించి మర్చిపోయి ఏమోమో మాట్లాడినందుకు సిగ్గుపడింది యువరాణి.

ఎర్రబారిన ఆమె బుగ్గల్ని పుణికి ముద్దుగా తల నిమిరింది వృద్ధురాలు. "నీకు అనుమానాలు అనవసరం... నీకోసం ఈ నగర భవిష్యత్తు కోసం ప్రాణాలు అర్పించేందుకు కూడా వెనుతీయని వారు ఎంతోమంది వున్నారు. ఈ దుష్టుడి అంతు చూసి తీరతాము. మనసు కష్టపెట్టుకోకుండా సంతోషంగా వుండు" అన్నది.

పళ్ళెరం వైపు చూసింది యువరాణి. మటుమాయం అయిపోయి వున్నాయి అందులో కనిపిస్తున్న దృశ్యాలు.

చేతుల్ని జాచి ఏవో మంత్రాలను చదువుతూ తల ఊపింది వృద్ధురాలు. నిర్మలంగా వున్న నీటి మీద తిరిగి పొగలు ప్రత్యక్షం అయ్యాయి. ఆ పొగల మధ్యలో యువరాణికి అగుపించాడు గదాధరుడు.

* * * * *

కొండమీది నుంచి దిగివచ్చిన కొండజాతి వృద్ధుడితో మాట్లాడుతున్నాడు అతను.

"భయపడటం దేనికి తాతా? పాములడొంకలో ఎటువంటి ప్రమాదం పొంచులు వేసి వున్నది?" తన ప్రశ్నను మరోసారి అతనికి వినిపిస్తున్నాడు.

అప్పుడు కూడా తన భయాన్ని వదిలిపెట్టలేదు వృద్ధుడు. "నడిరాత్రిలోనే కాదు. పగటి సమయంలో కూడా ఆ విషయాన్ని గురించి మాట్లాడుకోవటం మంచిది కాదు. నాలుగు కాలాలపాటు బ్రతికి వుండాలనే కోరిక వుంటే వెనుతిరిగి వెళ్ళిపో ముందుకు పోకు" అన్నాడు దృఢస్వరంతో.

"అది కాదు తాతా... అసలు అక్కడ–" అంటూ అతన్ని ఒప్పించటానికి ప్రయత్నించాడు గదాధరుడు.

వినిపించుకోలేదు ఆ మాటని ఆ వృద్ధుడు. గిరిక్కున వెను తిరిగాడు. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో గుట్టమీద దట్టంగా మొలిచివున్న పొదల మధ్యకు పోయి అదృశ్యమైనాడు.

తలను తడుముకుంటూ దగ్గిర్లో వున్న ఒక బండరాయి మీద చతికిల పడ్డాడు గదాధరుడు.

నిజానికి అతను అక్కడినించి వెనక్కి వెళ్ళాలనే అనుకున్నాడు. శ్యామలుడి దగ్గరికిపోయి గుడారాల దగ్గర తాను ఆలకించిన మాటల్ని చెప్పాలనీ, ఆ తరువాత తన నిర్ణయాన్ని అతనికి వినిపించాలని భావించాడు.

"పాములడొంక... ఈపేరే చాలా విచిత్రంగా వున్నది. పాములడొంకలో పాముల్ని మించిన ఆపద ఏదో వున్నది. గజదొంగ శ్యామలుడికి జతగాడినై వుండి కూడా అదేమిటో తెలుసుకోలేకపోతే ఎలా?"

తనలో తాను అనుకుంటూ పది క్షణికాల తరువాత బండమీది నించి లేచి బయలుదేరాడు. వెనక్కి కాదు. కొండజాతి వృద్ధుడు వద్దని వారించిన దిశలోకి.

* * * * *

కాలి మడమలతో తన అశ్వాన్ని చాలా గట్టిగా అదిలించింది వైదర్భి నగర పాలకుడి అర్ధాంగి.

"అంతవరకూ అతి నెమ్మదిగా ఎగుడుదిగుడుగా ఉన్న మార్గంలో ఆచితూచి అడుగులు వేస్తున్న అశ్వం– అదిరిపడి ముందుకు దూకింది ఒక్కసారిగా.

అశ్వచాలన విద్యను చాలాగట్టిగా అభ్యసించి వుండటం వల్ల. క్రింద పడిపోకుండా కళ్ళేలను మరింత గట్టిగా పట్టుకుని కూర్చోగలిగింది ఆమె. ఆ

విద్యను అభ్యసించకుండా ఉండి వుంటే – తల్లక్రిందులై నేలను కౌగిలించుకుని వుండేది.

ఆచితూచి అడుగులు వేయటాన్ని ఆపి, అతి వేగంగా పరుగులు మొదలు పెట్టింది ఆ అశ్వం.

"వద్దు తల్లీ... చాలాసేపటి నుంచీ మనం ప్రయాణం చేస్తూ వస్తున్నాము. నెమ్మదిగానే వచ్చినా వాటికి తప్పకుండా అలసట కలిగే వుంటుంది. ఈ స్థితిలో వేగం మంచిది కాదు" తన వాహనాన్ని ఆమె వెనుకే పరుగు తీయిస్తూ ప్రార్థించింది ఆమె చెలికత్తె.

వినిపించుకోలేదు మహారాణి. "పెళ్ళికి పోవటంలేదు మనం. గ్రామసీమల్లో జరుగుతున్న అన్యాయాన్ని గురించి ఆ నగరపాలకుడికి చెప్పి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టమని హెచ్చరించటానికి పోతున్నాము" అంది.

"తల్లీ... మన ప్రభువుల వారికి ఈ సంగతి తెలిస్తే ఎంత ప్రమాదమో ఆలోచించండి" ఆ మాటను అప్పటికి ఎన్నోమార్లు చెప్పినా, మరోసారి చెప్పకుండా ఉండలేకపోయింది చెలికత్తె.

"ప్రభువులకు తెలియదు. వారు నా మందిరానికి వచ్చి పలు దినాలు అయింది. నా గురించి మర్చిపోయినట్లు ప్రవర్తిస్తున్నారు" పెదవులు బిగపడుతూ చెప్పింది మహారాణి.

"మన సైనికులు, ఎందరో ఇప్పుడు మనం ప్రయాణిస్తున్న మార్గంలో మనకు తారసపడవచ్చు. వారిలో ఎవరైనా మిమ్మల్ని గుర్తిస్తే" అంటూ ఆపైన భయంతో మౌనంగా వుండి పోయిందా చెలికత్తె.

గుర్తించటానికి అవకాశాలున్నాయేకాని, గుర్తుపట్టగలరని గట్టిగా చెప్పటానికి వీలులేదని కూడా ఆమెకు తెలుసు.

అంతఃపురంలో నుంచి బయలుదేరిన సమయంలో తన వేషాన్ని పూర్తిగా మార్చుకున్నది మహారాణి. తన అంతస్థును సూచించే అలంకరణలన్నిటినీ వదిలి, సామాన్యమైన యువతి మాదిరి దుస్తుల్ని ధరించింది.

దళపతి వంటి అధికారులకు తప్ప ఆమె రూపం ఎటువంటిదో, మాట ఎలా ధ్వనిస్తుందో ఎవరికీ తెలియదు.

"నువ్వు అనవసరమైన భయాలను మనసులో పెట్టుకోకు. చీకటిపడే లోపు మనం నగరానికి దగ్గరిగా పోవాలి. దారిలో కనిపించే ప్రతి గ్రామాన్ని

హెచ్చరిస్తూ ప్రయాణం చేయాలి" తన వాహనాన్ని ఇంకోసారి అదిలిస్తూ తన నిర్ణయాన్ని తెలియచేసింది మహారాణి.

తాను ఎంతచెప్పినా ఆమె ఆలకించదని అర్థమై మౌనంగా వుండి పోయింది చెలికత్తె.

ఆఘమేఘాల మీద పరుగుతీయటం మొదలుపెట్టాయి వారి వాహనాలు. దట్టమైన దుమ్ముతెరలు గాలిలోకి లేవసాగాయి.

గదాధరుడి కోసం ఎదురుచూస్తూ, ఒక బండరాయిని ఆనుకుని కూర్చున్న శ్యామలుడికి కనిపించినాయి ఆ దుమ్ముతెరలు. గుడారాల దగ్గిర వున్న సైనికులకు కూడా అగుపించాయి.

"మన నగరంవైపు నుంచి రెండు అశ్వాలు అతివేగంగా వస్తున్నాయి ప్రభూ... బహుశా సేనాపతి ఏదైనా వర్తమానం పంపించి వుంటారు" బండరాయి మీదినుంచి లేచి తన గుడారంలోకి పోబోతున్న దళపతి దగ్గిరికి వచ్చి విన్నవించాడు ఒక సైనికుడు.

"వెంటనే నా దగ్గరికి తీసుకురండి. ఆ వర్తమానం ఎటువంటిదో నేనే స్వయంగా వింటాను" అన్నాడు దళపతి.

పరుగులాంటి నడకతో గుడారాలకు అవతలగా వున్న మార్గం దగ్గరికి పోయి నిలుచున్నాడు ఆ సైనికుడు.

"తల్లీ... సైనికులు... మన సైనికులే" మహారాణిని హెచ్చరించింది వెనుకగా వస్తున్న చెలికత్తె.

తను కూర్చుని ఉన్న బండ దగ్గర్నించి ఏ మాత్రం ముందుకు పోయినా, ఆ సైనికుల కంట పడక తప్పదని తెలుస్తూనే వున్నది శ్యామలుడికి.

కాని కొత్తగా వస్తున్నది ఎవరో, ఎందుకు వస్తున్నారో తెలుసుకోవటం కూడా అతి ముఖ్యం అనిపించి, నేలమీద బోర్లా పడుకున్నాడు అతను. పాము మాదిరి మోచేతుల మీద పాకుతూ సాధ్యమైనంత దగ్గరికిపోయి, ఒక పొద చాటున మోకరిల్లి కూర్చున్నాడు.

మూరెడు ఎత్తుమీద ఒకటి రెండు బెత్తల ఎత్తు మాత్రమే వున్నది ఆ పొద. తల వంచుకుని కూర్చున్నంత వరకూ కాపాడుతుంది అతన్ని. ఏ మాత్రం తల ఎత్తినా వెంటనే రట్టు అయిపోతుంది గుట్టు.

"తల్లీ... సైనికులు... మనల్ని ఆపటానికి సిద్ధంగా." దగ్గిరగా పోతున్న కొద్దీ ఆరాటం అధికం అయిపోతుండగా – మహారాణిని హెచ్చరించింది చెలికత్తె.

"మాట్లాడకు... నా వెనుకే వచ్చేయ్...." విసురుగా హెచ్చరించి తన వాహనాన్ని మరోసారి అదిలించింది మహారాణి.

ఇంకా కొంచెం వేగంగా కదిలింది అది... మార్గానికి దగ్గిరగా నిలబడిన సైనికుడు వున్నట్లుండి మధ్యలోకి వచ్చేశాడు.

"ఆగండి... వైదర్భి పాలకుల సైనికులం మేము. ఆగిపోండి" అంటూ చేతుల్ని బార్లా జాచాడు.

అతివేగంగా పరుగుతీస్తున్న అశ్వాన్ని ఆపదలచుకోలేదు మహారాణి. అతని ప్రక్కనుంచి ముందుకు దూకించబోయింది.

అది కొండదారి. అప్పుడప్పుడు ఎవరో ప్రయాణాలు చేస్తూ వుండడం వల్ల రహదారి మాదిరిగా కనిపిస్తోందే తప్ప, సరయిన దారి మాత్రం కాదు.

మూరెడు లోతున్న ఒక చిన్నగోతిలో పడింది అశ్వపు పాదం. చెవులు చిల్లులు పడేటట్లు సకిలిస్తూ ముందుకు తూలి క్రింద పడిపోయింది అది. కళ్ళేలను మరింత గట్టిగా పట్టుకుని తనను తాను నిగ్రహించుకోవటానికి ప్రయత్నించిన మహారాణి కూడా క్రిందపడి నేలను కౌగిలించుకున్నది.

"అయ్యయ్యో... అదేమిటి తల్లీ, అలా పడిపోయారేమిటి?" ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ, తన వాహనాన్ని ఆపి, క్రిందికి దూకింది రాణీవారి చెలికత్తె.

చాలీచాలని ముళ్ళపొద వెనుక మోకరిల్లి కూర్చుని ఉన్న శ్యామలుడికి మతి పోయినంత పని అయింది.

దట్టంగా దుమ్ముతెరలు పైకి లేచేటంత వేగంగా అశ్వాలు నడపగలిగిన వాళ్ళు మగవాళ్ళే అయి వుంటారని భావించాడు అతను. ఎండపొడ ఒంటికి తగిలితే కందిపోయేటంత సుకుమార వనితలై వుంటారని ఊహించలేదు.

కాలు మడతపడి ముందుకు తూలిన అశ్వం మీది నించి చాలా వేగంగా క్రింద పడింది మొదటగా వస్తున్న ఆడమనిషి. దెబ్బ బలంగా తగిలినట్లుంది పడిన చోటినించి కదలటంలేదు.

"తల్లీ... తల్లీ" అని సంభోదిస్తూ రెండవ వాహనం మీది నించి దూకి ఆమె దగ్గరికి వస్తున్న రెండవ యువతిని చూసి శ్యామలుడి మాదిరిగానే విపరీతమైన ఆశ్చర్యానికి గురి అయినాడు – చేతులు బార్లాజాచి దారికి అడ్డంగా నిలువబడిన సైనికుడు.

"ఎవరు మీరు? ఎక్కడినించి ఎక్కడికి పోతున్నారు?" అని అడుగుతూ రెండవ యువతి దారిని అడ్డగించాడు.

అవతల క్రింద పడిపోయి వున్న మనిషిని గురించి ఆలోచించకుండా, అనవసరమైన ప్రశ్నలు మొదలుపెట్టిన అతన్ని చూసి అసహ్యంగా తల విదిలించింది ఆ యువతి.

"నీకు బుద్ధి అనేది లేదు. ప్రక్కకు తప్పుకో" అంటూ అతన్ని అవతలికి నెట్టి ముందుకు అడుగువేయబోయింది.

దెబ్బతిన్నది ఆ సైనికుడి అహం. "ఎవరు మీరని మర్యాదగా అడుగుతుంటే సమాధానం చెప్పకుండా పెడసరంగా మాట్లాడతావా?" అంటూ ఆమె చేతిని పట్టుకుని బలంగా ఇవతలికి లాగాడు.

క్రిందపడిన యువతి పడినట్లే వున్నది. ఎటువంటి కదలికా కనిపించటం లేదు. ఆమె సంగతి ఆలోచించకుండా అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్న ఆ సైనికుడి తీరు శ్యామలుడికి తీవ్రమైన ఆగ్రహాన్ని కలిగించింది.

తాను పైకి లేచి ముందుకు దూకితే దూరంగా వున్న పైనికులందరికీ కనిపించక తప్పదనే సంగతిని మర్చిపోయాడతను. తాను ఏం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన ఆవేశంలో మునిగిపోయాడు. పొదచాటు నుంచి ఛెంగునలేచి వింటి నుంచి వెలువడిన బాణంలా ఆ సైనికుడి దగ్గరికి దూసుకుపోయాడు.

"వదులు... నన్నువదులు...." అని హెచ్చరిస్తూ సైనికుడి చేతిని వదిలించుకోవటానికి చూస్తోంది రెండవ యువతి.

"నిన్ను మా దళపతి దగ్గరికి తీసుకుపోయిన తర్వాత వదులుతాను. అప్పటివరకూ నువ్వు నన్ను వదిలించుకోలేవు" వెకిలిగా అంటూ బలవంతంగా గుడారాల దగ్గరికి తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నాడు.

మబ్బులేని పిడుగు మాదిరి పోయి అతనిమీద కలబడ్డాడు శ్యామలుడు. ఎడమచేతి పిడికిలితో మెడమీద బలంగా ఒక పోటు పొడిచాడు. కుడిచేత్తో రెండవ యువతిని పట్టుకున్న అతని చేతిని తీవ్రంగా గాయపరిచాడు.

"రండిరోయ్... రండి... రండి... శత్రువు. మన మీద దాడి చేయటానికి వచ్చాడు" గాయపడిన చేతిని గుండెలకు అదుముకుంటూ గొంతు చిరిగి పోయేటట్లు కేకలు పెట్టాడు ఆ సైనికుడు.

ఎడమపాదాన్ని వెనక్కి తీసుకుని ఎగిరి తన్నాడు శ్యామలుడు అతని నోటి మీద.

ముందు వరుసలో వున్న మూడు పళ్ళు పుటుక్కున ఊడిపోయాయి అతనికి. ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి రావటం మొదలుపెట్టేసరికి, మరింత పెద్దవి అయ్యాయి అతని అరుపులు.

"శత్రువు నన్ను చంపేస్తున్నాడు. వచ్చేయండి... వచ్చి కాపాడండి" నేల మీద వెల్లకిలా పడిపోయి గావురు గావురుమనటం మొదలుపెట్టాడు.

"అయ్యా... మీరెవరో తెలియదు. కోరికోరి మీ ప్రాణాల మీదికి తెచ్చు కున్నారు. వాడి సహచరులు చాలామంది ఇటుగా వచ్చేస్తున్నారు" భయం నిండిన కంఠంతో శ్యామలుడిని హెచ్చరించింది రెండవ యువతి.

తల తిప్పి చూసిన శ్యామలుడుకి పుట్టలో నుంచి వెలువడే చీమల మాదిరి గుంపుగా వచ్చేస్తున్న సైనికులు కనిపించారు.

అప్పుడు కూడా తను లేనిపోని ప్రమాదాల్ని చేజేతులారా తన తలమీదికి తెచ్చుకుంటున్నారేమోనన్న భావం కొంచెంగా కూడా అతని మనస్సులోకి ప్రవేశించలేదు.

"పడిపోయింది ఎవరు? నీకు ఏమౌతుంది?" అడిగాడు రెండవ యువతిని.

అతను అలా ప్రశ్నించినప్పుడు ఉలిక్కిపడిందామె. "అయ్యయ్యో... నా తల్లి... నా తల్లికి ఏమయిందో ఏమిటో...." విపరీతమైన ఆందోళనతో గద్గద కంఠంతో అటుకేసి కదిలింది.

"వస్తున్న జనం గురించి నువ్వేమీ దిగులు పడవలసిన అవసరం లేదు. లేపి కూర్చోబెట్టు. నీ దగ్గిర నీళ్ళు వుండే వుంటాయి. మొఖం మీద జల్లితే

స్పృహ వస్తుంది. కాళ్ళు చేతులకు దెబ్బలు గట్టిగా తగిలివుంటే మాత్రం కదలనీయకు. నేను వచ్చి చూస్తాను....” అంటూ ఆమెకు జాగ్రత్తలు చెప్పి తన కరవాలాన్ని వరలో నుంచి బయటికి తీశాడు శ్యామలుడు.

గుడారాల దగ్గిర్నించి చీమలదండు మాదిరి కదిలిన సైనికులు కందిరీగల గుంపు మాదిరి వచ్చి అతని మీద కలబడ్డారు.

పళ్ళు బిగపట్టి రెండు అడుగులు వెనక్కివేసి తన కరవాలాన్ని గాలిలో తిప్పటం మొదలు పెట్టాడు శ్యామలుడు.

గుంపుగా వచ్చి మీదపడితే అరక్షణికంలో అతను తల్లక్రిందులై తమకు దొరికి పోతాడన్న అతి నమ్మకంతో వచ్చిన ఆ సైనికులకు ఊపిరి తీసుకునే వ్యవధి కూడా లభించలేదు.

చూస్తూ చూస్తూ వుండగానే తమ ఆయుధాలు గాలిలోకి ఎగిరిపోగా, గుండెలమీద గాట్లు పడి నేలను కౌగిలించుకున్నారు పదిమంది. తలలు తెగిపోతాయన్న భయంతో వెనక్కి పరుగుతీశారు మరో పదిమంది.

మెరుపుకంటే వేగంగా కదులుతున్న శ్యామలుడి ఖడ్గానికి అందనంత దూరంలో నిలబడి హాహాకారాలు చేశారు మిగిలిన వారందరూ.

“అంతమంది వెళ్ళి కూడా ఒక చచ్చు పుచ్చు మనిషిని పడగొట్టడం చేతకాక గావుకేకలు పెడుతున్నారా? మీరు అసలు సైనికులేనా?” గుడారాల దగ్గర నిలబడి తీవ్రమైన ఆగ్రహంతో వారి నాయకుడు అరిచిన అరుపు అందరికీ వినిపించింది. శ్యామలుడి చెవులకు కూడా చేరింది.

జరుగకూడనిది ఏదో వెంటనే జరిగిపోతుందన్న భావం వెంటనే శ్యామలుడి మనసులో ప్రవేశించింది.

కత్తులకు బరిశెలకు లొంగని శత్రువును పడగొట్టాలంటే బాణ ప్రయోగం తప్పనిసరి.

గుడారాల దగ్గిర వున్న పెద్దమనిషి ఇప్పుడు చేయబోయేది కూడా అదే. దూరదూరంగా నిలబడిన సైనికుల మీదికి దూసుకుపోయే ఆలోచనను వెంటనే విరమించుకుని వెనక్కి దూకాడు అతను.

ఏదో ఒక బండరాయిని ఎన్నుకుని దాని వెనుక తల దాచుకోవటమే సరైన మార్గమని అనుకుంటూ, తల తిప్పి వెనక్కి చూశాడు.

సరిగ్గా అదే సమయంలో రివ్వురివ్వుమంటూ వచ్చిపడ్డాయి మూడు మూరల పొడుగు వుండే యుద్ధబాణాలు.

"కొట్టండి... గిలగిలలాడుతూ క్రిందపడి పొర్లిగింతలు పెట్టేట్లు గురిచూసి కొట్టండి...." ఖంగు ఖంగుమంటున్న నాయకుడి కంఠం అదేపనిగా వినవచ్చింది.

సూటిగా వచ్చిన పది బాణాల్ని తన కరవాలంతో చెల్లాచెదురు చేసేశాడు శ్యామలుడు. నాలుగే నాలుగు అంగల దూరంలో కనిపించింది అతనికి నడుము ఎత్తున వున్న ఒక నల్లరాతిబండ. దాని వెనక్కి చేరుకోగలిగితే తనకు ఎటువంటి ప్రమాదము ఉండదని అర్థమై ఎగిరి అటుకేసి దూకాడు.

అరక్షణికమే ఆలస్యం అయింది. బండరాయిని ఒక్క అరక్షణికం ముందు చూడగలిగినా, చూసిన వెంటనే అటుగా కదిలినా చాలా బాగుండి వుండేది.

బండరాయిని సమీపిస్తున్న సమయంలో వేగంగా వచ్చి అతని కుడిభుజం మీద దిగబడింది ఒక యుద్ధబాణం.

ఎంత ప్రయత్నం చేసినా ఉపయోగం లేకపోయింది. అతనికి తెలియకుండానే జారి క్రిందపడిపోయింది కరవాలం. ఎర్రటి నెత్తురు వెల్లువలా వెలువడి దుస్తుల్ని మలినపరుస్తూ వుండగా ముందుకు తూలి, ఆ నల్లరాతి బండముందు బోర్లా పడిపోయాడు.

బాహాబాహీ, కచాకచి, ఘనాఘన మహాయుద్ధంలో అత్యంత నేర్పరితనాన్ని చూపి, విజయాన్ని సాధించినట్లు పెడబొబ్బలు పెట్టారు అంతకుముందు ఆయుధాల్ని వదిలి దూరంగా పారిపోయిన వీరాధి వీరులు అందరూ.

"బంధించండి... కాళ్ళు చేతులు కదలకుండా కట్టి పడవేయండి" ఖంగుమంటూ వినవచ్చింది నాయకుడి మరో ఆజ్ఞ.

తోడేళ్ళ మంద మాదిరి కదులుతున్న సైనికుల్ని చూశాడు శ్యామలుడు. క్రిందపడి కదలిక లేకుండా వున్న యువతిని, కన్నీరు విడుస్తూ ఆమెకు తెలివి తెప్పించటానికి విఫల ప్రయత్నం చేస్తున్న ఆమె సహచరురాలిని చూశాడు. ఆ తరువాత తనకు కూడా మైకం కమ్ముకోవడంతో తలను వాల్చేశాడు.

*        *        *        *        *

"అయ్యయ్యో... అవ్వా... అతను తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాలు పోగొట్టుకుంటాడంటావా?" పళ్ళెరంలోని నీటిలో జరిగిన సంఘటనను చూస్తున్న యువరాణి, తడి ఆరిపోయిన కంఠంతో వృద్ధురాలిని అడిగింది.

ప్రక్కనే కూర్చుని ఏదో తాళపత్ర గ్రంధాన్ని తిరగేస్తున్నది వృద్ధురాలు. తలతిప్పి తను కూడా పళ్ళెరం వైపు చూసింది.

చూసిన వెంటనే చిన్నగా నవ్వింది. "పిచ్చి తల్లీ... ఎన్నిమార్లు చెప్పినా నీకు జ్ఞాపకం వుండటం లేదు. ఇప్పుడు మీకు కనిపిస్తున్నవన్నీ ఎప్పుడో జరిగి పోయిన సంఘటనలు. కత్తులు పట్టుకోవడం, బాణాలు వదలటం సరిగ్గా చేతకాని ఆ మూర్ఖుల చేతిలో గజదొంగ శ్యామలుడు ఎలా ప్రాణాలు పోగొట్టు కుంటాడు?" అన్నది.

"మరి గాయం చాలా తీవ్రంగా కనిపిస్తోంది. రక్తం వరదలా వెలువడు తోంది" అస్పష్టంగా అన్నది యువరాణి.

"పిచ్చి తల్లీ అప్పుడు అతను ప్రాణాలు పోగొట్టుకుని వుంటే, ఇప్పుడు మన నగరంలో ఎలా ప్రత్యక్షం కాగలిగాడు?" ఎదురు ప్రశ్నవేసింది వృద్ధురాలు.

తను వాస్తవాన్ని మర్చిపోయి, పళ్ళెరంలో కనిపిస్తున్నవి ప్రస్తుత దృశ్యాలే అనుకోవటం వల్ల అలా భయం కలిగినట్లు అర్ధమై తల విదిలించింది యువరాణి.

"శ్యామలుడు ఆ సైనికులకు దొరికి పోయాడు. మరి గదాధరుడు ఏమైనట్లు?" అని అడిగింది.

"ఓపికగా చూడాలి తల్లీ... తొందరపాటు పనికిరాదు. మంత్ర పూరితమైన జలం మన మాటల వల్ల తన శక్తిని కోల్పోయింది చూడు" అన్నది వృద్ధురాలు.

చటుక్కున తలతిప్పి చూసింది యువరాణి. వృద్ధురాలి మాటలు యదార్ధమేనని వెంటనే తెలిసిపోయింది.

నిశ్చలంగా వున్నాయి నీళ్ళు. ఎటువంటి దృశ్యాలు ఆమెకు అగుపించ లేదు. "అవ్వా... క్షణ క్షణానికి నా కుతూహలం అధికం అయిపోతున్నది. ఈసారి నువ్వు పలకరించినా పలకను. ఎటువంటి దృశ్యం కనిపించినా తల తిప్పి చూడను...." ఆమె చుబుకాన్ని పట్టుకుని గోముగా అడిగింది.

"ఈ ఒక్కసారికి నీ కోరిక తీరుస్తాను. ఇంకోసారి అడిగితే మాత్రం బాగోదు" అంటూ చేతులు ఊపింది వృద్ధురాలు.

నిశ్చలంగా వున్న నీటిమీద తిరిగి ప్రత్యక్షం అయ్యాయి పొగలు. వాటి మధ్యలో యువరాణికి అగుపించాడు శ్యామలుడు.

"అయ్యయ్యో... నేను చూడాలని అనుకుంటున్నది ఇతన్నికాదు గదాధరుడిని. అతను పాములడొంక వైపు బయలుదేరినట్లు గుర్తు...." అని పెద్దగా చెప్పబోయి, వృద్ధురాలు చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది కాబోలు, మాటను తన నోటిలోనే బంధించి వేసింది ఆమె.

* * * * *

తెలివితప్పిన శ్యామలుడి తొడలు విరిగిపోయేటట్లు పాదాలతో ప్రహరించారు ఇద్దరు సైనికులు. పిడికిళ్ళతో గుండెల మీద ఫెడీఫెడీమని శబ్దాలు వచ్చేటట్లు పొడిచారు.

"తెలివితప్పి వున్న మనిషిని హింసించడం వీరత్వం అనుకుంటున్నారా? మనుష్యులేనా మీరు?" తన సహచరురాలి దగ్గిర కూర్చుని వున్న యువతి వెంటనే వారించటానికి చూసింది వారిని.

వెకిలిగా నవ్వారు వాళ్ళు "అధిక ప్రసంగం మానుకోకపోతే నీకు కూడా పడుతుంది ఇదే గతి" కరుకుగా హెచ్చరించాడు ఒకతను.

పెద్దపెద్ద అడుగులు వేస్తూ వచ్చాడు అక్కడికి దళపతి. "కాళ్ళు చేతులు కదలకుండా బంధించమని ఇందాకనగా ఆజ్ఞ ఇచ్చాను. ఇంకా ఎందుకు బంధించలేదు?" కోపంగా అడిగాడు.

అప్పటికప్పుడు తీసుకువచ్చారు సైనికులు చిటికెన వ్రేలంత మందంగా వున్న పొడవాటి అడవి తీగెల్ని, శ్యామలుడి చేతుల్ని, భుజం మీది గాయాన్ని పట్టించుకోకుండా వెనక్కి విరిచి కట్టారు.

"తీసుకుపోయి ఒక గుడారంలో పడవేయండి. వైద్యం తెలిసిన వారెవయినా వున్నారా మీలో?" సైనికుల్ని చూస్తూ అడిగాడు దళపతి.

రెండు క్షణికాల తరువాత నెమ్మదిగా ముందుకు వచ్చాడు ఒక సైనికుడు. "భుజంలోనే వున్న బాణాన్ని తొలగించి కట్టుకట్టేయ్. తెలివి వస్తే నాకు తెలియ చేయి. తెలివిరాకుండానే గుటుక్కుమంటే రాబందులకు ఆహారంగా వేసేయండి" అని ఆజ్ఞ ఇచ్చి, స్పృహలేని యువతి దగ్గరికి నడిచాడు దళపతి.

ఆమె ప్రక్కనే మోకరించి కూర్చునివున్న యువతి, క్షణికం పాటు కూడా ఆలస్యం చేయకుండా క్రింద వెడల్పుగా పరుచుకుని వున్న ఆమె పయ్యెదను ఎత్తి, ముఖం మీద అడ్డుగా పరిచింది.

"సుకుమారంగా పెరిగిన వనితల మాదిరి వున్నారు. కొండలు, గుట్టలు, బండరాళ్ళు తప్ప మరేమీ కనిపించని ఈ గుగ్గడి ప్రదేశంలో వారి ఆగమనం మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. జాగ్రత్తగా తీసుకుపోయి పరిచర్యలు చేయండి. తెలివి రాగానే నాకు తెలియచేయండి...." అన్నాడు దళపతి.

ముళ్ళకంపను ఈడ్చినట్టు శ్యామలుడిని ఈడ్చుకుంటూ తీసుకుపోయి చిట్టచివరి గుడారంలో పడవేశారు కొందరు సైనికులు.

చేతుల మీద ఎత్తుకున్నారు తెలివి కోల్పోయిన యువతిని. సుతారంగా తీసుకుపోయి, అదే గుడారంలో ఒక ప్రక్కగా పడుకోబెట్టారు.

ఒకరి వెనుక ఒకరుగా ఆమెను గుర్తుపట్టి కేకలుపెడితే ఏం చెయ్యాలో తెలియక బిత్తర చూపులు చూస్తూ తాను కూడా అదే గుడారంలోకి పోయింది ఆమె సహచరురాలు.

శ్యామలుడి భుజం మీది గాయాన్ని ఒకసారి పరిశీలించి, చటుక్కున దిగబడి వున్న బాణాన్ని పట్టుకుని బలంగా బయటికి లాగాడు వైద్యం తెలిసిన భటుడు.

"నువ్వు అంతగా శ్రమ పడవలసిన అవసరంలేదు. మీ సైనికులకు గురిగా కొట్టడం సరిగ్గా చేతకానట్లు కనపడుతోంది. బాణపు మొన మాత్రమే దిగబడింది. ఎముకకు తగలలేదు. ఎక్కువ లోతుకు వెళ్ళలేదు." బాణం ములికి బయటికి తీసిన వెంటనే తెలివి వచ్చింది శ్యామలుడికి. పెదవులు బిగపట్టి గాయం వంక చూస్తున్న సైనికుడితో అన్నాడు మృదువుగా.

విపరీతమైన భయం ప్రత్యక్షం అయింది ఆ వ్యక్తి వదనంలో. తనకు తెలియకుండానే తన ఆయుధం కోసం ప్రక్కకు చూశాడు.

"వైద్యుడి మాదిరిగా బాధ్యతను తీసుకున్న నువ్వు నా దృష్టిలో నారాయణ స్వరూపుడివి. నీకు హాని తలపెట్టను. కలవరపడవలసిన పనేమీలేదు" నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

గాయం చిన్నదే అయినా రక్తస్రావం మాత్రం అధికంగా వుండటం వల్ల, అరచేత్తో దాన్ని అదిమి పట్టుకున్నాడు.

"నన్ను బంధించిన ప్రదేశంలో ఒక ముళ్ళపొద వున్నది. ఎరుపురంగు ఆకులు, నలుపు రంగు ముళ్ళను కలిగి వుంటుంది అది. ఆ ఆకుల్ని తెచ్చి ఈ గాయం మీద వేసి కట్టుకడితే రక్తం కారటం ఆగిపోతుంది. తన వదనంలోకే చూస్తున్న ఆ సైనికుడికి చెప్పాడు.

వెంటనే కదిలాడు సైనికుడు. వేగంగా వెలుపలికిపోయి పది రెండు క్షణికాల తర్వాత శ్యామలుడు చెప్పిన పొద మీది ఆకుల్ని తీసుకువచ్చాడు. మెత్తగా నలిపి గాయంమీద పెట్టి అతని దట్టీనే దాని చుట్టూ చుట్టాడు.

"నా గురించి పట్టించుకోవాల్సిన పనిలేదు... అచేతనంగా పడి వున్న ఆ అతివను ఒకసారిచూడు." గుడారం రెండో ప్రక్కన పడుకోబెట్టబడిన యువతికేసి చూస్తూ చెప్పాడతనికి శ్యామలుడు.

ఎదురు చెప్పకుండా వెళ్ళాడు సైనికుడు. ఆమె కనురెప్పల్ని చూపుడు వేలితో కదిపి, కనుపాపల్ని నిశితంగా పరిశీలించాడు. తల నుంచి పాదాల వరకు నిశితంగా పరిశీలించి చూశాడు.

"బయటికి కనిపించే దెబ్బలుగాని, గాయాలు గాని ఏమీ కనిపించటం లేదు. అగుపించని ప్రదేశంలో తీవ్రంగా గాయపడి వుండాలి" మొట్టమొదటి సారిగా పెదవులు విప్పుతూ, శ్యామలుడికి చెప్పాడు.

నేలమీద పడవేసి ఈడ్చుకుంటూ తీసుకురావటం వల్ల చిమచిమ లాడుతున్న శరీర భాగాలను తడుముకుంటూ లేచి కూర్చున్నాడు శ్యామలుడు.

"క్రిందపడిన సమయంలో నుదురు నేలను పొడుచుకున్నట్లు నాకు అగుపించింది. అక్కడ సరిగ్గా పరిశీలించి చూడు" అన్నాడు.

అతను చెప్పినట్లే చేయటానికి, ఆమె నుదుటికి అడ్డుగా వున్న పమిటెచెంగును కొద్దిగా పక్కకు జరిపాడు సైనికుడు.

శ్యామలుడు ఊహించినట్లే సరిగ్గా మధ్య భాగంలో అతనికి అగుపించింది చిన్నబుడిపె. దాన్ని చూసి భయపడలేదతను. పమిటె చెంగును పక్కకు జరిపిన వెంటనే పూర్తిగా దర్శనమిచ్చిన ఆమె వదనాన్ని చూసి అదిరిపడ్డాడు.

"అయ్యబాబోయ్... మహారాణి... వైదర్భి నగర పట్టమహిషి...." అంటూ ఒక్కసారిగా పైకిలేచి గుడారం వెలుపలికి పరిగెత్తబోయాడు.

అతని కంటే వేగంగా కదిలాడు శ్యామలుడు. గుడారం వెలుపలికి పోకముందే దుస్తుల్ని బిగించి పట్టుకుని బలంగా వెనక్కి లాగాడు.

"దయచేసి నన్ను నిరోధించకండి. దళపతుల వారికి వెంటనే తెలియ చేయాలి. మహారాణి వారే స్వయంగా ఈ గుగ్గుడి ప్రదేశంలోకి వచ్చారంటే అందుకు ఏదో బలమైన కారణమే వుండి వుంటుంది." చిన్నకంఠంతో వేడుకున్నాడు భటుడు.

అతను మహారాణిని గుర్తు పడతాడని ఊహించకపోవడం వల్ల స్థాణువు లాగా నిలబడి వున్నది చెలికత్తె.

"వద్దు... ఎవరికీ చెప్పవద్దు. మేము ఇటుగా వచ్చినట్లు మహారాజులకు తెలియదు." సన్నటి కంఠంతో గబగబా అన్నది.

శ్యామలుడి చేతుల్ని వదిలించుకునే ప్రయత్నాన్ని విరమించుకుని ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడు ఆ సైనికుడు.

"త్రివిశా నగర పాలకుడి మీద విరోధాన్ని కొనసాగించటం కోసం, పరాయి నగర పౌరుల్ని దోచుకోవటం మహారాణి వారికి రుచించలేదు. దోపిడీలు జరుగుతున్న నగరం దగ్గరికి పోయి ఆ నగర పాలకుడిని హెచ్చరించటం కోసం బయలు దేరారు. మహారాజుల వారికి తెలిస్తే అడ్డు కుంటారని చెప్పి, రహస్యంగా బయలుదేరారు" తడుముకుంటూ తడబడుతూ చెప్పింది.

"ఇప్పుడు దళపతికి ఈమె ఎవరో తెలిస్తే తప్పకుండా నగర పాలకుడికి చేరవేయబడుతుందా మాట" అన్నాడు శ్యామలుడు.

పది క్షణికాల పాటు ఆలోచించి గట్టిగా నిట్టూర్చాడు ఆ సైనికుడు.

"దళపతుల వారికి ఈమె ఎవరో తెలియకపోతే మరింత ప్రమాదం ఎదురవుతుంది" అన్నాడు హీనస్వరంతో.

"అదేమిటి? ఎటువంటిదా ప్రమాదం?" నొసలు విరుస్తూ అడిగాడు శ్యామలుడు.

"మంచిది కాదు ఆయనగారి చూపు. బండరాళ్ళు తప్ప మరేమీ కనిపించని ఈ గుగ్గుడి ప్రదేశంలో ఈ అతివలు కనిపించటం అతనికి ఎంతో ఆనందంగా వున్నది" అన్నాడు సైనికుడు.

అప్రయత్నంగా తన నడుమును తడుముకున్నాడు శ్యామలుడు. గట్టిగా నడుముకు చుట్టి వుండవలసిన దట్టీ భుజం మీద గాయానికి కట్టుగా మారి పోయింది. నడుముకు వ్రేలాడుతూ వుండవలసిన కరవాలం, బాణం దెబ్బతగిలిన వెంటనే జారి క్రిందపడిపోయింది.

"కరవాలం వుంటే మాత్రం నువ్వు చెయ్యగలిగింది ఏమీలేదు. నీ చేతిమీది గాయం చిన్నదే అయినా, తిరిగి కదిలిస్తే చాలా పెద్దది అవుతుంది" అన్నాడు సైనికుడు.

తాను గాయపడిన చేతిని మాత్రమే ఉపయోగించగలడని, రెండవ చేతిలో ఆయుధాన్ని పట్టుకోలేడని తలపోస్తున్న ఆ సైనికుడిని చూసి తనలో తాను నవ్వుకున్నాడు శ్యామలుడు.

కుడిచేతిని ఎంత తేలికగా కదిలించగలడో, ఎడమచేతితో కూడా అటు వంటి పనులే అదే వేగంతో చేయగలడు తాను. ఆ సంగతి అందరికీ తెలియవలసిన అవసరం లేదు.

"దళపతికి ఏం చెప్పాలో ఏమి చెప్పకూడదో తరువాత చూసుకుందాము ముందు మహారాణీ వారికి తెలివి రప్పించాలి" తన ఆలోచనల్ని తనలోనే దాచుకుంటూ చెప్పాడు.

"కంటికి కనిపించే గాయాల్ని, కొన్ని చిన్నచిన్న వ్యాధుల్ని మాత్రమే నేను నయం చేయగలను. ఇటువంటి దెబ్బల్ని ఎలా తగ్గించాలో నాకు తెలియదు" తల వంచుకుంటూ అన్నాడు సైనికుడు.

కనులు మూసుకుని ఒకసారి తను తన స్నేహితుడు విశ్రాంతి తీసుకున్న ప్రదేశాన్ని తలుచుకున్నాడు శ్యామలుడు.

అక్కడ తమకు కనిపించిన పొదల్ని మొక్కల్ని గుర్తు చేసుకుంటూ చిరునవ్వు నవ్వాడు.

"నా గాయాన్ని నయం చేసిన పొదకు మూడు విండ్ల దూరంలో చిన్న మొక్క ఒకటి వున్నది. నేపాళం చెట్టు కాదు అది. కాని ఆకులు మాత్రం అదే విధంగా వుంటాయి. వాటిని తెచ్చి ఆమెకు వాసన చూపించు" అన్నాడు.

రెండవసారి ఆ మాటల్ని చెప్పవలసిన అవసరం లేకపోయింది. వేగంగా వెలుపలికి పరిగెత్తాడు ఆ సైనికుడు. పావుఘడియ తరువాత ఆ ఆకుల్ని అరచేతులతో నలుపుతూ తిరిగి వచ్చాడు.

"దళపతి మనసులో ఉన్న మలినపు కోరిక మిగిలిన నా సహచరులందరికీ అంటుకున్నది. మహారాణి వారి చెలికత్తెను గురించి మాట్లాడుతున్నారు. ఈమెను వెలుపలికి పంపించమని కోరుతున్నారు" చిన్నకంఠంతో శ్యామలుడికి చెపుతూ, తాను నలిపిన ఆకుల పసరును మహారాణికి వాసన చూపించాడు.

వెంటనే వచ్చింది ఆమెలో చలనం. గట్టిగా తుమ్మింది. ఒక్కసారిగా కనులు తెరిచి, "నేను ఎక్కడవున్నాను?" అని అడుగుతూ లేచి కూర్చుంది.

"తల్లీ... తొందర పడకండి. తమరి తలకు బలమైన దెబ్బ తగిలింది" అంటున్న చెలికత్తెను వారించి, సైనికుడి వంకా, శ్యామలుడి వంక చూసింది.

మోకాళ్ళ మీదికి వంగి తల వంచి ఆమెకు నమస్కరించాడు సైనికుడు. "నాకు, ఈ యువకుడికి తప్ప మిగిలిన వారెవరికీ మీ గురించి తెలియదు" చిన్న కంఠంతో చెప్పాడు.

"మేము వెంటనే ప్రయాణం ప్రారంభించాలి. ఈ నగర పాలకుడి వద్దకు పోయి" అంటున్న మహారాణిని వారించాడు శ్యామలుడు.

"త్వరపడకండి తల్లీ... పరిస్థితి ఏమిటో మీ చెలికత్తె తెలియచేస్తుంది వినండి" అని చెప్పాడు.

చిన్నకంఠంతో దళపతిని గురించి చెప్పింది చెలికత్తె.

"మేము ఎవరిమో తెలిస్తే ప్రస్తుతం రాబోతున్న ప్రమాదం తప్పిపోతుంది. కాని నగరపాలకుల వారికి తెలిసిపోతుంది" సాలోచనగా అన్నది మహారాణి.

"తమరికి తెలివి వచ్చిన వెంటనే నేను దళపతికి తెలియచేయాలి... ఆలోచించి కర్తవ్యం ఏమిటో చెప్పండి మహారాణి...." తన బాధ్యతను ఆమెకు గుర్తుచేశాడు సైనికుడు.

"తెలివి వస్తే పోయి చెప్పాలి. రాకపోతే?" అడిగాడు శ్యామలుడు.

"వచ్చేదాకా వైద్యం చేస్తూనే వుండాలి" అన్నాడు సైనికుడు.

"వెళ్ళి ఆ మాటే చెప్పి, తెలివి రాగానే త్రాగించటానికి నీరు, ఆరగించటానికి ఆహారము తీసుకురా" అన్నాడు శ్యామలుడు.

అతని ఆలోచన ఏమిటో అర్థమై సంతోషంగా తల ఉపాడు సైనికుడు. గుడారంలో నుంచి బయటికి వెళ్ళిపోయాడు.

"నువ్వు ఎవరివి?" శ్యామలుడి వైపు పరిశీలనగా చూస్తూ అడిగింది మహారాణి.

"బాటసారిని తల్లీ... ఈ దారినపోతూ వుంటే ఈ సైన్యం కనిపించి భయంతో బండలచాటున తలదాచుకున్నాను. తమరు అశ్వం మీది నించి పడిపోవటాన్ని చూసిన తర్వాత బట్టబయలు అయింది నా గుట్టు" నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

ఆ మాటల్ని విని సానుభూతి సూచకంగా తల ఊపవలసిన మహారాణి అలా చేయకపోగా, ఫక్కున నవ్వింది.

"వందమంది కాదు... వెయ్యిమంది సైనికులు ఎదురయినా ఇసుమంత కూడా చలించడని పెద్దపేరు గజదొంగ శ్యామలుడికి" చిన్నగా అన్నది ఆమె.

"శ్యామలుడా? గజదొంగ శ్యామలుడేనా? ఎలా వచ్చాడు ఇక్కడికి?" ఆందోళన నటిస్తూ చుట్టూ చూశాడు శ్యామలుడు.

మరింత పెద్దదై పోయింది మహారాణి ముఖం మీది నవ్వు.

"విచలిత రాజ్యపాలకుడి సతీమణి నాకు పిన్నమ్మ అవుతుంది. ఆరు మాసాల క్రితం ఆ రాజ్యంలో అడుగుపెట్టి అందరినీ హడలగొట్టాడు గజదొంగ శ్యామలుడు. రాజభటులు తరమటం మొదలుపెట్టేసరికి అంతఃపురంలో తలదాచుకున్నాడు. నా పినతల్లి అతన్ని చూసింది. చేయి తిరిగిన చిత్రకారిణి కావడంతో అతని రూపాన్ని చిత్రపటంలో బంధించింది. మూడు మాసాల క్రితం ఆ రాజ్యానికి పోయినప్పుడు నేను ఆ పటాన్ని చూశాను" చిన్నగా చెప్పింది ఆమె.

ఆందోళన నటించటాన్ని ఆపి తను కూడా చిన్నగా నవ్వాడు శ్యామలుడు. కుడి మోకాలి మీదికి వంగి ఆమెకు వీర నమస్కారం చేశాడు.

"విదలిత రాజ్య పట్ట మహిషి మహా ఉత్తమురాలు. మూడు దినాల పాటు నన్ను నా స్నేహితుడిని తన శయన మందిరంలో దాచిపెట్టి కన్నబిడ్డల కంటె మిన్నగా చూసి కాపాడింది. మహాసాధ్వి" ఆమెను తలుచుకుంటూ ఆర్ద్రంగా అన్నాడు.

"తల్లీ... ఇప్పుడు ఈ మాటలు అనవసరం... దళపతిని గురించి ఆలోచించండి" అప్పటిదాకా మౌనంగా వున్న చెలికత్తె వున్నట్లుండి మాట్లాడింది.

"పిచ్చిమొఖమా... గజదొంగ శ్యామలుడు మనకు ఎదురుగా వున్నాడు. దళపతి మనల్ని ఏమిచేయగలడు?" అన్నది మహారాణి.

అప్పుడు ఆమె అలా మాట్లాడినప్పుడు విషయం పూర్తిగా అర్ధమై విపరీతమైన ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టింది చెలికత్తె.

వెలుపలికి పోయిన సైనికుడు హడావుడిగా తిరిగి రావడంతో ఆగి పోయింది వారి సంభాషణ.

"తల్లీ... దళపతుల వారే స్వయంగా వచ్చి తమరి పరిస్థితి సమీక్షిస్తారట. ఆ తరువాతనే ఆహారం నీరు" తడబడుతున్న కంఠంతో చెప్పాడు అతను.

ఆ మాటలు పూర్తి అవుతూ వుండగానే గుడారంలోకి వచ్చాడు దళపతి.

"వయస్సులో నాకంటె కొంచెం పెద్దదే అయినా, మనస్సును మెలిపెట్టి మత్తు ఎక్కించేటంత సుందరంగా వున్నది రూపం, ఎటువంటి జాప్యము చేయకుండా ఎంత త్వరగా వీలయితే అంతత్వరగా తెలివి తెప్పించి, గాయానికి కట్టుకట్టి, ఉత్సాహం ఉరుకులు పెట్టటానికి ఏదైనా ఆకునో, మూలికనో తినిపించి నా గుడారంలోకి పంపించు. ఆలస్యం చేయకు'' పాట పాడుతున్నట్టు రాగయుక్తంగా అంటూ తల తిప్పి చుట్టూ చూశాడు దళపతి.

బాణం దెబ్బనుంచి తేరుకొని శ్యామలుడు ఒక పక్కన చలనం లేకుండా పడిపోయి వుంటాడని, తెలివి తప్పిన సుందరాంగి కూడా అదే మాదిరి ఇంకో మూలన కనిపిస్తుందని అనుకుంటూ వచ్చాడతను గుడారంలోకి.

నిట్టనిలువుగా నిలబడి వున్న శ్యామలుడిని చూసేసరికి నిర్ఘాంత పోయాడు. విప్పారిత నేత్రాలతో తనకేసి చూసిన సుందరాంగిని గుర్తుపట్టేసరికి మతిని కోల్పోయినట్లు నోరు వెళ్ళబెట్టాడు.

"దోపిడీ దొంగల మాదిరి అమాయక ప్రజలను దోచుకు తింటూ వుండటమే కాకుండా, అబలల్ని ఆసరాలేని అతివల్ని చెరబట్టే పిశాచాల మాదిరిగా కూడా మారిపోయారన్న మాట!" కనుబొమలు ముడివేసి తీవ్రంగా చూస్తూ అన్నది మహారాణి.

"మహారాణి వారికి జయము జయము... ఈ గుగ్గుడి ప్రదేశంలోకి తమరు స్వయంగా వస్తారని నేను కలలో కూడా ఊహించలేదు...." అంటూ తలవంచి నమస్కారం చేశాడు దళపతి.

"ఊహించవలసిన అవసరంలేదు. వచ్చేశామని తెలిసింది కదా... ముందుగా మాకు ఆహారము, నీరు అత్యవసరం. వాటిని తెప్పించు" ఆజ్ఞ ఇచ్చింది ఆమె.

"తప్పకుండా... వెంటనే మీ ఆజ్ఞను అమలులో పెడతాను...." అంటూ తల తిప్పి శ్యామలుడి వైపు చూశాడు దళపతి.

"ఈ దుర్మార్గుడికి తెలివి వచ్చిన సంగతిని నాకు ఎందుకు చెప్పలేదు?" కనులు ఎర్రచేస్తూ వైద్యం తెలిసిన తన సైనికుడిని అడిగాడు.

"అదీ... దళపతుల వారు నన్ను మన్నించాలి. నేను తమ దగ్గరికి వచ్చిన సమయంలో–" అంటూ నీళ్ళు నమిలాడు ఆ సైనికుడు.

"చెప్పిన పని చెప్పినట్లు సరిగ్గా చేయని వాళ్ళు నా క్రింద పని చేయటం నాకు నచ్చదు. నీకు చావు తప్పదు" అంటూ వేగంగా తన కరవాలాన్ని ఒరలో నుంచి బయటికి లాగాడు దళపతి.

అతను అకారణంగా ఎందుకు అంత ఆవేశపడిపోతున్నాడో శ్యామలుడికి అవగతం కాలేదు. ఎదురు తిరిగే చిహ్నాలు ఆ సైనికుడి ముఖంలో లేవు. ఒకవేళ ఎదురు తిరగాలని అనుకున్నా సరయిన ఆయుధం కూడా లేదు. మరి ఎందుకంత ఆందోళన?

పళ్ళు బిగపట్టి కరవాలాన్ని పైకి ఎత్తాడు దళపతి. సన్నిపాత రోగం వచ్చినట్లు గజగజలాడటం మొదలుపెట్టాడు సైనికుడు.

"క్షమించండి ప్రభూ... ఒక్కసారికి నన్ను మన్నించండి. నా ప్రాణాలు కాపాడండి" వణుకుతున్న కంఠంతో వేడుకుంటూ చేతులు జోడించాడు.

కరుణ అనే భావం కలికానికి కూడా కనిపించలేదు దళపతి కనుల్లో. పైకి ఎత్తిన కత్తిని బలంగా అతని మెడ మీదికి విసిరాడు.

ఎగిరి అవతలపడేది సైనికుడి తల. ఆశ్చర్యంగా చూస్తున్న శ్యామలుడు ఛెంగున కదిలి, తన చేతిని అడ్డుగా పెట్టడం వల్ల ఆ దెబ్బ తగల లేదు... తగిలి ఉంటే...

"అరేయ్... నీ తల కూడా ఎగిరి ఆవల పడుతుంది. నీకు ఈ క్షణంతో భూమి మీద నూకలు చెల్లిపోయాయి...." పళ్ళు పటపటమని కొరుకుతూ అతన్ని బెదిరించి కత్తిని బలంగా వెనక్కి లాక్కున్నాడు దళపతి. ఒక అడుగు తను కూడా వెనక్కివేసి ఈసారి శ్యామలుడి తల మీద ప్రయోగించబోయాడు.

ఉన్నట్లుండి అతను అంతగా ఆవేశపడటానికి కారణం ఏమిటో తెలిసి పోయింది శ్యామలుడికి.

మహారాణివారి ఎదుట తాను మహాశక్తివంతుడిననీ, తనకున్న అధికారం అసామాన్యమైనదనీ, సైనికులందరూ తనను చూస్తే వణికిపోతారనీ తెలియ చేయటం అది.

మీదికి వస్తున్న కరవాలాన్ని మరోసారి అడ్డుకున్నాడు శ్యామలుడు. గాయపడిన చేతినే ఉపయోగించి అతని ముఖం మీద బలంగా కొట్టాడు.

ఆ కదలిక మూలంగా గాయం చెదిరిన మాట వాస్తవం. గట్టిగా బిగించి కట్టిన దట్టీ తిరిగి రక్తసిక్తం అవటం మొదలుపెట్టింది.

అయినాసరే పట్టించుకోలేదతను. పిడికిలి బిగించి మరో దెబ్బ కొట్టటానికి సిద్ధం అయ్యాడు.

సిద్ధం అవవలసిన అవసరం లేకపోయింది. మొదటి దెబ్బకే కళ్ళు పచ్చబడిపోయినట్లున్నాయి. తల విదిలిస్తూ ప్రక్కకుతూలి, చాపచుట్టలా క్రింద పడిపోయాడు దళపతి. తెలివి తప్పటంతో కనులు తేలవేశాడు.

“తల్లీ... తమరు వెంటనే ఇక్కడినుంచి అవతలకు వెళ్ళిపోవడం అత్యవసరం. తెలివివచ్చిన వెంటనే మిగిలిన వారందరినీ పిలిచి గోల చేస్తాడు వాడు” భయం నిండిన కంఠంతో చెప్పాడు మహారాణికి సైనికుడు.

“సైనికులు వస్తే ఏమౌతుంది? మేము ఎవరిమో తెలిస్తే ఇతని బ్రతుకే బుగ్గిపాలు అయిపోతుంది” గంభీరంగా అన్నది మహారాణి.

“తల్లీ... తరతరాలుగా మీ ఉప్పు తిని బ్రతుకుతున్న నేను ఒక్కడిని మాత్రమే ఈ జనం మధ్యలో వున్నాను. మిగిలిన వారందరూ కేవలం దోపిడీల కోసం ఇతర నగరాల నుంచి పిలిపించబడిన కర్కోటకులు. మీరు ఎవరో వారెవరికీ తెలియదు. ఒకవేళ తెలిసినా పట్టించుకోరు” అన్నాడు సైనికుడు.

“ఎందుకు పట్టించుకోరు?” ఆశ్చర్యంగా అడిగింది మహారాణి.

“నగరపాలకుల వారి ఆదేశాలు చాలా సూటిగా వున్నాయి. దోపిడీలు కొనసాగించి ఇబ్బడిముబ్బడిగా పశువుల్ని తీసుకురాకపోతే ప్రాణాలు దక్కవని హెచ్చరించబడింది. ఆ దోపిడీలను అడ్డుకోవటానికి మీరు వచ్చినట్లు తెలిస్తే నగరపాలకులవారు ఎలా స్పందిస్తారు?” ఎదురు ప్రశ్నవేశాడు సైనికుడు.

రంగులు మారాయి మహారాణి వదనంలో...

"మీరు ఇటుగా వచ్చినట్లు నగరపాలకుల వారికి తెలియనీయడు వాడు... దోపిడీ పూర్తి అయ్యేంతవరకు బంధించి వుంచానని, తమరే తప్పించు కోవటానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో గాయపడి ప్రాణాలువదిలారని చెప్తాడు అవసరం అయితే" అన్నాడు సైనికుడు.

"మేము గాయపడి ప్రాణాలు వదలటం ఏమిటి?" మరింత అయో మయంగా అడిగింది మహారాణి.

"అయ్యో తల్లీ... మీకు ఇంత వివరంగా చెప్పినా ఇంకా అసలు విషయం అవగతం కావటంలేదు. ఇతను నన్ను అకారణంగా సంహరించటానికి ఎందుకు ప్రయత్నించాడో గ్రహించారా?" ఓపికగా అడిగాడు సైనికుడు.

తల అడ్డం తిప్పింది మహారాణి.

"తల్లీ... మీరు ఎవరో దళపతికి వెంటనే తెలిసిపోయింది. ఆ విషయం నాకు కూడా తెలిసిందని తాను గ్రహించాడు. నన్ను అడ్డు తొలగించుకుంటే మీరు ఎవరో తెలిసినవాడు తాను ఒక్కడే అవుతాడు. మిగిలిన మా జనం ఎవరికీ తెలియదు...." అన్నాడు సైనికుడు.

అతను అంత వివరంగా చెప్పిన తర్వాత అంతవరకూ అతను చెపుతున్నది ఏమిటో అవగతమై, తల దించుకున్నది మహారాణి.

తన మీద కన్ను పడింది దళపతికి. తన దుష్ట ఆలోచనల్ని కార్యరూపంలో పెట్టి, ఆ తరువాత నిర్మొహమాటంగా ప్రాణాలు తీసేస్తాడు. రహస్యంగా రావడం వల్ల తాను ఏమైపోయిందీ నగర పాలకుల వారికి తెలియదు. ఒకవేళ ఏదో ఒక విధంగా తెలిసినా సైనికుడు చెప్పినట్లు ప్రమాదవశాత్తూ ప్రాణాలు వదిలినట్లు ప్రచారం చేయబడుతుంది.

విషయం పూర్తిగా అవగతమైన వెంటనే, "మనం వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి. మన వాహనాలు ఎక్కడ వున్నాయో చూడు" అంటూ తన చెలికత్తెను ఆజ్ఞాపించింది.

గుడార ద్వారం దగ్గరికి పోయి బయటికి తొంగి చూసింది చెలికత్తె. వెంటనే వెనక్కి దూకి గుండెలమీద చెయ్యి వేసుకున్నది.

"ఏమిటే... ఏమయింది?" అసహనంగా అడిగింది మహారాణి.

"ఈ దుర్మార్గుడు తనతోపాటు సైనికులు అందరినీ రెచ్చగొట్టాడు తల్లీ... గుంపుగా నిలబడి అందరూ ఇటువైపే చూస్తున్నారు...." వణుకుతున్న కంఠంతో చెప్పింది చెలికత్తె.

"దళపతికి తెలివి వచ్చేలోపుగా ఏదో ఒకటి చేయకపోతే చాలాకష్టం తల్లీ... ఇతనికోసం ఎవరైనా లోపలికివస్తే మరింత ప్రమాదం" హెచ్చరించాడు సైనికుడు.

ఏం చెయ్యాలో మహారాణికి తోచలేదు. తలఎత్తి శ్యామలుడికేసి చూసింది ఆమె.

దళపతిని పడగొట్టిన తర్వాత పెదవులు విప్పి ఒక్కమాట కూడా మాట్లాడకుండా మౌనంగా నిలబడి వున్నాడు అతను.

"దయచేసి ఈ సమస్యకు పరిష్కారమార్గం చూపించాలి" చేతులు జోడిస్తూ వేడుకున్నది మహారాణి.

తలుచుకున్న వెంటనే తాను ఎటువంటి సమస్యనైనా చిటికెలో పరిష్కరించగలనని ఆమె అనుకుంటున్నట్లు అర్థమై చిరాకుగా తల విదిలించాడు అతను.

దళపతిని పడగొడితే సమస్య పరిష్కారం అవుతుందని అనుకోలేదు అతను. సైనికుడిని రక్షించటానికి అంతకంటె వేరే మార్గం లేకపోవటం వల్ల అలా చేశాడు.

దళపతిని తప్పించుకోవటం కంటె కష్టమైన పని, గుడారం వెలుపల వున్న సైనికుల్ని తప్పించుకోవడం.

కత్తులు బరిశెలు పట్టుకున్నవారు ఒక్క లెక్కకాదు. ఎంతమందినైనా విదిలించి అవతలకు తరిమేయవచ్చు. ధనుస్సులను పట్టుకున్న వారితోనే వచ్చి పడుతుంది అసలు ప్రమాదం... వారి గురికి అందితే ప్రాణాలు కోల్పోవడం తథ్యం.

"రావచ్చా? నేను లోపలికి రావచ్చా?" ఉన్నట్లుండి ఒక కంఠం గుడారం వెలుపల నుంచి వినబడటంతో, అదిరి పడ్డాడు సైనికుడు.

"ఆగాలని చెప్పు. ఆత్రం ప్రమాదకరమని హెచ్చరించు" అతనికి మాత్రమే వినబడేటట్లు హెచ్చరించి, వేగంగా ఆలోచించడం మొదలుపెట్టాడు శ్యామలుడు.

గుడారంలో నుంచి వెలుపలికి పోయాడు సైనికుడు. పదిహేను క్షణికాల తరువాత తిరిగివచ్చి, "ఆగమని చెప్పాను. దళపతుల వారు నిన్ను ప్రశ్నిస్తున్నారని వివరించాను" అన్నాడు శ్యామలుడితో.

పూర్తి అయింది శ్యామలుడి ఆలోచన. అంతకు ముందు తన కరచరణాలను బంధించిన అడవి తీగెలతో దళపతి కాళ్ళు చేతుల్ని కదలకుండా కట్టి పడవేశాడు.

తెలివి వచ్చిన తరువాత అరిచి కేకలు పెట్టకుండా తన భుజానికి కట్టుగా కట్టి వున్న దట్టీలో నుంచి పొడవాటి ముక్కను చింపి నోటిలో కుక్కాడు.

"ఏం చేయాలి మనం? ఇతన్ని ఇక్కడే వదిలి పారిపోవటం ఎలా?" ఆత్రుతగా అడిగింది మహారాణి.

"తల్లీ... మీరు ఆత్రపడకూడదు. ఇతనితోపాటు మీరు ఇక్కడే వుంటారు. ఈ సైనికుడు నన్ను, మీ చెలికత్తెను తీసుకుని బయటికిపోతాడు. గుంపుగా నిలబడివున్న వారికి కొంచెం దూరంగా నన్ను తీసుకుపోయిన వెంటనే ఏదో ఒకటిచేసి మిమ్మల్ని ఇక్కడినుంచి తప్పిస్తారు" అన్నాడు శ్యామలుడు.

దళపతితో పాటుగా తాను గుడారంలోనే వుండిపోయి. అతను తన చెలికత్తె దూరంగా తీసుకుపోబడటం అంటే– బయట నిలబడి వున్న సైనికులు ఏ విధంగా ఊహించుకుంటారో తలుచుకునే సరికి, సిగ్గుతో, రోషంతో ఎర్రగా కందిపోయింది మహారాణి వదనం.

"నా కంఠంలో ప్రాణం వుండగా ఎవరికీ అటువంటి ఆలోచన రాకూడదు. నేను భరించలేను" కోపంగా అన్నది.

"తల్లీ ఆవేశపడకండి. మీ చెలికత్తెను ఇక్కడ వదిలిపెట్టి మనం వెళ్ళవచ్చు. కాని దళపతి చూపు మీ చెలికత్తె మీద లేదని వెలుపల వున్న వారందరికీ తెలుసు. ప్రస్తుతం ఈ ప్రమాదం నుంచి గట్టెక్కటానికి కొద్దిసేపు మీరు ఓర్పు వహించాలి. తప్పదు" ఖచ్చితమైన కంఠంతో చెప్పాడు శ్యామలుడు.

అయిష్టంగానే తల ఊపింది మహారాణి.

"ఈ దుర్మార్గుడికి తెలివి వస్తున్నట్టు కనిపించగానే గట్టిగా కొట్టి తిరిగి తెలివి తప్పించండి. ఎట్టి పరిస్థితిలోను వాడు శబ్దం చేయకూడదు...." అడ్డదిడ్డంగా పడివున్న దళపతి వైపు చూస్తూ ఆమెకు చెప్పి, సైనికుడికి సైగ చేశాడు శ్యామలుడు.

అతని అంగీని గుప్పిట్లో బిగించి పట్టుకున్నాడు సైనికుడు. రెండవ చేత్తో చెలికత్తె జుట్టును గట్టిగా చేతికి చుట్టుకున్నాడు.

"గొడవ చేయకుండా నడవండి. దళపతుల వారి ఆనందానికి విఘ్నం కలిగిందంటే మీ ప్రాణాలు మీకు దక్కవు" బిగ్గరగా అంటూ ఇద్దరినీ బయటికి లాక్కుపోయాడు.

గుంపుకట్టి నిలబడి గుసగుసలాడుకుంటున్న సైనికుల్లో వెంటనే వచ్చింది చలనం... చెలికత్తెను చూస్తూ ముందుకు అడుగువేయబోయిన కొందరిని చూపులతోనే వారించాడు సైనికుడు.

"దళపతుల వారు వీరిద్దరినీ తన శిబిరంలో నిలబెట్టి వుంచమని ఆజ్ఞాపించారు. వారు వెలుపలికి వచ్చేవరకూ మీరు కదలకుండా నిలబడండి...." అంటూ వేగంగా నడిపించి దళపతి తనకోసం సిద్ధం చేయించుకున్న గుడారంలోకి తీసుకుపోయాడు.

"అదృష్టం బాగుండబట్టి ఒక్క మాటతోనే అందరూ ఆగిపోయారు. ఆలస్యం చేస్తే వాళ్ళ సహనం అంతరించి కొత్త కొత్త ఆలోచనలు పుట్టుకు వస్తాయి. ఏదైనా చేయదలుచుకుంటే వెంటనే చేయటం చాలామంచిది" గుప్పిట్లో వున్న శ్యామలుడి అంగీని వదిలిపెడుతూ ఆత్రుతగా అన్నాడు.

అతని గుప్పిట వత్తిడికి నలిగి ముడుతలు పడిన అంగీ భాగాన్ని సరి చేసుకుంటూ చుట్టూ చూశాడు శ్యామలుడు.

నేల మీది మట్టిని ఒకచోటికి చేర్చి ఎత్తయిన రాతి దిమ్మమాదిరి తయారు చేశారు ఆ గుడారాన్ని నిలబెట్టిన సైనికులు. మెత్తటి వలువల్ని పరిచి హంసతూలికా తల్పం వంటి పడకను సిద్ధం చేశారు.

ఆ పడక దగ్గిరే క్రింద పడకేసి వున్నది శ్యామలుడి కరవాలం. వరతో సహా దాన్ని అందుకున్నాడు అతను. పడక ప్రక్కనే ఒక బండరాయి మీద పేర్చి వున్న దుస్తుల్లో నుంచి పొడవాటి వస్త్రాన్ని అందుకుని, దట్టీ మాదిరి తన నడుముకు చుట్టుకుని, కరవాలాన్ని అందులో ఇమిడ్చాడు.

"ఏం చేయదలచుకున్నావు? అవతల మహారాణి వారు చాలా ఇబ్బందిలో...." అంటూ అతన్ని హెచ్చరించబోయి, అతను చురుకుగా చూడటంతో చటుక్కున నోటిని మూసుకున్నది చెలికత్తె.

గుడారం ద్వారం దగ్గరికిపోయి, బయటికి తొంగి చూశాడు శ్యామలుడు.

అసహనంగా కదులుతున్నారు గుమికూడి వున్న సైనికులు. కొందరి చూపులు మహారాణి వున్న ప్రదేశం మీద లేవు. దళపతి శిబిరం వైపు మారు తున్నాయి.

త్వరపడకపోతే వారిలో ఎవరో ఒకరు తమ దగ్గరికి వచ్చేస్తారని అర్థమై, గబగబా బండరాయి మీద వున్న దళపతి దుస్తుల్ని కొన్నింటిని పరపరా చింపి ముక్కలు చేశాడు శ్యామలుడు.

చీకటిపడిన వెంటనే వెలిగించటానికి వీలుగా ఒక ప్రదేశంలో నిలబెట్టి వున్నాయి కొన్ని కాగడాకర్రలు.

వాటిలో రెండింటిని తీసుకుని, తాను చింపి పోగులు పెట్టిన గుడ్డముక్కల్ని దట్టంగా చుట్టాడు.

"కాగడాలు వెలిగించటానికి నూనెకావాలి. అది ఇక్కడ వున్నదా." అని సైనికుడిని అడిగాడు.

"నూనె భాండం వేరే గుడారంలో వున్నది. తీసుకువస్తాను" అంటూ బయటికి బయలుదేరబోయిన అతన్ని చటుక్కున ఆపి, బలంగా వెనక్కి నెట్టాడు.

"బుద్ధితక్కువ పనులు చేస్తే చిటికెలో బట్ట బయలు అయిపోతుంది మన గుట్టు. పట్టపగలు నూనె భాండం కోసం ఎవడూ బయలుదేరడు. చీకట్లు ముంచుకు వస్తున్నప్పుడే దాని అవసరం గుర్తుకు వస్తుంది" అంటూ చుట్టూ చూశాడు.

కాగడా కర్రలు నిలబెట్టి వున్న ప్రదేశంలోనే అతనికి అగుపించాయి నిప్పుచేయటానికి అవసరం అయిన సామాగ్రి.

తాను తయారు చేసిన కర్రల్ని క్రిందపెట్టి అరక్షణికంలో వాటిని అంటించాడు అతను... నెమ్మదిగా గాలిలోకి ఊపేసరికి మంటలు పెద్దవి అయ్యాయి.

"పట్టపగలు కాగడాలు పట్టుకుంటే ఎవరికీ అనుమానం రాదా?" కొంచెం వెక్కిరింపుగానే అడిగింది అంతవరకూ మౌనంగా వున్న చెలికత్తె.

చిన్నగా నవ్వి గుడారం ద్వారం దగ్గరికిపోయాడు శ్యామలుడు. ఒకే ఒక పాదాన్ని బయటపెట్టాడు. దిక్కులు చూస్తున్న గుంపులోని సైనికులకు ఏం

జరగబోతున్నదో అర్థం అయ్యేలోపుగా, తను వెలిగించిన కాగడాల్ని బలంగా అవతలికి విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి దగ్గిర్లో వున్న ఇంకో రెండు గుడారాల మీద పడ్డాయి అవి.

ఫెళ్ళున కాస్తున్న ఎండ మూలంగా బాగా వేడెక్కి వున్నాయి ఆ గుడారాలు. భగభగలాడుతూ కాగడాలు వచ్చి పడేసరికి పుటుక్కున అంటుకున్నాయి.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో పెద్దవి అయ్యాయి మంటలు. ఆకలిగొన్న పాముల మాదిరి నాలుకలు విరజాస్తూ గుడారాలను ఆక్రమించి, మూడుబారుల ఎత్తుకు పైకి లేచాయి.

గాలి విసురుకు పక్కకు వంగాయి అవి. వంగిన వెంటనే... సరసనే వున్న ఇంకో మూడు గుడారాలను కబళించడం మొదలుపెట్టాయి.

పదే పది క్షణికాల్లో జరిగిపోయిందా దారుణం. చిటపటలాడుతూ విలయతాండవం చేయడం మొదలుపెట్టిన తర్వాతగాని అర్థం కాలేదు అందరికీ. అర్థం అయిన వెంటనే గావుకేకలు పెడుతూ ఆ మంటల్ని ఆర్పటానికి పరుగు తీశారు.

గుడారపు ద్వారంలో నిలబడి ఒక కంట గమనించుకుంటూనే వున్నాడు శ్యామలుడు. మహారాణి వున్న గుడారం దగ్గిర్నించి మంటల దగ్గరికి అందరూ పోయిన వెంటనే తన వెనుక వున్న చెలికత్తెకు సైగచేశాడు.

“సాధ్యమైనంత వేగంగా పరిగెత్తు... దహదారి దగ్గరికిపోకు... గుట్టపక్క భాగంలోకి వెళ్ళిపో....” అంటూ తాను గుడారంలో నుంచి బయటికి వచ్చాడు.

అతను ఊహించినట్టే జరుగుతోంది అంతా. అటువంగి ఇటువంగి ఇంకో మూడు గుడారాలను చుట్టుముట్టాయి మంటలు.

తాగటానికి, ఇతర శారీరక అవసరాల కోసం మాత్రమే నీటిని తమ దగ్గిర వుంచుకున్నారు సైనికులు. మంటల మీద పోయటానికి అవసరం అయినవి లేవు. క్రిందినించి మట్టిని ఎత్తి మంటల మీదికి జల్లుతున్నారు కొందరు. మంటల బారిన పడకుండా వున్న గుడారాల త్రాళ్ళను వదులు చేసి వాటిని తొలగించేస్తున్నారు.

ఆలస్యం చేస్తే మహారాణి వున్న గుడారాన్ని కూడా క్రిందికి దించి మంటల బారిన పడకుండా కాపాడాలన్న కోరిక వారికి కలుగుతుందని అర్థమై రివ్వున అటుకేసి పరిగెత్తాడు శ్యామలుడు.

బయటికి తొంగి చూస్తోంది మహారాణి. ఎగసిపడుతున్న మంటల్ని చూసి కొంచెంగా భయపడుతున్నది.

అడ్డదిడ్డంగా పడివున్న దళపతి పాదాలు పట్టుకుని, రహదారి దగ్గిర్నించి తనను ఎలా ఈడ్చుకుంటూ వచ్చారో అలాగే గుడారం బయటికి ఈడ్చాడు శ్యామలుడు.

"ఎందుకు ఈడ్చటం? లోపలే వదిలేస్తే మాడి మసి అయిపోతాడు. వాడి దుర్మార్గపు ఆలోచనలకు తగిన శిక్ష పడుతుంది." కక్షగా అంటున్న మహారాణి వైపు చూసి చిరునవ్వు నవ్వాడు.

"మనం వేగంగా పారిపోకపోతే ఏదో ఒక శిక్ష మనకే పడుతుంది. పదండి మహారాణి" అంటూ ఒక ప్రక్కకు పరుగు మొదలు పెట్టాడు.

అతను హెచ్చరించినట్లు మహారాణి అతనితో సరిసమానంగా వేగంగా పరుగు తీయగలిగివుంటే – ఎవరికీ కనిపించేది కాదు ఆ దృశ్యం.

తన దుస్తులు పాదాలకు అడ్డు పడకుండా వుండేందుకు ప్రయత్నం చేస్తూ కొద్దిగా వెనక పడింది మహారాణి.

"పారిపోతోంది... చూడండి.. అటుచూడండి" బిగ్గరిగా అరిచాడు ఒక సైనికుడు.

"అడుగో... దళపతి... మన దళపతి" వెనువెంటనే వినవచ్చింది మరో అరుపు.

గుడారం వెలుపలికి తాను ఈడ్చిన దళపతిని అందరూ చూడటం జరిగిన మరుక్షణం– తాను చేసిన పని ఏమిటో తెలిసిపోతుందని శ్యామలుడికి ముందే తెలుసు.

విషయం అవగతం అయిన వెంటనే వెంటపడతారు అందరూ... పట్టుకోవడం చేయకపోతే దనుర్ధారుల్ని రెచ్చగొడతారు.

సరిగ్గా పాతిక ధనువుల దూరం పోయిన తర్వాత అతను అనుకున్నది అనుకున్నట్లే జరిగింది.

"పట్టుకోండి... పట్టుకోండి...." అని కేకలు పెడుతూ వెంబడించడం మొదలు పెట్టారు సైనికులు.

చీరె కుచ్చిళ్ళను సర్దుకోవటంలో నిమగ్నమై మరింత వెనకబడిపోతున్న మహారాణి వంక చూశాడు శ్యామలుడు.

"కొట్టండి... గింగిరాలు తిరుగుతూ క్రింద పడిపోయేటట్లు గురిచూసి కొట్టండి" అంటూ మొదలు అయ్యాయి అరుపులు.

రివ్వురివ్వున బాణాలు దూసుకురావటం మొదలయింది.

"తల్లీ... మీరు వేగం పెంచకపోతే ప్రమాదం...." హెచ్చరించాడు శ్యామలుడు.

"ప్రయత్నం చేస్తున్నాను. ఇలా ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయవలసిన అవసరం వస్తుందని అనుకోలేదు. మేము పెంచి పోషిస్తున్న సైనికులే మమ్మల్ని పడగొట్టడానికి చూడటం నిజంగా ఘోరం...." బరువుగా సమాధానం ఇచ్చింది ఆమె.

"సైనికుల తప్పు ఏమీలేదు మహారాణీ. పొట్ట తిప్పల కోసం పాటుపడే అల్పజీవులు. ధనపురాసుల ఆశ చూపి వారిచేత తప్పులు చేయించే వాళ్ళదే అసలైన తప్పు" అంటూ మర్యాదలన్నిటినీ గాలికి వదిలేసి, అమాంతంగా ఆమెను ఎత్తి భుజంమీద వేసుకున్నాడు శ్యామలుడు.

ఆ వత్తిడికి భుజం మీద గాయం తీవ్రమైన బాధను కలుగచేస్తున్నా లెక్క చేయకుండా పరుగు ప్రారంభించాడు.

తాచుపాముల మాదిరి దూసుకువస్తున్నాయి ధనుర్ధారులు వదిలిన బాణాలు. అతని తలమీదినించి అవతలకుపోయాయి కొన్ని, పక్కల్ని రాచుకుంటూ క్రింద పడ్డాయి మరికొన్ని.

"పరిగెత్తుతూ బాణాల్ని వదలాలంటే బోలెడంత పరిశ్రమ అవసరం, దోపిడీలు దొంగతనాలు చేస్తూ బ్రతికే ఈ అల్పులకు అంతటి శక్తి వుంటుందని నేను అనుకోవటం లేదు" ఆ బాణాల్ని చూసి భయపడుతున్న మహారాణితో అన్నాడు.

అంత ప్రమాదకర పరిస్థితిలో కూడా చిరునవ్వు నవ్వకుండా వుండలేక పోయింది ఆమె.

"దొంగతనాలు చేస్తూ బ్రతికే వారందరూ అల్పులే అయితే మరి నీ సంగతేమిటి? నీకున్న శక్తి యుక్తులు ఈ భూ ప్రపంచంలో ఎవరికీ లేవని అనుకుంటూ వుంటారు అందరూ" అన్నది.

మాటకు మాటగా సమాధానం ఇవ్వటానికి తెరిచిన నోటిని ఠక్కున మూసుకున్నాడు శ్యామలుడు.

*　　*　　*　　*　　*

"నిజమే అవ్వా.... మహారాణి వేసిన ప్రశ్న అక్షరాలా నిజం... దోపిడీలు దొంగతనాలు చేయటంలో ఆరితేరిన ఘనుడు ఆ శ్యామలుడు. మరి అతనికి అటువంటి శక్తియుక్తులు ఎలా వచ్చాయి?" తలతిప్పి వృద్ధురాలి వైపు చూస్తూ అడిగింది యువరాణి.

"మాట్లాడవద్దని ఎన్నిసార్లు చెప్పినా నువ్వు వినిపించుకోవడం లేదు" కోపం నటిస్తూ అన్నది వృద్ధురాలు.

కనిపిస్తున్న దృశ్యాలు మటుమాయం అయిపోయినా సరే... నువ్వు నా అనుమానానికి సమాధానం ఇచ్చి తీరవలసిందే... దొంగగా జీవితం గడిపే శ్యామలుడికి అనితరసాధ్యమైన తెలివి తేటలు, శక్తియక్తులు ఎలా వచ్చాయి?" రెట్టించింది యువరాణి.

దీర్ఘంగా నిట్టూర్చింది వృద్ధురాలు.

"నిజమో కాదో నాకు తెలియదు కాని, శ్యామలుడు మామూలు చోరుడు కాదు. ఒక పెద్ద రాజ్యానికి వారసుడు. ఏదో పెద్ద కారణం చేత అతను దొంగగా మారిపోయాడు...." చిన్నకంఠంతో అన్నది.

"ఏ రాజ్యానికి వారసుడు?" ఆశ్చర్యంగా అడిగింది యువరాణి.

"అది తెలియదు... అటువంటి రహస్యాలు తెలుస్తాయనే ఉద్దేశ్యంతోనే నీతోపాటు నేను కూడా అతని గతంలోకి చూస్తున్నాను" అన్నది వృద్ధురాలు.

రెండు క్షణాలు ఆగి, మళ్ళీ పళ్ళెరం వేపు చూసింది యువరాణి.

నిశ్చలంగా కనిపించాయి నీళ్ళు. అంతకుముందు వరకూ కనిపించిన దృశ్యం మటుమాయం అయిపోయి వుంది.

"అవ్వా... మరోసారి మంత్రించు... ఈసారి నువ్వు పలుకరించినా నేను పలుకను" అర్థింపుగా అడిగింది యువరాణి.

పెద్దగా నవ్వి చేతులు ఊపింది వృద్ధురాలు.

పొగలు ప్రత్యక్షం అయ్యాయి నీటిమీద... ఆ పొగల మధ్యలో నుంచి కనిపించింది ఒక దృశ్యం.

శ్యామలుడు మహారాణితో పాటు పరుగులు తీస్తున్నది కాదు... ఎత్తయిన బండల మధ్యగా అడుగులు వేస్తున్న గదాధరుడు అగుపించడం ఆరంభం అయింది.

* * * * *

ఆగకుండా అర్ధఘడియపాటు నడిచిన తర్వాత కూడా తనకు భయాన్ని కలిగించే దృశ్యం ఏదీ కనిపించకపోవడంతో, తనను వద్దు వద్దని హెచ్చరించిన వృద్ధుడిని తలుచుకుంటూ నవ్వుకున్నాడు గదాధరుడు.

"ఎప్పుడో ఏదో తరంలో, ఎంతోకాలం క్రితం ఏదో ప్రమాదం వాళ్ళకి ఎదురై వుంటుంది. దాన్నే గుర్తుచేసుకుంటూ ఇటుకేసి రావడం మానేసి వుంటారు...." తనలో తను అనుకుంటూ, ఆరు అడుగుల ఎత్తున ఒక బండమీదికి ఎక్కి చుట్టూ చూశాడు.

అప్పుడు కూడా కనిపించలేదు అతనికి ఎటువంటి అసాధారణ దృశ్యమూ. బండలూ వాటి మధ్యన పెరిగిన పొదలు తప్ప.

అప్పటివరకూ అతని మనసులో ఒక మూలగా మెదులుతున్న చిన్న అనుమానం ఒక్కసారిగా పెరిగి పెద్దదై పోయింది.

బండలు వున్నాయి, బండల క్రింద పొదలు వున్నాయి. కాని కలికానికి కూడా కనిపించడం లేదు జంతుజాలం... జంతువులే కాదు చిన్నచిన్న కీటకాలు కూడా అగుపించడం లేదు.

కారణం తెలియకుండానే జలదరించింది అతని శరీరం.

"మానవమాత్రుడు ఎవడూ రాకూడని ప్రదేశంలోకి మనం వచ్చినట్లు తెలిసిపోతోంది. పాములడొంక మహాప్రమాదకర ప్రదేశమని అందరూ చెప్పుకునే మాటల్లో యదార్థం వున్నట్లే కనిపిస్తోంది. వెంటనే వెనుతిరిగి వచ్చిన దారినే పాదాలకు బుద్ధి చెప్పటమంత మంచిపని మరొకటి వుండదు!" తనలో తను అనుకున్నాడు వెంటనే.

తను ఎక్కి నిలబడిన బండరాయి మీది నుంచి క్రిందికి దూకి ఆలస్యం చేయకుండా నడక మొదలుపెట్టటం ఆరోగ్యానికి చాలా మంచిదనేమాట అతని మనస్సులో మెదులుతూ వుండగానే - ఇంకోమాట కూడా మెదిలింది దానితోపాటు.

ప్రమాదకరమైన ప్రదేశమే అది. కాని ఆ ప్రమాదం ఎటువంటిదో ఏ రూపంలో వుంటుందో తెలియటం లేదు.

వెనక్కిపోయిన వెంటనే సూటిగా అడిగేస్తాడు తన జతగాడు. వివరాలు చెప్పమంటాడు.

ఏమని చెపుతాడు తను?

ఎటువంటి ప్రమాదం ఎదురయిందని చెప్పగలడు?

బండమీది నుంచి క్రిందికి దిగటం అయితే దిగాడుగాని, వెనక్కి నడవటం మాత్రం మొదలు పెట్టలేదతను.

ఇంతదూరం వచ్చిన తర్వాత, విషయం ఏమిటో తెలియకుండా వెళ్ళిపోవటం శౌర్యహీనుల లక్షణం అనిపించుకుంటుంది. ముందుకేపోయి మరో వంద ధనువుల దూరం నడిచి, ఆ తరువాత వెనుతిరగవచ్చు.

తనలో తను అనుకుంటూ మరోసారి నడక మొదలుపెట్టాడు అతను. పది ధనువుల దూరం పోయిన తర్వాత అతని మార్గానికి అడ్డుగా వచ్చింది రెండు తాడిచెట్లంత ఎత్తుగా వున్న ఒక పెద్దబండరాయి. చెయ్యివేస్తే జర్రున జారిపోయేటంత నునుపుగా వున్న ఆ రాయిమీదికి ఎగబ్రాకి ఆవలివైపు వెళ్ళటం అసంభవమని అర్థమై, ప్రక్కనే వత్తుగా వున్న పొదల్ని తన కరవాలంతో ఛిన్నాభిన్నం చేస్తూ కదిలాడు. నాలుగే నాలుగు అడుగులు వేశాడు. ఐదో అడుగు వేయకముందే అతని కర్ణేంద్రియాలకు సోకింది ఒక కంఠ స్వరం.

"రక్షించండి... కాపాడండి... దయామయులెవరైనా మమ్మల్ని ఉద్ధరించండి...."

ఝల్లుమన్నది గదాధరుడి శరీరం. సూదుల మాదిరి లేచి నిలుచున్నాయి అతని మెడమీది వెంట్రుకలు.

ఎదుట వున్న పొదల్ని చిన్నాభిన్నం చేయటాన్ని వదిలేసి, కరవాలాన్ని మరింత గట్టిగా బిగించి పట్టుకొంటూ ఆ కంఠం వినవచ్చిన వైపు కదిలాడు.

మరోసారి మరింత దీనంగా వినవచ్చింది అది.

"చనిపోతున్నాము... ప్రాణాలు పోగొట్టుకోబోతున్నాము... కాపాడండి... రక్షించండి."

పళ్ళు బిగపట్టి మరింత వేగంగా కదిలాడు అతను. పూనకం వచ్చిన మనిషి మాదిరి ఎదుట వున్న పొదల్ని చిటికెలో తెగనరికి, ఒక విశాలమైన ఇసుక ప్రదేశంలోకి అడుగుపెట్టాడు.

ఎటుచూసినా వంద ధనువుల దూరం విస్తరించి వుంది ఆ ప్రదేశం... చిన్నచెట్టుగాని, మొక్కగాని ఆఖరికి సన్నపాటి గరికగాని అక్కడ కనిపించటం లేదు.

ఆ ప్రదేశం మధ్యలో కనిపిస్తోంది చిన్న నీటి మడుగు. ఆ మడుగు మధ్య భాగంలో నడుములోతు నీళ్ళలో నిలబడి చేతుల్ని పైకెత్తి దీనాతిదీనంగా ఆర్తనాదాలు చేస్తూ అగుపించారు ఇద్దరు అతివలు.

ఊపిరి ఆగిపోయినంత పని అయింది గదాధరుడికి.

తెల్లగా పాలరాతితో చెక్కిన శిల్పాల మాదిరి వున్నారు వారిద్దరూ. కనులు మిరుమిట్లు గొలిపే అందం వారిది.

"నరుడా... సరయిన సమయానికి వచ్చావు. మమ్మల్ని ఈ దుర్మార్గపు ఊబిలో నుంచి బయటికి లాగి ప్రాణబిక్ష పెట్టు...." పొదల్ని అధిగమించి ఇసుక మీద అడుగుపెట్టిన వెంటనే అతన్ని చూసి అతి మధురంగా అర్ధించింది ఆ ఇద్దరిలో ఒక వనిత.

తన కనులు తనను ఏమారుస్తున్నాయేమోనన్న అనుమానంతో, కరవాలాన్ని క్రిందికి దించి చేతులతో కనుల్ని నులుముకుని మరీ చూశాడు అతను.

మనిషి అనేవాడు అడుగుపెడితే వెంటనే ప్రాణాలు పోగొట్టుకునే పాముల డొంక అది... అటువంటి ప్రదేశంలోకి ఈ అపురూప సౌందర్యవతులు ఎలా రాగలిగారు?

"తటపటాయింపు దేనికి నరుడా? మేము ఎటువంటి ప్రమాదంలో చిక్కుబడి వున్నామో నీకు ఇంకా అవగతం కాలేదా?" రాతి విగ్రహంలా నిలబడి కనులు పెద్దవి చేసి చూస్తున్న అతన్ని పలకరించింది ఆ స్త్రీలలో రెండవ యువతి.

ఆ పలకరింపుతో తన ఆశ్చర్యం నుంచి బయటపడ్డాడు గదాధరుడు. పదే పది అంగల్లో నీటి మడుగును సమీపించి పరిశీలనగా చూశాడు.

చూడచక్కటి ఇసుకప్రదేశం మధ్యలో వుండటం వల్ల, ఆ మడుగును చూసీ చూడగానే దగ్గరికిపోతారు ఎవరైనా, రెండో ఆలోచన లేకుండా అందులో దిగటమో, ఆ నీటిలో చేతులు పెట్టటమో ఏదోఒకటి చేస్తారు.

నిర్మలంగానే వున్నాయి నీళ్ళు, ఒక బారెడు లోతు మాత్రమే వున్నాయి. వెనుకా ముందు చూసుకోకుండా లోపలికి దిగినందువల్ల, మునిగి పోవటం జరుగదు. మునిగిపోయే లోతు ఎంత మాత్రము లేదు.

చిన్నచిన్న గులకరాళ్ళతో, అందమైన గవ్వలతో అతి స్పష్టంగా కనిపిస్తోంది అడుగుభాగం. లోపలికి దిగిన వారి పాదాలను బంధించే నాచుమొక్కలుగాని, బురద కయ్యలుగాని ఏమీ లేవు.

మరి ఆ లలనామణులు ఇద్దరూ కదలకుండా స్తంభాల మాదిరి నిలబడిపోవటం దేనికి?

"ఏమిటి మీకు వచ్చిన ప్రమాదం?" నడుముమీద చేతులు వేసుకుంటూ వారిని అడిగాడు అతను.

అంతకుముందు కంటే మరి కొంచెం భయంతో మలినపడిపోయాయి ఆ కాంతామణుల వదనాలు.

"నరుడా... ఆలస్యం చేయవద్దు... క్షణక్షణానికి దిగజారిపోతున్నాయి మా జవసత్వాలు... దయచేసి మమ్మల్ని ఉద్ధరించు" చేతుల్ని అతని వైపు చాస్తూ అర్థించింది ఒకర్తె.

"మీ అంతట మీరుగా బయటికి రావచ్చు... మిమ్మల్ని పట్టి బంధించే ప్రమాదం ఏదీ నా కళ్ళకు కనిపించటం లేదు...." మరోసారి ఆ మడుగు అడుగు భాగం వైపు పరిశీలనగా చూస్తూ అన్నాడు గదాధరుడు.

"మాటలు అనవసరం నరుడా... ముందు మమ్మల్ని ఉద్ధరించు" అతని మాటలు తమ చెవికి చేరనట్లు మరోసారి పలికిందా సుందరి.

అప్పుడు కూడా తన చేతుల్ని జాచలేదు గదాధరుడు. "నరుడా... నరుడా అంటూ అదో మాదిరిగా సంభోదిస్తున్నారు. మీరెవరు? మీరు కూడా నరజాతికి చెందినవారే కదా?" అన్నాడు.

"అయ్యో నరుడా... ఆలస్యం చేయకు....." అంటూ వున్నట్లుండి నీటిమీదికి వాలిపోయిందా యువతి. ప్రక్కనే వున్న రెండవ యువతి చటుక్కున ఆమెను పట్టుకుని బలవంతంగా పైకి లేపబట్టి ప్రాణాలు దక్కాయి. పైకి లేపి వుండకపోతే నీటిలో మునిగి ఉక్కిరి బిక్కిరి అయిపోయి వుండేది.

చికాకుగా మారిపోయింది గదాధరుడి పరిస్థితి.

కంటికి కనిపించని ప్రమాదం ఏదో ఆ మడుగును ఆశ్రయించుకుని వున్నట్లు తోచింది అతనికి.

అందరి మాదిరిగా తను కూడా వెనుకాముందు చూసుకోకుండా నీటిలోకి దిగితే ఆ వారిజాక్షుల మాదిరిగా బిగుసుకుపోక తప్పదని కూడా అనిపించింది.

"ఒక్క నిమిషం ఓపిక పట్టండి. చిటికెలో వచ్చేస్తాను." అంటూ ఆ ప్రదేశంలోకి అడుగుపెట్టటం కోసం, తాను ఏ పొదలను తెగ నరికాడో, ఆ పొదల దగ్గరికి పరిగెత్తాడు.

సన్నగా చిటికెన వేలంత లావుగా, బలమైన జనపనార త్రాడు మాదిరిగా వున్న రెండు తీగెలను తన కరవాలంతో చేధించి మడుగు దగ్గరికి తీసుకువచ్చాడు.

"వీటిని పట్టుకోండి... గట్టిగా పట్టుకోండి...." అంటూ వాటి కొసలను వారి వైపు విసిరి రెండవ ప్రక్కన వున్న కొసలను తను పట్టుకున్నాడు.

"నరుడు చాలా తెలివైనవాడు. ముందు చూపు చాలా అధికం...." తనను అంతకుముందు వరకు వణికించిన భయాన్ని మర్చిపోయినట్లు, చిరునవ్వుతో అంటూ ఒక తీగెను తాను పట్టుకున్నది రెండవ యువతి. రెండవ తీగెను తన సహచరురాలికి అందించింది.

శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుంటూ, వారిద్దరినీ ఆ మడుగులో నుంచి బయటికి లాగాడు గదాధరుడు.

తామరతూడుల మాదిరి సునాయాసంగా ఇవతలికి వచ్చేశారు వారిద్దరూ. ఒడ్డున వున్న ఇసుకలో చతికిలపడి ఎంతో దూరం నుంచి పరిగెత్తుకుంటూ వచ్చినట్లు ఆపసోపాలు పడటం మొదలు పెట్టారు.

తనవైపు చూస్తారనీ, తమను రక్షించినందుకు కృతజ్ఞతలు తెలియచేసు కుంటారని అనుకుంటూ అలాగే నిలుచున్నాడు గదాధరుడు.

పది క్షణికాలు కాదు గదా... పది నిమిషాలు గడిచిపోయిన తర్వాత కూడా తలలు తిప్పి చూడలేదు వాళ్ళు. తమను నీటిలోనుంచి బయటికి లాగిన మనిషి అసలు అక్కడ ఉన్నాడన్న విషయమే తమకు గుర్తులేనట్లు తలల్ని నీటి వైపే తిప్పుకొని వుండిపోయారు.

“తల్లులూ... మీ అవసరం తీరిపోయింది. నాతో మీకు పని వున్నట్లు కనిపించటం లేదు. ఇక నా దారిన నేను వెళ్ళిపోవచ్చునా?” పదునైదో నిమిషం తరువాత అడిగాడు గదాధరుడు అసహనంగా.

“మేము నీ కనులకు తల్లుల మాదిరిగా కనిపిస్తున్నామా నరుడా? మేము ఎంతటి సౌందర్యవంతులమో నీకు తెలియటం లేదా?” చటుక్కున తల తిప్పి అతనికేసి చూస్తూ అడిగింది ఆ యవతుల్లో ఒకర్తె.

శరీరమంతా తెల్లటి తెలుపు - కనులు మాత్రం నీలమణుల మాదిరి మిలమిలా మెరిసిపోతున్నాయి.

పడగను పైకెత్తి కాటు వేయడానికి సిద్ధంగా వున్న రాజసర్పం గుర్తుకు వచ్చింది గదాధరుడికి వెంటనే.

పది బారల పొడుగు వుంటుందా సర్పం. నాలుగు జానల వెడల్పున పడగవిప్పి, మూడు బారల ఎత్తుకు లేవ గల శక్తిని కలిగి వుంటుంది. కాటు వేయదు సామాన్యంగా. వేస్తే మాత్రం బ్రతికి బట్ట కట్టడం అసంభవం.

ఎక్కడో కొంకణదేశపు అడవుల్లో నివశిస్తూ వుండే ఆ మహాసర్పం, ఇప్పుడు ఎడారి భూమి వంటి ఆ కొండల మధ్య తనకు గుర్తుకు రావటం ఏమిటో అర్ధం కాలేదు గదాధరుడికి.

“సమాధానం చెప్పకుండా మట్టిబొమ్మ మాదిరి నిలబడిపోయావేమిటి? చెప్పు... మేము నీ కనులకు ఎలా కనిపిస్తున్నాము” తాను కూడా తలతిప్పి అతనివైపు చూస్తూ అడిగింది రెండవ యువతి.

ఆమె కనులు కూడా మహాసర్పపు కనుల మాదిరిగానే వున్నట్లు గమనించే సరికి, వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది గదాధరుడి నోరు.

“మీరు అందంగా లేరని ఎవరైనా అంటే, ఆ మనిషికి చూపులేదని అర్ధం. అందానికి నిర్వచనం చెప్పేందుకు భగవంతుడు మిమ్మల్ని సృష్టించాడని నేను భావిస్తున్నాను” తడుముకోకుండా చెప్పాడు.

ఆ మాటలు తమకు సంతోషాన్ని కలిగించినట్లు సన్నపాటి నవ్వులు నవ్వారు ఆ యువతులు.

"అసాధారణ సౌందర్యవంతులైన మీరిద్దరూ ఈ కొండ గుట్టల్లోకి ఎందుకు వచ్చారు? ముళ్ళ పొదలు బండరాళ్ళు తప్ప క్రిములు కీటకాలు కూడా కనిపించని ఈ ఎడారి ప్రదేశంలోకి ఎలా రాగలిగారు?" తన మనసులోని సందేహాన్ని బయట పెట్టాడు అతను.

"అంతా మా తల రాత...నుదిటి రాతను తప్పించుకోవటం ఎటువంటి వారికైనా సాధ్యపడదని అంటూ వుంటారు. నువ్వు వినలేదా?" అడిగింది మొదటి యువతి.

సానుభూతి సూచికంగా తల ఊపాడు గదాధరుడు.

"తీరికగా కూర్చుని ముచ్చట్లు చెప్పుకోవటానికి తగిన చోటు కాదు ఇది. చీకటిపడితే ఎటువంటి ఇబ్బందులు ఎదురుపడతాయో నాకు తెలియదు. ఓపిక చేసుకుని మీరు లేచి నిలబడితే ఇక్కడినుంచి అవతలికి వెళ్ళిపోదాము" అని చెప్పబోయి – మధ్యలోనే ఆగిపోయాడు.

"నాకు దాహంగా వున్నది. మడుగులోని నీటిని తాగవచ్చా??" అని అడిగాడు.

"నిర్మలంగానే వున్నాయి నీళ్ళు. తాగినందువల్ల తప్పేమీ వుండదు" తడుముకోకుండా చెప్పింది రెండవ యువతి.

ముందుకు అడుగువేశాడు గదాధరుడు. ముందుగా ఎడమచేతిని జాచి నీటిలో ముంచాడు. ఎటువంటి ప్రమాదము తనకోసం ఎదురు చూడటం లేదని అర్ధమై రెండవ చేతిని కూడా జాచాడు.

చల్లగా చాలా ఆహ్లాదకరంగా వున్నాయి అవి. దోసిటితో ఎత్తి మొఖం మీద జల్లుకుంటే ఎంతో హాయిగా అనిపించింది.

రెండు క్షణాలు తటపటాయించి, ఒక్కసారిగా మడుగులోకి దిగాడు అతను. ఒకవేళ ఆ సుందరీ మణుల పాదాలను బలవంతంగా బిగపట్టిన అదృశ్యశక్తి తనను కూడా మడుగులోనే బంధించదలుచుకుంటే ఎగిరి వడ్డుమీదకి దూకటానికి సిద్ధంగానే వున్నాడు అతను.

మూడు అడుగుల దూరం పోయిన తర్వాత కూడా అతన్ని బిగపట్టే ప్రయత్నం ఏదీ జరగలేదు.

అధికం అయిపోయింది అతని ధైర్యం...వేగంగా నడిచి ఆ మడుగు మధ్య భాగంలోకి అక్కడినించి అవతలి వడ్డు మీదికి అర క్షణికంలో చేరుకున్నాడు.

నీటిలోకి దిగిన వారిని తిరిగి బయటికి పోనీయకుండా ఆపే అదృశ్యశక్తి ఏదీ ఆ మడుగులో లేదని, అది ఒక సాధారణమైన నీటి మడుగు మాత్రమేనని అర్థం అయింది అతనికి.

అవతలి ప్రక్కన పాదాలు బార్లా జాపుకొని కూర్చుని వున్న అతివలు ఎందుకు అలా నీటిలో నిలబడిపోయారో ఎంత ఆలోచించినా అతనికి అవగతం కాలేదు.

నిమిషానికి ఒకసారి తనను నరుడా నరుడా అని విచిత్రంగా సంబోధిస్తున్న వారిద్దరూ ఎవరో, ఎక్కడినించి వచ్చారో తెలుసుకోవాలని అత్యవసరం అని మాత్రం అనిపించింది.

తడిసిన దుస్తుల్ని చేతులతో అద్దుకుంటూ మడుగు ఆవలి వడ్డు మీది నించి ఆ యువతుల దగ్గరికి వచ్చాడతను.

"మీ బడలిక తీరిందని నేను భావిస్తున్నాను...అనుమతిని ఇస్తే నా దారిన నేను వెళ్ళిపోతాను..." తను అడగదలుచుకున్న మాటను కాకుండా వేరే విధంగా సంభాషణ ప్రారంభించాడు.

"నరుడా – మమ్మల్ని వంటరిగా వదిలిపెట్టి వెళ్ళిపోతానని అనటం నీకు భావ్యమని అనిపిస్తోందా?" కనురెప్పల్ని అల్లల్లాడిస్తూ గోముగా అడిగింది మొదటి యువతి.

"భావ్యమో కాదో నాకు తెలియదు. చీకటిపడే సమయంలో నేను ఈ బండారాళ్ళ మధ్యన సంచరించకూడదు" అన్నాడు అతను.

ఆశ్చర్యంగా చూసింది రెండవ యువతి.

"ఎందుకని సంచరించకూడదు? నరజాతికి చెందిన వాడివేగా నువ్వు?" ప్రశ్నించింది మొదటి యువతి.

తను అడుగదలుచుకున్న మాటను తడుముకోకుండా అడగటానికి మంచి అవకాశం లభించిందని అర్థం అయింది గదాధరుడికి.

"నరజాతికి చెందిన వాడినే నేను. మరి మీరు?" మీరు ఏ జాతికి చెందిన వారు?" అడిగాడు.

"మేము కిన్నెర జాతికి చెందిన వారం. భూలోకపు అందాలను చూడటానికి వచ్చి ఈ మడుగులో చిక్కుపడ్డాము. ప్రాణాలు పోగొట్టుకోబోతున్న సమయంలో నువ్వు వచ్చి రక్షించావు" చెప్పింది రెండవ యువతి.

కిన్నెర జాతికి చెందిన వారు ఎవరో, ఎక్కడ నివశిస్తూ వుంటారో గదాధరుడికి తెలియదు. వారి లక్షణాలు ఎలాంటివో అంతకన్నా తెలియదు.

ఎటువంటి ప్రమాదము కలిగించని ఒక సాధారణమైన నీటి మడుగులో చిక్కుపడి ప్రాణాలు పోతున్నాయని గోల చెయ్యటం ఏమిటో కూడా అతనికి అర్థం కాలేదు.

"ఎందుకని? ఎందుకని మీరు చిక్కుపడ్డారు?" తడవు చేయకుండా తన మనస్సులోని సందేహాన్ని బయట పెట్టేశాడు.

"పిచ్చినరుడా... కిన్నెరలకు నీటికి బద్ధ విరోధం. నీకు మాకు విషతుల్యం" చిరునవ్వుతో చెప్పింది రెండవ యువతి.

"మీకు నీరు విషతుల్యం అయితే, మరి మీ శరీరాలకు సరిపడే ద్రవపదార్థం ఏది? మీరు తాగ గలిగింది ఏమైనా వుందా?" వెంటనే అడిగాడు గదాధరుడు.

మాటకు మాటగా సమాధానం ఇస్తున్న రెండవ యువతి ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వబోతూ వుండగా చటుక్కున అడ్డుకున్నది మొదటి యువతి.

"సంభాషణలు ఇక చాలు... ఈ ప్రదేశాన్ని వదిలి అవతలికి వెళ్ళి పోవటం చాలా ఉత్తమం" అంటూ లేచి నిలుచున్నది.

రెండవ యువతి చెప్పబోయిన మాటను ఆమె ఉద్దేశ్య పూర్వకంగానే అడ్డుకున్నట్లు అర్థమై, తల విదిలించాడు గదాధరుడు.

*　　*　　*　　*　　*

"అయ్యయ్యో... తల్లీ... దగ్గరికి వచ్చేస్తున్నారు ధనుర్ధారులు... వాళ్ళు వదులుతున్న వాటిలో ఒక్కటి తగిలినా చాలు... మనం మళ్ళీ బంధించ బడతాము...." పరుగును ఆపకుండా భుజాలు మీది నుంచి వెనక్కి చూస్తూ భయం నిండిన కంఠంతో అస్పష్టంగా అన్నది మహారాణి చెలికత్తె.

ఉలిక్కిపడి వెనక్కి చూశాడు శ్యామలుడు.

"నిన్ను ఇంకో పక్కకు పారిపొమ్మని చెప్పాను. చెప్పినట్లు చేయకుండా మా వెనుకే ఎందుకు వస్తున్నావు?" అని అడిగాడు.

"ఎవరి వెనుక వెళితే క్షేమంగా వుండగలమో వారిని అనుసరించాలి. మిమ్మల్ని వదిలి దూరంగా పోవటానికి మాకు ధైర్యం చాలలేదు" అంటూ విన వచ్చింది సమాధానం.

చెలికత్తె దగ్గిర్నించి కాదు. ఆమె వెనుకే వస్తున్న సైనికుడి దగ్గర్నించి గుడారాలు అంటుకుని, గందరగోళం మొదలైన తరువాత తన దారి ఏదో తను చూసుకుంటాడని అనుకున్నా అతను కూడా తమ వెనుకే ప్రత్యక్షం అవటంతో ఏం చేయాలో తోచలేదు శ్యామలుడికి.

ఒకే ఒక మనిషివైపు గురిగా బాణాలు వదలటం చాలా కష్టం. వరుసగా నలుగురైదుగురు పరుగులు తీస్తుంటే గుడ్డిగా వదిలిన బాణాలు కూడా ఒక్కోసారి గురిగా వచ్చిపడటం జరుగుతుంది.

"చెప్పిన పనిని చెప్పినట్లు చేయనివాళ్ళు ఎప్పుడో ఒకప్పుడు ఎదురు దెబ్బలు తినక తప్పదు..." కోపంగా అంటూ మరి కొంచెం వేగంగా పరిగెత్తటం మొదలు పెట్టాడు.

రివ్వురివ్వున వస్తున్న బాణాలకు అందకుండా అడ్డదిడ్డంగా పరుగు తీస్తున్నాడు సైనికుడు. తనతో పాటు రాణిగారి చెలికత్తెను కూడా అలాగే చేయమని సూచిస్తున్నాడు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఉపయోగం లేకపోయింది. పది నిమిషాలు కూడా గడవకముందే విపరీతమైన ఆయాసంతో చెలికత్తె అడుగులు తడబడటం మొదలుపెట్టాయి.

"కొట్టండి... గురి చూసి పడగొట్టేయండి" గగ్గోలుగా అరిచారు ఆ విషయాన్ని గమనించిన శత్రువులు.

"మీరు వెళ్ళిపోండి... నా పని అయిపోయింది... నేను పరిగెత్తలేను" అంటూ ఒక బండరాయి ప్రక్కన ఆగిపోయింది చెలికత్తె.

ఆమె తమ వెనుకే వస్తున్నందుకు శ్యామలుడు కోపంగా వున్నట్లు మహారాణికి తెలుసు. ఆమెను అక్కడే వదిలి ముందుకే వెళ్ళిపోవటం జరుగు తుందని అనుకున్నది ఆమె.

"నా చెలికత్తె అమాయకురాలు... ఇటువంటి బాధల్లో చిక్కుపడటం జరుగుతుందని తెలియక నా వెంట వచ్చింది. ఆమెను కాపాడటం మీ బాధ్యత...." అని శ్యామలుడికి చెప్పాలని అనుకున్నది ఆమె.

మాటలు పెదవుల్ని దాటి బయటికి రాకముందే చటుక్కున ఆగి పోయాడు అతను. భుజాలమీద వున్న మహారాణిని క్రిందికి దించి, ఒక బండచాటుకు నెట్టాడు.

అదే ఊపులో క్రింది నించి లావుపాటి పలుకు రాళ్ళను అందుకుని, ఎడాపెడా వెనక్కి విసరటం మొదలు పెట్టాడు.

మహారాణిని భుజాలమీదికి ఎత్తుకోవటం వల్ల సగం చెదిరి ఎర్రటి రక్తాన్ని వెలువరిస్తోంది అతని గాయం. ఇప్పుడు పలుగురాళ్ళను విసరటం మొదలు పెట్టగానే మరింత ఉధృతంగా బయటికి రావటం మొదలయింది నెత్తురు.

అయినాసరే వెనుకంజ వేయలేదతను. కంటికి కనిపించని వేగంతో చేతుల్ని కదిలించాడు.

ఇనుపముక్కల మాదిరి దూసుకువస్తున్న పలుకు రాళ్ళు తగిలి మొఖాలు గాయపడటం వల్ల వెర్రిగా అరుస్తూ నేల కూలిపోయారు నలుగురు దనుర్ధారులు. దగ్గిర్లో వున్న బండల్ని చాటు చేసుకుని అతని కేసి తమ ధనువుల్ని గురిపెట్టటం మొదలు పెట్టారు మిగిలిన వారందరూ.

ఉన్నట్లుండి వెనక్కి దూకాడు శ్యామలుడు. "పదండి... పరుగు మొదలు పెట్టండి" అని తన వారందర్నీ హెచ్చరిస్తూ తనే ఆ పని చేసి చూపించాడు.

బండలచాటుకు చేరిన దనుర్ధారులు ఆ దృశ్యాన్ని చూసి, తిరిగి వెంటాడటం ప్రారంభించే సమయానికి, బాణాలకు అందనంత దూరం వెళ్ళిపోయారు వారందరూ.

"పరిగెత్తండి... వేగంగా కదలండి. ఈ రోజు వాళ్ళని మన బాణాలకు బలిచేసి తీరవలసిందే" అని అందరినీ రెచ్చగొట్టబోయాడు ఒకడు.

పది అడుగుల దూరం కూడా పోకముందే, అతన్ని మిగిలిన వారిని అందరినీ ఆపేశాడు మరో ధనుర్ధారి.

"ఒక్క అడుగు కూడా వేయకూడదు. ఎవరూ ఇక ముందుకు పోకూడదు" పెద్ద కంఠంతో అరిచాడు.

"ఎందుకు పోకూడదు?" దురుసుగా అడిగాడు ఒక సహచరుడు.

"మా బంధువులు ఒకానొకప్పుడు ఈ గుట్టల దగ్గరికి వచ్చి అన్యాయం అయిపోయారని మా పెద్దలు చెపుతూ వుంటారు" అన్నాడు అతను.

"ఏ విధంగా" అడిగాడు ఆ సహచరుడు.

"ఇంకా కొంచెం ముందుకుపోతే పాములడొంక అనే ప్రదేశం వస్తుందట. అటుగాపోయిన వారెవరూ ప్రాణాలతో రాలేదట... మా బంధువులు ఆన్యాయం అయిపోయింది అక్కడేనట!" అన్నాడు అతను.

పరుగుపరుగున పోతున్న శ్యామలుడిని, అతనితో పాటుగా కదులుతున్న వారిని చూస్తూ వికటంగా నవ్వాడు ఆ ధనుర్ధారి.

"మనం ఇక్కడే మాటువేసి కూర్చుందాము... వాళ్ళు గనుక వెనక్కి తిరిగి వస్తే మన బాణాలకు బలి చేద్దాము" అన్నాడు.

ఆ మాట అందరికీ నచ్చినట్లుంది. ఎదురు చెప్పకుండా తలలు ఊపారు అందరూ... "వెనక్కిపోయి ఈ ప్రదేశంలో విడిది చేయటానికి అవసరమైన వాటన్నిటినీ తీసుకురావాలి. ముఖ్యంగా నీరు... ఆహారం..." చెప్పాడు ఆ దనుర్ధారి.

నలుగురు వ్యక్తులు తమ ధనస్సు, బాణాల్ని అక్కడే వదిలి వెనక్కి బయలు దేరారు.

పరుగును ఆపకుంటే భుజాల మీది నుంచి వెనక్కి చూస్తున్న సైనికుడు వెంటనే శ్యామలుడి దృష్టికి తీసుకుపోయాడు ఆ వైనాన్ని.

"వాళ్ళు విడిది ఏర్పాట్లు చేసుకుంటున్నారు... కారణం ఏమైవుంటుందో నాకు అవగతం కావటం లేదు" అంటూ.

తను కూడా ఆగిపోయాడు శ్యామలుడు.

"మనం ఆగినట్లు తెలిస్తే వాళ్ళు మళ్ళీ వెంటపడే ప్రయత్నం చేయ వచ్చు" ఆయాసాన్ని అణుచుకోవటానికి ప్రయత్నం చేస్తూ అన్నది మహారాణి.

ఆ మాటల్లో యదార్ధం వున్నదని అర్ధం అయింది శ్యామలుడికి. అయితే వాళ్ళు ఎందుకు ఆగిపోయారో అతనికి అంతుబట్టలేదు.

"ముందుకుపోతే ఏదైనా ముప్పు వాటిల్లుతుందని అనుకుంటున్నా రేమో!" తన అభిప్రాయాన్ని వెల్లడించింది రాణివారి చెలికత్తె.

పది క్షణికాలు ఆలోచిస్తూ తల అడ్డం తిప్పాడు శ్యామలుడు. “ముందు ఎటువంటి ప్రమాదం వున్నా సరే... మనం వెళ్ళి తీరవలసిందే... వెనుక వున్నది ఆ ధనుర్ధారులు మాత్రమే కాదు... దళపతి వచ్చాడు. ఇతర సైనికులు కూడా వున్నారు. వారందరూ కలిస్తే మనము తట్టుకోవటం చాలా కష్టం” అంటూ నడక మొదలుపెట్టాడు.

పాతిక ధనువుల దూరం మాత్రమే పోయారు వారందరూ. ఒక పల్లపు ప్రదేశాన్ని అధిగమించి, అవతలి వైపుకు చేరుకుంటూ వుండగా – నవ్వుతూ ఎదుట ప్రత్యక్షం అయ్యాడు గదాధరుడు.

వంటరిగా రావటం లేదతను. వెంట ఇద్దరు అపురూప సౌందర్య రాసులు ఇద్దరు వున్నారు.

*           *           *           *           *

పోతున్న ప్రాణం లేచి వచ్చినట్లు అయింది శ్యామలుడికి. తన జతగాడిని చూసేసరికి.

“ఎప్పుడనగానో వెళ్ళినవాడివి, తీరికగా ఇప్పుడు కనిపిస్తున్నావా? నీకు అసలు బుద్ధి అనేది వున్నదా??” కోపంగా ముఖం పెట్టి చాలా దురుసుగా అడిగాడు.

“వంటరిగా వదిలిపెట్టి వెళ్ళాను. నాకు చెప్పకుండా ఇంతమందిని వెంట పెట్టుకుని తిరుగుతున్నావు. ఎవరు వాళ్ళు” ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

“వీళ్ళు ఎవరో తర్వాత చెపుతాను. ముందుగా నీ స్నేహితురాళ్ళు ఎవరో నువ్వు చెప్పు” అతని వెనుక నిలబడిన ఇద్దరు అతివల వంకా ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు శ్యామలుడు.

ముక్తసరి మాటలతో తన అనుభవాలను అతనికి చెప్పాడు గధాదరుడు. అతను చెప్పిన మాటల్ని ఆలకించి సాలోచనగా తల ఊపాడు.

“మనం వెనక్కివెళ్ళి రహదారిని సమీపించాలంటే గుట్టక్రింద మాటు వేసిన వారందరినీ తప్పించుకోక తప్పదు. నువ్వు నేను ఇద్దరిమే వున్నట్లయితే ఆ పని చిటికెలో జరిగిపోయేది. ఇప్పుడు మనతోపాటు వాళ్ళందరూ వున్నారు. రహస్యంగా కదలటం చాలా కష్టం....” ఆ చిన్న కంఠంతో చెప్పాడు.

"అలాగని ఇక్కడే వుండటం కూడా చాలాకష్టం. పరిగెత్తి పరిగెత్తి అందరి గొంతుకలు ఎండుకు పోయాయి. నీళ్ళు కావాలి. నీరసం ముంచుకు రాకుండా ఆహారం కూడా కావాలి" అన్నాడు శ్యామలుడు.

"ఏదిచేసినా పట్టపగలు చేయటం అసంభవం. చీకటిపడిన తర్వాత చూద్దాము...." అంటూ ఏదోగుర్తుకు వచ్చినట్లు మాటలు ఆపి ప్రశ్నార్థకంగా చూశాడు గదాధరుడు.

"ఏమిటీ నీ అనుమానం?" అడిగాడు శ్యామలుడు.

"చీకటిమాటున ఆ దుర్మార్గులు వచ్చిపడితే?"

"ఆ అంశమే నాకు అంతుబట్టటం లేదు. అసలు వాళ్ళు ఎందుకు ఆగిపోయారో తెలియటం లేదు" అన్నాడు శ్యామలుడు.

"వాళ్ళకి పాములడొంక గురించి తెలిసిపోయి వుంటుంది" తన అనుమానాలన్నీ తీరిపోయినట్లు తృప్తిగా నిట్టూరుస్తూ అన్నాడు గదాధరుడు.

అయోమయంగా చూసిన తన స్నేహితుడికి తనకు చెప్పబడిన మాటల న్నిటినీ వివరంగా చెప్పాడు అతను.

ఎదురు ప్రశ్నలు వేయకుండా ఆలకించి తాను కూడా తృప్తిగా తల ఊపాడు శ్యామలుడు. "అయితే మనం భయపడవలసిన అవసరం లేదు. చీకటిపడిన తర్వాత చూసుకుందాము...." అంటూ తీరికగా ఒక బండరాయి దగ్గిర చతికిలపడ్డాడు.

అతని వంక, అతనికి కొంచెం అవతలగా కూర్చున్న సైనికుడి వంక చూసి తల ఊపింది గదాధరుడితో కలిసివచ్చిన మొదటి యువతి.

అధికంగా శ్రమ పడటం వల్ల పూర్తిగా రేగిపోయి, అదేపనిగా నెత్తురు వెలువరుస్తోంది శ్యామలుడి భుజం మీది బాణపు దెబ్బ. కట్టుగాకట్టిన అతని దట్టీ దారుణంగా మలినపడిపోయి కనిపిస్తోంది.

ఆ వస్త్రాన్ని ఊడతీసేశాడు గదాధరుడు. "గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తీసుకురావటం నీకు బాగా అలవాటు అయింది. ఇప్పుడు గనుక ఇది ఇంకేదైనా పెద్ద తలనొప్పిని తీసుకువస్తే మనం ఎటువంటి పరిస్థితిలో

చిక్కుకుంటామో ఏమైనా ఆలోచించావా?" చిరాకుగా ఎత్తిపొడుస్తూ తన నడుముకు వున్న దట్టీని తీసి కట్టుగా కట్టాడు.

"ఇప్పటినించీ నువ్వు ఎవరినైనా భుజం మీదికి ఎత్తుకోవాలని అనిపిస్తే, నన్ను పిలువ్... నేను ఎత్తుకుంటాను. అర్థం అయిందా?" అని అడిగాడు.

చిరునవ్వుతో తల ఊపి దగ్గిర్లో వున్న ఒక బండరాయిని ఆనుకుని కనులు మూసుకున్నాడు శ్యామలుడు.

రక్తంతో తడిసిపోయి ఉన్న అతని దట్టీని మడత పెట్టి తనకు దగ్గిర్లో వున్న ఒక బండమీద పెట్టాడు గదాధరుడు.

"అదేదో అపురూపమైన వస్త్రం మాదిరి అంత భద్రంగా మడతలు పెడుతున్నారేమిటి? అవతల పడవేయవచ్చు గదా...." వెంటనే అతన్ని అడిగాడు సైనికుడు.

"యుద్ధవిద్యల్లో ప్రత్యేకమైన శిక్షణ పొందిన వాడివి నువ్వు. నెత్తురుతో తడిసిపోయిన దుస్తుల్ని యుద్ధ సమయాల్లో ఏం చేస్తారో నీకు ఎవరైనా చెప్పారా?" అడిగాడు గదాధరుడు.

క్షణం ఆలోచించి తల ఊపాడు సైనికుడు. "మూటలు కట్టి భూమిలో పాతి పెట్టటమో, నిప్పుల్లో పడవేసి మసి చేయటమో ఏదో ఒకటి చేస్తారు. కాని మడతలు పెట్టి ఎదురుగా వుంచుకోరు" అన్నాడు.

"ఎందుకు అలా చేస్తారు?" ఇంకో ప్రశ్నవేశాడు గదాధరుడు.

"మలినపడిన ఆ వస్త్రాల మీదికి రకరకాల సూక్ష్మక్రిములు వచ్చి కూర్చుంటాయి. వాటి ద్వారా అనేకమైన వ్యాధులు వ్యాపిస్తాయి" అన్నాడు అతను.

"తర్వాత?" అడిగాడు గదాధరుడు.

"రక్తపువాసన క్షుద్ర ప్రాణుల్ని ఆకర్షిస్తుంది. ఏమరిపాటుగా వున్న సమయంలో అవి వచ్చిపడతాయి...."

తృప్తిగా తల ఊపాడు గదాధరుడు. "లెక్క ప్రకారం మనం కూడా ఈ వస్త్రాన్ని నిప్పుల్లో పడవేసి మటుమాయం చేసివేయాలి. కాని ఇప్పుడున్న పరిస్థితిలో నిప్పు చేయటం, మంటలు వేయటం అంటే మనం ఎక్కడ వున్నామో మనల్ని తరముకువస్తున్న వారికి తెలియచేయటమే. పాతిపెట్టటానికి తగినంత పెద్దగోతిని తవ్వే ఓపిక ప్రస్తుతం లేదు. తెల్లవారిన తరువాత చేయువలసిన పని

అది...."అంటూ తను కూడా ఒక బండరాయి దగ్గిర కాళ్ళు బారచాపుకుని కూర్చున్నాడు గదాధరుడు.

అతని మాటలు తనకు నచ్చినట్లు తల ఊపాడు సైనికుడు. తమ మహారాణి సుఖంగా విశ్రమించటానికి వీలుగా ఒక బండ దగ్గరి నేలను చేతులతో తడిమి, శుభ్రం చేశాడు.

"నీ సేవలు మాకు తృప్తిని కలిగించాయి. నగరానికి తిరిగి వెళ్ళగానే మీ విశ్వాసానికి తగిన ప్రతి ఫలం ఇవ్వబడుతుంది..." తన చెలికత్తె ద్వారా అతనికి చెప్పించింది మహారాణి.

"నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాను తల్లీ...మీ ఉప్పు తింటున్నందుకు ఎంతో కొంత సేవ చేసుకునే భాగ్యం కలిగినందుకు నాకు ఎంతో సంతోషంగా వున్నది" అంటూ ఆమె విశ్రమించిన ప్రదేశానికి పది అడుగుల అవతలగా వున్న ఒక మెరక ప్రదేశం దగ్గరికి పోయాడు సైనికుడు.

ఎర్రటి వెలుగులు వెదజల్లుతున్న సూర్యుడు చూస్తూ చూస్తూ వుండగానే పడమటి దిశలో పడి మటుమాయం అయిపోయాడు. అప్పటివరకూ కొండ గుట్ట మీది బండరాళ్ళ చాటున వున్న నీడలు అన్నీ ధైర్యంగా ఇవతలికి వచ్చేశాయి. క్షణాలు గడిచినకొద్దీ చిక్కబడి చీకటి రూపంలోకి మారిపోయాయి.

"రెండు ఝాములు గడిచే వరకూ నువ్వు మెలకువగా వుండు. ఆ తరువాత నేను కాపలా కాస్తాను. చీకటిమాటున శత్రువులు మన మీదికి వచ్చి పడే ప్రమాదం వుంది" చెప్పాడు అతనికి గదాధరుడు.

తల ఊపి ఒక బండను ఆనుకుని నిలుచున్నాడు సైనికుడు. పావుఘడియ గడిచిన తర్వాత ఎందుకో తల తిప్పి శ్యామలుడి వైపు చూశాడు అతను.

చూసిన మరుక్షణం అతన్ని ఆవరించుకున్నది విపరీతమైన ఆశ్చర్యం.

చీకటి పడకముందు శ్యామలుడు విశ్రమిస్తున్న ప్రదేశానికి రెండు బారల దూరంలో కూర్చున్నారు గదాధరుడు వెంట బెట్టుకువచ్చిన అందగత్తెలు ఇద్దరూ.

ఇప్పుడు వున్నట్లుండి ముందుకు జరిగి వున్నారు ఇద్దరూ. గదాధరుడు మడతపెట్టి బండమీద పెట్టిన మలిన వస్త్రం వైపు చేతిని జాస్తోంది వారిలో ఒకర్తె.

తన కనులు తనను ఏమరుస్తున్నాయేమోనన్న అనుమానం కలిగింది సైనికుడికి. “తల్లులూ... ఏం చేస్తున్నారు మీరు? ఎందుకు ఆ వస్త్రాన్ని ముట్టుకుంటున్నారు?” చిన్న కంఠంతో అడుగుతూ మూడు అంగల్లో వారి దగ్గరికిపోయాడు.

పరిగెత్తి పరిగెత్తి శరీరంలోని శక్తి అంతా హరించుకుపోయింది కాబోలు, గాఢనిద్ర పోతున్నది మహారాణి చెలికత్తె. విపరీతమైన మానసిక సంఘర్షణకు గురైనందువల్ల అలసిపోయింది మహారాణి. తాను కూడా ఆదమరిచి నిద్రపోతున్నది. గాయం దెబ్బకు మగత ముంచుకు వచ్చింది కాబోలు– కదలను కూడా కదలటం లేదు శ్యామలుడు.

అంతకుముందే మాట్లాడి బండరాయికి చేరగిలబడిన గదాధరుడు – సైనికుడికి కనిపించలేదు. ఎప్పుడు అవతలికి జరిగాడో తెలియదు.

“తల్లులూ...వదిలేయండి ఆ వస్త్రాన్ని” మరోసారి ఆ యువతుల్ని హెచ్చరిస్తూ, చేయిజాచి అడ్డుకోబోయాడు అతను.

చివ్వున తల తిప్పి ఒక చూపు చూసింది వస్త్రాన్ని పట్టుకోబోతున్న యువతి. ఛలిగాలి వీచినట్లు జలదరించింది సైనికుడి శరీరం.

సైన్యంలో చేరిన కొత్తలో యుద్ధశిక్షణ నిమిత్తం ఒక చిట్టడివిలో పది రోజుల పాటు సంచరించవలసి వచ్చింది అతనికి. ఒక రోజున సాయం సమయంలో అతనికి అగుపించింది ఒక పెద్ద పాములపుట్ట. దాని పైభాగంలో పడగ విప్పి నాట్యం చేస్తున్న నాగు పాము కూడా కనిపించింది.

ఆ రోజున ఆ పాము తన వైపు చూసిన చూపే ఇప్పుడు గుర్తుకువచ్చింది అతనికి. శరీరంలో ప్రవహించే రక్తం అంతా గడ్డకట్టుకుపోయిన అనుభూతి కలిగింది ఆ రోజున. అదే అనుభూతి తిరిగి ఇప్పుడు కూడా కలగటం మొదలు పెట్టింది.

అతని ముఖంలో ప్రత్యక్షం అవుతున్న భావాలను తాను గమనించనట్లు బండరాయి మీది వస్త్రాన్ని చేతుల్లోకి తీసుకున్నది ఆ యువతి. మొఖానికి దగ్గిరగా పట్టుకుని గట్టిగా వాసన చూసింది.

“ఎలా వున్నదీ? ఏమనిపిస్తోంది?” ఆత్రుతగా అడిగింది రెండవ యువతి ముందుకు వంగుతూ.

"కండబలం గుండె బలం దండిగా వున్న నరుడి రక్తం. వళ్ళు పులకరించి పోతున్నది. గుండె ఉప్పొంగిపోతున్నది" అంటూ ఆ వస్త్రాన్ని ఆమెకు అందించి మరోసారి సైనికుడి వైపు చూసింది మొదటి యువతి.

"ఏమిటి మాట్లాడుతున్నారు మీరు? అసలు మీరు ఎవరు?" తడి ఆరిపోయిన కంఠంతో అడిగాడు సైనికుడు.

"మేము ఎవరిమో నీకు ఇంకా అర్ధం కాలేదా?" కిలకిలా నవ్వుతూ అడిగింది ఆమె. తన చేతుల్ని అతనికేసి జాచింది.

"పట్టుకుంటే కందిపోయే శరీరాలు మావి. ముట్టుకుంటే మాసిపోయే అందాలు మా సొంతం. ఒకసారి నన్ను తాకి చూడు" అన్నది.

చీకటిపడిన క్షణం నుంచీ చల్లబడిపోయి వున్నది అక్కడి వాతావరణం. ముడుచుకు కూర్చోవాలన్నంత చలి అప్పుడప్పుడే మొదలు అవుతున్నది.

అంత చల్లటి వాతావరణంలో కూడా చెమటలు ప్రత్యక్షం అయ్యాయి సైనికుడి మొఖం మీద. వీపరీతమైన దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయింది అతని గొంతుక.

"రారా నరుడా... నన్ను తాకి చూడరా...." అంటూ తన చేతుల్ని మరింతగా ముందుకు జాచింది ఆ యువతి.

ఎగిరి వెనక్కి దూకాడు ఆ సైనికుడు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో మూడు అంగల దూరం వెళ్ళిపోయాడు.

"మీరు ఎవరోగాని మహాప్రమాదకరమైన వాళ్ళు. మీరు మనుష్యులు కారు...." జీరపడిన కంఠంతో అంటూ, తనకు దగ్గర్లో వున్న మహారాణి దగ్గిరికి ఎగిరి దూకాడు... "తల్లీ ఒక్కసారి కనులు తెరిచి చూడండి... తల్లీ" అంటూ ఆమెను నిద్ర లేపటానికి ప్రయత్నం చేయబోయాడు.

"నువ్వు భయపడవలసిన అవసరం లేదు. వీళ్ళ వల్ల నీకు ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. అనవసరంగా మహారాణి వారి విశ్రాంతికి భంగం కలిగించకు...." అంటూ అతనికి వినవచ్చింది గదాధరుడి కంఠం.

"వాళ్ళు... వాళ్ళు ఎవరు??" వణుకుతున్న కంఠంతోనే అతన్ని అడిగాడు సైనికుడు.

"కిన్నెరలమని నాతో చెప్పారు. నిజమోకాదో తెలియదు. కాని ఒక విషయం మాత్రం ఇప్పుడు రూఢి అయింది" మహారాణి విశ్రమిస్తున్న బండ రాయి వెనుక నుంచి అతనికి మాత్రమే వినబడేటట్లు చిన్నగా చెప్పాడు గదాధరుడు.

"ఏమిటా విషయం?" అడిగాడు సైనికుడు.

"తమంతట తాముగా నిన్ను వాళ్ళు ఏమీ చేయలేరు. నీకు నువ్వుగా వాళ్ళని తాకితే మాత్రం నాశనం అయిపోతావు. ఎట్టి పరిస్థితిలోను వాళ్ళ శరీరాలను నీ చేతులతో నువ్వు తాకకు" చెప్పాడు గదాధరుడు.

"వాళ్ళుఎవరో మీకు నికరంగా తెలియనప్పుడు ఈ విషయం మాత్రం ఎలా తెలిసింది?" అడిగాడు సైనికుడు.

"తమ చేతులు పట్టుకోమని వత్తిడిచేశారు. నేను పట్టుకోలేదు. ఇంకా ప్రాణాలతోనే వున్నాను. ఇప్పుడే నిన్నుకూడా అడిగింది ఆ పిశాచి. నువ్వు వెనక్కి దూకటం వల్ల నీ ప్రాణాలు కూడా దక్కాయని రూఢి అయింది" చెప్పాడు గదాధరుడు.

"ఇటువంటి పిశాచాలను వెంటబెట్టుకు తిరగటం ప్రమాదకరం కదా. తల రాతలు తిన్నగా వుండబట్టి మీరు నేను ఒడ్డున పడగలిగాము. నిద్రలు లేచిన తర్వాత నీ స్నేహితుడు, మా మహారాణి–" అంటూ ఆ పైన చెప్పలేక మాటల్ని ఆపాడు సైనికుడు.

"నా స్నేహితుడిని గురించి నువ్వు ఆలోచించవలసిన అవసరం లేదు...." అన్నాడు గదాధరుడు.

"ఎందుకని?" అడిగాడు సైనికుడు ఆశ్చర్యంగా.

"నా స్నేహితుడిని మాయ చేయగల మొనగాళ్ళు ఇంకా ఈ భూమిమీద ఎవరూ పుట్టలేదు... లాగిపెట్టి ఒకటి ఇచ్చుకుంటే క్రిందపడి కళ్ళు తేలవేసే ఈ అర్భక యువతులు ఒక లెక్కకాదు...." సగర్వంగా చెప్పాడు గదాధరుడు.

ఆ మాట తనకు పూర్తిగా అర్ధం కాకపోయినా, అవగతం అయినట్లు తల ఊపాడు సైనికుడు. "రెండు ఝాముల తరువాత మీరు అందరికీ కాపలా వుంటానని చెప్పారు. అంత వరకూ విశ్రాంతి తీసుకోకుండా ఇలా బండల చాటున నిలబడి వున్నారేమిటి?" అని అడిగాడు.

తను వెంటబెట్టుకువచ్చిన కిన్నెర వనితా మణుల చర్యల్ని చాటుగా గమనించటం కోసమేనని అతనికి చెప్పలేదు గదాధరుడు.

"నాకు కొన్ని పనులు వున్నాయి. అవి పూర్తి అయ్యేవరకూ విశ్రాంతి తీసుకోవడం సాధ్యపడదు. నువ్వు జాగ్రత్త" అని అతనికి చెప్పి వెనక్కి జరిగి చీకట్లో కలిసిపోయాడు.

"ఎవరా బండచాటున? ఎవరితో మాట్లాడుతున్నావు? మాట్లాడ దలచుకుంటే దగ్గరికి వచ్చి మాతో సంభాషించవచ్చును కదా...." గోముగా వినవచ్చింది రెండవ యువతి కంఠం – సైనికుడికి.

అధికం అయిపోయింది అతన్ని ఆవరించుకుని వున్న భయం. ఎగిరి మరింత దూరం వెనక్కి దూకబోయాడు.

"మదనుడి బాణాల వంటి రూపములు కోరికోరి ఆహ్వానిస్తుంటే బెదురు గొడ్డు మాదిరి దూరంగా దూకుతావేంటి? దగ్గరికి రా" అంటూ వినవచ్చింది మరో కంఠం.

అదిరిపడి చూసిన అతనికి బండరాయిని వదిలి సర్దుకు కూర్చుంటున్న శ్యామలుడు కనిపించాడు.

"అయ్యా... వాళ్ళు... వాళ్ళు... మామూలు మనుష్యులు...." అంటూ అసలు విషయాన్ని అతనికి చెప్పబోయాడు సైనికుడు.

చిరునవ్వు నవ్వాడు శ్యామలుడు. కట్టుకట్టి వున్న భుజాన్ని రెండవ చేత్తో రుద్దుకుంటూ దగ్గరికి రమ్మనమని తల ఊపాడు.

"దమ్ము ధైర్యం నిండుగా వున్నాయట నా రక్తంలో. ఏ మాత్రం అవకాశం లభించినా ముందుగా నన్నే ఏదైనా చేస్తారు వాళ్ళు. నా తర్వాతనే నువ్వు...." అన్నాడు.

భయం భయంగానే ముందుకు నడిచి అతన్ని చేరుకున్నాడు సైనికుడు. రక్తంతో మలినమై వున్న వస్త్రాన్ని వదిలి పెట్టకుండా తమ దగ్గిరే వుంచుకున్నారు ఆ యువతులు ఇద్దరు. నదురుబెదురు లేకుండా వారివంకే చూస్తున్నారు.

"వాళ్ళకి భయం అనేది వుండదా? వాళ్ళ గుట్టు రట్టు అయిందన్న విషయం ఇంకా వాళ్ళకి తెలిసి రాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు సైనికుడు.

"వాళ్ళ శక్తిమీద వాళ్ళకి అమితమైన విశ్వాసం వున్నట్లు నాకు అనిపిస్తోంది. ఏదో ఒక సమయంలో మనం దొరికి పోతామనే అనుకుంటున్నారు" దగ్గిర్లో వున్న మొదటి యువతి కేసి చూసి, చిన్నగా నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

"వంటరిగా ఎంతసేపు కూర్చుంటావు? నా చేతిని పట్టుకో. హాయిగా వుంటుంది" చేతిని ముందుకు జాస్తూ ఆహ్వానించింది ఆమె.

"కాళ్ళని చేతుల్ని పట్టుకునే అలవాటు మాకు లేదు... నోళ్ళు మూసుకుని మీ ఏడుపేదో మీరు ఏడ్చుకోండి...." చాలా తెలివిగా వెక్కిరించాడు అతను.

"అయ్యా... క్షణక్షణానికి వాళ్ళకి ఆత్మవిశ్వాసం అధికం అయిపోతున్నట్లుంది. ఇటువంటి వాళ్ళని పక్కన పెట్టుకోవడం మహా ప్రమాదం... ఎంత త్వరగా వదిలించుకోగలిగితే అంతమంచిది" భయం నిండిన కంఠంతో చెప్పాడు సైనికుడు.

"వదిలించుకుందాం...నా జతగాడు బహుశా అదే పని మీద అవతలికి పోయినట్లున్నాడు" అన్నాడు శ్యామలుడు.

*    *    *    *    *

నీడ మాదిరిగానే నిశ్శబ్దంగా అడుగు వేశాడు గదాధరుడు. అర్ధఘడియ తరువాత అగుపించారు అతనికి. బండరాళ్ళ దగ్గిర చితుకులమంటలు వేసుకుని నిద్రలు పోతున్న సైనికులు.

చీకటిమాటున ముందుకు పోయిన వాళ్ళు వెనక్కివస్తే – వెంటనే గమనించి అందరినీ హెచ్చరించటంకోసం నలుగురు భటులు బండరాళ్ళమీద మెలకువగా కూర్చుని వున్నారు.

అవే బండలను చాటు చేసుకుని పిల్లి మాదిరిగా వస్తున్న గదాధరుడిని గమనించలేకపోయారు వాళ్ళు. పాము మాదిరి మోచేతుల మీదుగా పాకుతూ వారిని దాటి నిద్రలు పోతున్న వారి సమీపంలోకి పోయాడు అతను.

ఒక చితుకుల మంట దగ్గిర కనిపించాయి అతనికి రెండు నీటి సంచులు. ఎండిపోయిన రొట్టెలున్న పాత్ర కూడా ఒకటి అగుపించింది.

నీటి సంచుల్ని భుజాలకు తగిలించుకున్నాడు అతను. రొట్టెల పాత్రను చేతులతో పట్టుకున్నాడు.

అంతకుముందు మాదిరి పాములాగా పాకటం అసాధ్యం అని వెంటనే తెలిసిపోయింది.

"వచ్చిన పని అయిపోయింది. నీరు లభించింది. రొట్టెలు దొరికాయి. మనం ఇక రహస్యంగా సంచరించవలసిన అవసరం లేదు" అని అనుకుంటూ వున్నట్లుండి లేచి నిలుచున్నాడు.

"పట్టుకోండి...పట్టుకోండి. శత్రువు మన మధ్యలోకి వచ్చేశాడు. పట్టుకోండి" అని బిగ్గరిగా అరిచి ఒక్కసారిగా పరుగు మొదలుపెట్టాడు.

అదిరిపడ్డారు బండల మీద కాపలా వున్న సైనికులు. సంభ్రమంగా తమ దగ్గిర వున్న చిన్నపాటి కొమ్ముబూరలను బయటికి తీసి గంయ్ గంయ్‌మని ఊదటం మొదలు పెట్టారు.

గదాధరుడు గట్టిగా కేకపెట్టిన మూడో క్షణంలో నిద్రలు చెడి ఆదరాబాదరగా లేచి నిలుచున్నారు నిద్రలు పోతున్న సైనికులు అందరూ.

"పట్టుకోండి... ఎట్టి పరిస్థితిలోను తప్పించుకోకూడదు. వెంటపడండి... బాణాలు వదిలి మట్టి కరిపించండి." ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞ ఇచ్చాడు దళపతి.

చేతులకు అందిన ఆయుధాల్ని అందుకున్నారు అందరూ. నిద్రచాలని కనులను నలుపుకుంటూ ముందుకు పరుగులు మొదలుపెట్టారు.

"అయ్యా... ఆగండి... ముందుకుపోకండి...ముందున్నది పాముల డొంక... గుడ్డిగాపోతే ప్రాణాలతో తిరిగి రావటం జరగదు" అంటూ దళపతికి విజ్ఞప్తి చేయటానికి ప్రయత్నించాడు అంతకుముందు ఆ ప్రదేశాన్ని గురించి అందరికీ చెప్పిన భటుడు.

పళ్ళు పటపటమని కొరుకుతూ, తన ఆయుధాన్ని వరలో నుంచి బయటికి తీశాడు దళపతి. "ఇంకొక్కమాట నీ నోటి వెంట వెలుపలికి వచ్చిందంటే నీ చావు ఇక్కడే ఇప్పుడు ముందుకు వచ్చేస్తుంది. పాములడొంక దగ్గరికి వెళ్ళవలసిన అవసరం లేదు. నోరు మూసుకో" అని హూంకరించాడు.

అడ్డం వచ్చిన బండల మీది నుంచి ఎగిరెగిరి దూకుతూ, ఆ పని చేయటం వీలు పడకపోతే బండల చుట్టు తిరిగి దారిని వెతుక్కుంటూ, చీకటిలోనే పరుగులు మొదలుపెట్టారు సైనికులు.

"కాగడాలు... కాగడాలను పట్టుకోండి. వారిని జాగ్రత్తగా చూసుకోండి" తన హెచ్చరికను దళపతి లక్ష్యపెట్టకపోయినా, వుండబట్టలేక బిగ్గరిగా అరిచాడు పాముల డొంకను గురించి చెప్పిన భటుడు.

ఆ మాటల్ని కూడా ఎవరూ వినిపించుకోకపోవటంతో, అప్పటికప్పుడు ఒక నిర్ణయాన్ని తీసుకున్నాడు అతను. అందరితో పాటు తాను కూడా ముందుకు కదిలినట్లే కదిలి, చల్లగా ఒక బండరాయి చాటున ఆగిపోయాడు.

ఆ సంగతి గమనించలేదు ఎవరూ... గుడ్డిగా ముందుకు పరుగులు తీశారు.

*   *   *   *   *

"మేము ఇద్దరం వున్నాము. మీరు కూడా ఇద్దరే వున్నారు. మా చేతుల్ని పట్టుకుంటే ఇప్పుడు వచ్చిన ప్రమాదం ఏముంటుంది?" తియ్యటి కంఠంతో అడిగింది మొదటి యువతి – శ్యామలుడిని.

చాలా అందంగా నవ్వాడు అతను. "నా జతగాడు వచ్చిన తర్వాత మేము ముగ్గురు అవుతాము. మీరు మాత్రం ఇద్దరే వుంటారు. అప్పుడు ఎలా కుదురుతుంది?" అని అడిగాడు.

"నాకు రెండు చేతులు వున్నాయి. నా సోదరికి రెండున్నాయి. మీరు నాలుగో నరుడిని తెచ్చుకున్నా పరవాలేదు." మరింత ముద్దుగా చెప్పింది ఆమె.

"చేతులు పట్టుకోవటం దేనికి?" అమాయకంగా చూస్తూ అడిగాడు అతను.

"అయ్యో... మాటలు వద్దు. మాటల్లో పడితే వాళ్ళు మనల్ని ఏమార్చే టట్లు కనిపిస్తోంది" భయంగా అతన్ని హెచ్చరించాడు సైనికుడు.

"మాటల్లో పెట్టి కాలం గడపటమే మంచిది. మౌనంగా వుంటే వాళ్ళ ఆలోచనలు ఎటు దారి తీస్తాయో తెలుసుకోవటం కష్టం" అన్నాడు శ్యామలుడు.

"పట్టుకోండి... మా చేతుల్ని పట్టుకోండి" ఆలస్యాన్ని భరించటం అసాధ్యం అయిపోతున్నట్లు వత్తిడిగా అడిగింది ఆ యువతి.

సైనికుడు వారిస్తున్నా ఆగకుండా తన చేతిని ముందుకు జాచాడు శ్యామలుడు.

వింతగా ప్రకాశించింది ఆ యువతి వదనం. నీలం రంగులో వున్న ఆమె కనులు నీలమణుల మాదిరి మిలమిలలాడటం మొదలుపెట్టాయి. ఆత్రం అధికం అయిపోతున్నట్లు పెదవుల్ని నాలుకతో తడిచేసుకున్నది ఆమె.

"అయ్యా... అయ్యా... ఆగండి... ఆగిపోండి...." గొంతు చినిగి పోయేటట్లు అరిచాడు సైనికుడు.

అరవటంతో ఆగలేదు అతను. శ్యాములుడి భుజాలు పట్టుకుని బలవంతంగా వెనక్కి లాగాడు.

మిలమిలలాడుతున్న ఆ యువతి కనుల్లో వెంటనే ప్రత్యక్షం అయింది దారుణమైన క్రోధం.

పిచ్చిగా అరవటం గాని, కోపంతో నిందావాక్యాలు పలకటం గాని చేయలేదు ఆమె. చివ్వునలేచి నిలబడింది. పూనకం వచ్చినట్లు ముందుకు వెనక్కి ఊగుతూ భీకరమైన శబ్దాలు చేయటం మొదలు పెట్టింది.

"ఏం కనిపించింది నీకు?" సైనికుడు వెనక్కి లాగటంతో నేలను పొడుచుకోబోయిన భుజాన్ని రెండవ చేతితో అదుముకుంటూ సైనికుడిని అడిగాడు శ్యాములుడు.

"ఆ పిశాచి నాలుక పాము నాలుక... రెండుగా చీలివుంది. అది మనిషికాదు... పాము... అడవి పాము...." వణుకుతున్న కంఠంతో చెప్పి దూరంగా పరుగుతీయబోయాడు సైనికుడు.

కదలకుండా చేయిపట్టుకుని ఆపేశాడు శ్యాములుడు.

"పారిపోవాల్సిన అవసరం లేదు... వాటంతట అతిగా మనకి హాని తలపెట్టలేవు" అన్నాడు.

"ఎలా తెలుసు మీకు?" అడిగాడు సైనికుడు.

"హాని తలపెట్టగలిగితే ఆ పని ఎప్పుడో జరిగిపోయి వుండేది. నా జతగాడిని ఎప్పుడో బలి తీసుకుని వుండేవి. అతని వెంట పెంపుడు జంతువుల మాదిరి నడిచి వచ్చేవి కావు...." అన్నాడు శ్యాములుడు నమ్మకంగా.

"ఏది ఏమయినా వాటిని ఎదురుగా పెట్టుకుని...." అంటూ చటుక్కున మాటల్ని ఆపాడు సైనికుడు.

వింటినుంచి వెలువడిన బాణం మాదిరి గదాధరుడు వేగంగా దూసుకు రావటమే అందుకు కారణం.

"మహారాణిని ఆమె ఇష్టసఖిని నిద్రలు లేపండి.... నీళ్ళను తాగించండి. రెండు రొట్టెల్ని చేతికి ఇచ్చి నములుతూ పరిగెత్తటానికి సిద్ధం అవమని చెప్పండి...." అంటూ తాను తీసుకువచ్చిన నీటి సంచుల్ని, రొట్టెల పాత్రను క్రింద పెట్టాడు.

"అయ్యా... అటు చూడండి... మీరు వెంటబెట్టుకు వచ్చింది ఎవరినో కాస్తంత గమనించుకోండి...." అంటూ అతన్ని హెచ్చరించాడు సైనికుడు.

పాము మాదిరి వికృత శబ్దాలు చేస్తూ ముందుకీ వెనక్కీ ఊగిపోతున్న యువతి వంక చూసి తల విదిలించాడు గదాధరుడు.

"వాళ్ళకళ్ళను చూసినప్పుడే వచ్చింది నాకు అనుమానం. కంటపడగానే మీదికి దూకి కాటు వేయకపోవటమే ఆశ్చర్యంగా వుంది" అన్నాడు.

"కుదరదురా... నువ్వు నీ అంతట నువ్వుగా మా వంటి మీద చేయివేస్తే తప్ప వీలు పడదురా... అది మా పద్ధతి... పట్టుకో నా చేతిని...." ముందుకీ వెనక్కి ఊగటాన్ని ఆపకుండా అరిచింది ఆ యువతి.

"చేతులు పట్టుకోకపోతే మనల్ని ఏమీ చేయలేరు. పట్టుకోకపోతే మనల్ని వదిలిపెట్టి అవతలికి వెళ్ళిపోయేటట్లు కనిపించటం లేదు. ఎలా?" స్నేహితుడిని అడిగాడు శ్యామలుడు.

"మరేం పరవాలేదు మిత్రమా... కరువు తీరిపోయేటట్లు చేతులు పట్టుకునే ఏర్పాటుచేసి వచ్చాను...." అంటూ చేయి ఊపాడు గదాధరుడు.

"రండి... నాతో రండి...." అంటూ మళ్ళీ వెనక్కి బయలుదేరాడు.

ముందుకీ వెనక్కి ఊగుతున్న యువతి వెంటనే కదిలింది. ఆమెను అనుసరించింది రెండవ యువతి.

* * * * *

బాణాలను వదలటానికి సిద్ధంగా పట్టుకుని మరీ పరుగులు తీశారు దనుర్ధారులు. కత్తుల్ని, బరిశెల్ని గాలిలో ఊపుతూ వారితోపాటు కదిలారు మిగిలిన వారందరూ.

ఒక పల్లపు ప్రదేశంలో నుంచి మెరక ప్రదేశంలోకి పోయిన వెంటనే వారికి ఆగుపించారు ఇద్దరు అందగత్తెలు.

కంటికి కనిపించని బంధనాలు ఏవో పాదాలకు అడ్డు పడినట్లు ఒక్కసారిగా ఆగిపోయారు అందరూ.

నక్షత్రాల వెలుగు తప్ప మరే విధమైన కాంతి కనిపించని ఆ చీకటి సమయంలో కూడా వారికి మతులు పోగొట్టాయి ఆ యువతుల అందాలు.

"ఎవరు మీరు? ఎలా వచ్చారు ఇక్కడికి?" తన వెనుక వున్న వారందరినీ ఆగిపొమ్మని సైగలు చేస్తూ అడిగాడు ఒక భటుడు.

"నరుడా... భయంగా వుంది. చేయి పట్టుకుంటావా?" మృదుమధురంగా అడిగింది ఒక యువతి.

తనకు తెలియకుండానే తన చేతిని ముందుకు జాచబోయి, అదిరిపడి ఆగిపోయాడు ఆ భటుడు.

"దళపతిని ముందుకు రమ్మని చెప్పండి...." అంటూ తన వెనుక వున్న వారిని హెచ్చరించాడు.

అతను అలా హెచ్చరించిన ఏడో క్షణికంలో పరుగు పరుగున వచ్చాడు దళపతి.

తెల్లటి పల్వరుస అంత చీకటిలోను తళుక్కున మెరుస్తూ కనిపించేలా నవ్వి చేతిని జాచింది ఆ యువతి.

తనను తాను మరిచిపోయాడు దళపతి. "పరిగెత్తి పరిగెత్తి అందరూ అలిసిపోయినట్లు కనిపిస్తున్నారు. వెనక్కి జరిగి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోండి. ఈ లోపుగా నేను వారెవరో, వారి సంగతులు ఏమిటో తెలుసుకుంటాను" ఖంగు మంటున్న కంఠంతో చెప్పాడు అందరికీ.

అతను చేయబోయేది ఏమిటో తమకు తెలిసినట్లు, తలలు వంచుకుని వెనక్కి జరిగారు అందరూ. మరోసారి పల్లపు ప్రదేశంలోకి దిగి, అవతలి ప్రక్కకు పోయి నిలుచున్నారు.

"ఎవరు మీరు? వంటరిగా ఈ గుగ్గుడి ప్రదేశాల్లోకి ఎలా వచ్చారు?" అని అడుగుతూ చేతిని జాచి మొదటి యువతి చేతిని పట్టుకున్నాడు దళపతి.

పట్టుకున్న మరుక్షణం వినవచ్చింది అతనికి పరువ ప్రాయంలో వున్న పెద్ద తాచుపాము బుస.

అదిరిపడి ప్రక్కకు చూశాడు అతను. "ఏమిటా శబ్దం? ఎక్కడినించి వస్తోంది?" అంటూ వుండగానే అతని ఎదుట ప్రత్యక్షం అయింది మహోగ్రంగా బుసలు కొడుతున్న రాజసర్పం ఒకటి.

తన ఎదుట వుండవలసిన యువతి మటుమాయం అయిపోయిందనీ, ఆమె స్థానంలోనే ఆ సర్పం ప్రత్యక్షం అయిందనీ అర్ధమయ్యేసరికి, పై ప్రాణాలు పైనే పోయినట్లు అయింది అతనికి.

తాను పట్టుకున్న ఆమె చేతిని వదిలి వెనక్కి దూకటానికి ప్రయత్నించాడు. తను పట్టుకున్నది ఆ సర్పం శరీరాన్ని అని తెలిసింది అతనికి.

"మాయ... మోసం... ద్రోహం... వంచన... రండి... అందరూ రండి" అని కీచుగా అరుస్తూ వెనక్కి తగ్గటానికి ఇంకోసారి ప్రయత్నం చేశాడు అతను.

మూడు బారల ఎత్తుకు పడగనువేసి, నోటిని కొండ గుహ మాదిరి తెరిచింది అతని ఎదుట ప్రత్యక్షం అయిన సర్పం. చటుక్కున ముందుకు వంచి అతని తలను కరిచి పట్టుకున్నది.

గొంతు చినిగిపోయేటట్లు అరవటానికి ప్రయత్నించాడు దళపతి. ఆ అరుపు పెదవుల్ని దాటి బయటికి రాకముందే పాము నోటిలోకి వెళ్ళిపోయింది అతని తల. ఒకటి నుంచి పది అంకెలు లెక్కబెట్టే లోపుగా మిగిలిన శరీరం కూడా మటుమాయం అయిపోయింది.

ఒకే ఒకసారి పడగను విదిలించింది ఆ సర్పం. చిటికెలో తిరిగి మానవ రూపాన్ని ధరించింది. తన వెనుక నిలబడి వున్న రెండవ యువతి వైపు తల ఊపి పల్లపు ప్రదేశంలోకి నడిచింది.

పల్లపు ప్రదేశం ఆవలివైపున వున్న సైనికుల్లో వెంటనే చెలరేగింది కలకలం. ఒకరి పాదాలకు ఒకరు అడ్డం పడుతూ ఒకేసారి ఆ యువతుల దగ్గరికి పరిగెత్తుకు వచ్చారు అనేకమంది.

* * * * *

కనురెప్పలు కూడా కదిలించకుండా, కూర్చున్న ప్రదేశం నుంచి, అంగుష్ట మాత్రం కూడా అవతలికి జరగకుండా తదేకంగా పళ్ళెరంలో వున్న నీటి వైపు చూస్తోంది యువరాణి.

"తల్లీ... కాలం గడిచిపోతున్నది... తిండి తిప్పలు లేకుండా, కనీసం మంచినీరు కూడా తాగకుండా కూర్చుంటే నీరసం ముంచుకు వచ్చేస్తుంది. కళ్ళు బైర్లు కమ్మేస్తాయి..." దూరం నుంచి ఆమెను హెచ్చరించింది వృద్ధురాలు.

నొసలు ముడిచి, పెదవులు బిగించి కోపంగా చూసింది యువరాణి ఆమె వంక. ఏదో మాట్లాడటానికి నోటిని తెరిచి, అంతలోనే ఇంకేదో గుర్తుకు వచ్చినట్లు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నది.

నోటిలోని దంతాలన్నీ బయటికి కనిపించేలా నోటిని తెరిచి మృదు మధురంగా నవ్వింది వృద్ధురాలు.

"ఇటువంటి పరిస్థితి వస్తుందని నాకు ముందుగానే తెలుసు. శ్యామలుడి కథల్ని విననే కూడదు. ఒకసారి వినటం మొదలుపెడితే ఆ తరువాత వినకుండా వుండటం అసంభవం. చెప్పేవాళ్ళకు అలుపు ఆయాసాలు వుండవు. వినేవాళ్ళకు అంతకన్నా వుండవు..." అందమైన రజత పాత్ర నిండా వెచ్చటి గోక్షీరాన్ని నింపుకుని ఆమె దగ్గరికి వస్తూ చెప్పింది.

అప్పటికీ పెదవులు విప్పి చిన్నపాటి శబ్దం కూడా చేయలేదు యువరాణి. పళ్ళెరంలోని నీటిమీద కనిపిస్తున్న దృశ్యాలను గమనించటం మానుకోలేదు.

"నోరు తెరిచి శబ్దం చేస్తే మంత్ర ప్రయోగం తన మహిమను కోల్పోతుందనీ, కనిపిస్తున్న దృశ్యాలు మాయం అయిపోతాయనీ నీకు చెప్పాను నేను. ఇటువంటి పరిస్థితి వస్తుందనే భయంతోనే అలా హెచ్చరించాను" యువరాణి చేతిని అందుకుని క్షీర పాత్రను బలవంతంగా ఆ చేతిలో పెడుతూ చెప్పింది వృద్ధురాలు.

"మాట్లాడినంత మాత్రాన నిర్వీర్యం కాదు నా మంత్రశక్తి. నువ్వు నిరభ్యంతరంగా మాట్లాడవచ్చు... క్షీరాన్ని సేవించిన తర్వాత నీ ఇష్టం వచ్చినంత సేపు ఆ దృశ్యాలను వీక్షించవచ్చు..." నవ్వుతూనే అన్నది.

"అవ్వా... గదాధరుడు వెంటబెట్టుకు వచ్చిన ఆ పిశాచాలు ఎంత క్రూరమైనవో చూశావా?" నోరు తెరిచి మాట్లాడింది యువరాణి.

"ఆవగింజలో అరవయ్యోవంతు క్రూరత్వాన్ని కూడా నువ్వు చూడలేదు. ముందు ముందు ఇంకా భయంకరమైన సంఘటనలు జరుగబోతున్నాయి. వాటిని చూస్తే నువ్వు తట్టుకోలేవు..." అన్నది వృద్ధురాలు.

"ముందుముందు జరిగేది ఏమిటో నీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగింది యువరాణి.

తల అడ్డం తిప్పింది వృద్ధురాలు. "ప్రత్యక్షంగా ఏమీ తెలియదు తల్లీ. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలను బట్టి భవిష్యత్తును ఊహించటం మాత్రమే" అంటూ అవతలకి వెళ్ళిపోయింది.

ఆమె తన చేతుల్లో పెట్టిన క్షీరపాత్రలోని క్షీరాన్ని రెండు గుక్కల్లో గొంతులోకి వంపుకుని, మళ్ళీ పళ్ళెరంలోని దృశ్యాలను వీక్షించటం మొదలు పెట్టింది యువరాణి.

* * * * *

ఒకరినొకరు నెట్టుకుంటూ, ఒకరి పాదాలకు మరొకరు అడ్డం పడుతూ ఒకేసారి గుంపుగా వచ్చిపడిన సైనికుల్లో ఒక్కరిని కూడా వదిలి పెట్టలేదు రాజసర్పాలుగా మారిపోయిన యువతీమణులు.

నాలుగుబారల ఎత్తుకు పడగల్ని లేపి, భయంకరంగా నోళ్ళు తెరిచి, ఆకలి మీద వున్న మనుష్యులు అతి మధురంగా వుండే మోదకాలను మింగేసినట్లు సైనికులందర్నీ పొట్టన పెట్టుకున్నారు.

తమ కనులముందే మటుమాయం అయిపోయిన తమ సహచరులను తలుచుకుంటూ, విపరీతమైన భయంతో వెనక్కి పారిపోయే ప్రయత్నం చేశారు కొంతమంది.

"రండిరా... రండి రండి... వచ్చి మా చేతుల్ని పట్టుకోండి. మీ జన్మలో ఎన్నడూ అనుభవించి వుండని ఆనందాన్ని పొందండి. రండి రండి..." సర్ప రూపాల్ని వదిలి తిరిగి మనుష్య రూపాలను పొందుతూ తియ్యటి కంఠంతో మధురాతి మధురంగా పిలిచారు యువతులు.

వారెవరో, వారి చేతుల్ని పట్టుకుంటే జరిగేది ఏమిటో ఆ సరికి పూర్తిగా తెలిసిపోవటం వల్ల, క్షణికం పాటు కూడా ఆగలేదు వారెవరూ... వెను తిరిగి చూడను కూడా చూడలేదు... పల్లపు ప్రదేశంలోకి వచ్చేందుకు ఎంతగా తొక్కిసలాడుకున్నారో, అవతలికి పారిపోయేందుకు అదేమాదిరి ఆత్రపడుతూ దూరంగా పరుగులు తీశారు.

సన్నగా శకలాల మాదిరిగా వున్నారు వారిని ఆకర్షించటానికి ప్రయత్నం చేస్తున్న యువతులు. కావాలని అనుకుంటే వారితో సరిసమానంగా పరిగెత్తగల సామర్థ్యం వున్నట్లు కనిపిస్తోంది.

కాని అలా పరిగెత్తలేదు వారిద్దరూ. కడుపులు పూర్తిగా నిండి పోవడం వల్ల భుక్తాయాసం అధికం అయిపోయిన వారి మాదిరి భారంగా అడుగులు వేస్తూ పల్లపు ప్రదేశం ఆవలివైపు వెళ్ళి అటూ ఇటూ చూశారు.

కనుచూపు మేరలో కనిపించలేదు ఎవరూ... చీకటి మాటున బండల దగ్గిర తిరుగాడే క్రిమికీటకాలు కూడా ఏవీ ఆ చుట్టుపట్ల లేవు.

ఒకరివంక ఒకరు చూసుకుని చిరునవ్వులు చిందించారు వారిద్దరూ. ఒకేసారి వెనుతిరిగి వచ్చిన దారినే పల్లపు ప్రదేశం ఇవతలివైపు నడక మొదలు పెట్టారు.

*      *      *      *      *

కాగడాలు వెంటబెట్టుకు పొమ్మని ఎంతగా హెచ్చరించినా దళపతిగాని, ఇతర సైనికులు గాని వినిపించుకోకపోవటంతో బండలచాటుకు జారుకున్న సైనికుడి కళ్ళు నీటితో నిండిపోయాయి. దారుణమైన దుఃఖం అతన్ని అతలా కుతలం చేసేసింది.

"వద్దువద్దని చెప్పాను... ముందుకు పోవద్దని బతిమాలుకున్నాను. వినిపించుకోలేదు ఎవరూ? ఎగేసుకుని పోయి ఏం చేసుకు వచ్చార్రా మీరు? ఏమయిపోయారు మిగిలిన వాళ్ళు" పడుతూ లేస్తూ వెనక్కి పరిగెత్తుకు వచ్చిన అతి కొద్దిమందిని చూస్తూ వాపోయాడు.

తడబడుతున్న కంఠాలతో తమ కనుల ఎదుట జరిగింది ఏమిటో అతనికి చెప్పారు వాళ్ళు.

"వాళ్ళు మనుష్యులు కాదు బాబోయ్... ఆడ పిశాచాలు... మనిషి రూపంలో వున్న నాగుపాములు..." అతని ఎదుట చతికిలపడుతూ అన్నాడు వారిలో ఒకతను.

"పాములడొంక దగ్గరికి పోయిన వాళ్ళు ప్రాణాలతో వెనక్కి రాలేదనే మాటకు అర్థం ఏమిటో ఇప్పుడు నాకు బాగా తెలిసింది. ముందుగానే తెలిసి వుంటే ఈ అనర్థం జరిగేది కాదు... వివరంగా చెప్పి అందరినీ అడ్డుకుని వుండేవాడిని..." బాధగా అన్నాడు ఆ సైనికుడు.

"ప్రాణాలన్నిటినీ పాదాల్లో పెట్టుకుని పారిపోయి వచ్చాము. ఆయాసం చాలా అధికంగా వున్నది. ఇప్పుడు గనుక వాళ్ళు ఇటుగా వస్తే మళ్ళీ పరుగు మొదలుపెట్టే ఓపిక లేదు... వస్తారంటావా... బాబోయ్?" ఆర్తిగా అడిగాడు ఇంకో భటుడు అతన్ని.

"వచ్చే ఉద్దేశ్యమే వుంటే మీ వెనుకే ప్రత్యక్షం అయి వుండేవాళ్ళు. ప్రత్యక్షం కాలేదు కాబట్టి రాకపోవచ్చనే నేను అనుకుంటున్నాను. ఇంతకీ చీకటి మాటున మనందరి మధ్యలోకి వచ్చిన వాడు ఎటు పరారై పోయినట్లు?" అడిగాడు ఆ సైనికుడు.

"ఏమో! వాడు కూడా ఆ పిశాచాలబారిన పడి మాయం అయిపోయి వుంటాడు... సరిగ్గా వాడు పరిగెత్తిన దారిలోనే అవి కాపుకాసి వున్నాయి..." అన్నాడు ఆ భటుడు.

గట్టిగా నిట్టూర్చి తల అడ్డం తిప్పాడు సైనికుడు.

"ఏమిటి నీ అనుమానం?" ఆశ్చర్యంగా అడిగాడు భటుడు.

"ఎంతో మందిమి వున్నాం మనం. ధైర్యంగా మనందరి మధ్యలోకి వచ్చి, మరింత దమ్ముగా తను వచ్చినట్లు మనందరికీ హెచ్చరికచేసి మరీ పారిపోయిన వాడు అతను. అంత తేలికగా ఆ పిశాచాల చేతికి దొరికి పోతాడంటే నమ్మబుద్ధి కావటం లేదు. అసలు వాటిని తీసుకు వచ్చింది అతనేనని నా అనుమానం... మనల్ని వాటికి మేతగా వేయటం కోసమే అతను మన మధ్యలోకి వచ్చి రెచ్చగొట్టినట్లు నాకు అనిపిస్తోంది..." అన్నాడు సైనికుడు.

కటిక నేల మీద చతికిలబడి, మోకళ్ళమీద తలలు ఆనించుకుని కూర్చున్న ఆ భటులందరి వదనాల్లో వెంటనే ప్రత్యక్షం అయింది భయం – మరోసారి.

"మన గుట్టుమట్లన్నీ తెలిసినవాడు అతను. ఇంకోసారి ఇటుగావస్తే ఈసారి తప్పించుకోవడం కష్టం... ఈ ప్రదేశాన్ని వదిలి సాధ్యమైనంత దూరంగా పోవటమే మేలు..." అంటూ కూడబలుక్కున్నట్లు ఒకేసారి లేచి నిలుచున్నారు.

అడ్డుచెప్పలేదు వారందర్నీ ఓదార్చిన సైనికుడు! "మంచి మాట చెప్పారు. మీకు ఇప్పటికైనా జ్ఞానోదయం అయినందుకు సంతోషంగా వున్నది. వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపోదాం" అంటూ తనుకూడా లేచి నిలుచున్నాడు.

"తమ దారిన తాము వెళ్ళిపోతున్న ఇద్దరు ఆడవాళ్ళకోసం ప్రయత్నం చేయటం వల్లనే ఈ దుర్గతి పట్టింది. జరిగింది ఏమిటో చెపితే నమ్మకపోగా తలలు తరిగించి కోట గుమ్మానికి వ్రేలాడతీయిస్తాడు నగర పాలకుడు. అప్పచెప్పిన పనిని వదిలేసి ఆడవాళ్ళ వైపు చూసినందుకు ముందుగా చిత్రహింసలు పెట్టిస్తాడు..." నెమ్మదిగా నడక మొదలు పెడుతూ అన్నాడు ఒక భటుడు.

"మనం నగర పాలకుడి దగ్గరికి పోకూడదు. వేరే నగరానికి పోయి ఇంకెవరినైనా ఆశ్రయించుకుని బ్రతుకుదాం..." అన్నాడు మరో భటుడు.

రెండు క్షణికాలు ఆలోచించి తలలు ఊపారు అందరూ... చెమటలతో మలినమైపోయిన మొఖాలను దట్టీలతో అద్దుకుంటూ వేగంగా నడక మొదలు పెట్టారు.

*　　*　　*　　*　　*

"సరయిన సమయంలో వచ్చి మాకు ఎనలేని సహాయం చేశారు. మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు..." పల్లపు ప్రదేశం దగ్గరికి వస్తూ మృదుమధురమైన కంఠంతో అన్నది మహారాణి.

గాఢనిద్రలో వుండగా బలవంతంగా మెలకువ తెప్పించి, వేగంగా అడుగులు వేయించాడు ఆమెను, ఆమె చెలికత్తెను – శ్యామలుడు.

"మీకు శ్రమ కలిగించినందుకు మమ్మల్ని క్షమించాలి" నవ్వుతూ అన్నాడు.

"కామాంధుడైన దళపతి చేతుల్లో చిక్కుబడడం కంటె, చీకటి సమయంలో ఇలా బండల మధ్య పరుగులు తీయటమే చాలా హాయిగా వున్నది. మీరు మాకు మేలుచేశారు. శ్రమ కలిగించలేదు" వెంటనే అన్నది చెలికత్తె.

"అవునూ... మీ జతగాడు వెంటబెట్టుకు వచ్చిన అపురూప సౌందర్యవతులు ఇద్దరూ ఏమైపోయారు? కనిపించరేమిటి?" ఉన్నట్లుండి చుట్టూ చూస్తూ అడిగింది మహారాణి.

ఒక బండరాయి మీద కూర్చుని, తన వంతుకు వచ్చిన ఎండు రొట్టెను తీరికగా నములుతున్నాడు గదాధరుడు.

"మిత్రమా... మహారాణి వారికి వచ్చిన అనుమానమే నాకు కూడా వస్తోంది. ఏరి వాళ్ళు? మనల్ని వదిలిపెట్టి వెళ్ళిపోయినట్లేనా?" అడిగాడు అతన్ని శ్యామలుడు.

చేతిలో మిగిలిన ఆఖరి ముక్కను కూడా నోటిలో పెట్టుకుని, సైనికుడు అందించిన నీటి సంచిలోని నీటిని గొంతులోకి వంపుకున్నాడు గదాధరుడు. అరచేత్తో పెదవులకు అంటిన తడిని అద్దుకున్నాడు.

"అడిగినమాటకు సమాధానం చెప్పకుండా పిడిరాయి మాదిరి కూర్చుంటా వేమిటి? ఏమైపోయారు నీ స్నేహితురాళ్ళు? మనల్ని వదిలిపెట్టి వెళ్ళిపోయి నట్లేనా?" విసుగు నిండిన కంఠంతో అడిగాడు శ్యామలుడు.

చిన్నగా నవ్వి తలతో ఒక పక్కకు చూపించాడు గదాధరుడు. అటుకేసి చూసిన శ్యామలుడికి వంటికి కారం రాసుకున్న అనుభూతి వెంటనే కలిగింది.

పాతిక అంగల దూరంలో వున్న ఒక బండరాయి చాటున పాములు చుట్టలు చుట్టుకుని పడుకున్నట్లు – ముడుచుకు పడుకుని వున్నారు ఆ సుందరీ మణులు.

"కడుపు నిండా ఆహారం తీసుకున్న పాములు రోజుల తరబడి నిద్రలు పోతాయట... ఆరగించిన ఆహారం పూర్తిగా జీర్ణం అయిపోయే వరకూ కదలనే కదలవుట" చెప్పాడు గదాధరుడు.

"ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్నది ఏమిటి?" అసహనంగా అడిగాడు శ్యామలుడు.

"మనం అరిచికేకలు పెట్టినా, లావుపాటి బండల్ని మీదికి విసిరినా వాళ్ళకి మెలకువ రాదు. తిన్నది జీర్ణం అయ్యేవరకూ వాళ్ళు మనల్ని గురించి ఆలోచించరు..." అన్నాడు గదాధరుడు.

అతను చెప్పీచెప్పకుండా చెప్పదలుచుకున్నది ఏమిటో వెంటనే తెలిసి పోయింది శ్యామలుడికి.

"వాళ్ళకి మెలకువ వచ్చేసరికి మనం పదిక్రోసుల దూరం వెళ్ళి పోవచ్చు... వెంటనే ప్రయాణం మొదలు పెట్టటం చాలామంచిది" అన్నాడు అతను.

అటువంటి మాటల్ని రెండవసారి చెప్పించుకునే అలవాటు తనకు లేనట్లు వెంటనే కదిలాడు సైనికుడు. తనతో పాటు బయలుదేరిన మహారాణికి, ఆమె చెలికత్తెకు దారిని చూపిస్తూ, రహదారి వైపు నడిచాడు.

"పాములడొంక దెబ్బకు నా వళ్ళు హూనం అయిపోయింది. మనం కూడా బయలుదేరటం చాలా బాగుంటుంది" అంటూ శ్యామలుడికి చేతిని అందించాడు గదాధరుడు.

ఛెంగున కదలవలసిన అతని జతగాడు తన శరీరంలోని ఓపిక అంతా హరించుకుపోయినట్లు అతి నెమ్మదిగా కదిలాడు. అతని చేతిని పట్టుకున్న గదాధరుడి నొసలు వెంటనే ముడిపడ్డాయి తీవ్రమైన ఆందోళనతో.

"వేడిగా వున్నది నీ చేయి... భుజం మీది గాయం నీకు ఇబ్బందిని కలిగించటం మొదలు పెట్టినట్లుంది" అంటూ చేతిని వదిలి నుదుటిమీద చెయ్యిపెట్టి చూశాడు.

భగభగలాడే మంటల మీద పెట్టిన పెనం మాదిరి చాలా వేడిగా వున్నది శ్యామలుడి నుదురు.

"ఎప్పుడు లేనిది నీకు ఇలా జరిగిందేమిటి మిత్రమా? గతంలో మనకి ఎన్నెన్నో గాయాలు అయినాయి. వంటి నిండా లెక్కకు మించిన కత్తిపోట్లు పడ్డాయి. అప్పుడు ఎప్పుడూ ఇలా జరుగలేదు..." అధికం అయిపోతున్న ఆందోళనను అదిమిపట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, అతని భుజం మీది కట్టువైపు చూశాడు అతను.

మరోసారి ఎర్రటి రక్తపు చారికలు దర్శనం ఇచ్చాయి ఆ కట్టుమీద. "నీకు తగిలిన బాణపు మొనకు ఏదో విష పదార్థం పూయబడి వుంటుంది. అది ఎటువంటిదో తెలుసుకోవడం అత్యవసరం" అంటూ తమతోపాటుగా నడుస్తున్న సైనికుడి కోసం చూశాడు గదాధరుడు.

మహారాణిని, ఆమె చెలికత్తెను వెంటబెట్టుకుని అప్పటికే చాలా దూరం వెళ్ళిపోవడం వల్ల, వెంటనే కనిపించలేదతను.

"నాకు తగిలిన దెబ్బ ఏమంత పెద్దదికాదు. విషపూరితమే గనుక అయివుంటే ఈసరికి పరిస్థితి ఇంకా విషమించి వుండేది. అదేపనిగా పరుగులు తీయటం వల్ల భుజం కదిలిపోయి రక్తం వెలువడుతోంది" అంటూ ముందుకు అడుగు వేయబోయాడు శ్యామలుడు.

గిర్రున తిరిగాయి కళ్ళు. ఎదుట వున్న ప్రపంచం అంతా ఒక్కసారిగా తల్లక్రిందులైన అనుభూతి కలిగింది. తనకు తెలియకుండానే తూలి, ముందుకు పడిపోయాడు.

మెరుపుకంటే వేగంగా కదిలి, మధ్యలోనే అతన్ని గట్టిగా కౌగలించి పట్టుకున్నాడు గదాధరుడు.

"నాకు మైకం ముంచుకు వస్తోంది మిత్రమా. చోటుకాని చోటులో నీకు లేనిపోని బాధను కలిగిస్తున్నందుకు క్షమించు" అంటూ వున్నట్లుండి మాటల్ని ఆపేశాడు శ్యామలుడు.

"మిత్రమా... మిత్రమా... కళ్ళుతెరువు... ఒక్కసారి నా వంక చూడు" ఆందోళన తీవ్రతరం అయిపోతూ వుండగా బిగ్గరిగా అరిచినంత పని చేశాడు గదాధరుడు.

కనులు తెరువలేదు శ్యామలుడు. అతనివంక చూడలేదు. మొదలుతెగిన తామరతూడు మాదిరి వ్రేలాడిబడి పోయాడు.

చెమటలు పట్టేశాయి గదాధరుడికి. "చోటుగాని చోటు... చీకటి సమయం... గట్టిగా ఒక మంటవేస్తే నిద్రపోతున్న ఆ పిశాచినులు లేచి కూర్చుంటాయేమోనన్న భయం... ఆలస్యం చేస్తే నీ పరిస్థితి ఏమిటి? నా నెత్తిన బండరాయిని పడేశావు మిత్రమా... ఇప్పుడు ఏం చేయాలి నేను..." అంటూ, చేతుల్లో వున్న శ్యామలుడిని అతి జాగ్రత్తగా క్రింద పడుకోబెట్టాడు.

నిద్రపోతున్న యువతీమణులకు నిద్రాభంగం అయ్యే అవకాశం వున్నదని తెలిసి కూడా ఆగకుండా, నోటి దగ్గర చేతులు పెట్టుకుని పెద్దగా ఒక పొలికేక పెట్టాడు.

"ఒక్కసారి వెనక్కి వచ్చేయ్ సైనికుడా. వచ్చేయ్..." అంటూ.

పక్కనే వున్న బండలకు, అల్లంత దూరంలో వున్న రాబందుల గుట్టకు తగిలి చిత్రవిచిత్రంగా ప్రతిధ్వనించిందా కేక.

* * * * *

వేగంగా నడుస్తున్న సైనికుడు ఎత్తిన పాదాన్ని ఎత్తినట్లే క్రిందికి దించి ఆగిపోయాడు ఒక్కసారిగా.

"ఎందుకు ఆగటం?" వెంటనే ప్రశ్నించింది మహారాణి చెలికత్తె.

"తల్లీ... అరుపు ఏదో వినిపించినట్లు అనిపించింది – మనల్ని ఆగమని హెచ్చరించినట్లు..." వెనక్కి చూస్తూ చెప్పాడతను మహారాణి వారికి.

అంతలోనే మరోసారి వినవచ్చిందా కేక... ఈసారి మహారాణికి కూడా అర్థం అయింది.

"గజదొంగ శ్యామలుడి జతగాడి కంఠం అది. నిన్ను వెంటనే వెనక్కి వచ్చేయమని పిలుస్తున్నాడు" చెప్పింది ఆమె.

"తల్లీ... మీరు ఇక్కడే కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ వుండండి... నేను వెనక్కిపోయి ఎందుకు పిలిచారో తెలుసుకు వస్తాను" అన్నాడు సైనికుడు.

"ఇప్పటికే మనం చాలా పెద్ద ప్రమాదంలో చిక్కుబడిపోయి వున్నాం. నగర పాలకుల వారికి మేము నగరంలో లేమని తెలిస్తే మరింత ప్రమాదం" సాలోచనగా అన్నది మహారాణి.

గజదొంగ శ్యాములుడు తన ప్రాణాలకు తెగించి దళపతిని అడ్డుకుని వుండకపోతే ఏం జరిగి వుండేదో ఆమెకు గుర్తు చేయలేదు సైనికుడు.

"తల్లీ... మన ప్రాణదాతలు వాళ్ళు. కలిసి ఇటుగా వచ్చాం. కలిసే వెనక్కి వెళ్ళటం భావ్యంగా వుంటుంది కదా..." చిన్నకంఠంతో చెప్పాడు.

"మనతోపాటు నడిచి వస్తే నువ్వు చెపుతున్నట్టు కలిసే ప్రయాణం చేసి వుండేవాళ్ళం... ఎదుటవున్న ప్రమాదం చాలదని అన్నట్లు, ఎక్కడో వున్న ఎవరో పిశాచినులను వెంట బెట్టుకు వచ్చాడు శ్యాములుడి జతగాడు. ఏ క్షణంలో అవి మన మీద పడి విరుచుకు తింటాయో తెలియదు" చిన్నగా అన్నది మహారాణి వారి చెలికత్తె.

తాను వెనక్కిపోవటం వారిద్దరికీ ఇష్టం లేనట్లు వెంటనే తెలిసిపోయింది సైనికుడికి.

"తల్లీ... బాగా ఆలోచించండి... ఒక్కసారి వెళ్ళి విషయం ఏమిటో తెలుసుకు వస్తే-" అంటూ వారికి సర్ది చెప్పటానికి ప్రయత్నం చేశాడు.

"అనవసరం సైనికా! ఆలస్యం చేస్తే ప్రాణాలతో మిగిలిన దళపతి అనుచరులు ఎవరైనా మనల్ని గమనించి వెంటబడవచ్చు... అవకాశం వున్నప్పుడే ఆత్మరక్షణ చేసుకోవాలి. మనం ముందుకే పోదాం..." అంటూ అతని అంగీకారంతో తనకు నిమిత్తంలేనట్లు నడక మొదలుపెట్టింది మహారాణి.

దళపతి తమను అట్టేపెట్టిన గుడారంలో వుండగా ఆమె మాట్లాడిన మాటలకు, ఇప్పుడు మాట్లాడుతున్న వాటికి పొంతనలేనట్లు అర్థం అయ్యేసరికి, చిన్నబోయింది సైనికుడి వదనం.

ప్రాణభయం మహారాణి వారి మనస్సును అల్లకల్లోలం చేసి, మంచిచెడు విచక్షణ జ్ఞానాన్ని దూరం చేసేస్తోంది.

తమ మాన ప్రాణాలను కాపాడిన వారి పట్ల ప్రవర్తించవలసిన తీరును మరిచిపోయేటట్లు చేస్తోంది.

అధికంగా మాట్లాడితే వారి ఆగ్రహానికి గురికావల్సి వస్తుందని తెలిసి కూడా ఆగలేకపోయాడతను. "తల్లీ... మరొక్కసారి మీరు నిదానంగా ఆలోచించండి" అంటూ ప్రాధేయపడబోయాడు.

అతను ఊహించినట్లే తీవ్రమైన కంఠంతో మాట్లాడింది మహారాణి. "నీ అర్హత ఏమిటో తెలుసుకుని మాట్లాడు, సామాన్యమైన సైనికుడివి. అధిక ప్రసంగం నీ ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు..."

నోటిని అదిమేసుకున్నాడు సైనికుడు. ప్రాణాలకు తెగించి తనను కాపాడిన గజదొంగను మనస్సులో నుంచి దూరంగా నెట్టివేసి, మహారాణివారికి దారి చూపించటంలో నిమగ్నుడైపోయాడు.

* * * * *

తెలివితప్పి పడిపోయిన తర్వాత పావుఘడియ కూడా గడవకముందే దారుణంగా పెరిగిపోయింది శ్యామలుడి శరీర ఉష్ణోగ్రత.

తీవ్రమైన బాధ తన అవయవాలను పిండి వేస్తున్నట్లు తల విదిలిస్తూ, ఉలికి ఉలికి పడసాగాడు అతను.

సైనికుల మధ్య నుంచి తాను తీసుకువచ్చిన నీటి సంచుల కోసం ఆ ప్రదేశాన్నంతా వెతికాడు గదాధరుడు.

ఒక బండచాటున కనిపించాయి అతనికి అవి. ఒక్క చుక్క నీరుకూడా లేదు వాటిలో... పరుగులు మొదలుపెట్టే ముందు పూర్తిగా తమ దాహాలు తీర్చుకున్నారు అందరూ... వట్టిపోయిన సంచుల్ని అవతలికి విసిరి కొట్టారు.

"తడివస్త్రం నుదుటిమీద వేసి నీ శరీర ఉష్ణోగ్రతను తగ్గిద్దామని అనుకున్నాను. దైవం ప్రతికూలంగా వుంది... ఇప్పుడు నన్ను ఏం చేయమంటావు మిత్రమా..." భయం భయంగా శ్యామలుడి నుదుటిని తడుముతూ వాపోయాడు అతను.

అతని అగచాట్లతో తమకు ఎటువంటి సంబంధం లేనట్లు, చిన్నగా గురకలు తీస్తూ గాఢ నిద్దురపోతూనే వున్నారు ఆ యువతులు. బుస పెడుతున్నట్టు వినిపిస్తున్న ఆ శబ్దాన్ని వింటున్న కొద్దీ అధికం అయిపోసాగింది గదాధరుడి చిరాకు.

గబుక్కున లేచాడు శ్యామలుడి దగ్గర్నించి. ఎదురుగా కనిపించిన లావుపాటి బండరాయిని అమాంతంగా చేతుల్లోకి ఎత్తుకున్నాడు.

"మీ మూలకం గానే నాకు లేనిపోని కష్టాలు ఎదురయ్యాయి. మీ తలల్ని నుజ్జునుజ్జుచేసి ప్రాణాలు తీస్తేగాని మాకు ప్రశాంతత లభించదు" అనుకుంటూ వారి దగ్గరికి బయలుదేరాడు బండరాయితో సహా.

నిద్రిస్తున్న వారిద్దరి తలల మీద పడేటట్లు దాన్ని విసిరేస్తే చిటికెలో వారి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోతాయని అతని ఆలోచన.

నాలుగే అడుగులు వేశాడు అతను. ఐదో అడుగు వేయకముందే అతని వెన్ను తట్టి హెచ్చరించింది వివేకం.

శ్యామలుడి భుజం మీది గాయం ఆ యువతీమణుల ఆగడాల వల్ల ఉత్పన్నం కాలేదు. తాను పాముల డొంకలోకి పోకముందే దళపతి దగ్గిర ధనుర్ధారుల చేతిలో ఆ బహుమానాన్ని పొందాడు అతను.

తాను నిందించదలుచుకుంటే అడ్డగోలుగా అశ్వం మీది నుంచి పడిపోయి, శ్యామలుడు గాయపడవలసిన పరిస్థితి కల్పించిన మహారాణిని నిందించాలి.

తమ మానాన తాము పాములడొంకలో నిలబడి తమ సమీపంలోకి వచ్చిన వారిని మాత్రమే ఆకర్షించే ఆ యువతీమణులు నిరపరాధులు.

తమంతట తాముగా ఎవరిమీదికి ఎగబడటం లేదు వాళ్ళు. తమను ముట్టుకున్న వారినే ఆరగించి తృప్తి పడుతున్నారు.

రకరకాల మాటలు మనస్సులో మెదలటం మొదలు కాగానే, ఎత్తి పట్టుకున్న బండరాయిని అవతలకు విసిరి కొట్టేశాడు అతను. వెనుతిరిగి శ్యామలుడి దగ్గరికి వచ్చాడు.

"నీ పరిస్థితి నా తెలివి తేటల్ని మందగింప చేస్తోంది మిత్రమా... ఏం చేయాలో, నిన్ను ఎలా కాపాడుకోవాలో తెలియటం లేదు..." అనుకుంటూ వుండగా – ఉన్నట్లుండి అతని కనుల ముందు మెదిలాడు. పాముల డొంకను గురించి అతనికి చెప్పి, అటుగా పోవద్దని హెచ్చరించిన కొండజాతి వృద్ధుడు.

చిటికెలో మాయం అయిపోయింది గదాధరుడి నిర్వేదం. "సరయిన సమయంలో చక్కటి జ్ఞాపకం... ఇప్పుడున్న ఈ విపత్కర పరిస్థితిలో మనకు సహాయం చేయగలిగింది ఆ కొండ జాతివాళ్ళే..." అనుకుంటూ, అడ్డదిడ్డంగా పడుకోబెట్టిన శ్యామలుడిని సున్నితంగా పైకి లేపి భుజం మీద వేసుకున్నాడు.

"కంటికి కనిపించినట్లే కనిపించి చిటికెలో మటుమాయం అయి పోయారు వాళ్ళు. తమ నివాసాలు ఎక్కడ వున్నాయో చెప్పలేదు. అయినా సరే, వెతుక్కుంటూ పోదాం... తెల్లవారే లోపల కనిపిస్తారని ఆశిద్దాం..." అనుకుంటూ గుట్టమీదికి బయలుదేరాడు.

* * * * *

సూర్యుడు ఉదయించిన పావుఘడియ తరువాత కనులు తెరిచింది మొదటి యువతి. బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ చుట్టూ చూసింది.

"రాత్రి ఆరగించిన ఆహారం ఇంకా పూర్తిగా జీర్ణం కాలేదు... అప్పుడే లేచి అటు ఇటూ తిరగటం అనవసరం. మరి కొద్దిసేపు విశ్రాంతిగా పరుండటమే మంచిది" తను కూడా కనులు తెరిచి చూస్తూ అన్నది రెండవ యువతి.

"ఎక్కడ మనల్ని ఆకర్షించి ఇవతలికి తీసుకు వచ్చిన యువక మూర్తి ఎక్కడ??" ఉన్నట్లుండి ఆందోళనగా అడుగుతూ లేచి అటూ ఇటూ నడిచింది మొదటి యువతి.

"మనకి ఆహారం ఎంత అవసరమో... ఆ నరుడికి కూడా అంతే అవసరం. సేకరించుకోవటానికి ఎటో పోయి వుంటాడు" అన్నది రెండవ యువతి.

"అతను సరే... మరి మిగిలిన వారు? భుజానికి కట్టు కట్టుకున్న మొనగాడు? ఏడి ఎక్కడ??" అడిగింది మొదటి యువతి ఒకింత ఆతృతగా.

తాను కూడా లేచి నిలబడి చుట్టూ చూసింది రెండవ యువతి.

"మనం విశ్రమిస్తున్న సమయంలో చప్పుడు చేయకుండా మటుమాయం అయిపోయినట్లు కనిపిస్తోంది" కోపంగా అన్నది మొదటి యువతి.

క్రిందికి వంగి, తమ పాదాల క్రింద వున్న రాతి ప్రదేశాన్ని వాసన చూడటం మొదలు పెట్టింది రెండవ యువతి.

ఉన్నట్లుండి వింతగా ప్రకాశించాయి ఆమె కళ్ళు. "భుజం గాయపడిన మొనగాడిని భుజం మీద వేసుకుని గుట్ట మీదికిపోయాడు..." అటుకేసి తల ఊపుతూ చెప్పింది ఆమె.

"మనల్ని తప్పించుకుని పోవటం తనకు సాధ్యపడుతుందని అను కుంటున్నాడు కాబోలు... అమాయకుడు... పాతాళంలోకి పయనం అయినా పట్టు వదలకుండా వెంట పడతామని తెలియదు... పద పద..." అంటూ గుట్టమీదికి బయలుదేరింది మొదటి యువతి.

తమకు దగ్గిర్లోనే పెట్టి వుంచుకున్న శ్యామలుడి దట్టీని అందుకున్నది రెండవ యువతి. దాన్ని మలినం చేస్తున్న రక్తపు మరకలను వాసన చూస్తూ తాను కూడా గుట్టవైపు అడుగులు వేసింది రెండవ యువతి.

* * * * *

దారుణమైన చెమటలతో తడిసి ముద్ద అయిపోయాడు గదాధరుడు. అచేతనంగా పడివున్న శ్యామలుడిని సుతారంగా క్రిందికి దించి, ఒక సమతల ప్రదేశంలో పడుకోబెట్టాడు.

సూర్యోదయం అయిన తర్వాత కూడా అతనికి అగుపించలేదు కొండ జాతి జనం నివసించే ప్రదేశం. శ్యామలుడి పరిస్థితిలో చిన్నమెత్తు మార్పు కూడా కనిపించటం లేదు. చీకటి సమయంలో కంటె అధికమైనట్లుగా వున్నది అతని శరీర ఉష్ణోగ్రత.

"ఏదో ఒకటి చేసి వెంటనే ఈ వేడిని తగ్గించకపోతే చాలా ప్రమాదం మిత్రమా... నాకు ఏమీ పాలుపోవటం లేదు..." అనుకుంటూ నిఠారుగా నిలబడి చుట్టూ చూశాడు గదాధరుడు.

పది క్షణికాల తరువాత అతని కంటికి కనిపించాయి రెండు గువ్వలు. పావురాల మాదిరిగా వుండే చిన్నచిన్న పక్షులు అవి.

"నీరు బాగా అవసరం గువ్వలకి... నీరు లభించే ప్రదేశానికి దగ్గిర్లోనే గూళ్ళు నిర్మించుకుంటాయి అవి. రాబందులు తప్ప వేరే పక్షులు కనిపించని ఈ గుట్ట మీద ఇవి కనిపించడం నిజంగా మన అదృష్టం...." తెలివిలేని శ్యామలుడికి చెప్పాడు అతను. పెద్దపెద్ద అడుగులు వేస్తూ ఆ పక్షులు కనిపించిన దిశలోకి బయలుదేరాడు.

దట్టంగా వున్న పొదల మధ్య అతికష్టం మీద దారిని ఏర్పాటు చేసుకుంటూ పాతిక అంగల దూరం పోయిన తర్వాత గదాధరుడికి అగుపించింది ఒక పెద్ద నీటి గుంట.

నిట్టనిలువుగా మోకాలి ఎత్తున ఎదిగి వున్నాయి వాటిని ఆశ్రయించుకుని ఎదిగే తుంగమొక్కలు.

బండరాళ్ళ మధ్య నుంచి ఆగి ఆగి వీస్తున్న గాలి తెరల దెబ్బకు ఎగిరెగిరి పడుతున్నాయి నీటి అలలు.

ఆనందమైపోయింది గదాధరుడికి ఆ దృశ్యాన్ని చూడగానే, జాగ్రత్తలన్నిటినీ గాలికి వదిలి వేగంగా నడిచి నీటిగుంట అంచును సమీపించాడు. ముందుకు వంగి నీటిలోకి చేతుల్ని ఉంచబోతూ, ఎవరో తనను అడ్డుకున్నట్లు ఒక్కసారిగా ఆగిపోయాడు.

ఒత్తుగా ఎదిగి వున్న తుంగపొదల మధ్య అతనికి రెండు గోరింకలు కనిపించటమే అందుకు కారణం.

ఆహారాన్ని వెతుక్కోవటానికో, నీళ్ళు తాగిన తర్వాత విశ్రాంతి తీసుకోవటానికో ప్రయత్నించటం లేదు అవి. దూరంలో వున్న బండరాళ్ళ చాటునుంచి వేటగాడు ఎవరో వడిశెలతో తమను దారుణంగా గాయ పరిచినట్లు అడ్డదిడ్డంగా నేలమీద పడిపోయి వున్నాయి. తీవ్రమైన బాధతో తల్లడిల్లి పోతున్నట్లు గిలగిలలాడిపోతున్నాయి.

"ఏమయింది మీకు? ఏం జరిగింది?" మృదు స్వరంతో అడుగుతూ ఒక పక్షిని తన చేతుల్లోకి తీసుకోబోయాడు.

"వద్దు నాయనా... వాటిని ముట్టుకోవద్దు. ఇంకొక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా నువ్వు వెనక్కి వెళ్ళి పోకపోతే, నీకు కూడా పడుతుంది అదే గతి" అంటూ వినవచ్చింది ఒక కంఠం.

ముందుకు జాచిన చేతుల్ని వెంటనే వెనక్కి తీసుకుంటూ ఆ కంఠం వినవచ్చిన దిశలోకి తలను తిప్పాడు అతను.

పది ధనువుల దూరంలో వున్న ఒక పెద్ద పొద చాటున నిలబడి అతనికి కనిపించాడు కొండజాతి వృద్ధుడు.

విపరీతమైన ఆనందంతో వెర్రిగా అరిచి, ఎగిరి గంతులు వేయాలన్న పిచ్చికోరిక వెంటనే వివశుడిని చేసింది గదాధరుడిని.

ఎవరిని తలుచుకుంటూ, ఎవరిని కలుసుకోవాలన్న కోరికతో తపించి పోతూ తాను ఆ గుట్టమీదికి వచ్చాడో ఆ వృద్ధుడే అతను.

నాలుగే నాలుగు అంగల్లో అతని దగ్గరికి పోయాడు... చేతులు జోడించి అమాంతంగా అతని పాదాల మీద పడి పోలేదు గాని, సరిగ్గా అటువంటి భావాలే కనుల్లో కదలాడుతుండగా, "తాతా... నాకు మీ సహాయం కావాలి... నా జతగాడిని మీరే కాపాడి ప్రాణభిక్ష పెట్టాలి" అన్నాడు గద్గద స్వరంతో.

రకరకాల భావాలు ప్రత్యక్షం అయ్యాయి వృద్ధుడి వదనంలో. "వద్దు వద్దన్న కొద్దీ పాములడొంక దగ్గరికిపోయి ప్రాణాలకు ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నావు కదూ?" అని అడిగాడు.

"పాములడొంకను గురించి మనం తర్వాత తీరికగా మాట్లాడు కుందాము... ముందు నా జతగాడి గురించి ఆలోచించాలి. అతనికి ఆ డొంకకు ఎటువంటి సంబంధము లేదు..." ఆత్రుతగా చెప్పాడు గదాధరుడు.

ఆశ్చర్యం ప్రత్యక్షం అయింది వృద్ధుడి వదనంలో. "ఏమయింది నీ జతగాడికి? ఇటుగా వచ్చినప్పుడు నువ్వు వంటరి వాడివని మేము భావించాము" అన్నాడు.

మాటలతో సమయాన్ని వృధా చేయటం మంచిది కాదని అనిపించింది గదాధరుడికి. "మీ అనుమానాలన్నిటికీ సరయిన సమాధానాలు తరువాత చెపుతాను" అంటూ అతని చేతిని పట్టుకొని శ్యామలుడు పడి వున్న ప్రదేశం వైపు బలవంతంగా నడిపించాడు.

అడ్డదిడ్డంగా పడి వున్న ఆ యువక మూర్తిని చూసిన వెంటనే తీవ్రమైన ఆందోళన ప్రత్యక్షం అయింది వృద్ధుడి వదనంలో.

"ఏమయింది ఇతనికి? ఎందుకు ఇంత ఊష్ణం కనిపిస్తోంది??" అంటూ ముందుకు వంగి, నుదుటి మీద చేయి వేశాడు. నెత్తురు మరకలతో మలినపడి వున్న భుజం మీది వస్త్రాన్ని చూపుడు వేలితో స్పృశించగానే, అసలు సంగతి తమకు అర్థం అయినట్లు తల ఊపాడు.

"విషాలన్నిటిలోను మహా అసహ్యకరమైన పచ్చ చెంగలువ రసం పూసిన ఆయుధం వల్ల ఏర్పడింది ఈ గాయం. మూడే మూడు దినాల పాటు నిలిచి వుంటాయి ప్రాణాలు... నాలుగో రోజు సూర్యాస్తమయం అవుతున్న సమయంలో అనూహ్యంగా పెరిగిపోతుంది ఉష్ణోగ్రత. రక్తనాళాలు చిట్లిపోతాయి. నెత్తురు కక్కుకుంటూ ప్రాణాలు వదిలేస్తారు" తల తిప్పి చూస్తూ చెప్పాడు.

"ఒకే గురుకులంలో విద్యాభ్యాసం చేశాము మేము. ఆయుధ విద్యలన్నిటినీ ఒకేసారి నేర్చుకున్నాము. విష ప్రయోగాలను గురించి, వాటి ఉపయోగాలను గురించి కూలంకషంగా అభ్యసించాము. నువ్వు చెపుతున్న ఈ పచ్చ చెంగలువ గురించి ఎన్నడూ విని వుండలేదు... అది ఏమిటి?" అయోమయంగా చూస్తూ అడిగాడు గదాధరుడు.

చటుక్కున లేచి నిలుచున్నాడు వృద్ధుడు. తనతో రమ్మనమన్నట్లు సైగచేసి అంతకుముందు అతను చూసిన నీటి గుంటకు సమీపంలోకి తీసుకుపోయాడు.

రెండు నిలువుల ఎత్తున ఎదిగి వున్న ఒక ముళ్ళ పొద వున్నది ఆ గుంటకు ఆవలి ఒడ్డున. పచ్చటి పసుపు రంగులో వున్న పువ్వులు కనిపిస్తున్నాయి ఆ పొదమీద.

"పచ్చసంపెంగ అంటే అవే... వాటిని కల్వంలో వేసి గట్టిగా నలిపితే చిక్కటి ద్రవం వస్తుంది. ఆయుధపు మొనను ఆ ద్రవంలో ముంచి ఆరబెడతారు. ఆ తరువాత దాన్ని ఎవరి మీద ప్రయోగించినా, నీ జతగాడికి పట్టిన గతే పడుతుంది" చిన్న కంఠంతో చెప్పాడు.

ఎక్కడో వున్న ఆ రాబందుల గుట్ట మీద కనిపిస్తున్న ఆ విషపు పువ్వులు నగరంలో నివశించే ధనుర్ధారుల దగ్గరికి ఎలా చేరాయో అవగతం కాలేదు గదాధరుడికి.

"తాతా... ఈ విషాన్ని గురించి నీకు నీ జాతికి తప్ప ఇంకెవరికీ తెలిసే అవకాశం వుండకూడదు. కానీ తెలిసింది. ఎలా తెలిసింది?" అని అడిగాడు.

"ఈ చుట్టుపట్ల వుండే నగర పాలకులందరూ ఒకరినొకరు జయించా లన్న కోరికలతో తపించిపోతున్నారు. ఏదో ఒక విధంగా ఒకరిమీద ఒకరు పై చెయ్యి సాధించటానికి రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. శత్రువులను తేలికగా పడగొట్టడానికి ఈ విషపు పువ్వును తమ ఉద్యానవనాల్లో పెంచి పోషిస్తూ వుండి వుండవచ్చు..." చెప్పాడు వృద్ధుడు.

"విరుగుడు ఏమిటి తాతా? ఈ పచ్చచెంగలువ ప్రతాపాన్ని అడ్డు కోవటానికి మార్గం ఏదైనా వుంటే వెంటనే చెప్పు..." ఆతృతగా అడిగాడు గదాధరుడు.

"నేను ఈ భూమి మీద పడి ఎనుబది సంవత్సరాలు అయింది. ఇంతవరకూ ఈ దుర్మార్గపు విషానికి విరుగుడు వుంటుందనే మాటను విని వుండలేదు. వళ్ళు దగ్గిర పెట్టుకుని దూరంగా వుండటమే విరుగుడు. అంతకు మించి మరో మార్గం లేదు" గట్టిగా నిట్టూరుస్తూ చెప్పాడు వృద్ధుడు.

తన చుట్టూ వున్న ప్రపంచం అంతా గిర్రున తిరిగినట్లు, తన పాదాల క్రింద వున్న భూమి రెండుగా చీలి, తాను పాతాళంలోకి పడిపోతున్నట్లు వెంటనే అనిపించింది గదాధరుడికి.

విరుగుడు అంటూ ఏమీలేని విషానికి లోబడి పోయిన తన జతగాడిని రక్షించుకోవటం అసాధ్యమా?

అప్రయత్నంగా తడి అయిపోయాయి అతని కళ్ళు. నీటి బుగ్గలో నుంచి ఉబికి వచ్చినట్లు పైకి వచ్చి బుగ్గల మీదికి జాలు వారడం మొదలు పెట్టాయి కన్నీళ్ళు.

సానుభూతి సూచకంగా అతని భుజం తట్టాడు వృద్ధుడు. "నీకు సహాయం చేయలేక పోతున్నందుకు నాకు ఎంతో బాధగా వున్నది. నువ్వు కావాలని అనుకుంటే ఒకటి మాత్రం చేయగలను" అన్నాడు మృదు స్వరంతో.

"ఏమిటది?" ఆశగా అడిగాడు గదాధరుడు.

"నీ జతగాడి ఉసురు గాలిలో కలిసి పోవటానికి ఎంతో సమయం లేదు. పచ్చచెంగలువ అతని నరాలన్నిటినీ ఆవరించుకున్నది. నేడో రేపో ఆఖరి శ్వాస తీసుకుంటాడు. అంతవరకూ ఇలా బండల మధ్య, పొదల దగ్గిర తచ్చట్లాడవలసిన అవసరం లేకుండా మా గూడేనికి దారి చూపిస్తాను. నీకు ఆహారం అందిస్తాను" అన్నాడు వృద్ధుడు.

పళ్ళు బిగపట్టి అతని నోటి మీద కొట్టకుండా తనను తాను నిగ్రహించుకున్నాడు గదాధరుడు. తాచుపాము మాదిరి చివ్వున తలఎత్తిన కోపాన్ని అతి బలవంతంగా అదుముకుని చిరునవ్వు నవ్వాడు.

"ముక్కుమొహం తెలియని నా వంటి పరాయిజాతి మనిషికి, మీ గూడెంలో ఆతిథ్యం ఇస్తామని చెప్పటం మీ విశాల హృదయాన్ని తెలియచేస్తోంది. కాని ఈ పరిస్థితిలో నేను మీతో పాటు రావటం మంచిగా వుండదు. నా తిప్పలు ఏవో నేను పడతాను. మీరు వెళ్ళిపొండి..." సాధ్యమైనంత గౌరవంగా చెప్పాడు.

"నీ నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను. నీకు అవసరమైన ఆహారాన్ని నీటిని నేను కొద్ది సేపట్లో నీ దగ్గరికి పంపిస్తాను" అంటూ వెనుతిరిగాడు వృద్ధుడు.

రెండు అడుగులు అతను అవతలికి వేసిన తరువాత ఆ మాటలు గదాధరుడికి అర్థం అయ్యాయి. ఆహారం పంపిస్తానని అతను అనటంలో అర్థం వున్నది. అతి సుందరమైన నీటిగుంట తమకు దగ్గిర్లోనే వుండగా, పని కట్టుకుని నీటిని పంపిస్తానని చెప్పటం ఏమిటి??

"తాతా... ఒక్క నిమిషం... ఒకే ఒక్క నిమిషం ఆగు..." అంటూ అతన్ని ఆపి, తన అనుమానాన్ని వెంటనే బయట పెట్టేశాడు అతను.

"నీకు అర్థం అయిందని అనుకున్నాను నేను. అర్థం అయినట్లు నటించకుండా నేరుగా అడిగి మంచి పనిచేశావు. ఆ నీటి గుంటలోని నీరు విషపూరితం... పక్కనే వున్న పచ్చ చెంగలువ పూవులు నీటిలో పడటం వల్ల పూర్తిగా కలుషితమైపోయింది అది..." చిన్నగా చెప్పి వడివడిగా నడవ బోయాడు వృద్ధుడు.

మరోసారి అతన్ని ఆపాడు గదాధరుడు.

"ఆ నీరు కలుషితమై పోయినట్లు తెలిసిన నువ్వు. మరి ఈ చుట్టుపట్ల సంచరించటానికి కారణం ఏమిటి." అని అడిగాడు.

"నువ్వు సామాన్యుడివి కాదు. నీకు వచ్చే అనుమానాలు ఈ భూ ప్రపంచంలో మరెవ్వరికీ రావు..." అన్నాడు వృద్ధుడు.

"సమాధానం చెప్పు తాతా... ఇప్పుడు నాకు కావల్సింది మెచ్చుకోళ్ళు కాదు... సమాధానాలు" విసుగు నిండిన కంఠంతో అడిగాడు గదాధరుడు.

"విరబూసి వున్నది ఆ పచ్చచెంగలువ పొద... ఏదో ఒక సమయంలో ఆ పూలన్నీ రాలిపోతాయి. తిరిగి మొగ్గలు రావటానికి కొంత సమయం పడుతుంది. పువ్వులన్నీ రాలి పోయిన తర్వాత నీటి గుంటలోని వాటినంతటినీ తోడి అవతల పారపోస్తే... తిరిగి కొత్తగా నీరు ఊరుతుంది. ఆ నీటిని ఉపయోగించుకోవచ్చు... కొంతకాలం వరకూ..." అని చెప్పి ముందుకు సాగాడు వృద్ధుడు.

విషపు పువ్వులన్నీ నేలమీదికి పడిపోయాయో లేదో చూడటం కోసం అతను వచ్చాడని అవగతమై ఈసారి అతన్ని నిలువరించటానికి ప్రయత్నం చేయలేదు గదాధరుడు.

ఎగిరిఎగిరి పడుతున్న శ్యాములుడి దగ్గిర చతికిలపడి, చెమటతో తడిసిపోయిన తన నుదుటిని అరచేత్తో అద్దుకున్నాడు.

"విషం శరీరంలోకి ప్రవేశించిన తరువాత కేవలం నాలుగు రోజులు మాత్రమే వ్యవధి వుంటుందని అంటున్నాడు వృద్ధుడు. ఏం చేయమంటావ్ మిత్రమా... ఏంచేస్తే ఈ గండం నుంచి గట్టెక్కటం కుదురుతుంది?" స్పృహలేని శ్యాములుడితో అంటూ చుట్టూచూశాడు.

వెంటనే అతనికి తెలియలేదు గాని, ఏదో ఒక విచిత్రమైన విశేషం తన మనస్సులోకి ప్రవేశించటానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసి వచ్చింది. పది నిమిషాల తరువాత.

"ఏమిటది? దిక్కుమొక్కులేని ఈ గుగ్గుడి ప్రదేశంలో నాకు ఆశ్చర్యాన్ని కలిగించే విశేషం ఎటువంటిది అయివుంటుంది?" తనలో తను అనుకుంటూ లేచి నిలుచున్నాడు.

మరో పది నిమిషాల వరకూ తెలిసి రాలేదు అతనికి. చిరాకుగా తల విదిలిస్తూ తిరిగి శ్యామలుడి ప్రక్కన చతికిల పడబోతుండగా – వున్నట్లుండి అవగతమైంది.

అవగతమైన మరుక్షణం ఝల్లుమన్నది అతని శరీరం. వేగంగా కదిలాడు. వింటి నుంచి వెలువడిన బాణం మాదిరి నీటి గుంట దగ్గరికి పోయాడు. మోకాలి ఎత్తున ఎదిగి వున్న తుంగ పొదల మధ్యలో గిలగిల లాడుతూ వుండవలసిన గోరింకల్లో, ఒక్కటి మాత్రమే కనిపించింది అతనికి. రెండవ పక్షి మటుమాయం అయిపోయి వున్నది.

"ఏమైంది అది? ప్రాణాలు వదిలేసినట్లు గమనించి కొండ చీమల దండు ఏదైనా ఇటుగా వచ్చి అవతలకు ఈడ్చుకు పోయి వుంటుందా?" తనలో తను అనుకుంటూ చుట్టూ చూశాడు.

అడవి పందుల వంటి మొరటు ప్రాణులైనా సరే, కొండ చీమలదండు వస్తున్న సవ్వడిని ఆలకిస్తే – అప్పటికప్పుడు దూరంగా పారిపోతాయి.

ఒకటి రెండు కాదు... ఒకేసారి వచ్చిపడతాయి లక్షల సంఖ్యలో వున్న ఆ చీమలు. ప్రాణాలతో వున్నా సరే లక్ష్యపెట్టకుండా మీద పడి తమ పుట్ట దగ్గరికి ఈడ్చుకు పోతాయి.

కాని, ప్రాణాలు వదిలిన గోరింకతో పాటు గిలగిలలాడుతున్న రెండవ పక్షిని కూడా తమతో పాటు తీసుకుపోవాలి అవి. దాన్ని వదిలిపెట్టి పోవటం జరుగదు.

తను నిలబడి వున్న ప్రదేశానికి ఎడమ వైపున వున్న ఒకపొద వెనుక నుంచి కిచకిచ ధ్వనులు వినిపించడంతో ఉలిక్కిపడి తన ఆలోచనలలో నుంచి బయటపడ్డాడు అతను.

నాలుగు గోరింకలు కనిపించాయి అతనికి ఆ పొద దగ్గర. నీటిగుంట దగ్గిర అతను నిలువబడి వుండటంతో, అసహనంగా చప్పుళ్ళు చేస్తున్నాయి.

ఆ గుంటలోని నీరు విషపూరితమైనదని తెలిసిన తర్వాత కూడా అవి అటుగా ఉండటం ఏమిటో అతనికి అంతుబట్టలేదు.

"ఏదో విచిత్రం మనకు కనిపించబోతున్నది... తాడిచెట్టు మాదిరి ఇక్కడే నిఠారుగా నిలువబడి వుంటే... అది కనిపించకపోవచ్చు..." తనలో తను అనుకుంటూ, తుంగపొదల దగ్గిర్నించి వెనక్కి వచ్చి, ఒక బండరాయి చాటున ఒదిగి నిలుచున్నాడు.

అతను దూరంగా వెళ్ళిపోయినట్లు నిశ్చయం చేసుకుంటున్నట్టు, నాలుగుసార్లు గాలిలో చక్కర్లు కొట్టాయి ఆ పక్షులు. తరువాత ఒకేసారి పొదల్లో పడిపోయి వున్న పక్షి దగ్గర వాలాయి.

కళ్ళు చిట్లించుకు చూడడం మొదలుపెట్టాడు గదాధరుడు.

వంకరటింకరగా వున్న ఒక సన్నపాటి గడ్డి పరక వంటి చెట్టుకొమ్మను ముక్కుతో కరిచి పట్టుకుని వున్నది వాటిలో ఒక పక్షి. గదాధరుడు చూస్తూ వుండగానే, ఆ కొమ్మకు గిలగిలలాడుతున్న గోరు వంక ముక్కుదగ్గిర పెట్టింది.

ఊపిరి బిగపట్టేశాడు గదాధరుడు. కనుల్ని మరింతగా చిట్లించి తదేక దీక్షతో చూశాడు.

ఒకటి... రెండు... నాలుగు నిమిషాల తరువాత వున్నట్టుండి కదిలింది పడిపోయి వున్న గోరువంక... రెక్కల్ని తపతపలాడిస్తూ గాలిలోకి ఎగిరింది.

సంతోషం పట్టలేనట్లు గోలగోలగా చప్పుళ్ళు చేస్తూ మిగిలిన పక్షులు కూడా పైకి లేచాయి. నీటిగుంట చుట్టూ రెండు సార్లు వలయాకారంలో తిరిగి, ఎటో ఎగురుకుంటూ వెళ్ళిపోయాయి.

తన కనుల్ని తను నమ్మలేక పోతున్నట్లు, కళ్ళు నులుముకుని మరీ చూశాడు గదాధరుడు.

ఆ నీటిగుంట దగ్గిర వున్న పచ్చచెంగలువ విషానికి విరుగుడు అనేది లేనే లేనట్లు మాట్లాడాడు కొండజాతి వృద్ధుడు. అతని అభిప్రాయం సరైనది కాదని ఆ గోరువంకలు రుజువు చేశాయి.

గడ్డిపరక వంటి మూలికను అవి ఎక్కడినుంచో సేకరించుకు వచ్చాయి. గిలగిలా కొట్టుకుంటున్న పక్షులు రెండింటినీ బ్రతికించి తనతో పాటు తీసుకు పోయాయి.

పక్షులు మాత్రమే వెళ్ళిపోయాయి. అవి తీసుకు వచ్చిన మూలిక ఇంకా ఆ పొదల దగ్గిరే పడిపోయివుంది.

పెద్దపులి ఏదో తన వెనుకపడి తరుముకు వస్తున్నట్లు అతి వేగంగా కదిలి తుంగపొదల దగ్గరికి పోయాడు అతను.

ఒకటికాదు... రెండు మూలికలు కనిపించాయి అతనికి. మొదటి పక్షిని రక్షించింది జానెడు పొడుగు మాత్రమే వున్నటువంటిది. రెండవ పక్షిని కాపాడిన మూలిక మాత్రం రెండు జానల పొడుగు వున్నది.

రెండింటిని తీసుకున్నాడు అతను. పక్షులను కాపాడినట్లే అవి తన జతగాడిని కూడా కాపాడాలని మనసులోనే భగవంతుడిని ప్రార్థిస్తూ పరుగు పరుగున వెనక్కి వచ్చాడు.

"ఇవి ఎటువంటి మూలికలో తెలియటం లేదు మిత్రమా... నీకు స్వస్థత చేకూరుస్తాయో లేదో కూడా నాకు తెలియదు. అయినాసరే తీసుకు వచ్చాను" అంటూ ఆ రెంటినీ కలిపి శ్యామలుడి నాశికా రంధ్రాల దగ్గిర పెట్టి పట్టుకున్నాడు.

నాలుగైదు నిమిషాల తరువాత కదిలింది. అతను చూసినప్పుడు తుంగ పొదల దగ్గిర గోరు వంక. ఇప్పుడు నాలుగు కాదు... పది నిమిషాలు గడిచిన తరువాత కూడా శ్యామలుడి పరిస్థితిలో మార్పు కనిపించలేదు.

తీవ్రమైన నిరాశతో కృంగిపోయాడు గదాధరుడు.

"ఇదేమిటి మిత్రమా? తలపెట్టిన ప్రతి పనిలోను విజయమే తప్ప అపజయం తెలియని వాళ్ళం మనం. ఇప్పుడు ఇలా జరుగుతున్నదేమిటి? ఎందుకు ఇలా జరుగుతున్నది..." బుగ్గలమీదికి జాలు వారుతున్న కన్నీటిని అడ్డుకోను కూడా అడ్డుకోకుండా గద్గదస్వరంతో అంటూ, తలను ప్రక్కకు తిప్పుకున్నాడు.

తన అంచనా తప్పి, శ్యామలుడు ప్రాణాలు పోగొట్టుకోవటమే తప్పని సరి అయితే ఏం చేయాలో... అతను ఆలోచించుకోలేక పోయాడు.

"నువ్వు పక్కన లేకుండా నేను ఒక్కడినే ప్రాణాలతో వుండటం చాలా కష్టం మిత్రమా... నీతోపాటు నేనుకూడా అనంతలోకాల్లోకి వచ్చేస్తాను. అయితే ఆ పనికి ముందు ఒక్క బృహత్కార్యం ముగించవలసి వున్నది. నీకు ఈ గతి పట్టించటానికి కారకుడైన ఆ నగర పాలకుడిని నిలువునా నరికి అతని తలను కోట గుమ్మానికి వ్రేలాడగట్టిన తరువాత నీకు తోడుగా వస్తాను" అంటూ తల తిప్పి, శ్యామలుడి వైపుచూశాడు.

ఊపిరి ఆగిపోయినంత పని అయింది అతనికి. తన కళ్ళు తనని ఏమారుస్తున్నాయేమోనన్న అనుమానం కలిగింది.

అంతకుముందు పది పదిహేను నిమిషాల వరకూ తెలివిలో లేని అతని జతగాడు, అప్పుడే గాఢమైన నిద్దురలో నుంచి లేచినట్లు కనులు నులుముకుంటూ లేచి కూర్చుంటున్నాడు.

"మనం ఎక్కడ వున్నాము... మహారాణి వారు ఎక్కడ? నువ్వు తీసుకు వచ్చిన సుందరీమణులు కనిపించటం లేదేమిటి?" తన వంక చూసిన గదాధరుడిని అడిగాడు.

ఆనందాన్ని అణుచుకోవటం అసాధ్యమైపోయింది గదాధరుడికి. ఒక్క అడుగు ముందుకు వేసి అతన్ని గాఢంగా కౌగలించుకున్నాడు.

అతని కనుదమ్మాల నుంచి అదేపనిగా జాలువారుతున్న భాష్పధారలను చూసి "ఏమయింది మిత్రమా? ఏమిటి నీ అలజడి?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

"నా అలజడికి కారణం ఏమిటో చెపితే గాని నీకు ఏదీ అర్థం కాదు. ఇప్పటివరకు నేనూ ఎంత ఆందోళనలో వున్నానో నీకు తెలియదు" అంటూ జరిగినదంతా అతనికి చెప్పాడు గదాధరుడు.

తన చెవుల్ని తనే నమ్మలేకపోతున్నట్లు విప్పారిత నేత్రాలతో చూశాడు శ్యామలుడు.

"మన అవసరాలను గమనించకుండా తన దారిన తాను వెళ్ళిపోయింది ఆ మహారాణి... వెనక్కి తిరగబోయిన సైనికుడిని కూడా వారించి వెంట తీసుకుపోయింది" చెప్పాడు గదాధరుడు.

"మరి ఆ కిన్నెర సుందరీమణుల సంగతి ఏమిటి?" అడిగాడు శ్యామలుడు.

"కడుపులు పూర్తిగా నిండిపోయినందువల్ల, వాళ్ళు ఇప్పట్లో మన గురించి ఆలోచించరు. వాళ్లు ఆలోచించేలోపల మనం ఈ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోవచ్చు" అన్నాడు గదాధరుడు.

నరాలకు వ్యాపించిన విషం విరిగి పోవటం వల్ల స్వస్థుడైనాడు శ్యామలుడు. భుజం మీది గాయం సలుపు మానిపోవడం వల్ల, చేతిని తేలికగా కదిలించగలుగుతున్నాడు.

"ఒంటరి ప్రదేశం అనుకున్నాడు గాని, పొదల చాటు నుంచి ఎవరో మనల్ని గమనిస్తున్నారు" అంటూ తన ఆయుధం కోసం అటూ ఇటూ చూశాడు.

అతన్ని భుజం మీద వేసుకుని గుట్టమీదికి బయలుదేరటమే ముఖ్యమని భావించాడు గదాధరుడు. అతని ఆయుధాన్ని గురించి మర్చిపోయాడు.

"పొదల చాటున వున్న వాళ్ళని నేను గమనించుకుంటాను. నువ్వు కలత పడవలసిన అవసరం లేదు" అంటూ తన కరవాలాన్ని వరలో నుంచి తీస్తూ లేచి నిలుచున్నాడు.

"ఒహ్హో స్నేహితుడా... నీకు మేము శత్రువులం కాదు... పరిచయ స్థలమే... తిండి పంపించాడు మా నాయకుడు. గొంతు తడుపుకోవటానికి నీటిని కూడా తీసుకువచ్చాము" అంటూ అతని ఎదుటికి వచ్చారు నలుగురు కొండజాతి పౌరులు.

"నీ జతగాడు ఎవరో చావుబతుకుల్లో వున్నాట్ట కదా... ఏడి?" చుట్టూ చూస్తూ అడిగాడు వారిలో ఒకతను.

"ఇప్పుడే వస్తానని చెప్పి, నీటి గుంట దగ్గరికి పోయాడు. వచ్చేస్తూ వుంటాడు" గంభీరంగా చెప్పాడు గదాధరుడు.

ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు వాళ్ళు.

"జతగాడికి జబ్బు నయం కావటం లేదన్న బాధతో ఇతని మనస్సు వంకరటింకరగా మారిపోయింది. నీటిగుంట గురించి నాయకుడు ఇతనికి వివరంగా చెప్పాడు. అయినా సరే దాన్ని గురించి మాట్లాడుతున్నాడంటే మనస్సును మబ్బు కమ్మినట్లే..." చిన్నకంఠంతో తమలో తాము మాట్లాడు కున్నారు వాళ్ళు. తాము తీసుకువచ్చిన పళ్ళు ఫలాలను అతని ముందు పెట్టారు. ఒక సొరకాయ బుర్రలోని నీటిని అతనికి అందించారు.

"నువ్వు ఒక్కడివే వుంటావని నాయకుడు చెప్పాడు. ఇద్దరని నాకు తెలియదు. మేము తెచ్చినవి మీ ఇద్దరూ పంచుకోండి..." అని చెప్పి వెనక్కి తిరిగాడు.

"వాళ్ళగూడెం ఎక్కడ వున్నదో తెలుసుకుని మనం అక్కడికిపోయి–" అని చెప్పబోతున్న శ్యామలుడిని వారించాడు గదాధరుడు.

"నీ వంటిని ఆవరించుకున్న విషం ఎలా విరిగిపోయిందో నాకు తెలియదు. గోరింకలు తీసుకు వచ్చిన మూలిక ఎటువంటిదో, ఎక్కడినించి తీసుకు రాబడిందో అంతకన్నా తెలియదు... ఇప్పుడు మనం వాళ్ళగూడెం

దగ్గరికిపోతే ఆ విషయం గురించి చర్చ మొదలు అవుతుంది. ఆ మూలికను వెతికి తెచ్చిపెట్టే పని మనకి అప్పగించబడుతుంది" అన్నాడు.

"భయంకరమైన విషానికి విరుగుడును వెతికి పెట్టటం మంచి పనే కదా... ఆ పనిని తలకు ఎత్తుకోవటంలో తప్పు ఏముంటుంది?" అడిగాడు శ్యామలుడు.

"కంటికి కనిపించిన ప్రతి సమస్యకు సమాధానాలు వెతుక్కుంటూపోతే, మనం మొదలుపెట్టిన పనిని పూర్తి చేయటం అసాధ్యం... ముందు మనం ఆ దిగంబరస్వామి ఆట కట్టించాలి... వాడి పని పట్టకపోతే చాలా ప్రమాదం..." ముక్తసరిగా చెప్పి, కొండజాతి వాళ్ళు తీసుకువచ్చిన ఆహారాన్ని అతని ముందుకు జరిపాడు గదాధరుడు.

"పచ్చచెంగలువ విషం బహు ప్రమాదకరమైందని మనకు తెలిసింది. ఆ విషాన్ని వ్యాపింప చేసే ప్రదేశం మన కంట పడింది. దాన్ని ఊరికే వదిలిపెట్టి అవతలికిపోవటం మంచిది కాదు" అంటూ తన దుస్తుల్లో నుంచి చెకుముకి రాయిని బయటికి తీశాడు శ్యామలుడు.

"ఆ విషవృక్షం సంగతి నేను చూసుకుంటాను, నువ్వు ఆహారం తీసుకో" అంటూ ఆ సాధనాన్ని తాను తీసుకుని ఎండుటాకుల మీద మంటల్ని సృష్టించాడు గదాధరుడు. భగభగలాడే సమయంలో అతి జాగ్రత్తగా తీసుకుపోయి, నీటిగుంట చుట్టూ ఎదిగివున్న తుంగపొదల మీదికి విసిరేశాడు.

పచ్చిగా వున్న పొదలను కూడా వదిలిపెట్టకుండా విజృంభించాయి మంటలు. చూస్తూ చూస్తూ వుండగానే పెద్దవి అయ్యాయి. నీటిగుంట చుట్టూ వున్న పొదలను ఆఖరికి పచ్చ చెంగలువ చెట్లను కూడా వదిలిపెట్టకుండా ఆరగించటం మొదలు పెట్టాయి.

"ఈ మంటలు ఇక్కడితో ఆగిపోవాలి. గుట్టనంతా ఆవరించుకోకూడదు" అన్నాడు శ్యామలుడు.

"గాలి గుట్ట క్రిందికి వస్తోంది. అంటే ఈ మంటలు గుట్ట క్రిందికీ ప్రయాణం చేస్తాయి. గుట్ట క్రింది భాగంలో బండలు తప్ప పొదలు లేవు. మరేం ప్రమాదం లేదు" అన్నాడు గదాధరుడు.

తన ముందుకు అతను జరిపిన పళ్ళు ఫలాల్లో సగభాగం ఆరగించి సొరకాయ బుర్రలోని నీటిని త్రాగాడు శ్యామలుడు. తృప్తిగా నిట్టూర్చి స్నేహితుడి వైపు చూశాడు.

"వచ్చినదారినే వెనక్కిపోతే మరోసారి ఆ కిన్నెర సుందరీమణులు ఎదురయ్యే అవకాశం వున్నది. గుట్టను దాటి రెండో ప్రక్కనుంచి పోదాము. ఎటువంటి ఇబ్బందీ వుండదు" అంటూ లేచి నిలుచున్నాడు గదాధరుడు.

తను చెప్పినట్లే గాలి వాలున గుట్ట క్రింది భాగం వైపు మరలిన అగ్నిజ్వాలలు – వాటంతట అవే మలిగిపోవటం కనిపించింది అతనికి.

"నువ్వు ఏమైపోతావోనన్న ఆందోళనతో ఇటుగా వచ్చాను. నీకు ఎటువంటి ప్రమాదము ఎదురు కానందుకు ఎంతో సంతోషంగా వున్నది" అంటూ శ్యామలుడి భుజం మీది కట్టును ఒకసారి సరిచూసి, గుట్ట ఆవలివైపుకు దారి తీశాడు.

*　　*　　*　　*　　*

"మంటలు... భగభగలాడే మంటలు మనకేసి ఉరుకులు పరుగులు పెడుతూ వస్తున్నాయి..." ఉన్నట్లుండి ఆగిపోతూ అన్నది మొదటి యువతి.

"మనం వెంబడిస్తున్నట్లు తెలియటం వల్ల అడ్డుకునేందుకు మంటలు వేశారు?" అడిగింది రెండవ యువతి.

బండరాళ్ళ మధ్యన వున్న ఎండు పొదల్ని ఆరగిస్తున్న మంటల వంక దీర్ఘంగా చూసి తల అడ్డం తిప్పింది మొదటి యువతి.

"మనకోసం వేయబడినవి కావు అవి. గాలి వాలున వస్తున్నాయి. బహుశా ఇంకొంచెం ముందుకు రాగానే ఆగిపోవచ్చు" అన్నది.

ఆమె సూచించినట్లే ఆరగించటానికి బండలు తప్ప ముళ్ళపొదలు కనిపించకపోవడంతో ఆరిపోయాయి ఆ మంటలు.

"మంటలు ఆరిపోయాయి. బాగానే వున్నది కాని బండలు మాత్రం బాగా వేడెక్కి పోయినట్లున్నాయి..." రెండు అడుగులు ముందుకు వేసి, వెంటనే వెనక్కి జరుగుతూ అన్నది రెండవ యువతి.

"ఆలస్యం చేస్తే ఆ మానవులు ఇద్దరూ మనకి అందనంత దూరం వెళ్ళిపోతారు" అన్నది మొదటి యువతి.

"నా ఉద్దేశ్యంలో వాళ్ళు గుట్టకు రెండో ప్రక్కకు పోయి వుంటారు... గాయపడిన నరుడికి ఏదైనా వైద్యం చేయించాలి..." అన్నది రెండవ యువతి.

"వారెవరికీ తెలియదు. ఆ గాయం పచ్చ చెంగలువ విషంతో నిండి వుంది. ఆ నరుడు బ్రతికి బట్ట కట్టటం అసంభవం" అన్నది మొదటి యువతి.

"పచ్చచెంగలువ విషానికి విరుగుడు లేదా?" అడిగింది ఆమె సహచరి.

"ఉన్నది... కాని విరుగుడు వున్నట్లు ఎవరికీ తెలియదు..."

"ఏమిటది?" కుతూహలంగా అడిగింది సహచరి.

"తర్వాత చెపుతాను... ముందు వారిద్దరినీ కలుసుకోవాలి..."

"గుట్ట చుట్టు తిరిగి రెండవ ప్రక్కకుపోదాము..." అంటూ వున్నట్లుండి తన మానవ రూపాన్ని వదిలి, సర్ప రూపాన్ని ధరించింది రెండవ యువతి.

మెలికలు తిరుగుతూ వేగంగా ప్రయాణం మొదలుపెట్టింది. తన దగ్గిర వున్న శ్యామలుడి దట్టీని ఒక బండరాయి మీద వదిలి ఆమెను అనుసరించింది మొదటి యువతి.

కాలి నడకన నాలుగు నాలుగు ఎనిమిది ఘడియల కాలం ప్రయాణం చేస్తే తప్ప అధిగమించలేని దూరాన్ని కేవలం ఒక ఘడియ కాలంలో అధిగమించి గుట్ట వెనుక భాగాన్ని చేరుకుని, తిరిగి మానవ రూపాల్ని ధరించారు వారిద్దరూ.

అతి వేగంగా రావటం వల్ల ఒళ్ళు హూనం అయిపోయినట్లు ముఖం చిట్లిస్తూ ఒళ్ళు విరుచుకున్నది రెండవ యువతి.

"నరులు ఎవరూ కనిపించటంలేదు. మధ్యలోనే ఆగిపోయి వుంటారం టావా?" చుట్టూచూస్తూ అడిగింది తన సహచరిని.

తను కూడా అడిగింది తన సహచరిని.

తను కూడా ఆ చుట్టుపట్ల వున్న చెట్టుపుట్టల్ని పరిశీలనగా చూస్తూ సాలోచనగా తల ఊపింది మొదటి యువతి.

"గాయపడిన నరుడు గుటుక్కుమని వుంటే తప్పకుండా మధ్యలోనే ఆగిపోవటం జరుగుతుంది. లేదా మనకంటే ముందుగా వచ్చి వుంటే దూరంగా వెళ్ళిపోవటానికి అవకాశాలు వున్నాయి" అంటూ ముందుకు వంగి నేలను వాసన చూడటం మొదలు పెట్టింది.

"గాయపడిన నరుడు మహాబలవంతుడు... ఎంతటి విషమైనా అతన్ని ఒక పట్టాన మృత్యువు ఒడిలోకి నెట్టడం అసంభవం... సమయం పడుతుంది" అంటూ తాను కూడా తన సహచరి మాదిరిగా నేలను వాసన చూసి, జాడల్ని అన్వేషించే కార్యక్రమాన్ని మొదలుపెట్టింది రెండవ యువతి.

కిచకిచమని శబ్దాలు చేశాయి వారి చుట్టూ వున్న చెట్లమీది గోరింకలు కొన్ని... రెక్కల్ని తపతపలాడిస్తూ గాలిలోకి ఎగిరాయి వాటిలో కొన్ని.

నేలమీద కేంద్రీకరించి వున్న చూపుల్ని పైకి ఎత్తి కోపంగా చూశారు ఆ సుదరీమణులు వాటివంక.

"అవతలకు వెళ్ళిపొండి... మా గురించి మీరెవరూ ఆలోచించకండి... వెళ్ళిపోండి" కనుబొమల మధ్యలో నుంచి క్రూరంగా చూస్తూ హెచ్చరించింది మొదటి యువతి.

"ఈ పాడు గోరింకలకు మనకీ మొదటి నుంచీ బద్ధ విరోధం... వాటిని ప్రాణాలతో వదిలిపెడితే సూటిగా పోయి నరులిద్దరినీ హెచ్చరిస్తాయి" అన్నది రెండవ యువతి.

గోరింకల వంక కోపంగా చూస్తున్న మొదటి యువతి వున్నట్లుండి ఫక్కున నవ్వింది. ఆమె ముఖంలోని కోపం మటుమాయం అయిపోయింది.

"నా మాటలు నీకు వినోదాన్ని కలిగిస్తున్నాయి?" చురుకుగా చూస్తూ ఆమెను అడిగింది రెండవ యువతి.

"మన గురించి ఆ నరులు ఇద్దరికీ తెలియదని అనుకుంటున్నావా?" మనం ఎవరిమో తెలియకుండానే వాళ్ళు మనల్ని తమతో నడవటానికి అంగీకరించారనీ నీ అభిప్రాయమా?" అని అడిగింది మొదటి యువతి.

ఆ మాటలు తనకు అవగతం కానట్లు అయోమయంగా చూసిన తన సహచరి తలమీద ముద్దుగా ఒక మొట్టికాయ వేసింది ఆమె.

"మనం ఎవరిమో మన దగ్గరికి వచ్చిన నరుడికి తెలుసు. తెలియబట్టే అతను మనల్ని ఆ సైనికులకు ఎదురు నడిపించాడు. తృప్తిగా విందు భోజనం పెట్టించింది అతనే... మన గురించి పూర్తిగా అర్థం చేసుకోవడం వల్లనే ఆ పని జరిగింది" మృదుస్వరంతో చెప్పింది.

"మన గురించి పూర్తిగా తెలిసినట్లయితే, మరి దూరంగా పారిపోవటం దేనికి?" అడిగింది రెండవ యువతి.

"ఎంతతెలిసినా ఏదో ఒక సమయంలో ఏదో ఒక పొరపాటు క్షణంలో మనల్ని తాకటం జరుగుతుందేమోనన్న భయం వారికి కలిగింది. మనల్ని తాకిన వెంటనే మన ఆకారాలు మారిపోతాయి...." నవ్వుతూ చెప్పింది ఆమె.

తమ ఆకారాలు మారిపోయిన తరువాత, తమను తాకిన వారిని ఆరగించకపోతే తమ ఆవేశం అణిగిపోదని తెలిసి వుండటం వల్ల, ఆ మాటలకు ఎదురు చెప్పలేదు రెండవ యువతి.

తమ తలల మీద గిరికీలు కొడుతున్న గోరువంకల వంక ఒకసారి కోపంగా చూసి మరోసారి నేలమీదికి తన చూపుల్ని మరలించుకున్నది మొదటి యువతి.

"ఇదిగో... ఇక్కడ... ఇక్కడినుంచి కదిలి ముందుకు ప్రయాణం మొదలు పెట్టారు ఆ నరులు...." అంటూ ముందుకు సాగటాన్ని ఆపి, శిలా విగ్రహం మాదిరి అక్కడే నిలుచుండిపోయింది ఆమె.

"ఏమిటది? ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగింది రెండవ యువతి.

"గుట్టమీదికి పోయే సమయంలో మన నరుడు తన జతగాడిని తన భుజాలకు ఎత్తుకుని తీసుకువచ్చాడు. కాని ఇప్పుడు నాకు రెండు జతల పాదాలు వేగంగా నడుస్తున్న జాడలు కనిపిస్తున్నాయి... ఎలా సాధ్యం ఇది?" నుదురు రుద్దుకుంటూ అన్నది మొదటి యువతి.

"మనం అనుసరిస్తున్నది ఇద్దరిని... మనకి రెండు జతల పాదాల జాడలు కనిపించటంలో ఆశ్చర్యం ఏముంది?" అడిగింది రెండవ యువతి.

"ఆలోచించి మాట్లాడాలి. నోటికి ఏదివస్తే అది వెంటనే బయట పెట్ట కూడదు. చెంగలువ విషం ఒంటినిండా వ్యాపించి, ఏ క్షణంలోనైనా ప్రాణాలు వదలబోతున్న మనిషి తనంతట తానుగా నడవటం ఎలా సాధ్యపడుతుంది?" కోపంగా చూస్తూ అడిగింది మొదటి యువతి.

"విషం వంటినిండా వ్యాపించిన నరుడు గుట్టమీద వుండగానే గుటుక్కుమని వుంటాడు. మరెవరో దారి చూపించటం కోసమో, మరేదయినా పని మీదనో మన నరుడితో జతకట్టి ఉండవచ్చు" అంటూ అదిరిపడి ఆ మాటల్ని ఆపేసింది రెండవ యువతి.

"అతనే... చెంగలువ విషం ఒంటినిండా వ్యాపించిన నరుడి జాడే ఇది. అతని గాయానికి కట్టుగా కట్టిన వస్త్రాన్ని మనం మన దగ్గిరే అట్టిపెట్టు కున్నాము. నువ్వు చెప్పినట్లు ఇది ఎలా సాధ్యపడింది?" తను కూడా నుదురు రుద్దుకుంటూ అడిగింది.

పది క్షణికాల పాటు దీర్ఘంగా యోచించి తల విదిలించింది మొదటి యువతి "మనల్ని మన స్థావరంలో నుంచి బయటికి వచ్చేటట్లు చేసిన నరుడు సామాన్యుడు కాదు. అతనే ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించి వుంటాడు" అన్నది.

"ఏది ఏమయినా మనం వెంటనే అతన్ని మట్టు పెట్టే మార్గం ఆలోచించాలి. లేకపోతే అతనే మనల్ని నామరూపాలు లేకుండా చేసేస్తాడు." అన్నది రెండవ యువతి.


ఉన్నట్లుండి మళ్ళీ తన రూపాన్ని మార్చుకున్నది మొదటి యువతి. పొడవాటి నాలుకల్ని వేగంగా కదిలిస్తూ, నేల మీద తమకు తప్ప మరెవ్వరికీ కనిపించని జాడల్ని అనుసరించి వేగంగా కదలటం మొదలు పెట్టింది.

రెండవ యువతి కూడా సర్పరూపాన్ని ధరించటాన్ని గమనించి మరింత గోలగోలగా అరవటం మొదలు పెట్టాయి గోరింకలు... ఎగురుతూ ఎగురుతూ వేగంగా క్రిందికి దూసుకువచ్చి, ఆ సర్పాలు రెండింటినీ చికాకు చేయటం ప్రారంభించాయి.

తమలో తాము కూడబలుక్కున్నట్లు, గిరుక్కున ప్రక్కకు తిరిగి, ఆ చెట్ల గుంపుకు దూరంగా వున్న ఒక పెద్ద మట్టి గుట్టకేసి దూసుకుపోయాయి వాటిలో కొన్ని.

(ఇంకావుంది)

**మిగతా కథ 'నరుడు' రెండవ భాగంలో చదవండి.**


NARUDU
Novel By
Madhubaabu


నరుడు - 2
మధుబాబు

# నరుడు-2

(రెండవ భాగము)

## మధుబాబు

మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

# NARUDU -2

(Serialised in 'Navya' weekly)

By

**MADHUBAABU**

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 94411 94605

First Edition :

**2016**

Price :

**Rs. 110-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

Edition :
**2016**

# నరుడు-2

నడుస్తూ నడుస్తూ ఉన్నవాడు కాస్తా, వున్నట్లుండి నడకను ఆపి, వెనక్కి చూశాడు గధాధరుడు.

"ఎందుకు అలా వెనక్కి వెనక్కి చూస్తావు? ఏమయింది నీకు?" విసుగు నిండిన కంఠంతో అడిగాడు శ్యామలుడు.

"మన కిన్నెర సుందరీమణుల గురించి నీకు ఇంకా పూర్తిగా తెలిసినట్లు లేదు. మనల్ని ఒక పట్టాన వదిలి పెడతారన్న నమ్మకం నాకు లేదు" అన్నాడు గదాధరుడు.

"ఈ ప్రపంచంలో మనం తప్ప మరో మనిషి ఎవరూ లేరన్నట్లు మాట్లాడకు. ఆకలి అయితే ఎవర్నో ఒకర్ని వెతుక్కుంటారు. మన గురించి ఆలోచించరు" అన్నాడు శ్యామలుడు.

"అవును మిత్రమా... గోరువంకలకు పాములకు బద్ధ విరోధం కదా?" ఉన్నట్లుండి అడిగాడు గదాధరుడు.

"గోరువంకలే కాదు... పక్షిజాతులు అన్నిటికీ పాములంటే విరోధమే!" అన్నాడు శ్యామలుడు.

"మరి గుట్టమీదికి పోయిన క్షణం నుంచీ నాకు గోరువంకలే కనిపిస్తున్నాయి. వేరే జాతిపక్షి ఒక్కటి కూడా అగుపించలేదు. కారణం ఏమై వుంటుంది?" అడిగాడు గదాధరుడు.

అతను అలా మాట్లాడటానికి ఏదో బలమైన కారణం వుండే వుంటుందని శ్యామలుడికి తెలుసు.

"మాటల్ని సాగదీయకుండా విషయం ఏమిటో చెప్పు...." విసుగునిండిన కంఠంతో అడిగాడు.

"అవిగో వస్తున్నాయి చూడు...." అంటూ తాము ఏ దిశలో నుంచి వస్తున్నారో అటుకేసి చూపించాడు గదాధరుడు.

తల తిప్పి చూసిన శ్యామలుడికి వెంటనే కనిపించాయి గుంపుగా వస్తున్న కొన్ని గోరువంకలు.

కిచకిచమని శబ్దాలు చేస్తూ వారి తలల మీదికి వచ్చేశాయి అవి. అరుపుల్ని ఆపకుండా గిరికీలు కొట్టటం మొదలు పెట్టాయి.

రెండు క్షణికాలు అదే పనిగా చూసి అందంగా నవ్వాడు గదాధరుడు.

"అర్ధం అయింది... గుట్టకు అవతలి ప్రక్కన మేము వదిలి పెట్టి వచ్చిన కిన్నెర సుందరీ మణులు మమ్మల్ని అనుసరించినట్లు తెలిసిపోయింది. మీ సహాయానికి వేలవేల నమస్కారాలు" నిజంగానే చేతులు జోడించి వాటికి నమస్కారం చేస్తూ చెప్పాడు అతను.

ఆ మాటలు తమకు అర్ధం అయినట్లు మరింత పెద్దగా కిచకిచ శబ్దాలు చేసి వెనక్కి వెళ్ళిపోయాయి ఆ పక్షులు.

"మిత్రమా... కారణం ఏదైనా వుండి వుంటుందా? మనుష్యుల మాదిరి ఈ గోరువంకలు మనల్ని హెచ్చరించటానికి రావటం చాలా విచిత్రంగా వుంది" అన్నాడు శ్యామలుడు.

"నిన్ను కాపాడుకునే అవకాశం మాకు కల్పించినప్పుడే వాటి ప్రవర్తన నాకు విచిత్రం అనిపించింది. కావాలనే ఆ రెండు గోరువంకలు ఆ నీటిమడుగు దగ్గిర విషపు పువ్వుల వాసనకు కళ్ళు తిరిగి పడిపోయి వుంటాయని నాకు అనిపిస్తోంది" సాలోచనగా అన్నాడు గదాధరుడు.

"ఇవి మన సహాయాన్ని అభ్యర్థిస్తున్నాయా?" అడిగాడు శ్యామలుడు.

"వాటి భాష మనకి అర్థం కాదు. మనతో ఏమి చెప్పదలుచుకున్నాయో తెలిస్తే తప్ప మనం చేయగలిగింది ఏమీ లేదు" గాఢంగా నిట్టూరుస్తూ, తిరిగి నడక మొదలు పెట్టాడు.

అర్ధఘడియపాటు మాత్రమే నడిచారు వాళ్ళు. ఎదురుగా పెద్ద మట్టిగుట్ట ఒకటి ప్రత్యక్షం అవటంతో ఆగిపోయారు.

"గుట్టలంటే నీకు ఎందుకో బెరుకుగా వుంది మిత్రమా... నీ శరీరంలోకి ప్రవేశించిన విషానికి విరుగుడు వేయగలడనే ఆశతో కొండజాతి వాళ్ళను వెతుకుతూ గుట్టమీదికి పోయి, విషంతో నిండిన చెట్టును చూశాను. తిరిగి ఇప్పుడు ఈ గుట్ట కనిపిస్తోంది. దానిమీద ఇంకే విధమైన ప్రమాదం పొంచి వున్నదో తెలియటం లేదు" చిరాకుగా అన్నాడు గదాధరుడు.

"కంటికి కనిపించే ప్రమాదాలను గురించి మనం భయపడాలి. కనిపించని వాటిని గురించి ఆందోళన చెందకూడదు. అనవసరమైన ఆలోచనలతో కాలహరణం చేస్తే, వెనుక వున్న మన స్నేహితురాళ్ళు వచ్చేస్తారు. బాగా ఆలోచించుకో" అన్నాడు శ్యామలుడు నవ్వుతూ.

ఆ మాటలతో తొలగిపోయింది గదాధరుడికి అయోమయ పరిస్థితి.

"ఈ గుట్ట చుట్టు తిరిగి దారిని వెతుక్కునే ఓపిక లేదు. దాన్ని అధిగమించి ఆవలి ప్రక్కకు పోవటమే ఉత్తమం" అంటూ గుట్టమీదికి నడవటం మొదలు పెట్టాడు.

వంద ధనువుల దూరం పైకి పోయారు వాళ్ళు. ఒక పెద్ద చెట్టు కనిపించింది వారికి. గుట్టమధ్య భాగంలో కూలిపోవటానికి సిద్ధంగా వున్న ఒక కుటీరం వంటి మట్టి కట్టడం కూడా ఆ చెట్టుక్రింద అగుపించింది.

"రండి... రండి... వెలుగు వుండగానే ఇక్కడికి రాగలగటం నిజంగా మీ అదృష్టం" అంటూ ఆ కట్టడంలో నుంచి బయటికి వచ్చి వారికి స్వాగతం పలికాడు వృద్ధుడు ఒకతను.

చినిగి పీలికలై పోబోతున్నాయి అతను ధరించి వున్న దుస్తులు. సరైన ఆహారం తీసుకునే అవకాశం లేనందువల్ల క్షీణించి పోతున్నట్లు, బలహీనంగా కనిపిస్తున్నాడు.

తమ వెనుకగా వస్తున్న కిన్నెర సుందరీమణులు వెంటనే గుర్తుకు వచ్చారు గదాధరుడికి.

ఆహారం తీసుకుని ఎంతోకాలం అయినట్లు ఆబగా ఎగబడ్డారు వాళ్ళు తమను అడ్డగించిన సైనికుల మీదికి. దొరికిన వాళ్ళను దొరికినట్లే గుటుక్కున మ్రింగేశారు. నరమానవులెవరూ కనిపించని నిర్జన ప్రదేశంలో నివశించే ఈ వృద్ధుడు కూడా అటువంటివాడే అయితే?

గదాధరుడి మనసులో మెదులుతున్న ఆలోచనలు ఎటువంటివో తనకు తెలిసిపోయినట్లు చాలా బరువుగా నవ్వాడు ఆ వృద్ధుడు.

"కనిపించిన ప్రాణిని కనిపించిన వెంటనే వలుచుకుని తినే రాక్షసుడిని కాదు నేను. మీ వంటి మానవుడినే. శంబర శక్తిని సాధించాలనే కోరికతో ఇక్కడికి వచ్చి... ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో చిక్కుపడి వున్న ఒక పిచ్చి మానవుడిని...." విషణ్ణ వదనంతో చెప్పాడు.

"అయ్యో... శబరశక్తిని సాధించటం అంటే మంత్ర సాధన చెయ్యడం, మీరు మాంత్రికులా?" అడిగాడు గదాధరుడు.

"ఆ మాట ఒకప్పుడు నిజం. ఇప్పుడు కాదు... మంత్ర శక్తులన్నీ హరించుకుపోయాయి. వట్టి మనిషిని మాత్రం మిగిలాను" మరింత బరువుగా అన్నాడు ఆ వృద్ధుడు.

మౌనంగా వింటున్నాడు శ్యామలుడు. మంత్రాలను గురించి తంత్రాలను గురించి అదేపనిగా మాట్లాడుకోవటం అతనికి నచ్చలేదు.

"మేము అత్యవసరంగా ఈ గుట్ట దిగి ఆవలికి వెళ్ళిపోవాలి. అందుకు సరైన దారి ఎటుగా వున్నదో చూపించండి. ఒంటరిగా రావటం లేదు మేము, మా వెనుక ఒక పెద్ద ప్రమాదం తరుముకుంటూ వస్తోంది...." అన్నాడు.

"పాముల డొంకలోకి పోయి అక్కడే నివశించే కిన్నెర సుందరీమణులను రెచ్చగొట్టారు? ఇవతలికి తీసుకువచ్చారా?" అతను ఆ ప్రమాదం ఎటువంటిదో చెప్పకముందే తనకు తానుగా అడిగాడు ఆ వృద్ధుడు.

విపరీతమైన ఆశ్చర్యంతో ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు స్నేహితులు ఇద్దరూ.

"ఆర్యా, ఆ కిన్నెరల గురించి మీకు ఎలా తెలుసు?" అడిగాడు గదాధరుడు.

"నా ప్రస్తుత పరిస్థితికి వాళ్ళు కూడా కారణమే... వాళ్ళు పాముల డొంకలో తిష్టవేసుకు కూర్చోవటం వల్లనే నేను ఇలా తయారైనాను...." తల దించుకుంటూ చెప్పాడు వృద్ధుడు.

"సగం సగం మాటలు చెప్పి మా సమయాన్ని వృధా చేయకండి... పూర్తిగా చెప్పండి... మీకు సహాయం చేయటానికి అవకాశం ఏదైనా వున్నదేమో ఆలోచించుకోవచ్చు" అన్నాడు శ్యామలుడు.

"చెప్పుతాను నాయనా... ఏబది సంవత్సరాల నుంచీ నా గుండెలను మండిస్తున్న బాధ ఎటువంటిదో మీకు వివరంగా చెపుతాను. ముందుగా మీరు కుదురుగా కూర్చోండి. అలసిపోయినట్లు కనిపిస్తున్నారు. కొద్దిపాటి ఆహారం తీసుకోండి" అంటూ తన కట్టడంలోకి పోయాడు వృద్ధుడు.

చటుక్కున శ్యామలుడి చేతిని పట్టుకున్నాడు గదాధరుడు. "ఆలస్యం చేయటం అనవసరం మిత్రమా... ప్రాణాలు దక్కాలంటే పాదాలకు బుద్ధి చెప్పటమే చాలా మంచిది" అంటూ గుట్ట పై భాగం వైపు పరుగు మొదలు పెట్టాడు.

"ఇతను కూడా కిన్నెరల వంటి ప్రమాదకారేనా?" అడిగాడు శ్యామలుడు అతన్ని అనుకరిస్తూ.

"పరాయి మనిషి కంటపడితే కులగోత్రాలు విచారించి, వివరాలన్నీ తేట తెల్లం అయిన తరువాతనే దగ్గరికి రానిస్తారు ఎవరైనా. బాల్య స్నేహితులను, తల్లి వైపు బంధువులను ఆహ్వానించినట్లు సాదరంగా పలకరించే వారి పట్ల మనం బహు జాగ్రత్తగా మసలుకోవాలి. అడగకముందే ఆహారం ఇస్తామనే వారిని అసలు నమ్మకూడదు" దృష్టినంతా ముందున్న మార్గం మీద కేంద్రీకరిస్తూ చెప్పాడు గదాధరుడు.

"అడగకముందే ఆహారం నీరు తెచ్చి ఇచ్చారు రాబందుల గుట్ట మీద ఆ కొండజాతి వాళ్ళు. మరి వాళ్ళు మన బంధువులు ఎలా అయినారు?" వెక్కిరించాడు శ్యామలుడు.

"అప్పటికప్పుడు బంధువులుగా మారలేదు. పాములడొంక వైపు వెళ్ళే సమయంలోనే వాళ్ళు పరిచయం అయ్యారు. నీ గాయానికి విరుగుడు ఏదైనా సూచిస్తారేమోనని నేనే వారిని వెతుకుతూ గుట్ట మీదికి పోయాను" జరిగింది మరోసారి అతనికి చెప్పాడు గదాధరుడు.

"మనం కనిపించకపోతే ఆ ముసలి మనిషి మన వెనుకే వెతుకుతూ వస్తాడా?" అడిగాడు శ్యామలుడు.

ఆ వృద్ధుడు ఏం చేస్తాడో, ఎలా ప్రవర్తిస్తాడో ఊహించటానికి ప్రయత్నం చేశాడు గదాధరుడు. ఫలించలేదు అతని ప్రయత్నం. గుట్ట పైభాగాన్ని చేరుకున్న వెంటనే అగుపించాయి అతనికి కొన్ని శిధిలాలు.

*        *        *        *        *

"మనిషి అనేవాడు ఎవడూ కనిపించని ఈ ప్రదేశంలో చిత్ర విచిత్రాలు చాలా అగుపిస్తున్నాయి. ఈ శిధిలాలు ఏ కాలం నాటివి అయివుంటాయో చెప్పగలవా?" చటుక్కున ఆగిపోయి శ్యామలుడిని అడిగాడు అతను.

ఒక మహాభవంతికి సంబంధించిన శిధిలాలు అవి. సగానికి సగం విరిగి పడిపోయి వున్నాయి గోడలు, చెదలు పట్టడం వల్ల పుచ్చిపోయి పొడుము పొడుమై క్రింద పడిపోయి కనిపిస్తున్నాయి తలుపులు, ద్వారబంధాలు.

పిచ్చిచెట్లు, ముళ్ళపొదలు దట్టంగా ఎదిగి వున్నాయి. అడుగుపెట్టడానికి వీలు పడనంతగా గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నాయి కొండరాళ్ళు.

"ఏ కాలం నాటిదో చెప్పటం చాలా కష్టం. శిధిలమై కనీసం ఒక శతాబ్దం పైనే అయివుంటుంది" పరిశీలనగా చూస్తూ చెప్పాడు శ్యామలుడు.

మన దారికి ఇది సరిగ్గా మధ్యలో వున్నది. వెనక్కి తిరిగి ఇంకో మార్గాన్ని వెతుక్కునే సమయం లేదు. అవతలి ప్రక్కకు పోవాలంటే ఈ గుట్టల్ని, శిధిలాల్ని దాటి పోవాల్సిందే" అన్నాడు గదాధరుడు.

"అది కూడా అనుకున్నంత తేలిక కాదు. ఒకసారి ఆకాశంలోకి చూడు" అన్నాడు శ్యామలుడు.

అతను ఎందుకు అలా అన్నాడో గదాధరుడికి తెలుసు. "మాటల్లో పడి పొద్దు గడిచిపోతున్న సంగతిని నేను గమనించలేదని అనుకోబోకు. ఇంకో అర్ధఘడియలో చీకట్లు చుట్టుముట్టేస్తాయి" అన్నాడు.

"చీకటి సమయంలో ప్రయాణం ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమాదకరం. సరయిన చోటును చూడు. రాత్రికి ఇక్కడే మన నివాసం...." అంటూ ముందుకు అడుగువేశాడు శ్యామలుడు.

వెనుక వస్తున్న కిన్నెర సుందరీమణులకు పగలూ రాత్రీ తేడాలు వుండవని ఏ సమయంలోనైనా అవి తమను వెతికి పట్టుకోగలవనీ తెలిసి కూడా వెనుకంజ వేయలేదు గదాధరుడు.

రెండు అడుగులు వేసి, ఎందుకనో ఆగిపోయాడు. భుజం మీది నించి వెనక్కి చూశాడు.

కనపడీ కనపడనట్లుగా కనిపించాయి గాలిలో గిరికీలు కొడుతున్న గోరువంకలు... వినపడీ వినపడనట్లు, వినవస్తున్నాయి వాటి కిచకిచలు.

"మనకి ఎంతో వ్యవధి లేదు మిత్రమా... కిన్నెర సుందరీ మణులను అనుసరిస్తున్నట్లు వున్నాయి ఆ గోరువంకలు...." తను కూడా వెనక్కిచూస్తూ అన్నాడు శ్యామలుడు.

"చెట్టుక్రింద మట్టి కట్టడంలో వున్న వృద్ధుడు ఏమైపోయి వుంటాడో...." తనలో తను అనుకుంటూ వేగంగా కదిలాడు గదాధరుడు. నడుమెత్తున వున్న ఒక రాళ్ళగుట్టను అధిగమించి విశాలంగా వున్న ఒక శిధిల మందిరంలోకి అడుగు పెట్టాడు.

"ఇది సాధారణమైనది కాదు... ఏదో పూజా మందిరం మాదిరిగా వున్నది...." అతని వెనుకే అక్కడికి వచ్చిన శ్యామలుడు వెంటనే అన్నాడు.

పూజామందిరం అని అతను చెప్పిన మాటలో అసత్యం ఏమీ లేదు. గదాధరుడికి పది బారల దూరంలో పడిపోవటానికి సిద్ధంగా వున్న ఒక చలువరాతి పీఠం మీద నిట్ట నిలువుగా నిలబడి కనిపిస్తోంది ఒక పెద్ద ప్రతిమ.

మూడు మూరల పొడుగున్న శూలాన్ని పట్టుకుని, జానెడు పొడవున పెద్ద నాలుక బయటికి జాపి, బండి చక్రాలు వంటి కళ్ళతో తీక్షణంగా చూస్తూ వున్నది ఆ విగ్రహం.

చేతులు జోడించి వరుసల్లో నిలబడి వున్నాయి మరికొన్ని ప్రతిమలు– ఆ విగ్రహం వెనుక భాగంలో.

"సేవకులో, సేవించుకోవటానికి వచ్చిన భక్తులో అయి వుంటారు... ఇంతకీ ఈ దేవత నామధేయం ఏమై వుంటుందో" అన్నాడు గదాధరుడు.

ఛట్‌మని శ్యామలుడికి గుర్తుకు వచ్చింది మట్టి కట్టడంలో నివశించే వృద్ధుడితో తాము జరిపిన సంభాషణ.

శంబర దేవతను సాధించటానికి వచ్చినట్లుగా చెప్పాడు అతను. సాధించటం చేతకాక పిచ్చి వాడిలా మిగిలి పోయినట్లుగా బాధపడ్డాడు.

అతను చెప్పిన శంబరదేవత అయివుంటుందా ఈ ప్రతిమ?

శ్యామలుడి మనస్సులో ఎటువంటి ఆలోచనలు మెదిలినా వెంటనే పసికట్టగల నేర్పు వున్నది గదాధరుడికి.

“చూపులకు ప్రతిమ భయంకరంగానే ఉన్నా, పూజ చేయటంలో కష్టాలు ఎదురుపడే విధంగా అగుపించడం లేదు. ఆ ముసలివాడు మరేదో కష్టాన్ని గురించి మాట్లాడి వుంటాడు.” అంటూ ధైర్యంగా ముందుకు పోయి పీఠం మీద నిలబడి వున్న దేవత చేతుల్ని స్పృశించాడు. పట్టుకుని వున్న శూలాన్ని కూడా తడిమి చూశాడు.

“ఇది వట్టి విగ్రహమే. ఇందులో ఎటువంటి శక్తి దాక్కొని లేదు. ఆ వృద్ధుడు చెప్పిన శక్తి ఇది అయి వుండదు....” అంటూ వెనుతిరిగి వచ్చాడు.

వెనక్కి నాలుగు అడుగులు వేసి, తాము అధిగమించి వచ్చిన రాళ్ళగుట్ట మీదుగా ఆవలి ప్రక్కకు చూశాడు శ్యామలుడు.

కిచకిచ శబ్దాలు చేస్తూ కనిపించాయి గోరువంకలు. శిథిల భవనానికి పాతిక ధనువుల దూరంలోకి వచ్చిన వెంటనే, రెట్టించిన వేగంతో వెనక్కి వెళ్ళి పోయాయి అవి.

“మిత్రమా... త్వరగా... త్వరగా” వెనక వున్న గదాధరుడిని చిన్న కంఠంతో పిలిచాడు శ్యామలుడు.

పదే పది అంగల్లో వచ్చి అతని భుజాల మీది నుంచి తాను కూడా దూరంగా వెళ్ళిపోతున్న ఆ గోరువంకల్ని చూశాడు గదాధరుడు.

“క్రింద... క్రింద చూడు....” మళ్ళీ హెచ్చరించాడు శ్యామలుడు.

క్రిందికి చూసిన గదాధరుడికి ఒక పెద్ద కొండరాయి దగ్గిర ఆగి పడగలు పైకి లేపుతున్న రెండు కాలసర్పాలు కనిపించి ఒళ్ళు జలదరించింది.

“మన స్నేహితురాళ్ళే... మనల్ని అనుసరించడం కోసం తమ అసలు రూపాల్లోకి మారిపోయినట్లున్నారు” అని శ్యామలుడికి చెపుతూ వుండగానే, సర్పరూపాల్ని వదిలి మానవ రూపాల్లోకి మారిపోయారు వారిద్దరూ.

“శిథిలాల్లో తలలు దాచుకుంటే మనం వెతికి పట్టుకోలేమని అనుకుంటు న్నట్టుగా వుంది... త్వరగా పద” అంటూ ముందుకు అడుగువేసింది మొదటి యువతి.

ఆశ్చర్యంగా చూస్తూ అలాగే నిలుచుండిపోయిన స్నేహితుడి చేతిని పట్టుకుని బలవంతంగా వెనక్కి లాగాడు గదాధరుడు.

"దేవుడి దయవల్ల ఒకసారి వాటిని వదిలి దూరంగా పారిపోయి రాగలిగాడు. ఇంకోసారి ఇది మనల్ని అతుక్కుంటే తిరిగి వదిలించుకోవడం అసంభవం అయిపోతుందని అనిపిస్తోంది" అంటూ అంతకుముందు చూసిన పూజా మందిరంలోకి లాక్కుపోయాడు.

పీఠం మీద నిలుచుని వున్న విగ్రహం వెనుక భాగంలో అతనికి కనిపించింది ఒక చిన్నమందిరం. వెనక్కికూడా తిరిగి చూడకుండా శ్యామలుడితో పాటుగా ఆ మందిరంలోకి దూకాడు అతను. విరిగి క్రింద పడిపోవటానికి సిద్ధంగా వున్న ఆ మందిరపు కవాటాన్ని మూసి, ఊపిరి బిగపట్టాడు.

పూజా మందిరంలోకి వచ్చేశారు ఆ సుందరీ మణులు. నేల మీదికి వంగి తమకు కావాల్సిన వారి జాడల్ని అన్వేషించటానికి ప్రయత్నం చేసింది రెండవ యువతి. క్షణికం కూడా ఆలస్యం చేయకుండా ఆమెను అడ్డుకున్నది ఆమె సహచరి.

"శంబర దేవత కొలువు వుండే మందిరం ఇది...." అన్నది.

"శిధిలమై రెండు శతాబ్దాలు గడిచిపోయాయి.... ఆ దేవత మహిమ అంతరించి పోయి వుంటుంది" అన్నది రెండవ యువతి.

"మహిమ అంతరించిపోయినా, అంతరించకపోయినా, ఈ ప్రదేశంలో మనం ఎక్కువ సమయం నిలువబడి వుండకూడదు. మరో మందిరంలోకి పోదాం" అంటూ వచ్చిన దారినే వెనక్కి నడిచింది మొదటి యువతి.

"ఆ నరులు ఇద్దరూ ఈ మందిరంలోనే వుండి వుంటే?" అడిగింది ఆమె సహచరి.

"ఏదో ఒక సమయంలో ఈ ప్రదేశాన్ని వదిలి వెలుపలికి వచ్చితీరాలి... అప్పుడు మనకి దొరికి పోతారు. ఈ లోపల మిగిలిన ప్రదేశాన్ని వెతికి వద్దాము" అంటూ ఇంకో శిధిల మందిరంలోకి దారి తీసింది మొదటి యువతి.

శిధిల కవాటం దగ్గిర నిలబడి ఆ తలుపుకున్న పగుళ్ళ మధ్యలో నుంచి వారిని చూస్తూ, వారి మాటలన్నిటినీ ఆలకించిన గదాధరుడిని ఆవరించుకున్నది ఒక విధమైన నిరుత్సాహం.

"తప్పుచేశాను మిత్రమా... సమయం వుండగానే ఈ భవనం వెనక్కి వెళ్ళిపోయి వుండాల్సింది. ఇక్కడ విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించటం నిజంగా పెద్ద అపరాధం అయింది" అన్నాడు.

ఆ నిర్ణయం తనదని అతనికి గుర్తు చేయలేదు శ్యామలుడు. "జరిగి పోయినదాన్ని గురించి చింతించటం అవివేకం. జరుగవలసింది ఏమిటో ఆలోచించు" అన్నాడు గంభీరంగా.

"ఎంతగా ఆలోచించినా నా మట్టి బుర్రకు మంచి ఉపాయం తట్టడం లేదు. నువ్వే చెప్పు." అన్నాడు గదాధరుడు.

"చీకట్లు దట్టం అయిన వెంటనే బయటికి పరిగెత్తాలి" అన్నాడు శ్యామలుడు.

"సిద్ధంగా వుంటాయి ఆ పిశాచులు... చిటుక్కున పట్టేసుకుంటాయి."

"మనంతట మనం చేతులు జాచి వాటిని పట్టుకోనంతవరకూ అవి మనల్ని ఏమీ చేయలేవు కదా."

"అయ్యో మిత్రమా... మళ్ళీ మొదటికి వచ్చేస్తోంది మన సంభాషణ. ఇంకోసారి అవి మనల్ని చూసి మనవెంట పడటం మొదలు పెడితే, ఆ పైన వాటిని వదిలించుకోవటం అసంభవం. ఎక్కడికి పోయినా వెనుకే ప్రత్యక్షం అవుతాయి. మనం చూస్తూ వుండగానే అమాయకుల్ని ఆకర్షించి ఆహారంగా చేసుకుంటాయి. ఆ పాపం మనల్ని చుట్టుకుంటుంది" అన్నాడు గదాధరుడు.

"నేను చెపుతున్నది అదే మిత్రమా.... కావాలని అనుకున్నా అవి నీకు నాకు ఎటువంటి బాధను కలిగించలేదు. ఈ మందిరంలో నుంచి బయటపడిన తర్వాత వాటిని వదిలించుకునే మార్గాన్ని వెతుకుదాము" అన్నాడు శ్యామలుడు.

తృప్తి కలుగలేదు గదాధరుడికి. అయినాసరే ఎదురు చెప్పలేదు అతను.

"ఎలా వదిలించుకోవాలో బాగా ఆలోచించుకుని సిద్ధంగా వుండు. చీకట్లు దట్టం అవటానికి ఎంతో వ్యవధి లేదు" అని మాత్రం అన్నాడు.

చూస్తూ చూస్తూ వుండగానే అతను చెప్పినట్లు కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

మరో పావు ఘడియ తరువాత, విరిగి పడిపోవటానికి సిద్ధంగా వున్న మందిరపు తలుపును నిశ్శబ్దంగా తెరిచి, పీఠం వెనక్కి చేరుకున్నాడు గదాధరుడు.

"నాకు ఎందుకో అనుమానంగా వుంది. జరుగకూడనిది ఏదో జరుగ బోతున్నట్లు అనిపిస్తోంది" అతని వెనుకే ఇవతలికి వస్తూ అన్నాడు శ్యామలుడు.

"నీకు ఈ మధ్య అన్నీ అనుమానాలే వస్తున్నాయి. జరగ కూడనిది ఏదో జరిగేది ఈ మందిరంలో కాదు. ఈ మందిరం వెలుపల... గోడలచాటుకో, గొబ్బెల చాటునో కాపు కాసి వుంటాయి ఆ పిశాచులు...." అన్నాడు గదాధరుడు.

చిన్నగా నవ్వి, అతన్ని పైకి చూడమని సైగ చేశాడు శ్యామలుడు.

పై కప్పులేని మందిరం అది. మొండిగా వున్నాయి మధ్యకు విరిగి పడిపోయిన గోడలు. అక్కడి నుంచి అవతలికి పారిపోయే మార్గం ఏమిటో తెలిసిపోయింది గదాధరుడికి.

*  *  *  *  *

"ఎందుకు ఇలా జరుగుతోంది అవ్వా? అసలు ఈ కిన్నెరలు ఇలా మానవుల మీదికి ఎగబడటం దేనికి? గుట్ట దగ్గర శిథిల కట్టడంలో వున్న వృద్ధుడు ఎవరు? ఏమిటి ఈ గందరగోళం?" కూర్చున్న చోటినుంచి ఒక్కపాదం మేరకూడా కదలకుండా అలాగే కూర్చుని వృద్ధురాలిని అడిగింది యువరాణి.

"ఎన్ని రోజులు ఇలా కూర్చుంటావు తల్లీ... ఈ సంఘటనలు జరిగి చాలా కాలం అయింది. జరిగిపోయిన వాటి మీద నీకు ఇంత కుతూహలం అవసరమా?" చిరునవ్వుతో ప్రశ్నించింది వృద్ధురాలు.

"నువ్వే చెప్పావు కదా... ఆ శ్యామలుడికి దొంగగా మారవలసిన అవసరం లేకపోయినా అతను చెడు మార్గంలోకి అడుగుపెట్టాడని. అలా ఎందుకు జరిగిందో తెలుసుకోవాలని అనుకోవటం సహజమే కదా" అన్నది యువరాణి.

"శ్యామలుడు దొంగగా మారిన మాట నిజమే కాని, చెడు మార్గంలోకి అడుగుపెట్టాడని నేను నీకు చెప్పలేదు" వెంటనే అడ్డుకున్నది వృద్ధురాలు.

"చెడు మార్గమని అనుకున్నా, మంచి మార్గమేనని భావించినా అతను గజదొంగగా మారిన మాట యదార్థమే కదా...." రెట్టించింది యువరాణి.

మౌనంగా తల ఊపింది వృద్ధురాలు.

"అయితే నాకు వివరంగా చెప్పు... ఆ మట్టిగుట్ట మీది శిథిల భవనంలో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యాలకు సరయిన వివరణ చాలా అవసరం" అన్నది యువరాణి.

"అది గతంలో పెద్ద శంబర ఆలయం... మంత్ర తంత్రాలను సాధించ దలచుకున్న క్షుద్ర మాంత్రికులు ఆ దేవతను ఆరాధిస్తారు. ఆ వృద్ధుడు కింకరుడు అని పిలువబడే ఒక మాంత్రికుడు. శంబర శక్తిని సాధించటానికి అక్కడ కాపు కాశాడు" అన్నది వృద్ధురాలు.

"మరి ఆ ఆలయం శిథిలం అయిపోయినట్లున్నది కదా" అన్నది యువరాణి.

"ఆలయం శిథిలం అయిపోయిన మాట వాస్తవమే అయినా, అందులోని దేవత యొక్క శక్తి సన్నగిల్లిపోలేదు".

"మరి ఆ కింకరుడి కోరిక ఎందుకు తీరటం లేదు... యాబది సంవత్సరాల నుంచీ ప్రయత్నిస్తున్నట్లు ఇందాక చెప్పాడు కదా..."

"శంబరదేవతను తృప్తి పరచటం అంటే మాటలు కాదు. మంత్ర జపాలు పూజలు పునస్కారాలు, యజ్ఞయాగాలు ఏవీ పనికిరావు..."

"ఏవి పనికి వస్తాయి? ఎలా తృప్తి పరచాలి?"

"అరివీర భయంకరులు. అత్యంత సాహసవంతులు అయిన మానవుల్ని వెతికి పట్టుకుని వారి కవోష్ణ రుధిర ధారలతో అభిషేకం చేయాలి. లేదా..." అంటూ మాటల్ని ఆపింది వృద్ధురాలు.

ఆమె కూడా మంత్ర తంత్రాలను నేర్చి వున్న మనిషే అని తెలిసి ఉండటం వల్ల ఏమంత ఆశ్చర్యంగా చూడలేదు యువరాణి.

"మాటను మధ్యలోనే ఆపటం దేనికి అవ్వా? సాహసవంతులను తీసుకువచ్చి బలి ఇవ్వడం ఒక పద్ధతి అని నాకు బోధపడింది. మరి రెండవ మార్గం ఏమిటో త్వరగా చెప్పు" అంటూ తొందర పెట్టింది.

"సాహసంతో ఆ శక్తిని సంతోషపెట్టాలి. తాను సంతసిస్తే ఎదుట ప్రత్యక్షమై ఎటువంటి కోరికలైనా వెంటనే తీరుస్తుంది" చెప్పింది వృద్ధురాలు.

"గజదొంగ శ్యామలుడు విపరీతమైన సాహసం కలిగినటువంటి వాడే అనటంలో ఎటువంటి సందేహం లేదు. అతని జతగాడు కూడా అటువంటి పోటుగాడే. ఆ దేవత అనుగ్రహాన్ని సంపాదించటానికి కావల్సిన అర్హతలన్నీ వారికి వున్నాయి" అన్నది యువరాణి.

ఫక్కున నవ్వింది వృద్ధురాలు. "పిచ్చితల్లీ... శంబర దేవతను ప్రసన్నం చేసుకోవాలనే కోరిక లేనివాళ్ళు వారిద్దరూ. ఆ దేవతను సంతోష పరచవలసిన అవసరం వారికి లేదు. ఇప్పుడు వారి ఎదుట ఉన్నది అక్కడి నుంచి క్షేమంగా ఆవలికి పోవటం ఎలా అనే సమస్య ఒక్కటే..." నవ్వుతూనే చెప్పింది.

ఎదుట ఉన్న పళ్ళెరంలోని నీటికేసి మరింత శ్రద్ధగా చూసింది యువరాణి.

* * * * *

చేతిలో ఉన్న కరవాలాన్ని వరలో పెట్టుకున్నాడు గదాధరుడు. అరచేతులు రెండింటినీ దుస్తులకేసి బలంగా రుద్దుకుని, అమాంతంగా గాలిలోకి ఎగిరాడు.

దొరికినట్లే దొరికి చిటికెలో జారిపోయింది ఒక మొండిగోడ పైభాగం. ఇసుకమూట క్రింద పడినట్లు దభేలున అతను క్రింద పడిపోబోతుండగా... చటుక్కున పట్టుకుని అతి జాగ్రత్తగా క్రిందికి దించాడు శ్యామలుడు.

"లేడికి లేచిందే ప్రయాణం అనే మాట నీ విషయంలో యదార్థం. ఏ పని చేయదలుచుకున్నా ముందు వెనుకా ఆలోచించుకోవాలి. గుడ్డిగా మందలో దూకకూడదు" అంటూ వెక్కిరించాడు.

"మిత్రమా... చీకట్లు దట్టమయి చాలా సమయం గడిచిపోయింది. అవతల ఆ పిశాచినులు మనం కనిపించక గంగవెర్రులెత్తిపోతూ ఉంటాయి. ఇక్కడ నువ్వేమో సామెతలు చెప్పి కాలహరణం చేస్తున్నావు..." చిరుకోపంతో అన్నాడు గదాధరుడు.

సమాధానం చెప్పలేదు శ్యామలుడు. చెల్లాచెదురుగా పడి ఉన్న కొండరాళ్ళను ఏరుకు వచ్చి శంబర దేవత విగ్రహం వెనుక గుట్టగా పేర్చటం మొదలు పెట్టాడు.

అతను ఎందుకు అలా చేస్తున్నాడో అప్పుడు అర్థమై, ఆ ఆలోచన తాను చేయలేకపోయినందుకు సిగ్గు పడినట్లు తల విదిలించాడు గదాధరుడు.

చూస్తూ చూస్తూ ఉండగానే నిలువెత్తుకు పేర్చబడ్డాయి కొండరాళ్ళు. చేతులకు అంటుకున్న దుమ్మును వదిలించుకోవటానికి ప్రయత్నం చేస్తూ, ఎత్తుగా పేర్చిన ఆ రాళ్ళమీదికి ఎక్కాడు శ్యామలుడు. అక్కడి నుంచి మూడు మూరల ఎత్తు మాత్రమే ఉన్న మొండిగోడ పైభాగం మీదికి అతి తేలికగా చేరుకుని, క్రింద ఉన్న గదాధరుడికి సైగ చేశాడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో అతని ప్రక్కకు చేరుకున్నాడు గదాధరుడు. అతను వారించేలోపల అవతలి ప్రక్కకు దూకి ముందుకు పరుగు తీశాడు.

"తొందర వద్దు... ఆత్రం అనవసరం..." చిన్న కంఠంతో అతన్ని హెచ్చరిస్తూ, తను కూడా అతని వెనుకే పరుగు మొదలుపెట్టాడు శ్యామలుడు.

శిథిల భవనం వెనుక భాగంలోకి చేరుకున్నారు ఇద్దరూ... సరిగ్గా అప్పుడే గదాధరుడి చెవులకు చేరింది ఒక వికృత ధ్వని.

"అయ్యబాబోయ్... శంబర దేవత నిలబడి ఉన్న మందిరంలో నుంచే వినవస్తోంది ఏదో శబ్దం. కిన్నెర పిశాచినులు ఆత్రం అణుచుకోలేక అందులోకి అడుగుపెట్టి ఏదో గొడవ ప్రారంభించినట్లు నాకు అనిపిస్తోంది." భుజాల మీది నుంచి వెనక్కి చూస్తూ చెప్పాడు శ్యామలుడికి.

తాను కూడా చూశాడు శ్యామలుడు. "అది మన యువతీమణులు చేస్తున్న శబ్దం కాదు. బరువైన చేతులు ఏవో మందిరపు గోడల్ని బలంగా తడుతున్న సవ్వడి..." అన్నాడు.

అతను అలా చెపుతున్న సమయంలోనే వికృత శబ్దాలు చేస్తూ తిరిగి పడిపోయింది ఒక గోడ... అంతకు ముందు వరకూ శంబరదేవత వెనుక భాగంలో చేతులు జోడించి నిలబడి వున్న ప్రతిమలు అన్నీ ప్రాణం వచ్చినట్లు ఆ గోడ వెనుక భాగంలో నుంచి ఇవతలకు వస్తున్న దృశ్యం కనిపించింది.

ఎండుకు పోయినట్లు అయింది గదాధరుడి గొంతు. వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది నోరు.

"పులి పోయి భూతం పట్టుకున్నట్లు తయారయింది మన పరిస్థితి. కిన్నెర పిశాచునులను తప్పించుకోబోతున్నామని సంతోషిస్తోంటే ఇప్పుడు ఈ భూతప్రేతాలు మన వెనుక ప్రత్యక్షం అవుతున్నాయి" స్వల్పంగా కంపిస్తున్న కంఠంతో శ్యామలుడికి చెప్పాడు.

"ప్రత్యక్షం అయిపోగానే మనం భయపడవలసిన అవసరం ఏమీ లేదు. వాటిని బాగా రెచ్చగొట్టు..." అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తల ఊపి, క్రింది నుంచి రెండు పలుకురాళ్ళను అందుకుంటూ చెప్పాడు అతనికి శ్యామలుడు.

"రెచ్చగొడితే అవి మరింత వేగంగా వచ్చేస్తాయి. పారిపోవటమే చాలా మంచిది" అన్నాడు గదాధరుడు. అనటం అయితే అన్నాడు గాని, పారిపో యేందుకు సిద్ధపడలేదు. శ్యామలుడి మాదిరిగానే తాను కూడా క్రింది నించి రెండు రాళ్ళను అందుకున్నాడు.

తను పైకి తీసిన రాళ్ళను బలంగా ఆ విగ్రహాల మీదికి విసిరాడు శ్యామలుడు.

గింగిరాలు తిరుగుతూ పోయి రెండు విగ్రహాల గుండెల్ని తాకాయి అవి. ఖంగుమంటూ వినవచ్చింది శబ్దం.

అంతకుముందు వరకూ ప్రశాంతంగానే ఉన్నట్లు కనిపించిన ఆ విగ్రహాల ముఖాల్లో ఉన్నట్లుండి వచ్చేసింది మార్పు. మూసి ఉన్న వాటి నోళ్ళు వెడల్పుగా తెరుచుకున్నాయి. తుప్పుపట్టిన బాకాలు మోగినట్లు వికృత శబ్దాలు వెలువడ్డాయి ఆ నోళ్ళలో నుంచి. రెట్టింపు అయ్యింది వాటి కదలికల వేగం... కన్నుమూసి కన్ను తెరిచేటంతలో భవనం వెనుక భాగంలోకి వచ్చి, స్నేహితుల మీద కలబడబోయాయి.

కదలకుండా నిలబడి ఉన్నట్లయితే–వాటి చేతులకు తప్పకుండా దొరికిపోయి ఉండే వాళ్ళు వారిద్దరూ.

తను పైకి తీసిన రాళ్ళను కూడా బలంగా విసిరేశాడు గదాధరుడు. “రండి... త్వరగా రండి... దగ్గరికి వచ్చి మా అంతు చూసే ప్రయత్నం చేయండి” అంటూ మళ్ళీ భవనం ముందు భాగంలోకి పరుగు మొదలు పెట్టాడు.

రెండవసారి వచ్చిపడిన రాళ్ళు తమ గుండెలకు తగిలేసరికి, మరింతగా పెరిగిపోయింది ఆ విగ్రహాల వేగం. గాలిలో తేలుతున్నట్లు వారిని వెంటాడటం మొదలు పెట్టాయి.

* * * * *

“ఈ స్నేహితులు ఇద్దరూ తెలివిగలవారో, తెలివి తక్కువ వారో తేల్చుకోవటం చాలా కష్టంగా ఉన్నది... దారినపోయే బాధలన్నిటినీ తమ తలల మీదికి తెచ్చుకోవడం వారికి అలవాటుగా మారినట్లున్నది” ఆ దృశ్యాన్ని చూస్తున్న యువరాణి వెంటనే అన్నది వృద్ధురాలితో.

“ఎందుకు అలా అనుకుంటున్నావు?” అడిగింది వృద్ధురాలు.

““అనుకోక ఏం చేస్తాను అవ్వా? క్షేమంగా అవతలి ప్రక్కకు చేరుకున్నారు. ఆ భవనం వెనుక నుంచి తరువాత తాము పాదాలకు బుద్ధి చెప్పవచ్చును కదా. ఆ విగ్రహాల మీద రాళ్ళువేసి వాటిని రెచ్చగొట్టడం దేనికి?” చిరుకోపంతో అడిగింది యువరాణి.

“నువ్వు చాలా పొరపాటు పడుతున్నావు. ఆ శ్యామలుడు ఏ పని చేసినా, ఆ పని వెనుక ఏదో ఒక పెద్ద కారణమే ఉండి ఉంటుంది. మాట్లాడకుండా చూస్తూ ఉండూ, నీకే అర్థం అవుతుంది” ముక్తసరిగా చెప్పింది వృద్ధురాలు.

తన మాటలకు సరైన సమాధానం లభించనందుకు కొంచెం మనసు కష్టపెట్టుకుంది యువరాణి. “నీకు ఆ దొంగలంటే అభిమానం అధికమని నాకు అనిపిస్తోంది” చురుకుగా చూస్తూ అన్నది.

"వారి మీద అభిమానం ఉన్నది నాకు ఒక్కదానికే కాదు... చాలామందికి వున్నది. నిజాయితీగా ఒప్పుకోగలిగితే నీకు కూడా ఉన్నది..." అన్నది వృద్ధురాలు.

"నాకేం లేదు... వాళ్ళు చేసే పనుల్ని నేను సమర్ధించటం లేదు" వేగంగా అన్నది యువరాణి.

"తిండి తిప్పల్ని గురించి ఆలోచించకుండా, కూర్చున్న ప్రదేశంలో నుంచి కదలకుండా ఆ దృశ్యాల్ని చూడాలని కోరుకోవటం ఎవరి ఆలోచన?" నవ్వుతూ అడిగింది వృద్ధురాలు.

మాటకు మాటగా సమాధానం చెప్పటానికి సిద్ధపడుతున్న యువరాణి చటుక్కున వదిలేసింది ఆ ప్రయత్నాన్ని. తలప్రక్కకు తిప్పుకుని తిరిగి పళ్ళెరం మీద తన దృష్టిని కేంద్రీకరించింది.

* * * * *

"వచ్చేశాయి మిత్రమా... దుర్మార్గపు విగ్రహాలు మన సమీపంలోకి వచ్చేశాయి..." చిన్న కంఠంతో స్నేహితుడిని హెచ్చరించాడు గదాధరుడు.

"పట్టుకో – గట్టిగా పట్టుకో... ఎట్టి పరిస్థితిలోనూ పారిపోనీయకూడదు" ఉన్నట్లుండి పెద్ద కంఠంతో ఆ మట్టి గుట్ట క్రింది భాగంలో నిలబడిన వారికి కూడా వినబడేటట్లు అరిచాడు శ్యామలుడు.

"అయ్యో... అయ్యయ్యో... దొరికిపోయాము మిత్రమా..." తను కూడా అదే మాదిరి కేక పెట్టాడు గదాధరుడు.

శిథిల భవనంలో ఉన్న మందిరాలన్నిటినీ కూలంకషంగా గాలించి, తమ దృష్టిని పూజా మందిరం మీదనే కేంద్రీకరించి, ఒక ప్రక్కగా నిలుచుని ఉన్న కిన్నెర యువతీమణులు ఇద్దరూ అదిరిపడి భవనం ముందు భాగంలోకి చూశారు.

వేగంగా పరిగెత్తుకు వస్తున్న స్నేహితుల్ని, వారి వెనుక ఉన్న విగ్రహ రూపాల్ని గమనించేసరికి వింతగా మెరిశాయి వారి కళ్ళు.

"రండి... రండి... మా చేతుల్ని స్పృశించి మీ అలసట తీర్చుకోండి" అంటూ అతి వేగంగా వెలుపలికి వచ్చి వారి దారికి అడ్డుగా నిలబడ్డారు.

పొరపాటున కూడా వారిని స్పృశించలేదు స్నేహితులు... చటుక్కున తలల్ని క్రిందికి వంచి, వారికి అరంగుళం దూరంలో నుంచి అవతలికి దూకేశారు.

వేగంగా తరుముకు వస్తున్న విగ్రహాలు మాత్రం అలా ప్రక్కకు తప్పుకోలేదు. బలిష్టంగా కనిపిస్తున్న తమ చేతుల్ని జాచి, ఆ యువతులిద్దరినీ అవతలికి నెట్టేందుకు చూశాయి.

వాటి చేతులు తమ శరీరాల్ని తాకిన మరుక్షణం మారిపోయాయి యువతుల రూపాలు. నాలుకల్ని వేగంగా లోపలికి బయటికి ఆడిస్తూ, రెండు నిలువుల ఎత్తున పడగల్ని పైకిలేపి, ఒకేసారి ఆ విగ్రహాల మీద విరుచుకు పడ్డాయి.

చూస్తూ చూస్తూ ఉండగానే మాయం అయిపోయాయి రెండు విగ్రహాలు. పది క్షణికాలు కూడా గడవక ముందే మిగిలినవి కూడా ఆ సర్పాలకు ఆహారంగా మారిపోయాయి.

"మిత్రమా... మన అంచనా తప్పిపోయింది. రాతి విగ్రహాలు... వాటికి మింగుడు పడవనీ, పెద్ద యుద్ధం జరుగుతుందనీ భావించాను. నా భావన తలక్రిందులైపోయింది. ఇప్పుడు ఈ పిశాచాలు మళ్ళీ మనకు నీడల మాదిరి తయారైపోతాయి" పాతిక అంగల దూరం పోయిన తర్వాత వెనుతిరిగి, ఆ దృశ్యాన్ని చూస్తూ వాపోయాడు గదాధరుడు.

అతని మాదిరిగా ఆందోళనకు గురికాలేదు శ్యామలుడు. "పాములు తమ ఆహారాన్ని ఏ విధంగా తీసుకుంటాయో వివరించి చెప్పు" అన్నాడు.

"ఏ విధంగా అంటే ఏమని చెప్పను? మన మాదిరిగా అవి ఆహారాన్ని నమిలి తినవు. గుటుక్కున మింగేస్తాయి" అన్నాడు గదాధరుడు.

"తేలికగా జీర్ణం అయ్యే ఆహారాన్ని నమిలినా నమలక పోయినా, గుటుక్కున మ్రింగినా పెద్ద ఇబ్బంది ఏమీ ఉండదు. నల్లరాతి బండల్ని మింగితే?" అడిగాడు శ్యామలుడు.

సమాధానం చెప్పటానికి నోటిని తెరిచి, చిన్నగా నవ్వేశాడు గదాధరుడు. "లోపలికి పోయిన తర్వాత గాని తమ ప్రభావాన్ని చూపించవు. పాపం... కిన్నెరల పరిస్థితి విషమంగా మారబోతున్నది" అన్నాడు.

అతను ఆ మాటలు చెపుతూ ఉండగానే, తమ సర్ప రూపాల్ని ఒదిలి, మానవ రూపాల్ని ధరించారు ఆ యువతీమణులు.

"మమ్మల్ని వదిలించుకోవడం మీకు సాధ్యపడదు..." అంటూ స్నేహితులు నిలబడిన ప్రదేశం వైపు బయలుదేరి, రెండు అడుగులు మాత్రమే వేశారు.

మూడవ అడుగు వేయకముందే, తీవ్రమైన బాధతో తల్లడిల్లిపోతున్నట్టు క్రిందికి వాలిపోయింది రెండవ యువతి.

ఆందోళన నిండిన కనులతో ఆమెవైపు చూసిన మొదటి యువతికి కూడా పట్టింది అదేగతి మరో క్షణికం తరువాత. నాభి ప్రదేశాన్ని చేతులతో అదుముకుంటూ నేలమీద పడిపోయింది ఆమె కూడా.

బాధను భరించడం అసాధ్యం అయిపోతున్నట్లు మెలికలు తిరగటం మొదలు పెట్టారు ఇద్దరూ.

ఉన్నట్లుండి మానవ రూపాలు మారిపోయాయి. తిరిగి సర్పాలుగా మారిపోయారు.

"మిత్రమా వాళ్ళ చరిత్ర ఇంతటితో సమాప్తం అయిపోయినట్లేనా?" తదేకంగా చూస్తూ అడిగాడు గదాధరుడు.

తల ఊపాడు శ్యామలుడు.

సరిగ్గా అప్పుడే రెండుగా చీలాయి ఆ రాక్షస సర్పాల శరీరాలు. వాటి ఉదరాలలో నుంచి బయటికి వచ్చాయి స్నేహితుల్ని తరుముకుంటూ వచ్చిన రాతి విగ్రహాలు.

"ఇప్పుడు మనం వేగంగా వెళ్ళిపోవాలి. ఆలస్యం చేస్తే కిన్నెరలకు పట్టినగతే మనకు కూడా పడుతుంది" అంటూ గుట్టక్రిందికి పరుగు మొదలు పెట్టాడు శ్యామలుడు.

"అయ్యయ్యో... గుట్టక్రిందికి పోకూడదు. మధ్యలో మనం తప్పించుకు వచ్చిన కింకరుడు మనకోసం ఎదురు చూస్తూ ఉంటాడు" అంటూ అతన్ని ఆపి, శిథిల భవనం వెనుక భాగంవైపు మరలించటానికి ప్రయత్నం చేశాడు గదాధరుడు.

ఆలస్యం చేయకూడదని శ్యామలుడు ఎందుకు హెచ్చరించాడో అప్పుడు తెలిసి వచ్చింది అతనికి. మరోసారి చాలా దగ్గరికి వచ్చేశాయి రాతి విగ్రహాలు.

ముందుకు జాస్తున్న వాటి చేతులకు అందకుండా పరుగు మొదలు పెట్టాడు అతను. గుట్ట మధ్య భాగంలోకి చేరుకుంటున్న సమయంలో వారి ఎదుట ప్రత్యక్షం అయ్యాడు కింకరుడు.

"ఆహారం తీసుకోకుండా అర్ధంతరంగా వెళ్ళిపోయారు మీరు? అలా చేయటం పద్ధతి కాదు. మర్యాద కూడా కాదు..." నడుము మీద చేతులు వేసుకుంటూ తీక్షణంగా అన్నాడు.

"అడ్డు తప్పుకోండి స్వామి. తీరికగా నిలబడి మీతో సంభాషించేందుకు వ్యవధి లేదు. తప్పుకోండి" అంటూ అతని ప్రక్కనుంచి అవతలికి దూకాడు శ్యామలుడు.

"ఆగు... ఆగిపో" అంటూ అతన్ని పట్టుకోవటానికి చేతులు జాచాడు కింకరుడు. రెండో ప్రక్కనుంచి తాను కూడా అవతలికి వెళ్ళిపోయాడు గదాధరుడు.

వారిద్దరి వంకే చూస్తున్న కింకరుడికి – వారిని తరుముకుంటూ వస్తున్న విగ్రహాలను గమనించడం సాధ్యపడలేదు.

గమనించేసరికి చాలా ఆలస్యం అయిపోయింది. గుంపుగా వచ్చి అతన్ని చుట్టుముట్టేశాయి అవి.

భయంతో బిగుసుకుపోలేదు కింకరుడు. గుండెలు జలధరించేటట్లు వెర్రిగా నవ్వాడు. నవ్వుతూ వుండగానే మారిపోయింది అతని ఆకారం. చిక్కి శల్యమై పోయిన మనిషి కాస్తా, బలంగా వున్న యోధుడి మాదిరి కనిపించాడు. పదునైన కరవాలం ఉన్నది అతని చేతుల్లో.

"నాకు మరణం లేదు. పాములడొంకలో ఉన్న కిన్నెర జంటను సంహరించిన వారి చేతుల్లో తప్ప నేను మరణించటం అసంభవం. శాంబరీదేవి అనుగ్రహం సంపాదించుకున్న తరువాత ఆ జంటను చంపిన వారు కూడా నన్ను జయించలేరు" అంటూ తల కరవాలాన్ని గిరగిరా తిప్పటం మొదలు పెట్టాడు.

అతని చేతులకు అందకుండా అవతలికి పోగలిగిన శ్యామలుడు ఆ దృశ్యాన్ని చూస్తూ అలాగే నిలుచుని వున్నాడు.

"ప్రమాదం తప్పిపోయిన తర్వాత ఇంకా తాత్సారం చేయటం మంచిది కాదు. మన దారిన మనం వెళ్ళిపోవటం చాలా ఉత్తమం. కదులు మిత్రమా..." అంటూ అతన్ని క్రిందికి తీసుకు పోవటానికి శక్తివంచన లేకుండా గదాధరుడు చేసిన ప్రయత్నం ఫలించలేదు.

"కింకరుడా... నువ్వు అతిశయపు మాటలు మాట్లాడుతున్నావు. నీ ఎదుట వున్నది ఎవరో పరకాయించి చూసుకో..." బిగ్గరగా అరిచాడు శ్యామలుడు.

రెండు విగ్రహాలకు తగిలి ఖంగుమని శబ్దం చేసింది కింకరుడి కరవాలం. ఆ శబ్దాలను విన్నవెంటనే అవగతం అయిపోయింది అతనికి.

"ఎలా సాధ్యపడింది ఇది? శాంబరీదేవి అనుచరగణాన్ని పూజా మందిరంలో నుంచి వెలుపలికి తీసుకు రావటం ఎలా?" ఆశ్చర్యం ఆందోళన నిండిన కంఠంతో అరిచాడు.

“ఆ మందిరంలోకి అడుగుపెట్టి, ఆ విగ్రహానికి అవసరమైన పూజలు చేయకపోతే ఈ విగ్రహాలు వెంట పడక తప్పదని నాకు అనిపించింది” సమాధానం ఇచ్చాడు శ్యామలుడు.

“మీరు సామాన్యులు కారు. నా నుంచి దూరంగా పారిపోయినప్పుడే నాకు తెలిసిపోయింది. మిమ్మల్ని బంధించి ఆ తల్లికి బలి ఇస్తే తప్పకుండా నా అభీష్టం నెరవేరుతుంది” అంటూ శ్యామలుడి కేసి పరిగెత్తుకు రాబోయాడు కింకరుడు.

“నా దగ్గిర వున్న విగ్రహాల గురించి మర్చిపోకు...” హెచ్చరించాడు శ్యామలుడు.

“నన్ను ఏమీ చేయలేరు. కిన్నెర యువతులకు సహకరించటం వీటికి అసాధ్యం. అసలు ఇవి పాములడొంక దగ్గరికి పోవటమే జరుగదు.” అంటూ కత్తిని వదిలి వేగంగా కదలబోయిన అతన్ని వెనుక నుంచి పట్టుకున్నది ఒక విగ్రహం.

“వదులు... నన్ను వదులు... నువ్వు నన్ను ఏమీ చేయలేవు” వెర్రిగా అరిచాడు అతను.

గోగుపుల్లను విరిచినట్లు అతని మెడను పుటుక్కున విరిచేసింది ఆ విగ్రహం. మెడ విరిగిన బొమ్మ మాదిరి వ్రేలాడబడి పోయిన అతన్ని ఆవలికి విసిరేసి... మరోసారి స్నేహితులవైపు కదిలింది. దడదడమని శబ్దాలు చేస్తూ దాన్ని అనుసరించాయి మిగిలినవి.

మనల్ని వెతుక్కుంటూ వచ్చిన కిన్నెర యువతుల్ని గురించి ఇతనికి తెలియదు. “మితి మీరిన ఆత్మవిశ్వాసం ఇతన్ని నాశనం చేసేసింది” అడ్డదిడ్డంగా పడిపోయిన కింకరుడి శరీరాన్ని చూస్తూ సానుభూతి సూచకంగా అన్నాడు శ్యామలుడు.

“నీ సానుభూతి నీ దగ్గిరే దాచిపెట్టుకో. ఆలస్యం చేస్తే అతనికి పట్టిన గతే మనకు కూడా పడుతుంది. ఆ విగ్రహాలకు అలుపు ఆయాసం ఉన్నట్లు కనిపించటం లేదు. మన దగ్గరికే వస్తున్నాయి” ఆందోళన నిండిన కంఠంతో అతన్ని హెచ్చరించాడు గదాధరుడు.

నేల అదిరేటట్లు శబ్దాలు చేస్తూ వస్తున్న విగ్రహాలను పరిశీలనగా చూస్తూ, స్నేహితుడితో పాటు మరోసారి పరుగు మొదలు పెట్టాడు శ్యామలుడు.

మట్టిగుట్ట దిగారు ఇద్దరూ... అయినాసరే వెనక్కి పోవటం గాని, వారిని వెంటాడే ప్రయత్నాన్ని ఆపటం గాని, ఆ విగ్రహాలు చేయలేదు. అలానే అనుసరించి కదులుతున్నాయి.

అంతకుముందు ఏ మార్గంలో రాబందుల గుట్ట మీది నుంచి ఇవతలికి వచ్చారో అదే మార్గాన్ని అనుసరించారు స్నేహితులు ఇద్దరూ. తూర్పు దిక్కు తెల్లబడుతున్న సమయంలో గుట్ట అవతలి వైపున వుండే బండల్ని చేరుకున్నారు. అక్కడి నించి రహదారి దగ్గరికి పరుగులు తీశారు.

సూర్యుడి కిరణాలు పడి తళతళ మెరుస్తున్న విగ్రహాలు-అలుపులేకుండా వారిని వెంటాడుతూనే వున్నాయి.

"మిత్రమా... నీ మనస్సులో ఏదో ఖచ్చితమైన ఆలోచన అడుగుపెట్టింది. కావాలనే నువ్వు ఈ రహదారి దగ్గరికి తీసుకువచ్చావు. మన అదృష్టం బాగుండి ఇక్కడ ఉండవలసిన సైనికులు అందరూ కిన్నెరులకు ఆహారమైపోయారు... అలా జరిగి ఉండకపోతే మనం ప్రమాదంలో చిక్కుపడే వాళ్ళం..." శ్యామలుడు చేసిన పనికి సగానికి సగం మంటల బారిన పడిన గుడారాలను గమనించు కుంటూ అన్నాడు గదాధరుడు.

ఆ మాటలకు సమాధానం చెప్పలేదు శ్యామలుడు. అంతకుముందు ఎవరికీ కనిపించకుండా తాను దాగున్న పొదల సమీపంలోకి పోయి, ఒకచోట దాచి పెట్టిన వస్త్రపు మూటను బయటికి తీశాడు.

దిగంబరస్వామికి కావల్సిన ఉంగరం ఆ మూటలోనే వున్నది. అది తమ శరీరాలకు తాకితే లేనిపోని ఆలోచనలు వస్తాయనే విషయం అనుభవ పూర్వకంగా తెలుసు కాబట్టి, దూరంగానే పెట్టి పట్టుకు వస్తున్నారు వారిద్దరూ.

"భూతాల మాదిరి తరుముకు వస్తున్న ఆ విగ్రహాలను గురించి ఆలోచించకుండా ఇప్పుడు మళ్ళీ ఈ ముదనష్టపు ఉంగరాన్ని బయటికి తీయటం దేనికి మిత్రమా?" విసుగు నిండిన కంఠంతో అడిగాడు గదాధరుడు.

"నేను దానిని ముట్టుకోబోతున్నాను... నా ప్రవర్తనలో మార్పువస్తే... వెంటనే దీనిని నా చేతిలో నుంచి అవతల పడేటట్లు ఏదో ఒకటి చేసేయ్..." అంటూ అతన్ని హెచ్చరించి, ఆ మూటను ఊడదీశాడు శ్యామలుడు.

సూర్యకిరణాలు సోకి తళతళ మెరుస్తున్న ఉంగరాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

వెంటనే అనిపించింది అతనికి. ఈ భూ ప్రపంచంలో ఆ ఉంగరాన్ని మించిన ఆభరణం మరొకటి లేనే లేదని.

అంతటి అందమైన వస్తువును తన దగ్గిరే శాశ్వతంగా ఉంచుకోవాలన్న కోరిక కూడా కలగటం ఆరంభం అయింది.

కనులు చిట్లించి అతని ముఖంవైపే చూస్తున్న గదాధరుడు వెంటనే పళ్ళు బిగించి బలంగా చరిచాడు అతని భుజం మీద.

“మిత్రమా... మిత్రమా... నిన్ను నువ్వు మర్చిపోకు. ఇది సాధారణమైన ఆభరణం కాదు...” బిగ్గరిగా అరిచాడు.

గదాధరుడు తనను ఉద్దేశించి ఎటువంటి మాట మాట్లాడినా, క్షణికం పాటు కూడా ఆలోచించకుండా అతని అభీష్టం ప్రకారం నడుచుకుంటాడు శ్యామలుడు. ఎందుకు ఏమిటి అని ఎదురు ప్రశ్నలు కూడా వేయడు.

అటువంటివాడు ఆ సమయంలో అతని మాటలు తనకు ఆగ్రహాన్ని కలిగించినట్లు కోపంగా చూశాడు. “ఇది నాకు చెందిన ఆభరణం. దీనిని నేను ఎవరికీ ఇవ్వడం జరుగదు. ఇది నాదే” పళ్ళు బిగించి చెప్పాడు అతనికి.

“నేను భయపడుతూనే ఉన్నాను. ఏదో చేయాలనే తపనతో దాన్ని పట్టుకున్నావు. నీ ఆలోచన ఏమిటో తనకు తెలిసిపోయినట్టు ఇది నిన్ను పూర్తిగా తనకు లోబడిపోయేటట్లు తన శక్తిని ప్రయోగిస్తోంది” అంటూ పిడికిలి బిగించి బలంగా కొట్టాడు అతని చేతిమీద.

“ఈ ఆభరణం నాకే స్వంతం. ఇది నాకు మాత్రమే చెందినది” అంటూ చేతిని వెనక్కి తీసుకోబోయాడు శ్యామలుడు.

అప్పటికే పడింది దెబ్బ. చేతిలో ఉన్న ఉంగరం గాలిలోకి ఎగిరింది.

అది తన చేతిలో నుంచి పైకి ఎగిరిన మరుక్షణమే తన చిత్తా భ్రమలో నుంచి బయటపడ్డాడు శ్యామలుడు.

“మంచి పనిచేశావు మిత్రమా... చాలా తెలివైన పని...” అంటూ ఆ ఉంగరపు మూటను ఏ చెట్టు కొమ్మకు తగిలించి తమవెంట తీసుకువచ్చారో, ఆ చెట్టు కొమ్మతో బంతిని కొట్టినట్లు ఉంగరాన్ని కొట్టాడు.

గింగిరాలు తిరుగుతూ పోయింది అది. పాతిక అంగల దూరంలోకి వచ్చేసిన విగ్రహాల దగ్గరికి పోయి ఒక విగ్రహం గుండెలకు తగిలింది.

ముందున్న మానవుల మీదనే దృష్టిని నిలిపి అడుగులు వేస్తున్న ఆ విగ్రహం చటుక్కున తలను వంచి క్రిందపడిన ఆ ఉంగరాన్ని చూసింది. చూడటంతో ఆగలేదు. ముందుకు వంగి చేతిలోకి తీసుకున్నది.

ఉంగరాన్ని తీసుకున్న వెంటనే ఎక్కడిదక్కడ ఆగిపోయింది అది. రెండు క్షణికాల పాటు తదేకంగా దాని వంక చూసి, ఉన్నట్లుండి వెనుతిరిగి వచ్చిన దారినే తిరిగి రాబందుల గుట్టకేసి నడవటం మొదలుపెట్టింది.

రహదారి దగ్గిర నిలబడి ఉన్న స్నేహితుల మీదనే దృష్టిని లగ్నం చేసి వున్న దాని సహచర విగ్రహాలు ఉన్నట్లుండి ఆగిపోయాయి.

రెండు అంగల్లో వెనక్కిపోయి, వేగంగా అడుగులు వేయబోతున్న విగ్రహాన్ని అడ్డుకున్నాయి వాటిలో రెండు. దాని చేతుల్లో వున్న ఉంగరాన్ని తాము వశపరచుకోవటానికి ప్రయత్నించాయి.

"దిగంబరస్వామి ఆ ఉంగరం కోసం ఎందుకు తహతహలాడి పోతున్నాడో ఇప్పుడు నీకు బాగా తేట తెల్లం అయింది కదా. అది దేవతా మూర్తుల్నే మోసం చేయగలదు" అన్నాడు గదాధరుడు.

అతని మాటలు అక్షర సత్యాలని వెంటనే ఋజువు అయింది.

తన దగ్గిర వున్న ఉంగరాన్ని వశపరుచుకోబోయిన విగ్రహాల మీద తిరగబడింది దాన్ని పట్టుకుని వున్న ఆకారం... పిడికిళ్ళు బిగించి వాటి గుండెల మీద బలమైన దెబ్బలు వేసింది.

అవి వెనక్కి తూలటాన్ని గమనించి వెంటనే ముందుకు దూకాయి మిగిలిన బొమ్మలు... రెండే రెండు క్షణికాల్లో దారుణమైన దొమ్మీయుద్ధం ఆరంభం అయింది అక్కడ.

అర్ధఘడియ పాటు సాగింది అది. ఉన్నట్లుండి క్రింద పడిపోయాయి రెండు విగ్రహాలు. బలమైన సమ్మెటతో ఎవరో కొట్టినట్లు ఊడి ఆవలకు దొర్లిపోయాయి వాటి తలలు.

చూస్తూ చూస్తూ ఉండగానే అదేవిధమైన గతి పట్టింది మిగిలిన విగ్రహాలన్నింటికీ... తమలో తాము కలహించుకుని, తమకు తాముగానే ఎందుకూ పనికి రాకుండా పోయాయి.

శ్యామలుడి చేతిలోనుంచి ఎగిరి వాటి దగ్గరికి పోయిన ఉంగరం మాత్రం నాశనం కాలేదు. సూర్య కిరణాలు పడి మిలమిల మెరుస్తూ తిరిగి స్నేహితులిద్దరికీ దర్శనమిచ్చింది.

విగ్రహాల పోరాటాన్ని తదేక దీక్షగా చూస్తున్న గదాధరుడు తన తలను రెండు చేతులతోను పట్టుకుని, నేలమీద చతికిల పడిపోయాడు. "ఈ దరిద్రం మనల్ని వదిలి పెట్టేటట్లు కనిపించటం లేదు మిత్రమా" అంటూ.

"వదిలిపెట్టి మనదారిన మనం వెళ్ళిపోదామా?"

సూర్యకిరణాలు పడి తళతళ మెరిసిపోతున్న ఉంగరాన్ని చూస్తూ గదాధరుడిని అడిగాడు శ్యామలుడు.

"వెళ్ళిపోవటం ఏమంత పెద్దపనికాదు... కానీ" అంటూ మాటల్ని ఆపాడు గదాధరుడు.

అతను అలా మాటల మధ్యలో ఉన్నట్లుండి మౌనం వహించాడంటే, అందుకు ఏదో బలమైన కారణం ఉండే ఉంటుందని తెలిసి ఉండటం వల్ల, చిరాకుపడలేదు శ్యామలుడు.

"నీ అనుమానం ఏమిటో త్వరగా చెప్పు. నడిచి నడిచి నా వళ్ళు చాలా బాగా నలిగిపోయి ఉంది. మంచి ప్రదేశాన్ని వెతుక్కుని విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు.

అప్పుడు కూడా మాట్లాడలేదు గదాధరుడు. కనులతో సైగ చేశాడు – ముందుకు చూడమని.

క్రిందపడిన ఉంగరం కేసి మళ్ళీ చూశాడు శ్యామలుడు.

వారిని తరుముకుంటూ వచ్చిన కొన్ని రాతి విగ్రహాల మెడలు విరిగి పడి ఉన్నాయి. గుండెలు గాయపడి, కాళ్ళు చేతులు విరిగి చెల్లాచెదరై ఉన్నాయి మిగిలినవి.

కంటికి కనిపించని వారెవరో ఆ అవశేషాలన్నిటినీ దగ్గరికి నెడుతున్నట్లు, తమంతట తామే జరిగి, ఒకచోటికి చేరుకుంటున్నాయి అవి.

"వాటికి మళ్ళీ ప్రాణం వస్తున్నట్లుంది మిత్రమా.... లేచి నిలబడిన వెంటనే తిరిగి మన మీద కలబడతాయి. ఏం చేద్దాం?" పెదవులు విప్పాడు గదాధరుడు.

విశ్రాంతి తీసుకోవాలని వున్నట్లు అంతకు ముందు చెప్పిన మాటల్ని మరిచిపోయాడు శ్యామలుడు. "అవి లేచి నిలబడేవరకూ వేచి ఉండటం అనవసరం, లేవకముందే ఇంకోసారి తలలు నరికి పారేద్దాం" అన్నాడు శ్యామలుడు.

"రాతి విగ్రహాలు అవి... గట్టిగా మాట్లాడితే రాయి మాదిరిగా కనిపించే ఏదో లోహంతో తయారు చేయబడినట్లు కనిపిస్తున్నాయి. తల నరకడం అసాధ్యం" అంటూ అటు ఇటూ చూసి, దగ్గిర్లో కనిపించిన ఒక పెద్ద కొండరాయిని అతి ప్రయత్నం మీద చేతుల్లోకి ఎత్తుకున్నాడు గదాధరుడు.

"ఎత్తి పడేస్తే రాయి అయినా, లోహమైనా అప్పడం మాదిరి అణిగి పోవాల్సిందే... నువ్వు కూడా అందుకో ఇంకో బండరాయిని" అని స్నేహితుడిని హెచ్చరిస్తూ ముందుకు పరిగెత్తాడు.

ఒక చోటికి చేరిన విగ్రహాల అవశేషాలు అన్నీ తిరిగి తమ తమ శరీరాలకు అతుక్కుంటాయని, ఒకదాని తర్వాత ఒకటిగా ఆ విగ్రహాలు లేచి నిలబడతాయని అనుకున్నాడు అతను. కాని చాలా దారుణంగా తప్పిపోయింది అతని ఊహ.

ఒకచోటికి చేరిన అవశేషాలు అన్నీ ఒకటిగా కలిసిపోయాయి. విడివిడి విగ్రహాలుగా కాకుండా ఒకే ఒక విగ్రహంగా రూపాంతరం చెందాయి అవన్నీ.

బలమంతా ఉపయోగించి పైకి ఎత్తిన బండరాయిని గబుక్కున ఆ రూపం మీదికి విసిరేశాడు గదాధరుడు. "మిత్రమా... తీసుకురా... ఇంకో బండని వెంటనే తీసుకువచ్చి ఈ పిశాచం మీదికి విసిరేయ్...." తన కరవాలాన్ని వరలో నుంచి బయటికి తీసి సిద్ధంగా పట్టుకుంటూ బిగ్గరగా అరిచాడు.

తాను కూడా ఇంకో బండరాయిని బలవంతంగా గాలిలోకి లేపాడు శ్యామలుడు. ఎడమ పాదాన్ని బలంగా నేలకు తాటించి పెద్దగా హుంకారం చేస్తూ ముందుకు విసిరేశాడు.

గింగిరాలు తిరుగుతూ పోయిందా బండ... దభీమని తగిలింది ఆ వికృతరూపం గుండెల మీద.

గదాధరుడు పడవేసిన బండను ఎడమచేత్తో ఒడిసి పట్టుకున్నది ఆ రూపం. శ్యామలుడు విసిరిన బండను దక్షిణ హస్తంతో అందుకుని అతి సుతారంగా క్రింద పడవేసింది.

కిలకిలమని మధురాతిమధురంగా నవ్వుతూ నిదారుగా లేచి నిలువబడింది.

తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నట్టు నోరుతెరుచుకుని నిలబడి పోయాడు గదాధరుడు.

వికృతంగా అరవటమో, క్రూరమృగం మాదిరి భయంకరంగా గర్జించడమో చేయవలసిన ఆ భీకరస్వరూపం మధురాతి మధురంగా, మనస్సుల్ని ఉత్తేజ పరిచే విధంగా తియ్యటి నవ్వు నవ్వటం ఏమిటి??

తను విసిరిన బండరాయి ఆ స్వరూపాన్ని గాయపరచలేక పోవటాన్ని గమనించి, క్షణికం పాటు కూడా ఆలోచించకుండా, మరో రాతికోసం చుట్టూ చూశాడు శ్యామలుడు.

“వచ్చేయ్ మిత్రమా... ముందు నువ్వు నా దగ్గరికి వచ్చేయ్... త్వరగా... త్వరగా....” హెచ్చరించాడు అతన్ని గదాధరుడు.

బండరాయి కోసం చూడటాన్ని వదిలేసి, మూడు అంగల్లో అతని దగ్గరికి పోయాడు శ్యామలుడు.

“మెచ్చాను చిరంజీవులారా... మీ అపూర్వ సాహసాలను చూసి నేను చాలా సంతోషించాను” నడుము మీద చేతులు వేసుకుంటూ మధురాతి మధురమైన కంఠంతో మాట్లాడింది – నిట్టనిలువుగా నిలుచున్న ఆ స్వరూపం.

అవసరం అయితే ఉపయోగించటానికి సిద్ధంగా పట్టుకున్న కరవాలాన్ని వెంటనే ఒరలోకి నెట్టి, ఒక అడుగు వెనక్కివేశాడు గదాధరుడు.

“నువ్వు... నువ్వు... ఎవరివి?” అనుమానంగా చూస్తూ అడిగాడు.

మరోసారి కిలకిలమని నవ్వింది ఆ స్వరూపం.

* * * * *

“పేరుకు మాత్రం మహా మహావీరులు. సాహసంలో సాటిలేని మేటి పరాక్రమవంతులు. బుద్ధులు మాత్రం చాలా స్వల్పం....” పళ్ళెరంలోని నీటిలో కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తూ ఈసడింపుగా అన్నది యువరాణి.

“అదేమిటి తల్లీ... అంత తేలికచేసి మాట్లాడుతున్నా రేమిటి? శ్యామల గదాధరులు చాలా తెలివైనవాళ్ళని, స్వయంగా నువ్వే గమనించావు కదా!” ఆశ్చర్యంగా అడిగింది వృద్ధురాలు.

“తెలివితేటలు కల వాళ్ళని ఎలా అనుకుంటావు అవ్వా... వాళ్ళ ఎదుట వున్న స్వరూపం ఎవరిదో గుర్తించటం చేతకావటం లేదు. సాష్టాంగ నమస్కారాలు చేసి తమ కోరికల్ని వెల్లడించకుండా తాత్సారం చేస్తున్నారు” విసురుగా అన్నది యువరాణి.

"వాళ్ళసంగతి వదిలిపెట్టు. ఆ స్వరూపం ఎవరిదో నువ్వు గుర్తించావా?" వినోదంగా చూస్తూ అడిగింది వృద్ధురాలు.

"నువ్వు చెప్పిన శాంబర శక్తే అయి ఉంటుంది. అపూర్వమైన సాహసంతో ఆ కిన్నెరల్ని నాశనం చేశారు వాళ్ళు. అందుకు సంతోషించి ప్రత్యక్షం అయింది" తన అభిప్రాయాన్ని తెలియచేసింది యువరాణి.

నవ్వుతూనే తల అడ్డం తిప్పింది వృద్ధురాలు. "శాంబర దేవతని ప్రత్యక్షంగా చూడటం ఎవరికీ సాధ్యపడదు. అసలు ఆ మహాశక్తిని వీక్షించటానికి తగిన శక్తి మానవ మాత్రులకు వుండదు. మహాతేజోవంతంగా ఉంటుంది. ఎంత కాంతివంతంగా ఉంటుందంటే – కళ్ళు తెరిచి ఉంచటం సాధ్యపడదు. ఒకవేళ మొండిగా తెరిస్తే టపాకాయల మాదిరి ఠప్పున ప్రేలిపోతాయి కనుగుడ్లు" చెప్పింది ఆమె.

"అలాగా... మరి ఇప్పుడు అక్కడ మాట్లాడుతున్నది ఎవరు?" తన అభిప్రాయాన్ని మార్చుకోవటానికి సిద్ధపడుతూ అడిగింది యువరాణి.

"శంబరశక్తి అనుమతి మీద ఆ అవశేషాలను ఆవహించిన ఆమె అంశ.. బహుశా ఆమె సహచరురాలైన మరో చిన్నదేవత అయివుంటుంది" చెప్పింది వృద్ధురాలు.

ఆ మాటలు తనకు అర్ధం కాకపోయినా, అర్ధం అయినట్లు తల ఊపి తిరిగి పళ్ళెరంలోని నీటి మీద కనిపిస్తున్న దృశ్యాలను వీక్షించటంలో నిమగమై పోయింది యువరాణి.

* * * * *

"ఎవరు నువ్వు?" సూటిగా ప్రశ్నించాడు శ్యామలుడు కిలకిలమంటున్న ఆ స్వరూపాన్ని.

"ఎన్నెన్నో తరాల నుంచీ ఈ కొండగుట్టల్ని ఆశ్రయించుకుని, తమ సమీపంలోకి వచ్చిన వారిని, సర్వనాశనం చేస్తున్న కిన్నెరలను నేర్పుగా మట్టుబెట్టించ గలిగారు మీరు...." అన్నది ఆ రూపం.

"వాడు... ఆ కింకరుడిని కూడా నేర్పుగానే వదిలించుకున్నాము. మర్చిపోయారా?" అడిగాడు వెంటనే గదాధరుడు.

మళ్ళీ నవ్వింది ఆ స్వరూపం అతి తియ్యగా.

"అధముల్లో కెల్లా అధమాధముడు వాడు... అత్యంత దురాశపరుడు. అన్నెం పున్నెం తెలియని ఎందరో అమాయకుల్ని వంచించి, ప్రాణాలు తీసిన దుర్మార్గుడు" అన్నది.

"అది వాడి తప్పు ఎంతమాత్రము కాదు. నరబలి కోరిన శాంబర దేవతది. ఎవడో బుద్ధి జ్ఞానం లేని వాడు ఏదో కోరిక కోరితే, ఇంకెవర్నో తీసుకువచ్చి బలి ఇవ్వాలనే నిబంధనలు విధించటం మహాదారుణం...." కోపంగా అన్నాడు గదాధరుడు.

"దేవతలు విధించే విధి విధానాలను సరిగ్గా అర్థం చేసుకోలేక ఎవరికి తోచిన అర్థాలు వారు తీసుకుంటూ ఉంటారు.. సాహసవంతుడి కవోష్ణరుధిర ధారలతో అభిషేకం చేయటం అంటే... ఎవరా సాహసవంతుడు?" అడిగిందా రూపం.

"ఇంకెవరు? నాలాంటి వాడే ఎవడో తలకు మాసిన వాడే అయి వుంటాడు" అన్నాడు గదాధరుడు.

మరోసారి నవ్వింది ఆ రూపం. "తప్పు... చాలాతప్పు... కోరిక ఎవరికి వుంటుందో వారే ఆ పని చేయాలి. ఆత్మత్యాగం చేయగలగటమే పెద్ద సాహసం...." అన్నది.

"అంటే కింకరుడు తనను తాను ఆ దేవతకు అర్పించుకుని వుంటే అతని కోరిక తీరి ఉండేదా?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

తల ఊపిందా స్వరూపం.

"మరి ఆ కిన్నెరలను వధించగల వాళ్ళ చేతిలో తప్ప తనకు మరణం లేదని ఆ కింకరుడు–" అంటూ మాటల్ని ఆపాడు గదాధరుడు.

"కిన్నెరలు దుష్టస్వరూపాలు – వాటిని మట్టుబెట్టగలిగిన వాళ్ళు నిజంగానే మహావీరుడు అయివుంటారు. అటువంటివారు ఆ కింకరుడిని వధించగలగటంలో ఆశ్చర్యం ఏముంది?" అడిగింది ఆ రూపం.

"నేను అడగదలుచుకున్నది ఏమిటంటే–" అంటూ మొదలు పెట్టిన గదాధరుడి భుజంమీద చేయివేసి బలంగా అదిమాడు శ్యామలుడు.

"అనవసరమైన సంభాషణ ఇది... జరిగిపోయిన సంఘటనల్ని గురించి మాట్లాడుకోవటం దేనికి?" అంటూ ఆ స్వరూపం కేసి తిరిగాడు.

అతను తనను ఏమి అడగబోతున్నాడో తనకు తెలిసి పోయినట్లు తల ఊపిందా స్వరూపం.

"శ్యామలి అంటారు నన్ను... నా తల్లి శాంబర దేవికి చెలికత్తెను. ఆ తల్లి ఆజ్ఞ మేరకు మీ ఎదుటికి వచ్చాను" అంటూ తాను ఎవరో తెలియజేసింది.

"అనుకోని విధంగా నీ దర్శనభాగ్యం లభించినందుకు చాలా సంతోషంగా వుంది తల్లీ... నిజంగా మేము అదృష్టవంతులం" వెంటనే అన్నాడు గదాధరుడు.

"నా తల్లి శాంబరదేవి అనుగ్రహాన్ని సంపాదించటానికి అవసరమైన సాహసం మీ ఇద్దరిలో ఉన్నది. మీ కోరికలు ఏమిటో తెలియచేయండి" అన్నది ఆ స్వరూపం.

శ్యామలుడి వైపు చూశాడు గదాధరుడు.

"కోరుకోండి... మీరు చేసే దానధర్మాలకు అవసరమైన ధనాన్ని కోరుకోండి... ఎటువంటి వీరుడినైనా ఎదిరించగల శక్తిని అడిగి తీసుకోండి... దిగంబరస్వామి వంటి మంత్రవాదుల్ని నిలువునా భస్మం చేయగల మార్గాల్ని చెప్పమని అడగండి" వృద్ధురాలి ఇంటిలో పళ్ళెరం ముందు కూర్చుని ఆ దృశ్యాన్ని చూస్తున్న యువరాణి తనకు తెలియకుండానే బిగ్గరిగా చెప్పింది.

"వారి మాటలు నీకు తెలుస్తాయి. నువ్వు చెప్పేవి వారికి వినిపించవు. ఆ సంగతి మర్చిపోకు" ఆమెకు చెప్పింది వృద్ధురాలు.

చిన్నబోయింది యువరాణి వదనం. "సాహసమే తప్ప ఇంగితజ్ఞానం వారిద్దరికీ ఉన్నట్లు నాకు అనిపించడం లేదు... ఎందుకు పనికిరాని కోరికలు ఏవో కోరుకుంటారు... నాకు తెలుసు" కచ్చగా చెప్పిందామె.

ఆమె అభిప్రాయం అక్షరాలా యదార్థమైనట్లు కనిపించింది వెంటనే.

"మాకు దేవతలను కోరదగిన కోరికలు ఏమీ లేవు" నిర్వికారంగా అన్నాడు శ్యామలుడు.

"నిజంగానే మీకు ఎటువంటి కోరికలు లేవా?" రెట్టించింది ఆ రూపం.

"ఉన్నాయి తల్లీ. ఒకటి రెండుకాదు. బోలెడు కోరికలు ఉన్నాయి. కాని ఇప్పుడు వచ్చిన చిక్కు ఏమిటంటే, మా శక్తి యుక్తులు మాత్రమే ఉపయోగించుకుని ఆ కోరికల్ని తీర్చుకోవాలి... దేవతల్ని ఆరాధించకూడదు... వరాలు పొందకూడదు... మానవ ప్రయత్నం ఒక్కటే మాకు తోడు...." తాను కూడా నమ్మకంగానే చెప్పాడు గదాధరుడు.

"మా అధినాయకి మీ ఎడల చాలా సంతృప్తురాలు అయింది. మీరు ఏదో ఒక కోరిక కోరుకోక తప్పదు...." పట్టిన పట్టు వదలకుండా అన్నది ఆ స్వరూపం.

"అయితే ఒక పని చేయి తల్లీ... త్రివిశా నగరాన్ని పరిపాలించే త్రికుట వర్ధనుడి దగ్గరికి దిగంబర స్వామి అనే మంత్రవాది చేరుకున్నాడు. వైదర్భి

పాలకుడైన విలాసుడిని జయించి ఆ నగరాన్ని అల్లకల్లోలం చేయాలని, త్రికుట వర్ధనుడి కోరిక. ఆ దిగంబరస్వామిని అశక్తుడిని చేసేయ్...." అన్నాడు గదాధరుడు.

పది క్షణికాల పాటు మౌనంగా వుండిపోయిందా స్వరూపం.

"ఏమిటి తల్లీ ఆలోచన? దిగంబరస్వామికి ఈ భూమి మీద ఇంకా నూకలున్నాయా? అతనికి ఆయువు తీరే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?" అడిగాడు అతను.

ఉలిక్కిపడినట్లు అయిందా స్వరూపం. "నీకు ఎలా తెలిసింది నాయనా... దేవతలకు తప్ప వేరెవరికీ తెలియని ఈ రహస్యాలు నీకు ఎలా వెల్లడి అయినాయి?" అని అడిగింది ఆశ్చర్యంగా.

"ఆయువు తీరే వుంటే ఈపాటికి వాడు మా చేతుల్లో ఎప్పుడో హతమారిపోయి ఉండేవాడు... అలా జరుగలేదు గనుక అతనికి ఇంకా మరణ సమయం ఆసన్నం కాలేదని అనుకోవాల్సి వస్తోంది" అన్నాడు గదాధరుడు.

సాలోచనగా తల ఊపిందా స్వరూపం. "దిగంబరస్వామిని ఏదైనా చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదు... ఇంకేదైనా కోరుకోండి" అన్నది.

"అదిగో... క్రింద పడి వున్నది ఒక ఉంగరం... దిగంబర స్వామికి ప్రతి రూపం... మీ దగ్గర్నించి వచ్చిన స్వరూపాలను కూడా తికమకపెట్టి సర్వనాశనం చేసిన దారుణశక్తి. దాన్ని నిర్వీర్యం చేసేయ్" అన్నాడు గదాధరుడు.

మరోసారి తల అడ్డం తిప్పిందా స్వరూపం.

"క్షుద్రశక్తులు సృష్టించిన ఆభరణం అది. దాన్ని నిర్వీర్యం చేయాలంటే ఒక్కటే ఒక్కమార్గం ఉన్నది" అన్నది.

"ఏమిటది?" తడుముకోకుండా అడిగాడు గదాధరుడు.

"పసి బిడ్డల మాదిరి స్వచ్ఛమైన మనస్సు కల మనిషి దాన్ని పట్టుకుని అగ్నిలో పడవేస్తే అది నాశనమైపోతుంది...." చెప్పింది ఆ రూపం.

కుతుహలంగా చూస్తున్న గదాధరుడి వదనంలో వెంటనే ప్రత్యక్షం అయింది తీవ్రమైన నిరాశ.

"అడుగడుగునా ఏదో ఒక కోరికతో తపించి పోవటమో, తల్లడిల్లి పోవటమో తప్ప నీతిగా న్యాయంగా జీవించాలని అనుకునేవారు ఎవరూ

ఇంతవరకూ మాకు అగుపించలేదు... నువ్వు చెప్పిన మాటల్ని బట్టి ఆలోచిస్తుంటే ఈ దరిద్రపు ఆభరణాన్ని నాశనం చేయటం అసంభవమే అనిపిస్తోంది" అంటూ తన అలవాటు ప్రకారం చటుక్కున మాటల్ని ఆపాడు.

"ఏమయింది నాయనా? నీకు ఏమి గుర్తుకు వచ్చింది?" మురిపెంగా అడిగింది ఆ స్వరూపం.

"నేను పెద్ద మందబుద్ధిని తల్లీ... చెట్టంత మనిషిని చెంతనే పెట్టుకుని అనవసరమైన ఆలోచనలు చేస్తున్న పిచ్చివాడిని" అంటూ తాను వరలో పెట్టిన కరవాలాన్ని రివ్వున బయటికి లాగాడు అతను. దగ్గిర్లో వున్న ఒక బండ దగ్గరికి పోయి, బలంగా కొట్టాడు దాని మీద.

ఖంగుమంటూ వినవచ్చింది శబ్దం... శబ్దంతో పాటు నాలుగు పక్కలకు చెదిరాయి నిప్పురవ్వలు.

ఎండుటాకులు, ఎండిపోయిన పొదలు వున్నాయి ఆ బండ దగ్గర... సూటిగా పోయి వాటి మీద పడ్డాయి కొన్ని రవ్వలు... చిటికెలో ప్రత్యక్షం అయ్యాయి ఎర్రటి మంటలు.

"మిత్రమా... నీ మనస్సులోని ఆలోచనలన్నింటినీ అణుచుకో... దాన్ని తీసుకువచ్చి ఈ మంటల్లో పడేయ్..." శ్యామలుడిని హెచ్చరించాడు అతను.

అంతకు ముందే తను ఆ ఆభరణాన్ని పట్టుకున్నప్పుడు తనలో కలిగిన వికారాలను గుర్తుచేసుకుని, తటపటాయించాడు శ్యామలుడు.

పళ్ళెరంలో ఆ దృశ్యాన్ని చుస్తూ యువరాణి, ఆశ్చర్యం నిండిన కనులతో వృద్ధురాలి వైపు చూసింది.

"ఆ గదాధరుడికి పిచ్చిపట్టింది. రాజ్యాలకు రాజ్యాలను గడగడలాడిస్తున్న గజదొంగ ఆ శ్యామలుడు... అతను ఆ ఉంగరాన్ని మంటల్లో పడేయటం ఏమిటి?" విపరీతమైన ఆశ్చర్యంతో అడిగింది.

"చూస్తూ వుండు తల్లీ... శ్యామలుడు ఎటువంటి వాడో నీకే తెలుస్తుంది. తినబోతూ రుచులు అడగటం దేనికి?" సమాధానం ఇచ్చింది వృద్ధురాలు.

తటపటాయిస్తున్న శ్యామలుడి దగ్గరికి పోయి భుజం మీద చెయ్యివేసి బలంగా ముందుకు నెట్టాడు గదాధరుడు.

"సిద్ధంగా వుండు... నా ప్రవర్తనలో ఏదైనా మార్పు కనిపిస్తే వెంటనే ఏదో ఒకటిచేసి దాన్ని అవతల పడేటట్లు చేసేయ్...." అంటూ మూడు అడుగులు వేసి క్రింద వున్న ఉంగరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు శ్యామలుడు.

వెంటనే మారిపోయాయి అతని ముఖ కవళికలు... అపురూపమైన ఆభరణం అయాచితంగా లభించినట్లు దాన్ని తన దుస్తుల్లో దాచుకోబోతుండగా...

"మిత్రమా... నువ్వు శ్యామలుడివి... సామాన్యుడి మాదిరి చిన్నచిన్న ఆశలకు లొంగిపోయే వాడివి కాదు... పారేయ్ దాన్ని... అవతలికి విసిరేయ్" ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించాడు గదాధరుడు.

ముఖం మీద ఎవరో చాచిపెట్టికొట్టినట్లు అదిరిపడి, గట్టిగా పట్టుకున్న ఆ ఉంగరాన్ని బలంగా విసిరి వేశాడు శ్యామలుడు.

సూటిగా పోయి భగభగలాడుతున్న ఎండుపొద మీద పడింది అది. వెంటనే వినవచ్చింది కంటికి కనిపించని శక్తి ఏదో హృదయ విదారకంగా ఆక్రోశించిన శబ్దం.

నల్లటి పొగ ఒకటి సుడులు తిరుగుతూ పైకి లేచి గాలిలో కలిసిపోయింది. భగభగలాడుతున్న ఎండు పొద ఎవరో గట్టిగా అదిమేసినట్లు అణిగిపోయింది.

"సాధు... వీరులారా... సాధు... సాహసమే కాదు స్వచ్ఛమైన మనస్సులు కూడా మీ స్వంతమే... మీరు తలపెట్టిన పనులన్నీ విజయవంతం అవుతాయి. మీ కోరికలన్నీ సిద్ధిస్తాయి... మహాదేవి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీ మీద వర్షిస్తూనే వుంటాయి...." అంటూ రెండు చేతులను ఎత్తి ఆశీర్వదించింది ఆ దృశ్యాన్ని చూస్తున్న స్వరూపం.

ఆ మాటలు ముగిసిన మరుక్షణం ఇసుకతో తయారు చేయబడిన బొమ్మ మాదిరి పొడుము పొడుమై క్రిందికి రాలిపోయిందా రూపం.

"అవ్వా... నేను నమ్మలేకపోతున్నాను. గజదొంగ శ్యామలుడు స్వచ్ఛమైన మనసు కలవాడు ఎలా అయినాడు?" ఆశ్చర్యంగా అడిగింది వృద్ధురాలిని యువరాణి.

"పిచ్చితల్లీ... తనకోసం అతను ఎటువంటి అపరాధం చేయటం లేదు. అవతలి వారికోసం తన ప్రాణాలను కూడా త్యాగం చేయగల ధీరుడు... ఆ ఉంగరాన్ని నాశనం చేయటానికి అవసరమైన అర్హతలు అన్నీ అతనికి వున్నాయి" అన్నది వృద్ధురాలు.

"మరి దాన్ని పట్టుకున్నప్పుడు అతనికి చెడు ఆలోచనలు వస్తున్నాయి కదా...." అన్నది యువరాణి.

"ఆలోచనల్ని కార్యరూపంలో పెట్టినప్పుడే మనస్సు కళంకితం అవుతుంది. ఆ విషయాన్ని గ్రహించినందు వల్లనే గదాధరుడు అతని చేత ఆ ఉంగరాన్ని మంటల్లో వేయించగలిగాడు...." చెప్పింది వృద్ధురాలు.

"ఏది ఏమైనా ఈ వీరులు ఇద్దరూ ఎవరికీ అర్థం కారు. వీరి చరిత్ర చాలా విచిత్రంగా వుంది" అన్నది యువరాణి.

* * * * *

తన వెనుకే బయలుదేరబోయిన పరివారంలో ఒక్క తన మంత్రిని తప్ప మిగిలిన వారందరినీ సభాభవనంలోనే వుండమని ఆజ్ఞ ఇచ్చాడు త్రివిశా నగరాన్ని పరిపాలించే త్రికుట వర్ధనుడు.

సభ జరుగుతుండగా దుమ్ముధూళిలో నిండిన దుస్తులతో, అదే పనిగా ప్రయాణం చేసి రావటం వల్ల ఉత్పన్నమైన అలసట నిండిన వదనంతో, ఒక అనుచరుడు సింహాసనం చెంతకు రావటమే అందుకు కారణం.

"తమరి కోరిక నెరవేరింది ప్రభూ... ఆ దిగంబర స్వామిని మన నగరం లోకి తీసుకురాగలిగాము...." చిన్న కంఠంతో ప్రభువుకు మాత్రమే వినిపించేటట్లు విన్నవించాడు.

నేతి కాగడాలు వెలిగించినట్లు ఒక్కసారి విప్పారింది త్రికుట వర్ధనుడి వదనం... "ఇక మీదట ఆ విలాసుడి ఆటలు కొనసాగవు... వైదర్భి నగరం మనకు వశమైపోయినట్లే...." సంతోషంగా అంటూ సింహాసనం దిగాడు.

"ప్రభూ... ఆ దిగంబరుడు పెద్ద మానసిక రోగి మాదిరిగా కనిపిస్తున్నాడు. అతనితో వ్యవహారం కత్తిమీద సాము వంటిది" వెంటనే హెచ్చరించాడు ఆ అనుచరుడు.

"మంత్రశక్తి కలిగినటువంటి వారి చర్యలు మాటలు అన్నీ మానసిక రోగుల్ని తలపిస్తాయి. మరేం పరవాలేదు... మేము సమర్థించుకోగలం... మీరు అతనికి అత్యంత ప్రీతిపాత్రమైన పానీయాన్ని వెంటనే సిద్ధం చేయించండి" అంటూ సభ వెలుపలికి బయలుదేరాడు.

అదిగో... అప్పుడు అతన్ని అనుసరించటానికి సిద్ధం అయినారు సభలో వున్న వారందరూ.

"సభా కార్యక్రమాలు యధాతథంగా కొనసాగించండి. అత్యవసరమైన కార్యమొకదాన్ని సరి చూసుకుని మేము వెంటనే వస్తాము" అంటూ తన మంత్రిని మాత్రం వెంటబెట్టుకుని ఆ భవనం వెలుపలికి వచ్చాడు ప్రభువు.

రాజభవనానికి దూరంగా వున్న ఉద్యానవనంలోని అందమైన భవనంలో దిగంబరస్వామికి విడిది ఏర్పాటు చేశారు అతని అనుచరులు.

పరమ వికృతంగా వున్న ఆ మాంత్రికుడి అవతారాన్ని చూడలేక, కనుల్ని అతి బలవంతంగా ప్రక్కకు తిప్పుకుంటున్నారు- అతనికి సేవలు చేసేందుకు నియమించబడిన పరిచారికలు.

వింజామరలు పట్టుకుని నిలబడి వున్నారు ఇద్దరు యువతులు. తెల్లగా పాలిపోయి ఉన్నాయి వారి ముఖాలు. భయంకరమైన భూతాన్నో, పిశాచాన్నో చూస్తున్నట్లు వణికిపోతున్నారు.

వారిద్దరినీ భవనం వెలుపలికి పంపించి, ఒక ఆసనం మీద చేరగిలపడి కూర్చుని వున్న దిగంబర స్వామికి నమస్కారం చేశాడు ప్రభువు.

"మంత్రవేత్తలు నా మాటను మన్నించి వచ్చినందుకు కృతజ్ఞతలు... తమరికి అత్యంత ప్రీతిపాత్రమైన పానీయం...." అంటూ మాటలు మొదలు పెట్టాడు.

మధ్యలోనే చేతిని ఎత్తి అతన్ని ఆపివేశాడు దిగంబరస్వామి.

"మహా మహిమాన్విత శక్తులు కలిగిన నా ముద్దుల ఉంగరాన్ని పోగొట్టుకోవటం వల్ల సగానికి సగంగా నశించిపోయాయి నా శక్తులు. నీ కోరిక నెరవేర్చేందుకు అవసరమైన ఒకే ఒక శక్తి వున్నది...." అంటూ ఆసనం మీది నించి లేచాడు.

మరింత సంతోషంతో పొంగిపోయాడు త్రికుట వర్ధనుడు.

"ఆవాహన చేయండి స్వామీ... వెంటనే పిలిచి ఆ నగరం మీదికి పంపకం చేయండి.... తరతరాల మా పగ ఈ రోజుతో తీరిపోవాలి...." ఆవేశంగా చెప్పాడు.

చిందరవందరగా తన భుజాల మీద పడుతున్న చింపిరి జుట్టును సవరించుకుంటూ పెద్దగా నవ్వాడు దిగంబరస్వామి.

"పిలిస్తే పలికే శక్తి కాదు అది. మనమే స్వయంగా వెళ్ళి ఆహ్వానించాలి అందుకు సిద్ధమేనా?" అని అడిగాడు.

సర్వనాశనం అయిపోతున్న వైదర్భి నగరం కనుల ముందు మెదిలి ఇంకా ఇంకా సంతోష పడిపోయాడు త్రికుట వర్ధనుడు.

"తమరి ఆజ్ఞల్ని నేను తూచా తప్పకుండా ఆచరణలో పెడతాను. ఆ శక్తిని ఆహ్వానించటానికి అవసరమైన ఏర్పాట్లు చేయిస్తాను. ఆజ్ఞ ఇవ్వండి" వినయాతి వినయంగా చెప్పాడు.

"ఏర్పాట్లు ఇక్కడకాదు... అక్కడ...." అంటూ నేలకేసి చూపించాడు దిగంబరస్వామి.

అర్థం కాలేదు త్రికుట వర్ధనుడికి. "ఎక్కడ స్వామి" అయోమయంగా చూస్తూ అడిగాడు.

"నేను చెపుతున్న శక్తి నేలమీద నివశించటం లేదు. నేల లోపల నివాసం ఏర్పరుచుకుని ఉంటుంది. కత్తులతో పొడిచినా పట్టించుకోని గాఢనిద్దురలో మునిగి వుంటుంది. నిద్ర లేపాలి. మన కోరికను నివేదించాలి...." చెప్పాడు దిగంబరస్వామి.

రెండు అంగల దూరంలో నిలుచుని ఉన్నాడు త్రికుట వర్ధనుడితోపాటు వచ్చిన మంత్రి. ఆ మాటల్ని వినగానే సైగ చేశాడు.

అసహనంగా చూస్తూ అతని దగ్గరికి పోయాడు త్రికుట వర్ధనుడు.

"ప్రభూ.... ఈ దిగంబరుడి మాటలు నాకు భయాన్ని కలిగిస్తున్నాయి" తడబడుతున్న కంఠంతో అన్నాడతను.

"భయపడవలసిన అవసరం ఏమీ లేదు... తను కదా వెళ్ళి ఆ శక్తితో మాట్లాడేది...." అన్నాడు ప్రభువు.

"అతని మాటలు వేరే విధంగా వున్నాయి. తమర్ని కూడా కలుపుకుని మాట్లాడుతున్నాడు" అన్నాడు మంత్రి.

దిగంబరస్వామి వైపు చూశాడు త్రికట వర్ధనుడు.

చాలా చిన్న కంఠంతో మంత్రి మాట్లాడిన మాటలు తనకు వినబడినట్లు విపరీతంగా నవ్వాడు దిగంబరస్వామి.

"నేను చెపుతున్న శక్తి సామాన్యమైనది కాదు... ఆ శక్తితో ఎవరికి అవసరం వుంటే వారే స్వయంగా ఎదుట నిలబడి తమ కోరికల్ని విన్నవించు కోవాలి. మీ ప్రభువు నాతోపాటు భూగర్భంలోకి రాక తప్పదు" అన్నాడు.

తెల్లబోయాడు మంత్రి... తడబడిపోయాడు త్రికుట వర్ధనుడు.

"నీకు వైదర్భిని జయించాలన్న కోరిక వుంటే నేను చెప్పినట్లు చేయక తప్పదు" ఖచ్చితమైన కంఠంతో అన్నాడు దిగంబరస్వామి.

మటుమాయం అయిపోయాయి త్రికుట వర్ధనుడి ఆలోచనలు. పళ్ళు బిగించి తల ఊపాడు.

వెంటనే అతని చేతిని పట్టుకుని తన పాదాల క్రింద అందంగా అమర్చి వున్న చలువరాళ్ళను బలంగా తాకించాడు దిగంబరస్వామి.

దట్టంగా పైకి లేచాయి దుమ్ముతెరలు. నిలుచున్న వారు నిలుచున్న పళాన ఊబి నేలలో దిగబడినట్లు క్రిందికి వెళ్ళిపోయారు. ప్రక్కకు జరిగి దారి ఇచ్చిన చలువరాళ్ళ స్థానంలో పెద్ద సొరంగం ప్రత్యక్షం అయింది.

"ప్రభూ.... ప్రభూ...." అని ఆందోళనగా పిలుస్తూ ముందుకు పరిగెత్తుకు వచ్చాడు మంత్రి.

భయంకరంగా వున్న ఆ గోతిని చూసేసరికి చెమటలు ప్రత్యక్షం అయ్యాయి అతని ముఖం మీద.

* * * * *

ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేస్తూ రావటం వల్ల విపరీతంగా అలసిపోయింది మహారాణి.

నగర ద్వారానికి వంద ధనువుల దూరంలో వున్న ఒక పెద్ద చెట్ల తోపులో ఆగిపోయింది ఆమె. "జరిగింది ఏమిటో పరాయి వారెవరికీ తెలియ కూడదు" అంటూ తన కంఠాభరణం ఒకదాన్ని తీసి తమతోపాటు వచ్చిన సైనికుడికి అందించింది. మౌనంగా తల ఊపాడు అతను.

"వెళ్ళిపో... నీ దారి ఏదో నువ్వు చూసుకో. మా వెంట రావాల్సిన అవసరం లేదు" చిన్న కంఠంతో హెచ్చరించింది మహారాణి చెలికత్తె.

తనతో వారికి అవసరం తీరిపోయిందని గ్రహించాడు ఆ సైనికుడు. నగరంలోకి అడుగుపెట్టిన వెంటనే అసలు తను ఎవరో తమకు తెలియనట్లే సంచరిస్తారని తెలిసిపోయింది.

"తల్లీ... నగర ద్వారాల దగ్గిర వున్న భటులు చాలా కరుకుగా మాట్లాడతారు. వారితో సంభాషించటం మీకు చేతకాదు. వారు మర్యాదగా ప్రవర్తించాలంటే మీరు ఎవరో తెలియచెప్పాలి. ఇప్పుడున్న పరిస్థితిలో ఆ పని చేయటం అసాధ్యం కదా...." అన్నాడు.

"మేము నగర ద్వారాల ద్వారా నగర ప్రవేశం చేస్తామని నీకు చెప్పలేదు. అధిక ప్రసంగం చాలించి నీ దారిన నువ్వు వెళ్ళిపో. వెళ్ళు." నొసలు ముడివేసి తీవ్రంగా చూస్తూ హెచ్చరించింది మహారాణి చెలికత్తె.

వారితో పాటుగా నగర ప్రవేశం చేసి, అప్పటి వరకూ ఏర్పడిన పరిచయాన్ని మరింత దృఢపరచుకోవాలన్న కోరిక పూర్తిగా నశించిపోయింది సైనికుడికి. తలవంచి అభివాదం చేశాడు. వెనుతిరిగి చెట్లతోపులో నుంచి వెలుపలికి పోయాడు.

"వెళ్ళిపోయాడా? సరిగ్గా చూశావా?" అసహనంగా చెలికత్తెను అడిగింది మహారాణి.

వెళ్ళినట్టే వెళ్ళి ఏదైనా చెట్టు చాటున నిలబడి వున్నాడేమోనన్న అనుమానం ఆమెది. తను కూడా పది అడుగులు అవతలకి వేసి, "వెళ్ళిపోయాడు తల్లీ... ఎక్కడా నిలబడలేదు" అన్నది చెలికత్తె.

వెంటనే ఒక పెద్ద రావిచెట్టు మొదట్లో ఉన్న చిన్న గట్టు దగ్గరికి పోయింది మహారాణి... ఆ గట్టు మధ్యలో వున్న ఒక నాపరాయిని పట్టుకుని బలంగా పైకి ఎత్తింది.

చిమ్మచీకటితో నిండి వున్న పెద్ద సొరంగం ఒకటి ప్రత్యక్షం అయింది ఆ రాయి క్రింద.

"త్వరగా వచ్చేయ్.... ఇప్పటికే చాలా ఆలస్యం అయింది" అని చెలికత్తెను హెచ్చరిస్తూ, ఆ సొరంగంలోకి దిగింది ఆమె.

తను కూడా ఆమెను అనుసరించింది చెలికత్తె. సొరంగం లోకి దిగిన వెంటనే చేతుల్ని బయటికి జాచి, మహారాణి పైకి ఎత్తి అవతలపెట్టిన నాపరాయిని తిరిగి ద్వారం మీద మూత పెట్టేసింది.

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించనంత కటిక చీకటితో నిండి వున్న ఆ సొరంగమార్గం తనకు బాగా పరిచయం అయినట్లు, అతివేగంగా నడిచింది మహారాణి. పావుఘడియ తరువాత, అంతం అయిపోయింది ఆ మార్గం... అడ్డుగా ఉన్న ఇంకో నాపరాయిని బలంగా ప్రక్కకు నెట్టిన వెంటనే, పట్టు తెరలతో, మెత్తటి సుఖాసనాలతో అలంకరించబడి వున్న ఆమె శయ్యమందిరం ఎదుట కనిపించింది.

దుమ్మూ ధూళితో నిండిపోయి ఉన్న ముఖాన్ని ఒక శుభ్రమైన వస్త్రంతో తుడుచుకుంటూ, తన హంసతూలికాతల్పం ప్రక్కన ఉన్న జేగంటను ఠంగున

ప్రోగించింది మహారాణి. అటువంటి శబ్దాన్ని ఆలకించటానికి సిద్ధంగా నిలబడి వున్నట్లు, వెంటనే శయ్యమందిరం వెలుపలనుంచి లోపలికి తొంగి చూసింది ఒక పరిచారిక. తన గుండెల మీది నుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలికపడింది ఆమె వదనం.

"మీరు వెళ్ళిన క్షణం నుంచీ విపరీతమైన భయంతో తల్లడిల్లిపోతున్నాం తల్లీ... ప్రభువులు గనుక తమరిని కలుసుకోవటానికి వస్తే ఎటువంటి సమాధానం చెప్పాలో తెలియక తల్లడిల్లిపోతున్నాను" మందిరంలోకి వస్తూ ఆనందంగా చెప్పింది.

మహారాణి వెనుకగా తను కూడా మందిరంలోకి వచ్చి, రహస్య మార్గాన్ని తిరిగి నాపరాతితో మూసివేసిన చెలికత్తె, "మహారాణి వారికి విశ్రాంతి అవసరం... అంతకంటె ముందుగా స్నానమందిరాన్ని సిద్ధం చెయ్యాలి... ప్రభువుల వారు గనుక ఇప్పుడు మహారాణి వారిని చూడటం జరిగితే, ఇంతవరకూ పడిన కష్టం అంతా వృధా అయిపోతుంది" అన్నది.

"తల్లీ వెళ్ళిన పని విజయవంతం అయిందా?" ఆత్రుత అధికం అయి పోతున్నట్లు అడిగింది రెండవ పరిచారిక.

"పని పూర్తి అవటం మాట దేవుడెరుగు... ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పారిపోయి వచ్చాము." గాఢంగా నిట్టూరుస్తూ చెప్పింది మహారాణి.

"తల్లీ... త్రికుట వర్ధనుడు దిగంబరస్వామి అనే మంత్రవాదిని తన దగ్గరికి రప్పించుకున్నాడు. మంత్ర ప్రయోగం ఏదైనా జరుగుతుందేమోనన్న అనుమానం కలుగుతున్నది అందరికీ. ప్రభువుల వారు తీవ్రమైన ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది" వారు అవతలికి పోయిన సమయంలో జరిగింది ఏమిటో తెలియచెప్పింది ఆ పరిచారిక.

హంసతూలికా తల్పం మీద కూర్చోబోతున్న మహారాణి, చటుక్కున ఆగిపోయి తనతో వచ్చిన చెలికత్తెవైపు చూసింది.

ఆ చూపులో వున్న భావాలు తనకు అర్థం అయినట్లు తల విదిలించింది ఆమె. "ఎటువంటి ప్రమాదాలు ఎదురైనా నిబ్బరంగా నిలువబడి, దీటుగా ఎదుర్కో గల ఆ శ్యామల గదాధరుల్ని వదిలిపెట్టి రావటం నిజంగా మనం చేసిన మహాపరాధం. వారే గనుక మనతో పాటు వచ్చివుంటే ఎంతో బాగుండేది" చిన్న కంఠంతో చెప్పింది చెలికత్తె.

ఆపద సమయంలో తమకు అండగా నిలువబడి, తమకు ప్రాణదానం చేసిన శ్యామలుడి ముఖం కనుల ముందు మెదులుతుండగా, తల విదిలించింది మహారాణి.

"జరిగింది ఏదో జరిగిపోయింది. ఇప్పుడు చింతించి ప్రయోజనం ఏమీలేదు. ఇక ముందు జరుగబోయేది ఏమిటో ఆలోచించాలి" సాలోచనగా అన్నది.

"ముందు మీరు స్నానమందిరానికి పోయి ఒంటిమీది దుమ్మును వదిలించుకోవాలి తల్లీ... అది అత్యంత అవసరం" అంటూ ఆమె చేతిని పట్టుకుని ఆ మందిరంలో వున్న మరో ద్వారం వైపు నడిపించింది ఆమె చెలికత్తె.

ముఖద్వారాన్ని తిరిగి దృఢంగా బంధించి అక్కడే నిలువబడింది రెండవ చెలికత్తె.

* * * * *

తన ఊపిరి ఆగిపోతుందేమోనన్న భయం కలిగింది దిగంబరస్వామితో కలిసి, నేలలోకి దిగబడిన త్రికుట వర్ధనుడికి.

తనకు తెలియకుండానే నడుముకు వ్రేలాడుతున్న కరవాలాన్ని ఒరలో నుంచి బయటికి తీయబోయాడు.

"ఎవరి మీద ప్రయోగిస్తావు నీ ఆయుధాన్ని? ఎవరున్నారు శత్రువులు నీ ఎదుట?" నవ్వుతూ అడిగాడు దిగంబరస్వామి.

ఆ మాటలకు త్రికుట వర్ధనుడు సమాధానం చెప్పకముందే అంతం అయిపోయింది వారి ప్రయాణం.

పాతిక ధనువుల వెడల్పు, ఏబది ధనువుల పొడవు కలిగి వున్న ఒక పెద్ద భూగర్భ మందిరంలో నిలబడ్డారు ఇద్దరూ.

నీలమణులు పొదిగి వున్నాయి ఆ మందిరం గోడల మీద, నీలరంగు కాంతులు మందిరం నిండా ప్రసరిస్తున్నాయి.

"మనం ఎక్కడ వున్నాము? ఈ మందిరం ఎక్కడి నించి వచ్చింది. భూమి లోపల ఇటువంటి మందిరం ఉండటం ఎలా సాధ్యపడింది?" ఆశ్చర్యంగా అడుగబోయి ఆ మాటల్ని గబుక్కున తన నోటిలోనే అదుముకున్నాడు త్రికుట వర్ధనుడు.

ఎందుకంటే ఆ మందిరంలో ఒక గోడ దగ్గిర కనిపించింది అతనికి పెద్ద వేదిక... ఆ వేదిక మీద చుట్టలు చుట్టుకొని గాఢ నిద్ర పోతున్నట్లు పడుకుని వున్నది బ్రహ్మాండమైన కొండచిలువ.

“నమో... నమో దేవతా... నమో కలహకంఠ. నమో నాగరూపిణీ... నమో... నమో....” పెద్ద కంఠంతో స్తోత్రపాఠాలు చదువుతూ ఆ వేదికముందు సాష్టాంగ నమస్కారం చేశాడు దిగంబరస్వామి.

వేదిక మీది అజగరం తల ఎత్తి తమను గమనిస్తే ఆ క్షణంతో తమ ఆయువు తీరిపోయినట్లే అనిపించింది త్రికుట వర్ధనుడికి.

“స్వామీ.... తొందరపడి దాన్ని నిద్రలేపకండి... దాని రూపాన్ని చూస్తుంటే నాకు ఏదో అనుమానంగా ఉన్నది....” తడబడుతున్న కంఠంతో మంత్రవాదిని హెచ్చరించటానికి ప్రయత్నించాడు.

“కిన్నెర జాతికి చెందిన నాగమాత... కరుణిస్తే మన కలలన్నిటినీ సాకారం చేయగల మహత్తు కలిగి నటువంటిది... నమస్కారం చేసుకో....” అన్నాడు అతనితో దిగంబరస్వామి.

“కిన్నెరలు అంటే ఎవరు స్వామి....” అడిగాడు ఆశ్చర్యంగా త్రికుట వర్ధనుడు.

దిగంబరస్వామి సమాధానం చెప్పకముందే, తలను కదిలించింది వేదికమీద చుట్టలు చుట్టుకుని పడుకుని ఉన్న కొండచిలువ.

మందిరం గోడలకు తాపడం చేసి వున్న నీలమణుల మాదిరిగానే తళతళమని మెరుస్తున్నాయి దాని కనులు.

బెత్తెడు వెడల్పున రెండు మూరల పొడవున అతి వేగంగా కదులుతున్నది దాని నాలుక.

“ఎవరు? ఎవరు నా విశ్రాంతిని భంగం కలిగించింది? ఎవరు నా విశ్రాంతి మందిరంలోకి వచ్చే సాహసం చేయగలిగింది?” ఖంగుఖంగుమంటూ వెలువడ్డాయి మాటలు దాని నోటిలో నుంచి.

“మాతా.... నేను నీ సేవకుడిని... విధిలేని పరిస్థితిలో నీ సహాయం అర్ధించటానికి వచ్చాను. నువ్వు తప్ప నాకు తోడు పడగలిగిన వారు ఎవరూ లేరు” మోకాళ్ళ మీద లేస్తూ చేతులు జోడించి అన్నాడు దిగంబరస్వామి.

"నేలమీదికి వచ్చి నీ కోరిక తీర్చే ఓపిక నాకు లేదు. రాబందుల గుట్ట సమీపంలో నా కుమార్తెలు ఇద్దరు రాజ్యం చేస్తుంటారు. వెళ్ళి వారిని అర్థించు. వెళ్ళు." పైకి ఎత్తిన తలను తిరిగి క్రిందికి దించబోతూ చెప్పింది ఆ కొండ చిలువ.

"తెలుసు తల్లీ... రాబందుల గుట్ట దగ్గర రాజ్యం చేసే నీ కుమార్తెల గురించి నాకు పూర్తిగా తెలుసు. వారంతట వారుగా మానవుల్ని ఏమీ చేయలేరు. ఎవరైనా వారిని తాకాలి. తాకిన తరువాతనే వారు తమ శక్తిని ప్రస్ఫుటం చేయగలరు" అన్నాడు దిగంబరస్వామి.

క్రిందికి వాలిపోబోతున్న కొండచిలువ శిరస్సు మళ్ళీ పైకిలేచింది. మంత్రవాది మాటలు తనకు వినోదాన్ని కలిగించినట్లు చిన్నగా నవ్వింది.

"అన్నెం పున్నెం తెలియని అమాయక బాలికలు వాళ్ళు... నా మాదిరి ఈ భూగర్భంలోనే మగ్గిపోకుండా కావాలనే నేను భూమి మీదికి పంపించాను. ఎన్నోతరాలు గడిచిపోయాయి. ఎలా ఉన్నారో తెలియలేదు." అంటూ తలను ఇంకా కొంచెం పైకి ఎత్తి, వేదిక ఎదురుగా వున్న గోడకేసి చూసింది.

కొండరాయితో నిర్మించబడి వున్నది ఆ గోడ... చిటికెలో పెద్ద నిలువు టద్దం మాదిరి మారిపోయింది.

ఆ అద్దంలో త్రికుట వర్ధనుడికి అగుపించింది ఒక గుట్ట మీద వున్న శిధిల మందిరం....

వేదిక దగ్గిర మోకరించి కూర్చుని ఉన్న దిగంబరస్వామికి వున్నట్లుండి వచ్చేసింది విపరీతమైన ఆవేశం.

"ఆహా.... అది శంబరదేవత కొలువై ఉన్న ప్రదేశం... సాహసవంతులకు తప్ప సామాన్యులకు సాధ్యం కాదు ఆ చోటికి పోవటం...." అంటూ లేచి నిలుచున్నాడు.

అదే సమయంలో అద్దం మాదిరిగా మారిపోయిన ఆ గోడ మీద అతనికి, త్రికుట వర్ధనుడికి అగుపించాయి రెండు సర్పాలు.

శరీరాలు రెండుగా చీలి, ప్రాణాలు పొగొట్టుకుని వున్నాయి అవి....

"అయ్యయ్యో... అదేమిటి? తల్లి తర్వాత తిరిగి అంతటి శక్తియుక్తులు కలిగిన ఆ కిన్నెరలకు అటువంటి గతి పట్టిందేమిటి?" కీచుకంఠంతో అరిచాడు.

తనకు తెలియకుండానే తలతిప్పి వేదికమీది కొండ చిలువ వైపు చూశాడు త్రికుట వర్ధనుడు.

తన కుమార్తెల గురించి అబ్బురంగా చెప్పి, వారి పరిస్థితి ఎలా వున్నదో తెలుసుకోవటానికి గోడను అద్దంగా మార్చిన కొండచిలువ, కంటికి కనిపించని వారు ఎవరో తన తోకమీద బలంగా కొట్టినట్లు, విపరీతమైన కోపంతో బుసలు కొట్టటం మొదలు పెడుతోంది.

రెండు నిలువుల ఎత్తుకు లేచింది దాని తల. కంటికి కనిపించనంత వేగంగా కదులుతున్నాయి దాని నాలుకలు.

"ఎవరు? ఎవరీ దారుణానికి ఒడికట్టిన వారు? నా ముద్దుబిడ్డల ఉసురు తీసింది ఎవరు?" క్రూరంగా వినవచ్చింది దాని కంఠం.

చెమటలు ప్రత్యక్షం అయ్యాయి త్రికుట వర్ధనుడి ముఖం మీద. కాళ్ళుచేతులు కంపించటం మొదలు పెట్టాయి. తల తిప్పి మరోసారి ఆ గోడకేసి చూశాడు అతను.

వెంటనే అతనికి కనిపించినట్లే కనిపించింది చిటికెలో మటుమాయం అయిపోయాయి శంబర దేవత ఆలయంలో నుంచి బయటికి వచ్చిన విగ్రహాలు.

ఇంకా ఇంకా అధికం అయిపోయింది కొండచిలువ క్రోధం... అది ఎంతస్థాయికి చేరుకున్నదంటే... అంతకు ముందు మాదిరి మానవ భాషలో మాట్లాడినట్లు, మాట్లాడటం మానివేసింది. బుసలు మాత్రమే వెలువడసాగాయి దాని నోటినుంచి.

"తీరికగా పడుకుని వున్న ఈ మహాశక్తిని ప్రార్థించి నీ శత్రువు మీదికి పంపకం చేద్దామని ఆశపడ్డాను... మనం వచ్చిన పని నెరవేరకపోగా మన ప్రాణాలకే పెనుప్రమాదం దాపురించేటట్లున్నది...." వణుకుతున్న కంఠంతో త్రికుట వర్ధనుడికి చెప్పాడు దిగంబరస్వామి.

"ఆలస్యం దేనికి స్వామీ? ఇక్కడినుంచి తిరోగమించటం చాలా మంచిది" అన్నాడు త్రికుట వర్ధనుడు.

చెమటలు క్రమ్ముతున్న మొఖాన్ని చేతులతో రుద్దుకుంటూ, "అది నువ్వు అనుకున్నంత తేలికకాదు... పగబడితే ప్రపంచం చివరికిపోయినా వెదుకుతూ వచ్చి గుటుక్కున మింగేస్తుంది. ధైర్యంగా నిలబడి ఈ కోపాన్ని మనకు ఉపయోగపడేటట్లు మలచుకోవాలి...." అన్నాడు దిగంబరస్వామి.

రెండు నిలువుల ఎత్తును దాటి మరో రెండు నిలువుల ఎత్తుకు లేచింది కొండ చిలువ తల. తాచుపాము పడగను ఆడించినట్లు తలను అటూ ఇటూ కదపటం మొదలు పెట్టింది.

“నీ శత్రువు పేరుచెప్పు... నేను మరిచిపోయాను.” అన్నాడు దిగంబర స్వామి... త్రికుట వర్ధనుడితో.

“విలాసుడు... వైదర్భి నగర పాలకుడు....” అతని చెవిలో ఊదాడు మహారాజు.

“మాతా... నీ ముద్దుబిడ్డల మరణానికి కారణాలు ఎవరో మాకు తెలుసు. ఆ మాట నీ చెవులో పడవేయటం కోసమే నేను వచ్చాను... కోపాన్ని తగ్గించుకో... మా మాటల్ని వినిపించుకో....” చేతులు జోడిస్తూ కొండ చిలువకు చెప్పాడు దిగంబరస్వామి.

ఒక నిలువు ఎత్తుకు దిగిపోయింది ఆ చిలువతల. తిరిగి మానవకంఠంతో, “ఎవరు? ఎవరు ఆ అధముడు.... చెప్పు” అంటూ హూంకరించింది.

“వైదర్భి పాలకుడైన విలాసుడు తన సైనికుల్ని పంపించి ఆ కిన్నెరలను కొండ గుట్ట మీదికి రప్పించాడు. వారి మరణానికి కారకుడు అయినాడు” తడుముకోకుండా చెప్పాడు దిగంబరస్వామి.

“ఆకలి... నాకు ఆకలి అధికంగా వున్నది. తరతరాలుగా ఆహారం తీసుకోకుండా ఈ ప్రదేశంలోనే గడపటం వల్ల, నీరసం అధికం అయింది. నాకు ఆహారాన్ని అందించు... ఆ నాయకుడి అహంకారాన్ని అణచివేస్తాను. నా బిడ్డల మరణానికి ప్రతీకారం చేస్తాను” గర్జించింది కొండ చిలువ.

“తల్లీ... భూ గర్భంలోకి వచ్చాము... నీకు కావలసిన ఆహారాన్ని మా వెంట తీసుకురాలేదు. వ్యవధి ఇస్తే ఏర్పాటు చేయిస్తాను” అన్నాడు దిగంబర స్వామి.

“వ్యవధి ఇవ్వటానికి వీలుపడదు... నా ఆగ్రహం క్షణక్షణానికి అధికం అయిపోతున్నది... నాకు ఇప్పుడే ఈ క్షణమే కావాలి ఆహారం....” అంటూ వేగంగా తలను ముందుకు జాచింది కొండచిలువ.

కొండగుహ మాదిరిగా తెరుచుకున్నది దాని నోరు. భయంతో గజగజ వణికిపోతూ వెనక్కి దూకాడు త్రికుట వర్ధనుడు.

"దిగంబరస్వామి రక్షించు... నన్ను కాపాడు...." అంటూ బిగ్గరిగా అరిచాడు. కొండచిలువ తల కంటె వేగంగా కదిలాడు దిగంబరస్వామి. అతని చేతిని పట్టుకుని అతి వేగంగా పైకి ఎగిరాడు.

అంతకుముందు ఎంత వేగంతో భూగర్భంలోకి వచ్చారో అంతే వేగంతో తిరిగి పైకి ప్రయాణం మొదలు పెట్టారు ఇద్దరూ.

"మన పథకం బెడిసికొట్టింది మహారాజా... మాయమాటలు చెప్పి ఈ శక్తిని నీ శత్రువు మీదికి పంపకం చేద్దామని ఆశించాను. దాని బిడ్డలు విగతజీవులు అయిపోయారన్న విషయం తెలియకపోవటం మనకి ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది...." తడబడుతున్న కంఠంతో అన్నాడు దిగంబరస్వామి.

"పారిపోయి వస్తున్నాము కదా... ఇంకా అది మనల్ని చేయగలిగింది ఏముంది?" అని అడిగాడు త్రికుట వర్ధనుడు.

"ఒక్కసారి క్రిందికి చూడు...." అన్నాడు దిగంబరస్వామి.

చూపుల్ని క్రిందికి వంచాడు మహారాజు.

వింటి నుంచి వెలువడిన బాణం మాదిరి వేగంగా వచ్చేస్తోంది కొండ చిలువ తల.

"అది... వేదిక మీదినుంచి ఎలా ఎగుర గలుగుతున్నది?" తడి ఆరిపోయిన గొంతుకతో అడిగాడు త్రికుట వర్ధనుడు.

"వేదిక మీది నుంచి ఎగరటం లేదు. తలను సాగ తీసుకుంటున్నది. అవసరం అయితే అది ఆకాశంలోకి కూడా తన తలను పంపించగలదు?" అన్నాడు దిగంబరస్వామి.

"ఇది... మనతోపాటు నేలమీదికి వస్తే ఎలా తప్పించుకోవాలి?" మరింత భయంగా అడిగాడు మహారాజు.

"ఇటువంటి శక్తుల జోలికి పోనే కూడదు. పోయినప్పుడు ఎటువంటి పరిస్థితులనయినా తట్టుకోవటానికి సిద్ధంగా ఉండాలి. ఆకలి మీద వున్నానని అంటున్నది. నువ్వు నేను దాని నోటికి అందకపోతే, వేరెవ్వరినో పట్టుకుంటుంది" అన్నాడు దిగంబరస్వామి.

అంటూ వుండగానే అతని పాదాల దగ్గరికి వచ్చేసింది కొండచిలువ తల. "ప్రమాదం స్వామీ... ప్రమాదం...." క్రిందికి చూసి బిగ్గరిగా అరిచాడు త్రికుట వర్ధనుడు.

తన చేతుల్ని జాచి మహారాజు భుజం మీద బలంగా ఒక చరుపు చరిచాడు దిగంబరస్వామి.

రెట్టింపు అయింది మహారాజు ప్రయాణవేగం... ఊపిరి రెండు సార్లు లోపలికి తీసుకుని, బయటికి వదిలేంతలో భూమిలో నుంచి వేగంగా పోయి మందిరంలో పడ్డాడు.

ఆత్రుత నిండిన చూపులతో, మందిరంలో ఏర్పడిన అఘాతం వైపే చూస్తున్నాడు అతని మంత్రి.

"మంత్రవాది ఏమైనాడు ప్రభూ... తమరు ఒక్కరే వెలుపలికి వచ్చారు. కారణం ఏమిటి?" అని అడుగుతూ ముందుకు వచ్చి, చేతిని అందించాడు.

వంటిని అంటుకున్న మట్టిని వదిలించుకునే ప్రయత్నం కూడా చేయలేదు త్రికుట వర్ధనుడు. "పారిపోవాలి... ప్రాణాలు దక్కించుకోవాలంటే వెంటనే పారిపోవాలి...." అంటూ మందిరం వెలుపలికి పరిగెత్తాడు.

"మహారాజా... మహారాజా... ఈ శక్తి నన్ను పట్టుకున్నది. నా ప్రాణాలను హరించి వేస్తోంది... మహారాజా...." అంటూ వినవచ్చింది దిగంబరస్వామి కంఠం.... అఘాతంలో నుంచి.

"పడగొట్టండి... భవనాన్ని కూల్చి పారవేయండి...." బయటికి పోయిన వెంటనే సిద్ధంగా నిలబడి వున్న భటులను హెచ్చరించాడు త్రికుట వర్ధనుడు.

తమ వెనుకే వినవచ్చిన ఆర్తనాదాన్ని ఆలకించలేదు అతను. మంత్రి విన్నాడు... "అందుకు తగిన వ్యవధి లేదు. అగ్నిపాలు చేసేయండి... నిప్పు ముట్టించండి" తడుముకోకుండా ఆదేశించాడు.

చిటికెలో చెకుముకి రాళ్ళను బయటికి తీసి నిప్పు రవ్వల్ని సృష్టించారు పది మంది భటులు... భవనం నాలుగు మూలలకు పరిగెత్తి, ద్వారాలకు, ఆ ద్వారాలకు వ్రేలాడుతున్న పట్టుతెరలకు అగ్నిని అంటించారు.

గప్పున పైకి లేచాయి మంటలు... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో భవనాన్ని పూర్తిగా ఆవరించుకున్నాయి.

"అయిపోయింది... ఆ దుష్టశక్తి ఆట కట్టు అయిపోయింది. అఘాతం లోనుంచి తలను బయటపెట్టిన మరుక్షణం మంటల్లో పడి మాడి మసి అయిపోతుంది...." మంటల వేడిమి తనకు సోకనంత దూరంలో నిలబడి ఆనందంగా అన్నాడు త్రికుట వర్ధనుడు.

"ప్రభూ... మంత్రవాది ఆ దుష్టశక్తికి బలి అయిపోతే మరి మన పథకం సంగతి ఏమిటి?" అడిగాడు మంత్రి.

"మనంతట మనంగా దండయాత్రకు సిద్ధపడటమే... వేరే మార్గం లేదు" సాలోచనగా అన్నాడు త్రికుట వర్ధనుడు.

అతను ఆ మాటలు ఉచ్ఛరిస్తూ ఉండగానే పెద్ద శబ్దంతో గాలిలోకి ఎగిరి దూరంగా పడిపోయింది ఆ భవనపు పైభాగం... ఎగసి పడుతున్న అగ్నిజ్వాలల్లో నుంచి నాలుకలు విరజాపుతూ ప్రత్యక్షం అయింది కొండచిలువ తల.

"ఆకలి... ఆకలి... ఆహారం కావాలి... నాకు ఆహారం కావాలి" గుండెలు జలదరించేటట్లు కేకలు పెడుతూ భవనం చుట్టు వున్న భటుల మీదికి ఎగబడింది.

భవనాన్ని తగులబెడితే అది బయటికి రాలేదని తాను అనుకోవటం పెద్ద అపరాధం అయిపోయిందని వెంటనే తెలిసి వచ్చింది త్రికుట వర్ధనుడికి.

"పారిపోండి.... అందరూ పారిపోయి మీ ప్రాణాలు దక్కించుకోండి" అని అరుస్తూ తనే ముందు పరుగు మొదలు పెట్టాడు.

మంత్రి తప్పించుకోగలిగాడు. భవనం దగ్గిర ఉన్న భటులు మాత్రం ఆ విధంగా చేయలేక పోయారు.

కంటికి కనిపించని వేగంతో కదిలి, అందరినీ తన కొండ గుహ వంటి నోటిలోకి లాగేసుకున్నది ఆ కొండచిలువ. ఎగసి పడుతున్న మంటలు దానికి ఎటువంటి బాధను కలిగించలేకపోయాయి.

పాదరసం మాదిరి వేగంగా కదులుతూ ఆ భవనంలో నుంచి బయటికి వచ్చింది అది.

గగ్గోలుగా కేకలు పెడుతూ దూరంగా పారిపోవటానికి ప్రయత్నం చేశారు దాన్ని గమనించిన నగరపౌరులు.

ఎక్కడా ఆగలేదు అజగరం. తన ఎదుట కనిపించిన ప్రతి ప్రాణిని ఆరగిస్తూ నగర ద్వారాల దగ్గరికి పోయింది.

నగరంలో చెలరేగిన అలజడిని ఆలకించి ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నారు అక్కడి భటులు. నగరంలో నుంచి వెలుపలికి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు.

అర్ధ ఘడియ కాలంలో నగర జనాభాలో ఒక వంతుమందిని సునా యాసంగా ఆరగించిందా కొండచిలువ. అతివేగంగా పాకుతూ నగరం వెలుపల ఉన్న అడవిలోకి వెళ్ళిపోయింది.

*　　*　　*　　*　　*

కనురెప్పలు కూడా కదిలించకుండా పళ్ళెరంలోనే చూస్తూ కూర్చున్న యువరాణి భుజం మీద చేయివేసి అనునయంగా మాట్లాడింది వృద్ధురాలు.

"ఎన్నిరోజులు ఇలా కదలకుండా కూర్చుంటావు తల్లీ... నిద్రహారాలు లేకపోతే నీరసపడిపోతావు...." అని.

"నువ్వు వున్నావుగా అవ్వా... నాకు నీరసం రాకుండా ఏదో ఒక మంత్రాన్ని తప్పకుండా చదువుతావు...." నవ్వుతూ చెప్పింది యువరాణి.

"శ్యామలుడు గజదొంగగా ఎందుకు మారవలసి వచ్చిందో తెలుసు కోవటం కోసం నేను ఈ మంత్ర ప్రయోగాన్ని మొదలుపెట్టాను. ఆ విషయం తప్ప మిగిలినవన్నీ తెలుస్తున్నాయి" నిరాశగా నిట్టూరుస్తూ చెప్పింది వృద్ధురాలు.

"ఆ స్నేహితులు ఇద్దరూ చేస్తున్న పనులకు, నువ్వు చెపుతున్న మాటలకు ఏదో సంబంధం తప్పకుండా వుండే వుంటుంది. మనం చేయవలసిందల్లా, వారి చర్యల్ని గట్టిగా గమనిస్తూ వుండటమే...." తిరిగి పళ్ళెరం వైపు చూస్తూ చెప్పింది యువరాణి.

"శ్యామలుడు కనిపించడం లేదు.. ఆ త్రికుట వర్ధనుడి నగరం కనిపిస్తోంది. అతని దురాశ ఫలితంగా ఒక వంతు నగరం నాశనం అయి పోయింది" అన్నది వృద్ధురాలు.

"ఇంతకుముందు మనం గమనించిన కిన్నెరలకు తల్లి ఈ కొండ చిలువ... దాన్ని కూడా హతమార్చటం సాధ్యపడి ఉంటుందంటావా?" అడిగింది యువరాణి.

"సాధ్యపడి వుండకపోతే, ఆ దొంగ ఇప్పుడు మన రాజ్యంలోకి వచ్చి వుండేవాడు కాదు... వచ్చాడు కాబట్టి ఆ దుష్టశక్తిని కూడా పరలోకానికి పంపించి వుంటాడు...." అన్నది వృద్ధురాలు.

"ఎలా? ఎలా పంపించి వుంటాడు?"

"చూస్తున్నావు కదా తల్లీ... చూస్తూనే ఉండు... నాకేం తెలుస్తుంది" అన్నది వృద్ధురాలు.

కనులు చిట్లించి తదేకంగా చూడటం మొదలు పెట్టింది యువరాణి. అడవిలోకి ప్రవేశించిన కొండ చిలువ తనకు ఎదురుపడిన జంతువులను కూడా వదిలి పెట్టడం లేదు. చెట్ల కొమ్మల మీది పక్షుల్ని చెట్ల తొర్రలలోని గుడ్లగూబల్ని, కొమ్మలకు తల్ల క్రిందులుగా వ్రేలాడుతున్న గబ్బిలాల్ని దేన్ని వదిలి పెట్టకుండా ఆరగిస్తూ ముందుకు సాగుతున్నది.

"ఇది వైదర్భి నగరం కేసి పోతున్నదా అవ్వా?" వృద్ధురాలిని అడిగింది యువరాణి.

"తప్పకుండా అది వైదర్భి నగరం వైపే వెళుతోంది. ఎందుకంటే దాని బిడ్డల్ని చంపించింది ఆ నగర పాలకుడే అని దిగంబరస్వామి దానికి తెలియ చేశాడు" అన్నది వృద్ధురాలు.

"అది నిజం కాదు గదా అవ్వా... విలాసుడికి ఆ కన్యలు చనిపోవటానికి సంబంధం ఏమీలేదు గదా... ఆ పని చేసింది శ్యామల గదాధరులు కదా...." అన్నది యువరాణి.

"ఆ సంగతి దానికి తెలియదు గదా...." అన్నది వృద్ధురాలు.

"ఎవరో చేసిన పనికి పాపం... వైదర్భివాసులు మూల్యం చెల్లించాలి... పసి బిడ్డ వంటి స్వచ్ఛమైన మనస్సు కలిగిన వాడు శ్యామలుడు... నగర ప్రజల ఉసురు అతనికి తప్పకుండా తగిలి తీరుతుంది" అన్నది యువరాణి.

* * * * *

సభా భవనంలో సింహాసనం మీద కూర్చుని వున్న విలాసుడి దగ్గరికి వచ్చి వినయంగా నమస్కరించాడు ఒక భటుడు. "సేనాపతుల వారు తమ దర్శనం కోరుతున్నారు ప్రభూ...." చిన్న కంఠంతో విన్నవించాడు.

కాంతివంతం అయింది నగరపాకుడి వదనం. "ఎదురు చూస్తున్నాము. వెంటనే ప్రవేశపెట్టు" అని అనుమతి ఇచ్చాడు.

సభా సదులందరూ విచిత్రంగా చూశారు... నగరంలోని భటులందరికీ నాయకుడు సేనాపతి... సామాన్యుడి మాదిరి నగరపాలకుడి అనుమతిని అర్థించటం ఏమిటి??

వారి సందేహానికి సమాధానం లభించకముందే సభలోకి వచ్చాడు సేనాపతి... చిన్నచిన్న అడుగులతో సింహాసనం దగ్గరికి పోయాడు.

"వచ్చారా... మన వారందరూ తిరిగి వచ్చారా? వెళ్ళిన పని సక్రమంగా ముగిసిందా?" అతనికి మాత్రమే వినిపించేటట్లు రహస్యంగా అడిగాడు నగర పాలకుడు.

"ప్రభూ... మన వారెవరూ తిరిగి రాలేదు... ఒకే ఒక్క సైనికుడు తప్ప" అంటూ ఎవరికో సైగ చేశాడు సేనాపతి.

సభా భవన ద్వారం దగ్గిర నిలబడి వున్నాడు మహారాణి వారితో పాటు తిరిగివచ్చిన సైనికుడు. వెంటనే ముందుకు వచ్చి అభివాదం చేశాడు.

"మీరందరూ వెల్లిన పని ఏమయింది? మిగిలిన వారందరూ ఎక్కడ?" నొసలు ముడిచి సూటిగా చూస్తూ ఆ సైనికుడిని అడిగాడు విలాసుడు.

"ప్రభూ... రాబందుల గుట్ట దగ్గిర అనుకోని ప్రమాదం ఒకటి మాకందరికీ తారసపడింది. నరమానవుడు అనేవాడు ఎవడూ కనిపించకూడదని ఆ గుగ్గుడి ప్రదేశంలో అపురూప సౌందర్యవతులైన ఇద్దరు యువతీమణులు అందరికీ అగుపించారు" అంటూ కిన్నెర యువతులు తమ సైనికుల్ని సర్వనాశనం చేసిన వైనాన్ని సవివరంగా చెప్పాడు ఆ సైనికుడు.

చురుకుగా చూస్తున్న విలాస ప్రభువు వదనంలో అమితమైన ఆశ్చర్యం ప్రత్యక్షం అయింది.

"ఇద్దరంటే ఇద్దరు... మన వారందర్నీ అలవోకగా ఆరగించేశారా? సైనికుడా... తెలివిలోనే ఉన్నావా?" ఆశ్చర్యం కాస్తా ఆగ్రహంగా మారుతుండగా అడిగాడు.

"పూర్తి తెలివిలో ఉన్నాను ప్రభూ... జరిగిందేమిటో మరింత వివరంగా చెప్పటానికి వేరే ఎవరూ సజీవంగా లేరు...." అన్నాడు సైనికుడు.

"నువ్వు మాత్రం ప్రాణాలతో ఉండటం ఎలా సంభవించింది? అందరితో పాటు నువ్వు కూడా హతమారి పోవాల్సింది కదా...." ప్రశ్నించాడు నగర పాలకుడు.

ఇరకాటంలో పడిపోయాడు సైనికుడు. అందరూ ముందుకుపోతున్న సమయంలో తను కూడా వారితో పాటుగా వెళ్ళకుండా వెనుకే ఆగిపోయినట్లు చెపితే?

పిరికివాడిగా భావించి అప్పటికప్పుడు ఏదో ఒక శిక్ష విధిస్తాడు. పాములడొంకను గురించి తనకు తెలుసని చెపితే, ఆ మాటను హతమారి

పోయిన వారందరికీ విడమర్చి చెప్పి వారిని ముందుకు పోనీయకుండా ఎందుకు ఆపలేదని నిలదీస్తాడు.

మహారాణి వారిని గురించి వెల్లడిస్తే ఆమె ఆగ్రహానికి గురి కావల్సి వస్తుంది. ఏమని చెప్పాలో ఏ విధంగా నగర పాలకుడి ఆగ్రహం అణిగి పోయేటట్లు చేయాలో తెలియలేదు అతనికి.

"ప్రభూ... సామాన్యమైన సైనికుడిని నేను... నాకంటే అధికారంలో పెద్దవారు అనేకమంది అక్కడ ఉన్నారు. ఎంతచెప్పినా ఎవరూ పట్టించు కోలేదు...." తన అసమర్ధతను కప్పి పెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు అతను.

"వాడు వట్టి పిరికిపంద మాదిరిగా ఉన్నాడు ప్రభూ... అందరూ ముందుకుపోతూ ఉండగా వాడు మాత్రం వెనక్కి పారిపోయి వచ్చాడు" కోపంగా అన్నాడు సైన్యాధిపతి.

విలాస ప్రభువు ఆగ్రహం అవధులు దాటిపోయింది. "తీసుకుపోండి ఈ అధమాధముడిని... తోటి సైనికులందరూ తమ శౌర్య పరాక్రమాలను ప్రదర్శిస్తుంటే వీడు మాత్రం తన ప్రాణాలు కాపాడుకుని పారిపోయి వచ్చాడు. పది మంది చూసేటట్లు పంజరంలో పెట్టి రాచవీధుల కూడలిలో వ్రేలాడ గట్టండి" ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞ ఇచ్చాడు.

నిలువు నీరయిపోయాడు ఆ సైనికుడు. "క్షమ ప్రభూ.. క్షమ... జరిగిన దానిలో నా అపరాధం ఏమీ లేదు. దయ చూపించండి. కనికరించండి." చేతులు జోడించి దీనంగా ప్రార్థించటం మొదలు పెట్టాడు.

ఆ మాటలు వినటం తనకు ఇష్టంలేనట్లు తలను ప్రక్కకు తిప్పుకున్నాడు విలాసుడు.

సైనికుడి చేతులు వెనక్కి విరిచి కట్టి సభా భవనం వెలుపలికి ఈడ్చుకుపోయారు భటులు.

"ఆలస్యం చేసిన కొద్దీ ఆ త్రికుట వర్ధనుడికి అలుసు అయిపోతాము... అతను ఊహించని రీతిలో మనం అతనికి మన పౌరుషాన్ని రుచి చూపించాలి. అనుకున్న మార్గంలో ముందుకు సాగలేమని తేటతెల్లం అయిపోయింది. ఇప్పుడు చేయవలసినది ఏమిటో ఆలోచించి చెప్పు...." సేనా నాయకుడికి ఆజ్ఞ ఇచ్చాడు నగర పాలకుడు.

"కొద్దిపాటి వ్యవధి ఇవ్వండి ప్రభూ... సాయం సమయం అయ్యేసరికి ఏదో ఒక మార్గాన్ని కనుగొంటాను...." అన్నాడు అతను.

*    *    *    *    *

"లాభం లేదుమిత్రమా... ఇక మీదట నేను ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేను... ఎక్కడో ఒక చోట ఆగిపోవాల్సిందే...." ఉన్నట్లుండి తన అలవాటు ప్రకారం తన అభ్యంతరాన్ని వెల్లడించాడు గదాధరుడు.

వంచిన తల ఎత్తకుండా నడుస్తూ వస్తున్న శ్యామలుడు చటుక్కున తల తిప్పి అతనివంక చూశాడు.

దట్టంగా ఎదిగి వున్న పెద్ద చెట్లతోపు వారి ఎదుట కనిపిస్తోంది. చల్లటి నీడనిచ్చే ఆ వృక్షాల క్రింద సేద తీరటమే మంచిదని అనుకుంటున్నాడు అతని జతగాడు.

"పది అడుగులు వేస్తే వైదర్భి నగరం అగుపిస్తుంది అనిపిస్తోంది. హాయిగా నగరంలోకి వెళ్ళి వెచ్చవెచ్చటి కట్టడాల్లో విశ్రాంతి తీసుకోవచ్చు...." తన అభిప్రాయాన్ని అతనికి వెల్లడించాడు శ్యామలుడు.

"మానవుల మానవత్వం మీద నాకు నమ్మకం పోయింది. పది మందిలోకి పోయిన వెంటనే ఏదో ఒక సమస్య మరోసారి మనకు కనిపించి తీరుతుంది. ఎంతవద్దని అనుకున్నా ఏదో ఒక విధంగా అది మనల్ని ఇబ్బందులలోకి లాగేస్తున్నది. నగరంలోకి పోకుండా హాయిగా ఈ చెట్ల క్రిందనే కాలక్షేపం చేయటం మంచిదని అనిపిస్తోంది" తన మాటలకు వెనుక వున్న కారణాన్ని పూర్తిగా బయట పెట్టాడు గదాధరుడు.

"మనం అసలు ఈ నగరం దగ్గిరికి ఎందుకు వచ్చినట్లు?" సూటిగా అడిగాడు శ్యామలుడు.

"ఈ నగరపాలకుడి శత్రువైన త్రికుట వర్ధనుడి దగ్గరికి ఆ దిగంబరస్వామి వెళ్ళాడు... అతని పీచం అణచాలంటే–" అంటూ ఏదో గుర్తుకు వచ్చినట్లు ఆగిపోయాడు గదాధరుడు.

"చెప్పుమిత్రమా... మాటల్ని మధ్యలో మింగేయకు" నవ్వుతూ ఎత్తి పొడిచాడు శ్యామలుడు.

"ప్రాణాలకు తెగించి నువ్వు కాపాడిన ఈ నగరపాలకుడి భార్య – అవసర సమయంలో మనల్ని గాలికి వదిలేసి తన దారి తాను చూసుకున్నది.

నగర పాలకుడు కూడా అటువంటి వాడే. అమాయక గ్రామీణులను దోచుకోవటానికి దోపిడీ మూకల్ని పంపి తను హాయిగా నగరంలో కూర్చున్నాడు." తనలో తాను అనుకుంటున్నట్టు పైకే అన్నాడు గదాధరుడు.

తల ఊపి మౌనంగా ఉండిపోయాడు శ్యామలుడు. నోరు తెరిచి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. వెంటనే వచ్చేసింది గదాధరుడికి పెద్ద అనుమానం... "మిత్రమా నేనేమయినా తప్పుగా మాట్లాడానా? నా అభిప్రాయాలు తప్పని నువ్వు అనుకుంటున్నావా?" అని అడిగాడు ఆత్రుతగా.

తల అడ్డం తిప్పాడు శ్యామలుడు. కనులతోనే పైకి చూపించాడు.

దట్టమైన చెట్ల తోపు కారణంగా, ఎన్నెన్నో పక్షిజాతులు ఆ ప్రదేశంలో గూళ్ళు నిర్మించుకుని ఉన్నాయి.

పెద్ద పక్షులన్నీ రెక్కలు తపతపలాడిస్తూ గాలిలోకి ఎగిరి పోవటం మొదలు పెడుతున్నాయి. గూళ్ళల్లో రెక్కలు ఇంకా రాని తమ సంతానాన్ని వదిలి పెట్టి పోలేకపోతున్నట్లు గోలగోలగా కూతలు పెడుతూ గిరికీలు కొడుతున్నాయి ఆడ పక్షులు అనేకం.

చెట్లక్రింద దట్టంగా ఎదిగి వున్న ముళ్ళపొదల క్రిందా, బండరాళ్ళ వెనకా నివాసం వుంటున్న చిన్న చిన్న జంతువులు విపరీతమైన భయంతో తలా ఒక ప్రక్కకు పరుగులు తీస్తున్నాయి.

"ఇదేమిటి మిత్రమా... ఇంతకుముందు వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ ప్రదేశం ఉన్నట్లుండి ఇలా చిందర వందరగా మారిపోయిందేమిటి? అడవి ప్రదేశం కాదు ఇది... అడవి జంతువులు ఏవీ ఇటుగా రాలేవు...." అంటూ చుట్టూ చూశాడు గదాధరుడు.

"నేల మీద నిలబడి చూస్తే కారణం తెలియకపోవచ్చు" అన్నాడు శ్యామలుడు. వెంటనే దగ్గిర్లో వున్న ఒక ఎత్తయిన రావిచెట్టు మీదికి ఎగబ్రాకాడు గదాధరుడు... చిటారు కొమ్మల దగ్గరికి చేరుకుని చూశాడు. ఆరు వందల ధనువుల దూరంలో అతనికి అగుపించింది నగర ద్వారం.

"ద్వారాల దగ్గిర భటులు ప్రశాంతంగానే వున్నారు. ఎటువంటి అలజడికీ గురి కావటం లేదు" క్రింద వున్న స్నేహితుడికి చెప్పాడు అతను.

"ఇక్కడి అలజడికి కారణం మనకు నగరంలో కనిపించదు. మనం వచ్చిన మార్గం కేసి చూడు" అన్నాడు శ్యామలుడు.

తల తిప్పి అటుకేసి చూశాడు గదాధరుడు.

"మిత్రమా.... పక్షులు... చెట్టు ఉన్న ప్రతి ప్రదేశంలోను ఆ చెట్టుమీద నివశించే విహంగాలు ఆత్రుతగా గాలిలోకి ఎగిరిపోతున్నాయి...." చెప్పాడు.

"కారణం ఏమిటో కనిపిస్తోందా?" అడిగాడు శ్యామలుడు.

పట్టుదలగా పది నిమిషాల పాటు పట్టుపట్టి చూసి క్రిందికి దిగి వచ్చాడు గదాధరుడు. పెదవులు విరుస్తూ తల అడ్డం తిప్పాడు.

"తమ బ్రతుకేదో తాము బ్రతకటం తప్ప ఎవరికీ ఎటువంటి హానీ తలపెట్టటం చేతకాని ఈ అమాయక పక్షులు ఇంతగా ఆత్రుతకు గురి అవుతున్నాయంటే, మనిషికి తెలియని ప్రమాదం ఏదో ఇటుకేసి తరుము కుంటూ వస్తున్నట్లే లెక్క...." సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"భూకంపం వంటి ప్రమాదం ఏదైనా వస్తోందని నీ అభిప్రాయమా?" అడిగాడు గదాధరుడు.

"కావచ్చు... కాకపోవచ్చు... అంతకంటె భయంకరమైనది ఇంకోటి ఏదో ఒకటి వచ్చి పడుతూ వుండవచ్చు...."

"అడవి జంతువులు గుంపుగా వస్తూ-" అంటూ తన మాటలు తనకే నచ్చనట్లు తల విదిలించాడు గదాధరుడు.

"మిత్రమా... ఇప్పుడు ఈ పరిస్థితిలో మనం నగరంలోకి పోవటం మంచిదా?" అని అడిగాడు.

"రెక్కలు ఉన్నాయి కాబట్టి గాలిలోకి ఎగిరి ఏదో ఒక విధంగా ఆత్మరక్షణ చేసుకుంటాయి ఈ విహంగాలు- నగరంలోని వారు ఆత్మరక్షణ ఎలా చేసుకోగలరు?" ప్రశ్నించాడు శ్యామలుడు.

గాఢంగా నిట్టూర్చి ముఖాన్ని అరిచేతులతో అద్దుకున్నాడు గదాధరుడు. "నగరంలోకి పోతే ఏదో ఒక సమస్యలో మనం చిక్కుకుంటామన్న భయంతో ఇక్కడే ఆగిపోదామని అన్నాను. అసలు నగరంలోకి పోకముందే సమస్య ఒకటి ఇప్పుడు మనల్ని చుట్టుముట్టింది..." అన్నాడు విసుగు నిండిన కంఠంతో.

"వేరే దారి ఏదయినా ఉంటే చెప్పు. ఆ విధంగా చేద్దాము" అన్నాడు శ్యామలుడు.

"దారులు చెప్పటానికి నేను తగినవాడిని కాదు. నువ్వు చెప్పిన మాటలకు ఎదురు పలుకకుండా తల ఊపవలసిన వాడిని... నువ్వు ఎలా చెపితే అలాగే" అన్నాడు గదాధరుడు.

చిన్నగా నవ్వి అతని భుజం తట్టాడు శ్యామలుడు. "పద నగరంలోకి..." అంటూ ముందుకు దారి తీశాడు.

గాలిలో చక్కర్లు కొడుతున్న పక్షుల్ని ఓరకంట గమనించుకుంటూ అతన్ని అనుసరించాడు గదాధరుడు.

* * * * *

పన్నీరు చిలకరించిన పరిశుభ్రమైన జలాలలో స్నానం చేసి అలంకార మందిరంలో తన అలంకరణలను ముగించుకున్నది మహారాణి. పునుగు జవ్వాది సుగంధ ద్రవ్యాల ఘుమఘుమలతో గుబాళించిపోతూ తన శయ్యా మందిరం దగ్గిరే వున్న సభా మందిరంలోకి వచ్చింది.

"తల్లీ... తల్లీ... తమరికి తెలియవలసిన సమాచారం ఒకటి వున్నది..." అంటూ పరిగెత్తుకు వచ్చింది, ఆమెతోపాటు రాబందులగుట్ట దగ్గరికి పోయి వచ్చిన చెలికత్తె.

"ఏమిటే అదీ? ప్రభువుల వారు విచ్చేస్తున్నారా?" అడిగింది మహారాణి.

అటూఇటూ చూసి, వింజామరలు వీస్తున్న వారిని, దూరంగా పంపింది ఆ చెలికత్తె.

"ఏమిటే నీ హడావుడి? ఎందుకు ఆత్రుత?" ఆశ్చర్యంగా అడిగింది మహారాణి.

"తల్లీ... మనతోపాటు వచ్చిన సైనికుడికి దారుణమైన శిక్ష విధించబడింది. తోటివారిని వదిలి వెనక్కి వంటరిగా వచ్చినందుకు పంజరంలో బంధించి నడివీధుల కూడలిలో వ్రేలాడగట్టారు" రహస్యంగా చెప్పింది చెలికత్తె.

నిర్విణ్ణురాలై పోయింది మహారాణి. "మనం కూడా ఆ ప్రదేశానికి వెళ్ళినట్లు బయట పడిపోయిందా? మన గుట్టు రట్టు అయిందా?" ఆందోళన నిండిన కంఠంతో అడిగింది.

"నాకు తెలిసినంతవరకూ అటువంటిది ఏదీ బయటికి రాలేదు తల్లీ... కాని మనం ఏదో ఒకటి చేయకపోతే, అతను బట్టబయలు చేసేస్తాడని భయం వేస్తోంది" చెప్పింది చెలికత్తె.

చేరగిలబడి కూర్చుని ఉన్న సుఖాసనం మీది నించి చటుక్కున లేచి నిలుచుంది మహారాణి.

"దారిచూపించు... ఒకసారి చూసివద్దాము"అంటూ ఆ చిన్న మందిరంలో నుంచి బయటికి బయలుదేరింది.

* * * * *

"పన్నులు రెట్టింపు చేయకపోతే మనం తట్టుకోలేము ప్రభూ... ఆలస్యం చేస్తే ఆ త్రికుట వర్ధనుడికి అలుసు అయిపోతాము" సాయం సమయంలో నగర పాలకుడి చెవిలో చెప్పాడు సేనాపతి.

"ప్రజలు తిరగబడతారు... తిరుగుబాటు లేవదీస్తారు" అన్నాడు నగర పాలకుడు.

"అణచివేద్దాం ప్రభూ... అవసరం అటువంటిది. మరో మార్గం అంటూ లేదు..." అన్నాడు సేనాపతి.

పది క్షణికాల పాటు ఆలోచించి తల ఊపాడు నగర పాలకుడు. వెంటనే దూరంలో వున్న మంత్రులకు సైగ చేశాడు సేనాపతి. అప్పటికప్పుడు నగర పాలకుడి అభీష్టాన్ని ఒక భూర్జపత్రం మీద లిఖింపచేశారు వాళ్ళు. నగర పాలకుడి అధికార ముద్రను దాని మీద ముద్రింప చేసి సేనాపతికి అందించారు.

* * * * *

"హెచ్చరిక... వైదర్భి నగర వాసులందరికీ నగర పాలకుల వారి హెచ్చరిక" చీకట్లు ఇంకా నగరాన్ని చుట్టుముట్టక ముందే రాచవీధిలోకి వచ్చాడు ఒక టముకరి.

"మన శత్రువు త్రికుట వర్ధనుడి దురాగతాలను అడ్డుకోవటానికి చేస్తున్న ప్రయత్నాలకు అమితమైన ధనం అవసరం అవుతూ ఉండడం వల్ల, ప్రజలకు భారమని అనిపించినా సరే... పన్నులు అధికం చేయక తప్పదు... కాబట్టి సద్దు చేయకుండా చెల్లించండి..." చెవులు చిల్లులు పడేటట్లు టముకును మ్రోగిస్తూ బిగ్గరిగా అరిచి చెప్పాడు.

"తమకు అనుకూలమైన మాటలు ఏమైనా చెప్పబడుతున్నాయనే ఆశతో గుంపుగా నిలబడిన నగర పౌరులకు వెంటనే ముంచుకు వచ్చింది విపరీతమైన కోపం.

"అన్యాయం ఇది... అక్రమం... ఎదిరించవలసిన మాటలు ఇవి... మౌనంగా వుంటే మన మెడల మీద వున్న తలకాయలకు కూడా పన్నులు విధించబడతాయి" గొంతు బొంగురుపోయే శృతిలో అరిచాడు ఒక పౌరుడు.

అతనితో ఏకీభవిస్తున్నట్లు తలలు ఊపారు అందరూ. "పదండి... అందరూ రాచ భవనం దగ్గిరికి నడవండి... చీకట్లు దట్టం కాకముందే నగర పాలకుల వారికి మన అసంతృప్తిని వెల్లడి చేద్దాము" అంటూ ముందుండి దారి తీశాడు ముందుగా పన్నుల్ని వ్యతిరేకించిన పౌరుడు.

ఉన్నట్లుండి ఆ వీధిలో ప్రత్యక్షం అయ్యారు అశ్వారూఢులైన సైనికులు అనేకమంది.

"నగర పాలకుల వారి ఆజ్ఞలను ఉల్లంఘించి, తిరుగుబాటు ప్రోత్సహించే వారి మీద తలకు పాతిక నాణేలు పన్ను – తలలు ఊపి వెంట నడిచే వారందరూ పదిహేను నాణేలను సమర్పించుకోవాలి" ఆ గుంపునకు అడ్డుగా నిలబడుతూ చెప్పాడు ఆ అశ్వికుల నాయకుడు.

"దుర్మార్గం ఇది... దౌర్జన్యం... మేము అంగీకరించేది లేదు" బిగ్గరిగా అరిచాడు అందరికంటే ముందున్న పౌరుడు.

అతని కంటికి కనిపించనంత వేగంతో పైకి లేచింది ఆ అశ్వికుల నాయకుడి కరవాలం.

ఎగిరి ఆవల పడిపోయింది ఆ పౌరుడి శిరస్సు.

నిర్ఘాంతపడి శిలా విగ్రహాల మాదిరి నిలుచుండి పోయారు మిగిలిన పౌరులు అందరూ... పన్నులు విధించడం అన్యాయమని బహిరంగంగా ప్రకటించినందుకు శిక్ష – తలను ఉత్తరించటమా??

"కొట్టండి... అందరినీ క్రిందికి నెట్టి నడుములు విరిగి పోయేటట్లు విరగ పొడవండి" ఖంగుమంటున్న కంఠంతో మిగిలిన వారందరికీ ఆజ్ఞ ఇచ్చాడు అశ్వికుల నాయకుడు.

ఒక్కసారిగా తమ వాహనాల మీది నుంచి క్రిందికి దూకారు వారందరూ. తమ నడుములకు వ్రేలాడుతున్న కొరడాలను అందుకుని, పౌర సమూహం మీదికి ఎగబడ్డారు. ఛళ్ ఛళ్మనే శబ్దాలతో దద్దరిల్లిపోవడం మొదలుపెట్టింది ఆ రాచవీధి... బాధ భరించటం సాధ్యం కాక గగ్గోలుగా అరుస్తూ తలా ఒక ప్రక్కకు పారిపోవటానికి ప్రయత్నించారు పౌరులు.

చిన్నచిన్న సందులలో నుంచి కూడా ఇవతలికి వచ్చి వారి మార్గాల్ని నిరోధించారు రాజభటులు.

"మీ ప్రాణాలు మీకు దక్కాలంటే మీకు విధించిన పన్నులను చెల్లించండి... లేదా ప్రాణాల్ని పోగొట్టుకోండి..." పొడవాటి బరిశెల్ని వారి గుండెలకు గురిపెడుతూ హెచ్చరించారు.

తనకు తెలియకుండానే పిడికిలి బిగించాడు ఆ దృశ్యాన్ని చూసిన శ్యామలుడు.

చీకటిపడిన వెంటనే నగర ద్వారాలు బంధించబడతాయని తెలిసి ఉండటం వల్ల, ఎక్కడా ఆగకుండా నగరంలోకి వచ్చేశాడు అతను.

"మంచి వసతిని వెతికి ఈ రాత్రికి విశ్రాంతి తీసుకుందాము... తెల్లవారిన తరువాత నగర పాలకుడిని గురించి తెలుసుకుందాము" అన్నాడు అతను అంతకు పది క్షణికాలకు ముందే - తన జతగాడితో.

అంతలోనే కనిపించిన ఆ దృశ్యం అతని రక్తాన్ని ఉడుకు ఎత్తించింది. "అర్థం పర్థం లేని పన్నుల్ని విధించే నగర పాలకుల గురించి ప్రత్యేకంగా తెలుసుకోవాల్సిన అవసరం లేదు. అధముల్లో కెల్లా అధముడు. దురాత్ముడు" అంటూ తన కరవాలాన్ని వరలో నుంచి బయటికి తీయబోయాడు.

"మిత్రమా... తొందర వద్దు... ఒకసారి అటుకేసి చూడు" అంటూ ఆ వీధి చివరి భాగంలో వున్న కూడలి వైపు చూపించాడు గదాధరుడు.

లావుగా వున్న ఇనుప స్తంభం ఒకటి పాతి పెట్టబడి వున్నది ఆ కూడలి మధ్య భాగంలో... ఆ స్తంభానికి వ్రేలాడ గట్టబడి ఉన్నది ఇనుప చువ్వలతో అల్లబడిన పెద్ద పంజరం.

ఆ పంజరంలో నిలువబడి ఉన్నాడు ఒక సైనికుడు. ఆకలి దప్పులతో అలమటించిపోతున్నట్లు కనిపిస్తోంది అతని వాలకం.

"మిత్రమా... అతన్ని ఎక్కడో చూసినట్లుంది" అటుకేసి చూసిన వెంటనే అన్నాడు శ్యామలుడు. రెండే రెండు అడుగులు ముందుకు వేసిన వెంటనే "అతను. నా గాయానికి ఆకుపసరు వేసి కట్టుకట్టిన సైనికుడు..." గుర్తుపట్టి గబగబా చెప్పాడు.

చెప్పటంతో ఆగలేదు. పరుగులాంటి నడకతో ఆ పంజరం దగ్గిరికి బయలుదేరాడు. పది అడుగులు కూడా వేయకముందే అతని మార్గానికి అడ్డుగా ప్రత్యక్షం అయ్యాడు అశ్వికుల నాయకుడు.

"ఎవరు మీరు?" దురుసుగా అడిగాడు.

తల విదిలించి కోరగా తలఎత్తి సమాధానం చెప్పబోతున్న శ్యామలుడి చేతిని పట్టుకుని బలవంతంగా వెనక్కి లాగాడు గదాధరుడు.

"అయ్యా... పరదేశీయులము మేము... చెంగలువ నగరానికి పోబోయి, పొరపాటున దారితప్పి ఈ నగరానికి వచ్చాము..." వినయంగా తను సమాధానం ఇచ్చాడు.

తన వెనుక వున్న ఎవరో ఒక రాజసేవకుడితో ఏదో చర్చించాడు అశ్వికుల నాయకుడు.

"మంచిది... దారితప్పి మా నగరంలోకి వచ్చిన పరదేశీయుల పట్ల మా నగర పాలకుల వారు ఉదారంగా వ్యవహరిస్తారు. మీ ఇద్దరూ తలకు ఏబది వెండి నాణేలను పన్ను రూపంలో చెల్లిస్తే సరిపోతుంది" అన్నాడు.

తన చెవుల్ని తను నమ్మలేక పోతున్నట్టు కనుల్ని పెద్దవి చేసి చూశాడు గదాధరుడు.

"ఏబది వెండి నాణేలను చెల్లించాలా? ఏ విధంగా? చెల్లించ లేకపోతే?" అని అడిగాడు.

"పన్నులు చెల్లించని వారిని నడి వీధిలో నిలబెట్టి కొరడాలతో కొట్టించమని ప్రభువుల వారి ఆజ్ఞ... ఆ తరువాత దగ్గిర వున్న సర్వస్వాన్ని తీసుకుని నగరంలో నుంచి బహిష్కరించమని మరో ఆజ్ఞ" నిష్కర్షగా చెప్పాడు అశ్వికుల నాయకుడు.

కను చివరల నుంచి తన జతగాడి కేసి చూశాడు గదాధరుడు. ఎరుపురంగు పులుముకుంటున్నాయి అతని కనులు. పళ్ళు పటపటమని మ్రోతలు చేసేందుకు సిద్ధం అవుతున్నాయి.

కోపం అంటూ వస్తే శ్యామలుడిని ఆపటం, అడ్డుకోవటం తనకు కూడా అసాధ్యమేనని తెలుసు గదాధరుడికి.

"నగర పాలకుల వారి విశాల హృదయానికి పాదాభి వందనాలు. మీరు చెప్పిన నాణేల్ని వెంటనే ఇచ్చుకుంటాము..." అంటూ తన దట్టీలోనుంచి ఒక నాణేల మూటను తీసి అశ్వికుల నాయకుడికి అందించాడు.

"మిత్రమా... నువ్వు తొందరపడబోకు..." అంటూ అతన్ని వారించ బోయాడు శ్యామలుడు. కనులతోనే అతన్ని హెచ్చరించాడు గదాధరుడు.

అతను అందించిన మూటలోని నాణేలను లెక్క చూసుకుని సంతృప్తిగా తల ఊపాడు అశ్వికుల నాయకుడు.

"కూడలికి ఆవలగా మా ప్రభువులు నిర్మించిన ధర్మసత్రం ఒకటి ఉన్నది. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి" అంటూ తన అశ్వాన్ని ముందుకు పోనిచ్చాడు.

"వాడు మనిషికాదు మిత్రమా... పిశాచం... వాడిని ఊరికే వదలటమా..." అంటున్న శ్యామలుడి చేతిని గట్టిగా పట్టుకుని బలవంతంగా కూడలి వైపు నడిపించాడు గదాధరుడు.

"తప్పు అతనిది కాదు మిత్రమా... అతనివంటి వారిని పెంచి పోషిస్తున్న నగర పాలకుడిది. పన్నుల నిర్ణయం నగర పాలకుడిదేనని మర్చిపోకు" అంటూ అతని కోపాన్ని తగ్గించటానికి ప్రయత్నం చేస్తూ – "మిత్రమా... అటు చూడు" అంటూ మరో హెచ్చరిక చేశాడు.

అతను చూపించిన వైపు చూసిన శ్యామలుడు తనకు తెలియకుండానే నడి వీధిలో ఆగిపోయాడు.

కూడలిలో వున్న ఇనుప స్తంభానికి వ్రేలాడుతున్న పంజరం వైపే చూస్తున్నారు ఇద్దరు స్త్రీలు.

తమను ఎవరూ సూటిగా చూడకుండా ఒక ఇంటి చాటున నిలబడి ఉన్నారు వాళ్ళు. తలల మీద మందపాటి వస్త్రాల్ని ముసుగులుగా ధరించి ఉన్నారు.

"మనం రక్షించిన మహారాణి... ఆమె చెలికత్తె... సందేహం లేదు. ముసుగులు వేసుకున్నంత మాత్రాన మనం గుర్తు పట్టలేమని వారి భావన కాబోలు" పళ్ళు బిగిస్తూ అన్నాడు శ్యామలుడు.

"ఆ ముసుగులు మనం గుర్తు పడతామని కాకపోవచ్చు. తమ చర్యల్ని నగర పాలకుడు గమనించకుండా ముందు జాగ్రత్త కోసం అయి ఉండవచ్చు" అన్నాడు గదాధరుడు.

"ఈ మహారాణి పద్ధతుల మీద నాకు నమ్మకం సన్నగిల్లిపోయింది. ఆమె చర్యల్ని గట్టిగా గమనించాల్సి ఉంది" అన్నాడు శ్యామలుడు.

నడివీధిని వదిలి ఒక ప్రక్కకు వెళ్ళారు వారిద్దరూ... అప్పటికి మసక చీకట్లు ముసురుకోవడం మొదలు అయినందువల్ల, వారిని గమనించడం ఆ స్త్రీలకు చేతకాలేదు.

పది అడుగుల దూరంలోకి పోయి మరో ఇంటికి సంబంధించిన గోడప్రక్కన నిలుచున్నాడు గదాధరుడు. శ్యామలుడిని తన వెనుక నిలుచోమని సైగ చేశాడు.

"తల్లీ... ఎంతసేపు మనం ఇక్కడ నిలబడటం? ఎవరైనా గమనిస్తే ప్రమాదం" అంటున్నది మహారాణి వారి చెలికత్తె.

"ఆకలి దప్పులతో శక్తి విహీనుడై పోయి ఉన్నాడు అతను. ఇప్పుడు గనుక ప్రభువుల వారు గట్టిగా ప్రశ్నిస్తే మన గురించి బయట పెట్టేస్తాడేమోనని అనిపిస్తోంది నాకు..." అంటున్నది మహారాణి.

"తల్లీ... మనం చేయగలిగింది ఏమీలేదు... అటువంటి ప్రమాదం ఎదురు కాకూడదని భగవంతుడిని ప్రార్థించటం తప్ప..." అన్నది చెలికత్తె.

"భగవంతుడి మీద భారం వేయటం వల్ల సమస్యలు పరిష్కరించబడవు. మనమే పూనుకోవాలి" అంటూ పయ్యెద చాటునుంచి పొడవాటి చురికను బయటికి తీసింది మహారాణి.

"ఎందుకు తల్లీ అది? ఇప్పుడు దానితో అవసరం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది చెలికత్తె.

"అతని నోటిని శాశ్వతంగా మూయించేస్తే ఈ ప్రమాదం తప్పిపోతుంది, అతను ప్రాణాలతో ఉన్నంతవరకూ మనం భయపడుతూ ఉండవలసిందే" అంటూ ఛురికను బలంగా ముందుకు విసిరింది మహారాణి.

ఊపిరి ఆగిపోయినంత పని అయింది చెవులురిక్కించి వారి సంభాషణ ఆలకిస్తున్న గదాధరుడికి.

"ఏబది నాణేలు పన్ను విధించటమే అన్యాయమని మనం అనుకున్నాము. అంతకంటె దారుణం మరొకటి జరిగి పోతున్నది. స్త్రీలు సుకుమార హృదయులు అనే నా నమ్మకం పూర్తిగా సడలిపోతున్నది" అంటూ తన కరవాలాన్ని వేగంగా బయటికి లాగి, వెనుకా ముందు చూడకుండా బలంగా విసిరాడు గదాధరుడు.

గింగిరాలు తిరుగుతూ వేగంగా దూసుకుపోతున్నది మహారాణి విసిరిన ఛురిక... ఇనుప ఊచల మధ్య నుంచి పోయి నిస్త్రాణగా నిలబడి వున్న సైనికుడి గుండెల్లో దిగబడబోతున్నది.

దానికంటె రెట్టింపు వేగంతో పోయి అది పంజరాన్ని సమీపిస్తూ ఉండగా... అడ్డుకున్నది గదాధరుడు విసిరిన కరవాలం...

ఖంగుమంటు వినవచ్చింది శబ్దం. సన్నపాటి నిప్పు రవ్వలు నాలుగు ప్రత్యక్షం అయ్యాయి. దబ్బుమని శబ్దం చేస్తూ క్రింద పడిపోయాయి రెండూ.

కనులు చిట్లించి చూస్తున్న మహారాణి అదిరిపడింది ఒక్కసారిగా... "ఎవరు? ఎవరు మా ఛురికను అడ్డుకున్నది ఎవరు?" అని అడుగుతూ చుట్టూ చూడబోయింది.

తన ముఖాన్ని ఆమెకు చూపించడం ఇష్టం లేక, చటుక్కున వెనక్కి జరిగాడు గదాధరుడు.

"ఆగదు ఆమె... ఇటుగా వచ్చేస్తుంది" అతని భుజం మీదినుంచి చూస్తూ హెచ్చరించాడు శ్యామలుడు.

అతను హెచ్చరించినట్లుగానే విసవిసా నడుస్తూ వారు దాగుకుని ఉన్న ఇంటికేసి బయలుదేరబోయింది మహారాణి.

చటుక్కున ఆమెను అడ్డుకున్నది చెలికత్తె. "గందరగోళం మొదలు అయితే నష్టం మనకే తల్లీ... ఇక్కడ వుండడం చాలా ప్రమాదం" అని హెచ్చరించింది.

"మరి ఆ సైనికుడు?" పళ్ళు బిగపడుతూ అడిగింది మహారాణి.

"అంతఃపురానికి పోయి మరోమార్గం వెతుకుదాము. ఈ రాత్రి గడిచి తెల్లవారేసరికి వాడు హతమారిపోయేటట్లు చూద్దాము..." అంటూ బలవంతంగా ఆమెను సందులోకి తీసుకుపోయింది చెలికత్తె.

పది క్షణికాలు మాత్రమే ఆగి వీధిలోకి వచ్చాడు గదాధరుడు. మసక చీకట్ల మూలకంగా పంజరం దగ్గిర జరిగింది ఎవరికీ అర్థం కాలేదు.

పరుగుపరుగున పోయి క్రిందపడి వున్న కరవాలాన్ని, దానితోపాటు ఛురికను తీసుకున్నాడు అతను.

"అతన్ని క్రిందికి దించాలి..." అన్నాడు శ్యామలుడు.

ఆ మాటల్లో తడబాటు లేదు... తడుముకోవడం అంతకన్నా లేదు.

"నువ్వు చెప్పిన విధంగానే ఇతన్ని పంజరంలో నుంచి బయటికి తీసుకు వచ్చే బాధ్యత నాది. అయితే ఇప్పటికిప్పుడు ఆ పని చేయటం మాత్రం సాధ్యపడదు... కొంచెం వ్యవధి అవసరం అవుతుంది" నడుము మీద చేతులు వేసుకుని నిలుచున్న శ్యామలుడికి చెప్పాడు అతను.

"నీ కరవాలాన్ని మరోసారి గట్టిగా విసిరితే పుటుక్కున తెగిపోతుంది పంజరాన్ని పట్టి ఉంచిన త్రాడు. పంజరం క్రిందికి వచ్చేస్తుంది. చిటికెలో జరిగిపోయే పని. ఏమంత కష్టమైనది కూడా కాదు" చెప్పాడు శ్యామలుడు.

"మిత్రమా లేడికి లేచిందే ప్రయాణం అన్నట్లుగా మాట్లాడావు. నగర పాలకుడు నిర్ణయించిన పన్ను చెల్లించాము కాబట్టి సైనికులు ఎవరూ మన గురించి పట్టించుకోవడం లేదు. చెల్లించకుండా ఉన్నట్లయితే ఈపాటికి కొరడాలు పట్టుకుని మనల్ని చుట్టుముట్టేసి ఉండేవారు" అన్నాడు గదాధరుడు.

అతని మాటల్లో అసత్యం అంటూ ఏమీలేదని తెలుస్తూనే ఉన్నది. అశ్వాలను అధిరోహించి అటూ ఇటూ పరుగులు తీయిస్తున్నారు సైనికులు. తమను చూసి దూరంగా పారిపోవటానికి ప్రయత్నిస్తున్న పౌరులను వెతికి వెతికి మరీ పట్టుకుంటున్నారు.

అరుపులు, ఆర్తనాదాలు, సైనికుల గర్జనలతో అల్లకల్లోలంగా ఉన్నది వీధి... తాము లోహస్తంభానికి వ్రేలాడుతున్న పంజరాన్ని పడగొడుతూ ఉండటాన్ని ఎవరైనా చూడడం అంటూ జరిగితే, తమను కూడా అదే పంజరంలోకి నెట్టి గాలిలో వ్రేలాడదీస్తారు.

"నేను వ్యవధి ఎందుకు అడిగానో ఇప్పుడు అర్థం అయింది కదా. ఇక ముందుకు నడువ్...." అంటూ అతని చేతిని పట్టుకుని అవతలికి నడిపించ బోయాడు గదాధరుడు.

"ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలుడు.

సైనికుల నాయకుడు ఏదో ధర్మసత్రాన్ని గురించి చెప్పాడు కదా... ముందు అక్కడికిపోయి, ఆ తరువాత మట్లాడుకుందాము" అన్నాడు గదాధరుడు.

అయిష్టంగానే అడుగులు కదిపాడు శ్యామలుడు.

చిన్నపాటి రాతి కట్టడంలో నిర్వహించబడుతూ ఉన్నది సైనికుల నాయకుడు చెప్పిన ధర్మసత్రం.

"రండి నాయకులారా... రండి... మా నగర పాలకుల వారి దాతృత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఈ సత్రంలో మా ఆతిధ్యాన్ని స్వీకరించండి. రండి రండి" ఆ కట్టడం ఎదుట నిలబడి పెద్ద కంఠంతో అరుస్తున్నాడు ఒక వ్యక్తి.

"విచిత్రంగా ఉంది... వాడు ఎవరోగాని అతిధుల రాకకోసం అలమటించి పోతున్నాడు" ఆశ్చర్యంగా అన్నాడు గదాధరుడు.

"కారణం లేకుండా ఎవరూ అలా అలమటించరు. దగ్గరికి పోతే మనకే తెలిసిపోతుంది ఆ కారణం ఏమిటో" అన్నాడు శ్యామలుడు.

మరో పది అడుగులు కూడా పూర్తిగా వేయకముందే వారిద్దరినీ చూడనే చూశాడు ఆ వ్యక్తి.

"రండి.... రండి... వచ్చేయండి" ఆనందంగా అంటూ తనే వారికి ఎదురు వచ్చాడు.

ఎక్కడి వాడక్కడ ఆగిపోయాడు గదాధరుడు.

"సంశయించటం దేనికి నాయనా? ఆగిపోవాల్సిన అవసరం ఏమిటి?" గబగబా దగ్గరికి వచ్చి అతని చేతిని పట్టుకుంటూ అడిగాడు ఆ వ్యక్తి.

"ఆతిధ్యం తీసుకోకపోతే ఏం జరుగుతుంది?" అతను గట్టిగా ముందుకు లాగినా కదలకుండా స్థిరంగా నిలబడుతూ అడిగాడు గదాధరుడు.

"సైనికులు వస్తారు... బలవంతంగా నడిపిస్తారు...." అన్నాడు ఆ వ్యక్తి.

"చూడు నాయనా... నగర పాలకుల వారు విధించిన పన్ను చెల్లించటం పూర్తి అయిపోయింది... ఇప్పుడు ఇంకోసారి చెల్లించడం మాకు అసాధ్యం...." అంతవరకూ మాట్లాడకుండా నిలబడిన శ్యామలుడు వెంటనే అన్నాడు.

వెలాతెలా పోయింది సత్రపు మనిషి వదనం. "రాత్రి రెండవ ఝాము గడిచిపోయే లోపల కనీసం పది మందితోనైనా సరే పన్ను కట్టించవలసిందిగా నాకు ఆదేశాలు ఇవ్వబడ్డాయి. మీరు కాదని అంటే నాకు ఈ నేలమీద నూకలు చెల్లిపోతాయి. దయచేసి కాదని అనకుండా మా ఆతిధ్యాన్ని స్వీకరించి ఎంతో కొంత పన్ను చెల్లించండి. నా ప్రాణాలు కాపాడండి" వేడికోలుగా అన్నాడు.

"ఈ పన్నులు విధించటం ఏమిటో చాలా విచిత్రంగా ఉన్నది మిత్రమా... ఒక మనిషి రోజుకు ఎన్నిసార్లు పన్ను చెల్లించవలసి వస్తుందో అంతు బట్టడంలేదు" అన్నాడు గదాధరుడు.

"అయ్యలూ ఆలోచించకండి... దయచేసి ఆతిధ్యం స్వీకరించండి" సత్రం మనిషి మరోసారి జాలిగొలిపే కంఠంతో అడిగేసరికి, అంతం అయి పోయాయి స్నేహితుల ఆలోచనలు అన్నీ.

అతని చేతిని వదిలించుకుని తనంతట తనే ముందుకు కదిలాడు గదాధరుడు. సత్రం నిర్వహించబడుతున్న కట్టడాన్ని సమీపించిన వెంటనే, లోపల నుంచి బిలబిలలాడుతూ బయటికి వచ్చారు పదిమంది భటులు.

"పరదేశీయుల తలల మీద పన్నులు విధించబడ్డాయి. చెల్లించకపోతే కారాగారవాసం...." అంటూ స్నేహితులను చుట్టుముట్టి నిలుచున్నారు.

"ఇంతకుముందే తలకు ఏబది నాణేల పన్ను చెల్లించాం" చెప్పాడు గదాధరుడు.

"అది నడివీధిలో నడుస్తూ కనిపించినందుకు... ఇది ఈ సత్రంలో ఆతిధ్యం తీసుకోవటానికి వచ్చినందుకు" ముక్తసరిగా చెప్పి చేతులు జాచాడు ఆ సైనికుల నాయకుడు.

"ఈ రాత్రి గడిచి తెల్లవారేసరికి ఇంకా ఎన్ని మార్లు పన్ను చెల్లించవలసి వస్తుందో తెలియటం లేదు...." తనలో తను అనుకుంటూ మరోసారి ఇంకో చిన్ని నాణేల మూటను తీసి అతనికి అందించాడు గదాధరుడు.

"మీరు లోపలికి పోయి విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. నేను ఇంకా కొంత మంది అతిధులను వెతికి పట్టుకోవలసి ఉన్నది" అంటూ వారిద్దరినీ అక్కడే వదిలి మరోసారి వీధి సమీపంలోకి పోయి నిలుచున్నాడు సత్రం మనిషి.

"రాబందుల గుట్ట దగ్గిర ఈ నగరపాలకుడి మూకని నాశనం చేసి మనం తప్పు చేశామని అనిపిస్తోంది మిత్రమా... వారి జోలికి పోకుండా ఉండి ఉన్నట్లయితే, వారి దోపిడీలు నిర్విఘ్నంగా కొనసాగి ఉండేవి. ఈ పన్నులు విధించటం ఉండేది కాదు...." అంటూ సత్రం ముందు భాగంలోనే ఉన్న అరుగు మీద చతికిలబడ్డాడు గదాధరుడు.

"లోపలికిపోండి... వీధిలో కూర్చోవలసిన అవసరం లేదు" అరిచాడు అతన్ని చూసిన సత్రం మనిషి.

"లోపలికి పోతే ఏం జరుగుతుందో తెలియదు. మన దగ్గిర నాణేల మూటలు నిండుకోవడానికి సిద్ధంగా వున్నాయి" శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

ఆ మాటల్ని వినిపించుకోలేదు శ్యామలుడు... అతని దృష్టి అసలు అక్కడ లేదు.

"మిత్రమా... మనం వెంటనే ఈ ప్రదేశాన్ని వదిలిపెట్టి అవతలికి వెళ్ళిపోవటం చాలా మంచిదని అనిపిస్తోంది" చిన్న కంఠంతో హెచ్చరించాడు.

"ఏమయింది మిత్రమా? ఎందుకు అంత తొందర?" అరుగుమీది నించి లేస్తూ అడిగాడు గదాధరుడు ఆశ్చర్యంగా.

తలతోనే చూపించాడు శ్యామలుడు.

అంతకుముందు సైనికుల కంట పడకుండా తలా ఒక ప్రక్కకుపోయి తలలు దాచుకున్న పౌరులు అందరూ... తిరిగి వీధుల్లోకి వచ్చేస్తున్నారు.

"ఆశ్చర్యం... ఏమిటి ఈ గందరగోళం??" అంటూ పది అడుగులు ముందుకు వేసి కనులు చిట్లించాడు గదాధరుడు.

వేగంగా పరిగెత్తుకు వచ్చిన వారిలో ఎవరితోనో ఏమిటో మాట్లాడాడు సత్రం అధికారి. మాట్లాడిన వెంటనే క్షణికం పాటు కూడా ఆలస్యం చేయలేదు.

"నాలుగు కాలాలపాటు బ్రతికి ఉండాలన్న కోరిక గనుక మీకు ఉంటే వెంటనే పాదాలకు బుద్ధి చెప్పండి. పారిపోండి" అంటూ తాను కూడా పరుగు మొదలు పెట్టి చిటికెలో మటుమాయం అయిపోయాడు.

"ఏమిటది మిత్రమా... ఏమయింది వారందరికీ" అప్పటికి కూడా ఆ గందరగోళానికి కారణం ఏమిటో అవగతం కాకపోవడం వల్ల, అయోమయంగా అడిగాడు గదాధరుడు.

"చెట్ల తోపులో ఉండగా మనం చూసిన దృశ్యాన్ని గుర్తుకు తెచ్చుకో... చెట్ల మీది పక్షుల్ని భయపెట్టిన ప్రమాదం ఏదో నగరం మీదికి వచ్చేసినట్లుంది" అన్నాడు శ్యాములుడు.

అతను ఆ మాటలు అంటూ ఉండగానే గట్టుతెగిన వరద మాదిరి పెద్ద ప్రవాహం మాదిరి పరుగులు తీస్తూ అటుగా వచ్చేశారు అనేకమంది పౌరులు.

"పారిపోండి... రాక్షసిలాంటి కొండచిలువ నగరం మీదికి వచ్చేసింది" బిగ్గరగా అరుస్తూ కొంతమంది సైనికులు కూడా ఆ జనంతో పాటుగా వస్తూ కనిపించారు.

"రాక్షసిలాంటి కొండచిలువ నగరం మీదికి రావటం ఏమిటి మిత్రమా... మనకి తెలిసిన పాములు రెండే రెండు... అవి హతమారిపోవటం మనం స్వయంగా చూశాం" అన్నాడు గదాధరుడు.

"ఈ ప్రపంచంలో ఉన్న పాములు అవి రెండే కాదు. ఇంకా చాలా ఉన్నాయి. బహుశా దిగంబరస్వామి ఈ ప్రమాదాన్ని సృష్టించి ఇటుగా పంపకం చేసి ఉండవచ్చు" అంటూ వీధిలోకి పరుగు తీశాడు శ్యాములుడు.

"ఎక్కడికి? ఎక్కడికి మిత్రమా?" – ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ అతన్ని అనుసరించాడు గదాధరుడు.

అటునుంచే పరుగెత్తుకు వస్తున్నారు జనం... అంటే నగరం మీద విరుచుకుపడిన ప్రమాదం ఏదో అటువైపే ఉన్నదని అర్థం... తాము దానికి ఎదురు పోవటం వివేకం అనిపించుకుంటుందా??

గదాధరుడి ఆలోచనల గురించి కొంచెంగా కూడా పట్టించుకోలేదు శ్యామలుడు. వింటి నుంచి వెలువడిన బాణం మాదిరి సూటిగా నాలుగు వీధుల కూడలి దగ్గరికి పోయాడు.

నిర్మానుష్యమైపోయి ఉంది అప్పటికే ఆ ప్రదేశం. ఇనుప ఊచల పంజరంలో నిలబడి విపరీతమైన భయంతో వణికిపోతున్నాడు అందులోని సైనికుడు.

"వచ్చేస్తోంది... భయంకరమైన పాము వచ్చేస్తోంది" కీచు కంఠంతో అరిచి కేకలు పెడుతున్నాడు.

నునుపుగా ఉన్న లోహస్తంభం మీదికి వేగంగా ఎగప్రాకాడు శ్యామలుడు. వరలో ఉన్న కరవాలాన్ని బయటికి లాగి, పంజరాన్ని పట్టి ఉంచిన త్రాడును తెగగొట్టలేదతను.

ఆ త్రాడు తెగితే, పంజరం వేగంగా క్రింద పడిపోతుంది. ఆ అదటును తట్టుకోలేక చిటికెలో కళ్ళు తేలవేస్తాడు ఆ సైనికుడు.

కరవాలాన్ని వెనక్కి తిప్పి, పంజరపు తలుపులకు బిగించి ఉన్న తాళం కప్పమీద బలంగా మోదాడు శ్యామలుడు. రెండు దెబ్బల్ని తట్టుకున్నది అది. మూడవ దెబ్బకు పగిలిపోయింది. తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

విస్ఫారిత నేత్రాలతో చూస్తూ విగ్రహం మాదిరి నిలువబడిపోయిన సైనికుడి చేయి పట్టుకుని తనకేసి లాగాడు శ్యామలుడు.

"పాము... రాక్షసి పాము...." తడబడుతున్న కంఠంతో అతన్ని హెచ్చరించాడు అతను.

"పాము పామంటూ ఇక్కడే నిలబడిపోతే ప్రాణాల్ని పోగొట్టుకోవటం తప్పనిసరి అవుతుంది.... పారిపోవాలి మనం...." అంటూ అతన్ని ఒక చేత్తో కౌగలించి పట్టుకుని బర్రున క్రిందికి జారాడు శ్యామలుడు లోహ స్తంభం మీది నించి.

సరిగ్గా అదే సమయంలో కూడలి దగ్గరికి వచ్చేసింది ఆ సైనికుడు పలవరిస్తున్న పాము.

పది నిలువల ఎత్తుకు తలను పైకి ఎత్తి, తనకు అగుపించిన కట్టడాలను, భవనాలను నేలమట్టం చేసేస్తోంది అది. కంటబడిన ప్రతి మనిషినీ గుటుక్కున మింగేస్తోంది.

"ఇదేదో మనం ఎదిరించిన కిన్నెరలకు మాతృమూర్తి మాదిరిగా ఉంది. ఇటువంటి జీవం ఒకటి భూమి మీద ఉంటుందని నేను కలలో కూడా ఊహించలేదు" అంటూ పరుగు మొదలు పెట్టాడు గదాధరుడు.

కాళ్ళూ, చేతులు విరిగిపోయిన బొమ్మ మాదిరి వ్రేలాడబడిపోతున్న సైనికుడిని భుజాల మీద వేసుకుని అతన్ని అనుసరించాడు శ్యామలుడు.

* * * * *

"ఇది తప్పకుండా ఆ త్రికుట వర్ధనుడి పన్నాగమే... మనం చీకటిస్వామిని ఆశ్రయించినట్లు అతను కూడా ఎవరో మంత్రవాది సహాయాన్ని పొందినట్లు నాకు అనిపిస్తోంది...." పళ్ళు బిగిస్తూ అన్నాడు సభాభవనంలో సింహాసనం మీద కూర్చుని ఉన్న నగర పాలకుడు.

"త్రికుట వర్ధనుడు ఎవరి సహాయాన్ని పొందాడో ఇప్పుడు అనవసరం ప్రభూ... ఆ పాము నగరంలోకి వచ్చేసింది. దాని దృష్టి రాచభవనాల మీదికి ప్రసరించకముందే తమరు సురక్షిత స్థానానికి చేరుకోవటం చాలా మంచిది...." అన్నాడు సేనాపతి.

"ఇంత బతుకూ బతికి ఆఖరికి ఒక వానపామును చూసి మేము దూరంగా పారిపోవటమా? మన సైనికులందరినీ హెచ్చరించండి... ఆ అజగరాన్ని ఎదిరించి మట్టుబెట్టమని మా ఆజ్ఞగా తెలియచేయండి" కరుకు కంఠంతో ఆజ్ఞ ఇచ్చాడు నగరపాలకుడు.

"అది వానపాము కాదు ప్రభూ.. మహాసర్పం... దాని ఎదుటపడిన వారు ఎవరూ ఎంతోసేపు ప్రాణాలతో ఉండటం లేదు...." అన్నాడు సేనాపతి.

"అడిగిన మొత్తాలను అందరికీ చెల్లిస్తున్నది దేనికి? మీరందరూ చెపుతున్న మాటలకు తల ఊపటానికా? వెంటనే వెళ్ళి దాన్ని ఎదిరించండి... వెళ్ళండి...." ఖంగుమంటున్న కంఠంతో బిగ్గరగా అరిచినంత పని చేశాడు నగరపాలకుడు.

వెంటనే తల ఊపి భవనం వెలుపలికి పరుగు తీయవలసిన సేనాపతి అటువంటి పని ఏదీ చేయలేదు. అలాగే కదలకుండా నిలబడ్డాడు.

"కదలవేమిటి? మా మాటలు వినబడటం లేదా? నీ చెవులు మూసుకుపోయాయా?" ఆశ్చర్యం, ఆవేశం కలగలసిన కంఠంతో అరిచాడు నగరపాలకుడు.

"మీరు చెల్లించే మొత్తాలు కేవలం మానవులతో పోరాడటం కోసమే... మానవాతీత శక్తులతో తలపడటానికి కాదు. మా శక్తికి మించిన పని మేము చేయలేము...." ఖచ్చితమైన కంఠంతో అన్నాడు సేనాపతి.

అణిగిపోయింది నగర పాలకుడి ఆవేశం... తన చెవులను తానే నమ్మలేకపోతున్నట్లు ముఖం పెట్టాడు.

"సైనికులారా... వెంటనే వచ్చి ఈ తిరుగుబాటు దారుడిని బంధించండి... మా ఆజ్ఞలను నిర్లక్ష్యం చేస్తున్న ఇతనికి మరణమే సరైన శిక్ష" పెద్ద కంఠంతో సభా భవనంలో ఉన్న సైనికులను పిలిచాడు.

ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ రాతి బొమ్మల మాదిరి అలాగే నిలుచుండిపోయారు వాళ్ళందరూ. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

"ఏమయింది మీకందరికీ? రండి... వచ్చి ఇతడిని బంధించండి...." మరోసారి అరిచాడు నగర పాలకుడు.

పెద్దగా నవ్వాడు సేనాపతి. "త్రికుట వర్ధనుడి మీద పగ సాధించాలన్న తపనలో పడి నగరపాలన మీద నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు మీరు... సైనికులు అందరూ నా పక్షం... నేను చెప్పిందే చేస్తారు...." అంటూ చప్పట్లు చరిచాడు.

"బంధించండి... నగరపాలకుల వారిని పట్టుకుని కరచరణాలను కదల కుండా కట్టిపడవేయండి...." అన్నాడు.

వెంటనే కదిలారు సైనికులు... నగరపాలకుడి వైపు పరిగెత్తుకుంటూ వచ్చారు.

నెత్తురు లేనట్లు తెల్లగా పాలిపోయింది నగరపాలకుడి ముఖం. తన నమ్మినబంటువంటి సేనాపతి ఆ విధంగా తిరుగుబాటు చేస్తాడని ఊహించలేక పోయాడతను.

"దుర్మార్గుడా... విశ్వాస ఘాతకుడా... నీ దుష్ప్రవర్తనకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు...." కీచుకంఠంతో అరిచాడు.

"ఎవరికి చెల్లించుకోమంటారో చెప్పండి నగరపాలకుల వారూ? మీరు దోపిడీలు సాగించమని చెప్పిన గ్రామాల వారికి చెల్లించుకోమంటారా? మీ ఆగర్భ శత్రువు త్రికుట వర్ధనుడికి చెల్లించుకోమని అంటారా?" అంటూ మరోసారి సైనికులను ఒత్తిడి చేశాడు సేనాపతి.

"చూస్తారేం? బంధించండి" అంటూ.

దగ్గరికి వచ్చేసిన ఇద్దరు భటుల్ని బలంగా వెనక్కి నెట్టి, సింహాసనం వెనుకభాగంలోకి పరుగు తీశాడు నగర పాలకుడు. అక్కడ వ్రేలాడుతున్న పట్టు తెరల వెనుక ప్రక్కకు పోయి అదృశ్యం అయినాడు.

అర క్షణికం తరువాత తాము కూడా ఆ తెరల దగ్గరికి పోయారు సింహాసనం ముందుకు వచ్చిన సైనికులు.

"మూర్ఖులు మీరు... చేతకాని చచ్చు ముఖాలు... తరతరాలుగా ఈ సింహాసనాన్ని పట్టుకుని వ్రేలాడుతున్న వంశానికి చెందినవాడు నగర పాలకుడు. ఈ భవనంలో ఎన్ని రహస్య మార్గాలున్నాయో వాటన్నిటిని గురించి బాగా తెలిసి ఉన్నటువంటి వాడు... మీ వంటి వారికి చిక్కేంత చేతకాని వాడు కాదు" తను కూడా ఆ తెరల దగ్గరికి వస్తూ కోపంగా అన్నాడు సేనాపతి.

పరుగు పరుగున సభా భవనంలోకి వచ్చారు బయటి నుంచి పాతికమంది సైనికులు. "ఎక్కడ? నగర పాలకుల వారెక్కడ?" చుట్టూ చూస్తూ అడిగారు.

పట్టుతెరల దగ్గర్నించి కదిలి, ఉన్నట్లుండి సింహాసనం మీద కూర్చున్నాడు సేనాపతి.

తమ కన్నుల్ని తామే నమ్మలేకపోతున్నట్టు నోళ్ళు తెరచుకుని చూశారు ఆ సైనికులు.

"నగర పాలకుల వారు పలాయనం చిత్తగించారు. వైదర్భి నగరానికి ఇకనుంచీ నేనే పాలకుడిని. మీరు విన్నవించుకోవలసింది ఏమైనా ఉంటే నాకే విన్న వించుకోండి" గంభీరంగా అన్నాడు సేనాపతి.

తలలు వంచి వినయంగా నమస్కారాలు చేశారు వారందరూ.

"ప్రభువుల వారికి జయము జయము... నగరం మీదికి వచ్చిపడిన రాక్షసి పాము ఇప్పుడు ఈ భవనం వైపే వస్తోంది. ఏదో ఒకటి చేసి దాన్ని వధించకపోతే, ఈ భవనం కూడా నేలమట్టం కాక తప్పదు" వెల్లడించాడు వారిలో ఒకతను.

కాలు మీద కాలు వేసుకుని ఠీవిగా కూర్చున్న సేనాపతి ముఖం తెల్లగా పాలిపోయింది.

"వెళ్ళండి... అందరూ వెళ్ళి మూకుమ్మడిగా దాన్ని వధించండి. అందరూ కలిసి ఒకేసారి ఆయుధప్రయోగం చేస్తే తప్పకుండా అది చచ్చి ఊరుకుంటుంది" అన్నాడు.

"ఆ పని కూడా అయిపోయింది. రెండు వందల మంది సైనికులను సర్వనాశనం చేసేసింది అది...." అన్నాడు ఆ భటుడు.

"ఇంకో రెండు వందల మందిని వెంట బెట్టుకువెళ్ళి–" అని ఆజ్ఞ ఇవ్వబోయాడు సేనాపతి.

అదే సమయంలో ఫెళ్ళుమని వికృత శబ్దం చేస్తూ విరిగి పడిపోయింది సభాభవన ముఖద్వారం.

కంటికి కనిపించని వేగంతో లోపలికి దూసుకు వచ్చింది రాక్షసి సర్పపు తల... సేనాపతికి దాన్ని గురించి చెప్తున్న సైనికులు చెల్లాచెదురు అయి పోయారు. సింహాసనం దగ్గర ఉన్నవారు కూడా అవతలికి పారిపోయారు. తాను కూడా పాదాలకు బుద్ధి చెప్పటానికి ప్రయత్నం చేశాడు సేనాపతి. తాడిచెట్టు ఎంత ఎత్తుగా ఉంటుందో అంత ఎత్తుకు తలను లేపి ఒక్కసారిగా అతని మీద పడిందా అజగరం.

కీచుగా అరిచి, వరలో ఉన్న ఖడ్గాన్ని బయటికి లాగే ప్రయత్నం చేశాడు అతను.

ఆ ప్రయత్నం సఫలం కాకముందే అతని తలను నోటిలో ఇరికించు కున్నది ఆ పాము.

తరతరాలుగా నగర పాలకుడి వంశీయుల ఆధీనంలో ఉన్న సింహాసనాన్ని తాను ఆక్రమించుకున్నానన్న సంతోషాన్ని పూర్తిగా అనుభవించక ముందే ప్రాణాలను పోగొట్టుకున్నాడు సేనాపతి.

సింహాసనాన్ని తలతో కొట్టి అవతలకు నెట్టి వేసిందా పాము. పట్టుతెరల వంక ఒకసారి దీర్ఘంగా చూసింది. దాని నాశికా రంధ్రాలలో నుంచి రివ్వున వెలుపలికి వచ్చాయి ఎర్రటి మంటలు.

భగ్గుమన్నాయి పట్టుతెరలు... కన్నుమూసి కన్ను తెరిచేటంతలో మాడి బూడిద గుట్టలుగా మారిపోయాయి.

వాటి వెనుకభాగంలో ఉన్న గోడను తలతో కొట్టిందా పాము.... విరిగి పడిపోయింది గోడ.... సన్నగా పొడవుగా ఉన్న సొరంగం ఒకటి బయటికి కనిపించింది.

తన నాశికారంధ్రాల నుంచి వెలువడుతున్న అగ్ని జ్వాలలు ఆ చీకటి మార్గాన్ని ప్రకాశవంతం చేస్తుండగా – సొరంగంలోకి ప్రవేశించింది అది... పాదరసం మాదిరి చురుకుగా కదులుతూ ముందుకు సాగింది.

*   *   *   *   *

"తల్లీ... తల్లీ.... పారిపోవాలి... ఆలస్యం చేస్తే ప్రాణాలు దక్కవు...." అంటూ శయన మందిరంలోకి పరిగెత్తుకు వచ్చిన తన చెలికత్తె వంక తీక్షణంగా చూసిందా మహారాణి.

"ఏమయిందే... మన గుట్టు రట్టు అయిందా? పంజరంలోని సైనికుడు మన రహస్యాన్ని బట్టబయలు చేసేశాడా?" అని అడిగింది.

"అయ్యో తల్లీ... అదంతా పాత కథ... పది తాడిచెట్లంత పొడవుగా వున్న పాము ఒకటి నగరాన్ని నాశనం చేస్తోంది" అంటూ నరగంలో చెలరేగుతున్న గందరగోళాన్ని గురించి చెప్పిందా చెలికత్తె.

వెలా తెలాపోయింది మహారాణి వదనం... "నగర పాలకుల వారు ఏం చేస్తున్నారు?" సన్నటి స్వరంతో అడిగింది.

సరిగ్గా అదే సమయంలో దడదడమని శబ్దం చేస్తూ ప్రక్కకు జరిగింది ఆ మందిరంలో ఉన్న ఒక గోడలోని కొంత భాగం.

వడిలిపోయిన వదనంతో మందిరంలోకి వచ్చాడు నగరపాలకుడు.

"దేవీ... ఆలస్యం చేస్తే తట్టుకోలేని పరిస్థితుల్లో చిక్కుబడతాం. వెంటనే మనం అవతలికి వెళ్ళిపోవాలి...." అంటూ ఆమె చేయి పట్టుకుని, మరో గోడ దగ్గరికి తీసుకుపోయాడు.

"ప్రభూ... ఏమయింది? ఎందుకీ తొందర?" అడిగింది ఆమె.

"తిరుగుబాటు జరిగింది. సేనాపతి మనల్ని వెన్నుపోటు పొడిచాడు... ఆలస్యం చేస్తే సైనికులు మనల్ని బంధించటానికి వస్తారు" అంటూ ఆ గోడమీది చిత్ర పటాన్ని ఒకదాన్ని ప్రక్కకు జరిపాడు నగరపాలకుడు. ఆ పటం వెనుక ఉన్న మీటను బలంగా అదిమాడు.

ఈసారి గోడలో ప్రత్యక్షం కాలేదు సొరంగ మార్గం. అతను నిలబడిన ప్రదేశానికి నాలుగు అడుగుల దూరంలో పాదాల క్రింద ప్రత్యక్షం అయింది. "ఆలస్యం చేయకూడదు... త్వరగా వెళ్ళిపోవాలి...." అంటూ ఆ సొరంగంలోకి ప్రవేశించాడు నగరపాలకుడు.

నోరు తెరుచుకు చూస్తున్న తన చెలికత్తెకు సైగచేసి తాను అతన్ని అనుసరించింది మహారాణి.

చెలికత్తె సొరంగంలోకి దిగిన వెంటనే దడదడమని శబ్దం చేస్తూ మూసుకు పోయింది ఆ మార్గం.

అది మూసుకుపోయిన మూడవ క్షణికంలో అంతకుముందు నగర పాలకుడు ఏ మార్గం నుంచి ఆ మందిరంలోకి వచ్చాడో ఆ దారిలోనుంచి వచ్చింది కొండచిలువ.

మందిరంలో ఉన్న ఆసనాలను చెల్లాచెదురు చేసి వేసింది. హంసతూలికా తల్పాన్ని మధ్యకు విరిచి అవతలకు విసిరివేసింది.

రకరకాల రహస్యమార్గాలు ఆ ప్రదేశంలో ఉన్నట్లు తనకు తెలిసినట్లు తలతో గోడలన్నిటినీ గట్టిగా కొట్టింది.

ఆ శబ్దాలను ఆలకించి ఆ మందిరంలోకి తొంగిచూసిన పరిచారికలు అందరూ భయంతో కేకలు పెడుతూ వెనక్కి పరుగులు తీశారు.

గోడల వెనుక ఉండే మార్గాలను వెతకటం మానుకుని వారిని వెంటాడటం మొదలు పెట్టిందా రాక్షసి పాము.

*　　*　　*　　*　　*

తూర్పుదిక్కు తెల్లబడే సమయం వరకూ సొరంగ మార్గంలో నడిచినడిచి, దట్టంగా ఉన్న పెద్ద చెట్ల గుంపులో భూతలాన్ని చేరుకున్నారు. నగరపాలకుడు – అతని సతీమణి.

"త్రికుట వర్ధనుడిని జయించి ఆ నగరాన్ని కూడా వశం చేసుకుని మహానగర పాలకుడిగా పేరు తెచ్చుకోవాలని అనుకున్నాను. సింహాసనాన్ని పోగొట్టుకుని ఇలా అడవుల వెంట తిరుగవలసి వస్తుందని అనుకోలేదు...." ఒక చెట్టుక్రింద చతికిల పడుతూ హీనస్వరంతో అన్నాడు నగరపాలకుడు.

"మనం చేసే పనులే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి ప్రభూ...." అంటూ అతను దోపిడీలను ప్రోత్సహించటాన్ని నిరసించబోయింది మహారాణి.

అంతలోనే ఆమెకు సైగ చేసింది చెలికత్తె. "తల్లీ... ఎవరో వస్తున్నారు... హితులో కాదో తెలియదు" అంటూ.

తన నడుముకు వ్రేలాడుతున్న కరవాలాన్ని వరలో నుంచి బయటికి తీసి, లేచి నిలుచున్నాడు నగరపాలకుడు.

నాలుగు నిమిషాలు కూడా గడవకముందే, నీరసంగా నడుస్తూ ఆ ప్రదేశంలోకి వచ్చారు కొంత మంది కాందిశీకులు.

"ఎవరు మీరు? ఎక్కడనుంచి వస్తున్నారు?" దీనంతో నిండి వున్న వారి వదనాల వంక చూస్తూ అడిగాడు నగర పాలకుడు.

"త్రివిశా నగరం నుంచి వస్తున్నాము...." అస్పష్టంగా చెప్పాడు ఒక వృద్ధుడు.

ఎరుపు జీరలను పులుముకున్నాయి నగర పాలకుడి కనులు... "త్రికుట వర్ధనుడు ఎలా ఉన్నాడు? తనే తన నగర పౌరుల్ని నగరంలో నుంచి బహిష్కరిస్తున్నాడా?" అని అడిగాడు.

తల అడ్డం తిప్పాడు ఆ పౌరుడు.

"త్రివిశా నగరం నాశనం అయిపోయింది. త్రికుట వర్ధనుల వారు నాశనం అయిపోయారు... వైదర్భి మీద విజయం సాధించటానికి ఆయన రప్పించిన మంత్రవాది తాను ఆహ్వానించిన రాక్షసి పాము నోటికి చిక్కి ప్రాణాలు పోగొట్టుకున్నాడు...." నీరు నిండిన కనులతో చెప్పాడు ఆ వృద్ధుడు.

తన నగరాన్ని నాశనం చేస్తున్న రాక్షసి సర్పం త్రివిశా నగరం నుంచే వచ్చిందని తెలిసేసరికి నగరపాలకుడి ఆగ్రహం హద్దులు దాటిపోయింది.

"ఆ పాము దెబ్బకు నాశనం కాకుండా మిగిలిన నగరాన్ని నేను స్వయంగా నేల మట్టం చేసేస్తాను. నా శక్తి ఏమిటో త్రివిశా నగరంలో మిగిలిన పౌరులకు రుచి చూపిస్తాను" పళ్ళు పటపటమని కొరుకుతూ అన్నాడు.

"ప్రభూ... ఆవేశపడకండి... అనవసరమైన ప్రతిజ్ఞలు చేయకండి. ఇప్పుడు మీ వెనుక సైనికులు ఎవరూ లేరు... మీరు ఒంటరి వారు...." చిన్న కంఠంతో హెచ్చరించింది మహారాణి.

చన్నీళ్ళు చిలకరించినట్లు చల్లారిపోయింది నగరపాలకుడి ఆగ్రహం. నిలుచోవటానికి కూడా ఓపిక లేనట్లు మళ్ళీ చెట్టు క్రింద కూలబడిపోయాడు.

"చింత చచ్చినా పులుపు చావలేదని ఒకసామెత... అది అక్షరాల యదార్థం" చిన్న కంఠంతో శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

నగరపాలకుడు కూర్చుని ఉన్న వృక్షానికి పాతిక అంగల దూరంలో ఉన్న ఒక పెద్ద బండరాయి చాటున నిలబడి ఉన్నారు వారిద్దరూ.

"అయ్యలారా... దీనంగా కనబడుతున్నాడని చెప్పి నగర పాలకుడిని తక్కువగా అంచనా వేయకండి. హెచ్చరిక లేకుండా కాటు వేసే కట్లపాము వంటివాడు...." తాను కూడా రహస్యంగానే వారిద్దరినీ హెచ్చరించాడు పంజరంలో నుంచి వారు రక్షించి తీసుకువచ్చిన సైనికుడు.

ముందుకుపోయి నగర పాలకుడిని మాట్లాడించాలని అనుకుంటున్న గదాధరుడు వెంటనే తన మనసు మార్చుకున్నాడు.

"త్రివిశా నగరంలో జరిగింది ఏమిటో మనకి వివరంగా తెలియాలి" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"ఈ నగరంలో జరిగిన సంఘటనలనే తట్టుకోలేక అడవిలోకి పారిపోయి వచ్చాము. ఇంకా త్రివిశా నగరం గురించి తెలుసుకుంటే ఇంకెక్కడికి పారిపోవాలో తెలియదు" అన్నాడు గదాధరుడు.

"నగరపాలకుడితో మాట్లాడిన వారు ఈ దరికి రాగానే కలుసు కుందాము... జరిగింది ఏమిటో తెలుసుకుందాము...." అతని మాటలు తనకు వినబడనట్లు చిన్నగా అన్నాడు శ్యామలుడు. అతను అంత పట్టుదలగా మాట్లాడటానికి ఏదో కారణం ఉండే ఉంటుందని తెలుసు గదాధరుడికి.

"నీ ఆలోచన ఏమిటి మిత్రమా?" అని అడిగాడు గదాధరుడు తన స్నేహితుడు శ్యామలుడిని.

"ఆత్రపడకుండా నిలబడు... నీకే తెలుస్తుంది" అన్నాడు శ్యామలుడు.

అలాగేనన్నట్లు తల ఊపాడు గానీ, ఆ విధంగా కుదురుగా నిలబడటం అసాధ్యం అయిపోయింది గదాధరుడికి.

"నీ మనస్సులోకి అసాధారణమైన ఆలోచన ఏదో వచ్చింది. అదేమిటో తెలుసుకోకపోతే నాకు కాలు నిలబడదు. నువ్వు చెప్పి తీరవలసిందే" అంటూ ఒత్తిడి చేశాడు.

"త్రివిశా నగరం నుంచి వచ్చామని చెప్పుకుంటున్న ఆ కాందిశీకుల వంక ఒకసారి పరిశీలనగా చూడు" అన్నాడు శ్యామలుడు.

కనులు చిట్లించి మరీ చూశాడు గదాధరుడు.

"తిండికి గుడ్డకి లోటు ఏర్పడటం వల్ల పారిపోయి వచ్చిన వాళ్ళ మాదిరి నాకు కనిపించటం లేదు. కేవలం ప్రాణాలు కాపాడుకోవటానికి మాత్రమే వచ్చినట్లు అనిపిస్తోంది. అది కూడా యదార్ధమని అనిపించటం లేదు. త్రివిశా నగరానికి ఈ వైదర్భికి తరతరాల పగ నడుస్తోంది. ఆ విషయం తెలిసి కూడా వీళ్ళు ఇటుగానే ఎందుకు వచ్చినట్లో!" చిన్న కంఠంతో అన్నాడు.

"మన విలాస ప్రభువుతో మాట్లాడిన వృద్ధుణ్ణి వదిలిపెట్టి మిగిలిన వారిని జాగ్రత్తగా పరిశీలించు" అన్నాడు శ్యామలుడు.

మరో పది క్షణికాల పాటు చూసి, అదిరిపడినట్లు శ్యామలుడి భుజాన్ని పట్టుకున్నాడు గదాధరుడు.

"రాజవంశీయుడు ఒకడు ఉన్నాడు వారిలో. ఇద్దరు ముగ్గురు రాచకాంతలు కూడా ఉన్నారు... కాలినడక అలవాటు లేకపోవటం వల్ల కాబోలు ఆపసోపాలు పడుతున్నారు" అన్నాడు.

అతని సునిశిత పరిశీలనా శక్తి ఎటువంటిదో తనకు తెలిసినట్లు చిన్నగా నవ్వాడు శ్యామలుడు.

"మిత్రమా... మిత్రమా... త్రివిశా నగర పాలకుడు త్రికుట వర్ధనుడే స్వయంగా ఇటు వచ్చాడని నాకు అనిపిస్తోంది. ఆ రాచకాంతలలో ఆయన భార్య ఉండి ఉంటుంది" అన్నాడు గదాధరుడు.

"ఇప్పుడు నువ్వు సూటిగా ఆలోచిస్తున్నావు. నీ అభిప్రాయం నిజమో కాదో మనం తెలుసుకోవాలి... నిజమే అయితే తన ఆగర్భశత్రువు నగరానికి అతను ఎందుకు వస్తున్నాడో మనకి తెలియాలి" అన్నాడు శ్యామలుడు.

"ఎందుకు వస్తాడు వీరుడా? తన నగరంలో నుంచి బయలు దేరిన ఆ ముదనష్టపు సర్పం ఈ నగరాన్ని కూడా నాశనం చేసిందో లేదో తెలుసుకోవటానికి వస్తూ ఉండి ఉంటాడు" అక్కసుగా అన్నాడు వారిద్దరి వెనుకే నిలబడి ఉన్న సైనికుడు.

"నువ్వు కొంచెం నోటిని అదుపులో పెట్టుకుంటే చాలా బాగుటుంది" అతనికేసి చురుకుగా చూస్తూ అన్నాడు గదాధరుడు.

అటువంటి హెచ్చరికల్ని రెండవసారి వినే కోరిక తనకు లేనట్లు వెంటనే తన నోటిని చేతులతో కప్పుకున్నాడు ఆ సైనికుడు.

తల వంచుకుని కూర్చుండి పోయిన నగరపాలకుడిని మరోసారి మాట్లాడించే ప్రయత్నం చేశాడు త్రివిశా నగరం నుంచి వస్తున్నవారిలో వృద్ధుడి మాదిరి కనిపిస్తున్న వ్యక్తి.

"మేము నగరంలోకి వెళ్ళేందుకు దగ్గరి దారి ఏదైనా ఉంటే దయచేసి చెప్పండి. నడిచినడిచి బాగా అలసిపోయి ఉన్నాము" అన్నాడు.

"తల వంచుకుని కూర్చున్న పెద్ద మనిషికి బుద్ధి అంటూ ఉంటే కారణం అడుగుతాడు. నగరంలోకి పోవాలని ఎందుకు అనుకుంటున్నారో తెలుసు కుంటాడు" అన్నాడు గదాధరుడు.

"బుద్ధి అనేది ఉంటే ఎప్పుడో బాగుపడి ఉండేవాడు. దిక్కూ, దివాణం లేనట్లు ఇలా అడవుల్లోకి పారిపోయి వచ్చివుండే వాడు కాదు" అన్నాడు శ్యామలుడు.

అతను చెపుతున్నట్లే జరిగింది అక్కడ. ఆ వృద్ధుడు అడిగిన మాటలకు మర్యాదగా సమాధానం చెప్పలేదు నగరపాలకుడు. "ఇంతదూరం వచ్చిన తర్వాత ఇంకా మాటలతో కాలక్షేపం చేయటం దేనికి... నడుస్తూ పోండి... నగరం కనిపించే దాకా నడుస్తూనే ఉండండి" కఠిన స్వరంతో విసురుగా అన్నాడు.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు కాందిశీకులు అందరూ. "పదండి... అందరూ తలలు వంచుకుని అడుగులు వేయండి" విసురుగా ముందుకు అడుగువేసి ఏదో మాట్లాడబోయిన ఒక యువకుడిని, వెనక్కి నెడుతూ స్పష్టమైన కంఠంతో అన్నాడు వారిలో ఒకతను.

"అతనే... అతనే త్రికుట వర్ధనుడు. త్రివిశా నగరపాలకుడు అతనే, సందేహం లేదు" వెంటనే అన్నాడు గదాధరుడు.

"మనం వాళ్ళతో మాట్లాడాలని అనుకున్నాము గదా... సరైన ప్రదేశం ఎక్కడ ఉన్నదో వెతికి సిద్ధంగా ఉండాలి" అన్నాడు శ్యామలుడు.

"మాటలే కదా... చేతలు కావు కదా... ఇక్కడే నిలబడి ఉంటే ఏమౌతుంది?" అడిగాడు గదాధరుడు.

"వైదర్భి నగరపాలకుడి అహంకారం ఇంకా అణిగిపోయినట్లు కనపడడం లేదు. మనం మాట్లాడే మాటల్ని అతను ఆలకించటం నాకు ఇష్టం లేదు" అన్నాడు శ్యామలుడు.

వెనుకగా నిలబడి ఉన్న సైనికుడి వంక చూశాడు గదాధరుడు.

అతని అభిప్రాయం తనకు అర్థం అయినట్లు వేగంగా ఒక ప్రక్కకు పరిగెత్తి పదిహేను నిమిషాలలో తిరిగి వచ్చాడు అతడు.

ఆసరికి శ్యామల, గదాధరులు నిలబడిన పొదల్ని దాటి పాతిక ధనువుల దూరం పోయారు కాందిశీకులు.

"రండి... మీరందరూ మా వెనకే ఈ ప్రక్కకు రండి...." అంటూ వారిని ఆహ్వానించాడు సైనికుడు.

వాళ్ళు అనుమానంగా చూసేసరికి చిన్నగా నవ్వాడు గదాధరుడు. "సర్వస్వాన్ని కోల్పోయి కట్టుబట్టలతో వస్తున్నారు మీరు.... మీ దగ్గర దోచుకోగలిగినవి ఏవీ వుండవని అధముల్లో అధములైన కన్నపు దొంగలకు కూడా తెలిసిపోతుంది... ఇంక మీకు భయమెందుకు?" తాను నిలబడి ఉన్న చెట్టు చాటునుంచి ఈవలకు వస్తూ అన్నాడు.

"ఈ నరవరుడు ఎవరో గాని యదార్థం చెప్పాడు ప్రభూ...." అన్నాడు అంతకుముందు వైదర్భి పాలకుడితో మాట్లాడిన వృద్ధుడు.

మారు మాట్లాడకుండా తమను పలుకరించిన సైనికుడి వెనుక అడుగులు వేశారు వారందరూ.

కేవలం వంద ధనువుల దూరం మాత్రమే నడిచారు అందరూ... ఉన్నట్లుండి వారి దారికి అడ్డుగా ప్రత్యక్షం అయింది ఒక చిన్న సెలయేరు...

దాని ఒడ్డునే ఎత్తుగా ఎదిగి అందరికీ కనిపించాయి పెద్ద పెద్ద నేరేడు చెట్లు.

"సెలయేటి వాగు మీ దాహాన్ని తీరుస్తుంది. నేరేడు పళ్ళు మీ ఆకలిని పూర్తిగా కాకపోయినా కొద్దిగానైనా తీరుస్తాయి. బడలిక తగ్గుముఖం పడుతుంది" అన్నాడు సైనికుడు.

ఆ పైన క్షణికం పాటు కూడా ఆలస్యం చేయలేదు ఎవరూ. మోకాలి లోతు మాత్రమే ఉన్న ఆ ఏటిలో దిగి దాహాన్ని తీర్చుకున్నారు. నేల రాలిఉన్న పండ్లను ఏరుకుని తమ ఆకలిని తృప్తి పరుచుకున్నారు.

"అడిగిన మాటకు సరైన సమాధానం ఇవ్వకుండా విదిలించి కొట్టాడు వెనుక ఉన్న మనిషి. అడగకపోయినా ఆదరించి అలసట తీరే మార్గాన్ని చూపించారు మీరు... ఎవరు మీరు?" ఆర్ద్రమైన కంఠంతో అడిగాడు కాందిశీకుల్లో వృద్ధుడు.

"ఆగర్భ శత్రువైన వైదర్భి నగరపాలకుడు రాజ్యం చేసే ప్రదేశానికి వస్తున్నారు మీరు... కారణం ఏమిటి?" అడిగాడు గదాధరుడు.

అంతకుముందు నగర పాలకుడికి చెప్పిన మాటల్నే మరోసారి అతనికి కూడా చెప్పాడు వృద్ధుడు.

"ఆ రాక్షసి పాము మీ నగరాన్ని నాశనం చేసిందని చెపుతున్న మాట మాకు అర్థం అయింది. ప్రాణాలు కాపాడుకోవటానికి మీరు మరో ప్రక్కకు పోయి ఉండవచ్చు. ఆ పాము ఇటుగా వచ్చిందని తెలిసి కూడా మీరు ఇటుగానే రావటానికి కారణం ఏమిటి?" సూటిగా అడిగాడు గదాధరుడు.

"తరతరాలుగా శత్రుత్వం వహించి మేము చాలా పెద్ద తప్పు చేశామని మాకు అనిపించింది. జరిగిన దారుణానికి మేమే కారకులమని తెలియచేసి క్షమాపణ కోరుకోవాలని అనిపించింది" వెంటనే అన్నాడు వృద్ధుడి వెనుక ఉన్న వ్యక్తి.

"ఉత్తుత్త క్షమాపణలతో ఇప్పుడు వైదర్భిని గడగడలాడిస్తున్న ప్రమాదం తప్పిపోతుందని మీరు బావిస్తున్నారా త్రికుట వర్ధనుల వారూ?" సూటిగా అడిగాడు గదాధరుడు.

ఉలిక్కిపడ్డాడు ఆ వ్యక్తి.

పెద్దగా నవ్వాడు గదాధరుడు. "రాక్షసి పాము దెబ్బకి వైదర్భి పాలకుడి కళ్ళు మసకలు బారిపోవటం వల్ల మిమ్మల్ని గుర్తుపట్టి ఉండకపోవచ్చు... మేము అతని వంటి వారం కాదు. మీరెవరో మాకు తెలిసిపోయింది" అన్నాడు.

"మమ్మల్ని విదిలించికొట్టినది విలాసుడా? ఆశ్చర్యం...." అంటూ అటుకేసి నడవబోయాడు ఆ వ్యక్తి.

తల అడ్డం తిప్పి అతన్ని అడ్డుకున్నాడు గదాధరుడు.

"ఇప్పటికిప్పుడు మీరు అతని దగ్గరికిపోయి చేతులు జోడించవలసిన అవసరం లేదు. మీ నగరంలో జరిగింది ఏమిటో వివరంగా చెప్పండి" అన్నాడు.

వాగు ఒడ్డున ఉన్న చిన్నచిన్న బండల మీద కూర్చుని తాము దిగంబర స్వామిని తమ నగరానికి ఆహ్వానించిన క్షణం నుంచీ రాక్షసి సర్పం పాతాళం నుంచి భూమి మీదికి వచ్చినంత వరకూ వివరంగా చెప్పాడు ఆ వ్యక్తి.

"తన బిడ్డలు హతమారి పోవటానికి వైదర్భి పాలకుడే కారణమని చెప్పటం వల్ల ఆ సర్పం ఇటుగా వచ్చింది" అని కూడా అన్నాడు.

"దాన్ని హతమార్చటానికి ఏదైనా ఉపాయం ఉన్నదా?" అడిగాడు శ్యామలుడు.

"ఉపాయం అంటూ ఉంటే హతమారిపోయిన దిగంబరస్వామి నాకు చెప్పి ఉండేవాడు.... చెప్పలేదు కాబట్టి ఎవరికీ ఏమీ తెలియదని అనుకోవటంలో తప్పేమీ లేదు" అన్నాడు ఆ వ్యక్తి.

"అది తన బిడ్డలు హతమారి పోయారన్న కక్షతో రగులుకు పోతున్నది. వెంటనే ఏదో ఒకటి చేయకపోతే, ఇక్కడి నుంచి ఇంకో నగరం మీదికి పోయి అక్కడ కూడా విధ్వంసాన్ని సృష్టిస్తుంది" శ్యామలుడితో చెప్పాడు గదాధరుడు.

"ఈ పరిస్థితికి కారకులం మనమే అని నాకు అనిపిస్తోంది" అన్నాడు అతను.

"మనం ఎలా కారకులం అవుతాము... దిగంబరస్వామిని మనం తీసుకు రాలేదు. ఈ దరిద్రపు శక్తిని ఆవాహన చేయమని చెప్పింది మనం కాదు" విసురుగా అన్నాడు గదాధరుడు.

"దాని బిడ్డల్ని గల్లంతు చేసింది మాత్రం మనమే" అన్నాడు శ్యామలుడు.

అతని వంకా, గదాధరుడి వంకా మార్చి మార్చి చూస్తున్నారు బండరాళ్ళ మీద కూర్చుని ఉన్నవారందరూ.

ఉన్నట్లుండి తమతో మాట్లాడిన వృద్ధుడి కేసి తిరిగాడు గదాధరుడు. “మీరు ఇప్పుడు వైదర్భిలోకి వెళ్ళటం వల్ల ఉపయోగం అంటూ ఏమీ లేకపోగా, ఆ రాక్షస సర్పం మీ త్రికుట వర్ధనుల వారి జాడల్ని పసిగడితే చాలా ప్రమాదం” అన్నాడు.

“మేమ చేసిన తప్పుకు క్షమాపణలు చెప్పుకోకపోతే మాకు మనశ్శాంతి ఉండదు” తను ఎవరో బయటపడి పోవడం వల్ల మొట్టమొదటిసారిగా తన అధికార స్వరంతో మాట్లాడాడు త్రికుట వర్ధనుడు.

“క్షమాపణలు చెప్పుకోవటానికి ఇంకా కొంత సమయం ఉంది... మీరు ముందు వెనక్కి తిరిగి మీ నగరానికి వెళ్ళిపోండి. రాక్షస సర్పం నాశనం చేసిన తర్వాత ఇంకా ప్రాణాలతో మిగిలిన వారిని చేరదీసి ఆదుకోండి. మీ మాదిరిగానే నగరాన్ని కోల్పోయి అడవుల పాలయిన వైదర్భి పాలకుడు గనుక మీ నగరానికి వస్తే అతన్నికూడా ఆదరించండి....” అన్నాడు గదాధరుడు.

“మరి ఆ సర్పం సంగతి?” అడిగాడు త్రికుట వర్ధనుడు.

“మేము ఆలోచిస్తాము... ఏదో ఒకటి చేస్తాము” మీరు ప్రయాణం మొదలు పెట్టండి అన్నాడు గదాధరుడు.

పది నిమిషాల పాటు తమలో తాము చర్చించుకున్నారు వాళ్ళు. ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఒకేసారి లేచి నిలుచున్నారు.

“మీరు ఎవరు నాయనలారా?” అని అడగనే అడిగాడు వృద్ధుడు.

చిన్నగా నవ్వి అతని భుజం మీద చేయి వేశాడు గదాధరుడు. “మేము ఎవరిమో తెలుసుకోవటానికి కూడా ఇంకా వ్యవధి ఉన్నది. మీరు నడక మొదలు పెట్టండి” అంటూ వారందరినీ, అంతకు ముందువారు వచ్చిన దారి వైపు నడిపించాడు.

“వాళ్ళని ఒప్పించాము... మరి వైదర్భి పాలకుడి సంగతేమిటి?” అడిగాడు శ్యామలుడు.

దిగంబరస్వామి వంటి దుర్మార్గుడిని తన దగ్గరికి పిలిపించుకుని, అటు త్రివిశా నగరాన్ని, ఇటు వైదర్భిని సర్వనాశనం చేయించిన త్రికుట వర్ధనుడి మీద ఎంతో సానుభూతి చూపించిన గదాధరుడు – ఇప్పుడు మాత్రం అటువంటి పని ఏదీ చేయలేదు.

“చచ్చీ చెడీ తన ప్రాణాలు కాపాడావు నువ్వు. తన మానాన్ని రక్షించావు... అటువంటి నిన్ను అర్ధాంతరంగా వదిలేసి తన దారి తాను చూసుకున్నది ఈ

వైదర్భి పాలకుడి భార్య... తనకు ఎంతో సాయపడిన ఈ సైనికుడిని పంజరంలో నుంచి బయటికి తీసి అవతలికి పంపించేయటానికి బదులుగా, ప్రాణాలు తీయటానికి ప్రయత్నం చేసింది. ఈ వెన్నుపోటు ప్రయత్నాలను నేను క్షమించలేను" పెదవులు బిగపడుతూ అన్నాడు.

"క్షమించమని నిన్ను బలవంతం చేయటం లేదు... వారి సంగతి ఏమిటని అడుగుతున్నాను అంతే" అన్నాడు శ్యామలుడు.

"కొద్దికాలం వాళ్ళు అడవిలో అలమటిస్తూ ఉండటమే మంచిది. మనం ఇందాక అనుకున్నట్లు త్రివిశా నగరానికి వెళితే మరీ మంచిది" అన్నాడు గదాధరుడు.

"సరే... మరి ఆ రాక్షస సర్పం సంగతి ఆలోచించు" అన్నాడు శ్యామలుడు.

మౌనంగా నిలబడి ఉన్న సైనికుడి వైపు చూశాడు గదాధరుడు.

"అయ్యలూ... దయచేసి నా అభిప్రాయం అడగకండి. అది మంత్ర తంత్రాలు నేర్చిన మాయల మారి మాదిరిగా అగుపిస్తోంది. అవసరం అయినప్పుడు ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతోంది. నాశికా రంధ్రాలనుంచి మంటల్ని వెదజల్లుతోంది. తలతోకొట్టి పెద్దపెద్ద గోడల్ని భవనాల్ని పునాదులతో సహా కూల్చి పారేస్తున్నది. సామాన్యమైన సైనికుడిని నేను... దాన్ని ఎదిరించే శక్తి నాకు లేదు" చేతులు జోడిస్తూ చెప్పాడు ఆ సైనికుడు.

చిన్నగా నవ్వి అతని భుజం తట్టాడు గదాధరుడు.

"నిన్ను ఎదిరించమని చెప్పటం లేదు. ఎదిరించే ఉపాయం ఏదైనా చెపుతావని ఆశించాను...." అన్నాడు.

సమాధానం చెప్పలేదు సైనికుడు. తల వంచుకుని నిలుచున్నాడు.

"ప్రతి మంత్రానికీ ఏదో ఒక విరుగుడు ఉండే ఉంటుంది. ప్రతి శక్తికి దాన్ని నిర్వీర్యం చేసే మార్గం ఏదో ఒకటి తప్పకుండా ఉంటుంది" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అన్నాడు గదాధరుడు.

"కొండ చిలువ నీటిలో సంచరించటం చాలా తేలిక... కాబట్టి దానిని నీళ్ళతో దెబ్బకొట్టలేము... తనే అగ్నిజ్వాలల్ని సృష్టిస్తోంది కాబట్టి నిప్పుల్లోకి నెట్టి సంహరించలేము... పాతాళంలో నివాసం ఏర్పరచుకున్న దుష్టశక్తి... మట్టిలో కప్పెడితే మరణించటం అసంభవం....." తన ఆలోచనల్ని ఒకదాని తర్వాత ఒకటిగా చెప్పటం మొదలు పెట్టాడు శ్యామలుడు.

"అటు తిరిగి ఇటు తిరిగి దాని వ్యవహారం మంత్రాల దగ్గరికే వస్తోంది. అవేమో మనకి రావు... ఏం చేద్దాం?" అడిగాడు గదాధరుడు.

"ముందు మనం దాన్ని వైదర్భి నగరంలో నుంచి బయటికి రప్పించి, చీమలు దోమలు కూడా కనిపించని ఏదైనా ఎడారి ప్రాంతంలోకి తీసుకుపోవాలి. దాని దృష్టి అంతా మనమీదే కేంద్రీకరించబడి ఉండాలి. అమాయక ప్రాణులు ఏవీ దాని మూలంగా ప్రాణాలు పోగొట్టుకోకూడదు" అన్నాడు శ్యామలుడు.

తల వంచుకుని నిలబడి వున్న సైనికుడిలో వెంటనే వచ్చింది కదలిక.... "అయ్యా... వైదర్భికి నైరుతి దిశలో బ్రహ్మాండమైన కొండలోయ ఒకటి ఉంది. రెండు వేల ధనువుల వెడల్పు... కనీసం లక్ష ధనువుల పొడవు ఉంటుంది. కలికానికి ఒక్క నీటి బొట్టు కూడా కనిపించదు. మీరు ఆశిస్తున్నట్లు చీమలు దోమలు కూడా ఆ ప్రదేశంలోకి వెళ్ళలేవు....." అన్నాడు.

విపరీతమైన ఆలోచనలతో ముడిపడి ఉన్న శ్యామలుడి వదనం ఒక్కసారిగా తేటపడింది ఆ మాటల్ని వినేసరికి.

"సరి అయిన సమయంలో సరయిన మాట చెప్పావు... చాలా సంతోషం అయింది." అంటూ గదాధరుడికి సైగ చేశాడు.

తన దుస్తుల చాటు నుంచి ఒక చిన్నమూటను బయటికి తీశాడు గదాధరుడు.

"ఏమిటది? ఏముంది ఆ మూటలో?" ఆశ్చర్యంగా అడిగాడు సైనికుడు.

ముడి విప్పి అతనికి చూపించాడు గదాధరుడు.

తళతళ మెరుస్తున్న బంగారు నాణేలున్నాయి అందులో. "వీటిని తీసుకుని వేరే నగరానికి వెళ్ళి హాయిగా జీవించవచ్చు...." అంటూ ఆ మూటను అతనికి అందించబోయాడు.

నాణేల మూటను కాకుండా అతను మరేదో విషపదార్థాలున్న మూటను జూస్తున్నట్లు భయంగా వెనక్కి జరిగాడు సైనికుడు.

"తీసుకో... నువ్వు జీవించటానికి ఈ ధనం సరిపోతుంది" మృదువుగా అన్నాడు శ్యామలుడు.

"క్షమించాలి అయ్యలూ... ధనం కోసం నేను వెంపర్లాడటం లేదు. మీ వంటి వీరకుమారుల సాహచర్యం లభించటమే చాలా గొప్ప విషయం. మహావీరుడైన గజదొంగ శ్యామలుడి సాహసకార్యాల్లో నేను కూడా పాలు

పంచుకోగలిగానని గర్వంగా చెప్పుకోవాలని ఉన్నది. దయచేసి నన్ను కూడా మీతోపాటు రానివ్వండి...." వేడికోలుగా అన్నాడు.

"నువ్వు చెప్పిన మాటల్ని బట్టి ఆ కొండలోయ మహా గుగ్గుడి ప్రదేశం మాదిరి అనిపిస్తోంది. అక్కడికి పోయిన వాళ్ళెవరూ ప్రాణాలతో వెనక్కి రాలేదని కూడా తోస్తోంది" అన్నాడు గదాధరుడు.

"నీటి బొట్టు కూడా కనిపించని ఆ ప్రదేశంలోకి ఎవరు మాత్రం ఎందుకు పోతారు? ఎవరూ పోరు... మొండిగా పోయిన మూడు జాముల్లో ప్రాణాలు పోగొట్టుకుంటారు...." అన్నాడు సైనికుడు.

"అటువంటి ప్రమాదకరమైన ప్రదేశంలోకి నిన్ను తీసుకుపోవడం మాకు ఇష్టంలేదు" అన్నాడు గదాధరుడు.

"మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా నేను మిమ్మల్ని వదిలి పెట్టి అవతలికి పోను, మీతోబాటే వస్తాను...." మరింత మొండిగా అన్నాడు సైనికుడు.

నిస్సహాయంగా చూశాడు గదాధరుడు – శ్యామలుడి వైపు.

"వస్తానని అంతగా పట్టుబడుతుంటే మనం చేయగలిగింది ఏమీ లేదు. మన వెంట నీళ్ళు తీసుకుపోవాలి.... ఆహారం కూడా అవసరమే... ఆ ఏర్పాట్లు చూసి, నువ్వు సూటిగా ఆ లోయలోకి బయలుదేరాలి" అన్నాడు శ్యామలుడు.

"నువ్వు ఏం చేస్తావు?" అనుమానంగా అడిగాడు గదాధరుడు.

"నగరంలోకి పోయి, ఆ రాక్షస సర్పం దృష్టిని నా వైపు తిప్పుకుంటాను. సూటిగా ఆ కొండలోయ దగ్గరికి తీసుకు వస్తాను" అన్నాడు అతను.

"తీసుకువచ్చిన తర్వాత?" మరింత అనుమానంగా అడిగాడు గదాధరుడు.

"ముందు దాన్ని నగరంలో నుంచి అవతలికి తీసుకుపోవాలి" మరోసారి అంతకుముందు చెప్పిన మాటనే మళ్ళీ చెప్పాడు శ్యామలుడు.

"కొండలోయలోకి దాన్ని తీసుకు వచ్చిన తర్వాత మనం చేయవలసింది ఏమిటి?" రెట్టించాడు గదాధరుడు.

"నాకు ఏమీ తెలియదు మిత్రమా... దాన్ని ముందు నగరంలో నుంచి ఈవలికి తీసుకురావాలి... ఆ తరువాత ఏం చెయ్యాలో ఆలోచించాలి" ఓపికగా చెప్పాడు శ్యామలుడు.

"ఆహారం, నీరు ఏర్పాట్లు నువ్వు చూసుకో. నేను నగరంలోకి వెళ్ళి ఆ పిశాచిని ఆకర్షిస్తాను" అన్నాడు గదాధరుడు.

నవ్వి తల అడ్డం తిప్పాడు శ్యామలుడు. ఉన్నట్లుండి పరుగు మొదలు పెట్టి కన్ను మూసి కన్ను తెరిచేటంతలో దృష్టి పథం నుంచి దూరమైపోయాడు.

* * * * *

ఊపిరి బిగపట్టి పళ్ళెరంలోని నీటి వంక చూస్తున్న యువరాణి, విసురుగా తల విదిలించింది.

"ఏమిటి తల్లీ... నీకు నచ్చని దృశ్యం ఏదైనా కనిపించిందా?" నవ్వుతూ అడిగింది ప్రక్కనే వున్న వృద్ధురాలు.

"ఈ గజదొంగ శ్యామలుడు తెలివైనవాడో, మంచి చెడుల విచక్షణ తెలియని మూర్ఖుడో నాకు అర్థం కావటం లేదు" అన్నది యువరాణి.

"ఎందుకని నీకు అలా అనిపించింది?" నవ్వుతూనే అడిగింది వృద్ధురాలు.

"దారుణమైన శక్తిగల పిశాచం ఆ రాక్షసిపాము... మంత్ర తంత్రాల్లో మెలి తిరిగిన చెయ్యి ఆ దిగంబరస్వామిది. అటువంటి వాడినే అది గుటుక్కున మింగేసింది. ఇక ఈ గజదొంగని మట్టుబెట్టటం దానికి ఒక లెక్కా?" అడిగింది యువరాణి.

"అతని ఊహ ఏమిటో తెలియకుండా ఒక నిర్ణయానికి రావటం మంచిది కాదు గదా" అన్నది వృద్ధురాలు.

"అదేదో చెట్ల మీద సంచరించే పసిరిక పాము అన్నట్లుగా అది చెలరేగి పోతున్న నగరంలోకి పోతున్నాడు. అది తప్పకుండా అతన్ని నాశనం చేసేస్తుంది" అన్నది యువరాణి.

తను కూడా ఒకసారి పళ్ళెరంలోకి పరిశీలనగా చూసి తల అడ్డం తిప్పింది వృద్ధురాలు.

"అంటే అతను దాన్ని నాశనం చేయగలడా?" ఆశ్చర్యంగా అడిగింది యువరాణి. తల ఊపింది వృద్ధురాలు.

"ఎలా?" మరింత ఆశ్చర్యంగా అడిగింది యువరాణి.

"ఎలాగో నాకు కూడా తెలియదు తల్లీ...." అన్నది ఆమె.

"అవ్వా... అటువంటి శక్తుల పీచం అణిచేందుకు మంత్రాలు ఏమైనా ఉన్నాయా." మరో ప్రశ్న వేసింది యువరాణి.

"కొన్ని కొన్ని దుష్టశక్తుల్ని అణచటానికి మంత్రాలుచాలవు. యుక్తులు కావాలి.. అలాంటి యుక్తులు ఆ గజదొంగ దగ్గిర అనంతంగా ఉన్నాయి"

"ఏమిటో అవి నాకు చెప్పవా?" గోముగా అడిగింది యువరాణి.

"చూస్తున్నావుగా తల్లీ... చూస్తూనే ఉండు. నీకే తెలుస్తాయి. తినబోతూ రుచులు అడగటం మంచిది కాదు...." అంటూ కూర్చున్న ప్రదేశం నుంచి లేచి అవతలికి వెళ్ళిపోయింది వృద్ధురాలు.

శ్యామలుడు చేయబోయే పనులు ఏమిటో ముందుగా తెలుసుకోవచ్చనే ఆశ అర్థాంతరంగా అణిగి పోవడంతో, విసుగ్గా తల విదిలించి పళ్ళెరం మీదికి దృష్టిని కేంద్రీకరించింది యువరాణి.

* * * * *

నిర్మానుష్యంగా ఉన్నది నగర ద్వారం... అంతకు ముందు రోజు వరకూ పదునైన ఆయుధాలు పట్టుకుని అక్కడ నిలబడి ఉండే సైనికులు ఎవరూ శ్యామలుడికి ఇప్పుడు అగుపించలేదు.

నగరం ద్వారం లోంచి నడిచి అతను ఒక రాచవీధిలోకి పోతూ వుండగా, చిన్నగా ఎవరో తనను పిలిచిన శబ్దం అతని చెవులకు చేరింది. తల తిప్పిచూసేసరికి, పెద్ద రాళ్ళగుట్ట చాటు నుంచి అతనికేసి చేయి ఊపుతున్న పౌరుడు కనిపించాడు.

"నిన్నటి వరకూ ఇది ధనపాల శ్రేష్టిగారి మూడు అంతస్థుల విలాసభవనం. ఇప్పుడు దాని పరిస్థితి ఎలా తయారయిందో కనిపిస్తోందా?" రాళ్ళగుట్ట దగ్గరికి రాగానే శ్యామలుడిని అడిగాడు ఆ పౌరుడు.

"ఎందుకు ఇలా కూలిపోయింది?" ఏమీ తెలియనట్లు అడిగాడు.

"ఇదే కాదు... రాజభవనం కూడా ఇదే మాదిరి కుప్పకూలిపోయింది. ఆరగించటానికి ఒక్క మనిషి కూడా కనిపించక పోయేసరికి, ఇక్కడే ఎక్కడో చుట్టలు చుట్టుకుని మాటు వేసింది ఆ రాక్షసి పాము. పోటుగాడి మాదిరి నడి వీధిలో నడుస్తున్నావు. నీ జాడ పసికట్టి చిటికెలో వచ్చి పడుతుంది" చిన్న కంఠంతో హెచ్చరించాడు ఆ పౌరుడు.

"సైనికులందరూ ఏమైపోయారు?" అడిగాడు శ్యామలుడు.

"సైనికులా... సైనికుల్ని గురించి అడుగుతున్నావంటే నువ్వు ఈ నగరంలోని వాడివి కాదని తెలిసిపోతోంది" క్రింది నించి పైవరకూ పట్టిపట్టి చూస్తూ అన్నాడు ఆ పౌరుడు.

"ఏమయింది? ఏం జరిగింది నగరంలో?" తన ఆశ్చర్యాన్ని అణుచుకుంటూ అడిగాడు శ్యామలుడు.

"మా నగర పాలకుల వారి మీద తిరుగుబాటు జరిగింది. సేనాపతి ఎదురు తిరిగాడు. సింహాసనాన్ని వశపరుచుకున్న మూడో క్షణంలో ఆ రాక్షసి పాము దెబ్బకి హతమారి పోయాడు. సైనికులందరూ తలా ఒక దారి అయిపోయారు. నగర పాలకుడు కూడా నగరాన్ని వదిలి పారిపోయాడని అందరూ అనుకుంటున్నారు" చెప్పాడు ఆ పౌరుడు.

వైదర్భి పాలకుడు నిరాశ నిస్పృహతో అడవి దారి పట్టటానికి తిరుగుబాటు కూడా ఒక కారణమని అర్థం అయింది శ్యామలుడికి.

"ఆ రాక్షసి పామును ఎదిరించగల మొనగాళ్ళు నగరంలో ఎవరూ లేరు?" లేరని తెలిసినా ఊరుకోలేక అడిగాడు.

"ఒకప్పుడు నగర పాలకుడు పోషించిన మంత్రగాడు ఉండేవాడు. ఇప్పుడు లేడు. ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి" నిరాశగా అన్నాడు ఆ పౌరుడు.

"అందరూ ప్రాణాలు కాపాడుకోవటానికి నగరాన్ని వదిలి పారిపోయినట్లు కనిపిస్తోంది" చుట్టూ చూస్తూ అన్నాడు శ్యామలుడు.

తల ఊపాడు ఆ పౌరుడు.

"అందరితో పాటు నువ్వు కూడా పోకుండా ఇంకా నగరంలోనే ఎందుకు ఉండటం?" అడిగాడు శ్యామలుడు.

"శత సంవత్సరాలు దాటిన వృద్ధుడు మా తాతయ్య. వృద్ధాప్యంలో వచ్చే నీరస వ్యాధుల మూలకంగా కదలలేని పరిస్థితి. ఒంటరిగా వదిలి నా దారి నేను చూసుకోవటం మహా పాపం...." తలవంచుకుంటూ అన్నాడు ఆ పౌరుడు.

తనకు తెలియకుండానే చేయి జాచి అతని భుజం తట్టాడు శ్యామలుడు సాదరంగా, "వృద్ధుని ఎడల నీకున్న అభిమానం నిజంగా శ్లాఘనీయం... మీ తాతయ్యను నగరం దాటించటంలో నేను సాయం చేస్తాను. దూరంగా వెళ్ళి హాయిగా బ్రతకవచ్చు" అన్నాడు.

మిలమిలమెరిశాయి ఆ పౌరుడి కనులు. గిరుక్కున వెనుతిరిగి, రాళ్ళగుట్ట వెనుక భాగంలో ఉన్న చిన్న వీధిలోకి దారి తీశాడు.

అక్కడ కూడా శ్యామలుడికి కనిపించాయి సర్వనాశనం అయిపోయి వున్న కట్టడాలు అనేకం.

సగం కూలిపోయిన ఒక ఇంటి వెనుక భాగంలో ఉన్న పెద్ద మారేడు చెట్టు దగ్గరికి అతన్ని తీసుకుపోయాడు ఆ పౌరుడు.

రెండు బారల వెడల్పు ఉన్నది ఆ చెట్టు మొదలు. నేలకు మూడు అడుగుల ఎత్తున పెద్ద బొరియ ఒకటి కనిపిస్తోంది ఆ మొదలుకు.

"ఎవరు? ఎవరు చెట్టు దగ్గిర?" వణుకుతున్న కంఠం ఒకటి ఆ చెట్టు క్రిందకి పోయిన వెంటనే వినవచ్చింది.

"ఎటువంటి శబ్దం వినవచ్చినా విన్ను మాట్లాడ వద్దని చెప్పాను కదా... ఎందుకు మాట్లాడుతున్నావు?" ఆ తొర్రలోకి తొంగి చూస్తూ కోపంగా అడిగాడు ఆ పౌరుడు.

"భయం వేసిందిరా... అందుకే మాట్లాడాను" సమాధానం ఇచ్చింది ఆ కంఠం.

పౌరుడి భుజాల మీదినించి లోపలికి తొంగిచూసిన శ్యామలుడికి కనిపించాడు ముడుతలు పడిన ముఖంతో, ముడుచుకు కూర్చుని ఉన్న శతాధిక వయస్సు కలిగిన వృద్ధుడు.

"మనం నగరాన్ని వదిలి వెళ్ళిపోతున్నాము తాతయ్యా...." అంటూ తొర్రలోకి చేతులు పోనిచ్చి ఆ వృద్ధుడిని బయటికి లాగాడు ఆ పౌరుడు.

"ఆ రాక్షసి ప్రాణాలతో ఉన్నంత వరకూ మనం ఎక్కడికి పోయినా ప్రమాదం తప్పదురా... దాన్ని నాశనం చేయందే ఎవరూ ప్రాణాలతో ఉండరురా" అన్నాడు వృద్ధుడు. కారణం తెలియలేదుగాని, ఉన్నట్లుండి అధికం అయింది శ్యామలుడి కుతూహలం.

"ఇటువంటి దుర్మార్గపు ప్రాణుల్ని ఇంతకు ముందు ఎప్పుడయినా చూశారా." వినయంగా అడిగాడు శ్యామలుడు.

"నువ్వు ఎవరివి నాయనా? నిన్ను ఇంతకుముందు ఎన్నడూ చూసిన జ్ఞాపకం లేదు" కనులు చిట్లిస్తూ ఎదురు ప్రశ్న వేశాడు వృద్ధుడు.

ప్రక్కనే నిలబడి ఉన్న అతని మనవడికి ఉన్నట్లుండి ముంచుకు వచ్చింది విపరీతమైన చిరాకు. "నీకు స్వయానా మనవడిని... నన్నే సరిగ్గా గుర్తుపట్టలేవు... పరాయివారిని ఎలా గుర్తుంచుకుంటావు?" విసురుగా అడిగాడు.

బోసినోరు అతని తాతయ్యది... వెడల్పుగా తెరిచి విచిత్రంగా నవ్వాడు. "పరాయివారితో మాట్లాడేటప్పుడు వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా

తెలుసుకోవటం కోసం అలాగే ప్రశ్నించాలి. అది పద్ధతి నీకు వయసు అయితే పెరుగుతోంది గాని బుద్ధి మాత్రం అధికం కావటం లేదు” అంటూ సున్నితంగా మందలించి మళ్ళీ శ్యామలుడి కేసి తిరిగాడు.

“తాతయ్యగారూ... మీ అనుభవాల ముందు మేము పసిబిడ్డల వంటి వాళ్ళం. మా అనుభవ రాహిత్యాన్ని చూసి కోపగించుకోకండి. దయచేసి నా ప్రశ్నకు సమాధానం చెప్పండి” మరింత వినయంగా అడిగాడు శ్యామలుడు.

“నువ్వు ఎవరివోగాని ముందుచూపు చాలా బాగా కలిగిన వాడిలా కనిపిస్తున్నావు. నిజమే... ఈ నగరం ఒక చిన్న పల్లెటూరి మాదిరిగా ఉన్న సమయంలో ఇక్కడికి వచ్చి నివాసం ఏర్పరచుకున్నారు మా వంశీయులు... అప్పటికి నేను పుట్టి ఉండలేదు” గతాన్ని తలుచుకుని దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నాడు వృద్ధుడు.

చిరాకు మరింత అధికం అయిపోయింది అతని మనవడికి “నువ్వు నీ మాటల్ని కట్టి పెడితే చాలా బాగుంటుంది. నువ్వు చెప్పే సోది మాటలు వినేవాళ్ళు ఎదుటవుంటే చాలు, నీకు ఇంక ఏదీ అవసరం ఉండదు” అంటూ శ్యామలుడికేసి చూశాడు.

“తెరిచిన నోటిని మూయకుండా మూడు పగళ్ళు మూడు రాత్రులు ఏకధాటిగా మాట్లాడుతూనే ఉంటాడు. ఈయన ఒక పెద్ద వైద్య శిఖామణి. చూపు మందగించి, చేతులు వణకటం మొదలు అయిన తర్వాత ఆ వృత్తిని వదిలేసి ఇంట్లోనే కాలం గడుపుతున్నాడు...” అన్నాడు.

అతను మాట్లాడుతూ ఉన్న సమయంలోనే రాచవీధిలో చెలరేగింది కలకలం... అరుపులు, ఆర్తనాదాలతో దద్దరిల్లిపోవటం మొదలుపెట్టింది... అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న ఆ ప్రదేశం.

పరుగులాంటి నడకతో వెనక్కిపోయి, ఒక శిథిలభవనం చాటునుంచి వీధిలోకి తొంగి చూశాడు శ్యామలుడు.

నగర వీధుల్లో ఎటువంటి కదలికలు, శబ్దాలు కనిపించకపోవటంతో, ఆ రాక్షసి సర్పం నగరాన్ని వదిలి వెళ్ళిపోయినట్లుగా భావించారు కాబోలు – తాము దాగుకుని ఉన్న తావుల్ని వదిలి ధైర్యంగా వెలుపలికి వచ్చారు పదిమంది పౌరులు. రాచవీధి మీదనే కన్నువేసి ఉంచింది కాబోలు – సుడిగాలి మాదిరి వచ్చి వారిని చుట్టుముట్టింది రాక్షసి సర్పం.

శ్యామలుడు చూస్తూ ఉండగానే వారందరినీ తనకు ఆహారంగా చేసేసుకుని, నెమ్మదిగా తలను క్రిందికి దించింది.

తాను అక్కడే నిలబడి ఉంటే తన ఉనికి కూడా దానికి తెలిసిపోతుందన్న అనుమానం కలిగింది శ్యామలుడికి. శబ్దం చేయకుండా వెనక్కి పరిగెత్తుకు వచ్చాడు అతను.

నేలమీద ముడుచుకు కూర్చుని ఉన్న వృద్ధుడిని అమాంతంగా పైకి ఎత్తి తన భూజాల మీద కూర్చో బెట్టుకున్నాడు.

"రాచవీధిలోకి వెళ్ళకుండా నగర ద్వారాలను అధిగమించాలి. ముందుండి దారి చూపించు" అంటూ మనవడిని హెచ్చరించాడు.

ఎదురుచెప్పలేదు మనవడు. వేగంగా అడుగులు వేసి, పావు ఘడియ తరువాత నిర్మానుష్యంగా ఉన్న నగర ద్వారాల దగ్గరికి తీసుకుపోయాడు.

రాచవీధిలోనే ఉన్న రాక్షసి సర్పానికి తెలియకుండా నగరాన్ని వదిలిపెట్టి వెళ్ళిపో గలుగుతున్నందుకు ఎంతగానో సంతోషించబోయిన శ్యామలుడు ఉన్నట్లుండి ఉలిక్కిపడ్డాడు.

"వచ్చేస్తోంది అది. గాలివాలున మన జాడలు దానికి తెలిసిపోయి నట్లున్నాయి." అని మనవడిని హెచ్చరిస్తూ పరుగు మొదలు పెట్టాడు.

రెండు వందల ధనువుల దూరం పోయిన తర్వాత అతని మాటలు నిజమేనని తేలిపోయింది.

చెవులు చిల్లులు పడిపోయేటట్లు వికృత శబ్దాలు చేస్తూ నగర ద్వారాల దగ్గిర ప్రత్యక్షం అయింది ఆ సర్పం. తాడిచెట్టు ఎత్తుకు తలను లేపి ద్వారాల దగ్గిర ఉన్న కోట గోడను దభీమని కొట్టింది.

ముక్కలు ముక్కలైపోయింది గోడలోని కొంత భాగం. కోటను ముట్టడి చేసిన శత్రువులు బలమైన ఇనుప స్తంభాలతో పొడిచినట్లు నిలువుగా పగిలిపోయింది.

"తప్పించుకోవడం అసంభవం... అది మనకోసమే వస్తోంది. మనల్ని గుటుక్కున మింగేస్తుంది..." విపరీతమైన భయంతో వాపోయాడు మనవడు.

భయం అతని పాదాల్లోని శక్తిని హరించివేసినట్లు ఎక్కడి వాడక్కడ ఆగిపోబోయాడు గాని, ఆ పని చేయలేదు శ్యామలుడు.

"ఒక్క క్షణం పాటు ఆలస్యం చేసినా దానికి మరింత దగ్గిర అవుతాము. పారిపోవటమే ప్రస్తుతం చేయగలిగిన పని" అంటూ రెచ్చగొట్టి పరుగు తీయించాడు.

"మనం అడవిలోకి వెళ్ళటం మంచిదికాదు నాయనా... చెట్లు చేమలు దాని శక్తిని మరింత అధికం చేస్తేస్తాయి. గడ్డి కూడా కనిపించని గుగ్గుడి ప్రదేశానికి పోవటమే ఇప్పుడు చేయగలిగిన పని" శ్యామలుడి భుజాల మీది నుంచి మాట్లాడాడు వృద్ధుడు.

తాను ఏం చేయటానికి నగరంలోకి వచ్చాడో, సరిగ్గా ఆ పనే చేయమని అతను సూచించటం చాలా విచిత్రంగా అనిపించింది శ్యామలుడికి.

"మీకు ఈ దుష్టప్రాణుల వంటి దుర్మార్గపు జీవులను గురించి బాగా తెలుసని నాకు అర్థం అయింది. దయచేసి ఆ పిశాచాన్ని శాశ్వతంగా వదిలించుకునే మార్గం ఏమిటో నాకు చెప్పండి" పరుగును ఆపకుండా అర్థించాడు అతన్ని.

"వైద్యుల వంశం కదా... ఎంతో కొంత విష వైద్యాల గురించి మాకు అవగాహన తప్పకుండా ఉంటుంది. వెన్నుపూస ఆధారంగా మాత్రమే కదిలే ఇటువంటి విషపు పురుగులకు ఒక విరుగుడు వైద్యశాస్త్రంలో చెప్పబడి ఉంది" అన్నాడు వృద్ధుడు.

పరిగెత్తటం అలవాటు లేదు కాబోలు, ఆయాసంతో వగరుస్తున్నాడు అతని మనవడు. "నువ్వు మళ్ళీ నీ వాగుడు మొదలు పెట్టావు... నోరు మూసుకోకపోతే మనం దానికి దొరికి పోతాము" భుజం మీది నించి వెనక్కి చూస్తూ కోపంగా అన్నాడు.

"తరతరాలుగా మా వంశీయులు చేస్తున్న వైద్యం వాడికి వంటబట్టలేదు. అది అసహ్యకరమైన వృత్తి అంటూ ఉంటాడు...." ఆ మాటల్ని పట్టించుకోకుండా శ్యామలుడికి చెప్పాడు వృద్ధుడు.

"మీరు దయచేసి నా మాటకు సమాధానం ఇవ్వండి. ఆ రాక్షసిని వదిలించుకునే మార్గం ఏదో వెంటనే చెప్పండి" అంటూ అతన్ని మరింత వినయంగా వేడుకున్నాడు శ్యామలుడు.

"అది మామూలు పాము కాదు. మంత్ర తంత్రాలు నేర్చిన మహమ్మారి. మా తాత చెప్పే ఉపాయాలన్నీ మామూలు జీవులకు సంబంధించి నటువంటివి. నల్లులు, బల్లులు, నీటిపాములు మొదలైన వాటి మీద పని చేస్తాయి గాని, ఇటువంటి పిశాచాల మీద కాదు" కోపంగా అన్నాడు మనవడు.

"వాడు వట్టి శుంఠ... వాడికి శాస్త్రాలమీద గౌరవంలేదు. ఎంత మంత్ర తంత్రాలు నేర్చినా కూడా అది ఒక పాము. పాములకు వంటినిండా విషం ఉంటుంది. ఎటువంటి విషాన్నయినా తిప్పికొట్టే శక్తి సాధారణమైన లవణానికి ఉంటుంది" క్లుప్తంగా అన్నాడు వృద్ధుడు.

ఝల్లుమన్నది శ్యామలుడి శరీరం... పగబట్టి ఎటువంటి మనిషినయినా వెతుక్కుంటూ వచ్చి ప్రాణాలను హరించే సర్పాలను అడ్డుకోవటం కోసం లవణ స్ఫటికలను మంత్రించి వాటి మార్గంలో అడ్డుగా చల్లిస్తారు మంత్ర వాదులు. ఎట్టి పరిస్థితిలోను ఆ పాములు ఆ స్ఫటికాలను దాటి రాలేవని నమ్మకంగా చెపుతారు.

శ్యామలుడి మనస్సులో మెదులుతున్న మాటలు ఏమిటో తనకు తెలిసి పోయినట్లు చిన్నగా నవ్వాడు వృద్ధుడు.

"లవణ స్ఫటికలను మంత్రించటం అనేది ఎదుటి వాళ్ళ నమ్మకాన్ని సొమ్ము చేసుకోవటానికి చేసే పని... మంత్రించినా, మంత్రించకపోయినా పాములు లవణ స్ఫటికాలను దాటి ముందుకు రావు... అవి వాటికి విషంతో సమానం" అన్నాడు.

అనుకోని విధంగా ఆ వృద్ధుడితో పరిచయం కావటం తన అదృష్టంగా అనిపించింది శ్యామలుడికి.

అతను తనకు కనిపించి ఉండకపోయినా, రాక్షసి సర్పాన్ని ఆకర్షించి అవతలకు తీసుకు పోయేవాడు తాను.

తాను చేయదలుచుకున్నది ఏమిటో తనకు తెలిసినట్లు ఆ సర్పాన్ని మట్టుబెట్టే ఉపాయాన్ని సూచించాడు వృద్ధుడు.

"అయ్యో... అధికంగా ప్రశ్నలు వేసి తమరిని ఇబ్బంది పెట్టటం నాకు ఇష్టం లేదుగాని, నైరుతి దిశలో ఉన్న గుగ్గుడి ప్రదేశాన్ని గురించి కూడా మీకు ఏమైనా తెలిస్తే దయచేసి చెప్పండి" అన్నాడు.

"నాకేమిటి నాయనా... నీకు కూడా ఈపాటికి తెలిసే ఉండాలి... గడ్డి మొక్క కూడా కనిపించని ఆ ఎడారి ప్రదేశం ఎందుకు అలా తయారయిందని నీ ఉద్దేశం?" ఎదురు ప్రశ్నవేశాడు వృద్ధుడు.

"నీరు నిలబడటానికి వీలు లేని రాతి నేల అని నేను విన్నాను" అన్నాడు శ్యామలుడు.

"నేల అయితే వర్షపు నీరు నిలబడదు. ఇగిరిపోతుంది. రాతి నేల అయితే పైభాగంలోనే నిలబడుతుంది. అలా నిలబడిన నీటి దగ్గరి ప్రదేశంలో రాతి నేల అయినా కూడా నీరు కనిపించదు. ఎందుకని?" ఇంకోసారి ఎదురు ప్రశ్న వేశాడు వృద్ధుడు.

వెనుక నుంచి వినవస్తున్న శబ్దాలను ఆలకించటానికి కూడా ప్రయత్నం చేస్తున్నాడు శ్యామలుడు. కోట ద్వారాల దగ్గిర గోడలను పగల గొట్టిన సర్పం, తమను అనుసరిస్తోందో లేదో తెలుసుకోవాలన్న కోరిక క్షణక్షణానికి బలపడి పోతున్నది అతని హృదయంలో.

ఆ మాటల్ని కూడా తేలికగానే గ్రహించినట్లు, "ఆగవలసిన అవసరం లేదు నాయనా... ఇది మనల్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదు. తప్పకుండా వెంట వచ్చి తీరుతుంది" అన్నాడు వృద్ధుడు. అంతటితో ఆగలేదు. "నా మాటకు నువ్వు సమాధానం ఇవ్వలేదు" అంటూ గుర్తుచేశాడు.

తాము వెళుతున్న గుగ్గుడి ప్రదేశంలో నీరు ఎందుకు నిలువబడదో ఊహించటానికి ప్రయత్నం చేశాడు శ్యామలుడు.

బండలు ఏటవాలుగా ఉంటే వర్షం కురిసిన వెంటనే నీరు పల్లపు ప్రదేశాలను వెతుక్కుంటూ వెళ్ళిపోతుంది. ఆ కారణంగా అక్కడ నీటి నిలువ కనిపించకపోవచ్చు.

కాని తమతోపాటు వచ్చిన సైనికుడు చెప్పిన మాటల్నిబట్టి చూస్తే అది ఒక పెద్ద కొండలోయ... ఆ లోయలో ఎక్కడో ఒక చోట ఏదో ఒక పల్లపు ప్రదేశం ఉండక తప్పదు. తగినంత కాకపోయినా ఎంతో కొంత తేమ ఆ ప్రదేశంలో నిలబడక తప్పదు.

తేమ ఉంటే వృద్ధుడు చెప్పిన నాచు మొక్కలు గాని, తుంగపొదలు గాని తప్పకుండా తలలు ఎత్తుతాయి.

అటువంటివి ఏవీ లేకపోతే-

శ్యామలుడి ఆలోచనలు అనంతంగా సాగిపోతూ ఉండటాన్ని చూసి చిన్నగా నవ్వాడు అతని భుజాల మీద వున్న వృద్ధుడు.

"లవణపు బండలు నాయనా అవి... ఆ లోయ పెద్ద లవణ లోయ... అదంతా రాతి ఉప్పుతో నిండి ఉంది. వర్షపు చినుకు పడిన వెంటనే ఆకర్షించి ఆత్రంగా తనలో కలిపేసుకుంటుంది ఆ ప్రదేశం. ఉప్పు ఉన్న ప్రదేశంలో గరిక మొక్క కూడా బతకలేదు."

గుండెల మీద ఉన్న బరువు మొత్తం చిటికెలో మటుమాయం అయిపోయిన అనుభూతి శ్యామలుడిని ఆవరించుకున్నది. తనకు తెలియకుండానే అప్రయత్నంగా పరుగువేగాన్ని అధికం చేశాడు.

రెండు ఘడియల పాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసిన తరువాత అతని ఎదుట ప్రత్యక్షం అయింది సైనికుడు చెప్పిన లోయ. దాని ముఖద్వారం దగ్గిరే నిలబడి కనిపించారు గదాధరుడు–ఆ సైనికుడు.

"వచ్చేస్తోంది మిత్రమా... ఆ పిశాచం మీ వెనుకే వచ్చేస్తోంది" ఆందోళన నిండిన కంఠంతో బిగ్గరగా అరిచాడు గదాధరుడు.

వెనక్కి చూడనుకూడా చూడకుండా భుజాల మీది వృద్ధుడితో సహా లోయలోకి అడుగు పెట్టాడు శ్యామలుడు.

"అది వచ్చిపడితే ఎదిరించే మార్గం ఏదైనా ఆలోచించావా?" అతని భుజాల మీది వృద్ధుడిని, ఆ వృద్ధుడి మనవడిని విచిత్రంగా చూస్తూ అడిగాడు గదాధరుడు.

లోయలోకి అడుగుపెట్టి పది ధనువుల దూరం పోయిన తర్వాత ఒక పెద్ద బండరాయి దగ్గిర వృద్ధుడిని కిందికి దించాడు శ్యామలుడు.

"మీరు చెప్పినట్లు ఆ పిశాచం ఈ లోయలోకి రాలేకపోయినా, ముఖ ద్వారం దగ్గిర ఆగి రచ్చరచ్చ చేసేస్తుంది. భయపడకండి...." అని ధైర్యం చెప్పి తన జతగాడి వైపు తిరిగాడు.

ఉరుకులు పరుగులు మీద వచ్చేస్తున్నది రాక్షసి పాము. బుసలు కొడుతోంది. నాశికా రంధ్రాలలో నుంచి మంటల్ని బయటికి ఊదుతోంది.

"అది లోయలోకి ఎందుకు రాలేదు? రాకుండా ఏదైనా ఉపాయం ఆలోచించారా?" మరోసారి అడిగాడు అతను.

వివరంగా సమాధానం చెప్పే వ్యవధి శ్యామలుడికి లభించలేదు... చూస్తూ ఉండగానే సుడిగాలి మాదిరి వచ్చి పడిందా సర్పం.

తమ వెంట తీసుకువచ్చిన నీటి బుర్రల్ని, మూటగా కట్టిన అడవి దుంపల్ని, ఇంకో బండ చాటుకు చేరుస్తున్న సైనికుడు భయంతో వెర్రిగా అరిచాడు.

నోటిని వెడల్పుగా తెరచి సూటిగా అతని మీదికి దూకబోయిన ఆ రాక్షసి సర్పం – ఉన్నట్లుండి తన ఎదుట ఏదో పెద్ద కోట గోడ ప్రత్యక్షం అయినట్లు ఆగిపోయింది.

గుండెలు బలదరించేటట్లు శబ్దాలు చేస్తూ నాశికా రంధ్రాలలో నుంచి వెలువడుతున్న మంటల్ని అతని వైపు గురి పెట్టింది.

"నెట్టేయ్ మిత్రమా... అతన్ని బండచాటుకు నెట్టేయ్" బిగ్గరగా అరిచాడు శ్యామలుడు.

భుజంతో సైనికుడిని బండచాటుకు నెట్టి, తాను కూడా అతనితోపాటు తల దాచుకున్నాడు గదాధరుడు.

అగ్నిజ్వాలలు సూటిగా వచ్చి వారు ఏ బండచాటున తలలు దాచుకున్నారో, ఆ బండకు తగిలాయి.

నిప్పులమీద ఉప్పు కణికెలు జల్లినట్లు వెంటనే వినవచ్చింది పెద్ద శబ్దం. చిటపటలాడుతూ గాలిలోకి లేచింది ముక్కలు అయిన బండరాయి.

"నువ్వు ఆలోచించిన ఉపాయం ఏమిటో చెప్పమంటే మాటలు రాని మూగవాడి మాదిరి నిలబడి పోతావేమిటి మిత్రమా... అది ఇంకా కొంచెం ముందుకు వచ్చి ఇంకోసారి బుస్సుమని శబ్దం చేస్తే ఈ బండలన్నీ పిండిపిండి అయిపోతాయి. కలుగుల్లో నుంచి బయటపడిన ఎలుకల మాదిరి దానికి దొరికిపోతాము మనం...." సైనికుడిని, ఇంకో బండచాటుకు నెడుతూ బిగ్గరగా అరిచాడు గదాధరుడు.

అతను భయపడినట్లే జరిగింది. లోయ ముఖ ద్వారం దగ్గర్నించి ఆ పిశాచి ముందుకు రాలేదుగాని, మరోసారి బుస్సుమని శబ్దం చేయనే చేసింది. అంతకుముందుకంటే రెట్టించిన వేగంతో దూసుకు వచ్చాయి దాని నాశికా రంధ్రాలో నుంచి అగ్ని జ్వాలలు.

ఫెడీల్ ఫెడేల్మంటూ పేలిపోయాయి మరికొన్ని బండలు. చిటపటశబ్దాలు చేస్తూ చిందరవందరగా గాలిలోకి ఎగిరాయి.

క్రూరంగా చూస్తున్న ఆ రాక్షసి సర్పం తన మొఖం మీద ఎవరో బలంగా చరిచినట్లు అదిరిపడి తల వెనక్కి లాక్కున్నది. అంతటితో ఆగలేదు. తన కళ్ళకు ఏదో దెబ్బ తగిలినట్లు గిలగిలకొట్టుకుంటూ నేల మీద పొర్లాడడం ప్రారంభించింది.

"ఏమయింది దానికి? ఎందుకు అలా గిలగిల లాడిపోతున్నది?" తన ఆశ్చర్యాన్ని అణుచుకోవటం చేతకాక శ్యామలుడి ప్రక్కకు వస్తూ అడిగాడు గదాధరుడు.

"పాములకు కళ్ళుంటాయి గాని, ఆ కళ్ళకు కనురెప్పలు ఉండవు. తాను వెలువరించిన అగ్ని జ్వాలలు ఈ లవణపు రాళ్ళను బ్రద్దలు చేశాయి. బ్రద్ధలయిన ఉప్పురాళ్ళ అవశేషాలు దాని కళ్ళల్లో పడ్డాయి... ఎటువంటి బాధ కలుగుతుందో నీకు తెలుసు" అంటూ తన కరవాలాన్ని బయటికి తీసి ముందుకు పరుగు తీశాడు శ్యామలుడు.

అతను ఏం చేయబోతున్నాడో తెలిసిపోయింది గదాధరుడికి. "మనకు తెలియకుండానే మహా మంచి ప్రదేశంలోకి వచ్చాము... దాని అంతుచూడటానికి ఇంతకంటే మంచి అవకాశం మరొకటి లభించదు" అంటూ తను కూడా ముందుకు పరిగెత్తాడు గదాధరుడు.

గిలగిలలాడుతున్న రాక్షసి సర్పం ముంచుకు వస్తున్న ప్రమాదాన్ని గుర్తించి తలను పైకి ఎత్తక ముందే చెరొక ప్రక్కనుంచీ దానిని ఎదిరించారు వారిద్దరూ. తమ కరవాలాలతో ఎడాపెడా దాని మెడ మీద కొట్టారు.

ఎదురు తిరగటానికి ప్రయత్నం మొదలు పెట్టకముందే రెండుగా తెగిపోయింది దాని శరీరం.

*  *  *  *  *

"నువ్వు చెప్పింది నిజమే అవ్వా... కొన్ని కొన్ని దుష్టశక్తుల్ని అణచటానికి మంత్రాలు చాలకపోయినా యుక్తులు సరిపోతాయి" పళ్ళెరంలోని నీటిలో కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తూ అన్నది యువరాణి.

ఆమెకు దూరంగా కూర్చుని ఏదో తాళపత్ర గ్రంధాన్ని చదువుతున్న వృద్ధురాలు ముందుకు వంగి తాను కూడా ఆ దృశ్యాన్ని చూసింది.

రెండు ముక్కలు అయిన రాక్షసిపాము శరీరాన్ని లోయ ముఖద్వారం దగ్గిర్నించి దూరంగా లాక్కుపోయారు స్నేహితులు ఇద్దరూ.

"దాన్ని ఇలాగే వదిలేస్తే కుళ్ళిపోయి దుర్వాసన వెలువరుస్తుంది. అగ్ని సంస్కారం చేయటం చాలా ఉత్తమం" అన్నాడు గదాధరుడు.

"కట్టెలు కావాలి. పెద్దపెద్ద అడవి బాదులు అవసరం అవుతాయి. ఎక్కడి నుంచి తీసుకువస్తావు?" అడిగాడు శ్యామలుడు.

"అసలు దాన్ని ఇలా అంతం చేయవచ్చని, అందుకు ఇదే సరైన చోటని నీకు ఎలా తెలిసింది?" అడిగాడు గదాధరుడు.

సైనికుడు అందించిన నీటి బుర్రలోని నీటిని తాగి, అతను చేతికి ఇచ్చిన అడవి పళ్ళను చప్పరిస్తున్న బోసినోటి వృద్ధుడికేసి చూపించాడు శ్యామలుడు. అతనితో తాను జరిపిన సంభాషణను వివరించాడు.

సాలోచనగా తల ఊపి, పెద్దపెద్ద అడుగులు వేస్తూ ఆ వృద్ధుడి దగ్గరికి పోయాడు గదాధరుడు.

"మీ గురించి నా జతగాడు చెప్పిన మాటల్ని ఆలకించి నేను ముగ్ధుడిని అయ్యాను... ఇప్పుడు ఆ కళేబరాన్ని దహనం చేసే ఉపాయం కూడా ఏదైనా ఉంటే చెప్పి పుణ్యం కట్టుకోండి" వినయంగా అడిగాడు.

బోసి నోటిని తెరిచి అందంగా నవ్వాడు వృద్ధుడు. "నగరానికి నగరాన్ని నాశనం చేయజూసిన ఆ పిశాచాన్ని ధైర్యంగా ఎదిరించిన వీర కుమారులు మీరు... మీకు ఏదైనా అవసరం అయితే నా వంటి సామాన్యుల్ని ఆజ్ఞాపించాలి. అర్థించకూడదు" అన్నాడు.

"తాతగారూ దాన్ని దహనం చేయాలి. మార్గం చూపించండి" ఓపికగా మరోసారి అడిగాడు గదాధరుడు.

తన దుస్తుల్లో నుంచి ఒక పెద్ద వస్త్రపు సంచిని బయటికితీశాడు వృద్ధుడు. "కనులు సరిగ్గా కనిపించకపోవటం వల్ల వైద్య వృత్తిని వదిలేశాను నేను. అలవాటు ప్రకారం ఇంకా ఈ ఔషధాల సంచిని వెంటబెట్టుకునే తిరుగుతున్నాను." అంటూ అందులో నుంచి ఒక చిన్న చెక్కభరిణెను తీసి అతనికి అందించాడు.

"భాస్వరంతో తయారుకాబడిన విషపు గుళికలు ఉన్నాయి. నీటిలో కలిపి దాని శరీరం మీద చిలకరించండి... తడి ఆరిపోయిన వెంటనే భగ్గున మాడి మసి అయిపోతుంది" అన్నాడు.

సైనికుడి దగ్గర ఉన్న నీటి బుర్రల్లో మరో బుర్రను అందుకుని, ఆ భరిణెలోని గుళికెలను నీటిలో వేశాడు గదాధరుడు. తీసుకుపోయి రాక్షసి సర్పం శరీరం మీద చిలకరించాడు.

నాలుగే నాలుగు నిమిషాల్లో ఆరిపోయింది ఆ నీటి తడి... వృద్ధుడు చెప్పినట్లే ఒక్కసారిగా భగ్గుమని పైకి లేచాయి మంటలు... ఇరువది రెండు క్షణికాల తరువాత మాడి మసై, గుట్టగా మారిపోయింది రాక్షసి సర్పం.

వరలో నుంచి బయటికి తీసిన కరవాలాన్ని తిరిగి వరలో పెట్టుకుని, లోయ ముఖద్వారం దగ్గిరే ఒక శుభ్రమైన ప్రదేశంలో చతికిలపడ్డాడు శ్యామలుడు. వెనుక వున్న లవణపు రాయికి ఆనుకుని కనులు మూసుకున్నాడు.

"నా జతగాడు తిరిగి నిద్రలేచే వరకూ ఎవరూ సద్దు చేయవద్దు. మీరు కూడా హాయిగా నిద్రలు పొండి" అందరినీ హెచ్చరించాడు గదాధరుడు. తన ఆయుధాన్ని వడిలో పెట్టుకుని తన స్నేహితుడి దగ్గిరే మెలకువగా కూర్చున్నాడు.

* * * * *

"ఇప్పుడు వాళ్ళు ఏం చేస్తారు అవ్వా?" శ్యామలుడి చర్యల్ని గమనించడం మొదలుపెట్టిన తర్వాత మొదటిసారిగా పళ్ళెరం ముందు నుంచి లేచి ఈవలికి వస్తూ వృద్ధురాలిని అడిగింది యువరాణి.

"ఏం చేస్తారని నువ్వు అనుకుంటున్నావు?" వినోదంగా చూస్తూ అడిగింది వృద్ధురాలు.

"ఆ వైదర్భి పాలకుడి దుర్మార్గపు పనుల్ని అందరికీ తెలియచేసి, అతన్ని సింహాసనం మీది నుంచి దించేస్తారు. మొదట వైదర్భి మీద శత్రుత్వం వహించినా, ఆ రాక్షసి సర్పం గురించి హెచ్చరించటానికి వచ్చిన త్రికుట వర్ధనుడిని క్షమించి వదిలేస్తారు" అన్నది యువరాణి.

పది క్షణికాల పాటు కనులు మూసుకుని ఏదో దృశ్యాన్ని చూస్తున్నట్లు తల ఊపింది వృద్ధురాలు.

"నేను చెప్పింది నిజమే కదా?" అడిగింది యువరాణి.

తల అడ్డం తిప్పింది వృద్ధురాలు,

"వైదర్భి పాలకుడు అడవుల్లో దారి తప్పి ఎటో వెళ్ళిపోయాడు. శిథిలమైన ఆ నగరాన్ని ఆ గజదొంగ తమతో పాటు వచ్చిన సైనికుడికి అప్పగించాడు. ప్రస్తుతం వైదర్భిని ఆ సైనికుడే పరిపాలిస్తున్నాడు. త్రికుట వర్ధనుడు అతనికి తన సంపూర్ణ సహాయ సహకారాలు అందచేస్తున్నాడు. ఆ రెండు నగరాల మధ్య స్నేహం వర్ధిల్లుతున్నది" అని చెప్పింది.

ఆశ్చర్యం తాండవించింది యువరాణి వదనంలో. "మరి ఆ గజదొంగ ఎక్కడికి పోయాడు?" అని అడిగింది.

"పళ్ళెరం ముందు కూర్చుని కూర్చుని నీకు వేరే వ్యాపకం అంటూ లేకుండాపోయింది... ఈరోజుకు విశ్రాంతి తీసుకో... రేపు తెలుసుకుందువు గాని" అంటూ ఆమె చేయి పట్టుకుని ఒక మందిరంలోకి తీసుకుపోయింది.

అందమైన హంసతూలికా తల్పం కనిపించింది యువరాణికి ఆ మందిరంలో. కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నట్లు అగుపించే ఆ పూరి పాకలో

అటువంటి సదుపాయాలు ఉండటం ఎలా సంభవించిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ ఆ తల్పం మీద మేనువాల్చింది యువరాణి. రెండే రెండు క్షణికాల్లో గాఢమైన నిద్దురలోకి జారిపోయింది.

* * * * *

విపరీతమైన సంరంభంతో నిండిపోయి ఉన్నది విక్రమ నగరపు రాచవీధి... ఎవరి పనుల మీద వారు చాలా హడావిడిగా సంచరిస్తున్నారు నగర పౌరులు.

పెద్దపెద్ద కేకలు పెడుతూ వారందరినీ తమ తమ వ్యాపార స్థలాలలోకి రప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు వర్తకులు.

"మేలుకరం వస్త్ర సంచయం... విలువైన ఆభరణాలు... కనులు మిరుమిట్లు గొలిపే ఆయుధాలు... రండి... రండి... వచ్చి ఒకసారి మీరే స్వయంగా చూసిపోండి...." బిగ్గరగా అరిచి తనకు సమీపంలోకి వచ్చిన పౌరుల్ని ఆకర్షించటానికి చూశాడు విపిన శ్రేష్ఠి.

ఆ మాటలకు ఆకర్షింపబడ్డారో ఇద్దరు పౌరులు. అటుకేసి తిరిగి రెండు అడుగులు వేశారు.

"విపినశ్రేష్ఠి మాటల్ని ఆలకించిన వాళ్ళు ఎవరూ బాగుపడినట్లు ఎవరికీ తెలియదు. తొందరపడి ముందుకు పోకండి" వెంటనే హెచ్చరించాడు వారిని, వెనుక వస్తున్న ఇంకో పౌరుడు.

"ఎందుకని? మోసాలు అధికమా?" ఆశ్చర్యంగా అడిగారు వాళ్ళు.

"మోసాలు అధికం కాదు... అతను చెప్పినవి అన్నీ పచ్చినిజాలు. మంచి మంచి వస్త్రాలు, మేలు రకం ఆభరణాలు. అపురూపమైన ఆయుధాలు నిజంగానే ఉంటాయి. కాని–" అంటూ ఇంకా ఏమో చెప్పబోయాడు ఆ పౌరుడు.

తన దగ్గరికి రాబోయిన పౌరులు ఇద్దరూ మధ్యలోనే ఆగి పోవటాన్ని గమనించాడు విపిన శ్రేష్ఠి. వారు ఆగిపోవటానికి వెనుక ఉన్న పౌరుడే కారణమని అర్థం అయింది అతనికి.

విపరీతమైన కోపంతో ఎర్రబడిపోయాయి అతని కనులు. "చూడండిరా... వారు ఎవరోచూసి తగిన శాస్తి చేయండి" చిన్న కంఠంతో తన వెనుక ఉన్న ఇద్దరు సేవకులను హెచ్చరించాడు.

ఒక్క క్షణికంకూడా ఆలస్యం చేయలేదు వారు ఇద్దరూ. వేగంగా ముందుకు పోయారు.

"నిన్న మా దగ్గిర వంద నాణేలు అరువు తీసుకున్నావు. ఈరోజు ఉదయమే తిరిగి చెల్లిస్తానని మాట ఇచ్చావు. ఏవీ అవి?" విపిన శ్రేష్టినిగురించి మాట్లాడబోతున్న పౌరుడి చేతులు పట్టుకుని పక్కకు లాగుతూ అడిగారు.

"నేనా? మీ దగ్గిర అరువు ఎప్పుడు తీసుకున్నాను? లేదు... లేదు" ఆందోళన నిండిన కంఠంతో బిగ్గరగా అరిచాడు అతను.

పిడికిళ్ళు బిగించి అతని నోటి మీద బలంగా పొడిచారు ఆ సేవకులు. వెనక్కినెట్టి పాదాలతో ప్రహరించటం మొదలుపెట్టారు.

"అన్యాయం... ఇది అక్రమం... చేయని రుణాన్ని నా నెత్తిమీద రుద్దటం దారుణం" కీచుగా అరిచాడు కింద పడిపోయిన ఆ పౌరుడు.

తమ కనుల్ని తామే నమ్మలేనట్లు చూస్తున్నారు అతనితో మాట్లాడిన పౌరులు ఇద్దరూ.

"మీరు అతగాడిని గురించి ఆలోచించకండి... వాడు పెద్ద పేరు మోసిన దరిద్రుడు... అయినకాడికి అప్పులు చేసి అందరికీ నామాలుపెట్టే బుద్ధి హీనుడు. లోపలికి వచ్చి నా దగ్గిర ఉన్న వస్తు సంచయాన్ని చూసుకోండి... రండి" ఆప్యాయత వెల్లివిరుస్తున్న కంఠంతో వారిని తన దగ్గరికి రమ్మనమని ఆహ్వానించాడు విపిన శ్రేష్ఠి.

"వద్దు... వెళ్ళకండి... వెళ్ళిపోండి... మీ దారిన మీరు వెళ్ళిపోండి" దెబ్బలు తింటూనే లేస్తూ ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోయాడు ఆ పౌరుడు.

దారుణమైన కోపం విపినశ్రేష్ఠిని ఆవరించుకున్నది. పళ్ళు పటపటమని కొరుకుతూ కిందపడిపోయిన వ్యక్తి దగ్గరికి వచ్చి ఎడమపాదంతో అతని గుండెల మీద బలంగా పొడిచాడు.

"తీసుకుపోయి దండనాధునికి అప్పగించండి. మన దగ్గిర దొంగతనం చేయటానికి ప్రయత్నించాడని ఆరోపించండి" అని చెప్పాడు తన సేవకుడికి.

"వదలండి. నన్ను వదిలిపెట్టండి... నేను ఎటువంటి తప్పు చేయలేదు. ఎవరి దగ్గరా రుణం తీసుకోలేదు. దొంగతనాలు చేయటం మా ఇంటా వంటా లేదు... వదలండి..." అంటూ తనను పట్టుకున్న విపిన శ్రేష్ఠి సేవకుల చేతుల్ని వదిలించుకోవటానికి ప్రయత్నం చేశాడు.

"అతను... నిజమే చెపుతున్నాడు శ్రేష్ఠిగారూ... నగరం వెలుపల నిమ్మతోట నొక దాన్ని పెంచుకుంటూ, ఆ తోట మీద వచ్చే ఆదాయంతో హాయిగా

జీవిస్తున్నాడు. అతన్ని గురించి నగరంలో చాలామందికి తెలుసు. వదిలేయండి" అటుగావచ్చి, ఆ గొడవను తిలకించిన పౌరుల్లో ఒకతను విపిన శ్రేష్ఠిని అనునయించబోయాడు.

"వాడిని గురించి నీకు బాగా తెలిసినట్లు మాట్లాడుతున్నావంటే, నువ్వుకూడా వాడికి సైదోడువే అయి ఉంటావు. నిన్ను కూడా దండనాధికారి దగ్గరికి పంపించి తీరవలసిందే" గుర్రుమన్నాడు శ్రేష్ఠి.

పుణ్యానికి పోతే పాపం ఎదురు వస్తున్నదని తెలిసిపోయింది ఆ పౌరుడికి. ఆపైన మరొక్కమాట కూడా మాట్లాడ లేదు. తలను ప్రక్కకు తిప్పుకుని వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు అక్కడి నుంచి.

"మొద్దురాచిప్పల మాదిరి ఇంకా అలాగే నిలబడి చూస్తారేమిటి? తీసుకుపోండి వాడిని...." గిలగిలలాడుతున్న పౌరుడి చేతుల్ని విరిచి పట్టుకుని శిలా విగ్రహాల మాదిరి నిలబడి ఉన్న తన సేవకుల్ని హెచ్చరించాడు శ్రేష్ఠి.

బలవంతంగా నడిపించారు వాళ్ళు ఆ పౌరుడిని. ఆ వీధి చివరన ఉన్న ఒక మండపం దగ్గరికి తీసుకుపోయి నిలబెట్టారు.

*  *  *  *  *

నగరంలో శాంతి భద్రతలను కాపాడేందుకు నియమించబడిన దండ నాధికారి కార్యాలయం ఆ మండపం.

వీధుల్లో అలజడి సృష్టించిన వాళ్ళు, అలజడులకు కారణం అయిన వాళ్ళు, చిల్లర మల్లర నేరాలను చేసి దొరికిపోయిన వాళ్ళు అనేక మంది గుంపుగా నిలబడి ఉన్నారు ఆ మండపం ప్రక్కనే ఉన్న ఒక పెద్ద వృక్షం క్రింద.

మండపంలో ఆశీనుడై ఉన్నాడు దండనాధికారి. పెద్దగా ఉన్న తన మీసాలను ఎడమచేతితో దువ్వుకుంటూ తన క్రింద పనిచేసే వారి మాటలను ఆలకిస్తున్నాడు.

విపినశ్రేష్ఠి సేవకులు ఈడ్చుకు వచ్చిన పౌరుడిని చూసిన వెంటనే ముడిపడ్డాయి అతని కనుబొమలు.

"వాడు నగరం వెలుపల ఉండే నిమ్మతోటకు హక్కుదారు. ఏం నేరం చేశాడని తీసుకు వస్తున్నారు?" అని తనే అడిగాడు.

వంగివంగి నమస్కారం చేశాడు ఒక సేవకుడు, శ్రేష్ఠిగారు చెప్పమన్న మాటల్ని తూచా తప్పకుండా వెల్లడించాడు.

"నిమ్మతోట మీది ఆదాయంలో ఎంతో కొంత నగరంలోని పరిస్థితుల్ని మెరుగు పరచటానికి ఉదారంగా ఇచ్చుకోమని ఎన్నోసార్లు బ్రతిమిలాడినా వాడు వినిపించుకోలేదు... ఇప్పుడు దొంగతనాలకు కూడా పాల్పడ్డాడన్నమాట" కోరగా చూస్తూ అన్నాడు దండనాధికారి.

"నగరంలోని పరిస్థితుల్ని మెరుగుపరచటానికి నేను ఉదారంగా ఏమీ ఇవ్వవలసిన అవసరం లేదు. నగర పాలకుల వారే తమ బొక్కసంలో నుంచి దండిగా తమరికి అందిస్తున్నారు. ఆ ధనాన్ని పూర్తిగా దిగమింగి, నా వంటి అల్పుల మీద మీ ప్రతాపం చూపించటం అన్యాయం..." కోపంగా అన్నాడు ఈడ్చుకు రాబడిన పౌరుడు.

"వాడి వరస చూస్తుంటే నగర పాలకుల వారి మీద తిరుగుబాటు చేయటానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది. తీసుకుపోయి కారాగారంలో నెట్టి వేయండి. మాటల్లో మర్యాద కనిపించేటంత వరకూ మక్కెలు విరగతీయమని నా మాటగా చెప్పండి" తన అనుచరులకు ఆజ్ఞ ఇచ్చాడు దండనాధికారి.

"అన్యాయం. ఇది అన్యాయం... నేను చేశానని వాళ్ళు చెపుతున్న నేరం ఎటువంటిదో విచారణ చేయకుండా శిక్ష విధించటం దారుణం" బిగ్గరగా అరిచాడు ఆ పౌరుడు.

"మా ఆజ్ఞలనే తప్పుపడుతున్న వాడి చర్మం ఊడిపోయేటట్లు కర్రు కాల్చి వాతలు పెట్టించండి" మరో శిక్ష ప్రకటించాడు దండనాధికారి.

శ్రేష్ఠి అనుచరుల దగ్గర్నించి, ఆ పౌరుడిని తమ అదుపులోకి తీసుకున్నారు దండనాధికారి అనుచరులు. పిడికిళ్ళతో అతని నోటి మీద పొడుస్తూ, అక్కడికి దగ్గర్లోనే వున్న కారాగారం వైపు లాక్కుపోయారు.

"నేను విధించిన శిక్ష సక్రమమైనదే అని మీరందరూ నమ్ముతున్నారా?" మండపం దగ్గిర నిలబడి ఉన్న పౌరుల వంక చూస్తూ అడిగాడు దండనాధికారి.

క్షణికం పాటు కూడా ఆలస్యం చేయకుండా తలలు ఊపారు వారందరూ. "ధర్మానికి, న్యాయానికి ప్రతి రూపం మీరు, మీ నోటి వెంట వెలువడిన మాటల్లో తప్పు వెతకటం అంటే బుద్ధి గడ్డి తినటం వంటిదే, సాక్షాత్తూ ధర్మదేవత అంటే మీరే...." తడుముకోకుండా అన్నాడు వారిలో ఒకతను.

ఆ మాటలకు కూడా తలలు ఊపుతున్న పౌరులందరి వంకా చూస్తూ, మీసాలు దువ్వుకున్నాడు దండనాధికారి.

"నిమ్మతోట యజమాని నేరం చేసి కారాగారం పాలయినాడు కాబట్టి అతని తోటకి యజమాని లేకుండా పోయాడు. వెంటనే వెళ్ళి స్వాధీనం చేసుకోండి. కాయలన్నిటినీ కోయించి విపణి వీధికి తరలించండి" అంటూ తన అనుచరుల్లో కొందరికి ఆజ్ఞ ఇచ్చాడు.

*　　*　　*　　*　　*

"అన్యాయం మిత్రమా.... ఇది దురన్యాయం.... ఎంతోమంది స్వార్థపరుల్ని చూశాము మనం. దుర్మార్గుల్ని దగ్గిర్లో నుంచి పరికించాము. ఈ దండనాధికారి వంటి దుష్టుడిని మాత్రం ఇప్పటివరకూ చూడలేదు" ప్రక్కనే వున్న శ్యామలుడితో అన్నాడు గదాధరుడు.

న్యాయవిచారణ జరిగే మండపానికి సమీపంలో ఉన్న ఒక కట్టడం దగ్గర నిలబడి ఉన్నారు వారిద్దరూ.

"ఆ నిమ్మతోట యజమాని పట్టుబడి చెరసాలలోకి నెట్టబడటానికి కారకులం మనమే కదా?" నెమ్మదిగా అడిగాడు శ్యామలుడు.

"మనం కాదు... నువ్వు... నువ్వు మాత్రమే కారకుడివి. ఏదో ఒక ధర్మసత్రం చూసుకుని, హాయిగా విశ్రాంతి తీసుకుందామని నెత్తీనోరు కొట్టుకుని చెపుతున్నా వినిపించుకోకుండా విపణి వీధిలోకి నన్ను తీసుకుపోయావు. వద్దువద్దని అంటున్నా వినిపించుకోకుండా ఆ విపిన శ్రేష్ఠి దుకాణంలోకి అడుగు పెట్టడానికి సిద్ధపడ్డావు. నీ మూలంగానే ఆ అమాయకుడు ఆ శ్రేష్ఠి కోపానికి బలి అయిపోయాడు" గబగబా అన్నాడు గదాధరుడు.

"శ్రేష్ఠి చర్యకు ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుంది" మండపం మీది నుంచి చూపుల్ని తిప్పకుండా అన్నాడు శ్యామలుడు.

"శ్రేష్ఠి ఒక్కడే కాదు... ఈ దండనాధికారి కూడా..." అన్నాడు గదాధరుడు.

"అయితే ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి?" అడిగాడు శ్యామలుడు.

"అత్యవసరంగా పోయి ఆ నిమ్మతోట నాశనం అయిపోకుండా కాపాడాలి" అన్నాడు అతగాడు.

“తర్వాత?”

“మనల్ని శ్రేష్ఠి గారి వలలో పడకుండా రక్షించబోయి తాను ఉచ్చులో పడ్డ ఆ అమాయకుడిని బయటికి రప్పించాలి”.

సాలోచనగా తల ఊపాడు శ్యామలుడు. మండపం దగ్గర్నించి కదిలి నగర ద్వారాల వైపు నడక మొదలు పెట్టారు.

“మిత్రమా...” నెమ్మదిగా సంబోధించాడు గదాధరుడు.

ఏమిటన్నట్టు అతని కేసి చూశాడు శ్యామలుడు.

“అడుగుపెట్టిన ప్రతి నగరంలోను ఏదో ఒక అన్యాయం మన కళ్ళపడటం, దాన్ని ఎదుర్కోవటానికి మనం రకరకాల బాధలు పడటంతోనే రోజులు గడిచిపోతున్నాయి. అసలు మనం ఎందుకోసం ఈ దేశ సంచారం మొదలు పెట్టామో ఆ పని ఒక్క అడుగు కూడా ముందుకు కదలటం లేదు. గౌరవంగా పిలిపించుకోవాల్సిన మనం గజ దొంగలుగా పిలవబడుతున్నాము. ఎంతకాలం ఈ నిందల్ని భరించాలి” అడిగాడు గదాధరుడు.

చిన్నగా నవ్వి అతని భుజం తట్టాడు శ్యామలుడు.

* * * * *

“అవ్వా... అవ్వా... రావాలి... త్వరగా రావాలి... త్వరగా...” ఉన్నట్లుండి పెద్దగా కేక పెట్టింది యువరాణి.

అవతలి ప్రక్కన ఉన్న మందిరంలో నుంచి పరుగు పరుగున వచ్చింది వృద్ధురాలు. పళ్ళెరంలోకి చూస్తున్న యువరాణి వంకా, ఆ చుట్టూ ఉన్న పరిసరాల వంకా చూసి తల విదిలించింది.

“ఇక్కడ చూడు అవ్వా... ఇక్కడ...” పళ్ళెరం కేసి చూపిస్తూ హెచ్చరించింది యువరాణి.

“ఏముంది తల్లీ అక్కడ?” అడిగింది వృద్ధురాలు.

“అసలు వీళ్ళు ఎందుకు దేశ సంచారం చేస్తున్నారో మనకి తెలియబోతున్నది. ఆ మాటలే మొదలు అయ్యాయి” ఉత్సాహంగా చెప్పింది యువరాణి.

కుతూహలంగా పళ్ళెరంలోకి చూసింది వృద్ధురాలు.

యువరాణి చెప్పినట్లు తమ గతాన్ని గురించిన మాటలు మాట్లాడుకోవటం లేదు శ్యామల గదాధరులు. నగర ద్వారాలను అధిగమించి వెలుపలికి వెళ్ళిపోతూ కనిపించారు.

"మనం వాళ్ళని గమనిస్తున్నట్టు అనుమానం వచ్చింది కాబోలు. మాటల్ని మానేశారు..." చెప్పింది యువరాణి.

*　　　*　　　*　　　*　　　*

విరగ కాసి ఉన్నది నగరం వెలుపల కోటకు ఒక క్రోసెడు దూరంలో ఉన్న నిమ్మతోట.

తమ అశ్వాలను తోటకు వెలుపలే చెట్ల క్రింద వదిలి, పది మంది పని వాళ్ళతో లోపలికి పోయారు దండనాధికారి సేవకులు.

"ఒక్క పిందె కూడా చెట్టుకు వ్రేలాడ కూడదు... మొత్తం తెంపి క్రింద పడవేయండి. మొదళ్ళను నరికి కట్టె పేళ్ళుగా మార్చివేయండి" నడుము మీద చేతులు వేసుకుని ఆజ్ఞలు ఇస్తున్నాడు ఒక అనుచరుడు.

"మొదళ్ళు నరికి కట్టె పేళ్ళుగా మార్చి వేసేటప్పుడు కాయల్ని పిందెల్ని కోయటం దేనికి?" అమాయకంగా అడిగాడు ఒక పనివాడు.

"మడ్డిమొఖమా... కాయల్నికోసి విపణి వీధికి పంపుతాము. కట్టెపేళ్ళను వంట కట్టెల క్రింద వదిలించుకుంటాము. పిందెల్ని వదిలిపెడితే కట్టెపేళ్ళకు పిందెలు కనిపించి అందరికీ అనుమానం వస్తుంది" అన్నాడు ఆ అనుచరుడు.

"నీకు ఏమయినా అర్ధం అయిందా మిత్రమా?" తోట వెలుపల నిలబడి ఆ మాటల్ని ఆలకించిన గదాధరుడు శ్యామలుడిని అడిగాడు.

"వివరంగా అడిగితే చెప్పలేను గాని, మొత్తానికి ఈ అందమైన తోటను సర్వనాశనం చేయటమే వాళ్ళ లక్ష్యం" అన్నాడు శ్యామలుడు.

"అయితే ఆలస్యం దేనికి? వాళ్ళు తమ పని మొదలు పెట్టకముందే మనం కల్పించుకోవడం చాలా మంచిది..." అంటూ తన దట్టీని ఊడదీసి ముఖ కవళికలు కనిపించకుండా ముఖం చుట్టూ చుట్టుకున్నాడు గదాధరుడు.

వరలో నుంచి కరవాలాన్ని బయటికి తీస్తూ తోటలోకి పరుగు తీశాడు.

పసుపు పచ్చటి రంగులో ఉన్న కాయల్ని కోయటానికి సిద్ధం అవుతున్నారు పని వాళ్ళు. అమితమైన వేగంతో వస్తున్న ఆయుధధారిని చూసి అవాక్కయి పోయారు.

"ఒక్కకాయను తెంపినా ఊరుకునేది లేదు. కాయల మాదిరిగానే తెగి క్రింద పడిపోతాయి మీ తలకాయలు... పొండి... వెళ్ళిపొండి..." అని అరుస్తూ కరవాలాన్ని వేగంగా ఊపాడు గదాధరుడు.

భయంతో బిక్కచచ్చిపోయారు ఆ పనివాళ్ళు. తమ అవయవాలకు అతి సమీపంలోకి వచ్చిన ఆ కత్తిని తప్పించుకుని, తోట వెలుపలికి పరుగు తీశారు.

"ఆగండి... ఆగిపోండి..." అని అరుస్తూ వారిని అడ్డగించబోయిన దండనాధికారి అనుచరుల్ని తాను ఎదిరించాడు శ్యామలుడు.

గదాధరుడి మాదిరిగానే తాను కూడా దట్టీతో ముఖం కనిపించకుండా చుట్టుకుని ఉన్నాడు అతను. దండనాధికారి అనుచరుల్ని క్రిందికి నెట్టి పాదాలతో క్రూరంగా హింసించాడు.

బాధను భరించటం అసాధ్యమై గావుకేకలు పెట్టారు వాళ్ళు, "అయ్యగారి ఆజ్ఞలను పరిపాలించే వాళ్ళం. మా తప్పేమీ లేదు. మమ్మల్ని వదిలిపెట్టండి మహాప్రభో..." అంటూ వేడుకున్నారు.

తోట వెలుపలికి పోయిన పనివాళ్ళు వెనక్కి వచ్చే అవకాశం లేదని నిశ్చయపరుచుకుని, తాను కూడా వారి దగ్గరికి వచ్చాడు గదాధరుడు.

"మేము అడిగిన మాటలకు సరైన సమాధానం చెపితే మీరు ప్రాణాలతో క్షేమంగా నగరంలోకి పోగలరు. పిచ్చి వేషాలు వేస్తే మాత్రం తలలు నరికి ఈ చెట్ల క్రింద పాతి పెట్టేయటం జరుగుతుంది" అన్నాడు.

"అడగండి మహాప్రభో... త్వరగా అడగండి... తప్పకుండా సరైన సమాధానాలు చెపుతాము...." చేతులు జోడిస్తూ చెప్పారు వాళ్ళు.

"మీ దండనాధికారికి ఈ తోట మీద ఇంత భ్రమ ఎందుకు కలిగింది?" అడిగాడు గదాధరుడు.

ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు ఆ అనుచరులు.

"అసలు ఆ విపినశ్రేష్ఠకి మీ అధికారికి ఏమిటి సంబంధం? అతను బంధించి పంపిన మనిషిని సరైన విచారణ లేకుండా కారాగారం వైపు నడిపించటానికి వేరే కారణం ఏదైనా ఉన్నదా?" వారి సమాధానం కోసం ఎదురు చూడకుండానే రెండవ ప్రశ్నవేశాడు గదాధరుడు.

"మీరు మౌనంగా ఉండి పోయినందువల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. బాగా ఆలోచించుకుని వెంటనే సమాధానం చెప్పటం మంచిది" అని వారికి చెప్పాడు అతను.

తన కరవాలాన్ని వరలోకి నెట్టి శ్యామలుడి ఆయుధం కోసం చేతిని జాచాడు.

"నా ఆయుధం నీకు దేనికి?" అడిగాడు శ్యామలుడు.

"నా ఆయుధానికి పదును కాస్తంత తక్కువగా ఉన్నది. వాళ్ళ తలల్ని తరిగితే మరింతగా మొండి బారిపోతుంది. అందుకు" అన్నాడు గదాధరుడు.

తన కరవాలాన్ని అతని వైపు జాచాడు శ్యామలుడు.

భయం అధికం అయింది కాబోలు, "వద్దు. ఇవ్వవద్దు... సమాధానం చెపుతాము..." బిగ్గరగా అరిచాడు వారిలో ఒకతను.

"విపిన శ్రేష్ఠికి వయసులో ఉన్న కూతురు ఉన్నది. అతని సంపదకంతా ఆమె ఏకైక వారసురాలు. ఆమెను దండనాధికారి కుమారుడికి ఇచ్చి వివాహం చేయాలని శ్రేష్ఠి కోరిక. ఆ సంబంధం మా అధికారికి కూడా సమ్మతమే" అన్నాడు అనుచరుడు.

"అదీ సంగతి మిత్రమా... ఇప్పుడు విషయం పూర్తిగా తెలిసిపోయింది. శ్రేష్ఠి కుమార్తె ఈ నిమ్మతోట యజమానితో ప్రేమలో పడింది. ఏదో ఒక విధంగా ఇతన్ని అడ్డు తొలగించుకోవటానికి సరైన అవకాశం ఈ రోజున ఆ ఇద్దరికీ దొరికింది. అది కూడా మన కారణంగా..." మిగిలిన మాటల్ని తాను పూర్తి చేశాడు గదాధరుడు.

"అయ్యలూ... మీరు ఎవరో గాని, మంత్రతంత్రాలు నేర్చిన మహనీయుల మాదిరిగా కనిపిస్తున్నారు... మీరు చెప్పింది అక్షరాల యదార్థం..." వెంటనే చెప్పాడు ఆ అనుచరుడు.

"విపిన శ్రేష్ఠి దుకాణాన్ని చూస్తుంటే అతని సంపద చాలా అధికం అని తెలిసిపోతోంది. అటువంటి సంపన్న కుటుంబంలోని యువతి ఎందుకూ పనికి రాని, ఈ నిమ్మతోట యజమానితో ప్రేమలో పడటమేమిటి?" ఆశ్చర్య పడుతున్నట్టు అడిగాడు గదాధరుడు.

"అన్నీ తెలిసిన వారు మీరు కూడా ఇటువంటి ప్రశ్న వేయటం ఏమిటి అయ్యా? ప్రేమ ఎందుకు పుడుతుందో చెప్పగల వారెవరు?" ఎదురు ప్రశ్న వేశాడు ఆ అనుచరుడు.

"నిజమే మిత్రమా... ప్రేమ గుడ్డిది గదా..." అన్నాడు శ్యామలుడు.

ఆ మాటను తాను అంగీకరించినట్లు గట్టిగా నిట్టూర్చి, "బాగుంది... మీ అధికారి ఆగ్రహానికి, ఆ విపిన శ్రేష్ఠి కోపానికి సరైన కారణమే ఉందని ప్రస్తుతానికి అంగీకరిస్తున్నాము... ఇంకా మీరు చెప్పవలసిన మాటలు ఏమైనా ఉంటే వెంటనే చెప్పండి" అన్నాడు గదాధరుడు.

"ఇంకా ఏమీ లేవు దేవరా... మీ ఆజ్ఞలను పాటించాము కాబట్టి మమ్మల్ని వదిలి వేయటం మాత్రమే మిగిలి ఉంది" గబగబా అన్నాడు ఆ అనుచరుడు. పక్కున నవ్వబోయి బలవంతంగా ఆపుకున్నాడు గదాధరుడు. "వెనక్కి చూడకుండా వెళ్ళిపోండి. మీ దండనాధికారితో చెప్పవలసిన సమాధానం ఏమిటో వెళుతూ వెళుతూ ఆలోచించుకోండి" అన్నాడు.

ఒక్కక్షణికం కూడా ఆలస్యం చేయలేదు ఎవరూ... ఒక్కసారిగా పైకి లేచి ఒకేసారి పరుగు మొదలు పెట్టారు. మూడే మూడు క్షణికాల్లో దృష్టి పథం నుంచి దూరమై పోయారు.

"దండనాధికారికి కోపం వస్తుంది. మరింత మందిని ఇటుగా పంపించి ఈ తోటను నాశనం చేయించేస్తాడు. వదిలిపెట్టడు" అన్నాడు గదాధరుడు.

"అది జరగకూడదు... ఏం చేయాలో ఆలోచించు" మొఖానికి అడ్డుగా ఉన్న దట్టీని ఊడతీసి తిరిగి నడుముకు చుట్టుకుంటూ చెప్పాడు శ్యామలుడు.

"నగరంలోకి పోయి సరైన ధర్మసత్రాన్ని వెతికి విశ్రాంతి తీసుకునే బదులు, ఇక్కడే ఆగిపోవచ్చు...రెండు నిమ్మకాయలు కోసి నీటిలో కలిపి, కాస్తంతలవణాన్ని రంగరిస్తే చక్కటి పానీయం తయారవుతుంది... బడలిక కూడా మటుమాయం అయిపోతుంది" అన్నాడు గదాధరుడు.

శ్యామలుడు ఆ మాటల్ని విన్న మరుక్షణికంలో తన వంక కోపంగా చూస్తాడనీ, పరుషంగా మాట్లాడతాడనీ అనుకున్నాడు అతను.

అటువంటిదేమీ జరుగలేదు... "నీ ఆలోచన బాగానే ఉన్నది గానీ, కారాగారంలో ఉన్న ఆ అమాయకుడిని మరింతగా హింసించటం మొదలు పెడితే?" అని అడిగాడు శ్యామలుడు.

"మిత్రమా... నువ్వు ఈ తోటను చూసుకో... నేను కారాగారం దగ్గరికి పోయి అక్కడి పని ముగిస్తాను..." వెంటనే చెప్పాడు గదాధరుడు.

"ఎలా? ఎలా ముగిస్తావు? పట్టుబడితే నీ మక్కెలు కూడా విరిగి పోతాయ్" హెచ్చరించాడు శ్యామలుడు.

"మరేం పరవాలేదు మిత్రమా... మనల్ని పట్టుకోగలిగిన మొనగాళ్ళు ఈ నగరంలో ఉంటారని నేను అనుకోవడంలేదు. మరణించి మట్టిలో కలిసి పోయిన కిన్నెరలకు, వారి తల్లికే ఆ పని చేయటం చేతకాలేదు. వీళ్ళకేం చేతవుతుంది?" అంటూ తోట వెలుపలికి బయలుదేరాడు గదాధరుడు.

*            *            *            *            *

అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు దండనాథికారి. నిమ్మతోట దగ్గిర్నించి వచ్చిన తన అనుచరుల మాటల్ని వినేసరికి.

"తమరి అనుచరులమని చెప్పినా వినిపించుకోలేదు ప్రభూ... కాళ్ళు చేతులు విరిగి పోయేటట్లు హింసించారు..." మరో కొత్తమాట .జోడించాడు ఒక అనుచరుడు.

"ఎవరు? ఎవరు వాళ్ళు?" పళ్ళు కొరుకుతూ అడిగాడు అధికారి.

"తెలియలేదు ప్రభూ. తమ కంఠంలో ప్రాణం ఉండగా తమరు శ్రేష్ఠిగారితో వియ్యం అందలేరని కూడా అన్నారు..." అన్నాడు మరో అనుచరుడు.

ఇంకా ఇంకా పెరిగిపోయింది దండనాథికారి కోపం... "ఎవర్రా అక్కడ?" గొంతు చినిగిపోయే శృతిలో అరిచాడు,

రాచనగరుకు దగ్గరిగా ఉన్న తన నివాస భవనంలోని సభా మందిరంలో కూర్చుని ఉన్నాడు అతను.

సభా మందిర ద్వారం దగ్గిర నిలబడి ఉన్న అనుచరుల్లో ఒకతను వెంటనే లోపలికి వచ్చి నమస్కరించాడు.

"విపిన శ్రేష్ఠిని వెంటనే తీసుకురా... వెళ్ళు" ఆజ్ఞాపించాడు దండనాథికారి.

పరుగులాంటి నడకతో ఆ మందిరంలో నుంచి బయటికి వచ్చాడు ఆ అనుచరుడు. భవనం వెలపల ఒక ప్రక్కగా నిలబెట్టి ఉంచిన అశ్వ శకటాన్ని అధిరోహించి నగరంలోకి నడిపించాడు.

*            *            *            *            *

ఆనందం చాలా అధికం అయిపోయింది విపిన శ్రేష్ఠికి... తన దుకాణం తెరిచిన తర్వాత ఒక్కసారి కూడా తాను కూర్చున్న ప్రదేశంలో నుంచి పైకి లేవటం అతనికి అలవాటు లేదు. అటువంటిది ఆ రోజు అసలు కూర్చోవటం చేతకానట్లు కాలుగాలిన పిల్లి మాదిరిగా అటు ఇటూ తిరగటం మొదలు పెట్టాడు.

"అయ్యగారూ... తమరికి ఏమయింది?" చూసి చూసి ఉండబట్టలేక అడిగాడు ఒక అనుచరుడు.

"నా గుండెల మీది బరువు దిగిపోయిందిరా... నా బిడ్డ భవిష్యత్తు నాశనం అయిపోబోతున్నదని భయపడ్డాను. దరిద్రం వదిలి పోయింది. నా బిడ్డను మాయమాటలతో బుట్టలో వేసుకోబోయిన ఆ దుర్మార్గుడు నాశనం అయి పోయాడు...." సంతోషంగా అన్నాడు శ్రేష్ఠి.

"అయ్యగారూ... వాడు కారాగారంలోకి మాత్రమే పోయాడు. ఒకటి రెండు మాసాల్లో తిరిగి బయటికి వస్తాడు...." అన్నాడు ఆ అనుచరుడు.

నవ్వుతూ తల అడ్డం తిప్పాడు శ్రేష్ఠి. "వాడిని లోపలికి పంపింది నాకు కాబోయే వియ్యంకుడు. వాడు ఇంక బయటికి రాలేడు. ఒకవేళ వచ్చినా ప్రేమలు పెళ్ళిళ్ళకు పనికి రాడు" నమ్మకంగా చెప్పాడు శ్రేష్ఠి.

అదే సమయంలో ఆ దుకాణం ముందుకు వచ్చి ఆగింది దండనాధికారి అశ్వ శకటం.

"తమరిని వెంటనే తీసుకురమ్మని మా అధికారి ఆజ్ఞ" లోపలకు వస్తూనే చెప్పాడు అధికారి అనుచరుడు.

కనులు చిట్లించాడు శ్రేష్ఠి.... "ఇందాక చెరసాలకు పంపించబడిన దుర్మార్గుడు తిన్నగానే ఉన్నాడా?" అడిగాడు అనుమానంగా.

"అయ్యా... ఒకసారి లోపలికి పోయిన తర్వాత తిరిగి వెలుపలికి రావాలంటే ఎంతో అదృష్టవంతుడు అయివుండాలి... వాడు తిన్నగానే వున్నాడు...." నవ్వుతూ చెప్పాడు ఆ అనుచరుడు.

రెండు క్షణికాల పాటు ఆలోచించి తన అనుచరులవైపు చూశాడు శ్రేష్ఠి.

"తమరు నిశ్చింతగా వెళ్ళిరండి అయ్యగారూ... మేము ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటాము" వెంటనే చెప్పాడు ప్రధాన అనుచరుడు.

తడుముకోకుండా తల అడ్డం తిప్పాడు శ్రేష్ఠి. "నేను లేకుండా మీరు వ్యాపారం చేయటం మంచిది కాదు. దుకాణాన్ని మూత వేయండి" అని ఆజ్ఞ ఇచ్చాడు.

తమ మీద నమ్మకం లేకపోవటం వల్లనే అలా అంటున్నట్లు తెలుసు అతని అనుచరులకు. అయినా చేయగలిగింది ఏమీ లేకపోవడం వల్ల, వెంటనే తలుపులు మూసి తలలు వంచుకు నిలుచున్నారు.

"ఇలా పోయి అలా వచ్చేస్తాను. ఎక్కడికీ పోకండి. చీకటి పడబోతున్నదని ఇంటిదారి పట్టకండి. చీకటిపడిన తరువాత కూడా వ్యాపారం సాగుతుందని మర్చిపోకండి" అంటూ శకటంలో కూర్చున్నాడు శ్రేష్ఠి.

ఆ ప్రదేశానికి ఆరు అంగల దూరంలోనే నిలబడి అతి స్పష్టంగా వినవచ్చిన ఆ మాటల్ని ఆలకించాడు గదాధరుడు.

జరిగింది ఏమిటో స్పష్టంగా తెలియకపోయినా, శ్రేష్ఠిగారు ఎందుకంత హడావుడిగా పయనమయ్యాడో అర్థం చేసుకో గలిగాడు.

నిమ్మతోట దగ్గిర జరిగినది ఏమిటో స్పష్టంగా దండనాధికారికి తెలియజెప్పి ఉండరు అతని అనుచరులు. ఉన్నవీ లేనివీ కల్పించి నింద తమ మీద పడకుండా తప్పించుకుని ఉంటారు.

నిజం ఏమిటో శ్రేష్ఠికి కూడా తెలియదు. కాబోయే వియ్యంకులు ఇద్దరూ కూర్చుని ఏదో ఒకటి చేయటం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టి–

అంతవరకే సాగాయి అతని ఆలోచనలు. దుకాణం తలుపులు మూసి వెలుపల నిలబడిన శ్రేష్ఠి అనుచరుల్లో చలనం వచ్చేసరికి మధ్యలోనే ఆగి పోయాయి గదాధరుని ఆలోచనలు.

"శ్రేష్ఠి తిరిగి రావటానికి కాస్తంత సమయం పట్టవచ్చు. ఈ లోపల నేను కొద్దిగా తీర్థం పుచ్చుకు వస్తాను" అన్నాడు ఒక అనుచరుడు.

"ఎక్కడికీ కదలవద్దని చెప్పాడు. తెలిస్తే నీ తల తీయిస్తాడు...." భయ పెట్టాడు మరో అనుచరుడు.

"భయపడకురా చెంగా... పని కట్టుకుని నువ్వు చెపితే తప్ప శ్రేష్ఠికి తెలియదు.... చెపుతావా?" కోరగా అడిగాడు మొదటి అనుచరుడు.

"ఈ చెంగడు అటువంటి వాడు కాదు... స్నేహానికి ప్రాణం పెట్టేవాడు. నా అంతట నేనుగా ఏమీ చెప్పను...." కోపంగా అన్నాడు ఆ అనుచరుడు.

"నీ గుణం నాకు తెలుసురా చెంగా... ఇక్కడ ఉన్నట్టుగా వచ్చేస్తాను" అంటూ వేగంగా నడుస్తూ అవతలికి వెళ్ళిపోయాడు మొదటి అనుచరుడు.

నిలబడిన చోటు నుంచి కదలకుండా ఆ సంభాషణ వింటున్న గదాధరుడి పెదవుల మీదికి వెంటనే పరిగెత్తుకు వచ్చింది చిన్న చిరునవ్వు.

"అనుకోని విధంగా చిన్న ఉపాయం తట్టింది మిత్రమా... పని చేస్తుందో లేదో తెలియదు... ఈ శ్రేష్ఠి అనుచరుల్లో ఒకడి పేరు మనకు తెలిసింది"

అనుకుంటూ వెంటనే కదిలాడు తాను కూడా. అశ్వశకటం వెళ్ళిన దిశలో వేగంగా అడుగులు వేశాడు.

* * * * *

"ఈ జన్మలో మనం వియ్యంకులం కాలేమని అన్నారట. కరవాలాలు ధరించి నా అనుచరుల ప్రాణాలు తీయటానికి సిద్ధ పడ్డారట...." నిమ్మతోట దగ్గిర జరిగిందని తన మనుష్యులు చెప్పిన మాటలకు మరి కొన్నింటిని కలిపి శ్రేష్టికి చెప్పాడు దండనాధికారి.

"అయితే ఆలస్యం దేనికి? మరికొంత మందిని పంపి వారి అంతు చూడవచ్చును కదా?" అన్నాడు శ్రేష్ఠి.

"నాకు ఈ వ్యవహారంలో కొన్ని అనుమానాలు ఉన్నాయి. ఆ తోటలో నా వారిని ఎదిరించిన వారిని అక్కడికి పంపింది ఎవరు?" అడిగాడు దండనాధి కారి.

"ఈ నగరంలో ఎవరికి ఎటువంటి శిక్ష విధించవలసి వచ్చినా, ఆ పని మీ ద్వారానే జరగవలసి ఉన్నది. మీకు తెలియకపోతే మరెవ్వరికి తెలుస్తుంది?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రేష్ఠి.

"శ్రేష్ఠీ... నీ కుటుంబంలోని వారెవరయినా ఆ ఆంగతుకుల్ని తోట దగ్గరికి పంపి ఉంటారా?" తన మనసులోని మాటను సూటిగా బయటపెట్టాడు దండనాధికారి.

కోపం ముంచుకు వచ్చింది శ్రేష్ఠికి. చివ్వున తల ఎత్తి ఏదో సమాధానం చెప్పబోయి ఆఖరి క్షణంలో ఆగిపోయాడు.

దండనాధికారికి వచ్చిన అనుమానమే అతనికి కూడా రావటం అందుకు కారణం. తన ఎదుట నిలబడి ధైర్యంగా మాట్లాడలేని తన కుమార్తె తన వెనుక ఏదైనా కుట్ర చేస్తోందా? తన ప్రేమికుడిని కాపాడు కోవటానికి ప్రయత్నం చేస్తోందా?

అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వచ్చేశాడు శ్రేష్ఠి. "ఈ గొడవలన్నిటికీ కారణమైన వాడు మీ ఆధీనంలోనే ఉన్నాడు. వాడిని నిర్మోహమాటంగా పైలోకాలకు పంపించి వేస్తే ఒక పని అయిపోతుంది. మనం వియ్యంకులం కాకుండా ఎవరూ అడ్డుకోలేరు...." అన్నాడు.

"మరణశిక్షలు విధించే అధికారం నగర పాలకులది. నాది కాదు" అన్నాడు దండనాధికారి.

"మరణ శిక్ష విధించమని చెప్పింది ఎవరు? విచారణ సమయంలో ఒత్తిడిని భరించలేక వాడు తన ప్రాణాలు తనే తీసుకుంటే అడిగేది ఎవరు?" అడిగాడు శ్రేష్ఠి.

పెద్దగా నవ్వాడు దండనాధికారి. "సరయిన ఆలోచన. వెంటనే అమలు చేద్దాము" అంటూ ఆసనం మీది నుంచి లేచి ఆ మందిరంలో నించి బయటికి బయలుదేరాడు.

* * * * *

"ఎవరు నువ్వు?" దండనాధికారి భవనం ముందుకు పోగానే గదాధరుడికి అడ్డుగా నిలబడుతూ అడిగాడు ఒక భటుడు.

"అయ్యా... నేను శ్రేష్ఠిగారి దగ్గిర పనిచేస్తూ ఉంటాను. అయ్యగారికి తోడుగా ఉండమని చెంగడు చెపితే పరిగెత్తుకుంటూ వచ్చాను" వినయంగా చెప్పాడు గదాధరుడు.

క్రింది నించి పైదాకా ఒకసారి చూసి తల ఊపాడు ఆ భటుడు. ప్రక్కగా నిలబడమని సైగ చేశాడు.

అదే సమయంలో లోపలి నుంచి బయటికి వచ్చాడు దండనాధికారి. అతని వెనుకే ప్రత్యక్షం అయ్యాడు శ్రేష్ఠి.

"ఎవరు అతను?" తనను చూడగానే వినయంగా నమస్కారం చేసిన గదాధరుడిని చూస్తూ కాపలా భటుడిని అడిగాడు శ్రేష్ఠి.

"తమరి వద్ద పని చేస్తున్నట్టుగా చెప్పాడు... తమ మనిషేనన్న అభిప్రాయంతో ఇక్కడ నిలుచోనిచ్చాము." వెంటనే శ్రేష్ఠికి సమాధానం ఇచ్చాడు ఆ భటుడు.

నొసలు ముడివేసి గదాధరుడిని క్రింది నించి పైదాకా చూశాడు శ్రేష్ఠి. తను తొందరగా మాట్లాడి అతని అనుమానాల్ని తొలగించకపోతే వచ్చిన పని సర్వనాశనం అయిపోతుందని తెలిసిపోయింది గదాధరుడికి.

సామాన్యుడు కాదు శ్రేష్ఠి. ఆవలించకముందే శరీరంలో ఉన్న ప్రేవులన్నిటినీ లెక్కపెట్టగల సునిశిత మేధాశక్తి సంపన్నుడు.

"అయ్యా... నమస్కారం... చెంగడికి నేను చిన్న తమ్ముడి వరస. తమ కొలువులో చేరాలని ఉన్నదని చెపితే ఈరోజే మా గ్రామం నుంచి నన్ను రమ్మనమని చెప్పాడు. ఇంతకు ముందే వచ్చాను. తమరు ఈ అయ్యగారి వద్ద ఉన్నారని తెలిసి ఇటుగా వచ్చాను." చేతులు కట్టుకొని వినయాతివినయంగా చెప్పాడు గదాధరుడు.

తన దుకాణంలో పనిచేసే చెంగడి పేరు చెవిన పడిన వెంటనే కొద్దిగా తటపటాయించాడు శ్రేష్ఠి.

"కొలువులో చేరటానికి వచ్చిన వాడివి, నేను దర్శనం ఇచ్చే వరకూ దుకాణం దగ్గిర వేచి ఉండాలి. ఎక్కడికి వెళితే అక్కడికి తరుముతున్నట్లు వచ్చేస్తారా?" కోరగా అడిగాడు.

"తోడు లేకుండా ఒంటరిగా వచ్చారని చెంగడు చెప్పాడు దేవరా. తమరి వంటి పెద్దవాళ్ళ వెనుక తోడుగా ఎవరో ఒకరు ఉండి తీరాలి...." తడుము కోకుండా చెప్పాడు గదాధరుడు.

"నువ్వు నా వెనుక తోడుగా ఉండటానికి వచ్చావా? ఏం పని చేస్తూ ఉండేవాడివి?" అడిగాడు శ్రేష్ఠి.

"మా గ్రామ పెద్దకు తోడుగా ఉండేవాడిని. కత్తి తిప్పటం, కర్రను పట్టుకోవటం వచ్చు. బరిశెను చేతికి ఇస్తే నలుగురయిదుగురిని కదలకుండా నిలబెట్టేయగలను. నా దమ్ముకు మెచ్చుకుని మా గ్రామపెద్ద బహూకరించాడు ఈ కరవాలాన్ని" తన నడుముకు ఉన్న కరవాలాన్ని చూపిస్తూ చెప్పాడు గదాధరుడు.

తడబడకుండా, తొట్రుపాటు లేకుండా అతను సూటిగా చెప్పిన మాటలు శ్రేష్ఠిని ఆలోచనలో పడవేశాయి.

"నీ గురించి తర్వాత ఆలోచిస్తాను. చెంగడితో మాట్లాడిన తర్వాత పనిలో పెట్టుకుంటాను...." అంటూ ముందుకు అడుగు వేయబోయాడు.

"అయ్యా... అంతవరకూ మీకు తోడుగా ఉండగలను. దయచేసి అనుమతించండి...." వదిలి పెట్టకుండా తాను కూడా అతని వెనుక నడవటానికి సిద్ధపడుతూ వేడుకున్నాడు గదాధరుడు.

శ్రేష్ఠిని తీసుకువచ్చిన అశ్వశకటం ఇంకా ఆ భవనం ఎదుటే నిలబెట్టబడి ఉన్నది. దాని దగ్గిర నిలబడి అసహనంగా చూస్తున్నాడు దండనాధికారి.

అవుననీ కాదనీ ఏదీ చెప్పకుండా కదిలాడు శ్రేష్ఠి. చకచకా పోయి దండనాధికారి వెనకే ఆ శకటంలో కూర్చున్నాడు.

"నిన్ను కొలువులో చేర్చుకుంటానని చెప్పకుండా వెళ్ళిపోయాడు... ఇప్పుడు ఏం చేస్తావ్?" గదాధరుడిని అడిగాడు కాపలాభటుడు. వారి సంభాషణ మొత్తాన్ని విని ఉండటం వల్ల.

"కొలువులో చేర్చుకుంటానని చెప్పలేదు. నిజమే. చేర్చుకోనని కూడా చెప్పలేదు" నవ్వుతూ అన్నాడు గదాధరుడు.

"నిజమే సుమా...." ఒప్పుకున్నాడు ఆ భటుడు. "మరి ఏం చేస్తావ్?" అని మళ్ళీ అడిగాడు.

"తోడుగా ఉండటానికి వచ్చానుకదా... తోడుగానే ఉంటాను" అంటూ అశ్వ శకటం పోతున్న దిశలో పరుగు మొదలు పెట్టాడు గదాధరుడు.

* * * * *

విచ్చుకత్తులను పట్టుకుని కారాగార భవనం ఎదుట శిలా విగ్రహాల మాదిరిగా నిలుచుని ఉన్నారు రాజభటులు. వేగంగా వచ్చి ఆగిన అశ్వశకటాన్ని చూడగానే గబగబా ముందుకు వచ్చారు వారిలో ఇద్దరు.

శకటాన్ని నడిపించే అశ్వాల కళ్ళేలను పట్టుకున్నాడు ఒకతను. శకటపు తలుపుల్ని తెరిచి పట్టుకున్నాడు రెండవ వ్యక్తి.

ఠీవిగా దిగాడు దండనాధికారి. శ్రేష్ఠి కూడా దిగిన వెంటనే భవన ద్వారం వైపు నడిచాడు.

ఉరుకులు పరుగుల మీద వచ్చిపడ్డాడు గదాధరుడు. ఆయాసాన్ని అణుచుకునే ప్రయత్నం కూడా చేయకుండా, తను కూడా ద్వారం దగ్గిరికి దూసుకు పోయాడు.

చటుక్కున తమ ఆయుధాలను అడ్డుపెట్టి అతన్ని నిరోధించారు రాజభటులు. "ఆగు... ఆగిపో... అడుగు ముందుకు వేస్తే హతమారిపోతావ్" అని హెచ్చరించారు.

"అయ్యలూ... నేను శ్రేష్ఠిగారి మనిషిని... ఆయనకు తోడుగా ఉండటానికి వచ్చినవాడిని...." తన గురించి వెల్లడించాడు గదాధరుడు.

వెల్లడించడం అయితే ధైర్యంగా వెల్లడించాడుగాని, గుండెలు మాత్రం గుబగుబలాడుతూనే ఉన్నాయి.

చెరసాల భవనంలోకి సూటిగా పోవటం అంటే మాటలు చెప్పినంత తేలికకాదు. చీకటి సమయం అయి ఉన్నట్లయితే, ఏదో ఒక మాయచేసి ఏదో ఒక విధంగా పని పూర్తి చేసుకోవచ్చు. పట్టపగలు పదిమందీ చూస్తూ ఉండగా ఆ విధంగా చేయటం సాధ్యపడే విషయం కాదు. కానీ చీకటిపడే వరకూ వేచి

ఉండటం కుదిరే పనిగా కనిపించడంలేదు. దండనాధికారి శ్రేష్ఠిని వెంటబెట్టుకు రావడం మంచి శకునం కాదు. లోపల ఉన్న నిమ్మతోట యజమానికి ఏదో ఆపద ఎదురుకాబోతున్నది. వెంటనే తాను కల్పించుకోకపోతే అతన్ని కాపాడటం అసాధ్యం కావచ్చు.

"నువ్వు ఎవరి మనిషివో నమ్మకంగా తేలేవరకూ ఇక్కడే నిలబడి ఉండు" అతని గుండెల మీద చేయివేసి వెనక్కి నెడుతూ, దండనాధికారి భవనం దగ్గిర భటుడు మాట్లాడినట్లే మాట్లాడాడు రాజభటుడు.

"దేవరా... వీళ్ళు నన్ను అడ్డుకుంటున్నారు. నన్ను తమరి వెంట తోడుగా వచ్చిన మనిషిగా గుర్తించటం లేదు" బిగ్గరగా అరిచాడు గదాధరుడు.

ద్వారాన్ని అధిగమించి లోపలికి పోబోతున్న శ్రేష్ఠి, భుజం మీది నుంచి వెనక్కిచూసి, చేతిని ఊపాడు.

చేతిని మాత్రమే ఊపాడు. నోరు విప్పి ఎటువంటి మాటా మాట్లాడలేదు. అయినా సరే మాట్లాడినట్లే సంబరపడిపోయాడు గదాధరుడు.

"చూడండి. శ్రేష్ఠిగారి చే సైగను బాగా చూడండి... నన్ను తమ వెంట వచ్చినట్లు ఒప్పుకోవటాన్ని గమనించండి." వికసించిన ముఖంతో రాజభటులను ఊదరబెట్టేశాడు.

మాట్లాడలేక పోయారు రాజభటులు. తలలు ఊపి అతన్ని లోపలికి పోనిచ్చారు.

పట్టుబడిన నిమ్మతోట యజమానిని రక్షించటం ఎలాగో నిజానికి ఏమీ తెలియదు గదాధరుడికి. అసలు ఆ పనిని ముగించటం ఎలాగో తెలియకుండానే వచ్చాడతను నగరంలోకి.

ఎదుట ఉన్న పరిస్థితులను బట్టి అప్పటికప్పుడు తదనుగుణంగా మాట్లాడుతూ ముందడుగు వేస్తున్నాడు.

కారాగార భవనంలోకి అడుగుపెట్టే వరకూ ఎటువంటి ఒడిదుడుకులు ఎదురు పడలేదు... అడుగుపెట్టిన తర్వాత మాత్రం అతన్ని పట్టి పీడించడం మొదలు పెట్టింది పెద్ద సందేహం.

నిమ్మతోట యజమానిని చూడటం కోసమే ఆ పెద్దలిద్దరూ వచ్చారన్న మాట నిజమే అయినా, అతనితో మాట్లాడే సమయంలో తనను ఆ పరిసరాల్లోకి అనుమతించకపోతే ఏం చేయాలి?

అడవి జంతువులను బంధించే ఇనుప పంజరాల మాదిరి వరుసగా నిర్మించబడి ఉన్నాయి చిన్న చిన్న గదులు. బలిష్టమైన ఇనుప ఊచలతో తయారు చేయబడి ఉన్నాయి ఆ గదుల తలుపులు.

పొడవాటి బరిశెల్ని పట్టుకుని ఆ గదులకు కాపలాగా నిలబడి ఉన్నారు పాతికమంది రాజభటులు. అనుమానం అంటూ వచ్చిన మరుక్షణం ఆ ఆయుధాలను నిర్మొహమాటంగా తన మీద ప్రయోగిస్తారు.

భయం లేని వాడి మాదిరిగా నడవటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తూ, దండనాధికారిని, శ్రేష్ఠిగారిని అనుసరించి, ఒక మారుమూల గది దగ్గరికి పోయాడు అతను.

మసక చీకటితో నిండి ఉన్నది ఆ గది. ఒక చివరగా ఉన్న రాతి దిమ్మ మీద కూర్చుని ఉన్నాడు నిమ్మతోట యాజమాని. అనుకోని విధంగా వచ్చిన పెద్ద మనుషుల్ని చూసి నెమ్మదిగా తలుపుల దగ్గరికి వచ్చాడు.

"నా కుమార్తె గురించి ఆలోచించవద్దని నీకు లక్షసార్లు చెప్పాను. అయినా సరే పెడచెవిన పెట్టావు. ఇప్పుడు నీ ప్రాణాలు మా చేతుల్లో ఉన్నాయి...." నడము మీద చేతులు వేసుకుంటూ అన్నాడు శ్రేష్ఠి.

"తల్లిదండ్రుల అనుమతి లేని అమాయకురాలిని నేను వివాహం చేసుకోవటానికి సిద్ధంగా లేను. ఈ మాటను కూడా నేను మీకు ఎన్నో మార్లు చెప్పాను. పోయి మీ కుమార్తెను హెచ్చరించుకోండి. తనను మర్చిపొమ్మని ఆమె గనుక నన్ను హెచ్చరించిన మరుక్షణం నేను ఈ రాజ్యాన్ని వదిలి దీనంగా వెళ్ళిపోతాను" నిర్భయంగా అన్నాడు నిమ్మతోట యజమాని.

అతని నిర్భయత్వాన్ని చూసి ముచ్చటపడిపోయాడు గదాధరుడు. తన ప్రాణాలకు పెనుముప్పు వాటిల్లబోతున్నదన్న భయం కించిత్తు కూడా కనిపించడం లేదు అతని మాటల్లో.

"ఇతనితో మాటలు దేనికి శ్రేష్ఠీ? వచ్చిన పనిముగించుకుని త్వరగా వెళ్ళిపోవాలి" అంటూ వెనక్కి చూశాడు దండనాధికారి.

బరిశెను పట్టుకుని అక్కడ కాపలా నిలబడిన భటుడు వారిని చూసిన వెంటనే దూరంగా పోయినిలుచున్నాడు.

అతన్ని తమ దగ్గరికి పిలవబోయి ఆఖరి క్షణంలో ఆగిపోయాడు దండనాధికారి.

"సందేహం దేనికి ఆర్యా? భటుడిని పిలిచి నన్ను చిత్రహింసలు పాలు చేయమని ఆజ్ఞ ఇవ్వండి... సరయిన విచారణ లేకుండా చెరసాలలోకి నెట్టబడిన నిందితుడిని విచారించే పద్ధతి ఎలా ఉండాలో వారికి నేర్పండి" వెక్కిరింపుగా అన్నాడు గది లోపల ఉన్న యువకుడు.

పళ్ళు బిగించి మరోసారి రాజభటుడిని పిలువబోయిన దండనాధికారిని వెంటనే ఆపి వేశాడు శ్రేష్ఠి.

"ఇంతోటి పనికి ఇప్పుడు ఆ భటుల్ని పిలవటం దేనికి?" అంటూ అవతలగా నిలుచున్న గదాధరుడికి సైగ చేశాడు.

"నా దగ్గిర కొలువు చేయాలంటే నేను చెప్పింది చెప్పినట్లు చేయాలి. చేయగల సత్తా నీకు ఉన్నదా?" అని అడిగాడు.

అతని మనసులోని ఉద్దేశాన్ని చిటికెలో కనిపెట్టి, సంతోషంగా తల ఉపాడు గదాధరుడు.

"ఈ దుర్మార్గుడు మనకు శత్రువు. మాటకు మాటగా ఎదురు చెపుతున్న ఇతన్ని తగిన విధంగా దండించాలి" అన్నాడు శ్రేష్ఠి.

దండనాధికారి వైపు చూశాడు గదాధరుడు.

"నోరు తిరిగి పెగలకూడదు. అసలు ఇంకా బ్రతికి ఉండటం దేనికనే భావం మనసులో మెదలాలి" తన అభిప్రాయాన్ని చెప్పాడు అతను.

ఆలస్యం చేస్తే వారి మనసులు మారిపోయి, వేరే కొత్త ఆలోచనలు పుట్టుకు వస్తాయేమోనని అనుమాన పడుతున్నట్లు వేగంగా కదిలాడు గదాధురుడు.

"మీరు వెళ్ళి ముందున్న మందిరంలో వేచి ఉండండి. ఎటువంటి రభస వినబడినా భటులు ఎవరూ భయపడకూడదని చెప్పి ఉంచండి" అంటూ నడుముకు వ్రేలాడుతున్న కరవాలాన్ని ఒరతో సహా తీసి ఒక ప్రక్కనపెట్టి, ఒళ్ళు విరుచుకున్నాడు.

దూరంలో ఉన్న భటుడిని పిలిచి, గది తలుపులకు వేయబడిన తాళాన్ని తీయించాడు దండనాధికారి.

"త్వరగా పని ముగిసి పోవాలి... ఆలస్యం చేయకు" అంటూ శ్రేష్ఠితో పాటు ఆ ప్రదేశానికి అవతలగా ఉన్న మందిరంలోకి వెళ్ళిపోయాడు దండ నాధికారి.

నిమ్మతోట యజమాని దగ్గరికిపోయి భుజంమీది నుంచి వెనక్కి చూశాడు గదాధరుడు.

తలుపుల్ని తెరిచిన భటుడు తిరిగి తన స్థానంలోకి పోయి నిలుచున్నాడు. తనకు ఏమీ పట్టనట్లు ఎటో చూస్తున్నాడు గాని, అతని ధ్యాస అంతా తమ మీదనే ఉన్నట్లు తెలిసిపోయింది గదాధరుడికి.

"అధికారంలో ఉన్న వారి అడుగులకు మడుగులొత్తే నీ వంటి అధములను నేను చాలామందిని చూసి ఉన్నాను. వచ్చిన పని ముగించుకుని నీ దారిన నువ్వు వెళ్ళిపో" అతన్ని హెచ్చరించాడు నిమ్మతోట యజమాని.

పిడికిళ్ళు బిగించి అతని నోటిమీద కొట్టబోతున్నట్టు ముఖం పెడుతూ, ఉన్నట్లుండి చిన్నగా నవ్వాడు గదాధరుడు.

"నువ్వు... నువ్వు...." అమితమైన ఆశ్చర్యంతో నోరు తెరిచాడు నిమ్మతోట యజమాని.

"నేనే... శ్రేష్ఠిగారి దుకాణంలోకి వెళ్ళవద్దని నువ్వు హెచ్చరించావు. ఆ పని చేయటం వల్లనే నీకు ఈ గతి పట్టింది" అన్నాడు గదాధరుడు.

"అది కేవలం ఒకసారి మాత్రమే. అదికాకపోతే ఇంకేదో కారణాన్ని చూపించి నాకు ఈ గతిని పట్టించేవాడు శ్రేష్ఠి" అన్నాడు ఆ యువకుడు.

"విషయం నాకు అర్థం అయింది. ఇప్పుడు నువ్వు ఏం చేయదలచు కున్నావు?" అడిగాడు గదాధరుడు.

"అదుగో... భటులకు అనుమానం వచ్చినట్లుంది. వచ్చేస్తున్నారు ఇక్కడికి" ఉన్నట్లుండి అతన్ని హెచ్చరించాడు నిమ్మతోట యజమాని.

పిడికిలితో అతని ముఖం మీద పొడిచినంత పని చేశాడు గదాధరుడు. వెనక్కి తూలి వెల్లకిలా పడిపోయాడు నిమ్మతోట యజమాని.

"నీకు ఒకటి రెండు దెబ్బలు సరిపోవు. నీ ఒళ్ళు వాచిపోతే తప్ప నీకు బుద్ధిరాదు...." అంటూ నోటితో విచిత్రమైన శబ్దాలు చేశాడు గదాధరుడు.

వెనుక నుంచి వినే వారికి అవి ఎడాపెడా పడుతున్న దెబ్బల చప్పుడు మాదిరిగా అనిపించాయి.

గదాధరుడి కనుసైగలను అర్థం చేసుకుని, భీకరంగా అరుపులు మొదలు పెట్టాడు నిమ్మతోట యజమాని. భరించరాని బాధతో మెలికలు తిరిగి పోతున్నట్లు నటించటం ఆరంభించాడు.

గది దగ్గరికి రాబోయిన భటులు మధ్యలోనే ఆగిపోవడం కనిపించింది అతనికి.

"చావరా దుర్మార్గుడా... చావు... ధర్మప్రభువు లాంటి మా శ్రేష్ఠిగారికి తీరని మానసిక వేదన కలిగించిన నువ్వు బ్రతికి ఉండకూడదు. చచ్చిపో...." బిగ్గరగా అరుస్తూ చిందులు తొక్కాడు గదాధరుడు.

అరిచి కేకలు పెట్టే ఓపిక కూడా నశించిపోయినట్లు హీన స్వరంతో అస్పష్టమైన శబ్దాలు చేయడం మొదలు పెట్టాడు నిమ్మతోట యజమాని.

ఉన్నట్లుండి గది బయటికి దూకాడు గదాధరుడు. అంతకుముందు అవతలగా పెట్టిన తన ఖడ్గాన్ని ఒరలో నుంచి లాగి పట్టుకోబోతుండగా– అతన్ని అడ్డుకున్నారు రాజభటులు.

"ఏమిటిది? ఎందుకు ఈ కత్తి? ఏం చేయబోతున్నావు?" చేతిని గట్టిగా పట్టుకుంటూ అడిగాడు ఒక భటుడు.

"చంపేస్తాను... శాశ్వతంగా వాడి పీడ విరగడ చేసేస్తాను" అన్నాడు గదాధరుడు.

"చెరసాలలో ఉండగా బందీలు ఎవరూ ప్రాణాలు వదలకూడదు" అన్నాడు ఆ భటుడు.

"మరణశిక్ష విధించే అధికారం దండనాధికారికి లేదు. నగర పాలకుల వారి వద్ద నుంచి ఆదేశాలు రావాలి... అప్పుడు కూడా ఆ శిక్ష చెరసాలలో అమలు పరచరు... అందరిసమక్షంలో బహిరంగంగా జరపాలి" అన్నాడు మరో భటుడు.

బలవంతంగా తన ఆవేశాన్ని అణుచుకుంటున్నట్లు నటిస్తూ, కత్తిని తిరిగి వరలోకి నెట్టి, గదిలోకి పోయాడు గదాధరుడు.

చలనం లేకుండా పడిపోయి ఉన్నాడు నిమ్మతోట యజమాని. పాదంతో ప్రక్కకు నెట్టినా కదలలేదు... కనీసం చిన్నపాటి శబ్దం కూడా చేయలేదు.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు రాజభటులు. "ఇతని పరిస్థితి ఏమీ బాగోలేదు... ఈ సంగతిని వెంటనే నగర పాలకుల వారికి తెలియచేయడం చాలామంచిది" అన్నాడు వారిలో మరొకతను.

ఆ మాట చెవుల పడిన వెంటనే తన పథకంలో మరో కొత్త మలుపు గదాధరుడి మనసులో మెదిలింది.

రాభటుల మధ్యలో నుంచి కదిలి, క్రిందపెట్టిన తన కరవాలాన్నితిరిగి తీసుకున్నాడు. పెద్దపెద్ద అడుగులు వేస్తూ అవతలి మందిరంలోకి పోయాడు.

అక్కడ ఉన్న రాతి దిమ్మల మీద కూర్చుని ఉన్నారు అసహనంగా దండనాధికారి, శ్రేష్ఠిగారు.

"ఏమయింది? పూర్తి అయిందా పని??" అతన్ని చూడగానే అడిగాడు శ్రేష్ఠి. జరిగింది ఏమిటో సవివరంగా వారిద్దరికీ చెప్పాడు గదాధరుడు.

"అతను ఇంకా ఎంతో సమయం ప్రాణాలతో ఉండడం జరగదు. ఇక్కడే వదిలితే నగర పాలకుల వారి దృష్టికి తీసుకు పోబడుతుంది. తీసుకుపోయి బయట పారవేస్తే ఎటువంటి బాధ ఉండదు" అన్నాడు.

అదే సమయంలో అక్కడికి వచ్చారు లోపల కాపలా ఉండే భటుల్లో ఇద్దరు. గదాధరుడి కనుసైగను అందుకుని, వెంటనే వారిని అడ్డుకున్నాడు దండనాధికారి.

"బంధితుడికి తగిన శిక్ష విధించబడినట్లు మేము భావిస్తున్నాము. ఇప్పటికి ఇది చాలు... అతన్ని విడుదల చేయాలని నిశ్చయించాము" అంటూ శ్రేష్ఠిగారికి సైగ చేశాడు. శ్రేష్ఠి వెంటనే గదాధరుడికి సైగ చేశాడు.

పరుగులాంటి నడకతో తిరిగి నిమ్మతోట యజమాని దగ్గరికి పోయాడు గదాధరుడు.

"నువ్వు ప్రాణాలు వదల బోతున్నట్లు భటులకు అనుమానం వచ్చింది. వారు చూస్తుండగా కొంచెం ఓపికగా నిలబడు...." అంటూ అతన్ని బలవంతంగా పైకి లేపి, గది బయటికి నడిపించాడు.

తల వ్రేలాడవేసి బాధా సూచకంగా శబ్దాలు చేస్తూ అడుగులు వేశాడు ఆ యువకుడు... అవతలి మందిరంలో ఉన్న శ్రేష్ఠిగారి ఎదుట మాత్రం కళ్ళు తేల వేయటానికి సిద్ధం అయ్యాడు.

"దండనాధికారి, శ్రేష్ఠిగారితో కలిసి బయటికి వెళ్ళిపోయారు. నువ్వు ఇతన్ని తీసుకుని వెళ్ళిపో...." అంటూ గదాధరుడికి చెప్పారు అక్కడ నిలబడి వున్న భటులు ఇద్దరూ.

అడుగుకు ఆరు అవాంతరాలు ఎదురు పడతాయని అనుకున్న తన పథకం అంత తేలికగా సులువుగా పూర్తి అవుతుందని ఊహించలేదు గదాధరుడు.

ఉబికి వస్తున్న సంతోషాన్ని అతి బలవంతంగా అదుముకుంటూ, తనకు ఇష్టం లేని పనిని బలవంతంగా చేస్తున్నట్లు ముఖం పెట్టాడు.

"వీడు మహా బరువుగా ఉన్నాడు. భుజాల మీద వేసుకుని తీసుకుపోవటం చాలా కష్టం. అశ్వశకటం కావాలి" విసురుగా అన్నాడు.

"నగర పాలకుల వారికి విన్నపం పంపించుకో... ఒకటి కాకపోతే రెండింటిని పంపిస్తారు. ఒక దానిలో నువ్వు కూర్చో. రెండవ శకటంలో ఇతన్ని పడుకోబెట్టు" వెక్కిరింపుగా అన్నారు ఆ భటులు.

క్షణక్షణానికి తన విసుగుదల అధికం అయిపోతున్నట్లు శబ్దాలు చేస్తూ నిమ్మతోట యజమానిని చెరసాల ముఖ ద్వారం దగ్గరికి తీసుకుపోయాడు గదాధరుడు.

లోపల జరిగింది ఏమిటో తెలిసింది కాబోలు – అతన్ని అడ్డుకోలేదు అక్కడ వున్న భటులు. "ఈ చుట్టుపట్ల ఉండగా ఇతను ప్రాణాలు పోగొట్టుకుంటే, మేము నగర పాలకుల వారికి నివేదించవలసి ఉంటుంది. ఎంత త్వరగా ఆవలికి పోగలిగితే అంత మంచిది" అంటూ హెచ్చరించాడు.

అక్కడ కూడా అశ్వశకటం లేదని గొణగటానికి సిద్ధం అవుతున్నాడు గదాధరుడు. ఆ హెచ్చరికను విన్నవెంటనే ఒక్క క్షణికం కూడా ఆలస్యం చేయలేదు. అంతవరకూ అతి నెమ్మదిగా నడిపించుకుంటూ వచ్చిన యువకుడిని అమాంతం భుజం మీద వేసుకుని పరుగులాంటి నడకతో దూరంగా తీసుకుపోయి, ఒక ఇంటిచాటున క్రిందికి దించాడు.

"నీ పని అయిపోయినట్లుగా భావించి తమదారిన తాము వెళ్ళిపోయారు నీ శత్రువులు. ఇక నటించటాన్ని చాలించి తిన్నగా నిలబడవచ్చు" అని అతని చెవిలో చెప్పాడు.

కనులు తెరిచి ఆనందంగా తల ఊపి, అతనికి నమస్కారం చేశాడు ఆ యువకుడు.

"ప్రాణాలతో ఆ నరక కూపంలో నుంచి బయటపడతానని అనుకోలేదు. నీ దయవల్ల క్షేమంగా ఇవతలికి రాగలిగాను. నీ ఋణం ఏ విధంగా తీర్చుకోగలను?" వినయంగా అడిగాడు.

"ఋణాల గురించి తరువాత మాట్లాడుకోవచ్చు. ముందు మనం వెంటనే నీ తోట దగ్గరికి పోవాలి. నీకు ప్రమాదం తప్పటం బాగానే ఉన్నదిగాని, నీ తోటకు ఇంకా పొంచే ఉన్నది" అన్నాడు గదాధరుడు.

తన తోట నాశనం అయిపోతుందని తెలిసిన వెంటనే విపరీతమైన ఆందోళనకు గురి కావల్సిన ఆ యువకుడు – కనీసం కళ్ళు చిట్లించను కూడా చిట్లించలేదు.

"నా తోటకు ఎటువంటి ప్రమాదమూ రాదు... పచ్చటి ఆ చెట్ల మీద దుష్టబుద్ధితో ఎవరైనా చేతులు వేస్తే ఆ మరుక్షణం వారు సర్వనాశనం అయిపోతారు" అన్నాడు.

ఆశ్చర్యంతో కనులు పెద్దవి చేసి చూశాడు గదాధరుడు.

తోట నాశనం అయిపోతుందన్న అనుమానంతో దండనాధికారి అనుచరుల్ని ఎదుర్కొన్నారు తాను, తన జతగాడు... జరిగింది ఏమిటో తెలుసుకున్న దండనాధికారి మరింత మందిని పంపిస్తాడన్న అనుమానంతో తోటలోనే ఉండిపోయాడు శ్యామలుడు.

ఇప్పుడు ఈ యువకుడి మాటల్ని బట్టి చూస్తుంటే తాము అనవసరంగా శ్రమపడినట్లు కనిపిస్తోంది.

గదాధరుడి మనసులోని అనుమానం ఏమిటో తనకు అర్థం అయినట్లు తల ఊపాడు ఆ యువకుడు.

"ఎదుటివారి కష్టాల్ని చూసి కరిగిపోయే మీ వంటి వీరాధి వీరుల్ని అనవసరంగా శ్రమపెట్టడం నిజంగా నా అపరాధమే... ఏ మాత్రం ముందుగా తెలిసినా, తోటను గురించి కలత పడవలసిన అవసరం లేదని చెప్పి ఉండే వాడిని...." నెమ్మదిగా అన్నాడు.

గాఢంగా నిట్టూర్చి తల ఊపాడు గదాధరుడు. "నా జతగాడు ఇంకా ఆ తోట దగ్గిరే ఉన్నాడు. విషయం అతనికి కూడా చెపితే గుండెల మీది నుంచి బరువు దిగి పోయినట్లు సంతోషిస్తాడు...." అంటూ నగర ద్వారాల వైపు నడక మొదలు పెట్టాడు.

తమ చర్యల్ని గమనించేందుకు దండనాధికారి అనుచరులు ఆ చుట్టుపట్ల ఎవరూ లేరని నిశ్చయపరుచుకుని, పరుగులాంటి నడకతో అతన్ని అనుసరించాడు నిమ్మతోట యజమాని.

* * * * *

దండనాధికారి తోటలో జరిగింది. ఏమిటో తెలుసుకున్న తర్వాత కక్ష తీరక మరికొంతమందిని పంపిస్తాడన్న అనుమానంతో తోటకు రక్షణగా ఉండి పోయిన శ్యామలుడికి–విసుగు పుట్టింది చీకట్లు చుట్టు ముట్టబోతున్న సమయంలో.

తోటకు మధ్యభాగంలో పర్ణశాల మాదిరి అందంగా ఉన్న ఒక చిన్న మట్టి కట్టడం దగ్గిర నిలబడి ఉన్నాడు అతను.

నిలబడి నిలబడి పాదాలు బరువెక్కుతున్న అనుభూతి కలగటం మొదలయ్యేసరికి, మట్టి కట్టడం ముందున్న చిన్నపాటి అరుగుమీద చతికిలపడ్డాడు.

ఆహారం తీసుకోకుండా కనీసం మంచినీరు కూడా తాగకుండా నిలబడి ఉండటం వల్ల, చిరాకు అధికం అవుతున్నట్లు అనిపించి, అంతకుముందు గదాధరుడు చెప్పినట్లు... రెండు నిమ్మకాయలను కోసి, నీటిలో పిండుకుని తాగితే బాగుంటుందన్న ఆలోచన అడుగుపెట్టింది అతని హృదయంలో.

తోట యజమాని అనుమతి లేకుండా చెట్లకు ఉన్న కాయలను తెంపటానికి గాని, కోయటానికి గాని అంగీకరించలేదు అతని వివేకం.

"నిమ్మరసం తాగాలన్న కోరిక కలిగినప్పుడు అందుకు కాయలను తెంపవలసిన అవసరం లేదు. మిగల పండిన కాయలు వాటంతట అవే రాలి క్రింద పడిపోతాయి. వాటితో నీ అవసరం తీరిపోతుంది" రెండు క్షణికాల తరువాత అతని మనస్సులో మెదిలింది ఆ మాట.

కూర్చున్న చోటి నుంచి లేచాడు. మట్టి కట్టడానికి దగ్గరిగా ఉన్న చెట్టు దగ్గరికిపోయాడు.

నేలకు మూడు అడుగుల ఎత్తుకు వాలిపోయి ఉన్నాయి... పెద్దపెద్ద కాయలతో నిండి ఉన్న ఆ చెట్టుకొమ్మలు... చెట్టు చుట్టూ రెండుసార్లు తిరిగాడు శ్యామలుడు.

మిగలపండి ఉన్న కాయలు ఏ క్షణంలోనైనా వాటంతట అవే క్రిందికి రాలిపోయేటట్లు కనిపిస్తున్నాయి గాని, నేల మీద ఒక్క కాయ కూడా కనిపించటం లేదు.

ఆ చెట్టును వదిలి మరో రెండు చెట్ల చుట్టూ వలయాకారంలో తిరిగాడు అతను. అక్కడకూడా చిన్నపాటి ఎండు పిందె కూడా క్రింద కనిపించకపోయేసరికి – వచ్చేసింది అతనికి అనుమానం.

ఒరలో ఉన్న కరవాలపు పిడిని ఒక చేత్తో గట్టిగా పట్టుకుని, రెండవ చేత్తో తనకు దగ్గిరగా ఉన్న కొమ్మ మీద కాయను ముట్టుకున్నాడు.

అతి సామాన్యంగా కనిపిస్తున్న ఆ తోటలో ఎవరికీ అర్థం కాని ఏదో రహస్యం దాగి ఉన్నదని ముందుగానే గ్రహించ గలిగినా, కొమ్మకు వ్రేలాడుతున్న

కాయమీద చేతిని వేసిన మరుక్షణం... ప్రత్యక్షం అయిన ప్రమాదాన్ని అడ్డుకోవటం మాత్రం అతనికి చేతకాలేదు.

అంతకుముందు వరకూ గట్టిగా మూసి ఉన్న మట్టికట్టడపు తలుపులు దఢేలున తెరుచుకున్నాయి.

సుడులు తిరుగుతూ కట్టడంలో నుంచి వెలుపలికి వచ్చింది నల్లటిపొగ, కన్నుమూసి కన్ను తెరిచేటంతలో అతన్ని సమీపించి, అమాంతంగా చుట్టు ముట్టింది.

ఒరలో ఉన్న కత్తిని అవసరం అయితే బయటికి లాగి, ఎటువంటి ప్రమాదాన్నయినా ఎదుర్కోవటానికి సిద్ధంగానే ఉన్నాడు శ్యామలుడు. కత్తిని బయటికి తీసే అవకాశం మాత్రం అతనికి లభించలేదు. సుడిగాలి గడ్డి పరకల్ని పైకి ఎత్తినట్లు అతన్ని గాలిలోకి ఎత్తింది ఆ పొగ. గింగిరాలు తిప్పుతూ తీసుకుపోయి తోటకు వెలుపల ఉన్న పెద్ద బురద గుంటలోకి విసిరి కొట్టింది.

ఆఖరి క్షణంలో కత్తిని బయటికి తీయాలన్న కోరికను వదిలేసి, రెండు చేతులతోను తలను కప్పుకున్నాడు అతను. అందువల్ల తల నేలకు పొడుచుకుని, తీవ్రంగా గాయపడకుండా తప్పించుకున్నాడు.

దుర్వాసన వెలువరుస్తోంది బురద గుంటలోని మురికి నీరు... తల నుంచి పాదాల వరకు పూర్తిగా మురికి పడిపోయింది అతని శరీరం.

"సాధారణమైన నిమ్మతోటలో మతులు పోగొట్టే మంత్ర శక్తులు కనిపించటం నిజంగా చాలా విచిత్రంగా ఉంది." తనలో తను అనుకుంటూ బురద గుంటలో నుంచి బయటికి వచ్చాడు అతను.

"వెళ్ళిపో... ఎటునుంచి వచ్చావో అటుగా వెళ్ళిపో... తోటలోకి వచ్చి కాయలు కోయటానికి ప్రయత్నించావంటే నీ ప్రాణాలు నీకు దక్కవు" ఉన్నట్లుండి అతని మనస్సులో మెదిలింది ఆ హెచ్చరిక.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ చుట్టూ చూశాడు అతను. చుట్టుముడుతున్న చీకట్లు తప్ప, ప్రాణాలకు ప్రమాదాన్ని కలిగించే పరిస్థితి గాని, మరేదైనా ఆకారం గాని అగుపించలేదు అతనికి.

"నేను తోటలోని కాయలను అక్రమంగా సొంతం చేసుకోవటానికి రాలేదు. నువ్వు ఎవరివోగాని, ఎదుటికి వచ్చి మాట్లాడితే బాగుంటుంది" చుట్టూ చూస్తూ బిగ్గరగా అన్నాడు.

చీకటి సమయం దగ్గిర పడుతూ ఉండటం వల్ల, తమ తమ గూళ్ళకు తిరిగిపోతున్న పక్షుల కూతలు శబ్దాలు తప్ప మరెటువంటి శబ్దమూ అతనికి వినిపించలేదు.

సరైన కారణం లేకుండా అవేశపడటంగాని, ఆత్రపడటంగాని అలవాటు లేదు శ్యామలుడికి, తనకు సంబంధించని పనిలో అవతలివారి అంగీకారం లేకుండా వేళ్ళు పెట్టడం కూడా తెలియదు అతనికి.

ఇప్పుడు మాత్రం ముంచుకు వచ్చేసింది అతనికి విపరీతమైన ఆగ్రహం. "దుష్టదుర్మార్గులు ఎవరో తోటను నాశనం చేయ సంకల్పిస్తే, ప్రమాదం అని తెలిసి కూడా ఎదిరించి దూరంగా తరిమికొట్టాము. తోటను ప్రాణప్రదంగా చూసుకునే వాళ్ళకి ఆ దృశ్యం కనిపించలేదా? తమతోటను తమంతట తాము కాపాడుకోగలిగిన శక్తియుక్తులు ఉండి ఉంటే – మా కంటే ముందుగా ఆ పని ఎందుకు చేయలేదు?" తన కరవాలం మీద చేయివేసి, తిరిగి తోటలోకి వస్తూ బిగ్గరగా అడిగాడు.

అప్పుడు కూడా రాలేదు సమాధానం. అసహజమైన శబ్దాలు ఏవీ అతనికి వినిపించలేదు.

మరింతగా పెరిగి పోయింది అతని కోపం. చరచరా ఒక చెట్టు దగ్గరికి పోయి, క్రిందికి వాలి ఉన్న కొమ్మ మీది కాయల మీద చెయ్యి వేయబోయాడు. అంతలోనే వచ్చింది అతనికి ఒక కొత్త ఆలోచన.

కొమ్మకు ఉన్న కాయల్ని తెంపే యోచన మానుకుని, కట్టడం దగ్గరికి పోయి, మూసివున్న తలుపుల్ని గట్టిగా వెనక్కి నెట్టాడు.

దగ్గరికి లాగి ఉన్నట్లు కనిపిస్తున్నాయి అవి. తాళం బిగించి ఉండటం గాని, గొళ్ళెం పెట్టి ఉండటంగాని ఏమీ కనిపించటంలేదు.

అయినా సరే తెరుచుకోలేదు అవి... లోపలి పక్క గడియ బిగించినట్లు కదలకుండా ఉండిపోయాయి.

తీవ్రతరం అయిపోయింది శ్యామలుడి కోపం. పళ్ళు బిగించి, ఎడమ పాదంతో బలంగా తన్నాడు.

ఫెళ్ళుమని వినవచ్చింది శబ్దం... మధ్యకు విరిగిపోయింది ఒక తలుపు. ద్వారబంధాన్ని వదిలి దూరంగా పోయి పడింది రెండవది.

ఒరలో ఉన్న కరవాలాన్ని చర్రున బయటికి లాగుతూ, ఎగిరి దూకాడు లోపలికి. కనులు చిట్లిస్తూ చుట్టూ చూశాడు.

కూర్చునేందుకు గాని, విశ్రాంతిగా మేను వాల్చేందుకు గాని, ఎటువంటి ఆసనాలు, పడకలు లేవు అక్కడ. పూజామందిరం వంటి వేదిక ఒకటి మాత్రం ఉన్నది ఒక గోడ దగ్గర.

పసుపు కుంకుమలతో అలంకరించబడిన మట్టి విగ్రహం ఒకటి కనిపిస్తోంది ఆ వేదిక మీద... చాలా వికృతంగా ఉన్నది అది. దేవతా విగ్రహం మాదిరి కనిపించటం లేదు.

క్షణక్షణానికి అధికం అయిపోతున్న కోపం కారణంగా, మంచిచెడుల విచక్షణ కోల్పోయాడు శ్యామలుడు. విసురుగా వేదికను సమీపించి, ఆ విగ్రహాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

మూడు జానల ఎత్తు మాత్రమే ఉన్నది అది. ఎత్తు తక్కువే అయినా, మూడు పుట్ల బరువు ఉన్నట్లు అనిపించింది అతనికి.

శరీరంలో ఉన్న శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుంటూ దాన్ని గట్టిగా పట్టుకున్నాడు అతను. ప్రక్కనే ఉన్న గోడకేసి విసిరేయబోయాడు.

అతను అలా చేయటానికి సిద్ధం అయినప్పుడు ప్రత్యక్షం అయింది అంతకుముందు అతన్ని బురద గుంటలోకి విసిరి కొట్టిన పొగ. ఇంకోసారి అతన్ని చుట్టు ముట్టటానికి ప్రయత్నించింది.

“ఒక్క అంగుళం మేర ముందుకు వచ్చావంటే ఈ విగ్రహం ముక్కలు ముక్కలు అయిపోతుంది. దూరంగా నిలబడి నువ్వెవరివో చెప్పుకో....” ఖంగు మంటున్న కంఠంతో హెచ్చరించాడు అతను.

“క్రిందపెట్టు... ముందు విగ్రహాన్ని భద్రంగా వేదిక మీదికి చేర్చు” ఆందోళనగా వినవచ్చాయి ఆ మాటలు–గింగిరాలు తిరుగుతున్న ధూమస్తంభంలో నుంచి.

“ముందు నాకు సమాధానం కావాలి....” మొండిగా అన్నాడు శ్యామలుడు.

“నాకు అధికారం లేదు... అధికారం గల వాళ్ళు అడిగితే గాని సమాధానం చెప్పటానికి వీలు లేదు....” వినవచ్చాయి ఆ మాటలు.

"అధికారం ఎవరికి ఉంది? ఈ తోట యజమానికా?" అడిగాడు శ్యామలుడు.

"అతను వట్టి కాపలాదారుడు మాత్రమే...." అన్నది ఆ కంఠం.

ఇంకా ఇంకా అధికం అయిపోయింది శ్యామలుడి చిరాకు.

"కాకమ్మ కథలు వింటూ కూర్చునే ఓపిక నాకు లేదు. ఈ రోజుతో ఈ తోటకు పట్టిన పీడ విరగడ అయిపోవాల్సిందే...." అంటూ చేతిలోని విగ్రహాన్ని మరోసారి గోడకేసి విసరబోయాడు.

"వద్దు... వద్దు... సాహసం వద్దు...." కీచుగా అరిచింది ఆ కంఠం.

"మిత్రమా... ఆగిపో... ఆ పని చేయబోకు...." అంతకంటే బిగ్గరగా వినవచ్చింది గదాధరుడి కంఠం గుమ్మంలో నుంచి.

విగ్రహాన్ని విసిరికొట్టే ఆలోచన విరమించుకున్నాడుగాని, దాన్ని క్రింద పెట్టలేదు శ్యామలుడు. భుజం మీది నుంచి వెనక్కి చూశాడు.

రెండే రెండు అంగల్లో అతన్ని సమీపించి, భుజం మీద చేయి వేశాడు గదాధరుడు. తన వెనకే లోపలికి వచ్చిన నిమ్మతోట యజమానిని అతనికి చూపించాడు.

"ఇతను ఈ తోటకు కాపలా మనిషి మాత్రమే... యజమాని కాదట...." పళ్ళు బిగపడుతూ చెప్పాడు శ్యామలుడు.

గింగిరాలు తిరుగుతూ వేదిక దగ్గిర నిలబడి ఉన్న ధూమ స్తంభానికి సాష్టాంగ నమస్కారం చేశాడు గదాధరుడు వెంట బెట్టుకు వచ్చిన యువకుడు.

"నేను క్షేమంగా చెరసాల నుంచి బయటికి వచ్చాను. దయచేసి నువ్వు నీ ఆగ్రహాన్ని అణచుకో... నేను వారితో మాట్లాడతాను...." మోకాళ్ళ మీద లేచి చేతులు జోడిస్తూ వేడుకున్నాడు.

వెనువెంటనే మాయమైపోయిందా పొగ... అప్పటివరకూ ఆ కట్టడాన్ని కంపింపచేస్తున్న ఈదురుగాలి మోతలు కూడా అణిగిపోయాయి.

లేచి నిలబడ్డాడు ఆ యువకుడు. శ్యామలుడి ముందుకు వచ్చి వినయంగా చేతులు జాచాడు.

గోడకేసి విసిరి కొట్టబోయిన విగ్రహాన్ని అతనికి అందించాడు శ్యామలుడు. వేదికమీద దాన్ని తిరిగి నిలబెట్టి, అతన్ని, గదాధరుడిని కట్టడంలో నుంచి బయటికి తీసుకు పోయాడు ఆ యువకుడు.

గుమ్మాన్ని దాటి ఒక అడుగు వారు అవతలికి వేయగానే, విరిగి పడిపోయిన తలుపు యధాప్రకారం ద్వార బంధానికి అతుక్కున్నది... వెడల్పుగా తెరుచుకున్న రెండవ తలుపు కూడా దాన్ని చేరుకున్నది.

"చెరసాల దగ్గర జరిగింది ఏమిటంటే–" అంటూ అక్కడ జరిగిన విశేషాలన్నింటిని వివరంగా చెప్పబోతున్న గదాధరుడిని, నోరు మూసుకోమని చేయి ఊపాడు శ్యామలుడు.

"ఈ తోటకు యజమాని ఎవరో నాకు తెలియాలి. ఈ తోటలోని చెట్లమీద చేయివేసిన మరుక్షణం జరుగుతున్న దారుణం ఎందుకో నాకు అర్థం కావాలి...." క్లుప్తంగా సూటిగా తన మనసులోని మాటను బయటికి చెప్పాడు.

"నా మాటలు మీకు విచిత్రంగా అనిపించవచ్చు... బహుశా మీరు నమ్మకపోవచ్చు–" అన్నాడు నిమ్మతోట యువకుడు.

"ఎటువంటి మాటలు చెప్పినా వినటానికి మేము సిద్ధంగా ఉన్నాము. నమ్మటం నమ్మకపోవటం మాకు సంబంధించిన విషయం... నువ్వు చెప్పవలసింది ఏమిటో వెంటనే చెప్పటం చాలా మంచిది" అన్నాడు గదాధరుడు.

"ఈ తోటకు యజమాని విపిన శ్రేష్ఠిగారి కుమార్తె కనకప్రభ."

తన చెవులు తనను ఏమారుస్తున్నాయేమోనన్న అనుమానం కలిగింది గదాధరుడికి... శ్యామలుడి పరిస్థితి కూడా అచ్చు అలాగే ఉన్నది.

తన కుమార్తె ఆ యువకుడి మీద మనసుపడి తనకు అప్రతిష్ఠ తీసుకు వస్తోందన్న కోపంతో, అతన్ని కారాగారానికి పంపి అడ్డు తొలగించుకోవటానికి ప్రయత్నించాడు విపిన శ్రేష్ఠి.

నిమ్మతోటకు యజమానురాలు అతని కుమార్తే అయి ఉంటే ఆ సంగతి అతనికి తెలియకుండా ఉంటుందా?

దండనాధికారికి ఆ తోటను స్వాధీనం చేసుకోవాలన్న కోరిక ఉన్నప్పుడు, తన అనుచరుల్ని పంపి దౌర్జన్యం చేయించాలని అనుకోవటం దేనికి?

శ్రేష్ఠి కుమార్తెను తన కొడుక్కి చేసుకునే సమయంలో ఆ తోటను వరకట్నంగా అడిగి పుచ్చుకుని హాయిగా ఆనందంగా ఉండవచ్చుగదా...

స్నేహితుల వంకే చూస్తున్న నిమ్మతోట యువకుడికి అర్థం అయిపోయాయి వారి అంతరంగాల్లో చెలరేగుతున్న ఆలోచనలు.

"ఒకటి రెండు మాటలతో మీ అనుమానాల్ని తీర్చవచ్చని నేను భావించాను. కాని అది సాధ్యపడేటట్లు కనిపించటం లేదు. నా కథను మీకు పూర్తిగా వినిపించవలసిందే...." అంటూ మట్టికట్టడం ముందు భాగంలో ఉన్న అరుగుల వైపు చేయి చూపించాడు.

చీకట్లు చాలా దట్టం అయిపోయాయి ఆ సమయానికి. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి ఆ తోటను ఆవరించుకుంది.

"చిమ్మచీకట్లో సంభాషణ నాకు నచ్చదు. రెండు క్షణాలు ఓపికపడితే ఎండు చితుకులతో ఏదైనా చిన్న చితుకుల మంట వేస్తాను" అంటూ అవతలికి పోబోయాడు గదాధరుడు.

అతన్ని చేయి జాచి ఆపాడు ఆ యువకుడు. కనులు మూసుకుని చిన్నగా చిటికె వేశాడు.

తీపి పదార్థాన్ని చూసి నోరు ఊరినప్పుడు చిన్న పిల్లలు నాలుకతో శబ్దం చేసినట్లు వినవచ్చింది మృదువైన శబ్దం. ఆ యువకుడి చేతి దగ్గిర ప్రత్యక్షం అయింది ఒక చిన్న అగ్నిగోళం.

పున్నమి చంద్రుడి మాదిరి సుతిమెత్తటి వెలుగులు విరచిమ్మటం మొదలు పెట్టింది అది.

"నన్ను కారాగారంలో నుంచి వెలుపలికి తీసుకు రావటంలో చాలా ఎక్కువగా శ్రమపడ్డాడు నీ జతగాడు. ఈ ప్రదేశాన్ని ముష్కరుల బారినుండి కాపాడటం కోసం అంతకంటే ఎక్కువగా కష్టపడ్డారు. సమయం మించిపోకుండా ఏదైనా ఆహారం తీసుకోవటం చాలా బాగుంటుంది" అంటూ మూతబడిన కట్టడం తలుపుల వైపు తిరిగి, లోపల వేదిక మీద ఉన్న విగ్రహానికి నమస్కారం చేశాడు ఆ యువకుడు.

"అతిథులు తల్లీ... నోరుతెరిచి అడుగకపోయినా నిన్నూ నన్నూ కాపాడటానికి వాళ్ళు అలసిపోయేటంతగా శ్రమ పడ్డారు...." అన్నాడు.

బురదగుంటలో పడటం వల్ల మలినమై, దుర్వాసన వెలువరుస్తున్న శ్యామలుడి దుస్తులు చటుక్కున శుభ్రపడ్డాయి. అతని ఒంటిని అంటుకుని ఉన్న బురద మటుమాయం అయిపోయింది.

మట్టి అరుగుమీద ప్రత్యక్షం అయినాయి రకరకాల రజిత పాత్రలు. సెగలు పొగలు వెలువరుస్తున్న ఆహార పదార్థాలతో నిండుగా కనిపిస్తున్నాయి అవి.

క్షణికం పాటు కూడా ఆలస్యం చేయకుండా తన కత్తిని ఒరలో నుంచి బయటికి తీశాడు గదాధరుడు.

"సాధారణమైన పౌరుడివే అనుకున్నాము మేము. మాయలు మంత్రాలు నేర్చిన మంత్రవాదివని ఊహించలేదు. ఈ క్షణంలో నీకు ఈ భూమి మీద నూకలు చెల్లిపోయినట్లే" అంటూ కత్తిని అతని గొంతుకు ఆనించాడు.

"నేను చేసిన తప్పేమిటి?" అయోమయంగా చూస్తూ అడిగాడు యువకుడు.

"చిటికెలు వేసి వెలుతురు సృష్టించగలిగిన వాడివి, క్షణాల మీద ఆహారాన్ని సిద్ధం చేయగల మొనగాడివి. చేతకాని వాడి మాదిరి చెరసాలలోకి ఎందుకు పోయినట్లు? ఎవరిని మోసం చేయటానికి?" కరుకుగా అడిగాడు గదాధరుడు.

"చెపుతాను వీరుడా... నా గురించి శ్రేష్ఠిగారి కుమార్తె గురించి మీకు పూర్తిగా చెపుతాను. దయచేసి నీ ఆయుధాన్ని క్రిందికి దించు" వేడుకున్నాడు ఆ యువకుడు.

"వాడు మళ్ళీ ఏదో మెలిక పెట్టబోతున్నాడు మిత్రమా... మంత్రాలు మాయలు నేర్చిన వాడు సాధారణమైన మన ఆయుధాల్ని చూసి భయపడవలసిన అవసరం లేదు" శ్యామలుడితో చెప్పాడు గదాధరుడు.

వినిపిస్తూనే ఉన్నాయి ఆ మాటలు నిమ్మతోట యువకుడికి.

"ప్రమథ రాజ్యాన్ని పరిపాలించే రాజులు పూర్వకాలంలో శంబరశక్తి అనే ఒక మహాదేవతకు బ్రహ్మాండమైన ఆలయాన్ని కట్టించారు. కాలక్రమంలో ఆ దేవళం కనుమరుగు అయిపోయింది. అది ఏ ప్రదేశంలో ఉన్నదో ఆ రాజ వంశీకులకు మాత్రమే తెలుసు...." గదాధరుడి మాటలకు కోపం తెచ్చుకోకుండా చెప్పటం మొదలు పెట్టాడు అతను.

అతని మెడకు ఆనించిన తన కత్తిని క్రిందికి దించి ఆసక్తిగా వినటం మొదలు పెట్టాడు గదాధరుడు.

"ఆలయం ఎక్కడ ఉన్నదో తెలిసినా, స్వయంగా వెళ్ళి ఆ దేవతను ఆరాధించే అదృష్టానికి ఆ రాజవంశీయులు నోచుకోలేదు" అన్నాడు ఆ యువకుడు.

"ఎందుకని?" కుతూహలంగా అడిగాడు శ్యామలుడు.

"శంబరశక్తి అంటే ఒక క్షుద్రశక్తి అనీ. ఆ శక్తిని వశపరుచుకోగలిగితే అపూర్వమైన మంత్ర శక్తులు సిద్ధిస్తాయని అనేకమంది క్షుద్ర మాంత్రికులు భావించటం వల్ల ఏర్పడిన పరిస్థితి అది" అన్నాడు ఆ యువకుడు.

ఒకరి వంక ఒకరు చూసుకున్నారు శ్యామల గదాధరులు.

తను చెపుతున్నది వారికి అవగతం కాలేదని అర్థమై చిరునవ్వు నవ్వాడు ఆ యువకుడు.

"మీరిద్దరూ తీరికగా కూర్చుని ఆహారం తీసుకుంటూ ఉండండి... కడుపులు నిండుగా ఉంటేనే కొన్ని కొన్ని మాటలు వివరంగా తెలుస్తాయి" అన్నాడు.

బయటికి తీసిన ఖడ్గాన్ని తిరిగి ఒరలో పెట్టుకుని, మట్టి అరుగు మీద కనిపించిన రజిత పాత్రలోని నీటితో కరచరణాలను శుభ్ర పరుచుకున్నారు స్నేహితులు ఇద్దరూ.... మిగిలిన పాత్రలలోని ఆహార పదార్థాలను ఆరగించటం మొదలు పెట్టారు.

"శంబర దేవతను క్షుద్రశక్తిగా భావించి, నరబలులు ఇవ్వటానికి అనేకమంది మంత్రవాదులు ప్రయత్నించటంతో తనకు తానుగా తన ఆలయాన్ని కనుమరుగు చేసివేసిందా తల్లి...." వారికి సమీపంలో కూర్చుని మరోసారి మాటలు మొదలు పెట్టాడు ఆ యువకుడు.

"తనకు బలులు వద్దని అనుకుంటే వాటిని తిరస్కరించవచ్చు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో హెచ్చరికలు చేయవచ్చు. ఆలయాన్ని కనిపించకుండా చేయవలసిన అవసరం ఏమొచ్చింది?" ఆసక్తిగా అడిగాడు శ్యామలుడు.

"ఆలయ నిర్మాణ సమయంలో ఆ ప్రదేశాల్లో ప్రతిష్టాపన చేసిన యంత్రాలు మంత్రాల రేకులు మహాశక్తిని కలిగి ఉంటాయి. వాటి ఆకర్షణ పరిధిని దాటి ఆలయంలోని దేవతామూర్తులు స్వతంత్రంగా వ్యవహరించలేవు. శంబరశక్తిని బలులతో అర్పించదలచుకుంటే – అడ్డుకునే అధికారం ఆ తల్లికి లేదు... ఆ విధంగా అర్పించిన వారికి దర్శనం ఇచ్చి వారి కోరికలను తీర్చవలసిందే. వేరు మార్గం లేదు." అన్నాడు ఆ యువకుడు.

"ఆ కారణంతోనే తన ఆలయం ఎక్కడ ఉన్నదో ఎవరికీ తెలియకుండా మరుగు పరచటం జరిగిందా?" అడిగాడు గదాధరుడు.

తల ఊపాడు ఆ యువకుడు.

"ఆలయం మరుగున పడటం వరకూ  బాగానే ఉన్నది. మరుగునపడింది గాని, శిథిలం కాలేదు... అవునా?" అడిగాడు శ్యామలుడు.

ఆ మాటలకు కూడా తల ఊపాడు నిమ్మతోట యువకుడు.

"క్షుద్రశక్తుల మాదిరి తీవ్రమైన శక్తులు కలిగిన దేవతలను నిమ్మకాయలతో పూజించటం సాధారణంగా జరిగే పని. ఎక్కడో ఉన్న ప్రమథ రాజ్యంలోని శంబరశక్తిని పూజించేందుకు కావల్సిన నిమ్మకాయలు ఈ తోటలో నుంచే సేకరించటం జరుగుతున్నదా?" వెంటనే అడిగాడు గదాధరుడు.

తెల్లటి పల్వరుస బయటికి కనిపించేటా పెద్దగా నవ్వాడు నిమ్మతోట యువకుడు.

"ప్రమథ రాజధాని నగరంలో మా గురుదేవుడు నివశిస్తున్నాడు... నగరం మధ్యలో ఒక బిల్వ వృక్షం ఉంటుంది. దాని ప్రక్కనే చిన్నచెక్కల కట్టడం కనిపిస్తుంది. అందులో నివసించే మా గురుదేవులను కలుసుకోండి. మీ అనుమానాలన్నీ తీరిపోతాయి..." అన్నాడు.

"విపిన శ్రేష్ఠి కుమార్తెకు ప్రమథ రాజ్యంలోని శంబర మాతకు ఏమిటి సంబంధం?" వెంటనే ప్రశ్నించాడు గదాధరుడు.

"తన మంత్ర శక్తులతో మమ్మల్ని లోబరుచుకున్నాడు మా గురుదేవుడు. కేవలం ఈ తోట బాగోగుల్ని చూసుకోవటం కోసమే ఆ పని చేశాడు" అంటూ తల వంచుకున్నాడు ఆ యువకుడు.

రజిత పాత్రల్లోని ఆహార పదార్థాలన్నిటినీ ఆరగించారు స్నేహితులు ఇద్దరూ. తీరికగా కట్టడపు గోడల్ని ఆనుకుని కూర్చుంటూ "నువ్వు చెప్పిన కథలో ఇంతవరకూ బయటపడని రహస్యం ఏదో దాక్కుని ఉన్నట్టు కనిపిస్తోంది. అదేమిటో బయట పెట్టటం చాలా మంచిది" అన్నాడు శ్యామలుడు.

"ఉన్నదేమిటో వివరంగా చెప్పేశాను. ఈ తోట, ఇందులోని ఫలాలు అన్నీ శంబరదేవతకు చెందినవి. పరాయి వారెవరూ ముట్టుకోకూడదు... కట్టడంలోని ధూమశక్తి నేను తోటలో లేని సమయంలో తోడుగా కాపలా కాస్తూ ఉంటుంది. ఇందులో దాక్కుని ఉన్న రహస్యం వేరే ఏమీ లేదు" గబగబా అన్నాడు ఆ యువకుడు.

"కాదు... కట్టడంలో నా జతగాడు ఎదిరించిన శక్తి కాపలాగా వచ్చినది కాదు. అసలు ఈ తోటలోని కాయలు ఎవరికీ ఉపయోగపడకుండా, అడ్డుకోవటానికి సృష్టించబడింది. మనుష్యులకే కాదు... ఈ కాయలు పూజలకు కూడా పనికి రాకుండా చేయటానికి ఉద్దేశించబడింది అది" సూటిగా అన్నాడు గదాధరుడు.

తెల్లబోయి చూశాడు ఆ యువకుడు.

"ఎక్కడో ఉన్న ప్రమధ రాజ్యంలోని ఒక పురాతన కాలపు ఆలయంలో పూజలు చేయటానికి అవసరం అయిన వస్తువులు ఈ నగరంలోనే లభించటానికి ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుంది. ఆ వస్తువులకు రక్షణగా మంత్ర తంత్రాలు నేర్చిన వారినే కాకుండా, మంత్రశక్తుల్ని కూడా కాపలా పెట్టడం వెనుక ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుంది" అన్నాడు శ్యామలుడు.

తల వంచుకున్నాడు వారితో మాట్లాడుతున్న యువకుడు.

"మౌనంగా ఉండటం వల్ల ఎటువంటి ఉపయోగము ఉండదు. మా అనుమానాలకు సరైన సమాధానాలు లభించక పోతే మేము ఊరుకోము" అన్నాడు శ్యామలుడు.

అతను ఆ మాటలు అంటూ ఉండగానే బలమైన గాలి తెర ఒకటి ప్రత్యక్షం అయింది ఆ ప్రదేశంలో.

నితారుగా నిలబడి తన కరవాలం మీద చేయి వేయబోతున్న శ్యామలుడి భుజం మీద చేయి వేసి, బలంగా వెనక్కి నెట్టాడు గదాధరుడు.

కాలు నిలదొక్కుకోవడం అసాధ్యమై వెనక్కి తూలాడు శ్యామలుడు. అలా తూలటమే అతని ప్రాణాలను కాపాడింది ఆ సమయంలో. అంతకు ముందు ఒక్క క్షణికం వరకూ అతను నిలబడి ఉన్న ప్రదేశంలో నుంచి రివ్వున దూసుకుపోయి కట్టడం గోడను తగిలింది పదునైన చురకత్తి ఒకటి.

శ్యామలుడిని అవతలికినెట్టి తను కూడా మరో ప్రక్కకు దూకాడు గదాధరుడు. అయితే శ్యామలుడి మాదిరిగా విచిత్రంగా చూస్తూ ఊరికే నిలబడలేదు. ఎడమ చేతిని విసురుగా ముందుగా జాచి, చాచి పెట్టి కొట్టాడు తన ఎదుట ఉన్న గాలిని.

"ఏమయింది మిత్రమా? ఏమిటా పని?" ఆ చర్య ఏమిటో అర్ధం కాక పోవటం వల్ల, అయోమయంగా చూస్తూ అడిగాడు శ్యామలుడు.

"చెపుతాను మిత్రమా... ఒక్క క్షణికం ఆగితే తప్పకుండా చెపుతాను" అంటూ మరోసారి తన చేతిని విసిరాడు గదాధరుడు.

బాధా సూచకమైన శబ్దం ఒకటి వినవచ్చింది వెంటనే. బరువైన శరీరం ఏదో నేలను తాకిన శబ్దం కూడా వచ్చింది.

"మంత్ర తంత్రాలు మాకు రావు. మంత్రవీరులం కాదు మేము... కాని ఆ మానవతీత శక్తులు ఎలా ఉంటాయో, ఎలా ఎగబడతాయో తెలియని వాళ్ళం మాత్రం కాదు. మమ్మల్ని నాశనం చేయటానికి మీకు ఉన్న శక్తులు చాలవు" అంటూ తన ఎడమ పాదాన్ని ఎత్తి బలంగా వేశాడు ఒక అడుగు. తన కరవాలాన్ని ఒరలో నుంచి బయటికి తీసి గాలిలోకి ఎత్తాడు.

"వద్దు... కత్తిని విసరవద్దు. దయచేసి ఆగిపొండి...." ఆందోళన నిండిన కంఠంతో బిగ్గరగా అరిచి, గభాలున పైకి లేచాడు నిమ్మతోట యువకుడు. తను కూర్చున్న ప్రదేశం లోనుంచి, వేగంగా ముందుకు వచ్చి గదాధరుడి ఖడ్గాన్ని అడ్డుకున్నాడు.

"బయటికి రమ్మని చెప్పు... మాయలు మా ఎదుట పనికి రావని హెచ్చరించాలి...." కరుకుగా అన్నాడు గదాధరుడు.

"కనకప్రభా... కనిపించు... ఈ వీరకుమారులకు నువ్వు వెంటనే కనిపించి, దురుసుగా ప్రవర్తించి నందుకు క్షమాపణలు కోరుకో...." గదాధరుడి ఎడమ పాదం వైపు చూస్తూ గబగబా అన్నాడు నిమ్మతోట యువకుడు.

మరోసారి ఆ ప్రదేశంలో ప్రత్యక్షం అయింది గాలి తెర. గదాధరుడి పాదం క్రింద ప్రత్యక్షమయింది ఒక అందాల సుందరి.

అంతకుముందు ఎంత గంభీరంగా మాట్లాడినా, తన కాలిక్రింద ఉన్నది ఒక స్త్రీ మూర్తి అని తెలిసిన వెంటనే ఎగిరి వెనక్కి దూకి, తను బయటికి తీసిన కరవాలాన్ని క్రిందికి దించాడు అతను.

"నువ్వు శత్రువువో, స్నేహితురాలివో తెలియదు... ఎటువంటి దానివైనా స్త్రీ మూర్తివి. పాదంతో అవమానించినందుకు మన్నింపు వేడుకుంటున్నాను" తల వంచి అభివాదం చేస్తూ అర్థించాడు.

"నా తోట ఇది. నా అనుమతి లేకుండా రావటమే కాకుండా ఈ మనిషిని తికమక పెడుతున్నందుకు మీరు శిక్షను అనుభవించవలసిందే" నిమ్మతోట యువకుడి చేతిని ఆసరాగా తీసుకుని పైకి లేస్తూ కోపంగా అన్నది ఆ యువతి.

"తల్లీ... ఈ వీరకుమారుడి మీద నీకు ఉన్న అభిమానానికి మేము నిజంగానే ముగ్ధులం అయిపోతున్నాము. ఇవన్నీ నీ తండ్రి దండనాధికారికి అప్పగించి, కారాగారానికి పంపించినప్పుడు ఎక్కడికి పోయింది ఈ అభిమానం? నిద్దర పోయిందా?" వెక్కిరింపుగా అడిగాడు గదాధరుడు.

"పగటి సమయంలో నా శక్తులు పని చేయవు. అందువల్ల నేను ఏమీ చేయలేకపోయాను...." సూటిగా చెప్పింది ఆమె.

ఆమె ఆ మాట చెప్పినప్పుడు శ్యామలుడి వైపు చూసి చిన్నగా నవ్వాడు గదాధరుడు.

"ఈ వీరాధివీరుడు చిటికెలు వేసి మంత్ర శక్తుల్ని ప్రదర్శించగల మొనగాడు తల వంచుకుని చెరసాలకు పోవటానికి కూడా కారణం అదే అయి ఉంటుంది మిత్రమా... పగటి సమయంలో వీళ్ళకి ఎటువంటి మంత్రాలు నోటికి రావు... చీకటిపడిన తర్వాతనే వాళ్ళు చెలరేగి పోవడం జరుగుతుంది" అన్నాడు.

"లెస్సగా చెప్పావు... నీ మాటలు అక్షర సత్యాలు...." తల ఊపుతూ అన్నాడు నిమ్మతోట యువకుడు.

"అసలు విషయాన్ని వదిలిపెట్టి మనం వేరే మాటలు మాట్లాడుతున్నట్టు నాకు అనిపిస్తోంది" కనులు చిట్లిస్తూ అన్నాడు శ్యామలుడు.

"అసలు విషయం అంటూ వేరే ఏమీలేదు. నేను ఇతన్ని ప్రేమిస్తున్నాను. వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాను. ఆ సంగతి తెలిసి నా తండ్రి ఇతన్ని అడ్డు తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు...." అన్నది ఆమె.

"తల్లీ... మంత్ర తంత్రాలు నేర్చిన మహిళా మణివి. సూటిగా మాట్లాడు... ఈ తోటకు నీకూ ఏమిటి సంబంధం? నీకూ, నీ ప్రేమికుడికీ ఉన్న మంత్ర శక్తులు చాలనట్లు ఈ మట్టి కట్టడంలో ఇంకో ధూమశక్తిని ఎందుకు నిక్షేపించినట్లు?" అడిగాడు గదాధరుడు.

నిమ్మతోట యువకుడి మాదిరిగా ఏవేవో మాటలు చెప్పటానికి ప్రయత్నం చేయలేదు ఆ యువతి.

"అది ఒక దేవ రహస్యం... మీ వంటి సామాన్యమానవులు తెలుసు కోదగింది కాదు. మీరు చేసిన సహాయానికి తగినటువంటి బహుమతిని తీసుకుని మీ దారిన మీరు వెళ్ళిపొండి...." కొంచెం కటువుగానే మాట్లాడింది.

"కట్టడంలోని ప్రతిమను గోడ కేసి కొట్టి సర్వనాశనం చేయకుండా ఆగిపోవటం చాలా పెద్ద తప్పుగా అనిపిస్తోంది మిత్రమా... దాన్ని పగలగొట్టి ఉన్నట్లయితే ఇక్కడి గుట్టుమట్లు ఎప్పుడో బట్టబయలు అయిపోయి ఉండేవి" శ్యామలుడితో అన్నాడు గదాధరుడు.

ఆ మాటలు చెవున పడిన వెంటనే దారుణమైన మార్పు వచ్చేసింది విపిన శ్రేష్ఠి కుమార్తె వదనంలో.

సుందరమైన ఆ ముఖం పరమ వికృతంగా మారిపోయింది. అందమైన ఆమె పెదవుల చివర్ల నుండి బయటికి పొడుచుకు వచ్చాయి పొడవాటి కోరలు.

పట్టుకుచ్చుల వంటి ఆమె కేశాలు జనపనార పీచుల మాదిరి మొరటుగా రూపాంతరం చెందాయి.

"అధిక ప్రసంగం చేస్తున్న మీ ఇద్దరినీ ప్రాణాలతో వదిలి పెట్టడం జరుగదు. మీ అవయవాలను నరికి అగ్నికి ఆహుతి చేస్తాను" అంటూ గదాధరుడి మీదికి ఎగబడింది ఆమె.

ఈసారి గదాధరుడి కంటే ముందుగా కదిలాడు శ్యామలుడు. ఎడమచేతిని జాచి ఆమె కేశసంపదను గట్టిగా పట్టుకున్నాడు. కుడిచేతిని పిడికిలిగా బిగించి బలంగా తల మీద కొట్టాడు.

గావురుమని అరిచింది వికృత రూపిణిగా మారిపోయిన కనకప్రభ. తలను చేతులతో అదుముకుంటూ నేలమీద చతికిలపడింది.

ఆమె కేశాలను వదిలి, తన కత్తిని అందుకున్నాడు శ్యామలుడు.

అంతవరకూ మౌనంగా ఉన్న నిమ్మతోట యువకుడు ఒక్కసారిగా ముందుకు వచ్చి, కనకప్రభకు అడ్డుగా నిలుచున్నాడు.

"వీరకుమారులారా... దయచేసి శాంతించండి" చేతులు జోడించి వేడుకున్నాడు.

"మీరు మానవులు కాదు... మానవ రూపంలో ఉన్న యక్ష రాక్షసులు. మీ మాటల్ని నమ్మటమే కాదు... వినటం కూడా ప్రమాదమే...." అన్నాడు శ్యామలుడు.

"కాదు... మేము యక్షులమే అయినా ఈ మా రూపాలు మాత్రం మానవ రూపాలే. నా భార్య విపిన శ్రేష్ఠి కుమార్తె కనక ప్రభను ఆవహించింది. నేను ఈ తోట యజమానిని ఆవహించాను" నిజం ఏమిటో చెప్పాడు అతను.

చెప్పటంతో ఆగలేదు. నిమ్మతోట యువకుడిలో నుంచి అవతలికి జరిగి తన నిజరూపంతో ప్రత్యక్షం అయ్యాడు.

భయంకరాకారం కలిగిన యక్షుడు అవతలికి పోయిన వెంటనే, స్పృహ తప్పి నేలమీద పడిపోయాడు నిమ్మతోట యువకుడు.

కనకప్రభ శరీరాన్ని వదిలేసింది యక్ష రాక్షసి... ఆమె కూడా తెలివి తప్పి నేలను కౌగలించుకున్నది.

"విపిన శ్రేష్ఠికి ఎంత అహంకారం ఉన్నదో ఈ కనక ప్రభకు కూడా అంతకు రెట్టింపు పొగరు ఉన్నది. నేను ఈ శరీరంలో ఉండటం వల్ల, నా భర్త ఈ యువకుడి శరీరాన్ని ఆవహించటం వల్ల మా ఇద్దరికీ ప్రేమ సంబంధం ఉన్నట్లు ప్రచారం జరిగింది. యదార్ధానికి వీరిద్దరి మధ్య అటువంటి బంధం ఏమీలేదు. తమ తోటకు కాపలా దారుడు అయిన ఈ యువకుడి మీద ఆమెకు సదభిప్రాయం లేనేలేదు" చిన్న కంఠంతో చెప్పింది యక్ష రాక్షసి.

"సామాన్యమైన మానవ కన్యకు చెందిన ఈ తోటలో ధూమశక్తి ఎక్కడి నుంచి వచ్చి చేరింది? మీరు దానికి కాపలా కాయవలసిన అవసరం ఎందుకు కలిగింది?" అంటూ మళ్ళీ మొదటికి వచ్చాడు గదాధరుడు.

ఆ ప్రశ్నకు యక్ష దంపతులు సమాధానం ఇవ్వకముందే "అరుగో... ఆ కట్టడం దగ్గిర ఉన్నారు. బంధించండి... ఎదురు తిరిగితే తలలు తరిగేయండి...." ఖంగుమంటూ వినవచ్చింది దండనాధికారి కంఠం.

అదిరిపడి అటుకేసి చూసిన స్నేహితులు ఇద్దరికీ బిలబిలలాడుతూ వచ్చి పడుతున్న రాజభటులు అనేకమంది కనిపించారు.

"మాటల్లో పడి ఈ ప్రమాదాన్ని గురించి మర్చిపోయామా మిత్రమా" తన కత్తిని అందుకుంటూ అన్నాడు గదాధరుడు – శ్యామలుడితో.

స్నేహితుడి మాటలు వినిపించుకోలేదు శ్యామలుడు. పరుగుపరుగున వస్తున్న రాజభటులను గురించి కూడా ఆలోచించటం లేదు. అతని చూపంతా తమ ఎదుట ప్రత్యక్షమై ఉన్న యక్షదంపతుల మీదనే కేంద్రీకరించి ఉన్నది.

చిటికెలువేసి చిత్రాలు చేయగలడు యక్షుడు. కంటికి కనిపించకుండా అదృశ్యరూపంలో వచ్చి ఎదుట ఉన్న శత్రువులను చీల్చిచెండాడగల శక్తిని కలిగి ఉన్నది అతని భార్య.

తోడేళ్ళగుంపు మాదిరి వస్తున్న రాజభటులను వాళ్ళు కూడా గమనించటం జరిగింది. గమనించిన తర్వాత వాళ్ళ ప్రవర్తన ఎలా ఉంటుంది?

తమ గొంతులు చినిగి పోయేటట్లు సింహనాదాలు చేస్తూ ఆ భటుల మీదికి లంఘిస్తారా? తలలు వంచుకుని తిరిగి తమ మానవ రూపాలలోకి దూరిపోతారా??

"కొట్టండి... నరకండి... బంధించటానికి వీలు పడకపోతే ప్రాణాలు బలి తీసేసుకోండి" వెనుక నుంచి తన భటుల్ని మరోసారి హెచ్చరించాడు దండనాధికారి.

ఆ ఆజ్ఞల్ని వినీ వినటంతోనే, శ్యామలుడు ఊహించినట్లుగానే చిటికెలో మటుమాయం అయిపోయారు యక్షదంపతులు. నేలమీద పడిపోయి ఉన్న మానవ శరీరాల్లోకి దూరిపోయారు.

గట్టుతెగిన వరద ప్రవాహం మాదిరి వేగంగా వచ్చేశారు రాజభటులు. కరవాలాన్ని సిద్ధంగా పట్టుకుని ఉన్న స్నేహితుల మీద కలబడ్డారు.

పాతికసంఖ్యకు కొంచెం అధికంగానే ఉన్నారు వాళ్ళు. కత్తుల్ని కలిగి ఉన్నారు వారిలో కొందరు.... పొడవాటి బరిశెల్ని పట్టుకుని ఉన్నారు మిగిలిన వాళ్ళు.

పది క్షణికాల పాటు కళ్ళు మూసుకుంటే వారందరినీ చెల్లాచెదురు చేయగల శక్తి తన జతగాడికి ఉన్నదని గదాధరుడికి తెలుసు. తాను వెనక్కి జరిగి, తల ఊపితే అతను ఒక్కడే ఒంటరిగా వారందరినీ చీల్చి చెండాడగలడని శ్యామలుడికి కూడా తెలుసు. ఇద్దరూ కలిసి విజృంభిస్తే మూడే మూడు క్షణికాల్లో పోరాటం అంతం అయిపోతుందని ఇద్దరికీ తెలుసు.

"ఏం చేద్దాం మిత్రమా...." అయినాసరే ఆత్రపడకుండా తన మిత్రుడిని అడిగాడు గదాధరుడు.

"ఈ నిమ్మతోట వ్యవహారం అంతా పెద్ద గందర గోళంగా ఉంది. అదేమిటో తెలుసుకోకుండా మనం గందరగోళాన్ని సృష్టిస్తే అది మరుగున పడిపోతుంది" అన్నాడు శ్యామలుడు.

"అయితే లేనిపోని ఆలోచనలతో మనం కలవర పడటం అనవసరం. చేతకాని వాళ్ళ మాదిరి పట్టుబడిపోదాం...." అన్నాడు గదాధరుడు.

"పట్టుబడి పోవటం పెద్ద సమస్య కాదు... పట్టుకున్న తర్వాత మనకి రాచమర్యాదలు చేస్తారు. కొరడాలతో ఒళ్ళు వాయగొట్టి నువ్వు చూసివచ్చిన చెరసాలలోకే పంపించి, తిండి పెట్టకుండా మాడ్చి చంపుతారు" అన్నాడు శ్యామలుడు.

"అయినా సరే... అంతకు మించి వేరే మార్గం లేదు...." అన్నాడు శ్యామలుడు.

మీదికి వచ్చిన భటుల్లో నలుగురి చేతుల్లో ఉన్న కత్తుల్ని గాలిలోకి ఎగర గొట్టాడు గదాధరుడు. ఇద్దరి దగ్గిర ఉన్న బరిశెల్ని ఎందుకూ పనికి రాకుండా మధ్యకు విరిచేశాడు.

తాను కూడా మరో నలుగుర్ని మట్టి కరిపించి, ఉన్నట్లుండి తన కత్తిని చేజార్చుకున్నాడు శ్యామలుడు.

"అయ్యయ్యో మిత్రమా... ఏమయింది నీకు?" ఆందోళనగా అడుగుతూ అతన్ని పరామర్శించబోయాడు గదాధరుడు.

ఛటా ఛటాఛట్ మంటూ అతని వెన్నుమీద పడ్డాయి నాలుగు దెబ్బలు. బాధను భరించలేకపోతున్నట్టు బిగ్గరగా అరిచాడు అతను... అరుస్తూ ఉండగానే క్రింద పడిపోయింది అతని ఆయుధం కూడా.

లెక్కకుమించిన శత్రువుల్ని జయించినట్లు ఆ ప్రదేశం దద్దరిల్లిపోయేటట్లు అరిచారు రాజభటులు అందరూ. ఒకేసారి మీద పడి వారిద్దరినీ నేలమీదికి నెట్టేశారు.

"భళీ భటులారా... భళీ... భళీ... చేతులు విరిచి కట్టి పడేయండి...." సంతోషంతో పరవశించిపోతూ ముందుకు వచ్చాడు దండనాధికారి.

క్రిందపడి ఉన్న నిమ్మతోట యజమానిని కూడా పట్టుకోమని సైగ చేస్తూ విపిన శ్రేష్ఠి కుమార్తె దగ్గర మోకరించి కూర్చున్నాడు.

అప్పుడే తనకు తెలివి వచ్చినట్లు, భయం భయంగా చూస్తూ లేచి కూర్చుంది ఆమె. దండనాధికారిని చూడగానే చటుక్కున తలను ప్రక్కకు తిప్పు కున్నది.

"శత్రువులు బంధింపబడ్డారు కనకప్రభా... నీకు వచ్చిన ప్రమాదం ఏదీలేదు. ఇప్పుడు నువ్వు హాయిగా నీ భవనానికి తిరిగి పోవచ్చు. ఇక్కడి

విషయాలన్నిటినీ నేను చూసుకుంటాను" ఆప్యాయంగా అభిమానపూర్వకంగా చెప్పాడు దండనాథికారి.

కాళ్ళూచేతులు కదలకుండా బంధింపబడి ఉన్న స్నేహితులిద్దరి వంకా ఒకసారిచూసి పైకి లేచింది ఆమె.

"తీసుకుపోండి... శ్రేష్ఠిగారి కుమార్తెను భద్రంగా ఇంటికి తీసుకుపోయి అతనికి అప్పగించండి" నలుగురు భటులను పిలిచి ఆమెను అప్పగించాడు దండనాథికారి.

తల వంచుకుని వారి వెంట ఆ తోట వెలుపలికి వెళ్ళిపోతున్న ఆమె వంకా, తమ మాదిరిగానే తిరిగి బంధితుడైన ఆమె భర్త వంకా ఒకసారి చూసి, శ్యామలుడికి కనుసైగ చేశాడు గదాధరుడు.

"నువ్వు ఊహించిందే యదార్థం మిత్రమా... ఈ తోట చుట్టూ సామాన్యమైన రహస్యం కాదు... చాలా పెద్ద రహస్యం కోటగోడ మాదిరి నిలబడి ఉంది. ఒకళ్ళు ఇద్దరు భటుల్ని కొట్టి దూరంగా తరిమేసినంత మాత్రాన అదేమిటో తెలియదు. లోతుగా విశ్లేషించాలి...." అన్నాడు.

ఆ మాటలు అర్థం కాలేదు అతన్ని తన ఆధీనంలో ఉంచుకున్న భటుడికి. బలంగా చేతిని ఎత్తి మరింత బలంగా అతని నోటి మీద కొట్టాడు.

"నిశ్శబ్దంగా నిలబడి ఉండకపోతే, ఇప్పటికిప్పుడు తెగి నేల మీద పడుతుంది నీ తలకాయ... జాగ్రత్త" అంటూ హెచ్చరించాడు.

పెదవులు చిట్లి ఎర్రటి రక్తం తన చుబుకం మీదికి జాలువారుతున్నా లెక్కచెయ్యకుండా చిరునవ్వు నవ్వాడు గదాధరుడు.

"మీ చేతులకు దొరకనే దొరికాము కదా అని లేనిపోని మాటలు మాట్లాడకు. నా తలను నేల మీదికి దొర్లించటం నీకు కాదు గదా, నీ ప్రభువైన దండనాథికారికి కూడా సాధ్యపడదు... జాగ్రత్తగా ఉండవలసింది నేను కాదు. నువ్వు" కరుకుగా అన్నాడు.

పెదవులు బిగించి మరోసారి చేతిని ఎత్తాడు ఆ భటుడు.

సరిగ్గా అదే సమయంలో వారి దగ్గరికి వచ్చాడు దండనాథికారి.

"నగరంలో శాంతి భద్రతల్ని పరిరక్షించవలసిన నన్నే ఎందుకూ పనికిరాని వాడి మాదిరి చిత్రించావు నువ్వు. భటులందరి ముందు చేతకాని వాడి మాదిరి

చూపెట్టావు. నీకు తగినశిక్ష నేను విధిస్తాను. ఈ దండనాధికారి దారికి అడ్డం పోకుండా ఉన్నట్లయితే ఎంతో బాగుండేదని నువ్వు అనుకునేటట్లు చేస్తాను" అంటూ భటుల వైపు తిరిగాడు.

"తీసుకుపోయి ఈ ముగ్గుర్ని మా భవనంలో ఉన్న నేలమాళిగలో బంధించండి. వారిని అక్కడికి తీసుకుపోయినట్లు ఎవరికీ తెలియకూడదు...." అంటూ ఆజ్ఞ ఇచ్చాడు.

కదలకుండా నిలబడి ఉన్న బంధితుల్ని నెట్టుకుంటూ తోట వెలుపలికి తీసుకుపోవటం మొదలుపెట్టారు భటులు.

"వాడు తోటలోనే నిలబడి ఉన్నాడు. అది చాలా ప్రమాదం. మనతోపాటు తోట వెలుపలికి వచ్చేయాలి...." భుజం మీది నుంచి వెనక్కిచూస్తూ, ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు నిమ్మతోట యువకుడు.

"నిన్ను అడ్డం తొలగించుకుని, తాను ఈ తోటకు యజమాని కావచ్చన్న ఆలోచన అతనికి ఇంకా ఎందుకు రావటంలేదో నాకయితే అస్సలు అర్థం కావటం లేదు" అన్నాడు గదాధరుడు.

మరోసారి అతని మెడమీద బలంగా కొట్టాడు వెనుక ఉన్న భటుడు.

"ఎన్నిసార్లు చెప్పినా నీకు జ్ఞానోదయం అవటం లేదు. నీకు దండనాధికారి చెప్పిన నేల మాళిగే సరయిన ప్రదేశం... మూడు రోజులపాటు అందులో బంధింపబడి ఉంటే నీ పొగరు దానంతట అదే అణిగిపోతుంది" అంటూ ముందుకు నెట్టాడు.

నాలుగు అశ్వశకటాల్లో వచ్చారు వారందరూ... బంధితుల్ని మొదటి శకటంలోకి నెట్టారు. మిగిలిన శకటాల్లో అందరూ సర్దుకుంటూ ఉండగా జరిగింది– ఎవరూ ఎదురు చూడని సంఘటన.

భటులు తోట వెలుపలికి పోయిన తర్వాత తాను కూడా వారి వెనుక అడుగులు వేస్తూ వేస్తూ తమకు దగ్గర్లో ఉన్న ఒక నిమ్మచెట్టు వైపు చూశాడు దండనాధికారి.

మిగలపండి, సువాసనలు వెదజల్లుతూ కనిపించాయి అతనికి క్రిందికి వాలి ఉన్న కొమ్మల మీదికాయలు.

చీకటి సమయంలో చెట్ల మీది కాయల జోలికిగాని, ఆకులు, పువ్వుల జోలికిగాని పోకూడదని పెద్దలు పెట్టిన కొన్ని నియమాల్ని మరిచిపోయి పుటుక్కున తెంపాడు అతను ఒక పెద్దకాయని.

రివ్వుమంటూ వీచటం మొదలైంది పెద్ద ఈదురు గాలి. కారుమబ్బులు కమ్మినట్లు కావురు కమ్మింది నిమ్మతోటపైన ఉన్న ఆకాశం...

ధబేల్మని శబ్దం చేస్తూ తెరుచుకున్నాయి కట్టడం తలుపులు. సుడులు తిరుగుతూ బయటికి వచ్చింది ధూమస్తంభం.

“వదిలి వేయండి. ఆ కాయను వదిలేసి బయటికి వచ్చేయండి. వచ్చేయండి” బిగ్గరగా అరిచాడు గదాధరుడి సరసనే ఉన్న నిమ్మతోట యువకుడు.

“మరేం ఫరవాలేదు మిత్రమా... ప్రమాదం ఏమీరాదు. ఎత్తి బురద గుంటలో పడిపోయేటట్లు కొడుతుంది. ప్రాణాలు తీయదు....” ఆ ధూమ స్తంభం చేయబోయేది ఏవిటో తనకు అనుభవపూర్వకంగా తెలిసి ఉండటం వల్ల చాలా నెమ్మదిగా అతనికి చెప్పాడు శ్యామలుడు.

“అయ్యా... మీరు వీరకుమారులు.. వయసులో ఉన్నటువంటి వారు. ఎంతటి దెబ్బ తగిలినా తట్టుకోగల శక్తి సామర్థ్యాలు మీకు ఉన్నాయి కాబట్టి మీకు ఎటువంటి చెడుపు జరగలేదు. దండనాధికారికి అహంకారం మాత్రమే అధికంగా ఉన్నది. శక్తి సామర్థ్యాలు చాలా తక్కువ....” భయం భయంగా అన్నాడు ఆ యువకుడు.

శ్యామలుడిని ఎలా చుట్టుముట్టిందో దండనాధికారిని కూడా అదే మాదిరి కమ్ముకున్నది ఆ ధూమస్తంభం... అమాంతంగా గాలిలోకి ఎత్తి మహావేగంగా తోట వెలుపలికి విసిరి వేసింది.

బురద గుంటలోనే పడ్డాడు అతను. అయితే తల్లక్రిందులుగా పడ్డాడు. తల నేలకు బలంగా పొడుచుకోవటంతో, ఫట్‌మని శబ్దంచేస్తూ, పచ్చి చెట్టుకొమ్మ మాదిరి విరిగిపోయింది అతని మెడఎముక.

చిటికెలో విగతజీవుడై పోయాడతను. చలనం లేకుండా ఉండిపోయాడు. హాహాకారాలు చేస్తూ అతని దగ్గరికి పరుగు తీశారు భటులు అందరూ...

* * * * *

“విక్రమ నగర పౌరులందరికీ నగర పాలకుల వారి హెచ్చరిక... హెచ్చరిక....”

యుద్ధభేరి వంటి పెద్దభేరీని వృషభ శకటం మీద కుదురుగా నిలబెట్టి, చెవులు చిల్లులు పడిపోయేటట్లు మ్రోగిస్తూ, నాలుగు వీధులూ ఒక చోట కలిసే కూడలి ప్రదేశంలోకి వచ్చి బిగ్గరగా అరిచాడు శకటం మీద ఉన్న భటుడు.

అప్పటికే ఆ ప్రదేశంలో గుంపులు గుంపులుగా నిలబడి ఉన్నారు పౌరులు. తూర్పుదిక్కు తెల్లబడుతున్న సమయంలో అందరికీ తెలిసింది తమ దండనాధికారి ఉన్నట్లుండి మృత్యువాత పడిన విషయం.

"నగరం వెలుపల ఉన్న ఆ తోటను నేను చాలాసార్లు గమనించాను. కనులు చెదిరిపోయేటట్లుంటాయి ఆ తోటలోని కాయలు" అంటున్నాడు ఒక గుంపులోని పౌరుడు.

"కళ్ళు చెదిరిపోయేటట్లు అవి కనిపిస్తూ ఉండే మాట యదార్థమే. అయితే ఆ కాయలు మన నగరంలో విక్రయించబడినట్లు ఎవరైనా చెప్పగలరా?" అన్నాడు ఇంకో పౌరుడు.

"నిజమే సుమా... నేను చూసింది లేదు. నాకు తెలిసిన వారెవరూ ఆ కాయల్ని విపణివీధి నుంచి తెచ్చుకున్నట్లుగా కూడా లేదు" అంటున్నాడు మరో పౌరుడు.

"వినండి... పౌరులారా... బహు జాగ్రత్తగా వినండి...." అంటూ మరోసారి బిగ్గరగా అరిచి అందరి దృష్టిని పూర్తిగా తనకేసి మరల్చుకున్నాడు శకటం మీద భటుడు.

సూది క్రింద పడినా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దం ఆ కూడలి ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

"నగరం వెలుపల ఉన్న నిమ్మతోట దగ్గర దండనాధికారి నాశనం అయిపోయిన సంగతి ఈసరికి మీకు అందరికీ తెలిసే ఉంటుంది" అరిచి చెప్పాడు ఆ భటుడు.

తలలు ఉపారు పౌరులు... కొందరు అయితే తమ చేతుల్ని గాలిలోకి ఎత్తి తమకు తెలిసినట్లు సైగలు చేశారు.

"దండనాధికారి మృత్యువుకు కారణం అయితే ఆ తోట సమీపంలోకి పోకూడదని శాసిస్తున్నారు" చెప్పాడు ఆ భటుడు.

"అది విపినశ్రేష్ఠి తోట. అతని పూర్వీకులు ఎవరో దాన్ని నాటించారట. ప్రస్తుతం అది ఆయన కుమార్తెకు చెందినటువంటిదని అందరూ అనుకుంటున్నారు" బిగ్గరగా అరిచాడు ఒక పౌరుడు.

"నీ అనుమానం ఏమిటి? నువ్వు చెప్పదలుచుకున్నది ఏమిటి?" కనులు చిట్లిస్తూ అతన్ని అడిగాడు శకటం మీది భటుడు.

"ఆ తోట దెయ్యాలకు స్థావరం అయినప్పుడు, అటువంటి ప్రమాదకరమైన ప్రదేశాన్ని కలిగివున్న శ్రేష్ఠిగారి సంగతి ఏమిటి?" ధైర్యంగా అడిగాడు ఆ పౌరుడు.

గుమికూడిన పౌరులందరి ముఖాల్లో ఆ సందేహమే కదలాడుతున్నట్లు అర్ధం అయింది భటుడికి.

"ప్రస్తుతం ప్రభువుల వారు శ్రేష్ఠిని విచారణకు పిలిపిస్తున్నారు. శ్రేష్ఠి నుంచి వివరణ పొందిన తర్వాత, మిగిలిన విషయాల మీద ఒక నిర్ణయం తీసుకుంటారు. పౌరులు ఎవరూ ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ఆ తోట దగ్గరికి పోకుండా ఉంటే ఎటువంటి ఆపదా ఎదురుకాదు...." చెప్పాడు అతడు. భేరిని తిరిగి పెద్దగా మ్రోగిస్తూ మరో కూడలి వైపు శకటాన్ని పోనిచ్చాడు.

* * * * *

"ప్రభూ... అమాయకుడిని నేను. అభం శుభం తెలియని ముద్దరాలు నా కుమార్తె. ఆ తోటలో జరిగిన దారుణానికి, మాకు ఎటువంటి సంబంధం లేదు...." వంగివంగి నమస్కారాలు చేస్తూ నగర పాలకుడికి చెప్పాడు విపినశ్రేష్ఠి.

"నీ కుమార్తె ఆ తోటలోని యువకుడిని వివాహం చేసుకోదలచిందని, ఆ విషయం నీకు అంగీకారం కాదని మాకు తెలిసింది" గంభీరంగా అన్నాడు నగరపాలకుడు.

"అసత్యం ప్రభూ... ఆ మాటలో నిజం లేదు. వట్టి కల్పితం" వెంటనే తన అభ్యంతరాన్ని తెలియ చేశాడు శ్రేష్ఠి.

"అలాగా... అయితే చీకటిపడిన తర్వాత ఆమె ఆ తోటలోకి ఎందుకు పోయినట్లో?" ప్రశ్నించాడు నగరపాలకుడు.

"తోట తనది అయినప్పుడు అక్కడికి పోవటంలో తప్పేమున్నది ప్రభూ?" ఎదురు ప్రశ్న వేశాడు శ్రేష్ఠి.

తలతిప్పి తన ప్రక్కనే ఉన్న మంత్రి వంక చూశాడు నగరపాలకుడు. "శ్రేష్ఠి చెప్పింది సవ్యంగా ఉన్నది ప్రభూ. మనం ఒకసారి ఆ తోటకు కాపలాగా నియమించబడిన యువకుడిని, అతనితో పాటు బంధించబడిన ఇద్దరినీ విచారించటం బాగుంటుంది" రహస్యంగా చెప్పాడు మంత్రి.

తల ఊపాడు నగర పాలకుడు.

"శ్రేష్ఠీ ఈ రోజుకు నువ్వు వెళ్ళిపోవచ్చు. తిరిగి నిన్ను మరోసారి పిలిపిస్తాం" అని శ్రేష్ఠికి చెప్పాడు.

తల వంచి నమస్కారం చేసి సభా భవనంలో నుంచి బయటికి వచ్చాడు శ్రేష్ఠి.

సభా భవనం వెలుపల గుంపుగా నిలబడి ఉన్నారు అనేకమంది వ్యక్తులు... సదాచార సంపన్నులైన బ్రాహ్మణులు వున్నారు వారిలో వికృతంగా కనిపిస్తున్న విజాయితీలు కూడా ఉన్నారు. అర్ధనగ్నంగా ఉన్న కాపాలికులు కూడా కనిపిస్తున్నారు.

"వీరు ఎవరు? ఎందుకు ఇక్కడ నిలబడి ఉన్నారు?" సభా భవనం దగ్గర కాపలాగా ఉన్న భటుల్లో ఒకతనిని ప్రశ్నించాడు శ్రేష్ఠి.

"మీ తోట దెయ్యాలతోట అంటున్నారు అందరూ... మంత్రాలు చదివి దాన్ని నాశనం చేయటానికి పిలిపించబడ్డారు వారందరూ" చిన్నకంఠంతో తనకు తెలిసింది చెప్పాడు ఆ భటుడు.

గుండెల మీది నించి కొండంత బరువు దిగిపోయినట్లు అనిపించింది శ్రేష్ఠికి "చిల్లిగవ్వ కూడా ఆదాయం రాని తోట అది. నాశనం అయిపోవటమే నాకు కావాల్సింది. శని వదిలిపోతుంది" తనలో తాను అనుకుంటూ తన శకటాన్ని ఎక్కి తన భవనానికి తిరిగి పోయాడు.

విశాలమైన భవనం విపిన శ్రేష్టిది. చుట్టూ అందమైన పూలతోట–తోట చుట్టూ ఎత్తయిన గోడలు– ప్రవేశద్వారం దగ్గిర కత్తులు పట్టుకుని ఉన్న నలుగురు సేవకులు – అదాటుగా చూసినప్పుడు అది అచ్చు నగరపాలకుడు నివశించే ప్రదేశం మాదిరిగానే కనిపిస్తుంది.

ప్రవేశద్వారం దగ్గర తన శకటంలో నుంచి దిగిన శ్రేష్టికి – దిగిన వెంటనే వినవచ్చాయి భవనంలోంచి పెద్దపెద్ద అరుపులు, కేకలు.

"అయ్యో... తోడులేకుండా చీకటిపడిన తరువాత నిన్న తోట దగ్గరికి పోయి వచ్చారు అమ్మాయిగారు... ఇందాకటి నుంచీ దెయ్యం పట్టినట్టు అరుపులు కేకలు... ఆపటం ఎవరి వల్లా కావటంలేదు..." ద్వారం దగ్గిరే ఉన్న సేవకులు వెంటనే విన్నవించారు అతనికి.

గుబగుబ లాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుని భవనంలోకి పోయాడు శ్రేష్ఠి. ముఖద్వారాన్ని అధిగమించి, విశాలమైన మందిరంలోకి అడుగుపెట్టిన వెంటనే పూనకం వచ్చినట్లు చిందులు తొక్కుతూ కనిపించింది అతని కుమార్తె.

“ఊరుకునేది లేదు... నా తోట దగ్గరికి ఎవరు వచ్చినా నేను సహించేది అంతకన్నా లేదు. నాశనం చేస్తాను... అందరినీ నిలుచున్న పళాన విరుచుకు తింటాను” జుట్టు విరబోసుకుని ఎగిరెగిరి పడుతూ గొంతు చించుకుని అరుస్తోంది.

“అమ్మా... ఆ తోట నీది. నీకు అంగీకారం కాకుండా అక్కడ ఏమీ జరగలేదు. శాంతించు తల్లీ... పెళ్లి కావాల్సిన కన్నెపిల్లవి. ఇలా గోలచేస్తే ఎవడు వస్తాడు నిన్ను మనువాడటానికి?” అనునయంగా అడిగాడు శ్రేష్ఠి.

“వాడే... ఆ తోటలో ఉన్నవాడే నాకు మొగుడు... వాడే నా భర్త... వేరెవడూ కాదో....” మరింతగా రెచ్చిపోతూ అరిచింది ఆమె.

“అయ్యా... తల ఊపి అవతలికి వెళ్ళిపోండి. ఎదురు చెప్పి రెచ్చగొట్ట కండి” చిన్న కంఠంతో శ్రేష్ఠిని హెచ్చరించింది ఒక పరిచారిక.

నగరపాలకుడి భవనం దగ్గర తాను గమనించిన అపరిచిత వ్యక్తులు అందరూ కనుల ముందు మెదిలారు శ్రేష్టికి. ఆ తోట సంగతి తేల్చుకోవటానికే వారందరినీ పిలిపించాడు నగరపాలకుడు... కావల్సిన పనేదో ఆయన చేతులు మీదుగానే జరుగుతుంది. తను ఆవేశపడటం, ఆత్రపడటం అనవసరం.

తలను ప్రక్కకు తిప్పుకుని ఆ మందిరంలో నుంచి, తన శయన మందిరంలోకి పోయాడు శ్రేష్ఠి.

విషణ్ణ వదనంతో ఒక ఆసనం మీద కూర్చుని ఉన్నది అతని భార్య.

“నీకు బుద్ధిలేదు. తోట అని చెప్పుకోవటానికి తప్ప మరెందుకూ పనికిరాని ఆ ప్రదేశాన్ని వదిలించుకుందామని ఎన్నిసార్లు నీకు చెప్పినా నువ్వు ఒప్పుకోలేదు. ఇప్పుడు చూడు ఏం జరుగుతున్నదో కోపంతో పళ్ళు బిగిస్తూ ఆమెను నిందించాడు శ్రేష్ఠి.

“అది వదిలించుకోవటానికి వీలు లేనిది. నాకు మా అమ్మ ఇచ్చింది. ఆమెకు ఆమె తల్లి ఇచ్చింది... పది పన్నెండు తరాల నుంచీ అది అలా కుమార్తెలకు ఇవ్వబడుతూ వస్తోంది. ఇవ్వటమే గాని, వదిలించుకోవటానికి వీలు లేదని ఆంక్ష....” గద్గద సర్వంతో చెప్పింది అతని భార్య.

"ఏమౌతుందిట వదిలించుకుంటే?" సమాధానం తెలిసి కూడా రెట్టించాడు శ్రేష్ఠి.

"వంశ క్షయం అవుతుందట. సర్వనాశనం జరిగి పోతుందిట."

ముందున్న మందిరంలో చిందులు వేస్తూ తన కుమార్తె అరుస్తున్న అరుపులు చెవుల్లో మార్మోగాయి శ్రేష్ఠికి... నగర పాలకుడు పిలిపించిన అపరిచిత వ్యక్తులు కూడా ఇంకోసారి కనుల ముందు మెదిలారు.

తోట నాశనం అయితే తన వైభవం కూడా పాడుబడి పోతుందేమోనన్న భయం అతని మనస్సులో అడుగు పెట్టి ఒళ్ళు జలదరించింది.

*　　*　　*　　*　　*

"ప్రమథ రాజ్యంలోని శంబర దేవత ఆలయానికి దారిని చూపించే వస్తువు ఒకటి నిమ్మతోటలోని కట్టడంలో నిక్షిప్తమై ఉంది. అదేమిటో ఎవరికీ తెలియదు. తెలుసుకోవటానికి మా గురుదేవుడు తరతరాలుగా ప్రయత్నం చేస్తూ వస్తున్నాడు. శ్రేష్ఠిగారి మాదిరిగా ఎవరైనా ఆలోచించి, ఆ తోటను నాశనం చేయటానికో, లేక పరాయి వారికి ధారాదత్తం చేయటానికో ప్రయత్నించకుండా నన్ను, నా భార్యను ఈ నగరానికి పంపించాడు. తోటలో పనిచేసే పనివాడిని నేను ఆవహిస్తాను. ఆ వంశంలో తోటకు వారసురాలిని నా భార్య ఆవహిస్తుంది. ఇలా ఇప్పటికీ తరతరాలుగా కొనసాగుతూ వస్తోంది...." శ్యామల గదాధరులకు చెప్పాడు నిమ్మతోట యువకుడు.

దండనాధికారి ప్రాణాలు వదలటం వల్ల, సరాసరి నగర కారాగారానికే తరలించబడ్డారు వారు ముగ్గురూ. ఒక మూలగా ఉన్న చీకటి గదిలో బంధించ బడ్డారు.

"పగటి సమయంలోనో, లేక మీ యక్షదంపతులు ఏమరుపాటుగా ఉన్నప్పుడో పరాయి వారెవరూ తోట మీదికి రాకుండా ఆ ధూమస్తంభంలోని భూతం కాపలా కాస్తూ ఉంటుంది. అంతేనా?" అడిగాడు గదాధరుడు.

తల ఊపాడు యువకుడు అంగీకార సూచకంగా.

"మరి ఆ వేదికమీది దేవత ఎవరు?" అడిగాడు శ్యామలుడు.

"మీరు చూసిన ధూమస్తంభానికి అధిష్ఠాన దేవత...."

"అంటే అర్థం ఏమిటి? ఆ బొమ్మను నాశనం చేయగలిగితే ధూమస్తంభం లోని భూతం కూడా నాశనం అయిపోతుందా?"

అవునన్నట్లు తల ఊపాడు యువకుడు.

నడుము మీద చేతులు వేసుకుని, ఒక గోడ దగ్గిర నిలబడిన శ్యామలుడి వంక నవ్వుతూ చూశాడు గదాధరుడు.

"అదీ సంగతి మిత్రమా... ఈ నిమ్మతోట కథకి మూలం ప్రమథ రాజ్యంలో ఉన్నది. ఆ మూలాన్ని వెతికే ప్రయత్నం మాత్రం ఈ తోటలోనే మొదలు పెట్టాలి" అతని దగ్గరికి పోతూ చెప్పాడు.

అంతవరకూ విషణ్ణ వదనంతో కూర్చుని ఉన్న యువకుడిలో వెంటనే కనిపించింది తీవ్రమైన ఆందోళన.

"మీరు ఎక్కువగా ఆలోచించవద్దు... మీకు మా తోటకు ఎటువంటి సంబంధము లేదు. కావాలంటే నేను మిమ్మల్ని ఈ కారాగారంలో నుంచి ఇప్పటి కిప్పుడు నగరం వెలుపలికి తీసుకుపోయి వదలగలను. తోటను గురించి మీరు మర్చిపోండి" గబగబా అన్నాడు.

"పరిచయం లేని మమ్మల్ని నువ్వు శ్రేష్ఠిగారి దుకాణంలోకి పోవద్దని ఎందుకు హెచ్చరించావు?" ఉన్నట్లుండి ఒక కొత్త ప్రశ్నవేశాడు గదాధరుడు.

"మీ వాలకం చూసిన వెంటనే నాకు ఆందోళన అధికం అయింది. శ్రేష్ఠి మిమ్మల్ని మోసం చేసి తీరతాడు. మీరు అందరి మాదిరిగా తలలు వంచుకుని అవతలకి పోరని నాకు అనిపించింది. అతనితో శత్రుత్వం వహిస్తారు. ఆ గడబిడలో నిమ్మతోట వ్యవహారం మీకు అవగతం అవుతుంది. అలా జరుగ కూడదని భావించాను. కానీ ఏదైతే జరగకూడదని అనుకున్నానో అది జరగనే జరిగింది...." బాధ నిండిన కంఠంతో చెప్పాడు.

"తోట నాశనం అయితే నీ పరిస్థితి, నీ భార్య పరిస్థితి ఏమిటి?" అడిగాడు గదాధరుడు.

"ప్రమథ రాజ్యంలో ఉన్న మా గురుదేవుడికి ఆగ్రహం కలుగుతుంది. మమ్మల్ని నాశనం చేస్తాడు." అన్నాడు యువకుడు.

అతను ఆ మాట అంటూ ఉండగానే, అతని ముఖకవళికలు వికృతంగా మారిపోయాయి. పగటి సమయం కావడం వల్ల తన నిజస్వరూపంతో యువకుడి

శరీరంలో నుంచి బయటికి రాలేకపోయాడు గాని, బాధను భరించటం అసాధ్యం అయిపోతున్నట్టు క్రిందపడి గిలగిలలాడసాగాడు.

"ఇప్పటిదాకా ఏడుపు ముఖంతో మాట్లాడటమే తప్ప, వేరే విధమైన బాధను అనుభవిస్తున్నట్లు కనిపించలేదు. ఏమై ఉంటుంది ఇతనికి?" ఆశ్చర్యంగా అంటూ ఆ గది తలుపుల దగ్గరికి పోయి, తలుపుల్ని దబదబమని మోదాడు గదాధరుడు.

పది క్షణికాల తరువాత అటుగా వచ్చాడు ఒక భటుడు.

"అతనికి ఏదో అయింది. వైద్య సహాయం అవసరం కావచ్చు. ఒకసారి వెలుపలికి తీసుకుపోయి చూడండి" చెప్పాడు గదాధరుడు.

పెద్దగా నవ్వి తల అడ్డం తిప్పాడు ఆ భటుడు. "మీ సంగతి మాకు బాగా తెలుసు. నగరపాలకుల వారు స్వయంగా వచ్చి ఆజ్ఞ ఇస్తే తప్ప మేము ఎటువంటి సహాయమూ చేయలేము...." అన్నాడు.

"అతని ప్రాణాలు పోతున్నట్లు కనిపిస్తోంది" అన్నాడు గదాధరుడు.

"మరీ మంచిది. విచారణ చేసి శిక్షను ప్రకటించే శ్రమ తగ్గిపోతుంది" అంటూ అవతలికి వెళ్ళిపోయాడు ఆ భటుడు.

"ఏం చేద్దాం మిత్రమా?" శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

క్రిందపడి మెలికలు తిరిగిపోతున్న యువకుడి దగ్గర మోకరించి కూర్చుని అతని భుజం మీద చెయ్యి వేశాడు శ్యామలుడు.

"తోట... తోట దగ్గిర ఏదో మంత్ర ప్రయోగం జరుగుతోంది. కట్టడం తలుపులు పగల గొట్టబడుతున్నాయి. ఇంతకాలం మేము పడిన శ్రమ వృధా అయిపోబోతున్నది...." పెదవులు బిగపడుతూ చెప్పాడు యువకుడు.

* * * * *

నగర పాలకుడి దగ్గిర్నించి విపినశ్రేష్ఠి తన భవనానికి తిరిగి వచ్చిన తరువాత కొద్దిసేపటికి తనంతట తనే శాంతించింది అతని కుమార్తె. ఒక ఆసనం మీద కూలబడి కనులు మూసుకున్నది.

బంగారు పాత్రలో చల్లటి పానీయాన్ని తెచ్చి, "తల్లీ... కొద్దిగా సేవించండి" అంటూ బ్రతిమాలింది పరిచారిక.

ఆ పాత్రను చేతిలోకి తీసుకున్నది కనకప్రభ... పెదవుల దగ్గర పెట్టుకోబోతూ ఉన్నట్లుండి అదిరిపడింది.

"ఏమయింది తల్లీ? మళ్ళీ ఏమి గుర్తుకు వచ్చింది?" ఆందోళన నిండిన కంఠంతో అడిగింది పరిచారిక.

"నాశనం అయిపోతోంది. నా తోట తగలబడి పోతున్నది...." అంటూ చేతిలోని పాత్రను అవతలికి విసిరికొట్టి భవనం వెలుపలికి పరుగు తీసింది కనకప్రభ...

"ఆపండి... ఆమెను వెంటనే ఆపి భవనంలోకి తీసుకు రండి" బిగ్గరగా అరిచింది పరిచారిక.

ఆవరణ ముఖద్వారం దగ్గర ఉన్న సేవకులకు వినిపించిందా అరుపు... చేతులు ఎడంగా జాచి, కనక ప్రభను అడ్డుకోవటానికి ప్రయత్నించారు వాళ్ళు.

పిడికిళ్ళు బిగించి ఎడాపెడా కొట్టింది ఆమె. చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరుస్తూ వీధిలోకి పరుగు తీసింది.

ఆమెను పట్టుకోవటానికి సేవకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నగర ద్వారాల దగ్గర ఉన్న రాజభటులు కూడా ఆమెను అడ్డుకోలేకపోయారు.

సుడిగాలి కంటే వేగంగా పరుగుతీసి నిమ్మతోటను చేరుకున్నది కనకప్రభ... నగర పాలకుడు పిలిపించిన బ్రాహ్మణులు, కాపాలికలు, అర్ధనగ్న శరీరాలతో ఉన్న అపరిచిత వ్యక్తులు అందరూ తోటలోని మట్టి కట్టడం దగ్గర అర్ధచంద్రాకారంలో నిలబడి ఏవేవో శబ్దాలను ఉచ్చారణ చేస్తున్నారు.

గొడ్డళ్ళు, పెద్దపెద్ద కత్తులు పట్టుకుని, విరగకాసి ఉన్న నిమ్మచెట్లను నిలువునా నరికి పోగులు పెడుతున్నారు అనేకమంది రాజభటులు.

కనకప్రభ తోటలోకి అడుగు పెడుతూ ఉన్న సమయంలోనే వికృత శబ్దాలు చేస్తూ విరిగి పడిపోయాయి కట్టడం తలుపులు.

గిరగిరా గిరగిరా తిరుగుతూ ప్రత్యక్షం అయి ఉండాల్సిన ధూమస్తంభం మాత్రం కనక ప్రభకు కనిపించలేదు.

"చండీ... ఎక్కడ ఉన్నావు? తోటను కంటికి రెప్పలా కాచుకుంటూ ఉండవలసిన కర్తవ్యం నీది? ఏమైపోయావు?" జీరపడిన కంఠంతో కీచుగా అరిచింది కనకప్రభ.

కనబడీ కనబడనట్లు కనిపించి అంతలోనే మాయమైపోయింది ఆమె కనులకు కట్టడంలో నుంచి బయటికి వచ్చే ధూమస్తంభం.

కట్టడం ముందు భాగంలో చిత్రవిచిత్రమైన ముగ్గులు లిఖించబడి ఉన్నాయి. వాటిమీదికి వచ్చి, అక్కడే నిలబడి పోయిందా శక్తి. అక్కడినించి బయటపడటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తూనే ఉన్నది కాని – ప్రయోజనం కనిపించటం లేదు.

అర్ధచంద్రాకారంలో నిలువబడి మంత్రపఠనం చేస్తున్న అపరిచిత వ్యక్తుల మధ్యలో నుంచి ఆ ముగ్గులు దగ్గరికి పోయేందుకు కదిలింది కనకప్రభ.

పది అడుగులు మాత్రమే వేసింది ఆమె. పదకొండో అడుగు వేయక ముందే, తల తిప్పి ఆమెను చూశాడు మంత్ర ప్రయోగం చేస్తున్న వారిలో ఒక కాపాలికుడు.

“ఆహ్హా... వచ్చింది... ఇక్కడి గడబిడలకు సూత్రధారిణి రానే వచ్చింది. మానవరూపంలో ఉన్న యక్షిణి అది....” అంటూ గిరుక్కున ఆమెకేసి తిరిగి, అంతకు ముందు చేస్తున్న మంత్ర పఠనాన్ని వదిలి, కొంగ్రొత్త మంత్రాలను చదవటం మొదలు పెట్టాడు.

చీకటిపడిన తరువాత గాని, శ్రేష్ఠి కుమార్తెను వదిలి, వెలుపలికి రాలేని యక్షిణి జుట్టు పట్టుకుని తనను ఎవరో బలవంతంగా బయటికి లాగినట్లు, ఇవతలకు వచ్చేసింది.

“భళీ కాపాలికా... బహుభళీ... మూల కారణాన్ని చిటికెలో కని పెట్టేశావు. నాశనం చేసెయ్... సర్వనాశనం అయిపోవాలి” ఆనందాన్ని అణుచుకోవటం అసాధ్యం అయిపోతున్నట్లు పెద్దగా అరిచాడు మరో అపరిచిత వ్యక్తి.

మదిరా పానం చేస్తున్నట్లు అటూ ఇటూ ఊగిపోతున్నది కనక ప్రభను వదిలి ఈవలకు వచ్చిన యక్షిణి. తనను వశపరుచుకుని ఉన్న ఆ భయంకరాకారం, తనలోనుంచి వేరుపడిన వెంటనే నేలకూలి పోయింది కనక ప్రభ. స్పృహను కోల్పోయింది.

“రారోయ్ మగడా... నా అంతం చూసే ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. త్వరగా వచ్చి నాకు సహాయం చేయ్...” తూలుతూనే అరిచింది యక్షిణి.

"అనుకున్నానే... నేను అనుకుంటూనే ఉన్నాను. నీకు మగతోడు ఉండి ఉంటుందని నిన్ను చూడగానే ఊహించాను" అంటూ మరింత బిగ్గరగా మంత్ర పఠనం మొదలుపెట్టాడు కాపాలికుడు.

*   *   *   *   *

"మిత్రమా... ఇతని వేదనను నేను చూడలేకపోతున్నాను. ఏదో ఒకటి చేసి తీరాలి... చేతకాని వారి మాదిరి నిలబడి ఉండటం నాకు చేతకావటం లేదు" క్రిందపడి గిలగిలలాడుతున్న నిమ్మతోట యువకుడిని చూస్తూ శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

"చేయటానికి ప్రత్యేకంగా ఏమీ లేదు. ఇతన్ని ఇక్కడినించి తప్పించి తోట దగ్గరికి తీసుకుపోవటమే" అన్నాడు శ్యామలుడు.

తోట దగ్గరికి ఇతన్ని తీసుకుపోవటం అంటే... అక్కడ ఉండే వారితో తాము తగువు పడటమే అని తెలుసు గదాధరుడికి.

"ఒకళ్ళు ఇద్దరు అయితే ఏదో ఒక విధంగా మనం తగువు పెట్టుకోవచ్చు. ఇప్పుడు ఈ వ్యవహారం దండనాధికారి స్థాయిని దాటి నగర పాలకుడి దాకా వెళ్ళిపోయింది. నగర పాలకుడితో వ్యవహారం అంటే – నగరం మీద దాడి చేయటం వంటిది. అతని బలగం అంతా వచ్చి పడుతుంది. తట్టుకోవటం కష్టం అవుతుంది" సాలోచనగా అన్నాడు గదాధరుడు.

"అన్నీ తెలిసిన వాడివి కదా... ఆలోచించు మరి" అన్నాడు శ్యామలుడు.

"ఏది ఆలోచించాలన్నా ముందుగా ఈ చెరసాలలో నుంచి బయటపడాలి కదా" అంటూ ఆ గది తలుపుల దగ్గరికి పోయాడు గదాధరుడు.

తుప్పుపట్టి కాంతి విహీనంగా కనిపిస్తున్నాయి తలుపులకు బిగించి ఉన్న ఇనుప ఊచలు... గట్టితనం ఎంత ఉంటుందో... చూడటం కోసం వాటిని పట్టుకుని, గట్టిగా ఊపబోయాడు అతను.

సరిగ్గా అప్పుడే చెవులు చిల్లులు పడి పోయేటట్లు అరిచాడు క్రింద పడి ఉన్న నిమ్మతోట యువకుడు. "వస్తున్నా... వస్తున్నా... వచ్చేస్తున్నా..." అంటూ నీటిలో నుంచి ఒడ్డున పడిన చేప మాదిరి ఎగిరెగిరి పడ్డాడు.

తలుపులకున్న ఇనుప ఊచల బలాన్ని అంచనా వేసే ఆలోచనను మర్చిపోయి ఆశ్చర్యంగా చూశాడు గదాధరుడు అతనివంక...

చీకటి సమయంలో తప్ప వెలుగు ఉండగా తాను ఆవహించి ఉన్న శరీరంలో నుంచి వెలుపలికి రాలేని యక్షుడు – తన కేశాలను పట్టుకుని ఎవరో బలవంతంగా బయటికి లాగుతున్నట్లు ఒక్కసారిగా వెలుపలికి వచ్చి పడ్డాడు.

“ఏమయింది యక్షుడా... ఏం జరిగింది??” అంటూ అతనికి ఎదురుగా నిలబడబోయాడు గదాధరుడు.

పెదవులు బిగించి భయంకరంగా హూంకారం చేశాడు ఆ యక్షుడు. పిడికిలితో అతని గుండెల మీద బలంగా మోదాడు.

ఊపిరి ఆగిపోయినంత పని అయింది గదాధరుడికి. గుండెల్ని అదుము కుంటూ వెనక్కి తూలాడు.

ఆ దృశ్యాన్ని చూసీ చూడగానే ఎర్రబడిపోయాయి శ్యామలుడి కను కొలకులు. పళ్ళు బిగించి తాను కూడా ఆ యక్షుడి మీద కలబడబోయాడు.

అతని వైపు చూడను కూడా చూడలేదు యక్షుడు... వేగంగా కదిలాడు. దృఢంగా బిగించి ఉన్న తలుపుల్ని భుజాలతో ఢీ కొట్టాడు.

గోగు పుల్లలతో చేయబడి ఉన్నట్లు పుటుక్కున విరిగి పోయాయి తలుపులకు ఉన్న ఊచలు... విరిగి ఆవల పడిపోయాయి తలుపులు.

తోటలోని కట్టడం నుంచి వెలుపలికి వచ్చే ధూమస్తంభం మాదిరిగానే, అతివేగంగా గదిలో నుంచి బయటికి పరుగు తీశాడు యక్షుడు.

“మిత్రమా... మంచి అవకాశం... కాపలా భటులు అందరూ యక్షుడిని అడ్డుకోవటానికి ప్రయత్నం చేస్తారు. మన గురించి పట్టించుకునే వారెవరూ ఉండరు” అంటూ గదిలో నుంచి తాను కూడా బయటికి పరిగెత్తాడు గదాధరుడు.

*　　　*　　　*　　　*　　　*

“ఆగు... ఆగు ఆగిపో” అని కేకలు పెడుతూ యక్షుడిని అడ్డుకోవడానికి ఆయుధాలతో సహా ప్రయత్నాలు ప్రారంభించారు కారాగార రక్షకులు.

నిర్మొహమాటంగా అందరినీ చెల్లాచెదురు చేసేశాడు యక్షుడు.

“మూసివేయండి. ముఖద్వారాలను మూసి గడియ పెట్టండి” అని వెలుపల ఉన్న భటులను హెచ్చరించారు కొందరు రక్షకులు.

కిరకిర శబ్దాలు చేస్తూ మూత బడటం మొదలుపెట్టిన అటువంటి ద్వారాలు మూడింటిని సర్వనాశనం చేసేశాడు యక్షుడు. మూకుమ్మడిగా వచ్చిన

ముప్పది మంది భటుల తలలను వ్రయ్యలు చేసి కారాగార భవనంలో నుంచి బయట పడ్డాడు.

ఎవరి పనుల మీద వారు అత్యవసరంగా అటూ ఇటూ సంచరిస్తున్నారు రాచవీధుల్లో పౌరులు అందరూ. పరుగుపరుగున వస్తున్న యక్షుడిని చూసి భీతావహులై దూరంగా పారిపోయారు కొందరు. అడ్డుకోవటానికి ప్రయత్నం చేసి, కారాగార రక్షకుల మాదిరిగానే తెలివి తప్పి పడిపోయారు మరికొందరు.

క్షణికం పాటు కూడా ఎక్కడా కుదురుగా నిలబడటం లేదా యక్షుడు. వేగంగా నగర ద్వారాల దగ్గరికి పోతూనే ఉన్నాడు.

అతని మాదిరిగానే కారాగారం వెలుపలికి పరిగెత్తుకు వచ్చిన గదాధరుడికి ఎందుకో వచ్చింది ఒక అనుమానం.

"మిత్రమా... మిత్రమా..." అని పిలుస్తూ వెనక్కి చూశాడు.

తనతో పాటుగా పరిగెత్తుకుంటూ రావాల్సిన శ్యామలుడు తన వెనుక లేక పోవడం కనిపించింది అతనికి. చలిగాలి వీచినట్లు జలదరించింది శరీరం.

"ఏమైపోయావు మిత్రమా... ఎక్కడ నిలబడిపోయావు??" అని పిలుస్తూ, ఎంత వేగంగా వెలుపలికి వచ్చాడో, అంతే వేగంగా మళ్ళీ లోపలికి పోయాడు.

తాము ఏ గదిలో నుంచి బయటికి వచ్చారో, ఆ గదికి పది అంగల ఇవతలగా కనిపించాడు అతనికి శ్యామలుడు. తెలివితప్పి పడిపోయి ఉన్న నిమ్మతోట యువకుడికి తెలివిని రప్పించే ప్రయత్నం చేస్తున్నాడు.

"అవతల ఆ యక్షుడు నగర ద్వారాల్ని అధిగమించి తోట దగ్గరికి పరిగెత్తుతున్నాడు. ఏం చేస్తాడో తెలియదు... ఏం జరుగబోతున్నదో అంతకన్నా తెలియదు... నువ్వు ఇక్కడ తీరుబడిగా–" అని నిందించబోయి – ఆఖరిలో మాటల్ని మింగేశాడు గదాధరుడు.

యక్షుడు అవతలికి పోయిన వెంటనే మామూలు మానవుడిగా మారిపోయిన యువకుడు చిన్నగా శబ్దం చేసి కళ్ళు తెరవడమే అందుకు కారణం.

"నీ తోట దగ్గిర గందరగోళం జరుగబోతున్నది. ఆ గడబిడ ఫలితం ఎలా ఉన్నా, ఇక ముందు నీకు ఆ తోటలో అడుగుపెట్టే అవకాశం ఉండదు" అతనికి చెప్పాడు శ్యామలుడు.

"అది కాకపోతే మరొక తోట... శ్రమ పడటానికి సిద్ధంగా ఉన్న వాడిని నేను... ఏ తోట అయినా ఒకటే..." అన్నాడు యువకుడు.

"మరి శ్రేష్ఠిగారి కుమార్తె కనకప్రభ..." అని గుర్తు చేయబోయాడు గదాధరుడు.

"నా యజమాని కుమార్తె..." అన్నాడు అతను.

ఒకరి వంక ఒకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు స్నేహితులు ఇద్దరూ.

కనకప్రభతో తన అనుబంధాన్ని పూర్తిగా మరిచిపోయినట్లు ఉంది అతని సమాధానం... అది ఎలా సాద్యం?

"యక్షుడు ఇతన్ని పూర్తిగా వదిలివేసినట్లు అనిపిస్తోంది. అతని ప్రభావం ఎంతో కొంత ఇతని మీద ఉంటేగాని, అటువంటి విషయాలు మనస్సులో నిలబడి ఉండవు" తన అభిప్రాయాన్ని తెలియచేశాడు గదాధరుడు.

తెలియచేయటంతో ఆగలేదు అతను. తన దుస్తుల్ని తడుముకున్నాడు. కారాగారంలోకి రాగానే వారి ఆయుధాలను, వారి వద్ద ఉన్న నాణేల మూటల్ని నిర్మొహమాటంగా స్వాధీన పరుచుకున్నారు కారాగార రక్షకులు.

"ఒక్కక్షణికం ఆగు మిత్రమా..." అంటూ తన ఎదుట వున్న మంది రాన్నంతా కలియతిరిగి, ఒక ప్రక్కగా ఉన్న పెద్ద మందసాన్ని వెతికి పట్టుకున్నాడు అతను... అందులోనే అతనికి కనిపించాయి తమ ఆయుధాలు... తమ ధనపు సంచులు కూడా వాటితోనే ఉన్నాయి.

అన్నిటినీ తీసుకుని వెనక్కి వచ్చాడు అతను. రెండు ధనపు సంచుల్ని యువకుడికి అందించాడు.

"కనకప్రభ మీద నీకు ఎటువంటి ఆపేక్ష లేనప్పుడు ఇంకా ఈ నగరంలోనే ఉండటం అనవసరం... నిమ్మతోట లేనిపోని గడబిడలకు కారణభూతమయింది. నగర పాలకుడు వదిలిపెట్టినా మేము దాన్ని వదలబోవటం లేదు. కాబట్టి నువ్వు నీ పాదాలకు బుద్ధి చెప్పటమే బాగుంటుంది" అన్నాడు.

రెండవ మాట మాట్లాడలేదు ఆ యువకుడు. అతను అందించిన నాణేల సంచుల్ని రొంటిన దోపుకుని, చకచకా ఆ భవన సముదాయంలో నుంచి బయటికి వెళ్ళిపోయాడు.

"మనం మళ్ళీ నగర పాలకుడి భటులకు దొరికి పోకుండా ఉండాలంటే ఒక గొప్ప ఘనకార్యం చేయవలసి ఉంటుంది" అంటూ కారాగారపు గదుల్లో

బంధితులు అందరినీ బయటికి లాగాడు గదాధరుడు. యక్షుడి దెబ్బకు తల్లక్రిందులు అయిపోయిన రక్షకుల వద్ద ఉన్న తాళం చెవులను వెతికి గదులన్నిటినీ తెరిచాడు.

అటువంటి అవకాశం మళ్ళీ మళ్ళీ లభించదని తెలిసిన బంధితులు అందరూ బిలబిలలాడుతూ వీధుల వెంట పరుగులు తీశారు.

వారందరితో పాటు తాము కూడా వీధుల వెంట నడిచి, నగర ద్వారాలను అధిగమించారు స్నేహితులు ఇద్దరూ.

* * * * *

"రారా... ఆలస్యం చేస్తే నా ఆగ్రహ జ్వాలల్లో పడి మాడి మసి అయిపోతావు... రా" ఖంగుఖంగుమంటున్న కంఠంతో పిలుస్తున్న కాపాలికుడి దగ్గరికిపోయి, అతనిమీదికి లంఘించబోయాడు యక్షుడు.

"వెలుపలకు రా. నీ ధూర్తా లక్షణం ఎటువంటిదో మాకు బాగా తెలుసును"అంటూ మరో మంత్రమేదో చదివాడు ఆ కాపాలికుడు.

అప్పుడే ఆ తోటలో ఉన్న ఆఖరి నిమ్మచెట్టును నేల కూల్చారు నగర పాలకుడి అనుచరులు. గింగిరాలు తిరుగుతూ నేల వాలిపోయాడు యక్షుడు. అతని మాదిరిగానే అడ్డదిడ్డంగా పడిపోయింది యక్షిణి. కాపాలికుడి మంత్ర పఠనం పూర్తి అయిన మరుక్షణం భగ్గుమంటూ వారి శరీరాల మీద ప్రత్యక్షం అయింది పెద్దమంట... చూస్తూ చూస్తూ ఉండగానే పెద్ద బూడిద గుట్టగా మారిపోయారు వారిద్దరూ.

అపరిచిత వ్యక్తులు అందరూ కలిసి రచించిన ముగ్గుల మీద నిలబడి గిలగిల లాడుతున్నది ధూమస్తంభం.

యక్షదంపతులు అగ్నికి ఆహుతి అయిపోతున్న సమయంలోనే విరిగి పడిపోయాయి కట్టడపు తలుపులు. గుంపుగా లోపలికి పోయిన మంత్రవాదులకు కనిపించింది వేదిక మీద ప్రతిమ.

రెండవ ఆలోచన లేకుండా ఆ ప్రతిమను ఎత్తి నేలకేసి కొట్టారు వాళ్ళు. అది ముక్కలు ముక్కలు అయిపోయిన వెంటనే ముగ్గుల మీది ధూమస్తంభం కూడా మటుమాయం అయిపోయింది.

భూకంపం వచ్చినట్లు దడదడలాడింది కట్టడం... ఉన్నట్లుండి వినవచ్చింది పెద్ద ప్రేలుడు శబ్దం.

ఒకరి కాళ్ళకు ఒకరు అడ్డుపడకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ బయటికి పరిగెత్తారు అపరిచిత వ్యక్తులు అందరూ.

ముఖద్వారాన్ని అధిగమించి, తాము ధూమస్తంభాన్ని కట్టడి చేసేందుకు రచించిన ముగ్గుల దగ్గరికి వచ్చే సమయంలో, మరింతగా కంపించింది నేల...

అందరూ చూస్తూ ఉండగానే రెండుగా చీలింది. యక్ష దంపతులను నాశనం చేసిన కాపాలికుడితో సహా అందరూ ఆ చీలికలో పడిపోయారు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో తిరిగి ఒకటిగా కలిసిపోయిందా చీలిక.

తెలివితప్పి పడిపోయి ఉన్న కనకప్రభ... నిమ్మ చెట్లను నరికే నగర పాలకుడి భటులు తప్ప మరెవ్వరూ కనిపించకుండా పోయారు ఆ ప్రదేశంలో.

కనులు తేలవేసి ఉన్న కనకప్రభను భుజాల మీద వేసుకున్నాడు ఒక భటుడు. మిగిలిన వారందరితో కలిసి నగరం వైపు పరుగు మొదలు పెట్టాడు.

*　　*　　*　　*　　*

"తోట లేదు... తోట మొదట్లో కట్టడం లేదు. కోయటానికి వీలుపడని పంట లేదు. ఆ పంటకు కాపలాగా ఉన్న అమాయక యువకుడు. అతన్ని వేధించుకు తిన్న యక్ష రాక్షసులు అందరూ మటుమాయం అయిపోయారు..." చీకటి పడుతున్న సమయంలో తోట ఉండిన ప్రదేశం దగ్గిరికి వచ్చి, చుట్టూ కలియ చూస్తూ అన్నాడు గదాధరుడు.

అతని మాదిరిగానే హాయిగా నిట్టూర్చాల్సిన శ్యామలుడు మాత్రం చిరాకుగా తల విదిలించి దగ్గిర్లో ఉన్న ఒక బండరాయి మీద కూర్చున్నాడు.

"ఈ నగరంలోకి వచ్చిన తర్వాత మనకు సంబంధించని వ్యవహారంలో చిక్కుకుని నానా బాధలు పడ్డాము. ఇక ఇక్కడ తాత్సారం చేయడం అనవసరం... మన దారిన మనం వెళ్ళిపోదాము" అతని మనస్సులోని ఆలోచనలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు గదాధరుడు.

"అసలు విషయం అలాగే ఉండిపోయింది కదా మిత్రమా" అన్నాడు శ్యామలుడు.

"అనుకుంటూనే ఉన్నాను మిత్రమా... నువ్వు ఈ విధంగా మాట్లాడతావని నేను భయపడుతూనే ఉన్నాను..." ముఖం మీద అరచేత్తో గట్టిగా చరుచుకుంటూ నిష్టూరంగా అన్నాడు గదాధరుడు.

"ఎక్కడో ఏదో దేశంలో ఉన్న ఒక ఆలయానికి సంబంధించిన కొన్ని గుర్తులు ఈ దేశంలో ఉండటం ఏమిటో – నీకు విచిత్రంగా అనిపించటం లేదా?" అడిగాడు శ్యామలుడు.

"అనిపిస్తోంది మిత్రమా. కాని అది జరిగిపోయిన కథ... ఇంత దూరం వచ్చిన తర్వాత, ఇన్ని సంఘటనలు జరిగిన తర్వాత మళ్ళీ ఆ విషయాలను తవ్వి తలకు ఎత్తుకోవడం అవసరమా?" చిరుకోపంతో అడిగాడు గదాధరుడు.

"సమాధానం లభించని ప్రశ్నలను ఊరికే వదిలి వేయటం నాకు నచ్చదు..." ముక్తసరిగా అన్నాడు శ్యామలుడు.

అంతకుముందు ఆ రోజు ఉదయం వరకూ పచ్చని చెట్లతో, మిగల పండిన కాయలతో కనులకు ఇంపుగా ఉన్న తోట మటుమాయం అయిపోయింది. నరికి వేయబడ్డాయి చెట్లు. చెల్లాచెదురుగా పడి ఉన్నాయి కొమ్మలకు ఉండేకాయలు... చెక్కల కట్టడం అయితే – ఆనవాలు కూడా లేకుండా అదృశ్యం అయిపోయింది.

నడుము మీద చేతులు వేసుకుని ఆ ప్రదేశాన్నంతా కలియ చూశాడు గదాధరుడు.

ఉన్నట్లుండి బండరాయి మీది నుంచి లేచి, అతని చేతిని పట్టుకున్నాడు శ్యామలుడు. "ఏమయింది మిత్రమా... ఏమిటి సంగతి?" అని అడుగుతున్నా వినిపించుకోకుండా అవతలికి లాక్కుపోయాడు.

అంతకుముందు తోట మొదట్లో ఉన్న చెక్కల కట్టడం వెనుక భాగంలో ఉన్నది ఒక పెద్దబండరాయి. స్నేహితుడితో సహా ఆ రాయి వెనుక ఒదిగి నిలుచున్నాడు అతను.

అంత హడావిడి దేనికో రెండు క్షణికాల తరువాత తెలివిడి అయింది గదాధరుడికి.

నగర పాలకుడి భటులు తీసుకువచ్చి తనకు అప్పగించిన తన కూతురితో సహా, తన భార్యను వెంట బెట్టుకుని అశ్వశకటంలో అక్కడికి వస్తున్నాడు విపిన శ్రేష్ఠి.

అశ్వశకటం పూర్తిగా ఆగకముందే అందులో నుంచి క్రిందికి దిగి తోట ఉండే ప్రదేశంలోకి వచ్చింది శ్రేష్ఠి సతీమణి.

"తరతరాల క్రిందట మా పూర్వీకులు అప్పచెప్పిన బాధ్యతను నేను సక్రమంగా నిర్వహించలేకపోయాను. నేను బ్రతికి ఉండగానే ఈ ఉద్యానవనం నాశనం అయిపోయింది" కన్నీరు విడుస్తూ గద్గద కంఠంతో బిగ్గరగా అన్నది.

"ఈ తోట నాశనం అయిపోవటం మనకి మంచిదే అయింది. నగర పాలకుడి అనుమతితో మనబిడ్డను ముందుగా అనుకున్న ప్రకారం దండనాధికారి కుమారుడికిచ్చి వివాహం చేయవచ్చు..." వెనుకగా వచ్చిన శ్రేష్ఠి ఆమెను సముదాయించాడు.

పమిటెచెంగుతో కన్నీటి చారికలను తుడుచుకుంటూ తన కుమార్తె వైపు చూసింది ఆమె.

అంతకుముందు రోజుల్లో అటువంటి మాట చెవుల పడితే తోకతొక్కిన పాములా గోలగోల చేసే ఆ బాలిక – ఇప్పుడు చిరునవ్వుతో తలను ప్రక్కకు తిప్పుకున్నది.

ఆనందం అయిపోయింది శ్రేష్ఠికి. "రేపు సూర్యోదయం అయిన వెంటనే నగర పాలకుల వారి దగ్గరికి పోయి అనుమతిని అర్థిస్తాను" అంటూ వెనుతిరిగాడు. ఆయనతో పాటు అశ్వశకటం వైపు అడుగువేయబోయిన తమ కుమార్తె చేతిని పట్టుకున్నది శ్రేష్ఠి సతీమణి.

"తోట నాశనం అయిపోయిన తర్వాత ఇకముందు దాన్ని మన సంతానానికి అప్పగించాలన్న మాటకు అర్థం లేదు...." అంటూ, కుమార్తె మెడలో ఉన్న ఒక పచ్చలహారాన్ని తాను స్వాధీన పరుచుకున్నది.

"అందంగా ఉన్న ఈ ఆభరణం అంటే నీకు అమితమైన మక్కువ... తీసి వేయటం దేనికి?" అమాయకంగా అడిగింది కుమార్తె.

"ఈ తోట మీద మనకున్న బాధ్యతను గుర్తు చేసే ఆభరణం ఇది. ఇక మీదట మంచి జరిగినా, చెడు జరిగినా ఇది మన ఆధీనంలో ఉండకూడదు. దాన్ని గురించి నువ్వు మర్చిపోవడం చాలామంచిది" అంటూ ఆ ఆభరణాన్ని బలంగా అవతలికి విసిరివేసింది తల్లి.

అది ఎక్కడ పడిపోయిందో చూడను కూడా చూడలేదామె. కుమార్తె చేతిని పట్టుకుని అశ్వశకటం వైపు తీసుకుపోయింది.

గింగిరాలు తిరుగుతూ వచ్చి ఆమె విసిరిన ఆభరణం తాము తల దాచుకున్న బండరాయికి సమీపంలోనే పడటాన్ని గదాధరుడు గమనించాడు. అశ్వశకటం దృష్టి పథం నుంచి దూరం అయిపోయిన వెంటనే బండచాటు నుంచి వచ్చి, ఆ హారాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

విలువ చాలా హెచ్చుగా కలిగి ఉండే ఆభరణమే అది. కాని, అతి సామాన్యమైనటువంటిది. మంత్రశక్తులు గానీ, మహిమల్ని వెలువరించే లక్షణాలు గానీ దానిలో ఉన్నట్లు అనిపించటం లేదు.

"ఏమంటావు మిత్రమా? నీ అభిప్రాయం ఏమిటి?" శ్యామలుడిని అడిగాడు అతను.

"నీకంటే అధికమైన తెలివితేటలు కలిగిన వాడిని కాదు. నీకు తెలియని రహస్యాలు నాకు తెలుసని అనుకోవడం వట్టి భ్రమ..." నవ్వుతూ చెప్పాడు శ్యామలుడు.

తనను తన తెలివితేటల్ని అతను పొగడటమో, మెచ్చుకోవటమో జరిగిందని సంతోషించలేదు గదాధరుడు. "వేళాకోళాలు కట్టిపెట్టి నువ్వు చెప్పేది ఏమిటో వెంటనే చెప్పు..." అంటూ ఒత్తిడి చేశాడు.

"తరతరాలనుంచీ తమ దగ్గిర ఉంటూ వస్తున్నదీ ఆభరణమనీ, ఇది ఈ తోట యజమానిత్వానికి సూచిక అనీ శ్రేష్ఠి భార్య వాపోయింది" అన్నాడు శ్యామలుడు.

"అంటే దీనికి, ఈ తోటకి సంబంధం ఏదో ఉన్నది" అన్నాడు గదాధరుడు.

"తోటకి ఈ తోటలోని పంటకు పెద్ద సంబంధమే ఉన్నది. మిగల పండి పోయిన కాయల్లో ఏ ఒక్కటి కూడా రాలి క్రింద పడలేదు. కనీసం కుళ్ళి పాడయిపోయిన లక్షణాలు కూడా నాకు అనిపించలేదు" తాను వంటరిగా తోట దగ్గిర నిలబడి ఉన్న సమయాన్ని గుర్తు చేసుకుంటూ అన్నాడు శ్యామలుడు.

తీవ్రంగా ఆలోచించాడు గదాధరుడు... శ్రేష్ఠి సతీమణి అవతలికి విసిరిన ఆభరణాన్ని చేతిలో గిరగిరా తిప్పుతూ, అటూ ఇటూ పచార్లు చేయటం మొదలు పెట్టాడు.

మాయమైపోయిన చెక్కల కట్టడంలో శంబర దేవత ఆలయానికి దారిని చూపించే వస్తువు ఒకటి నిక్షిప్తమై ఉన్నదని యక్షుడు తనని ఆవహించి ఉన్నప్పుడు నిమ్మతోట యువకుడు చెప్పిన మాటలు శ్యామలుడి చెవుల్లో మార్మోగుతున్నాయి.

ఇప్పుడు తోట లేదు. తోటలోని ఆ కట్టడం లేదు. యక్షుడు లేడు. సమస్య మాత్రం తమకు తల నొప్పిని తెప్పిస్తూ అలాగే ఉండిపోయింది.

పావు ఘడియపాటు ఆలోచించినా ఆలోచన ఒక దారిలోకి రాకపోవడంతో విసురుగా తల విదిలించి స్నేహితుడికేసి చూశాడు గదాధరుడు.

చూసిన వెంటనే చటుక్కున అగుపించి అంతలోనే మాయమైపోయింది ఒక విచిత్రమైన గుర్తు.

శ్రేష్ఠి భార్య విసిరివేసిన ఆభరణాన్ని తన చేతిలో గిరగిరా తిప్పుతున్నాడు గదాధరుడు. తన ఆలోచనలో తానుండిపోయి, దాని వైపు చూడటం లేదు. తల తిప్పి చూసిన శ్యామలుడికి గిరగిరా తిరుగుతున్న ఆ హారం దగ్గిరే కనిపించింది ఆ గుర్తు.

ఒక్క గంతులో ముందుకుపోయి గదాధరుడిని ఆపి, ఆ ఆభరణాన్ని తాను తీసుకున్నాడు. తన చూపుడు వేలికి తగిలించుకుని, చక్రం మాదిరి గిరగిరా తిప్పాడు.

"అయ్య బాబోయ్... ఏమో ముగ్గులు... విశాలమైన వృత్తంతో ఏవో ముగ్గులు కనిపిస్తున్నాయి" తనకు తెలియకుండానే బిగ్గరగా అరిచాడు గదాధరుడు.

ఆభరణాన్ని తిప్పటం ఆపాడు శ్యామలుడు.

"గుర్తులు కనిపించటం లేదు. మాయం అయిపోయినయ్" అన్నాడు గదాధరుడు.

"ఇప్పుడు సూటిగా ఆలోచించు... ఈ గుర్తులకి, ఈ తోటకి లేదా తోటలోని చెట్లకు కాసిన కాయలకు సంబంధం ఏదైనా ఉండి ఉంటుందా?" అని అడిగాడు శ్యామలుడు.

రెండు క్షణికాలు ఆలోచించి నరికి వేయబడిన చెట్ల దగ్గిరికి పరుగు తీశాడు గదాధరుడు.

"మనకు ఆలోచన సకాలంలో వచ్చింది. ఏ మాత్రం ఆలస్యం అయినా నరికివేయబడిన ఈ చెట్లను వంట చెరుకుగా వాడుకోవటానికి నగరంలోకి తరలించేవారు..." అంటూ చెల్లాచెదురుగా పడివున్న కొమ్మల నుండి కాయల్ని ఏరి తన దట్టీలో మూట కట్టుకుని వచ్చాడు.

కట్టడం ఉండి ఉండే ప్రదేశంలో శ్రేష్ఠి భార్య విసిరిన ఆభరణాన్ని నేలమీద పెట్టాడు శ్యామలుడు.

"శక్తి స్వరూపాల్ని సూచించే దేవతలకు నిమ్మకాయలతో పూజలు చేయటం తరతరాలుగా వస్తున్న ఆచారం... ఈ హారంలో కనిపించిన గుర్తులే గనుక అటువంటి సన్మానాన్ని ఆశిస్తూ ఉండి ఉంటే వెంటనే ఫలితం కనిపించాలి..." అంటూ తన దట్టీలోని కాయలన్నిటినీ ఆ హారం చుట్టూ పేర్చి నమస్కారం చేశాడు గదాధరుడు.

"శుచి శుభ్రత మొదలైన విషయాలను పట్టించుకునే తీరిక మాకు లేదు. మా మనస్సులు మాత్రం శుచిగానే ఉన్నాయి. మమ్మల్ని పీడించుకు తింటున్న సమస్యకు సమాధానం ఉంటే వెంటనే కనిపించాలి" అని మనసులోనే అను కున్నాడు.

అతను అలా అనుకుంటూ ఉన్న సమయంలోనే కావురు కమ్మినట్లు అయింది ఆకాశం... దారుణమైన ఈదురుగాలి, మహా బలంగా వీచటం మొదలు పెట్టింది.

"కట్టడంలోని ధూమస్తంభం వెలుపలికి వస్తున్న సమయంలో కనిపించిన మార్పులే ఇవి. శుభసూచకం కాదు. మనం ఈ ప్రదేశంలో ఉండటం మంచిది కాదు" ఆందోళనగా అంటూ గదాధరుడి చేతిని పట్టుకుని అవతలికి లాగబోయాడు శ్యామలుడు.

నిమ్మకాయల మధ్యలో ఉన్న ఆభరణం, తనంతట తాను దేదీప్య మానంగా ప్రకాశించడం మొదలుపెట్టింది.

అంతకుముందు కట్టడం ఉన్న ఆ ప్రదేశంలోని నేల కొద్దిగా చీలింది. ఆ చీలికలో నుంచి ఎగిరి గదాధరుడి ఎదుట పడింది ఒక వెండి తాళం చెవి.

మరింత అధికం అయిపోయింది ఈదురు గాలి. క్రింద పడిపోకుండా ఉండటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తూ స్నేహితుడిని మరింత తొందరపెట్టాడు శ్యామలుడు.

"మిత్రమా ఆభరణం.... ఆభరణాన్ని ఒకసారి చూడు..." ఆశ్చర్యంగా అన్నాడు గదాధరుడు.

క్రిందికి చూసిన శ్యామలుడికి ఆభరణం నిప్పుల కొలిమిలో పెట్టబడినట్టు కరిగి నీరుగా మారిపోవడం కనిపించింది.

"మన ప్రశ్నకు సమాధానం లభించింది. ఇంకా ఇక్కడే ఆగటం మహా ప్రమాదం" అంటూ గదాధరుడి చేతిని వదలకుండా పరుగు మొదలు పెట్టాడు శ్యామలుడు.

తన ఎదుటకు వచ్చిన వెండి తాళం చెవిని గట్టిగా పట్టుకుంటూ అతన్ని అనుసరించాడు గదాధరుడు.

వంద ధనువుల దూరం వారు పోయిన తరువాత – బలంగా వీస్తున్న ఈదురుగాలిలో నుంచి బండరాయి దగ్గిర ప్రత్యక్షం అయింది ఒక ఆకారం.

కట్టడం ఉండవలసిన ప్రదేశంలో పేర్చి వున్న నిమ్మకాయలను, వాటి మధ్యలో ఏదో ఆభరణం కరిగి నీరయి పోయినట్లుగా ఉన్న జాడల్ని గమనించి విపరీతమైన ఆగ్రహంతో చిందులు తొక్కినంత పని చేశాడు.

"నా శ్రమను వృధా చేసిన వారిని నేను వదిలి పెట్టను. వారు ఎవరో తెలుసుకుని, సర్వనాశనం చేస్తాను" పళ్ళు కొరుకుతూ పెద్దగా అరిచాడు.

దృష్టినంతా ఎదుట ఉన్న మార్గం మీద కేంద్రీకరించి పరుగు తీస్తున్న గదాధరుడు – చటుక్కున ఆగిపోబోయాడు.

"ఏమిటి నీ బాధ?" కోపంగా అడిగాడు శ్యామలుడు – పరుగు ఆపకుండానే.

"మనం వదిలిపెట్టి వచ్చిన బండరాయి దగ్గిర ఎవరో బిగ్గరగా అరిచిన సవ్వడి వినిపించింది" అన్నాడు అతను.

"ఏమని వినిపించింది?" అడిగాడు శ్యామలుడు.

"సవ్వడి మాత్రమే తెలిసింది. మాటలు బోధపడలేదు" అన్నాడు గదాధరుడు.

"మరేమీ పరవాలేదు. వివరాలు తెలిసినా మనం చేయగలిగింది ఏమీ లేదు. ఇప్పటికిప్పుడు వెనక్కి పోవటం నాకు ఇష్టం లేదు" అన్నాడు శ్యామలుడు.

"వెనక్కి పోవటం ఇష్టం లేకపోతే మరి ఎక్కడికి పోదాము?" అడిగాడు గదాధరుడు.

"ఈ నగరంలోకి వచ్చిన వెంటనే మనల్ని అమితంగా ఇబ్బందిపెట్టిన ఆ శంబర దేవత ఎవరో, ఎవరికీ కనిపించకుండా ఆ ఆలయం మటుమాయం అవటం ఏమిటో తెలుసుకోవాలని ఉన్నది" అన్నాడు శ్యామలుడు.

"అంటే ఇప్పుడు మనం ఎక్కడా ఆగకుండా ప్రమధ పరిసరాల్లోకి వెళ్లిపోవాలి. ఎవరికీ అనుమానం రాకుండా నగర ప్రవేశం చేయాలి" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అన్నాడు గదాధరుడు.

మౌనంగా తల ఊపాడు శ్యామలుడు.

వాహనాలు లేవు. వారిద్దరి దగ్గిరా... అయినాసరే ఆగలేదు... అలాగే నడుచుకుంటూ ఒక అడవి మార్గం వైపు వెళ్ళారు.

రెండే రెండు క్రోసులు నడిచిన తర్వాత వారికి అగుపించింది ఒక వృషభ శకటం. అరువది సంవత్సరాలకు పైబడిన వయసు కలిగిన వృద్ధుడు ఒక్కడే ఉన్నాడు ఆ శకటం దగ్గర.

“చీకటి సమయంలో ఎవరైనా ఈ దారి వెంట ప్రయాణం చేస్తారా? ఒకవేళ చేయవలసి వస్తే ఇంకో ఏడెనిమిది మందిని వెంటబెట్టుకుని మరీ బయలు దేరతారు. నువ్వేమిటి ఇలా ఒంటరిగా?” నడుము మీద చేతులు వేసుకుని దిక్కులు చూస్తూ నిలబడిన ఆ వృద్ధుడిని అడిగాడు గదాధరుడు.

అల్లంత దూరంలో ఉండగానే వారిని గమనించాడు వృద్ధుడు. “అయ్యలూ... మీరు ఎవరో బందిపోటు దొంగలని అనుకుని భయంతో వణికి పోతున్నాను” అంటూ భుజం మీది వస్త్రంతో ముఖానికి పట్టిన స్వేదాన్ని తుడుచు కున్నాడు.

“ఇంకొద్దిసేపు నువ్వు ఇలాగే ఈ దారిలో నిలబడితే ఆ కోరిక తప్పకుండా తీరిపోతుంది. శకటాన్ని కదిలించి ప్రయాణం మొదలుపెట్టు త్వరగా. ఏదో ఒక గ్రామాన్ని వెంటనే చేరుకోవటం చాలా మంచిది” అన్నాడు గదాధరుడు.

“అడవిలో పెరిగిన పెనుమాను మాదిరి ఈ దారి మధ్యలో కదలకుండా నిలబడటం నాకు సంతోష దాయకమని అనుకుంటున్నారా?” కోపంగా అడిగాడు వృద్ధుడు.

“నువ్వు నిలుచుని ఉన్న పద్ధతి చూస్తుంటే అలాగే కనిపిస్తోంది. ఇంతకీ ఏమిటి నీకు వచ్చిన ఇబ్బంది?” నవ్వుతూ అడిగాడు గదాధరుడు.

చేతిని జాచి తన శకట చక్రాన్ని చూపించాడు ఆ వృద్ధుడు.

స్నేహితులు ఇద్దరూ అనుసరించి వస్తున్న ఆ మార్గం మధ్యలో ఎప్పుడో కురిసిన ఒక పెద్దవర్షం కారణంగా ఏర్పడి ఉందొక పెద్ద బురదగుంట. వృద్ధుడు నడుపుతున్న వృషభ శకటపు చక్రం ఒకటి సరిగ్గా ఆ గుంటలో పడి కదలకుండా ఇరుక్కుపోయి ఉన్నది.

"నా వృషభాల వల్ల కాలేదు బండిని బయటికి లాగటం. నాకు కూడా చేత కాలేదు. భగవంతుడి మీద భారం వేసి సహాయం కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు వృద్ధుడు.

శ్యామలుడికి సైగ చేసి తన భుజాన్ని బురదలో దిగబడిన చక్రానికి ఆనించాడు గదాధరుడు. శకటం ముందు భాగంలోకి పోయి. అలసటగా నిలబడి ఉన్న వృషభాల ముఖాలను ఆప్యాయంగా తడిమాడు శ్యామలుడు.

"నా జతగాడు మీకు సహాయం చేస్తాడు. మీరు కొద్దిపాటి శ్రమకు సిద్ధపడాలి" అంటూ వాటి ముకుతాళ్ళను పట్టుకుని ముందుకు లాగాడు.

తన శరీరంలోని శక్తినంతా వినియోగించి చక్రాన్ని పైకి ఎత్తాడు గదాధరుడు. పటపటమని శబ్దం చేశాయి అతని భుజపు కండరాలు. అంగుళం అంగుళం చొప్పున పైకి లేచింది కూరుకుపోయిన చక్రం. శ్యామలుడి బుజ్జగింపు మాటలకు తమ అలసట మర్చిపోయిన వృషభాలు చివ్వున అవతలికి లాగేశాయి కదలకుండా నిలబడిపోయిన శకటాన్ని.

ఆనందమైపోయింది ఊపిరి బిగపట్టి చూస్తున్న వృద్ధుడికి "మీ మేలు నేను మరిచిపోలేను. మీరు ఎవరో నాకు తెలియదు. సమయానికి దేవుళ్ళ మాదిరి వచ్చి సహాయం చేశారు" చేతులు జోడిస్తూ గబగబా అన్నాడు.

"మేము చేసింది చాలా తక్కువ. నువ్వు పొగడవలసిన అవసరం లేదు. అలసిపోయి ఉన్న ఈ వృషభాలకు విశ్రాంతి ఇవ్వాలి. ముందు ఆ పని చూడు" అన్నాడు శ్యామలుడు.

వృషభాలను బండి నుంచి వేరు చేశాడు వృద్ధుడు. శకటం వెనుక భాగంలో వ్రేలాడదీసి వున్న రెండు నీటి సంచుల్ని క్రిందికి దించాడు. రెండు జానల వెడల్పు ఉండే ఒక ఎత్తు పాత్రను కూడా బండిలోనుంచి తీసి సంచుల్లోని నీటిని ఆ పాత్రలోకి వంపాడు.

ఆబగా తాగాయి వృషభాలు. తలల్ని విదిలించి ఆ దారి ప్రక్కనే ఉన్న పొదల దగ్గరికి పోయి, ఆ పొదల చుట్టూ పెరిగి వున్న గడిపొదల్ని హాయిగా కొరకటం మొదలు పెట్టాయి.

నీటి సంచుల్ని, సత్తుపాత్రను తిరిగి వాటి వాటి స్థానాల్లోకి చేర్చి, ఈసారి బండి ముందు భాగంలో నుంచి ఒక చిన్న వెదురుబుట్టను క్రిందకి దించాడు వృద్ధుడు.

"రండి నాయనలారా... విందు భోజనాలను వడ్డించే స్థోమత నాకులేదు. కడుపు నింపుకోవటానికి అవసరమైన జొన్నరొట్టెలు ఈ బుట్ట నిండుగా ఉన్నాయి. రండి... రెండు మూడు రొట్టెల్ని ఆరగించి మీ కడుపులు నింపుకోండి" అంటూ ఆహ్వానించాడు.

మట్టితో మలినమైన చేతుల్ని తమ దుస్తులకు రుద్దుకుంటూ పోయి అతని ఎదుట కూర్చున్నారు స్నేహితులు. అతను బుట్టలో నుంచి తీసి ఇచ్చిన రొట్టెలను తృప్తిగా ఆరగించారు.

"ప్రమధ రాజ్యపు సరిహద్దులకు దగ్గరగా ఉన్న గంధవతి నగరానికి పోతున్నాను నేను. నా తోటలో పండిన మొక్కజొన్న కండెలను ఆ నగర వర్తకులు మహా ఇష్టంగా ఆరగిస్తారు. మంచి వెల గిట్టుబాటు అవుతుంది. మీరు అటుగా పోతూ ఉన్నట్లయితే నాతోపాటు నా శకటం మీద కూర్చుని హాయిగా ప్రయాణం చేయవచ్చు" చెప్పాడు వృద్ధుడు.

చాలాహాయి అనిపించాయి ఆ మాటలు గదాధరుడి చెవులకు. "తప్పకుండా వస్తాము.. మేము పోవల్సింది అటు వైపే" తడుముకోకుండా చెప్పాడు.

"తోడు ఎవరూ లేకపోవడం వల్ల ఈ చీకట్లో ఎక్కడా ఆగకూడదని అనుకున్నాను. చీకటి మూలంగానే దారి కనిపించక ఈ బురదగుంట బారిన పడ్డాను. ఇప్పుడు మీరు తోడుగా ఉన్నారు కాబట్టి ఆత్రపడవలసిన అవసరంలేదు. తెల్లవారే వరకూ ఇక్కడే విశ్రాంతి తీసుకోవచ్చు" అంటూ వారి సమాధానం కోసం ఎదురు చూడకుండా, ఒక చిరుగుల కంబళిని నేల మీద పరిచి, రెండో మాట మాట్లాడకుండా, నిద్రకు ఉపక్రమించాడు వృద్ధుడు.

కనుచివరల నుంచి గదాధరుడి వైపు చూశాడు శ్యామలుడు.

రొట్టెల్ని ఆరగిస్తున్నప్పుడు ఎంతో ఆహ్లాదంగా అగుపించిన గదాధరుడి వదనం వృద్ధుడి మాటల్ని ఆలకించిన వెంటనే విసుగుతో నిండిపోయింది.

"దొరకనే దొరికాము కదా అని తన బాధ్యతలు అన్నిటినీ మనమీదికి నెట్టేస్తున్నాడు. ఇప్పుడు తెల్లవారే వరకూ ఈ శకటానికి కాపలా కాయవలసినది మనమే...." చిరుకోపంతో అన్నాడు.

"నువ్వు కొద్దిగా కునుకు తియ్యి... నేను మెలకువగా ఉంటాను. నాకు మగతగా అనిపించినప్పుడు నిన్ను నిద్రలేపుతాను" అన్నాడు శ్యామలుడు.

అటువంటి మాటల్ని రెండవ సారి చెప్పించుకునే అలవాటు లేనట్లు వెంటనే, ఒక శుభ్రమైన ప్రదేశంలో నడుము వాల్చాడు గదాధరుడు.

నడుముకు వ్రేలాడుతున్న కరవాలాన్ని తీసి శకటం వెనుకభాగంలో ఉన్న ఒక వసి కర్రకు తగిలించాడు శ్యామలుడు. బద్ధకం వదిలి పోయేటట్లు వళ్ళు విరుచుకుని, బండికి ఆనుకుని నిలుచున్నాడు.

అతి నెమ్మదిగా నడిచింది సమయం. అర్ధరాత్రి గడిచిన కొద్దిసేపటి తర్వాత నిద్ర ముంచుకువచ్చిన అనుభూతి కలిగింది అతనికి.

కదలకుండా పడుకుని ఉన్న గదాధరుడి దగ్గరికి బయలుదేరబోతున్న సమయంలో, గడ్డిదుబ్బుల దగ్గిరే పడుకుని ఉన్న వృషభాలు రెండూ ఉన్నట్లుండి పైకి లేచాయి తలల్నివంచి, కొమ్ముల్ని బారుచేస్తూ, పాముల మాదిరి బుసలు కొట్టాయి.

తమ కళ్ళకు కనిపించని ప్రమాదం ఏదో వాటిని బెదిరించిందని అర్ధమై వసికర్రకు తగిలించిన తన కరవాలం దగ్గరికి ఎగిరి దూకాడు శ్యామలుడు. ఒరలో ఉన్న కత్తిని బయటికి తీస్తూ ఉండగానే, పిశాచాల గుంపు మాదిరి బండి దగ్గరికి పరిగెత్తుకు వచ్చారు పదిమంది దృఢకాయులు.

నిద్ర పోతున్న తన జతగాడు తనకు తోడుగా వస్తే బాగుండుననిగాని, ఆయుధంతో తనకు సహాయపడితే బ్రహ్మాండంగా ఉంటుందని గాని, కొంచెంగా కూడా అనుకోలేదు శ్యామలుడు.

ఒరలో నుంచి బయటికి తీసిన కత్తిని గిరగిరా తిప్పుతూ ఆ మూక మీదికి ఎగబడ్డాడు.

"నరికేయండి. తల తెగి బురదగుంటలో పడిపోయేటట్లు కొట్టేయండి!" ఖంగుమంటున్న కంఠంతో మిగిలిన వారిని హెచ్చరించాడు ఆ గుంపులో ఉన్న దృఢకాయుడు ఒకతను.

"వాడిని నాకు వదిలేయ్ మిత్రమా... మిగిలిన వారిని నువ్వు చూసుకో" శ్యామలుడి చెవికి చేరింది నిద్రపోతున్నాడనుకున్న తన జతగాడి కంఠం.

ఉబికివచ్చిన నవ్వు బలవంతంగా పెదవుల వెనుకే దాచిపెట్టుకుంటూ తన ఆయుధానికి పని కల్పించాడు అతను.

వెనుకనుంచి అతన్ని పడగొట్టటానికి ప్రయత్నించాడు అందరినీ హెచ్చరించిన దృఢకాయుడు. సూటిగా వచ్చి అతనితో కలబడ్డాడు గదాధరుడు.

ఎంతోసేపు సాగలేదు పోరాటం... రెండే రెండు నిమిషాలు నడిచింది. అవయవాలు తెగి, రక్తం వెల్లువలై పోతుండగా, వచ్చినదారినే వెనక్కి పారిపోయారు శ్యామలుడిని చుట్టుముట్టిన వారు.

తన ఆయుధం గాలికి ఎగిరి పోగా, తాను కూడా వారిని అనుసరించ బోయిన వారి నాయకుడిని క్రిందికి నెట్టి గుండెల మీద పాదంతో అదిమాడు గదాధరుడు.

"మీరెవరోగాని, వీరాధివీర శూరాధిశూరుల మాదిరిగా ఉన్నారు. మీరు పడగొట్టింది ఎవరినో తెలుసునా?" ఆశ్చర్యం నిండిన కంఠంతో అడిగాడు నిద్రలేచి వచ్చిన వృద్ధుడు.

కరవాలాల చప్పుళ్ళు విన్న వెంటనే మెలకువ వచ్చింది అతనికి. వెంటనే లేచి శకటంలో నుంచి పెద్ద కాగడాని బయటికి తీసి నిప్పు ముట్టించాడు. ఆ కాగడా వెలుగులో క్రింద పడిపోయిన దృఢకాయుడి ముఖాన్ని తాను చూసి, వారిద్దరికీ చూపించాడు.

"మేము పరాయిదేశస్థులం... మాది ఈ నగరం కాదు. ఇతను ఎవరో మాకు తెలియదు" అన్నాడు శ్యామలుడు.

"వాడు తుమ్మలడొంకకి చెందిన బందిపోటు వీరన్న. ఈ అడవిదారిలో ప్రయాణించే వారిని దోచుకోవటం వాడి వృత్తి... వాడి ఆగడాలను భరించటం చేతకాక, చేతులు ఎత్తేశారు గంధవతి సైనికులు. ఇతన్ని పట్టిచ్చిన వారికి పది వేల బంగారు నాణేలు బహుమతి ప్రకటించారు...." అన్నాడు వృద్ధుడు.

"బహుమతి ప్రకటించడంతో తమ కర్తవ్యం ముగిసిపోయిందని చేతులు ముడుచుకుని కూర్చోలేదు... తమవంతు ప్రయత్నాలు తాము చేస్తూనే ఉన్నారు కదా...." అన్నాడు గదాధరుడు.

"ఎటువంటివి ఆ ప్రయత్నాలు?" ఆశ్చర్యంగా అడిగాడు వృద్ధుడు.

చటుక్కున చేయిజాచి దుమ్ముధూళితో మలినమై ఉన్న అతని అంగీని పట్టుకుని, బలంగా లాగాడు గదాధరుడు.

సర్రుమని శబ్దం చేస్తూ చినిగి పీలికలైపోయింది అది.

వంటిమీది వస్త్రం చిరిగిపోతే, నగ్నంగా నిలబడి పోవాలి వృద్ధుడు. కాని ఆ విధంగా లేదు అతను. మలినమైన అంగీ క్రింద అతి విలువైన దుస్తులు ధరించి ఉన్నాడు.

"బురదగుంటలో దిగబడిపోయిన శకటాన్ని బయటికి లాగే సమయంలోనే నాకు వచ్చింది అనుమానం... అనుకోని విధంగా సహాయం చేయటానికి వచ్చిన అపరిచితుల్ని చూసి, ఆనందించటమే కాదు – తనవంతు సహాయం కూడా చేయాలి. అటువంటి దేదీ చేయకపోగా, నిబ్బరంగా నిలబడి పోవటం, వేగంగా అవతలికి వెళ్ళకుండా ఇక్కడే ఆగిపోదామని అనటం నా అనుమానాన్ని రెట్టింపు చేశాయి. గంధవతి సైనికుల మీద మీ అధికారం ఎటువంటిది?" నవ్వుతూ అడిగాడు గదాధరుడు.

తలవంచి అతనికి శ్యామలుడికి అభివాదం చేశాడు వృద్ధుడు. "సైనికుల మీద అధికారం సామాన్యమైనది కాదు... సాక్షాత్తూ ఆ నగరానికి పాలకుడిని నేను... అమరేంద్రుడు అని నా నామధేయం" అన్నాడు.

"నా జతగాడు కొట్టిన దెబ్బల్ని తట్టుకోలేక పలాయనం చిత్తగించిన దుర్మార్గుల సంగతి ఏమిటి?" అడిగాడు గదాధరుడు.

ఆ మాటలకు గంధవతి పాలకుడు సమాధానం చెప్పకముందే, చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకుని, పారిపోయిన వారందర్ని వెంటబెట్టుకు వచ్చారు పాతిక మంది సైనికులు.

"మేము మా నిజస్వరూపాలతో ఈ మార్గం వెంట నడిస్తే, ఈ దుర్మార్గులకు అనుమానం వస్తుందని చెప్పి రహస్యంగా సంచరిస్తున్నాము. నిస్సహాయుడైన వృద్ధుడి మాదిరిగా ఈ శకటం దగ్గిర ఉండిపోయాను నేను. పొదలచాటున నక్కి, కూర్చున్నారు. నా సైనికులు...." వారిని చూస్తూ చెప్పాడు నగరపాలకుడు.

క్రింద పడిపోయిన నాయకుడితో కలిపి, సైనికులు తీసుకు వచ్చిన వారందరినీ లెక్కించాడు గదాధరుడు. పదిమంది మాత్రమే ఉన్నారు వాళ్ళు.

"ఏమిటి వీరుడా నీ అనుమానం?" అతని చర్యల్ని గమనించి ఆశ్చర్యంగా అడిగాడు నగరపాలకుడు.

"తిప్పితిప్పి లెక్కవేసినా ఈ దుర్మార్గుల సంఖ్య పదికి మించటం లేదు. ఈ అల్పసంఖ్యాకులే ఈ మార్గాన్ని అల్లకల్లోల పరుస్తున్నారా? ఈ పదిమందినీ పట్టుకోవటానికి నగరపాలకుల వారే స్వయంగా మారువేషంలో వచ్చి నాటకం ఆడవలసి వచ్చిందా?" అడిగాడు గదాధరుడు.

"చూడటానికి వారి సంఖ్య తక్కువే అయినా దుర్మార్గంలో వాళ్ళు సాటిలేని మేటి మొనగాళ్ళు. ఇప్పటివరకూ రెండు వందల మంది సైనికులను వీరు తమ పొట్టన పెట్టుకున్నారు...." అన్నాడు నగరపాలకుడు.

తన అనుమానం తీరిపోయినట్లు తల ఊపవలసిన గదాధరుడు ఆ పని చేయలేదు... "పరాయి దేశస్థులం కావడం వల్ల ఇక్కడి పరిస్థితులు ఎలాంటివో మాకు తెలియదు. సంఖ్య తక్కువే అయినా, రెండు వందల మంది సైనికుల్ని హతమార్చగల శక్తియుక్తులు ఆ దారిదోపిడీ బృందానికి ఉండటం నిజంగా విచిత్రమే...." అంటూ శకటం చాటుకు జరిగి, చిన్నగా సైగ చేశాడు.

బంధితులైన దుర్మార్గులందరినీ, అడవిమార్గం ఆవల ఉన్న చెట్ల దగ్గరికి తీసుకుపొమ్మని ఆజ్ఞ ఇచ్చి, అతని దగ్గరికి వచ్చాడు నగరపాలకుడు.

"ఏం చేయదలుచుకున్నారు వారందరినీ?" అడిగాడు గదాధరుడు.

"దలుచుకోవటాలు, ఆలోచించుకోవటాలు ఏమీ లేవు. నిర్మొహమాటంగా మెడకు తాళ్ళు కట్టి చెట్టు కొమ్మలకు వ్రేలాడ దీయించటమే... ఇటువంటి వారిని శిక్షించటంలో ఆలస్యం చేయటం అతి ప్రమాదకరం." అన్నాడు నగరపాలకుడు.

"తెల్లవారిన తరువాత విచారణ మొదలు పెట్టబడుతుందని చెప్పండి. అందరినీ చెట్లకు అంటగట్టి ప్రాణాలతోనే ఉండనీయండి. ఒకేఒక్క దుర్మార్గుడిని తక్కువగా అంచనా వేయండి. వాడు తప్పించుకు పారిపోయేందుకు అవకాశం ఇచ్చి చూడండి" చిన్న కంఠంతో చెప్పాడు గదాధరుడు.

"వాళ్ళ సంగతి మీకు తెలియదు. ఒకసారి చేతిలో నుంచి జారిపోతే తిరిగి పట్టుకోవటం అసంభవం" అన్నాడు నగరపాలకుడు.

"అయినా సరే నేను చెప్పినట్లు చేయండి" గంభీరంగా చెప్పాడు గదాధరుడు.

పది క్షణికాల పాటు ఆలోచించి అయిష్టంగానే తల ఊపాడు నగర పాలకుడు. దారి దోపిడీ గుంపును చెట్ల దగ్గరికి తీసుకుపోయిన సైనికుల్లో ఒకతన్ని పిలిచి, గదాధరుడి మాటను అతని చెవిన వేశాడు.

ఆశ్చర్యంతో వెడల్పు అయ్యాయి ఆ సైనికుడి కళ్ళు... "చాలా ప్రమాదం ప్రభూ... తిరిగి పట్టుకోలేము. పారిపోయిన వాడు తమ జట్టులోని ఇతరుల్ని కలిసి–" అంటూ మాటల్ని చటుక్కున మ్రింగివేశాడు.

తను ఆ ఉపాయాన్ని ఎందుకు చెప్పటం జరిగిందో, అతనికి అవగత మైందని తెలిసి చిన్నగా నవ్వాడు గదాధరుడు.

"మీ ముందు చూపుకు మా వందనాలు... ఈ దారిదోపిడీ గుంపులో ఇప్పుడు పట్టుబడిన వారు మాత్రమే సభ్యులు అని నేను నమ్మటంలేదు. ఇంకా చాలామంది ఉండే ఉంటారు. వారందర్నీ బంధిస్తే తప్ప మాకు పట్టిన దరిద్రం వదిలిపోదు. కానీ–" అంటూ మరోసారి మాటల్ని ఆపాడు.

"నీ సందేహం ఏమిటి?" అడిగాడు గదాధరుడు.

"మేము పాతికమందిమి మాత్రమే ఉన్నాము. పారిపోయే దుర్మార్గుడు అంతకుమించిన సంఖ్యతో ఉన్న వారిని రెచ్చగొడితే ఎదుర్కోవటం చాలా కష్టం అవుతుంది" సాలోచనగా అన్నాడు ఆ సైనికుడు.

సామాన్యమైన వేగమే అయినా, ఆ మాటల్లోని ఆలోచనల్ని, కించిత్తుగా ధ్వనిస్తున్న అధికారాన్ని వెంటనే గమనించాడు గదాధరుడు.

"మొక్కజొన్న పొత్తుల్ని నగరంలో విక్రయించి జీవితం గడుపుకునే రైతన్న వేషం మీ నగర పాలకుల వారు వేశారు. నగర సైన్యాధిపతి సామాన్య సైనికుడి మాదిరి వచ్చాడు. అవునా?" నవ్వుతూ అడిగాడు.

చేతిని జాచి అతని భుజాన్ని అభిమానంగా అదిమాడు ఆ సైనికుడు.

"మీ గురించి మేము కూడా చాలా తక్కువగానే ఊహించాము. ఈ దోపిడీ గుంపును ఎదుర్కోవటంలో మీరు చూపించిన సాహసం సామాన్యులు చూపించలేరు. ఆయుధ విద్యలో ఆరితేరిన రాచవంశీయులకే అది సాధ్యం" అన్నాడు.

"మేము ఎవరిమో ఇప్పుడు చెప్పినా మీరు నమ్మలేరు. కాబట్టి అనవసరమైన మాటలతో సమయాన్ని వృధాచేయను...." అంటూ దోపిడీ గుంపుకేసి చేయి ఊపాడు గదాధరుడు.

పెద్దపెద్ద అడుగులు వేస్తూ పోయాడు గంధవతి సైన్యాధిపతి. దోపిడీ దొంగల్ని చెట్లకు అంటకట్టడంతో తన సైనికులకు సహాయం చేస్తూ, పొరపాటున ఒక దొంగ చేతిని వదులుగా పట్టుకున్నాడు.

పట్టుబడిన క్షణం నుంచీ అటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నట్లు, ఒక క్షణికం పాటు కూడా ఆలస్యం చేయలేదు ఆ దొంగ. ఎగిరి అవతలికి దూకాడు. కుందేలు పిల్ల మాదిరి అడవి పొదల్లో దూరి అరక్షణికంలో అదృశ్యం అయిపోయాడు.

"వెతకండి... గాలించండి...." తన సైనికులు అసమర్థతను చూసి విపరీత మైన ఆగ్రహంతో రగులుకుపోతూ ఆజ్ఞ ఇచ్చాడు నగరపాలకుడు.

మిగిలిన వారందర్నీ దృఢంగా చెట్లకు విరిచికట్టి తలా ఒక ప్రక్కకు పరిగెత్తారు సైనికులు.

*                    *                    *                    *                    *

కనులు చిట్లించి తదేకంగా పళ్ళెరం వైపు చూస్తున్న యువరాణి చిరాకుగా తల విదిలించి, ప్రక్కనే ఉన్న వృద్ధురాలి వైపు చూసింది.

"ఏమిటి తల్లీ?" ఆదరంగా అడిగింది ఆమె.

"ఈ శ్యామలుడు గదాధరుడు ఇద్దరూ సూటిగా ప్రయాణం చేయటం గాని, మొదలుపెట్టిన పనిని పూర్తి చేయటం గాని ఎన్నడూ జరగదని నాకు అనిపిస్తోంది. ఆ అడవి దారిలోకి అడుగుపెట్టిన వారు, మళ్ళీ ఇంకో మార్గంలోకి వెళ్ళిపోతున్నారు...." విసుగు నిండిన కంఠంతో చెప్పింది యువరాణి.

"సూటిగా ప్రయాణం చేయటం వారికి అలవాటు లేదనే మాట నిజమే కాని, మొదలుపెట్టిన పనిని మధ్యలో వదిలేయటం మాత్రం వారికి చేత కాదు... అంతవరకూ నేను చెప్పగలను" అన్నది వృద్ధురాలు.

"అంత నిక్కంగా ఎలా చెప్పగలవు అవ్వా? మన రాజ్యంలో ఎవరికీ అగుపించని శంబరదేవత ఆలయానికి సంబంధించిన ఒక రహస్యం వారికి తెలిసింది. ఆ పని మీద వారిద్దరూ ఇక్కడికి వచ్చేయాలి. మధ్యలో ఆ గంధవతి

నగర పాలకుడితో కలిసి అడవిలో ఆ పరుగు పందేలు వేయటం దేనికి?" చిరు కోపంతో అడిగింది యువరాణి.

"పిచ్చితల్లీ... నువ్వు చూస్తున్న దృశ్యాలు ఇంతకుముందే ఎప్పుడో జరిగిపోయాయి... ప్రస్తుతం వారిద్దరూ ఈ నగరంలోనే ఉన్న సంగతిని నువ్వు మర్చిపోయి మాట్లాడుతున్నావు" నవ్వుతూ చెప్పింది వృద్ధురాలు.

నాలుక కరుచుకున్నది యువరాణి. చప్పున తలను తిరిగి పళ్ళెరం వైపు తిప్పింది.

*   *   *   *   *

అడ్డువచ్చిన అడవి పొదల మీది నుంచి ఎగిరెగిరి దూకుతూ మహావేగంగా ప్రయాణం చేశాడు సైన్యాధిపతి. పట్టులో నుంచి బయటపడి పరుగు మొదలు పెట్టిన దొంగ తూర్పుదిక్కు తెల్లబడుతున్న సమయంలో ఒక పెద్ద కొండ గుట్టకు చేరుకుని, ఒక బండరాయి దగ్గిర ఆగాడు.

ఆయాసం అణిగిపోయిన తర్వాత, ఆ రాతి వెనుక భాగంలో నుంచి చిన్న కొమ్ముబూరా తీసి చిన్నగా ఊదాడు.

కొండరాళ్ళలో నివసించే చిమటల వంటి కీటకాలు అరిచినట్లు వినవచ్చింది శబ్దం... రెండుసార్లు వినరాగానే, దడదడమని చప్పుడు చేస్తూ, ప్రక్కకు జరిగింది ఆ బండరాయి.

బరిశెలు పట్టుకున్న నలుగురు దృఢకాయులు బయటికి వచ్చారు – ఆ బండరాయి పక్కకు జరిగి నప్పుడు ప్రత్యక్షం అయిన పెద్ద గుహలో నుంచి.

"ఏమయిందిరా? ఏరి మనవాళ్ళు అందరూ?" అలసటతో నలిగి పోయినట్లు కనిపిస్తున్న ఆ దొంగను అడిగాడు వారిలో ఒకతను.

"మోసం జరిగిపోయింది. వీరన్నతోపాటు అందరము బంధింప బడ్డాము. గంధవతి సైనికులు నేర్పుగా వలపన్ని మమ్మల్ని పట్టుకున్నారు" తల వంచుకుంటూ చెప్పాడు పారిపోయి వచ్చిన దొంగ.

"నువ్వు సందు చూసుకుని పారిపోయి వచ్చావన్న మాట... నిన్ను ఎవరైనా తరిమారా?" తల ఎత్తి అడవికేసి చూస్తూ అడిగాడు ఆ దృఢకాయుడు.

"పరిగెత్తటం మొదలుపెట్టిన తర్వాత నన్ను పట్టుకోవటం గాలి దేవుడికి కూడా సాధ్యం కాదని మీకు తెలుసు. మనం వెంటనే వెళ్ళి మన వీరన్నను

విడిపించాలి. ఆలస్యం చేస్తే నగరానికి తరలించి ప్రాణాలు తీసేస్తారు" అన్నాడు ఆ దొంగ.

సాలోచనగా తల ఊపి, గుహలోకి దారి తీశాడు ఆ దృఢకాయుడు. అతనితో పాటుగా బయటికి వచ్చిన వారు మాత్రం బండవెలుపలే నిలబడి కాపలా కాయటం మొదలు పెట్టారు.

* * * * *

"వాళ్ళు ముగ్గురు ఉన్నారు. వారికంట పడకుండా మనం గుహలోకి పోలేము...." సాలోచనగా అన్నాడు దొంగను అనుసరించి వచ్చిన గదాధరుడు.

"రహస్యంగా సంచరించవలసిన అవసరం లేదనే నేను అనుకుంటున్నాను. మనం కూడా ముగ్గురం ఉన్నాము. ఎదురుపడి తలల్ని ఎగరేయవచ్చు" గంభీరంగా అన్నాడు సేనాధిపతి.

"తలల్ని మనం ఎగరేసే లోపల వాళ్ళు అరిచి కేకలు పెడతారు. గుహలో ఎంతమంది ఉంటే అంతమందీ హెచ్చరించబడతారు. తలా ఒక ప్రక్కకు పారిపోతే కథ మళ్ళీ మొదటికి వచ్చేస్తుంది" అన్నాడు గదాధరుడు.

"ఆ పని మాత్రం వద్దు... ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. ఏదో ఒక విధంగా అందరినీ బంధించడమే శ్రేయస్కరం...." గబగబా అన్నాడు సేనాధిపతి.

పది క్షణికాల పాటు ఆలోచించి, తనకు సమీపంలో ఉన్న ఒక అడవి పొదను పట్టుకుని గట్టిగా ఊపాడు గదాధరుడు.

అతను ఆశించినట్లే గుహ ముందున్న దృఢకాయులకు కనిపించింది ఆ కదలిక.

తన బరిశెను బిగించి పట్టుకుని వేగంగా పరిగెత్తుకు వచ్చాడు వారిలో ఒకతను. గలగలలాడిన పొద దగ్గరికి వచ్చి, చుట్టూ చూశాడు.

ఒదిగి కూర్చుని ఉన్నాడు శ్యామలుడు ఆ పొదపక్కనే ఉన్న ఒక బండ రాయి దగ్గర. వేగంగా చేతిని జాచి, ఆ దృఢకాయుడి ఎడమ పాదాన్ని పట్టుకున్నాడు.

అదిరిపడి వెనక్కి గెంతబోయాడు అతను. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. పాదాన్ని నేలకు ఆనించి ఉంచడం అసాధ్యం అయిపోవటంతో వెల్లకిలా పడిపోయాడు.

పడుతూ ఉండగానే పెద్దగా అరిచి తన సహచరులను హెచ్చరించటానికి ప్రయత్నం చేశాడు. అతని కంటే వేగంగా కదిలి, అరచేత్తో అతని నోటిని అదిమేశాడు సేనాధిపతి. శబ్దం బయటికి రాకుండా అడ్డుకున్నాడు.

రెండు మూడు ధనువులు ఎత్తున్న పొదల్లో జరిగింది ఏమిటో గుహ దగ్గిర ఉన్న వారికి అగుపించలేదు.

పిచ్చికమాదిరి ఎగురుకుంటూ పోయిన తమ సహచరుడు ఎంత సేపటికీ వెనక్కి రాకపోవటంతో వారికి వచ్చేసింది అనుమానం.

తమ ఆయుధాల్ని బలంగా బిగించి పట్టుకుని ఒకేసారి పొదల దగ్గరికి వచ్చారు వారిద్దరూ.

ఎడమ చేతివైపు నుంచి శ్యామలుడు, కుడిచేతి పక్క నుంచి గదాధరుడు వారిద్దరినీ ఎదిరించారు. రెండు రెండు దెబ్బలతో స్పృహ తప్పించి నేలకు దొర్లించేశారు.

ఒక్క క్షణికం కూడా ఆలస్యం చేయకుండా గుహ దగ్గరికి పరుగుతీశాడు సైన్యాధిపతి. వెనుకాముందు చూసుకోకుండా లోపలికి పోయాడు. పోయిన మూడో క్షణికంలో అతి వేగంగా వెలుపలికి వచ్చేశాడు.

“ఏమయింది సేనాధిపతుల వారు? ఏమి కనిపించింది.” అడిగాడు గదాధరుడు.

“నీ అనుమానమే నిజం అయింది వీరుడా... లోపల చాలా విశాలంగా ఉన్నది గుహ... దగ్గర దగ్గరిగా శత సంఖ్యలో సమావేశమై ఉన్నారు దొంగలు. జరిగింది ఏమిటో అందరికీ వివరించి చెపుతున్నాడు పారిపోయి వచ్చిన దుర్మార్గుడు” చిన్న కంఠంతో చెప్పాడు సేనాధిపతి.

“వారందరూ ఒకేసారి వెలుపలికి వస్తే ఆపటంగాని, ఎదిరించటం గాని, బంధించటం గాని మనం చేయలేము. నలుగురైదుగుర్ని మాత్రమే నిరోధించగలం. మిగిలిన వారందరూ తప్పించుకుంటారు” అన్నాడు గదాధరుడు.

“తప్పించుకున్న తర్వాత చేతులు ముడుచుకు కూర్చోరు. రెట్టించిన పట్టు దలతో మా నగరాన్ని పీడించుకు తింటారు....” కక్ష నిండిన కంఠంతో అన్నాడు సేనాధిపతి.

“ఒక్కడు కూడా తప్పించుకోకూడదు. ఏం చేస్తే బాగుంటుంది?” గదాధరుడిని అడిగాడు శ్యామలుడు.

సేనాధిపతి వైపు చూశాడు శ్యామలుడు.

"వీరుడా... ఎదురుపడిన శత్రువుల్ని ఎదిరించటం ఎలాగో చెప్పమంటే చెప్పగలను. ప్రాణాలకు తెగించి పోరాటం సల్పటం చూపించమంటే చూపించగలను. ఇంతమందిని ఒంటరిగా మట్టుబెట్టటం నాకు చేతకాదు. పారిపోనీయకుండా ఆపడం కూడా నాకు అంతుబట్టని విషయమే" తన అసమర్థతను ఎటువంటి జంకుగొంకులేకుండా బయట పెట్టాడతను.

"అడిగిన మాటకు సమాధానం చెప్పకుండా చర్చలు మెదలు పెడితే ఎలా మిత్రమా? ఆలస్యం చేస్తే లోపల ఉన్న ఎలుకలు అన్నీ బయటికి వచ్చేస్తాయి" అసహనంగా అన్నాడు గదాధరుడు.

"అదే పని చెయ్యాలి...." నవ్వుతూ అన్నాడు శ్యామలుడు.

ఒక క్షణం పాటు అయోమయంగా చూసి, అంతలోనే నిశ్శబ్దంగా పెద్ద నవ్వు ఒకటి నవ్వాడు గదాధరుడు.

"సరయిన ఉపాయం... సిద్ధంగా ఉండండి" అంటూ అప్పటికప్పుడు కొండగుహ మొదట్లో ఉన్న పొదల్ని, గడ్డి దుబ్బుల్ని తన కరవాలంతో నరికి పెద్ద గుట్ట తయారుచేశాడు. ఆ గుట్టను గుహలోకి నెట్టి తన దుస్తుల్లో ఉన్న చెకుముకి రాయి సహాయంతో నిప్పు ముట్టించాడు.

పారిపోయి వచ్చిన దొంగ, బండరాయి చాటున ఉన్న కొమ్ముబూరని ఊదగానే ఆ బండ అవతలికి జరగటాన్ని చూసి ఉన్నాడు శ్యామలుడు. తన జతగాడు చెత్తగుట్టకు నిప్పు ముట్టించగానే, ఆ బండరాయిని పట్టుకుని, బలంగా ప్రక్కకు లాగాడు.

దడదడమని శబ్దం చేస్తూ కదిలింది అది. గుహద్వారం మూసుకు పోయింది. "జరుగుతున్నది ఏమిటో లోపల ఉన్న వారు గమనించి, చెత్తగుట్ట మీది నిప్పును ఆర్పివేస్తే, ఇప్పుడు పడిన కష్టం వృధా అవుతుంది. మన ఆయుధాలకు పని చెప్పవలసిన అవసరం ఏర్పడుతుంది." వరలో నుంచి తన కత్తిని బయటికి తీస్తూ అన్నాడు సేనాధిపతి.

"నిప్పును ఆర్పినా, చెత్తనంతా పాదాలతో తొక్కినా ఏమీ ప్రమాదం లేదు. లోపల ఉన్న వారిలో ఒక్కడు కూడా బయటికి తనంతట తానుగా రాలేడు. మనం వెళ్ళి మోసుకు రావాల్సిందే" నమ్మకంగా చెప్పాడు గదాధరుడు.

"ఎలా? ఎలా చెప్పగలవు వీరుడా?" అయోమయంగా చూస్తూ అడిగాడు సేనాధిపతి.

గుహ వెలుపల ఉన్న గడ్డి దుబ్బుల్ని చిన్నచిన్న అడవిపొదల్ని నరికిన తరువాత, తన కరవాలాన్ని ఒరలో పెట్టేశాడు గదాధరుడు.

ఇప్పుడు దాన్ని తిరిగి ఒరలో నుంచి తీసి ముందుకు జాచాడు. అతను ఎందుకు అలా చేస్తున్నాడో శ్యామలుడికి తెలిసిపోయింది. క్షణికం కూడా ఆలస్యం చేయకుండా రెండు అడుగులు వెనక్కివేసి నిలుచున్నాడు.

సేనాధిపతికి మాత్రం తెలియలేదు. విస్ఫారిత నేత్రాలతో అలాగే చూస్తూ నిలుచున్నాడు.

సన్నపాటి వాసన... తియ్యతియ్యటి వాసన... మధ్యమధ్యలో కొంచెం వెగటు పుట్టించే విధంగా వస్తోంది గదాధరుడి కరవాలపు అంచుల మీది నుంచి.

"ఏమిటీ వాసన? ఎక్కడి నించి వస్తోంది?" అంటూ ముక్కుల్ని ఎగబీల్చాడు సైన్యాధిపతి. పీల్చిన మరుక్షణం గిర్రున తిరిగాయి కాబోలు కళ్ళు– వెనక్కి తూలబోయాడు.

"ఆటలు చాలు మిత్రమా... ఒరలో పెట్టేయ్." విసురుగా హెచ్చరించాడు శ్యామలుడు తన జతగాడిని. చేతుల్ని జాచి సైన్యాధిపతి పడిపోకుండా పట్టుకున్నాడు.

"ఏమిటది? ఏమిటీ వాసన? ఎందుకు నాకు కనులు బైర్లు క్రమ్మబోయాయి?" కాళ్ళు నిలదొక్కుకుంటూ విపరీతమైన ఆశ్చర్యంతో అడిగాడు సైన్యాధిపతి.

"మనం గుహలోకి నెట్టినచెత్తలో, మతి పోగొట్టి మైకాన్ని కలిగించే చిట్టిపొదలున్నాయి. వాటినుండి వెలువడే వాసన ప్రభావం ఈ పాటికి గుహ మొత్తం వ్యాపించి వారిని అల్లకల్లోలం చేసి వేస్తూ ఉంటుంది" అంటూ శ్యామలుడి సహాయంతో గుహ ద్వారానికి అడ్డుగా ఉన్న బండరాయిని ప్రక్కకు నెట్టాడు.

పూర్తిగా కాకపోయినా మూడు వంతులకు పైగానే నిజం అయినాయి అతని మాటలు. ఎక్కడి వారక్కడ పడిపోయి ఉన్నారు లోపల ఉన్న దోపిడీ దొంగలు. మిగిలినవారు తడబడుతున్న అడుగులతో బయటికి పరిగెత్తుకు రాబోయారు.

తమ ఆయుధాల్ని వృషభ శకటాల మీద ఉండే వసి కర్రల మాదిరి ఉపయోగించి వారందరినీ ఎడాపెడా కొట్టేశారు స్నేహితులు ఇద్దరు. పదేపది క్షణికాల్లో అందర్నీ మట్టి కరిపించారు.

"ఇప్పుడు పిలుచుకోండి మీ సైనికులందరినీ...." అంటూ సేనాధిపతికి చెప్పాడు గదాధరుడు.

గుహ లోపలే ఉండిపోయి, దట్టమైన పొగలు వెలువరుస్తున్న చెత్తను బయటికి లాగబోయిన సేనాధిపతిని అడ్డుకుని తల అడ్డం తిప్పాడు శ్యామలుడు.

"ఆ చెత్తలో నా జతగాడు చేర్చిన చిట్టిపొదల ప్రభావం ఇంకో నాలుగయిదు ఘడియలపాటు ఈ గుహను ఆవరించుకుని ఉంటుంది. లోపలికిపోతే మీరు కూడా క్రింద పడిపోతారు" అని హెచ్చరించాడు.

గుహ వెలుపల ఉన్న పొదల్ని, చెత్తా చెదారాన్ని పోగుచేసి ఈసారి తను మంట వేశాడు సేనాధిపతి.

తెలుపు నలుపు రంగులు కలగలిపిన దట్టమైన పొగ సుడులు తిరుగుతూ లేచింది గాలిలోకి.

ఆ ధూమస్తంభం గాలిలోకి లేచిన మూడు ఘడియల తరువాత తన సైనికుల్ని వెంటబెట్టుకుని అటుగా వచ్చాడు గంధవతి నగర పాలకుడు.

"మీ వంటి వారు నాకు అండగా ఉంటే ఎటువంటి ప్రమాదకరమైన పరిస్థితులనయినా నేను ఎదుర్కోగలను. మాతోపాటు మా నగరానికి విచ్చేయండి. మా ఆతిథ్యాన్ని స్వీకరించండి" శ్యామలుడి భుజం మీద చేయి వేస్తూ ఆర్ద్రంగా అడిగాడు.

చిరునవ్వుతో తల అడ్డం తిప్పాడు శ్యామలుడు. "మీ అభిమానానికి మేము కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాము. అత్యవసరంగా మేము ప్రమథ రాజ్యం వెళ్ళాలి... చాలా అవసరం...." చిన్న కంఠంతో చెప్పాడు.

ప్రమథ రాజ్యం పేరు విన్నవెంటనే కనులు చిట్లించాడు గంధవతి పాలకుడు. "పరిస్థితులు అక్కడ ఏమంత శుభకరంగా లేవని తెలుస్తోంది... రాజ్యపాలన అంతా మంత్రవాదుల పర్యవేక్షణలో జరుగుతున్నదని ఒక సమాచారం" అన్నాడు.

"మాకు, నగర పాలనకు ఎటువంటి సంబంధము లేదు" అన్నాడు గదాధరుడు.

"వీరాధి వీరులు మీరు... ఎటువంటి ప్రమాదకర పరిస్థితులనయినా సమర్ధంగా ఎదుర్కోగలరు... మీ కోసం మా నగర ద్వారాలు ఎల్లవేళలా తెరిచే ఉంటాయి. మర్చిపోకండి" ఆదరంగా చెప్పాడు నగరపాలకుడు.

స్పృహలేని దోపిడీ దొంగలందరినీ కాళ్ళుచేతులు బంధించి, తమతోపాటు తీసుకువచ్చిన వృషభ శకటం మీద ధాన్యపు సంచుల మాదిరి పడవేయించాడు సేనాధిపతి.

"గుహ లోపలికి వెళ్ళండి... ఎవరయినా మిగిలి ఉన్నారేమో ఇంకో సారి వెతికి చూడండి" అంటూ తన సైనికులకు ఆజ్ఞ ఇచ్చాడు.

ఒక ప్రక్కగా నిలబడి ఆ మాటల్ని ఆలకించిన శ్యామలుడికి నవ్వు వచ్చింది వెంటనే, ఎంత బిగపట్టుకుందామని ప్రయత్నించినా ఆగలేదు అది.

"నేను ఏమైనా తప్పు మాట్లాడానా?" అయోమయంగా చూస్తూ అడిగాడు సైన్యాధిపతి.

"తప్పుకాదు... కాని అసలు విషయాన్ని మర్చిపోయి మాట్లాడటం జరిగింది. మనం బంధించింది మీ నగరాన్ని తమ దోపిడీలతో అల్లకల్లోలం చేస్తున్న గజదొంగల్ని, ఇంతవరకూ వారు సాగించిన దోపిడీల సొత్తు ఏమయి పోయిందోనని మీరు ఆలోచించటం లేదు" అన్నాడు గదాధరుడు.

నాలుక కరుచుకుని వెంటనే మరో ఆజ్ఞను అందరికీ వినిపించాడు సైన్యాధిపతి.

"ఒక్క అంగుళం మేర కూడా వదలకుండా గుహనంతా గాలించండి"

దోపిడీదొంగల్ని తల్లక్రిందులు చేసిన మత్తుగాలి ఏమైనా గుహలో మిగిలి ఉన్నదేమోనన్న అనుమానంతో తమ తల భాగాలను నాశికాలకు అడ్డుగా కట్టుకుని లోపలికి పరిగెత్తారు సైనికులు.

పావుఘడియ తరువాత బయటికి తీసుకు రాబడింది దోపిడీలు సాగించి ఆ దొంగలు కూడబెట్టిన సంపద.

"ఒక్క శకటం సరిపోదు... కనీసం పది శకటాలైనా అవసరం అవుతాయి" గుండెల మీద చెయ్యివేసుకుంటూ అన్నాడు సేనాధిపతి.

"మనం చేయగలిగిన సహాయం చేయటం పూర్తి అయిపోయింది. వాళ్ళ బాధలు ఏవో వాళ్ళు పడతారు. మన దారిన మనం వెళ్ళిపోవటం చాలా ఉత్తమం" సన్నగా శ్యామలుడి చెవిలో ఊదాడు గదాధరుడు.

"మేము వెళ్ళి వస్తాము నగర పాలకుల వారూ" అంటూ నగరపాలకుడికి చెప్పబోయి, చటుక్కున ఆ మాటల్ని మ్రింగివేశాడు శ్యామలుడు.

అంతకుముందు వరకూ ఎంతో నిర్మలంగా ఉన్న ఆకాశం ఒక్కసారిగా కావురు కమ్మినట్లుగా మారిపోవటమే అందుకు కారణం.

"ఇదేమిటి? వర్షం ఏమైనా రాబోతున్నదా?" ఆశ్చర్యంగా అంటూ తల పైకెత్తి చూసిన గదాధరుడి గుండెలు ఝల్లుమన్నాయి.

"ప్రమాదం ముంచుకు వస్తోంది... త్వరపడండి అందరూ... గుహ లోపలికి పరిగెత్తి మీ ప్రాణాలు కాపాడుకోండి...." అని బిగ్గరగా అరుస్తూ అందరి కంటే ముందుగా తను అటుగా పరిగెత్తాడు.

అతని వెనకే శ్యామలుడు – అతన్ని అనుసరించి నగర పాలకుడు, ఆ తరువాత సైనికులు, సైన్యాధిపతి అందరూ గుహలోపలికి గెంతారు.

ప్రక్కకులాగి ఉంచిన బండరాయిని బరబరమని గుహ ద్వారానికి అడ్డుగా నెట్టేశారు స్నేహితులు ఇద్దరూ.

"ఏమయింది వీరులారా? ఇప్పుడు మనల్ని తరుముకుంటూ వస్తున్న ప్రమాదం ఎటువంటిది?" అయోమయంగా చూస్తూ అడిగాడు నగరపాలకుడు.

ద్వారానికి అడ్డుగా లాగిన బండరాయిని కొంచెంగా, కేవలం చిటికెన వేలు పట్టేటంత మేరకు జరిపి బయటికి చూడమన్నట్లు సైగ చేశాడు గదాధరుడు.

నగరపాలకుడు చూశాడు. సైన్యాధిపతి చూశాడు. కాళ్ళల్లో బలం లేనట్లు బండరాయిని ఆసరాగా చేసుకున్నారు ఆ ఇద్దరూ.

రెక్కల్ని తపతపలాడిస్తూ గుహ వెలుపల గందరగోళంగా చక్కర్లు కొడుతున్నాయి కాకులు.

ఒకటి రెండు కాదు... వందలు వేలు కూడా కాదు. లక్షల సంఖ్యలో ఉన్నాయి అవి. వాటి రాక కారణంగానే నల్లబడిపోయింది ఆకాశం... కావురు కమ్మినట్లు తయారయింది.

"ఎందుకు వచ్చాయి ఇవి... ఇక్కడ వాటికి ఏం కనిపించి ఉంటుంది." తడి ఆరిపోయినట్లు తయారయిన కంఠాన్ని చేతులతో అదుముకుంటూ అడిగాడు నగరపాలకుడు.

"ఆహారం కోసం రాలేదు అవి... వాటి సహచరుల్నో, సంతానాన్నో రక్షించుకోవటానికి కూడా అయిఉండదు. ఎందుకంటే మనం ఆ కాకుల్నే కాదు, అసలు ఏ విధమైన పక్షినీ చూడలేదు ఇప్పటివరకూ" అన్నాడు గదాధరుడు.

"మరి ఇంత పెద్ద సంఖ్యలో అవి దేనికి వచ్చినట్లు?" మరో ప్రశ్న వేశాడు నగరపాలకుడు.

"మిత్రమా... నా మట్టి బుర్రకు ఎటువంటి ఆలోచనా రావటం లేదు. నీ మాట ఏమిటి?" శ్యాములుడిని అడిగాడు గదాధరుడు.

సైన్యాధిపతి వంక చూశాడు శ్యామలుడు. "ఎవరైనా ఒకరు గుహ వెలుపలికి వెళ్ళి కొద్దిసేపు అటు ఇటూ సంచరించాలి" అన్నాడు.

"అమ్మో... అవి కత్తులవంటి తమ ముక్కులతో పొడిచి పొడిచి ప్రాణాలు తీస్తాయి కదా...." భయం భయంగా అన్నాడు సైన్యాధిపతి.

"ప్రాణాలు తీస్తాయో, తీయవో మనకు నికరంగా తెలియాలి" అన్నాడు శ్యామలుడు.

వెనక్కి తిరిగి తన సైనికుల వంక చూశాడు సేనాధిపతి. వారి వదనాల్లోని భయాన్ని గమనించి, తనే వెలుపలికి వెళ్ళటానికి సిద్ధం అయినాడు.

సన్నగా తెరిచిన బండను మరికొంచెం అవతలికి జరిపాడు గదాధరుడు. ఒక్క గంతులో వెలుపలికి పోయాడు సేనాధిపతి.

శ్యామలుడు చెప్పినట్లు అటుఇటూ సంచరించే అవకాశం అతనికి లభించ లేదు. వెలుపలికి వచ్చిన మరుక్షణికంలో గగ్గోలుగా అరుస్తూ అతనివైపు దూసుకు వచ్చాయి కాకులు.

ఆలస్యం చేస్తే అతను చిటికెలో ప్రాణాలు కోల్పోవటం తథ్యమని గ్రహించి, గబుక్కున ముందుకు కదిలి, అతన్ని బలంగా గుహలోకి లాగేశాడు శ్యామలుడు.

వెంటనే బండరాయిని యథాస్థానంలోకి జరిపాడు గదాధరుడు. అయినా కూడా అప్పటికే కొంచెం ఆలస్యం అవనే అయింది.

వింటినుంచి వెలువడిన బాణాల మాదిరి గుహలోకి దూసుకు వచ్చేశాయి పది కాకులు.

సేనాధిపతి ముఖానికి ఉన్న తలపాగాను వేగంగా ఊడతీసి వాటి రెక్కల మీద దడదడా కొట్టాడు గదాధరుడు.

చెవులు చిల్లులు పడిపోయేటట్లు వికృతంగా అరుస్తూ క్రింద పడిపోయాయి అవి... తిరిగి పైకి లేవకుండా తలపాగాను వెడల్పు చేసి వాటి శరీరాల మీద వలలాగా కప్పేశాడు.

"మనకు ఎవరికీ అర్థం కాని మర్మం ఏదో ఇక్కడ ఉన్నది... అది ఏమిటో తెలుసుకోలేకపోతే ఈ వాయసాలు మనల్ని వదిలిపెట్టవు" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"మంత్రవాదుల్ని ప్రోత్సహించడం, మాయలు మంత్రాలను ప్రదర్శించే వారికి ఆశ్రయం కల్పించటం మా నగరంలో ఎవరికీ అలవాటు లేదు. ఈ పరిస్థితి మాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది" అన్నాడు నగరపాలకుడు.

"ఒకటి రెండు పక్షులు ఒకే ప్రదేశంలో కనిపించడం చాలా సహజం. ఒక్కోసారి పది పాతిక సంఖ్య వరకూ అగుపించవచ్చు. మబ్బులు కమ్మినట్లు ఒకేసారి ఇన్ని వాయసాలు ప్రత్యక్షం అవటం మాత్రం అనుమానించదగ్గ అంశమే...." అన్నాడు గదాధరుడు.

సైన్యాధిపతి వంకా, గుహలో ఒదిగి నిలుచుని ఉన్న సైనికుల వంకా చూశాడు శ్యామలుడు.

"వీరుడా... మా నగర పాలకుల వారు చెప్పిన పనులు చేయటమే మా కర్తవ్యం... మంత్ర తంత్రాలకు మాకు నూరు ఆమడల దూరం" వెంటనే తమను గురించి చెప్పాడు సైన్యాధిపతి.

"గుహలో ఉన్న దొంగల్ని బయటికి రప్పించి శకటం మీద పడవేసినప్పుడు ఈ పక్షులు ప్రత్యక్షం కాలేదు...." అన్నాడు శ్యామలుడు.

చటుక్కున చిటికె వేశాడు గదాధరుడు "సొత్తు మిత్రమా... దోపిడీ దొంగలు దాచిపెట్టిన సొత్తును బయటికి తీసుకు వచ్చిన మరుక్షణం ప్రత్యక్షం అయ్యాయి ఇవి...." పెద్దగా అన్నాడు.

"మా నగరంలోను, నగరం చుట్టుపట్ల ఉండే గ్రామాల్లోను దోచుకున్న సంపద అది. నాణేల మూటలు, నగల పేటికలు... ఆభరణాలు నిండిన మందసాలు...." అంటూ తాము గుహలో నుంచి బయటికి చేర్చిన వస్తువులను గురించి చెప్పటం మొదలు పెట్టాడు ఒక సైనికుడు.

"మర్చిపోకుండా చెప్పు. వెలుపలికి వచ్చినవన్నీ లెక్కకు సరిపోవల్సిందే" అంటూ అతన్ని ప్రోత్సహించాడు సేనాపతి.

"అవును వీరుడా... ఆఖర్లో ఒక నలుపు రంగు సందుగాయ పేటికను నేనే స్వయంగా బయటికి చేర్చాను... అన్నిటికంటె ఆఖర్లో చిన్నబండమీద పెట్టాను...." అన్నాడు మరో సైనికుడు.

"ఆ పేటికలో ఎటువంటి సంపద ఉన్నట్లు నీకు అనిపించింది?" అడిగాడు గదాధరుడు.

"నాకు తెలియదు వీరుడా... పేటిక మాత్రం విచిత్రంగా ఉన్నది...." అంటూ ముందుకు వచ్చాడు అతను.

వెంటనే బండరాయిని తిరిగి కొంచెంగా ప్రక్కకు జరిపాడు గదాధరుడు.

"అదిగో... బోషాణం వంటి పెద్ద మందసం ప్రక్కనే ఉన్నది ఆ పేటిక... నేను పెట్టిన ప్రదేశంలో నుంచి ప్రక్కకు జరిగింది...." అంటున్న సైనికుడిని అవతలకు నెట్టి, తను బయటికి తొంగి చూశాడు.

రెండేరెండు క్షణికాలపాటు చూశాడు... "మిత్రమా... అదే. ఆ పేటికే ఇప్పటి మన పరిస్థితికి కారణం... చూడు...." అంటూ శ్యామలుడిని పిలిచాడు.

బయటికి చూసిన శ్యామలుడు వళ్ళు గగుర్పొడిచింది.

గుంపులు గుంపులుగా ఆ పేటిక దగ్గర వాలుతున్నాయి వాయసాలు... తమ కాలి గోళ్ళతో దాన్ని పట్టుకుని గాలిలోకి లేపటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి.

"ఆ పేటికలో వాటికి అవసరం అయిన వస్తువు ఏదో నిక్షిప్తమై ఉంది. దానికోసమే ఇన్ని పక్షులు ప్రత్యక్షం అయ్యాయి...." అన్నాడు శ్యామలుడు.

"ఆ కాకుల దండు చూస్తుండగా మనం గుహలో నుంచి బయటికి పోలేము. అలాగని శాశ్వతంగా ఇక్కడే కాపురం ఉండనూ లేము... ఎలా??" అడిగాడు గదాధరుడు.

దోపిడీదొంగల ఆచూకీ లభించిన క్షణం నుంచీ విశ్రాంతి అనేది లేకుండా పని చేస్తున్నారు నగరపాలకుడి సైనికులు... ఆహారం అడగలేరు... దాహం తీర్చుకోలేరు... అలసట అధికం అయిపోతున్నా లెక్కచేయటం లేదు.

ఎంత సమయం అలా ఉండగలరు వాళ్ళు.

"ఏదో ఒకటి ఆలోచించు... మనం ఈ గుహలో నుంచి వెలుపలికి వెళ్ళిపోవాలి...." దృఢస్వరంతో అన్నాడు శ్యామలుడు.

"వెనుక ఏదైనా దారి ఉన్నదేమో...." అని చెప్పబోయి ఆగిపోయాడు దగాధరుడు... "వెతికాము వీరుడా... ఒక్కటే మార్గం – రెండవది ఉన్నట్లయితే ఈ దుర్మార్గులు మన చేతులకు చిక్కి ఉండేవారు కాదు" అన్నాడు ఒక సైనికుడు.

బండరాయి ద్వారానికి అడ్డుగా ఉండటంతో, వాయు సంచారం నిలిచిపోయింది గుహల్లో... అంతకు ముందు దోపిడీ దొంగల్ని వివశుల్ని చేసిన మైకపు గాలి, అక్కడక్కడా నిలిచి ఉంది కాబోలు – తెలివి తప్పుతున్నట్టుగా అనుభూతిని పొందసాగారు కొందరు సైనికులు.

తల పాగాలను తమ నాశికాలకు అడ్డుగా కట్టుకున్నా కూడా ఎక్కువ సమయం ఆ ప్రదేశంలో ఉండడం వల్ల కలుగుతున్న అనుభూతి అది.

ఎటువంటి కఠోర శ్రమనైనా కనురెప్ప కదిలించకుండా భరించటానికి తగిన శిక్షణ పొందిన వారు కావటం వల్ల బయటికి చెప్పటం లేదు వారు.

"మిత్రమా... మనం వెలుపలికి వెళ్ళిపోవటం చాలా మంచిది. ఈ గుహలో గాలి నా ఒంటికి సరిపడటంలేదు" సూటిగా చెపితే ఆ వీర సైనికులు నొచ్చుకుంటారన్న అనుమానంతో, శ్యామలుడికి విషయాన్ని అన్యాపదేశంగా వివరించాడు గదాధరుడు.

ఒక్క అంగుళం మేర కూడా సందులేకుండా గుహ ముందున్న పొదల్ని, బండల్ని, దోపిడీ దొంగలున్న బండిని, ఆఖరికి బయటికి చేరవేయబడిన మూటల్ని అన్నిటినీ ఆక్రమించుకు ఉన్న వాయసాల వంక పరిశీలనగా చూసి, దీర్ఘంగా నిట్టూర్చాడు శ్యామలుడు.

వాయసాలు ఎత్తుకు పోవాలని అనుకుంటున్న సందుగాయ పెట్టెలోనే విషయం అంతా ఉండి ఉంటుంది. ఆ పేటికనే అక్కడినుంచి అవతలికి విసిరి వేయగలిగితే!

నడుముకు చుట్టుకుని ఉన్న దట్టీని ఊడతీసి తన తలచుట్టు, ముఖం చుట్టూ చుట్టుకున్నాడు అతను.

"సిద్ధంగా ఉండండి... ఆ పక్షులు నన్ను తరమటం మొదలు పెట్టగానే మీరందరూ బయటికి పరిగెత్తి దూరంగా వెళ్ళిపొండి" అని నగర పాలకుడికి చెపుతూ తన జతగాడికి సైగ చేశాడు.

బండరాయిని ప్రక్కకు జరిపినట్లే జరిపి, మళ్ళీ వెంటనే యధాస్థానానికి చేర్చాడు గదాధరుడు.

వింటినుంచి వెలువడిన బాణంలా వృషభశకటం దగ్గరికి పరుగు తీశాడు శ్యామలుడు.

కాకులు పైకి లేపటానికి ప్రయత్నిస్తున్న పేటిక మీద చేతులు వేస్తూ ముందుకు చూసిన అతనికి వళ్ళు జలదరించింది.

చిన్నపాటి మాంసపు ముద్దలు కూడా మిగల లేదు వృషభాల వంటి మీద. అస్థిపంజరాలుగా మారిపోయాయి అవి.

ధాన్యపు సంచుల మాదిరి శకటం మీద పడవేసిన దోపిడీ దొంగల పరిస్థితి కూడా అదే. ఒక్కడు కూడా ప్రాణాలతో మిగలలేదు. పిశాచాల మాదిరి వారిని పొడుచుకు తినేశాయి వాయసాలు.

ఆలస్యం చేస్తే తనకు కూడా అదే గతి పడుతుందని అర్థమై, రెక్కలతో, ముక్కులతో తన మీద దాడి చేయటం మొదలు పెట్టిన కాకుల్ని గురించి పట్టించుకోకుండా క్రింద ఉన్న పేటికను పైకి ఎత్తాడు అతను.

చెవులు చిల్లులు పడేటట్లు అరుస్తూ అతన్ని హింసించటానికి ప్రయత్నించాయి కాకులు అన్నీ.

"పరిగెత్తాలి మిత్రమా... వేగంగా పరుగు తీయాలి..." వెనుకనుంచి శ్యామలుడికి వినిపించింది గదాధరుడి కంఠం.

తన మాదిరిగానే దట్టీతో తలను, ముఖాన్ని కప్పుకుని, అతనుకూడా బయటికి వచ్చేశాడని తెలిసి, చిన్న చిరునవ్వు ఒకటి ప్రత్యక్షం అయింది శ్యామలుడి పెదవుల మీద.

వట్టిగా రాలేదు గదాధరుడు... గుహలో కనిపించిన ఒక దివిటీని వెలిగించి వెంట తీసుకు వచ్చాడు. దాన్ని తల మీదికి ఎత్తి పట్టుకుని గిరగిరా తిప్పుతూ తన స్నేహితుడిని అనుసరించాడు.

ఏటవాలుగా క్రిందికి దూసుకువచ్చి శ్యామలుడి మొఖాన్ని గాయపరచ బోయి, ఆ దివిటీ వేడిమికి భయపడటం మొదలు పెట్టాయి కాకులు.

అడ్డువచ్చిన పొదల మీది నుంచి, బండల మీది నుంచి ఎగిరెగిరి దూకుతూ గుహకి రెండు వందల ధనువుల దూరం పోయాడు శ్యామలుడు.

అప్పుడు కూడా అతన్ని వదలలేదు కాకుల గుంపు... వికృతంగా అరుస్తూ వెంటపడి తరుముతూనే ఉన్నది.

"దివిటీ కొండెక్కి పోయే లోపల మనం వాటిని వదిలించుకోలేకపోతే చాలా ప్రమాదం మిత్రమా..." ఉన్నట్లుండి హెచ్చరించాడు గదాధరుడు.

"ఏం చేయాలో నువ్వే చెప్పు" అన్నాడు శ్యామలుడు.

"వీటికి కావల్సినది ఏదో ఈ పేటికలో ఉన్నదని నాకు అనిపిస్తోంది... అదేమిటో తెలుసుకుని వాటికి ఇచ్చేస్తే మనం క్షేమంగా బయట పడవచ్చు..." అన్నాడు గదాధరుడు.

ఎత్తి నేలకేసి కొట్టాడు శ్యామలుడు తను పట్టుకు వస్తున్న పేటికని.

వికృతి శబ్దాలు చేస్తూ ముక్కలు ముక్కలై పోవాల్సిన ఆ పేటిక, ఇసుమంత కూడా చెక్కుచెదరలేదు... ఇసుకలో పడినట్లు ప్రక్కకు కూడా దొర్లకుండా అలాగే ఉండిపోయింది.

దివిటీ విసురుకు బెదిరి పైపైన తిరుగుతున్న వాయసాలు అన్నీ ఒకేసారి భీకరంగా అరిచాయి.

"పెట్టెను పగల గొట్టడం ఇష్టం లేనట్లుంది" అన్నాడు గదాధరుడు.

క్రింది నించి మరోసారి దాన్ని పైకిలేపి, ఈసారి మరింత బలంగా విసిరికొట్టబోయాడు శ్యామలుడు.

"ఆగుమిత్రమా... ఒక్కక్షణం ఆగు...." అంటూ అతన్ని ఆపి, ఆ పేటిక వంక పరిశీలగా చూశాడు గదాధరుడు.

సందుగాయ పేటిక కావడం వల్ల, దాని మూత లోపలి భాగంలోనే అమర్చబడి ఉన్నది తాళం... తాళం చెవిని ఉపయోగించటానికి రంధ్రం మాత్రమే బయటికి కనిపిస్తోంది.

"తీరిందా నీ అనుమానం? విసిరి వేయవచ్చా?" అడిగాడు శ్యామలుడు.

"ఆగమంటున్నాను కదా... ఆత్రం దేనికి?" విసుగు నిండిన కంఠంతో అంటూ తన దుస్తుల్లో నుంచి పెద్ద తాళం చెవిని ఒకదాన్ని బయటికి తీశాడు గదాధరుడు.

నిమ్మతోటలో మట్టి కట్టడం దగ్గిర పచ్చల పతకాన్ని గజ నిమ్మపళ్ళతో పూజించినప్పుడు ప్రత్యక్షం అయిన పరికరం అది. ఇప్పుడు శ్యామలుడి చేతిలో

ఉన్న పేటికను తెరిచేందుకే తయారు చేయబడినట్లు చక్కగా ఇమిడిపోయింది ముందు భాగంలో.

"చిత్రాలలోకెల్లా మహావిచిత్రం ఇది" అంటూ తాళం చెవిని బలంగా ప్రక్కకు తిప్పాడు గదాధరుడు.

క్లిక్‌మనే శబ్దంతో తనంతట తానుగా తెరుచుకున్నది పేటిక.

అపురూపమైన మరకత మాణిక్యాలు పొదగబడి వున్న హస్త కంకణాలు రెండు కనుల విందుగా కనిపించాయి వారిద్దరికీ.

"ఎవరో స్త్రీలు ధరించే ఆభరణాలు ఇవి... మనకి పనికిరావు... ఈ పేటికను తెరిచే ఉపాయం స్ఫురించక పోవడం వల్ల పేటికతో సహా ఎత్తుకు వచ్చేసి ఉంటారు ఆ దొంగలు...." అన్నాడు శ్యామలుడు.

ఆ మాటల్ని గదాధరుడు వినిపించుకోలేదు. ఆ కంకణాలను పేటికలో నుంచి బయటికి తీసి పైన గిరికీలు కొడుతున్న కాకుల గుంపునకు గురిపెట్టాడు.

తమను అంతమొందించే ఆయుధాన్ని తమకు చూపించినట్లు భయంతో బెంబేలెత్తిపోయాయి ఆ వాయసాలు... కన్నుమూసి కన్ను తెరిచేటంతలో దూరంగా వెళ్ళిపోయాయి.

ముసురు పట్టినట్లు మూసుకుపోయిన ఆకాశం వెంటనే తెరిపిన పడింది. మబ్బుల చాటుకు వెళ్ళిపోయినట్లుగా మసకబారిన సూర్యుడు తిరిగి తన వెలుగుతో ఆ ప్రదేశాన్ని రంజింప చేయటం మొదలుపెట్టాడు.

జారిపోయిన ధైర్యాన్ని కూడ గుట్టుకుని పారిపోయిన కాకులు, మరోసారి తమ మీదికి వస్తాయన్న ఉద్దేశంతో, ఎండు కొమ్మల్ని పోగుచేసి, పెద్దపెద్ద చితుకుల మంటల్ని సిద్ధం చేశాడు గదాధరుడు.

పావుఘడియ... ఘడియ... రెండు ఘడియల కాలం గడిచిపోయిన తరువాత కూడా ఆ వాయసాలు తమ చుట్టుపట్ల కనిపించక పోవటంతో గుండెల మీద బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూర్చాడు.

"ఈ కంకణాలలో ఏదో శక్తి నిక్షిప్తమై ఉన్నట్లు నాకు అనిపిస్తోంది. ఇవి ఎందుకు ఉపయోగపడతాయో తెలియటం లేదు" అంటూ శ్యామలుడు క్రింద పెట్టిన పేటిక కోసం చూశాడు.

ఏ తాళం చెవితో దాన్ని తెరిచాడో, ఆ తాళం చెవితో సహా క్రింద పెట్టిన మరుక్షణమే భగ్గున మండి– చూస్తూ ఉండగానే బూడిద గుట్టగా మారిపోయిందా సందుగాయ పేటిక.

"ఏం చేద్దాం మిత్రమా...." అడిగాడు స్నేహితుడిని.

"గంధవతి నగరంలో జరిగిన దోపిడీలలోని భాగం ఈ కంకణ ద్వయం. నగర పాలకుడికి అప్పచెప్పటం మన ధర్మం...." అన్నాడు శ్యామలుడు.

"మిత్రమా... మనం కూడా దొంగలమే... మర్చిపోయావా?" నవ్వుతూ అడిగాడు గదాధరుడు.

"ఆ నగర పాలకుడు అహంభావి అయి ఉంటే అది వేరే సంగతి. మన పరాక్రమం మీద నమ్మకం ఉంచాడు. మనతో మర్యాదగా మాట్లాడాడు. అటువంటి మనిషిని మోసం చేసి, అతని రాజ్యానికి సంబంధించిన సొత్తుతో మాయం కావటం మంచిది కాదని నాకు అనిపిస్తోంది" సాలోచనగా అన్నాడు శ్యామలుడు.

"మిత్రమా... ఇది గంధవతి పాలకుడి సొత్తు అనే మాటలో అసత్యం ఏమీ లేదుగానీ, వాటిని ఆ పేటికలో నుంచి బయటికి తీసిన తాళం చెవి మాత్రం నగర పాలకుడికి చెందినది కాదు... కాబట్టి ఈ ఆభరణాలను...." అంటూ సంభాషణను పొడిగించబోయాడు గదాధరుడు.

"వాదన అనవసరం మిత్రమా... మనం వచ్చిన దారినే వెనక్కివెళ్ళి వాటిని నగర పాలకుడికి అప్పగించటం మంచిది" అంటూ వెనుతిరిగి నడక మొదలు పెట్టాడు శ్యామలుడు.

"శకటానికి కట్టిన వృషభాలు అస్తిపంజరాలైపోయాయి. బందీలైన దొంగలందరూ తమ రూపాల్ని కోల్పోయారు... ఆ దృశ్యాల్ని చూసి భయంతో తలా ఒక ప్రక్కకు పారిపోయి ఉంటారు వారందరూ... మనకి మార్గాయాసం మాత్రమే మిగులుతుంది...." సన్నగా గొణుగుతూ అతన్ని అనుసరించాడు గదాధరుడు.

మూడు ఘడియలు పట్టింది వారిద్దరికీ తాము వదిలిపెట్టి వచ్చిన గుహ దగ్గరికి చేరుకోవటానికి.

శకటం అక్కడే ఉన్నది శరీరాలు అలాగే పడిఉన్నాయి. గుహలో నుంచి వెలుపలికి తీసుకువచ్చిన సంపద కూడా ఆ ప్రదేశంలో ఉన్నది. నగరపాలకుడు

లేదు. సేనాధిపతి లేదు. వారి సైనికులు కూడా ఆ చుట్టుపట్ల ఎక్కడా అగుపించ లేదు."

*   *   *   *   *

"ఎవరు మీరు? ఎక్కడి నుంచి వస్తున్నారు??" తన చేతిలో ఉన్న బరిశెను గదాధరుడి గుండెలకు గురి పెడుతూ కరుకుగా ప్రశ్నించాడు ఆ భటుడు.

"అయ్యా... మేము కాందిశీకులం... చాలా దూరం నించి కాలినడకన వస్తున్నాము. ఈ గంధవతి పాలకుల వారిని దర్శించుకోవాలన్నది మా కోరిక." వినయాతి వినయంగా సమాధానం చెప్పాడు గదాధరుడు.

పక్కున నవ్వాడు ఆ భటుడు.

"రండి... అందరూ రండి... వెంటనే వచ్చి ఈ కాందిశీకుడి మాటల్ని వినండి" అంటూ అవతలగా ఉన్న మరి కొందరు భటుల్ని పిలిచాడు.

"గంధవతి పాలకుడు మర్యాద కలిగిన వాడని అన్నావు నువ్వు" శ్యామలుడి కేసి చూస్తూ కినుకగా అన్నాడు గదాధరుడు.

"ఇప్పుడు నీకు కలిగిన కష్టం ఏమిటి?" అడిగాడు శ్యామలుడు.

"వాడు ఎవడోగాని మనల్ని వెక్కిరించి వేళాకోళం చేయదలుచుకున్నాడు" అంటూ భటుడి వైపు తిరిగాడు గదాధరుడు.

"అయ్యా... దయచేసి మమ్మల్ని నగరపాలకుల వారి వద్దకు తీసుకుపోండి" అంటూ అర్థించాడు.

"గంధవతి నరగ పాలకుల వారి వద్దకేనా?" ఎదురు ప్రశ్న వేశాడు అతను. తల ఊపాడు గదాధరుడు.

"పాతిక గవ్యూతుల దూరం నడిచిన తర్వాత పెద్ద అడవి వస్తుంది. ఆ అడవికి దక్షిణ దిశలో ఉంటుంది గంధవతి... ఇది వైకాశి నగరం... వీరవల్లభుల వారి పరిపాలనలో ఉన్నటువంటిది" అన్నాడు ఆ భటుడు.

తన చెవులను తనే నమ్మలేకపోతున్నట్లు కనులు పెద్దవి చేసి చూశాడు గదాధరుడు.

"దారి తప్పినట్లున్నాము మిత్రమా... వైకాశి నగరమట ఇది" శ్యామలుడికి చెప్పాడు.

"ఎందుకు వచ్చారు మీరు? ఏమిటి పని?" రెట్టించి అడిగాడు భటుడు.

"అయ్యా... పొరపాటు జరిగిపోయింది. మేము గంధవతికి పోబోయి" అంటూ యధార్ధం చెప్పబోయాడు గదాధరుడు. దుమ్ము తెరలు రేపుకుంటూ ఒక అశ్వం అక్కడికి వచ్చేసరికి ఆగిపోయాయి అతని మాటలు.

"వాళ్ళెవరో బందిపోటుదొంగల మాదిరి ఉన్నారు. దుస్తుల్ని తడిమి దోపిడీ సొత్తు ఏదయినా ఉంటే స్వాధీనం చేసుకోండి" అన్నాడు అశ్వం మీది వ్యక్తి.

అలుపు ఆయాసం అనే మాటలకు అర్ధం తెలియనట్లు అదేపనిగా, నడిచి నడిచి, తాము ఎటువంటి నగరానికి చేరుకోవటం జరిగిందో ప్రత్యక్షంగా తెలిసి వచ్చేసరికి, నెత్తిమీద చేతులు పెట్టుకుని, నేలమీద చతికిలపడిపోవాలని అనిపించింది గదాధరుడికి.

"ఆ కొని వచ్చిన వారికి ఆహారం అందియ్యాలనుకునే నగరపాలకులు చాలా తక్కువమంది ఉన్నట్లు నాకు అనిపిస్తోంది మిత్రమా... ఈ భూప్రపంచంలో నీతి న్యాయం జాలి కరుణ అనే సద్గుణాలు మటుమాయం అయిపోయినట్లు అనిపిస్తోంది" శ్యామలుడి చెవిలో ఊదాడు చాలా చిన్నగా.

"ఏమిటా గొణుగుడు? కదలకుండా నిలుచోండి. పారిపోవటానికి మాత్రం ప్రయత్నం చేయకండి... మా కరుకు కత్తులకు ఆహారంగా మారిపోతారు" అశ్వం మీది నుంచి క్రిందికి దిగకుండానే హెచ్చరించాడు కొత్తగా వచ్చిన అశ్వికుడు.

"ఆర్యులకు ఆవేశం చాలా అధికంగా ఉన్నట్లు కనిపిస్తోంది. తమరు ఎవరో తెలుసుకోవటానికి వీలుపడుతుందా? తమరి నామధేయం ఏమిటో మేము వినవచ్చునా?" చేతులు జోడించి నమస్కారం చేస్తూ బహువినయంగా అడిగాడు గదాధరుడు.

ఎటువంటి హెచ్చరిక కూడా చేయకుండా చాచిపెట్టి అతని చెంపమీద కొట్టాడు నగర ద్వారాల దగ్గర ఉన్న భటుడు.

కొరడాపెట్టి కొట్టినట్లు వినవచ్చింది వికృత శబ్దం. తన చెంప పగిలిపోయిన అనుభూతి కలిగింది గదాధరుడికి. ప్రక్కకు తూలి క్రింద పడిపోబోయాడు.

చటుక్కున చేతుల్ని జాచి గట్టిగా పట్టుకున్నాడు శ్యామలుడు.

"వద్దు మిత్రమా... ఈ నగరం ఎటువంటిదో ఇక్కడి ఆచార వ్యవహారాలు ఎటువంటివో పూర్తిగా తెలియకుండా ఆవేశ పడకూడదు. ఆగిపో...." చిన్న కంఠంతో అతన్ని హెచ్చరించాడు గదాధరుడు.

హెచ్చరించటంతో ఆగలేదు అతను. చిమచిమలాడటం మొదలుపెట్టిన చెంపను తడుముకోవటాన్ని వదిలేసి అతని భుజాల్ని గట్టిగా పట్టుకుని వెనక్కి లాగటానికి ప్రయత్నం చేశాడు.

కాని అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

తనకు ఎటువంటి బాధ కలిగినా ఇసుమంత కూడా పట్టించుకోని శ్యామలుడు తన జతగాడి వంటిమీద ఒక చిన్న ఈగవాలినా చూస్తూ ఊరుకోలేడు. ఆ సమయంలో అతనికి వచ్చేకోపం సామాన్యంగా ఉండదు.

ఆ సంగతి బాగా తెలుసు గదాధరుడికి. అందుకే అతన్ని శాంతింప చేయటానికి చూశాడు.

చెంపదెబ్బ అదటుకు ప్రక్కకు పడిపోయిన జతగాడిని పట్టుకుని, తిన్నగా నిలబెట్టిన వెంటనే ఆకలి మీద ఉన్న సింహం మాదిరి ఆ దెబ్బకొట్టిన భటుడి మీదకి ఎగబడ్డాడు శ్యామలుడు. పిడికిలి బిగించి ఒకే ఒక దెబ్బ కొట్టాడు అతని గుండెల మీద.

పెద్దగా అరవటానికి నోటిని తెరిచాడు ఆ భటుడు. శబ్దం బయటికి రాలేదు. ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి వచ్చింది.

నిర్ఘాంతపోయినట్లున్నాడు అశ్వం మీద వచ్చిన పెద్ద మనిషి – కళ్ళు పెద్దవి చేసి అలాగే చూస్తూ ఉండిపోయాడు ఆ దృశ్యాన్ని.

నెత్తురు కక్కుకుంటున్న భటుడిని వదిలేసి అదే వేగంలో అతనితో పాటుగా నిలబడి ఉన్న మరో నలుగురు భటుల మీదకి పోయాడు శ్యామలుడు. కనులు మూసి కనులు తెరిచేటంతలో గింగిరాలు తిరుగుతూ నేలకూలిపోయారు వారు కూడా.

అప్పటికీ అణిగిపోలేదు శ్యామలుడి ఆగ్రహం. గిరుక్కున ప్రక్కకు తిరిగి, చివ్వున గాలిలోకి ఎగిరాడు.

విస్ఫారిత నేత్రాలతో అలాగే చూస్తూ ఉండిపోయిన అశ్వికుడికి తెలియలేదు ఆ తరువాత ఏం జరుగబోతున్నదో. అతని అశ్వానికి తెలిసింది.

వికృతంగా సకిలిస్తూ ప్రక్కకు తిరిగి దూరంగా పరిగెత్తే ప్రయత్నం చేసింది అది. రెండు అడుగుల దూరం కూడా పోక ముందే, పిడుగుపాటు మాదిరి పోయి అశ్వికుడి తలకు తగిలింది గాలిలోకి ఎగిరిన వెంటనే శ్యామలుడు ముందుకు జాచిన ఎడమ పాదం.

లావుపాటి ఇనుప సమ్మెట ఏదో వచ్చి తనకు తగిలినట్లు కీచుగా అరిచాడు అశ్వికుడు. దెబ్బ తగిలిన ప్రదేశాన్ని చేతులతో అదుముకుంటూ అశ్వం మీది నుంచి జారి క్రింద పడిపోయాడు.

ఒరలో ఉన్న కరవాలాన్ని బయటికి లాగి, అతని దగ్గరికి దుముకబోతున్న శ్యామలుడిని వెనుక నుంచి గట్టిగా పట్టుకున్నాడు గదాధరుడు.

"వదులు మిత్రమా... అపరిచితులను గురించి పూర్తిగా తెలుసుకోకుండా, నిందలు వేసిన వాడి తల తెగి పోవాల్సిందే... నిన్ను హింసించమని ఆజ్ఞ ఇచ్చిన ఇతని ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే...." కరకరమంటున్న కంఠంతో అన్నాడు శ్యామలుడు.

"నువ్వు కోపం చేస్తే తట్టుకోవటం వీరాధి వీర శూరాధి శూరులకే సాధ్యం కాదు. వాళ్ళెంత... వాళ్ళ బ్రతుకులు ఎంత? వదిలేయ్ మిత్రమా" అంటూ అతన్ని వదిలిపెట్టకుండా అవతలికి లాగాడు గదాధరుడు.

కొద్దిగా తగ్గింది శ్యామలుడి కోపం. పూర్తిగా కాదు.

"ఈ నగరంలో ఇకముందు ఎవరు మనల్ని వెక్కిరించినా, వేళాకోళం చేసినా సహించేది లేదు. వేటుకు తలకాయ చొప్పున నరికి పారేస్తాను" పళ్ళు బిగపట్టి అతనికి చెప్పాడు.

"అటువంటి పరిస్థితిని మనం ఎదురు చూడకూడదు. మార్గాయాసం తీరేవరకూ విశ్రాంతి తీసుకుందాం. మనం వెళ్ళవలసిన గంధవతి నగరానికి సరైన మార్గాన్ని తెలుసుకుని ప్రయాణం మొదలుపెడదాం. నువ్వు శాంతంగా ఉండు" అంటూ నగరంలోకి దారి తీశాడు గదాధరుడు.

దూర దూరంగా నిలబడి ఉన్నారు నగర ద్వారాల దగ్గర సంచరిస్తున్న పౌరులు. అక్కడ జరిగిన గందర గోళాన్ని కనురెప్పలు కదిలించకుండా గమనిస్తున్నారు.

"బాబులూ... మీరు ఎవరోగాని, వట్టి అమాయకుల మాదిరిగా ఉన్నారు" పది అంగల దూరం పోయిన తర్వాత రాచవీధిని ఆనుకుని ఉన్న ఒక సందు మొగదలకు పోయి చుట్టూ చూడటం మొదలుపెట్టిన గదాధరుడితో అన్నాడు ఒక మధ్య వయస్కుడు.

విశ్రాంతి తీసుకోవటానికి వీలు కల్పించే పూటకూళ్ళ ఇల్లు గాని, ధర్మ సత్రం గాని అక్కడికి దగ్గర్లో ఏదైనా కనిపిస్తుందేమోనని, ఆ సందు దగ్గర ఆగాడు గదాధరుడు.

ఒంటిచేత్తో కాపలా భటుల్ని, వారి మీద అధికారం చూపించే దళపతి వంటి అశ్వికుడిని చిటికెలో నేలకు దొర్లించగలిగిన తన జతగాడిని కూడా అమాయకుడి మాదిరి సంబోధించిన ఆ మధ్య వయస్కుడిని చూసి చిన్నగా నవ్వాడు అతను.

"ఎందుకు అలా అంటున్నావు పెద్దయ్యా?" అభిమానంగా అడిగాడు.

"వాడు... ఆ అశ్వం మీది నుంచి పడిపోయిన వాడు ఎవడో మీకు తెలుసా?" అడిగాడు ఆ మధ్య వయస్కుడు.

తల అడ్డం తిప్పాడు గదాధరుడు.

"వాడు నగర పాలకుడి ఏకైక కుమారుడు. భవిష్యత్తులో ఈ నగరానికి ఏలిక కావాల్సిన వాడు... పేరు లంబనాధుడు. పరమ పిశాచి... ఎదుటి వాళ్ళు ఎవరైనా సరే నవ్వుతూ ఉండటాన్ని చూసి భరించలేని అహంభావి" చెప్పాడు మధ్య వయస్కుడు.

"మీరు ఇద్దరూ ఎవరోగాని, జంట గువ్వల మాదిరి ముద్దుగా ఉన్నారు. ఈ నగరం మీకు సరిపడే ప్రదేశం కాదు. వెనక్కి వెళ్ళిపోండి... క్రింద పడిపోయిన ఆ లంబనాధుడికి తెలివి వచ్చిన వెంటనే నగరంలో ఉన్న భటులు అందరినీ మీ మీదికి ఉసికొల్పుతాడు...." తనను అడగకముందే తనంతట తానుగా చెప్పాడు మధ్యవయస్కుడి ప్రక్కనే ఉన్న మరో పౌరుడు.

"మీ నగరానికి ఏలిక కాబోయే మనిషిని గురించి మేము అడగకముందే ఇన్ని మాటలు చెపుతున్న మీకు అతనంటే భయంలేదా?" అంత వరకూ మౌనంగా ఉన్న శ్యామలుడు వెంటనే ప్రశ్నించాడు.

"తప్పులు చేసిన వారిని శిక్షించటం సహజం... తప్పులు చేయకపోయినా ప్రతి దినమూ ఏదో ఒక కారణాన్ని చూపించి మమ్మల్ని చింతబరికెలతో కొట్టిస్తూ ఉంటాడు ఆ లంబనాధుడు... మీతో ఇప్పుడు మాట్లాడినా, మాట్లాడకపోయినా మాకు దెబ్బలు తప్పవు. ఎందుకంటే మీరు అతన్ని గింగిరాలు తిరిగేట్టుగా పడగొట్టటాన్ని మేము చూశాము గనుక...." అన్నాడు ఆ పౌరుడు.

నగర పౌరుల్ని ఏదో ఒక కారణం చూపించి చిత్రహింసలకు గురి చేసే నగర పాలకుల్ని, భట సమూహాల్ని ఎంతో మందిని చూసి ఉన్నారు స్నేహితులు ఇద్దరూ. ఎటువంటి కారణము లేకుండా అటువంటి చర్యలకు పాల్పడేవారిని చూడటం మాత్రం అదే ప్రథమం.

“ఏం చేద్దాం మిత్రమా... వెనుతిరిగి వెళ్ళిపోదామా?” అడిగాడు గదాధరుడు.

పెదవులు బిగించి తల అడ్డం తిప్పాడు శ్యామలుడు. ఆపైన అతన్ని బలవంత పెట్టలేదు గదాధరుడు.

“పెద్దయ్యా... నడిచి నడిచి మా పాదాలు బొబ్బలు ఎక్కాయి. మా ఓపిక అంతా హరించుకు పోయింది. కొద్దిసేపు విశ్రాంతి అవసరం. ఆకలితో అలమటించిపోతున్న మాకు ఆహారం కూడా అవసరమే....” అంటూ తమ అవసరాలు ఇంకా వివరంగా చెప్పబోయాడు.

మధ్యలోనే అతన్ని ఆపేశాడు మధ్య వయస్కుడు. “వెనక్కి వెళ్ళిపోయే ఓపికలేదని అంటున్నారు కాబట్టి మీకు ఒక ఉపాయం చెపుతాను....” అంటూ ఒకసారి నగర ద్వారాల వైపు చూశాడు. తన మాటల్ని అక్కడి భటులుగాని, క్రింద పడి ఉన్న లంబనాధుడు గాని వినిపించుకునే పరిస్థితి లేదని నిశ్చయం చేసుకున్నాడు.

“ఈ సందు చివర వరకూ పోతే మీకు దొమ్మరివాడ కనిపిస్తుంది. కాయకష్టం చేసుకుని బ్రతికే వర్ణం అది. కాని అభిమానం ఆత్మగౌరవం చాలా అధికం వారందరికీ.... ఈ నగరంలో ఎవరూ సరైన కారణం లేకుండా వారి వాడలోకి పోరు....” అన్నాడు చిన్న కంఠంతో.

“లంబనాధుడు కూడానా?” కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

తల ఊపాడు మధ్యవయస్కుడు. “మట్టి తట్టలను మోసి మోసి, బండ రాళ్ళను బ్రద్ధలు చేసి చేసి మహా బలాఢ్యులుగా తయారయిన వర్ణం అది... వారంటే అందరికీ భయమే....” అన్నాడు.

“మనం ఇప్పటివరకూ అడుగుపెట్టిన ప్రతి నగరంలోనూ అట్టడుగు జాతి వారిగా పరిగణించబడిన వర్ణం అది. ఈ నగరంలో శక్తిమంతులుగా పేరుగావించటం నాకు వింతగానే ఉన్నది....” లోగొంతుకతో శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

"అసహజంగా వినిపించే మాటల్ని వినటానికి, విచిత్రమైన విషయాల్ని గమనించటానికి కంకణం కట్టుకుని ఉన్నాము మనం... ఆలస్యం చేయకుండా అడుగులు వేయి... ఆకలి చాలా అధికంగా ఉన్నది" అన్నాడు శ్యామలుడు.

అడగక ముందే ఆ నగరం గురించి తమకు ముఖ్యమైన మాటలు చెప్పిన మధ్య వయస్కుడికి, అతని ప్రక్కనే ఉన్న పౌరుడికి కృతజ్ఞతలు తెలియ చేసుకుని, వారు చూపించిన మార్గంలో నడవటం మొదలు పెట్టాడు గదాధరుడు.

*    *    *    *    *

"ఈ శ్యామల గదాధరుల చరిత్ర ఏమిటోగాని చిత్రాతిచిత్రంగా ఉన్నది అవ్వా... ఒక ప్రమాదంలో నుంచి మరో ప్రమాదంలోకి మంచినీళ్ళు తాగినంత తేలికగా దూకేస్తున్నారు... ఒకరోజులో ఎప్పుడయినా పది రెండు ఘడియలపాటు ప్రశాంతంగా ఉండటం వాళ్ళకు చేతనవుతుందా?" పళ్ళెరంలో కనిపిస్తున్న దృశ్యాలను చూస్తూ వృద్ధురాలు నీలమణిని అడిగింది యువరాణి.

"పాదరసం వంటి చురుకయిన బుద్ధి కలిగిన వారందరూ ఇంతే తల్లీ... కుదురుగా కూర్చోవటం చేతకాదు వారికి" అంటూ కనులు చిట్లించింది వృద్ధురాలు.

అంతకు ముందు కనిపించని ఏదో ఆత్రుత ఆమె వదనంలో అగుపించింది ఇప్పుడు యువరాణికి.

"వెండితాళం చెవిని వెతికి పట్టుకున్నారు... బహుశా అది గట్టిగా బంధించబడి ఉన్న కవాటాలను తెరవటానికి ఉపయోగపడుతుందని నేను భావించాను. ఎత్తి నేలకేసి కొడితే మూడు ముక్కలు అయిపోయే ఒక సందుగాయ పేటికను తెరవటానికి మాత్రమే పనికి వచ్చింది అది...." తాను చూసిన దృశ్యాలను గుర్తు చేసుకుంటూ అన్నది యువరాణి.

"ఆ పెట్టెలో రెండు కర కంకణాలు లభించాయి కదా...." అన్నది వృద్ధురాలు.

"అమోఘంగా ఉన్నాయి అవి. వాటిని ధరించగలిగిన వారు ఎవరై ఉంటారో!" ఆశ్చర్యపడింది యువరాణి.

"మానవమాత్రులు ఎవరూ వాటిని ధరించలేరని నాకు అనిపిస్తోంది. ఒకవేళ ధరించినా భరించ గలరనే మాట అనుమానమే."

"అంటే ఏమిటి అవ్వా? అర్థం అయ్యేటట్లు చెప్పు" అన్నది యువరాణి.

"ఆ కంకణాలు దైవిక శక్తులకు సంబంధించినవి అయి ఉంటాయని అనిపిస్తోంది...." చెప్పింది వృద్ధురాలు.

"అయితే ఆ నిమ్మతోటలో జరిగినటువంటి సంఘటనలే మరోసారి మనకు కనిపిస్తాయని నీ అభిప్రాయమా?"

చిన్నగా నవ్వి యువరాణి తల నిమిరింది వృద్ధురాలు.

"జరిగేది ఏమిటో నీ అంతట నువ్వే తెలుసు కోవటం బాగుంటుంది. చూస్తూ ఉండు...." అంటూ లేచి అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

పళ్ళెరంలోని నీటిలో కనిపించే దృశ్యాల మీదికి దృష్టిని మరలించింది యువరాణి. నోరు తెరిచి చిన్నపాటి శబ్దం చేసినా ఆ దృశ్యాలు మటుమాయం అయిపోయేవి అంతకుముందు.

వాటిని గమనిస్తూ, మధ్యమధ్యలో తన మనస్సులో అడుగుపెట్టిన అనుమానాల్ని నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఉండటంతో, వృద్ధురాలిని వేడుకున్నది ఆమె. ఆ రోజు నుంచీ శబ్దాలు చేయటమే కాదు, పెద్దపెద్ద మాటలు మాట్లాడినా, మాయం కావటం లేదు కనిపించే సంఘటనలు.

సందు చివరి భాగంలోకి పోతున్న స్నేహితులు ఇద్దరూ కొంచెం అస్పష్టంగా అగుపించటంతో – కనులు నులుముకుని మరీ చూసింది ఆమె.

మరింతగా అస్పష్టమైపోయింది దృశ్యం.

"అవ్వా... అవ్వా... త్వరగా రావాలి. త్వరగా" పెద్దకంఠంతో పిలిచింది యువరాణి.

అవతలి గదిలోకి పోయిన వృద్ధురాలు వెంటనే వచ్చింది. పళ్ళెరం వంక చూసి గట్టిగా నిట్టూర్చింది.

"ఏమి జరుగుతోంది అవ్వా... నువ్వు ప్రయోగించిన మంత్రశక్తి బలహీన పడిపోతున్నదా?" ఆతృతగా అడిగింది యువరాణి.

మరింత గాఢంగా గాలి వదిలి తలను విదిలించింది వృద్ధురాలు. "చెప్పవ్వా... త్వరగా చెప్పు... ఏం జరుగుతోంది?" మరింత ఆతృతగా అడిగింది యువరాణి.

"నా శక్తిని మించిన శక్తి ఏదో ఆ యువక మూర్తులు అడుగు పెడుతున్న ప్రదేశంలో కొలువై ఉన్నది... అది మన దృష్టి మార్గాన్ని నిరోధిస్తోంది" అన్నది వృద్ధురాలు.

"మా సింహాసనానికి చేటు తీసుకువచ్చిన మహా మాంత్రికుడు మాండలీకుడినే ఏమార్చగలిగిన శక్తి నీది... నిన్ను మించిన శక్తి మంతులు ఆ చిన్న నగరంలో నివసిస్తూ ఉండటం ఎలా సంభవించింది?" అడిగింది యువరాణి.

"నగరం పెద్దది అయితే అమితమైన శక్తి కలిగిన వారు కనిపిస్తారని, చిన్నవాటిలో శక్తి విహీనులు ఉంటారని అనుకోవటం చాలా తప్పు. శక్తి అనేది వ్యక్తిగతమైన సాధన మీద ఆధారపడి ఉంటుంది. నివసించే ప్రదేశాల గొప్పతనం మీద ఉండదు...." అంటూ మాటల్ని ఆపింది వృద్ధురాలు.

ఆమె ఇంకా ఏదో చెప్పబోయి మధ్యలోనే ఆగిపోయినట్లు గమనించింది యువరాణి.

"నాకు చెప్పకూడని రహస్యాలు ఏవైనా ఉన్నాయా అవ్వా?" గోముగా అడిగింది.

"పిచ్చితల్లీ... ఈ నగరాన్ని కన్నతల్లి మాదిరి కాపాడుకోవాల్సిన దానివి... నీ దగ్గర దాచవలసిన మాటలు ఏమీ లేవు... ఇప్పటివరకూ శ్యామల గదాధరులు ఇద్దరూ అనేక రకాల మంత్ర శక్తులతో తలపడ్డారు. మనం ఆ దృశ్యాలను నిరాటంకంగా చూసి ఉన్నాము. ఇప్పుడు మాత్రమే ఇలా జరుగుతోంది...." అంటూ పళ్ళెరం వైపు చేయి ఊపింది.

తల తిప్పిన యువరాణి ఒళ్ళు ఝల్లుమన్నది ఒక్కసారిగా. అంతకుముందు వరకూ అస్పష్టంగా అగుపించిన దృశ్యం ఇప్పుడు పూర్తిగా అదృశ్యమైపోయింది.

"కాయకష్టం మీద బ్రతికే వర్ణం వారు నివసించే ప్రదేశంలో ఈ మంత్రగత్తె నీలమణిని మించిన మహిమ ఉండటం నిజంగా ఆశ్చర్యమే. అదేమిటో తెలుసు కోవాలి" అంటూ అంతకు ముందు వెళ్ళిన గదిలోకి వెళ్ళింది వృద్ధురాలు.

పళ్ళెరాన్ని వదిలి ఆమెను అనుసరించింది యువరాణి.

వృద్ధురాలు అడుగుపెట్టిన గదిలో ఒక పూజామందిరం ఉన్నది. నాలుక బయటికి జాపి ఎర్రటికనులతో భీకరంగా చూస్తున్న దేవతా విగ్రహం నిలబెట్టి ఉన్నది అక్కడ.

ఆ విగ్రహం ముందు కూర్చుని ధ్యానంలోకి వెళ్ళిపోయింది వృద్ధురాలు. అర్ధఘడియ... ఘడియకాలం గడిచిపోయినా ఆమె కనులు తెరిచి తనకేసి చూడక

పోవటంతో... విసుగ్గా తల విదిలించి అక్కడ నుంచి ఇవతలికి వచ్చేసింది యువరాణి.

పళ్ళెరంలోని నీటిలో శ్యామల గదాధరుల కదలికల్ని గమనిస్తూ కాలక్షేపం చేసిన ఆమెకు, ఇప్పుడు సమయం గడవటం కష్టతరం అనిపించింది. అటూ ఇటూ చూసి నెమ్మదిగా ఆ మందిర ద్వారంలో నుంచి బయటికి బయలుదేరింది.

ద్వారబంధం మీది నుంచి పాదాన్ని అవతలకు వేసిన మరుక్షణం ఆమె ఎదుట ప్రత్యక్షం అయింది పది సంవత్సరాల వయసుండే బాలిక ఒకత్తె.

తను వృద్ధురాలి వద్దకు వచ్చిన క్షణం నుంచీ అప్పటివరకూ అన్యులు ఎవరినీ చూసి ఉండలేదు యువరాణి.

"నువ్వు ఎవరివి?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"నేను నీలమణి దగ్గిర పనిచేసే బాలికను. యువరాణీ వారి అవసరాలను గమనించుకుంటూ ఉండటం నా కర్తవ్యం" నవ్వుతూ చెప్పిందా బాలిక.

"ఇప్పుడు నాకు అవసరాలు ఏమీలేవు... ఈ ఇంటి వెలుపలికి పోయి కొద్దిసేపు సంచరించాలి" అన్నది యువరాణి.

రెండు చేతులను వెడల్పుగా జాచి ద్వారానికి అడ్డుగా పెట్టిందా బాలిక. "ఈ ఇంటిలోపలి భాగం వరకే నీలమణి శక్తి పనిచేస్తుంది. వెలుపలికి వెళ్ళిన వెంటనే తమరి గురించి ఆ మాండలీకుడికి తెలిసిపోతుంది" మృదువైన మాటలతో వివరంగా చెప్పింది.

మన్నించి వెనక్కి తిరిగి ఉన్నట్లయితే బాగానే ఉండి ఉండేది. పళ్ళెరంలోని దృశ్యాలు కనిపించకుండా పోవటం, తనను మించిన శక్తి కలవాళ్ళు చిన్న నగరంలో ఉన్నారని వృద్ధురాలు చెప్పటం... యువరాణిలోని అసహనాన్ని అధికం చేశాయి.

"చెరసాలలో పెట్టబడినట్లు ఒకే ప్రదేశంలో కూర్చుని మాకు విసుగు పుట్టింది. మేము బయటి ప్రపంచాన్ని చూడవలసిందే" అంటూ అడ్డంగా ఉన్న ఆ బాలిక చేతుల్ని పక్కకునెట్టి ద్వారంలో నుంచి వెలుపలికి వెళ్ళింది యువరాణి.

అంతకుముందు ఒక్కక్షణికం వరకూ ఎంతో అందమైన రాచభవనం మాదిరి అగుపించిన ఆ భవనం కాస్తా–సాధారణమైన పూరి గుడిసె మాదిరి మారి పోయింది – ఆమె చూస్తూ ఉండగానే.

ఆ వీధికి ఆవలివైపున ఉన్న ఒక బూరుగుచెట్టు మీద కునికిపాట్లు పడుతున్న ఒక కాకి, రెక్కల్ని తపతపలాడిస్తూ గాలిలోకి లేచి దూరంగా వెళ్ళిపోవటాన్ని యువరాణి గమనించలేదు.

*　　*　　*　　*　　*

మదిరాపానం చేశాడు మహామాంత్రికుడు మాండలీకుడు. మత్తులో ఎర్రబడిన కనులతో తన శిష్యుడి వైపు చూశాడు.

"యువరాణి ఏమైపోయిందో ఇంతవరకూ ఎరుక పడలేదు. ఎత్తుకుఎత్తు బంగారు నాణేల్ని బహుమతిగా ఇస్తామని ప్రకటించినా, ఎవరూ ఏమీ చెప్పటం లేదు...." తల వంచుకుని చిన్న కంఠంతో అన్నాడు ఆ శిష్యుడు.

"యువరాణి తప్పకుండా ఆ నీలమణి రక్షణలోనే ఉండి ఉంటుందని నాకు అనిపిస్తోంది" ముద్దమాటలతో అన్నాడు మాండలీకుడు.

"నీలమణి జాడల్ని కనిపెట్టటానికి మన వేగుల్ని నగర మంతా సంచరించటానికి పంపించాను. ఇంత వరకూ ఫలితం కనిపించలేదు" అంటూ మాటల్ని ఆపాడు ఆ శిష్యుడు.

అతను ఏదో చెప్పటానికి సందేహిస్తున్నట్లు తెలిసి పోయింది మాండలీకుడికి. "నిర్భయంగా చెప్పు...." అంటూ ప్రోత్సహించాడు.

"కరాళి అలుకబూని చాలారోజులు అయింది. ఈ పాటికి తన కోపాన్ని మరిచిపోయి ఉంటుంది. ఒకసారి ఆవాహన–" అంటూ మాండలీకుడి ముఖంలో రకరకాల భావాలు ప్రత్యక్షం అవుతూ ఉండడంతో మాటల్ని మధ్యలోనే ఆపేశాడు.

"కరాళి అలుక ఒట్టొట్టి, మాటలతో మాయం కాదు... ప్రసన్నం చేసుకోవటం మంచిది కాదు గురుదేవా... యువరాణి నగరాన్ని వదిలి ఇంకేదైనా సురక్షిత స్థానానికి వెళ్ళిపోతే సమస్య మరింత జటిలం అవుతుంది" అన్నాడు శిష్యుడు.

"శంబరశక్తిని గురించి ఆలోచిస్తున్నది మనం మాత్రమే... యువరాణి మన చేతికి దొరికిన మరుక్షణం నా జీవితాశయం నెరవేరుతుంది. ఈ నగరంలో నుంచే కాదు– ఈ భూమి చివరి భాగంలోకి పారిపోయినా ఆమెను వెతికి పట్టుకోగలం మనం...." దర్పంగా అన్నాడు మాండలీకుడు.

తన సందేహం సమసిపోయినట్లు తేలికగా నిట్టూర్చవలసిన శిష్యుడు అలా చేయలేదు... తల విదిలించాడు.

"ఏమిటి నీ సందేహం?" విసుగ్గా అడిగాడు మాండలీకుడు.

"నగరం మధ్యలో ఒక చిన్న చెక్కల కట్టడం ఉన్నది. పెద్ద బిల్వవృక్షం కనిపిస్తుంది దాని సమీపంలో...." చెప్పడం మొదలు పెట్టాడు శిష్యుడు.

అధికం అయిపోయింది మాండలీకుడి అసహనం... "బిల్వవృక్షం పూజలకు పునస్కారాలకు ఉపయోగపడేటటువంటిది. దాన్ని కలిగి ఉండటం నేరం కాదు" అన్నాడు విసురుగా.

"గురుదేవా... నేను పంపిన వేగులు ఆ వృక్షం మీద వాలటానికి వీలుపడటం లేదు... రెక్కల్ని మాడ్చి మసిచేసే వేడిమి ఏదో ఆ చెట్టు కొమ్మల్లో ఉన్నట్లు భావిస్తున్నాయి" అన్నాడు శిష్యుడు.

అతను ఏ మాట చెప్పినా విసుగ్గా తల విదిలించటానికి సిద్ధంగా ఉన్న మాండలీకుడు అదిరిపడినట్టు, ఒక్కసారిగా ఆసనం మీది నుంచి లేచి నిలుచున్నాడు.

"అవును గురుదేవా... ఇంతవరకూ మనం ఒక్క నీలమణిని గురించే ఆలోచిస్తున్నాము... ఈ నగరంలో ఆమెతో పాటు మరో శక్తి సంజాతుడు ఉన్నట్లు నాకు అనిపిస్తోంది" అన్నాడు శిష్యుడు.

తాను కూర్చుని ఉన్న ఆసనం ప్రక్కనే పెట్టి ఉంచిన పెద్ద దండాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు మాండలీకుడు.

"మనకు ప్రతిద్వంది ఉన్నట్లుగా అనిపిస్తే వెంటనే తెలుసుకోవాలి. అక్కడికి పోయి అదేమిటో చూడాలి" అంటూ అప్పటికప్పుడు ఆ మందిరం వెలుపలికి బయలుదేరబోతూ ఉండగా....

"పరాకు... బహుపరాకు... మహారాణీ వారి సోదరుడు శ్యాలక భూపతుల వారు విజయం చేస్తున్నారు. పరాకు... బహుపరాకు...." అంటూ వినవచ్చాయి వందిమాగధుల కంఠాలు.

పళ్ళు బిగించి ఎడమ పాదంతో క్రింది భాగాన్ని బలంగా తన్నాడు మాండలీకుడు. "సమయం కాని సమయంలో ఏమిటి ఈ బుద్ధిహీనుడి ఆగమనం...." అంటూ తిరిగి ఆసనంలో కూలబడ్డాడు.

పటాటోపంగా ఆ మందిరంలోకి వచ్చేశాడు శ్యాలకభూపతి.

"మాండలీకుల వారూ... మీరు మా కరుణాకటాక్ష వీక్షణాల సహాయంతో బ్రతుకుతున్నారు... మాకు చేయవలసిన సేవల్ని విస్మరించి కాలం గడపటం మహానేరం...." లోపలికి వస్తూనే కోపంగా అన్నాడు.

"మా గురుదేవులు మీ కరుణా కటాక్ష వీక్షణాల సహాయంతో బ్రతకటం లేదు... చక్రవర్తి వకుళేంద్రుల వారే మాకు ఆరాధ్యనీయుడు" సన్నటి కంఠంతో ఎత్తి పొడిచాడు మాండలీకుడి శిష్యుడు.

"మా మాటలే మా బావగారి మాటలు... వివరంగా చెప్పవలసిన అవసరం ఉన్నదా?" విసురుగా అడిగాడు శ్యాలకుడు.

మరోసారి తన అభిప్రాయం చెప్పటానికి నోటిని తెరువబోయాడు మాండలీకుడి శిష్యుడు. తన చేతిలోని దండాన్ని ఊపి అతన్ని నోరు మూసుకోమని సైగ చేశాడు మాండలీకుడు.

"శ్యాలక భూపతుల వారు నా శిష్యుడిని మన్నించాలి. చిన్నవయసు కావటం వల్ల తమ అధికారం ఎటువంటిదో తెలుసుకోలేకపోయాడు...." అంటూ ఒక ఆసనాన్ని చూపించాడు.

కుదురుగా కూర్చుని తను వచ్చిన పని ఏమిటో చెప్పవలసిన శ్యాలకుడు ఆ పని చేయలేదు. "నడి వీధిలో మమ్మల్ని అవమానించిన దుండగులు ఇంతవరకూ పట్టుబడకపోవటం మాకు మహా అవమానంగా ఉన్నది. మీరు వెంటనే మీ శక్తుల్ని ప్రయోగించి వారిని మా సమక్షానికి లాక్కు రావాల్సిందిగా ఆజ్ఞాపించటానికి వచ్చాము...." దురుసుగా అన్నాడు.

"దారినపోయే దానయ్యలు ఎవరో ఏదో చేస్తే, వారిని పట్టుకోవటానికి మంత్రశక్తుల సాయం కోరటం అవమానం...." గబుక్కున అన్నాడు శిష్యుడు.

ఒరలో ఉన్న ఖడ్గాన్ని చర్రున బయటికి లాగాడు శ్యాలకభూపతి. మూడే మూడు అంగల్లో ఆ శిష్యుడిని సమీపించి, గుండెల మీద పాదంతో ప్రహరించాడు.

అతను అంత వేగంగా తన మీదికి వస్తాడని ఊహించకపోవడం వల్ల పాదాలు తడబడి క్రింద పడిపోయాడు శిష్యుడు.

గుండెల మీద తన ఎడమపాదాన్ని మోపి, ఒరలో నుంచి తీసిన కరవాలాన్ని గాలిలోకి ఎత్తాడు శ్యాలకుడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయింది అది. అదిరిపడి అతన్ని నిరోధించటానికి తన దండాన్ని పైకి ఎత్తబోయిన మాండలీకుడికి కనిపించింది. ఒక గవాక్షం అంచుమీదికి వచ్చి వాలిన ఒక కాకి.

"మాంత్రికుల వారికి అభివాదం...." రెక్కల్ని విదిలిస్తూ అన్నది అది.

"ఎవరు? నువ్వు ఎవరివి?' కనులు చిట్లిస్తూ అడిగాడు మాండలీకుడు.

"మీ శిష్యుడు నగరంలోకి పంపించిన వేగువు... అత్యవసరమైన సమాచారాన్ని తీసుకు వచ్చాను...." చెప్పిందా కాకి.

క్రిందపడిన శిష్యుడి తలను తన కరవాలంతో తెగ నరకవలసిన శ్యాలకుడు – ఎత్తిన కత్తిని ఎత్తినట్టు అలాగే పట్టుకుని, తాను కూడా ఆ మాటల్ని ఆలకించటం మాండలీకుడికి కనిపించింది.

"వేగుల మాటల్ని వినిపించుకునే సమయం ఇప్పుడు కాదు. తరువాత...." అంటూ మాటను దాటవేయటానికి ప్రయత్నించాడు మాండలీకుడు.

"దాట వేయటానికి వీలుకాని సమాచారం...." అంటూ నగరంలోని ఒక చిన్న వీధిని వర్ణించింది ఆ కాకి.

"మీకు ప్రత్యర్థి అయిన నీలవేణి ఆ వీధిలోని ఒక చిన్న ఇంటిలో నివసిస్తున్నట్లు అనిపిస్తోంది" అని కూడా చెప్పింది.

"వివరంగా చెప్పాలి. ఊహలు, ఊహాగానాలు మాకు అవసరం లేదు" చిరాకుగా అన్నాడు మాండలీకుడు.

"ఊహాగానాలు కాదు... ఊహలు అంతకన్నా కాదు. యువరాణి మహా శ్వేతని నేను ఆ ఇంటి దగ్గర చూశాను" చెప్పింది ఆ పక్షి.

చలిగాలి వీచినట్లు జలదరించింది మాండలీకుని శరీరం. తనకు తెలియకుండానే మరోసారి శ్యాలకుడి వైపు చూశాడు అతను.

"శ్వేత నగరంలోనే ఉన్నదా? తను ఇంకా ప్రాణాలతోనే ఉన్నారా? ఆశ్చర్యం...." అంటూ ఆ మందిర ద్వారం వైపు తిరిగి చప్పట్లు చరిచాడు – తన అనుచరుల్ని పిలవటానికి.

ఆలస్యం చేయటానికి ఎంత మాత్రం అవకాశం లేదని అర్థమైపోయింది మహామాంత్రికుడు మాండలీకుడికి. శ్యాలకుడి చప్పట్లు ఆలకించిన వెంటనే గుంపుగా ఆ మందిరంలోకి వచ్చేస్తారు అతని అనుచరులు. గవాక్షపు అంచుమీద కూర్చుని ఆ వాయసం తమకు చెప్పిన మాటల్ని ఒక్క అక్షరం కూడా వదిలిపెట్ట కుండా అతను వారికి వివరించి చెపుతాడు.

ఆఘమేఘాల మీద పోతారు అందరూ. యువరాణి మహాశ్వేతను పెడరెక్కలు విరిచికట్టి రాజభవనం దగ్గరికి తీసుకువస్తారు. వెనుకా ముందు ఆలోచించకుండా అప్పటికప్పుడు ఆమెకు మరణశిక్ష అమలు చేస్తాడు నగర పాలకుడు వకుళేంద్రుడు. ఇలా జరిగితే, అప్పటివరకూ తాను పడిన కష్టం అంతా వృధా అయిపోవటమేకాదు – తన జీవితాశయం కూడా సర్వనాశనం అయిపోతుంది.

"బంధనం... బంధనం... శబ్ద బంధనం... ఈ మందిరంలో నుంచి చిన్నపాటి చప్పుడు కూడా బయటికి ప్రసరించటానికి వీలు కాకూడదు" చేతిలోని దండాన్ని నేలకేసి అదుముతూ వికృత కంఠంతో బిగ్గరిగా అన్నాడు మాండలీకుడు.

ఆ మందిరం చుట్టూ మందంగా ఉండే పట్టు తెరలు వ్రేలాడదీసినట్లు అయింది శ్యాలకుడు కొట్టిన చప్పట్ల శబ్దం – ఆ మందిరంలోనే ఆగిపోయింది.

ఎర్రగా మారిపోయాయి శ్యాలకుడి కనులు... బహు క్రూరంగా తయారైనాయి అతని చూపులు.

"మేము విసిరివేసే ఎంగిలి మెతుకులు ఆరగించి బ్రతికే ఒక క్షుద్ర మాంత్రికుడు మా మీదనే తన మంత్రతంత్రాలను ప్రయోగించటమా? అవమానం. అందుకు శిక్ష అనుభవించవలసిందే" అంటూ క్రిందపడిన శిష్యుడి తల నరికే ఆలోచన వదిలిపెట్టి మాండలీకుడి మీదికే లంఘించాడు.

"వద్దు శ్యాలకుల వారూ... నాతో పెట్టుకోవద్దు. నన్ను ఎదిరించేశక్తి మీకు లేదు" ఒక అడుగు వెనక్కి వేస్తూ హెచ్చరించాడు మాండలీకుడు.

మంచిచెడుల విచక్షణ కోల్పోయాడు శ్యాలక భూపతి. పళ్ళు పటపటమని కొరుకుతూ మహా వేగంగా తన కత్తిని ముందుకు విసిరాడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో పోయి మాండలీకుడి తల తెగ నరక వలసిన ఆ ఆయుధం– తన దారికి ఏదో పెద్ద అడ్డంకి ప్రత్యక్షం అయినట్లు మధ్యలోనే క్రింద పడిపోయింది.

పిచ్చిపట్టిన వాడి మాదిరి పెద్దగా హూంకరించి, తనే ముందుకు లంఘించాడు శ్యాలకుడు. చేతులు జాచి అతని మెడను పట్టుకోబోయాడు.

తన దండాన్ని మరోసారి గాలిలో ఊపాడు మాండలీకుడు... కంటికి కనిపించని చేతులు ఏవో తనను గట్టిగా పట్టుకుని గాలిలోకి ఎత్తినట్లు తనంతట

తానే గాలిలోకి లేచాడు శ్యాలకుడు. వడిశెలలో నుంచి విసిరిన రాయిమాదిరి రివ్వున పోయి ఆ మందిరం ఆవలి ప్రక్కన ఉన్న పూజా మందిరంలో పడ్డాడు.

"తెలియని తనంతో నేను చేసిన అపరాధానికి బదులుగా నీకు రక్త తర్పణం చేస్తున్నాను. ఈ నరబలిని స్వీకరించి నాకు ప్రసన్నం కావాల్సిందిగా వేడుకుంటున్నాను. తీసుకోవే కరాళీ ఈ బలి, మానవుడి ఆత్మను నువ్వు ఆనందంగా తీసుకో" అంటూ దండాన్ని గాలిలోకి ఎత్తాడు మాండలీకుడు.

గాలిలోకి లేచిన మరుక్షణం పదును కలిగిన ఒక మహాఖడ్గంగా మారిపోయింది అది.

క్రిందపడిన అదటుకు శరీరంలోని నవనాడులు ఛిన్నాభిన్నం అయిన అనుభూతి కలిగింది శ్యాలకుడికి. పళ్ళు బిగించి ఆ బాధను భరిస్తూ పైకి లేవబోయాడు అతను.

మహావేగంతో అతని మెడ మీద పడింది మాండలీకుని చేతిలోని ఖడ్గం. పుటుక్కున తెగిపోయింది తల. ఎర్రటి రక్తం వెల్లువలా వెలుపలికి వచ్చి ఎదుట ఉన్న కరాళి ప్రతిమ పాదాలను తడిపివేసింది.

కిచకిచమని వికృతంగా నవ్వింది కరాళి... "తృప్తి తృప్తి అయింది మాంత్రి కూడా... నాకు చాలా సంతృప్తి కలిగింది... నీ అపరాధాన్ని నేను మర్చిపోయాను. ఏం చేయమంటావో చెప్పు...." వీనులవిందుగా వినవచ్చాయి మాటలు ఆ ప్రతిమ నోటినుంచి.

"ఆలోచించి చెప్పవలసి ఉన్నది గురుదేవా... ఆత్రపడి సగం సగంగా చెపితే తిరిగి మధ్యలోనే ఆగిపోతాయి మన పనులు... ఒకే ఒకమాటతో అన్ని పనులు పూర్తి అయిపోవాలి" శ్యాలకుడి చేతిలో ప్రాణాలు పోగొట్టుకోబోయిన శిష్యుడు గబగబా ఆ మందిరంలోకి వచ్చి, తన ఆలోచనను సవివరంగా చెప్పే సరికి, సాలోచనగా తల ఊపాడు మాండలీకుడు.

"యువరాణి ఆచూకీ మనకి తెలిసింది కాబట్టి, వెంటనే వెళ్ళి ఆమెను పట్టుకు రమ్మని చెపుతాము. యువరాణితోనే మన పనులన్నీ ముడిపడి ఉన్నాయి" అన్నాడు.

"మరి నేను పంపిన వేగులు చూసి వచ్చిన బిల్వవృక్షం సంగతేమిటి?" అడిగాడు శిష్యుడు.

"అది ఒక సమస్యకాదు. అదేదో దైవశక్తి కలిగిన వృక్షం అయి ఉంటుంది. దైవిక శక్తులున్న ప్రదేశంలోకి మనం పంపే క్షుద్రశక్తులు చేరుకోలేవు...." అన్నాడు మాండలీకుడు.

"మరి అర్ధంతరంగా హతమారిపోయిన ఈ శ్యాలకుల వారి సంగతి?" మరో మాట అడిగాడు శిష్యుడు.

అది కూడా పెద్ద సమస్య కాదని అన్నట్లు నాలుక చప్పరించబోయి, చటుక్కున ఆగిపోయాడు మాండలీకుడు.

"అలుక వహించిన కరాళిని తిరిగి ప్రసన్నం చేసుకోగలిగినందుకు మీరు ఎంతగానో సంతోషిస్తున్నారు గాని, ఈ శ్యాలకుల వారిని బలి ఇవ్వటం మాత్రం బహు బాధాకరమైన విషయం. మహారాణి వారికి తెలిసిన వెంటనే ఆమె ఆగ్రహం అవధులు దాటిపోతుంది. ఆమె ఆగ్రహిస్తే నగరపాలకుల వారే స్వయంగా ఆగ్రహించినట్లు... నగరంలోని సర్వసైన్యాలు మన మీద దండయాత్రకు కదిలి వస్తాయి...." నెమ్మదిగా చెప్పాడు శిష్యుడు.

"నగరంలోని సైన్యాలు మాత్రమే కాదు. ఈ చుట్టుపట్ల ఉన్న నగరాలన్నీ కట్టకట్టుకుని తమ బలగాల్ని ఉసికొల్పినా మనల్ని ఏమీ చేయలేరు. మన మంత్ర శక్తుల ముందు అందరూ తలలు వంచవలసిందే" సగర్వంగా చెప్పాడు మాండలీకుడు.

"నిజమే గురుదేవా... కాని ఆ సైన్యాలకు ఆ నీలమణి వంటి మంత్ర వాదులు తోడుగా నిలబడితే?" అడిగాడు శిష్యుడు.

మాండలీకుడి మాటలకు వెంటనే అవరోధం ఏర్పడింది. మాటకు మాటగా సమాధానం చెపుతున్న అతని గొంతు ఒక్కసారిగా మూగబోయింది.

"మదిరాపానపు మత్తులో ఇంతదూరం ఆలోచించలేక పోయాను. శ్యాలకుల వారిని బలి ఇవ్వటం నిజంగా అపరాధమే. లేని పోని తలనొప్పుల్ని సృష్టించుకున్నాము." నుదురు రుద్దుకుంటూ నెమ్మదిగా అన్నాడు.

మిణుకు మిణుకుమంటున్న కనులతో వారిని గమనిస్తోంది కరాళి ప్రతిమ. "నాకు ఎటువంటి ఆజ్ఞ ఇవ్వకుండా మీలో మీరు ఆలోచనలు చేస్తున్నారు. ఏమి చెయ్యాలో వెంటనే చెప్పండి" ఉన్నట్లుండి హెచ్చరించింది.

తలవంచి మహాభక్తిగా నమస్కరించాడు శిష్యుడు. "తల్లీ... మేము మాట్లాడుకోవల్సిన మాటలు ఇంకా చాలా ఉన్నాయి. ఒక నిర్ణయానికి వచ్చిన

తర్వాత నీ సహాయం అర్థిస్తాను. అంత వరకూ శాంతంగా ఉండాలి. అదే మా కోరిక....” వినయంగా అన్నాడు.

అతని అభ్యర్థనను కరాళి వినిపించుకోదని మాండలీకుడికి తెలుసు... “నా మాట కూడా అదే కరాళీ... మాకు కొద్దిపాటి సమయం అవసరం” అన్నాడు గబగబా.

పెద్దగా నవ్వింది కరాళి ప్రతిమ. “నగర పాలకుడి ముద్దుల రాణి సోదరుడిని నాకు బలి ఇచ్చేశావు. బాగా ఆలోచించుకో. ఆత్రపడితే నీ శిష్యుడు చెప్పినట్లు ఇబ్బందులు పాలైపోతావు” అంటూ మౌనం వహించింది.

“మదిర మత్తు మా అంతరంగాన్ని ఇంకా అల్లకల్లోలం చేస్తూనే ఉన్నది. సరైన ఆలోచన రావటం లేదు. ఇప్పుడు ఏం చేయాలో నువ్వే చెప్పు” శిష్యుడికి చెప్పాడు మాండలీకుడు.

“తమరు తీరికగా కూర్చోండి” అంటూ అతన్ని ఆసనం మీద కూర్చోబెట్టి తాను చప్పట్లు చరిచాడు.

“శబ్ద బంధనం చేశాను... నీ చప్పట్లు ఎవరికీ వినిపించవు” అంటూ తన చేతిలోనే ఉన్న కరవాలం వంక చూశాడు మాండలీకుడు. వెంటనే అది అంతకుముందు మాదిరి దండంగా మారిపోయింది. గాలిలో ఊపగానే ఆ మందిరం చుట్టూ పరుచుకుని ఉన్న మందపాటి పట్టుతెరలు మటుమాయం అయిన అనుభూతి శిష్యుడికి కలిగింది.

ఓరగా వేసి ఉన్న తలుపుల్ని తెరుచుకుని లోపలికి తొంగి చూశారు శ్యాలకుడి అనుచరులు ఇద్దరు.

“నగర పాలకుల వారికి నివేదించండి. మన నగరంలో ఒక వీధి ఉన్నది. ఆ వీధిలో ఒక బిల్వ వృక్షం” అంటూ ఆ వివరాల్ని వారికి వినిపించాడు శిష్యుడు.

ఆ కట్టడంలో నివసించే ఒక దుష్టుడి దాష్టీకం మన శ్యాలకుల వారిని మాయం చేసేసింది. వెంటనే భటుల్ని పంపి అతన్ని బంధించండి” చెప్పాడు శిష్యుడు వారికి.

“బిల్వవృక్షం దగ్గర ఒక కట్టడం ఉన్నదనీ, అందులో ఒక దుష్టుడు నివశిస్తూ ఉంటాడని నువ్వు నాకు చెప్పలేదు” ఆశ్చర్యంగా అన్నాడు మాండలీకుడు.

“అక్కడ ఎవరున్నారో నాకు తెలియదు. ముందు ఈ భటుల్ని ఇక్కడినుంచి అవతలికి పంపటానికి నోటికి వచ్చింది చెప్పాను....” నవ్వుతూ అన్నాడు శిష్యుడు.

"ఎందుకు అలా?" అడిగాడు మాండలీకుడు.

"శ్యాలకుల వారి శరీరాన్ని వెంటనే ఇక్కడి నుంచి తొలగించాలి. ఎవరికైనా అనుమానం వస్తే మనం చిక్కుల్లో పడతాము" అంటూ తాను పూజామందిరంలోకి పోయాడు శిష్యుడు.

ఆసనం మీద చేరగిలబడి కూర్చునే... అతని చర్యల్ని అతిజాగ్రత్తగా గమనించటం మొదలుపెట్టాడు మాండలీకుడు.

ఒక్కప్రక్కగా ఉన్న పెద్ద కుండలోనుంచి దోసిటితో నీటిని అందుకుని శ్యాలకుడి శరీరం మీద జల్లాడు శిష్యుడు. చేతుల్ని చిత్ర విచిత్రంగా తిప్పుతూ ఏదో మంత్రాన్ని చదివాడు.

గప్పున పైకిలేచింది దట్టమైన పొగ. క్రిందపడిఉన్న శ్యాలకుడి దేహం, మటుమాయమైపోయింది - తెగిపోయిన శిరస్సుతో సహా.

"ఎక్కడికి పంపావు? ఎటుగా పంపావు?" మెచ్చుకోలుగా తల ఊపుతూ అతన్ని అడిగాడు మాండలీకుడు.

"నగరం వెలుపల ఉన్న చెట్ల తోపు దగ్గరికి వెళ్ళిపోయింది. ఎవరికీ కనిపించదు. పట్టుదలగా వెతికితే తప్ప" అన్నాడు శిష్యుడు.

*   *   *   *   *

"ఎవరు మీరు? ఎందుకు వస్తున్నారు?" ఖంగుమంటున్న కంఠం ఒకటి చాలా కటువుగా ప్రశ్నించేసరికి, ఎక్కడి వారక్కడ ఆగిపోయారు శ్యామల, గదాధరులు.

విశాలమైన ఒక చదరపు స్థలంలో ఆగిపోయింది వారు అనుసరించి వస్తున్న సన్నపాటి సందు.

పొడవాటి కొమ్మలతో, వెడల్పాటి ఆకులతో చల్లటి నీడను ఇచ్చే రావిచెట్టు ఒకటి ఉన్నది ఆ చదరపు స్థలంలో. ఆ చెట్టుక్రింద కూర్చుని ఉన్నారు కొంతమంది పౌరులు.

నూనె పూసినట్లు నిగనిగ మెరిసిపోతున్నాయి కండలు తిరిగిన వారి శరీరాలు. గుబురుగా ఉన్నాయి మీసాలు... భుజాల మీదికి వాలుతున్నాయి పొడవాటి కేశాలు.

రాచవీధి మొగదలలో తాము విన్నమాటలు పచ్చి నిజాలని వెంటనే తెలిసిపోయింది గదాధరుడికి.

ఆ చెట్టుక్రింద ఉన్న పౌరులు మహాబలశాలులు. ఎవరైనా వారిని ఎదిరించటం అంటే తమ గొంతుల్ని తాము పిసుక్కోవటం వంటిదే.

"అయ్యలూ... పరాయి నగరం నుంచి వచ్చిన వాళ్ళం. గంధవతికి వెళ్ళబోయి పొరపాటుగా ఈ నగరంలోకి వచ్చిపడ్డాము...." వినయంగా చెప్పాడు అతను.

"నగర ద్వారాల్ని అధిగమించిన వెంటనే నీ ఎడమ చేతివైపున ఒక పెద్ద కొండగుట్ట కనిపిస్తుంది. దాన్ని చేరుకోగానే, ఒక సన్నపాటి కాలిబాట మీకు అగుపిస్తుంది. ఆ బాటను అనుసరిస్తే మూడు పొద్దుల తర్వాత మీరు గంధవతి దగ్గరికి పోగలరు... పొండి" ముక్తసరిగా చెప్పాడు ఆ మహాబలుడు.

అతను అంత తేలికగా తమకు మార్గదర్శనం చేస్తాడని ఊహించక పోవటం వల్ల, రెండు క్షణికాలపాటు నిరుత్తరుడయ్యాడు గదాధరుడు.

"అయ్యా... అలసిపోయి ఉన్నాము... విశ్రాంతి చాలా అవసరం... ఈ రాత్రి గడిచిన తర్వాత–" అంటూ తను మాటలు మొదలుపెట్టాడు శ్యామలుడు.

"రాత్రి గడపటానికి ధర్మసత్రాలు రాచవీధిలో మూడున్నాయి. కాసులు తీసుకుని మీకు వసతి కల్పించే పూట కూళ్ళ ఇళ్లు నాలుగు రాచవీధిలోనే ఉన్నాయి. అటు వెళ్ళండి... పొండి" మరోసారి కటువుగా చెప్పాడు ఆ పౌరుడు.

"నగర పాలకుల వారి కుమారుడిని కొట్టినందుకు మాకు శిక్షలు పడకుండా రక్షించగల వారు ఆ ప్రదేశాల్లో ఉంటారా?" అడిగాడు గదాధరుడు.

కనులు చిట్లించి విసుగుదలగా మాట్లాడుతున్న ఆ వ్యక్తి ముఖంలో వెంటనే ప్రత్యక్షం అయ్యాయి రకరకాల భావాలు.

"నగర పాలకుడి కుమారుడిని మర్ధించటమా? ఎవరు? ఎప్పుడూ?" తన చెవుల్ని తనే నమ్మలేకపోతున్నట్లు అడిగాడు.

"నేనే మర్ధించాను. మర్యాద తెలియని మనిషికి మాటలు అర్ధం కావని అనిపించింది" చెప్పాడు శ్యామలుడు.

చటుక్కున తల తిప్పి తన వెనుక కూర్చున్న వారిలో ఒక యువకుడి వైపు చూశాడు ఆ వ్యక్తి. ఛెంగున లేచి స్నేహితులు వచ్చిన దారిలో పరుగు

తీశాడు అతను. పదే పది నిమిషాలలో తిరిగి వచ్చి, ఆ వ్యక్తి చెవిలో ఏదో చెప్పాడు.

"తెలివి వచ్చిందిట ఆ వీర కుమారుడికి. రెండు వందల మంది భటుల్ని, వెంట బెట్టుకుని మీకోసం నగరంలో గాలింపు చర్యలు చేపడుతున్నాడట" అన్నాడు ఆ వ్యక్తి.

"రెండు వందల మందిని ఎదిరించటం కొంచెం కష్టమే మిత్రమా.... ఈ చిన్న ప్రదేశం అంతా అల్లకల్లోలం అయిపోతుంది. తిరిగి నగర ద్వారాల దగ్గరికే పోదాము" వెంటనే శ్యామలుడికి చెప్పాడు గదాధరుడు.

ఒరలో ఉన్న కరవాలాన్ని కొద్దిగా బయటికి లాగి తిరిగి ఒరలోకి నెట్టాడు శ్యామలుడు, "విశ్రాంతి తీసుకునే అవకాశం లేదు. ఈ నగరంలో అడుగుపెట్టిన వేళావిశేషం ఏమంత మంచిగా ఉన్నట్టు కనిపించడంలేదు...." అంటూ వెను తిరగబోయాడు.

"ఆగండి... ఎక్కడికి పోతున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు అంతవరకూ అతనితో మాట్లాడిన వ్యక్తి.

వచ్చిన దారివైపు చేయి చూపాడు గదాధరుడు.

"మా మధ్యకు వచ్చిన వారికి ఆతిథ్యం ఇవ్వకుండా అవతలికి పంపటం మాకు అలవాటు లేదు... మీరు–" అంటున్న ఆ వ్యక్తిని వెంటనే అడ్డుకున్నాడు అతని వెనుక కూర్చున్న వారిలో ఒక వృద్ధుడు.

"ముక్కు ముఖం తెలియదు. మనం ఆతిథ్యం ఇస్తామని చెప్పలేదు. అనవసరంగా నగరపాలకుడితో విరోధం మంచిదికాదు. వెళ్ళిపోనీ...." అంటూ స్నేహితులకేసి చేయి ఉపాడు... వెళ్ళిపోమన్నట్లు.

"ఆగమని అంటారని ఆశించాను... నగరపాలకుడు అంటే వారికి కూడా కొంచెం భయమేననిపిస్తోంది" శ్యామలుడి చెవిలో ఊదాడు గదాధరుడు.

సమాధానం ఇవ్వలేదు శ్యామలుడు. వెనుతిరిగి వచ్చిన దారినే తిరిగి నగర ద్వారాల వైపు బయలుదేరాడు.

పది అడుగులు కూడా వేయకముందే దుమ్ముతెరలు రేపుతూ అటుగా వస్తున్న రెండు వందల మంది భటులు అతనికి అగుపించారు.

"అదుగో... వారే... వారే... కాళ్ళు చేతులు కదలకుండా బంధించండి" వారందరి వెనుక తన అశ్వం మీద వస్తూ బిగ్గరగా అరిచాడు నగరపాలకుడి కుమారుడు లంబనాధుడు.

మరింత వేగం పెంచారు అతను వెంటబెట్టుకు వచ్చిన భటులు. పదే పది క్షణికాల్లో స్నేహితులను చుట్టుముట్టారు.

"ఆగండి... అందరూ ఆగిపొండి...." ఖంగుమన్నది రావిచెట్టు క్రింద కూర్చుని మాట్లాడిన వ్యక్తి కంఠం.

"ఇది మీకు సంబంధించిన విషయం కాదు. లంబనాధుల వారిని అవమానించి ఇటుగా పారిపోయి వచ్చారు వీళ్ళు. మీకు లేనిపోని మాటలు చెప్పి – ఇక్కడ రక్షణ పొందటానికి ప్రయత్నించారు. వీళ్ళు రాజద్రోహులు...." అతనివైపు చూస్తూ వివరంగా చెప్పాడు ఒక భటుడు.

"ఎంతద్రోహం చేసినా మీరు రెండు వందలమంది. వారు కేవలం ఇద్దరే... అన్యాయం అనిపించుకుంటున్నది కదా...." అన్నాడు ఆ వ్యక్తి.

"మేము వారిని వధించబోవటం లేదు. కేవలం బంధించటమే చేస్తున్నాము. విచారణ అనంతరం తగిన శిక్ష విధించబడుతుంది" అన్నాడు ఆ భటుడు.

భటుల్ని చూడగానే చెట్టు క్రింది నుంచి లేచి నిలుచున్నారు అక్కడ ఉన్న వారందరూ... "ఇతను మాట్లాడిన మాటలు న్యాయబద్ధంగానే ఉన్నాయి. మనం కల్పించుకోవటం అనవసరం...." అంటూ చెట్టుకు దూరంగా అడుగులువేశాడు మొదటి వ్యక్తి. మారు మాట్లాడకుండా అతన్ని అనుసరించారు మిగిలిన వారందరూ.

"వాళ్ళు అందరూ మహాస్వాభిమానం కలవారని, తమ నివాస ప్రదేశాల్లోకి భటులు రావటాన్ని సహించరని నేను అనుకున్నాను. కాని ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం వేరే విధంగా ఉన్నది" అంటూ తన ఒరలో ఉన్న కత్తిని బయటికి తీశాడు గదాధరుడు.

"చూస్తారేమిటి? కొట్టండి... పడగొట్టండి" గొంతు చినిగిపోయేటట్లు అరిచాడు అశ్వం మీద కూర్చుని ఉన్న లంబనాధుడు.

గొల్లున అరిచారు భటులు అందరూ... తమ ఆయుధాల్ని గాలిలోకి ఎత్తి స్నేహితుల మీద కలబడ్డారు.

"మనకి సంబంధించిన విషయం కాకపోయినా, ఈ దృశ్యం చూడటానికి కొంచెం బాధగానే ఉన్నది. రెండు వందల మంది భటుల్ని ఇద్దరే ఇద్దరు ఎదిరించటం సాధ్యం కాదు. ఇంకో పది క్షణికాల్లో పట్టుబడిపోతారు" దూరం నుంచి చూస్తున్న వ్యక్తి తనను ఆగమని చెప్పిన వృద్ధుడితో అన్నాడు.

అతను అలా అంటున్న సమయంలోనే బాధతో గిలగిలలాడుతూ నేల కూలిపోయారు పదిమంది భటులు. తమ ఆయుధాలు గాలిలోకి ఎగిరి పోయేసరికి, ఏం చేయాలో తెలియక దూరంగా పరుగుతీశారు మరో పది మంది.

"అమాయకుల్ని హింసించటం అన్యాయమనే మాటను మరిచిపోవాలి మిత్రమా... ఏమరుపాటుగా ఉంటే మన తలలు తెగి నేలమీద పడతాయి" అంటూ శ్యామలుడిని హెచ్చరించాడు గదాధరుడు.

"నువ్వు వాళ్ళ సంగతి చూసుకో. నేను ఆ లంబనాధుడి దగ్గరికి పోతున్నా" అంటూ వేగంగా అటు కదలిలాడు శ్యామలుడు.

తన అశ్వాన్ని చిందులు తొక్కిస్తూ, గొంతు చినిగిపోయేటట్లు అరుస్తున్నాడు లంబనాధుడు – "కొట్టండి. పడగొట్టండి" అంటూ.

ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి, అతని సమీపంలో నేలను తాకాడు శ్యామలుడు. ఎడమపాదంతో అతని అశ్వాన్ని బలంగా ప్రహరించాడు.

చెవులు చిల్లులు పడేటట్లు వికృతంగా సకిలించి, ప్రక్కకు దూకింది అది. కళ్ళేలను గట్టిగా పట్టుకుని క్రింద పడిపోకుండా ఉండటానికి ప్రయత్నం చేశాడు లంబనాధుడు. చేతకాలేదు. నడుము విరిగిపోయేటట్లు దబ్బున పడిపోయాడు నేలమీద.

అతని గుండెలమీద కాలు వేసి ఆకాశం బ్రద్ధలై పోయేటట్లు సింహనాదం చేశాడు శ్యామలుడు.

"అయిపోయాడు నగరపాలకుడి తనయుడు. తల తెగి నిర్జీవుడైపోబో తున్నాడు...." అన్నాడు దూరం నుంచి చూస్తున్న వ్యక్తి.

"మనం నివసిస్తున్న ప్రదేశంలో ఆ దారుణం జరగకూడదు. నగర పాలకుడు కచ్చగడతాడు...." అన్నాడు వృద్ధుడు.

"మనం ఏ విధంగా బాధ్యులం అవుతాము? మనం కాదు గదా ఆ పని చేస్తున్నది?" అడిగాడు ఆ వ్యక్తి.

"కొడుకును పోగొట్టుకున్న బాధలో మంచి చెడుల వివక్షణ కోల్పోతాడు" అంటూ తానే వేగంగా ముందుకు పరుగు తీశాడు వృద్ధుడు.

తన కరవాలాన్ని పైకెత్తి క్రింద ఉన్న లంబనాధుడి తల మీద వేటువేయ బోతున్నాడు శ్యామలుడు.

"ఆగు నాయనా... ఆగిపో... అతన్ని వదిలిపెట్టు" అంటూ అతని చేతిని గట్టిగా పట్టుకున్నాడు వృద్ధుడు.

శ్యామలుడు తన ప్రక్కన లేకపోయినా, ఇసుమంత కూడా బెదరకుండా మొత్తం భటులందరినీ చెల్లాచెదురు చేసేశాడు గదాధరుడు. తాను కూడా శ్యామలుడి దగ్గరికి వచ్చేశాడు.

"ఇటువంటి నీచుడు బ్రతికి ఉండటానికి వీలు లేదు. వేసేయ్ మిత్రమా" అంటూ తన కరవాలాన్ని ఎత్తి వేటువేయబోయాడు.

ఆ తరువాత ఏం జరిగిందో అతనికి తెలియలేదు. ఎవరో గట్టిగా పట్టుకుని బలవంతంగా లాగినట్టు అతని చేతిలో నుంచి ఎగిరి దూరంగా పడిపోయింది అతని చేతిలోని కరవాలం.

శ్యామలుడుని అడ్డుకుంటున్న వృద్ధుడే అలా చేశాడని అతను భావించాడు. ఆదరాబాదరగా వచ్చి వేటు వేయాలని అనుకోవటంలో పట్టు తప్పి ఆ కత్తి అతని చేతిలో నుంచి జారిపోయిందని శ్యామలుడిని ఆపుతున్న వృద్ధుడు భావించాడు.

కత్తి లేకపోయినా ఆగలేదు గదాధరుడు. ఎడమ పాదాన్ని పైకెత్తి లంబనాధుడి గుండెల మీద బలంగా మోపబోయాడు.

"ఆగు మిత్రమా... ఆగిపో–" అన్నాడు శ్యామలుడు.

ఆశ్చర్యం నిండిన కనులతో అతని వంక చూశాడు గదాధరుడు.

"వాడి అంతు చూడాలని వాంఛించిన మాట నిజమే కాని, ఎందుకో మనసు మారిపోయింది... వదిలేయ్" అంటూ వెనక్కి జరిగాడు శ్యామలుడు.

అతని చేతిని వదిలేసి క్రింద ఉన్న లంబనాధుడికి సహాయం చేసి, నిలుచోబెట్టాడు వృద్ధుడు.

"మా మాటను మన్నించి మీకు హాని తలపెట్టే ఆలోచనను విరమించు కున్నారు ఈ వీరకుమారులు. వెనక్కి వెళ్ళిపోండి. వారిద్దరూ మా దగ్గర ఉండగా

ఇంకోసారి ఎదిరించే ప్రయత్నం చేయకండి” అంటూ దూరంగా జరిగిన అశ్వాన్ని తీసుకువచ్చి అతన్ని దాని మీదికి ఎక్కించాడు.

చూపులకే మనుష్యుల్ని హతమార్చే శక్తి ఉంటే – లంబనాధుడు ఆ సమయంలో చూసిన చూపుతో మాడి మసి అయిపోయి ఉండేవాడు శ్యామలుడు.

కాలి మడమలతో తన వాహనాన్ని క్రూరంగా అదిలించి, అతివేగంగా ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్ళిపోయాడు అతను.

గదాధరుడి కరవాలపు విసుర్లకు గాయపడిన అవయవాలను చేతులతో అదుముకుంటున్న భటులు అతన్ని అనుసరించారు.

“మీ సాహసం మీ శౌర్యం నిరుపమానం... ఈ రాత్రికి మా ఆతిధ్యం తీసుకోండి....” అంటూ శ్యామలుడికి చెప్పాడు వృద్ధుడు.

చీకట్లు నగరాన్ని పూర్తిగా చుట్టుముట్టిన తరువాత, కడుపు నిండా భోజనం చేసి, రావిచెట్టు క్రిందికి చేరుకున్నారు స్నేహితులు ఇద్దరూ.

“మొదట అవతలకి వెళ్ళిపొమ్మన్నారు... తర్వాత ఆతిధ్యం స్వీకరించమని అర్థించారు. విచిత్రంగా ఉంది.” తమ మాటలు వినేందుకు దగ్గర్లో ఎవరూ లేరని నిశ్చయం చేసుకుంటూ అన్నాడు గదాధరుడు.

మౌనంగా తల ఊపాడు శ్యామలుడు.

“నువ్వు తిరస్కరిస్తావని అనుకున్నాను” మళ్ళీ అన్నాడు గదాధరుడు.

“ఆ విషయాన్ని వదిలేయ్... ఆ లంబనాధుడి తల నరకటం నాకు చేతకాలేదు... ఆ వృద్ధుడు అడ్డుపడి భల్లూకం మాదిరి పట్టుకున్నాడు....” అన్నాడు శ్యామలుడు.

“నిజమే మిత్రమా... నేను కూడా ప్రయత్నించాను. చూడటానికి వృద్ధుడి మాదిరిగానే ఉన్నా, అతని వేగం అసామాన్యం. కంటికి కనిపించకుండా నా కరవాలాన్ని కూడా ఎగర గొట్టేశాడు” అన్నాడు గదాధరుడు.

“నేను వీరి ఆతిధ్యాన్ని తిరస్కరించకుండా తల ఊపటానికి కూడా అదే కారణం. నీ కరవాలం అవతల పడిపోవటమే నాకు విచిత్రంగా అనిపిస్తోంది” అన్నాడు శ్యామలుడు.

“అదేమిటి మిత్రమా... ఆ వృద్ధుడికి అమితమైన బలం ఉన్నట్లు కనిపిస్తోందని చెపుతున్నాగా... కారణం అదే అయి ఉంటుంది” అన్నాడు గదాధరుడు.

తల అడ్డం తిప్పాడు శ్యామలుడు.

"నీ కరవాలం నీ చేతుల్లోనుంచి జారిపోవటం సామాన్యంగా జరగదు. ఇందులో ఏదో తిరకాసు ఉంది...." అన్నాడు.

అతను ఆ మాట మాట్లాడిన తరువాత గదాధరుడికి కూడా వచ్చేసింది అనుమానం... "ఏమై ఉంటుందా తిరకాసు? ఈ నగరంలో కూడా ఎవరైనా మంత్రవాదులు ఉండి ఉంటారా?" తనలో తాను అనుకుంటున్నట్లు పైకే అన్నాడు.

"కాయకష్టం చేసుకుని బ్రతికే ఈ వాడలోని వారు మంత్రాల జోలికి పోతారని నేను అనుకోవటం లేదు" అన్నాడు శ్యామలుడు.

"మంత్రాల మహిమ కాకపోతే మరేమై ఉంటుంది?" అడిగాడు గదాధరుడు.

పావు ఘడియపాటు తీవ్రంగా ఆలోచించినా తమకు ఎటువంటి సమాధానం తోచక పోవటంతో, చిరాకుగా తల విదిలించాడు శ్యామలుడు.

"వాళ్ళ కడుపులు నిండిపోయేటట్లు తిండి అయితే పెట్టారు గాని, విశ్రమించే ప్రదేశాన్ని చూపించలేదు. రావిచెట్టు క్రింద నిద్ర చేయటం మంచిది కాదని పెద్దలు చెపుతారు...." తల ఎత్తి ఆ చెట్టు కొమ్మలవైపు చూస్తూ అన్నాడు గదాధరుడు.

"ఎందుకని?" నవ్వుతూ అడిగాడు శ్యామలుడు.

"పక్షులు నివసిస్తూ ఉంటాయి... చీకటి సమయంలో వాటిని ఆరగించ టానికి పాముల వంటి జీవులు కొమ్మల మీదికి చేరుకుంటూ ఉంటాయి. పట్టుజారి మన తలల మీద పడే ప్రమాదం ఉంది... అందుకని" అన్నాడు గదాధరుడు.

చుట్టూచూసిన శ్యామలుడికి పాతిక అంగల దూరంలో అగుపించింది ఒక పెద్ద మండపం.

"విశ్రాంతి తీసుకోవటానికి అది చాలా అనుకూలంగా ఉంటుంది. ఇక్కడి వారు ఆ మండపాన్ని దృష్టిలో ఉంచుకునే మనకు తిండిపెట్టి వదిలేశారు" అంటూ అటుకేసి నడిచాడు అతను.

అతని వెనుకే అడుగులు వేశాడు గదాధరుడు. నడుముకు చుట్టుకుని ఉన్న దట్టీని ఊడతీసి, మండపంలో పరిచి ఉన్న చలువరాళ్ళను శుభ్రం చేశాడు. శ్యామలుడు నడుము వాల్చిన తరువాత, తాను కూడా అతని ప్రక్కనే పడుకో

బోతుండగా – కనిపించింది అతనికి – మండపానికి ఆవలి ప్రక్కన ఉన్న ఒక చిన్న దేవళం.

గాలి గోపురం గాని, ధ్వజస్తంభం గాని, ఎటువంటి అలంకారాలు కనిపించని అతి చిన్న గుడి అది.

తలుపులు కూడా లేని ఆ గుడిలో నిలబడి ఉన్నది ఒక దేవతా విగ్రహం. రెండే రెండు చేతులు ఉన్నాయి. ఎవరినో ఏదో అర్థిస్తున్నట్లు ముందుకు జాచబడి ఉన్నాయి ఆ రెండు.

"మిత్రమా... మిత్రమా...." తల తిప్పకుండా ఆ విగ్రహం వైపే చూస్తూ శ్యామలుడిని పిలిచాడు అతను.

"నువ్వు నిద్రపోవు. నన్ను పోనీయవు. మళ్ళీ ఏమయింది? పారిపోయిన నగర పాలకుడి కొడుకు ఇంకోసారి యుద్ధానికి వస్తున్నాడా?" విసుగు నిండిన కంఠంతో అడిగాడు శ్యామలుడు.

"నువ్వు కొట్టిన దెబ్బని వాడు ఇంకో పది సంవత్సరాల వరకూ మర్చిపోడనే నేను ఆశిస్తున్నాను. విషయం అది కాదు. ఒకసారి అటుకేసి చూడు" అంటూ అతన్ని బలవంతంగా లేపి, చేతులు జాచి నిలబడి ఉన్న విగ్రహాన్ని అతనికి చూపించాడు గదాధరుడు.

నల్లటి కొండరాయితో చెక్కబడి ఉన్నది ఆ విగ్రహం. వంటి మీది నగలు కూడా ఆ విధంగానే దానిలో మలచబడి ఉన్నాయి.

"మిత్రమా... చేతులు బోసిగా ఉన్నాయి. కరకంకణాలు కనిపించడం లేదు" అన్నాడు శ్యామలుడు.

చటుక్కున మండపంలో నుంచి లేచి, ఆ దేవళం ముందుకుపోయాడు గదాధరుడు, ఒక మనిషి ప్రవేశించేటంత ఎత్తులోనే ఉన్నది ద్వారబంధం. అది కూడా నల్లరాతితోనే చెక్కబడినట్లు నిగనిగ మెరుస్తూ కనిపిస్తోంది.

"అది మా కులదేవత ఆలయం... మట్టిపనులు చేసుకుంటూ బ్రతికే మాకు సహాయం చేయటానికి తన చేతుల్ని ముందుకుజాచి నిలబడి ఉంటుంది" ఆలయం ప్రక్కభాగంలో నుంచి మృదువుగా వినవచ్చాయి ఆ మాటలు.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ అటుకేసి చూసిన గదాధరుడికి వెంటనే అగుపించాడు అంతకుముందు నగరపాలకుడి కుమారుడిని సంహరించ కుండా అడ్డుపడిన వృద్ధుడు.

"అలసిపోయి ఉన్నారు మీరు. కడుపులు నిండిన తరువాత మండపంలో ఆదమరిచి నిద్రపోతూ ఉండి ఉంటారని మేము భావించాము. చీకటిని ఆసరాగా చేసుకుని పారిపోయిన భటులు మరోసారి మీ మీదికి వచ్చిపడతారేమోనన్న అనుమానంతో కాపలా నిలబడ్డాము" అంటూ ఆ ఆలయం వెనుకభాగంలోకి చూపించాడు.

బలమైన బాణాకర్రల్ని పట్టుకుని, ఒక ఇంటి ముందు కూర్చుని ఉన్నారు పదిమంది యువకులు.

తిండి పెట్టిన తర్వాత విశ్రాంతి తీసుకోవటానికి సరైన ఏర్పాట్లు వారు ఎందుకు చేయలేదో ఇప్పుడు అర్థమైంది స్నేహితులు ఇద్దరికీ.

రాజభటులు తిరిగి రావటమే జరిగితే వెంటనే తమకు తెలియటంకోసం అలా చేశారు వాళ్ళు.

"ఏమో అనుకున్నాను గాని, వాళ్ళకి ముందు చూపు కొంచెం అధికంగానే ఉన్నట్లుంది మిత్రమా... మనం ముందు అనుకున్నట్లు మట్టి బుర్రలు మాత్రం కాదు" మండపంలో నుంచి లేచి తన దగ్గరికి వచ్చిన శ్యామలుడితో అన్నాడు గదాధరుడు.

"వాళ్ళకు తోచిన పనేదో వాళ్ళు చేసుకుంటారు. ముందు మనం చేయవలసింది ఏమిటో చూడు" అన్నాడు శ్యామలుడు.

కనులు చిట్లించి మళ్ళీ దేవళంలో ఉన్న విగ్రహం కేసి చూశాడు గదాధరుడు. అర్ధ నిమీలిత నేత్రాలు ఆ రాతి బొమ్మవి... ఉన్నట్లుండి అవి పూర్తిగా తెరుచుకున్నట్టు తనవైపే తదేకంగా చూసినట్లు అనిపించింది అతనికి.

అదిరిపడినట్లు చటుక్కున రెండు అడుగులు వెనక్కి వేశాడు అతను. కనులు నులుముకుని మరోసారి ఆ ప్రతిమ వైపు చూశాడు.

అతను ఎందుకు అలా కలవరపడ్డాడో తనకు అవగతమైపోయినట్లు చిన్నగా నవ్వి, అతని భుజం తట్టాడు శ్యామలుడు.

"నూనెదీపం వెలుగులో ఒక్కోసారి మనకళ్ళు మనల్ని మోసం చేస్తూ ఉంటాయి. ఇటువంటి దేవళాల్లోని విగ్రహాలు కదిలినట్లు, చేతులు ఊపినట్లు, నోళ్ళు తెరిచినట్లు భ్రమలు కలుగుతూ ఉంటాయి. వాటిని గురించి పట్టించు కోకూడదు. ముందు ఆ చేతులు ఎందుకు అలా ముందుకు జాచి ఉన్నాయో తెలుసుకో" అన్నాడు.

తమను పలకరించిన వృద్ధుడి కేసి తిరిగాడు గదాధరుడు. అతను అడుగదల్చినది ఏమిటో తనకు తెలిసినట్లు తల ఊపాడు వృద్ధుడు.

"తరతరాల నుంచి మేము నివసించే ఈ వాడని తన మంత్ర శక్తులతో రక్షిస్తున్న దేవత... ఒకప్పుడు రత్నఖచితమైన స్వర్ణకంకణాలు ఉండేవి ఆ చేతులకి... ఏదో సమయంలో ఎవరో దుర్మార్గుడు వాటిని అపహరించి తన వెంట తీసుకు పోయాడు. అప్పటినుండి ఆ చేతులు అలా ముందుకు జాచబడే ఉన్నాయి...." అన్నాడు.

"మీరెవ్వరూ మరో జత కంకణాలను చేయించి ఈ దేవతకు బహూకరించ లేదా?" అడిగాడు గదాధరుడు.

"ఒకసారి కాదు... కనీసం వందసార్లయినా చేయించాము. అలంకరించ టానికి ప్రయత్నించిన ప్రతిసారి ఆ కంకణాలు వాటంతట అవే శిథిలం అయిపోయాయి. విపరీతమైన వేడిమి తగిలినట్లు వాటంతట అవే నీరుకారి పోయాయి" బరువుగా నిట్టూరుస్తూ చెప్పాడు.

"నగర పాలకుడు గాని, ఆయన కుమారుడు గాని, ఈ వాడలోకి వచ్చి తమ దౌర్జన్యాలని కొనసాగించలేక పోవటానికి కారణం ఏమిటి? మీ శౌర్య ప్రతాపాలను చూసి భయపడి పోవటం వల్లనా లేక ఈ దేవత మహిమకు బెదిరిపోవటం వల్లనా?" ఉన్నట్లుండి చాలా సూటిగా అడిగాడు శ్యామలుడు.

"మా బలాన్ని చూసి భయపడటమే అందుకు కారణం" తడుముకోకుండా అన్నాడు వృద్ధుడు.

"నిజం చెప్పు తాతా. మాకు అనుమానం రావటానికి కారణం ఉంది. కల్లబొల్లి సమాధానాలతో నివృత్తి అయ్యేది కాదు అది" అన్నాడు మళ్ళీ శ్యామలుడు.

"నిజమేమిటి అసత్యమేమిటి... విచిత్రంగా ఉన్నాయి మీ మాటలు.. మా వాడలోకి వచ్చిన వారు తలలు వంచుకుని వచ్చినదారినే తోకలు ముడుచుకుని వెళ్ళిపోవాల్సిందే. మా కుర్రవాళ్ళ బల పరాక్రమాలు అసామాన్యమైనవి. వారు అసామాన్యులు. మా వారి శౌర్యానికి ఎదురు ఉండదు" పెద్ద కంఠంతో గంభీరంగా చెప్పాడు వృద్ధుడు.

శ్యామలుడి వైపు చూశాడు గాదాధరుడు. అతని చూపులోని భావాన్ని వెంటనే అర్థం చేసుకుని తల ఊపాడు శ్యామలుడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో ఒక కరవాలాన్ని ఒరలో నుంచి తీసి వృద్ధుడి మీదికి దుమికాడు గదాధరుడు.

నివ్వెరపోయారు బాణాకర్రలు పట్టుకుని కూర్చుని ఉన్న యువకులు. "ఆగు... ఆగు... ఆగిపో...." అని అరుస్తూ కూర్చున్న ప్రదేశంలో నుంచి పైకి లేవబోయారు వారిలో కొందరు.

అప్పటికే వృద్ధుడిని సమీపించాడు గదాధరుడు. అతను ఎందుకు అంతవేగంగా తన మీదికి వచ్చాడో తెలియక విస్తుబోయి చూస్తున్నాడు వృద్ధుడు. అతని మెడ మీద పడబోయిన గదాధరుడి కరవాలం, కంటికి కనిపించని చేయి ఏదో గట్టిగా పట్టుకున్నట్లు, మధ్యలోనే ఆగిపోయింది. శక్తి నశించి పోయినట్లు క్రిందికి వాలిపోయింది అతని చేయి. మధ్యలోనే ఆగిపోయిన ఆయుధం కాస్తా, ఎగిరి ఆవల పడిపోయింది.

కూర్చున్న ప్రదేశంలో నుంచి లేచిన యువకులు సుడిగాలుల మాదిరి వచ్చి గదాధరుడిని కమ్ముకుని, తమ కర్రల్ని అతని మీద ప్రయోగించటానికి సిద్ధమైనారు.

అవసరం అయితే వారందరినీ తన కరవాలంతోఎదుర్కోవటానికి సిద్ధంగా ఊపిరి బిగపట్టి నిలుచుని ఉన్నాడు శ్యామలుడు.

అతను ఊహించినట్లుగానే ఆ అవసరం కొద్దిగా కూడా రాలేదు. గదాధరుడి ఆయుధం మాదిరిగానే ఎగిరి దూరంగా పడిపోయాయి ఆ యువకుల కర్రలు కూడా.. అతనిచేయి మాదిరిగానే ఆ యువకుల చేతులు కూడా జీవం నశించి పోయినట్లు క్రిందికి వాలిపోయాయి.

"మీ దేవర మహిమ సామాన్యమైనది కాదు. తన దేవళం చుట్టుపట్ల తగాదాలు తన్నులాటలు జరగటం ఆమెకు ఇష్టం లేదు. అన్యాయంగా ఎవరైనా ఆయుధాలను ఉపయోగిస్తే వెంటనే అడ్డుకుంటుంది. నగరపాలకుడు గాని, రాజభటులు గాని, మీ వాడలోకి వచ్చి తమ బలాన్ని ప్రదర్శించలేక పోవటానికి మీ శౌర్య పరాక్రమాలు కారణం కాదు. మీ దేవత కరుణా కటాక్ష వీక్షణాలే...." ఒక్కొక్క మాటను ఆచి తూచి ఉపయోగిస్తూ చెప్పాడు గదాధరుడు.

"అయ్యలూ... ఎవరో కాందిశీకులుగా మిమ్మల్ని భావించి కొంచెం చులకనగా చూశాము... ఎవరు మీరు?" వినయంగా అడిగాడు వృద్ధుడు.

"మేము ఎవరిమో ఇప్పుడు చెప్పవలసిన అవసరంలేదు. మీ దేవత గురించి మేము తెలుసుకోవలసిన విషయాలు ఇంకా ఏమైనా ఉంటే మాకు చెప్పండి...." తాను కూడా వినయంగానే అన్నాడు గదాధరుడు.

"అబ్బే... అటువంటివి ఏమీ లేవు... ఉన్నదేదో ఇందాకనే మీకు చెప్పాను...." ఒకింత కలవరపాటుతో గబగబా అన్నాడు ఆ వృద్ధుడు.

శిలావిగ్రహాల మాదిరి తమచుట్టూ నిలబడి ఉన్న యువకుల వంకా, అతని వంకా పరిశీలనగా చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు గదాధరుడు.

"వీళ్ళు అమాయకులు కాదు మిత్రమా... అమాయకుల మాదిరి నటిస్తున్న మహాచతురులు... వాళ్ళు దాచి పెడుతున్నదేమిటో నాకు తెలిసిపోయింది" శ్యామలుడి వైపు చూస్తూ చిన్నగా అన్నాడు.

అధికం అయిపోయింది వృద్ధుడి వదనంలోని కలవరపాటు "ఏమిటి తెలిసిపోయింది... ఏమిటది?" గబగబా అడిగాడు.

"మీ పూర్వీకులకి ప్రమథరాజ్యంలోని శంబర దేవతకు ఏదో సంబంధం ఉన్నది... ఆ ఆలయం మరుగున పడిపోవటానికి కారణం ఏమిటో మీకు తెలుసు. ఆ సంగతి బట్టబయలు కాకుండా ఉండటం కోసమే మీరు ఈ నగరానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు" అన్నాడు గదాధరుడు.

తన పాదాల క్రింద ఉన్న భూమి రెండుగా చీలిపోతున్నట్లు అదిరిపడి రెండు అడుగులు వెనక్కివేశాడు వృద్ధుడు. చుట్టూ నిలబడి ఉన్న యువకులైతే – పది అడుగుల దూరం అవతలకి దూకారు.

"అక్కడి ఆలయానికి ఇక్కడి మీ దేవళంలోని దేవతకు ఏదో సంబంధం కచ్చితంగా ఉన్నది. తనను ఉద్ధరించే వారికోసమే ఎదురు చూస్తున్నట్లు ఈ విగ్రహం తన చేతులు జాచి నిలబడి ఉన్నది" అంటూ గిరుక్కున ప్రక్కకు తిరిగి ఆ దేవళంలోకి పోయాడు గదాధరుడు.

లోపల ఉన్న విగ్రహానికి అతను ఏదైనా అపచారం తలపెడతాడన్న భయంతో, "ఆగు పరదేశీ.. ఆగు..." అంటూ వెనుకే పరిగెత్తాడు వృద్ధుడు.

అర్ధ నిమీలిత నేత్రాలతో నిలబడి ఉన్న ఆ దేవరకు అపచారం తలపెట్టే ఉద్దేశం గదాధరుడికి ఎంత మాత్రము లేదు.

తన దట్టీలో భద్రపరుకుని ఉన్న కరకంకణాలను బయటికి తీశాడు అతను. "ఇవి నీకు చెందినవే అయితే నిరభ్యంతరంగా తీసుకో తల్లీ... వాటిని తీసుకుని, మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దైవరహస్యాలను మాకు తేటతెల్లం చేయి...." అంటూ వాటిని ముందుకు జాచి ఉన్న ఆ దేవర చేతులకు అలంకరించాడు.

కరిగి నారలు పోవటమో, రూపుచెడి నాశనం అయిపోవటమో జరగలేదు. వెయ్యి నూనెదీపాలను వెలిగించినట్లు ఒక్కసారిగా కాంతివంతం అయిందా దేవళం. మరోసారి కలువపూవుల మాదిరి వెడల్పుగా తెరుచుకున్నాయి విగ్రహం కనులు. చిరునవ్వు నవ్వుతున్నట్లు అందంగా అగుపించాయి పెదవులు.

ముందుకు జాచి ఉన్న చేతులు ఉన్నట్లుండి క్రిందికి వాలిపోయాయి. పెద్ద మెరుపు మెరిసింది. దేవళంలో విగ్రహం నిలబడి ఉన్న పీఠం మాత్రమే మిగిలింది... విగ్రహం మటుమాయం అయిపోయింది.

*　　　*　　　*　　　*　　　*

మాండలీకుడి శిష్యుడు తమకు చెప్పిన మాటల్ని యధాతధంగా రాణి వారికి వినిపించారు శ్యాలక భూపతి అనుచరులు.

"బిల్వవృక్షమట... దాని దగ్గరే చిన్నకట్టడమట... అందులో ఒక క్షుద్ర మాంత్రికుడు... అతనే శ్యాలకుల వారిని మాయం చేశాడు...."

కోపం వచ్చేసింది రాణీవారికి. వెనువెంటనే తీవ్రమైన దుఃఖం కూడా కలిగింది. కనుల వెంట భాష్పధారలు అదే పనిగా జాలువారుతుండగా, విసవిసా నడుస్తూ, నగర పాలకుల వారి మందిరం వైపు బయలుదేరింది.

"తల్లీ... అత్యవసరమైన విషయాలు చర్చిస్తున్నారు. ఎవరినీ లోపలికి అనుమతించవద్దని ఆజ్ఞాపించారు" వినయంగా ఆమెకు చెప్పాడు ఆ మందిరం వెలుపల కాపలా నిలబడిన భటులకు నాయకుడైన ఒక దళపతి.

పెదవులు బిగించి అతని చెంపమీద బలంగా కొట్టింది రాణి.

"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసుకుని మరీ సంభాషించు" అంటూ అతన్ని అవతలకు నెట్టి మూసి ఉన్న మందిర ద్వారాలను తన ఎడమ పాదాలతో బలంగా తట్టింది.

భళ్ళున తెరుచుకున్నాయి అవి. తన సేనా పతులు ముగ్గుర్ని తన ఎదుట కూర్చోబెట్టుకుని, ఏదో ముఖ్యమైనమాట మాట్లాడుతున్న నగరపాలకుడు ఉలిక్కిపడి తల ఎత్తిచూశాడు.

ఎర్రబడిన కనులతో చురచురాచూస్తూ పోయి ఎదుట నిలబడింది రాణి.

"నగరంలో ఉన్న సైనికులందరినీ వెంటనే సిద్ధం చేయండి. అర్ధఘడియలో నా సోదరుడు నా ఎదుటికి వచ్చేయాలి. ఆలస్యం అయితే నేను సహించను" ఖంగుమంటున్న కంఠంతో మహావేగంగా చెప్పింది.

కనులు వెడల్పుచేసి, నోళ్ళు విశాలంగా తెరిచి మరీ చూశారు నగర పాలకుడి ఎదుట ఉన్న సైన్యాధిపతులు.

"దేవిగారు ఏమి మాట్లాడుతున్నారో నాకు అవగతం కావటం లేదు. నెమ్మదిగా వివరంగా చెప్పండి" మృదుస్వరంతో అంటూ, ఆమె చేయి పట్టుకొని, తన ఆసనం మీద కూర్చోబెట్టాడు నగరపాలకుడు.

తన వెనుకే వచ్చిన తన చెలికత్తె వైపు చూసింది రాణి. శ్యాలకుడి అనుచరులు వచ్చి తమకు చెప్పిన మాటల్ని వివరంగా వినిపించింది ఆ చెలికత్తె.

"మాండలీకుడిని వెంటనే ప్రవేశపెట్టండి...." ఖంగుమంటున్న కంఠంతో ద్వారపాలకులకి ఆజ్ఞ ఇచ్చాడు నగరపాలకుడు.

* * * * *

"నగరపాలకుడి బావమరిదిని నాకు బలిఇచ్చావు. అందువల్ల నీకు కష్ట నష్టాలు తప్పవని తెలిసి కూడా నన్ను తృప్తి పరిచావు. సంతోషం అయింది" ఉన్నట్లుండి మాట్లాడింది కరాళి.

నీలమణి నివాస స్థలం ఎక్కడ ఉన్నదో పూర్తిగా కాకపోయినా, కొద్దిగానైనా తెలిసినందుకు సంతోషంతో పరవశించి పోతున్నాడు మాండలీకుడు.

"యువరాణి మాత్రమే కనిపించింది కదా గురుదేవా... అది నీలమణి స్థావరమేనని అనుకోవటానికి వీలు లేదు కదా" అంటూ అతని ఉత్సాహాన్ని మందగింపచేయటానికి ప్రయత్నించాడు శిష్యుడు.

"యువరాణిని మనకు కనిపించకుండా దాచిపెట్ట గల శక్తి ఒక్క నీలమణికి మాత్రమే ఉన్నది. అది తప్పకుండా ఆ దుర్మార్గురాలి నివాసస్థానమే అయి ఉంటుంది. సందేహం లేదు...." అన్నాడు మాండలీకుడు.

"అయితే ఇప్పుడు మనం ఆమెకు తెలియకుండా యువరాణిని ఎత్తుకు రావాలి. అంతే కదా?" అడిగాడు శిష్యుడు.

తల అడ్డం తిప్పాడు మాండలీకుడు. "అది నీలమణి బ్రతికి ఉన్నంత వరకు సాధ్యం కాదు... ముందు నీలమణిని అంతం చేయాలి. అప్పుడే యువరాణిని మనం బంధించగలం."అంటూ ఆ మందిరంలో అటూ ఇటూ చూసి, ఒక మూలగా ఉన్న పెద్ద మండపం దగ్గరికి పోయాడు.

అప్పటికి ఆరేడు సంవత్సరాలుగా అతని దగ్గిర మంత్ర విద్యలు నేర్చు కుంటున్నాడు ఆ శిష్యుడు. కరాళి విగ్రహాన్ని మాత్రమే చూసి ఉన్నాడు అతను. ఆ మందిరంలోనే ఉన్న ఆ మండపాన్ని గమనించలేదు.

"అది ఏమిటి గురుదేవా?" కుతూహలంగా అడిగాడు.

"నేను మాట్లాడుతుంటే, నా మాటలు వినిపించుకోకుండా మీలో మీరు సంభాషించుకుంటున్నారు. పద్ధతి కాదు మాండలీకుడూ... నాకు అవమానం జరిగినట్టు భావించవలసి వస్తుంది" ఉన్నట్లుండి వారి మాటలకు అడ్డువచ్చింది కరాళి.

మూలన ఉన్న మందసాన్ని తెరిచే ప్రయత్నాన్ని విరమించుకుని, కరాళికి నమస్కరించాడు మాండలీకుడు.

"యువరాణి జాడలు తెలిశాయన్న సంతోషంతో నా మతి మందగించింది. నా అవినయాన్ని మన్నించి నువ్వు చెప్పదలుచుకున్నదేమిటో చెప్పు" వినయంగా అర్థించాడు.

తృప్తి చెందినట్లు చిన్నగా నవ్వింది కరాళి. "శ్యాలకుడి సోదరి నగర పాలకుడి దగ్గరికి పోయింది. అతను మీ కోసం భటుల్ని పంపిస్తున్నాడు. జాగ్రత్త వహించండి. నన్ను తృప్తి పరిచారు కాబట్టి అడగకపోయినా ఈ మాట చెప్పవలసి వచ్చింది" అంటూ మౌనం వహించింది.

ఆ మాటలు ముగియటం – మాండలీకుడి మందిర కవాటాలు ధడేల్మని వికృతశబ్దాలు చేస్తూ తెరుచుకోవటం ఒకేసారి జరిగింది.

"నగరపాలకుల వారి ఎదుటికి రండి. ఆజ్ఞ అయింది" ఎటువంటి మర్యాదలు లేకుండా వికృత కంఠంతో హెచ్చరించాడు ఒక భటుడు.

ఎరుపు రంగును పులుముకున్నాయి మాండలీకుని కనులు. ముఖం వికృతంగా మారటం మొదలుపెట్టింది.

ఆలస్యం చేస్తే అతని ఆగ్రహం వెల్లువ మాదిరి వెలుపలికి వచ్చేస్తుందని అర్థమై, హడావిడిగా భటుల ముందుకు పోయాడు శిష్యుడు.

"శ్యాలకుల వారి అంతర్ధానం గురించి నగరపాలకులు తలచుకున్న వెంటనే మాకు కూడా ఏదో ఒకటి వెంటనే చేయాలని అనిపించింది. మేమే వారి సమక్షంలోకి రావాలని అనుకుంటున్నాము. మీరు ముందు నడవండి" బుజ్జగింపుగా అన్నాడు.

"మీరు మాతోనే రావాలి" మరింత ఖచ్చితంగా చెప్పాడు భటుడు.

కనులతోనే మాండలీకుడిని హెచ్చరించాడు. శిష్యుడు. "వెళ్ళివద్దాము... పదండి గురుదేవా...." అంటూ చేయి చూపించాడు ద్వారం కేసి.

మహోగ్రంగా ముంచుకు వస్తున్న ఆగ్రహాన్ని అతి ప్రయత్నం మీద అణుచుకుంటూ అడుగులు వేశాడు మాండలీకుడు.

*    *    *    *    *

"రెండే రెండు ఘడియల్లో శ్యాలకభూపతి మా రాణి వారి కనుల ముందు కనిపించాలి. ఆలస్యం చేస్తే మీరు మా కోపం ఎలా ఉంటుందో చవిచూడాల్సి వస్తుంది." ఎటువంటి శషభిషలు లేకుండా సూటిగా ఆజ్ఞ ఇచ్చాడు నగర పాలకుడు.

శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశాడు శిష్యుడు. కొద్దిపాటి వ్యవధి తీసుకోవటానికి.

"ముగ్గులు వేయాలి. బిల్వవృక్షం దగ్గరి కట్టడంలో ఎవరున్నారో తెలుసుకోవాలి. అందుకు తగిన శక్తుల్ని ఆవాహన చేయాలి. అందుకు కొద్దిపాటి సమయం–" అంటూ ఉండగా – ఎడమపాదంతో నేలను తన్ని ఆసనంలో నుంచి లేచింది రాణి. విసురుగా వెళ్ళిపోయింది ఆ మందిరంలో నుంచి.

"వ్యవధి ఇవ్వబడదు... మీరు వెంటనే కదలటం చాలా బాగుంటుంది" మరోసారి తన నిర్ణయాన్ని వినిపించాడు నగరపాలకుడు.

"కరాళి మందిరంలోని మందసంలో ఒక తాళపత్ర గ్రంథం ఉన్నది. దాన్ని తీసుకుని నువ్వు బిల్లవృక్షం దగ్గరికి వచ్చేయ్...." తన శిష్యుడికి చెప్పి, వంద మంది భటులు తన వెనువెంట నడుస్తుండగా – నగరంలోకి బయలుదేరాడు మాండలీకుడు.

"శ్యాలకుడు అక్కడ లేడు గదా గురుదేవా... ఈ గడ్డు పరిస్థితి నించి గట్టు ఎక్కటం ఎలా??" చిన్న కంఠంతో అడిగాడు శిష్యుడు. అతను ఆ భవనంలో నుంచి బయటికిపోతున్న సమయంలో.

"ఒకేదెబ్బకు రెండు పిట్టలు... నువ్వు చెప్పినట్లు ఆ ప్రదేశంలో ఎటువంటి శక్తి దాగి ఉందో తెలుసుకుంటాను" అన్నాడు మాండలీకుడు.

"తర్వాత?" కుతూహలంగా అడిగాడు శిష్యుడు.

"నా శక్తి ఎటువంటిదో ప్రత్యక్షంగా ఈ నగరపాలకుడికి చూపిస్తాను...." పెద్దగా నవ్వి ముందుకు సాగిపోయాడు ఆ సమయంలో మాండలీకుడు.

అతను దృష్టి పథం నుంచి దూరం అయిన వెంటనే పరుగు లాంటి నడకతో కరాళి కొలువు తీరి ఉన్న మందిరంలోకి పోయాడు శిష్యుడు. మాండలీకుడు అంతకుముందు సమీపించిన మందసం దగ్గరికిపోయి, మూతను తెరిచాడు.

తెరలు తెరలుగా బయటికి వచ్చింది దట్టమైన ధూమం.

"ఎవరు నువ్వు? మాండలీకుల వారి సొత్తుమీద చెయ్యివేసే అధికారం నీకు ఎక్కడిది?" ఖంగుమంటూ వినవచ్చింది ఒక కంఠం.

"నేను వారి శిష్యుడిని. వారి ఆజ్ఞ మేరకే ఈ మందసాన్ని తెరిచాను...." ఏదో తెలియని భయం ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా సమాధానం ఇచ్చాడు శిష్యుడు.

"సుంకం చెల్లించు... సుంకం చెల్లించనిదే ఈ మందసాన్ని తెరిచే అధికారం ఎవరికీ లేదు" వినవచ్చింది ఆ కంఠం.

క్షణం ఆలోచించి, తన దుస్తుల్లో నుంచి చిన్న చురకత్తిని బయటికి తీశాడు శిష్యుడు. ఎడమ చేతిమీద మూడు గాట్లు పెట్టుకుని, ఆ చేతిని ముందుకు జాపాడు.

ఎర్రటి రక్తం ధారలు ధారలుగా మందసం మీద పడటం మొదలు పెట్టింది. "తృప్తి... తృప్తి అయింది...." వినవచ్చిందా కంఠం... తెరలు తెరలుగా పైకి లేస్తున్న పొగ మటుమాయం అయిపోయింది.

రకరకాల వస్తువులు ఉన్నాయి ఆ మందసంలో. దుర్వాసనలు వెదజల్లు తున్న ద్రావకపు పాత్రలు కనిపిస్తున్నాయి. వాటన్నిటి మధ్యలో ఒక నల్లటి వస్త్రంలో అతనికి కనిపించింది మాండలీకుడు చెప్పిన తాళపత్ర గ్రంథం.

అందులో ఏముందో చూడాలని ఎంతగా అనిపిస్తున్నా, ఆ కోరికకు తల వంచకుండా మందసాన్ని మూసి, ఆ మందిరంలో నుంచి బయటికి పరిగెత్తాడు అతను. భవనం వెలుపల ఒక ప్రక్కగా నిలచి ఉన్న అశ్వాన్ని అధిరోహించి, మాండలీకుడు పయనించిన మార్గంలో దాన్ని పరుగు తీయించాడు.

* * * * *

కరకంకణాలను ధరింపచేసిన వెంటనే దేవళంలోని విగ్రహం మటు మాయం అయిపోయేసరికి, నిర్ఘాంత పోయాడు గదాధరుడు.

"ప్రమాదం ఏదో ముంచుకువస్తోంది మిత్రమా.... మన ప్రాణాలు కాపాడు కోవాల్సిన అవసరం ఎంతయినా ఉన్నది...." అంటూ ఎగిరి వెనక్కి దూకాడు.

కొంచెం అవతలగా నిలబడి ఉన్న వృద్ధుడు గొంతు చినిగి పోయేటట్లు అరిచి కేకలు పెడతాడని, ఆ వాడలో ఉన్న వారందరూ ఆయుధాలతో తమ మీదికి వచ్చిపడతారని భావించి, తన ఆయుధంతో సిద్ధంగా నిలబడ్డాడు శ్యామలుడు.

స్నేహితులు ఊహించినట్టు ఆయుధాలతో రాలేదు ఎవరూ. దేవళంలోని విగ్రహం మటుమాయం అయిపోయిన మరుక్షణం, "రండి రండి... అందరూ రండి. తరతరాలుగా ఎదురు చూస్తున్న తరుణం వచ్చేసింది. వచ్చేయండి" బిగ్గరగా అరిచాడు వృద్ధుడు.

చిన్న పెద్ద, ముసలి ముతకా... ఆడామగా అందరూ వచ్చేశారు పుట్టలో నుంచి వెలువడిన చీమలు మాదిరి.

"మనం ఇక మీదట ఈ నగరంలో నివసించవలసిన అవసరం లేదు. శంబర దేవత తన అజ్ఞాత వాసాన్ని వదిలి, బయటి ప్రపంచంలోకి వచ్చే తరుణం ఆసన్నమయింది. ఎన్నోతరాల క్రితం మన పూర్వీకులు వదిలి వచ్చిన మన స్వస్థలానికి మనం వెళ్ళిపోవచ్చు. ప్రయాణానికి సిద్ధం చేసుకోండి" ఆనందంగా అరిచాడు వృద్ధుడు.

"ఆ మాటలు నీకు ఏమైనా అర్థం అయ్యాయా మిత్రమా?" శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

పెదవులు విరిచి, తల అడ్డం తిప్పాడు శ్యామలుడు.

"మన చేతుల్లో ఉన్న ఆయుధాల్ని అవతలికి ఎగురగొట్టే దేవర ఇప్పుడు ఇక్కడ లేదు. ఆ ముసలాడిని పట్టుకుని, రెండు పిడి దెబ్బలు వేస్తే సరిపోతుంది. మనకు కావాల్సిన సమాధానాలు అన్నీ వాటంతట అవే బయటికి వచ్చేస్తాయి...." అంటూ ముందుకు అడుగు వేశాడు గదాధరుడు.

"రండి నాయనలారా... మీరు కూడా మాతో పాటుగా ప్రమథ రాజ్యంలోకి వచ్చేయండి. ఎప్పుడో కనుమరుగు అయిపోయిన శంబర దేవత తిరిగి ఈ భూమి మీద ప్రత్యక్షం అయ్యే సమయంలో ఆ తల్లి దర్శనం చేసుకుని మీ

జీవితాలను ధన్యం చేసుకోండి” అతను తన దగ్గరికి వస్తున్న కారణం ఏమిటో తనకు తెలిసినట్టు గంభీరంగా అన్నాడు వృద్ధుడు.

అతని మెడను గట్టిగా పట్టుకుని తీవ్రంగా దెబ్బలు కొట్టాలనే మాటను మరిచిపోయాడు గదాధరుడు.

“శంబర దేవతకి ఈ దేవళంలోని దేవతా విగ్రహానికి ఏమిటి సంబంధం?” అని అడిగాడు.

“ఆ తల్లి కొలువుండే ఆలయ ద్వారానికి రక్షకురాలు మా ఈ దేవళంలోని శక్తి. ఏమరుపాటు మూలకంగా తన కరకంకణాలు పోగొట్టుకున్నది. ఆ పొరపాటు కారణంగానే శంబరశక్తి ఆలయం కనుమరుగు అయిపోయింది....” అన్నాడు శ్యామలుడితో.

వృద్ధుడు అరిచిన అరుపులకు ఇళ్ళల్లో నుంచి బయటికి వచ్చిన ఆ వాడ పౌరులందరు అప్పటి కప్పుడు ప్రయాణ సన్నాహాలు చేసుకుంటూ ఉండటాన్ని శ్యామలుడు గమనించాడు.

“మనం కూడా ప్రమధ రాజ్యంలోకి పోదాము... ఈ మాటలన్నిటికీ అర్థం తెలియాలంటే ఒకే ఒక వ్యక్తిని మనం పట్టుకోవాల్సి ఉంటుంది” అన్నాడు.

“ఎవరిని?” అడిగాడు గదాధరుడు.

“నగరం మధ్యలో బిల్వవృక్షం... దాని దగ్గిర ఉండే కట్టడం... అందులో నివసించే పెద్దమనిషి....” అతన్నే మనం విచారించాలి.

సాలోచనగా తల ఊపాడు గదాధరుడు.

మండపంలో విశ్రాంతి తీసుకునే ఆలోచన వదిలేశారు వారిద్దరూ... గంధవతి నగరానికి వెళ్ళాలనే కోరిక కూడా మర్చిపోయారు. నగర ద్వారాల్ని దాటి మైదాన ప్రాంతంలోకి ప్రయాణం అవుతున్న ఆ వాడ పౌరుల వెనుకగా తాము కూడా నడక మొదలుపెట్టారు.

* * * * *

“ఆశ్చర్యం... ఇది పరమాశ్చర్యం... దోపిడీలు దొంగతనాలు చేస్తూ గజ దొంగలనే పేరు సంపాదించుకున్న శ్యామల గదాధరుడు మన శంబర దేవత ఆలయాన్ని చూడటం కోసం రావటం నిజంగా విచిత్రంగా ఉంది” పళ్ళెరంలోని నీటిలో కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తూ అన్నది యువరాణి.

గుంపులు గుంపులుగా మాయమైపోయింది నీటిలో కనిపిస్తున్న దృశ్యం. “అవ్వా ఎందుకు జరుగుతోంది ఇలా? మళ్ళీ ఏదైనా శక్తి నీ మంత్రాల్ని అడ్డుకోవటం మొదలు పెట్టిందా?” ఆతృతగా అడిగింది యువరాణి.

కనులు మూసుకుని నిశ్చలంగా కూర్చున్నది వృద్ధురాలు. పదేపది క్షణికాలు తరువాత ఉలిక్కి పడినట్లు చలించిపోతూ కనులు తెరిచింది.

“ఏమయింది అవ్వా?” ఆందోళనగా అడిగింది యువరాణి.

“మాండలీకుడు తన మందిరంలో నుంచి వెలుపలికి వచ్చాడు. నీ జాడలు అతనికి తెలిసిపోయినట్లుగా నాకు అనిపించింది. ఈ మందిరంలో ఉన్నంత వరకూ నీ గురించి అతనికి తెలియటానికి అవకాశాలు లేవు. కాని–” అంటూ తిరిగి తన పూజా మందిరంలోకి పోబోయింది.

“ఎందుకు పోవటం?” అయోమయంగా అడిగింది యువరాణి.

“నీ గురించి అతనికి ఎలా తెలిసి ఉంటుందో నేను తెలుసుకోవాలి” అన్నది వృద్ధురాలు.

“తెలిస్తే ఏమౌతుంది అవ్వా? నువ్వు నన్ను కాపాడలేవా” అమాయకంగా అడిగింది యువరాణి.

“తల్లీ... వాడు మహాబలవంతుడు. ఒకసారి వాడి దృష్టి నీ మీద పడితే, చేతులు ముడుచుకుని కూర్చోడు. ముందుగా నా మీద యుద్ధం ప్రకటిస్తాడు. నన్ను నాశనం చేసిన తర్వాత నిన్ను పట్టుకుపోవటం చాలా తేలిక” అన్నది వృద్ధురాలు.

ఆమె తన పూజా మందిరంలోకి పోయి ధ్యాన సమాధిలో నిమగ్నమయితే, అంతకుముందు, ఆమె హెచ్చరికలను పెడచెవిన పెట్టి తాను ఆ మందిరం వెలుపలికి పోయిన సంగతి బయటికి వచ్చేస్తుందని తెలిసిపోయింది యువరాణికి.

“అవ్వా నీ దగ్గర నేను ఒక మాట దాచిపెట్టాను. నన్ను క్షమించు” అంటూ తనంతట తానే ఆమెకు తెలియచేసింది.

ద్వారబంధాన్ని దాటి ఆవలికి పోకుండా చేతులు అడ్డుగా పెట్టిన బాలిక స్వరూపాన్ని గురించి కూడా చెప్పింది.

ఉన్నట్లుండి నీటితో నిండిపోయాయి వృద్ధురాలి కనులు. “ఎంత పని చేశావు తల్లీ... నా గుట్టు రట్టు అవటమే కాకుండా నీ ప్రాణాలకు కూడా పెను ప్రమాదమే ఏర్పడింది కదా....” బరువుగా అన్నది.

"ఎంతో సేపు నేను వెలుపల నిలబడలేదు. వెంటనే లోపలికి వచ్చేశాను... నన్ను ఎవరూ గమనించలేదు. వీధిలో ఒక్క పౌరుడు కూడా నాకు కనిపించలేదు." చెప్పింది యువరాణి.

"అంబా... ఎక్కడ ఉన్నావమ్మ?" అభిమానంగా పిలిచింది వృద్ధురాలు.

యువరాణిని అడ్డుకున్న బాలిక మరోసారి ద్వారం దగ్గిర ప్రత్యక్షం అయింది.

"ఏం జరిగింది తల్లీ?" అడిగింది వృద్ధురాలు.

"మాండలీకుడి శిష్యుడు పంపకం చేసిన వాయస భూతం యువరాణిని చూసింది" క్లుప్తంగా చెప్పి మాయం అయిపోయిందా బాలిక.

పది క్షణికాల పాటు దీర్ఘంగా ఆలోచించి, చటుక్కున లేచి నిలబడింది వృద్ధురాలు. "మనం ఇక్కడ ఉండటం మంచిది కాదు" అంటూ యువరాణి చేతిని పట్టుకుని అవతలి గదిలోకి తీసుకుపోయింది.

వృద్ధురాలిని అతలాకుతలం చేస్తున్న భయం ఏమిటో పూర్తిగా తెలియలేదు యువరాణికి.

"ఎక్కడికి పోతున్నాం అవ్వా? ఇప్పటికిప్పుడు ఇక్కడినించి అవతలికి పారిపోవటం అవసరమా?" అని అడిగింది.

"అయ్యో పిచ్చితల్లీ... నీ అమాయకత్వాన్ని చూస్తుంటే నాకు చాలా వేదన కలుగుతోంది. నువ్వు గనుక ఆ దుష్ట దుర్మార్గుడికి దొరికితే ఏం జరుగుతుందో తెలిసి కూడా తెలియనట్లే మాట్లాడుతున్నావు" చిన్న కంఠంతో చెప్పింది వృద్ధురాలు.

"తెలుసు అవ్వా... బాగా తెలుసు. నన్ను బలిఇస్తాడు. మటుమాయం అయిపోయిన ఆ దేవత ఆలయం ఎక్కడ ఉన్నదో తెలుసుకుంటాడు. అంతే కదా...." ముఖంలో ఎటువంటి భావాలూ ప్రత్యక్షం అవకుండా, చాలా నిర్వికారంగా సమాధానం ఇచ్చింది యువరాణి.

"అలా బేలగా మాట్లాడటం దేనికి తల్లీ? నిన్ను రక్షించుకోవటానికి నేను ఇంకా ప్రాణాలతోనే ఉన్నాను. నా సర్వశక్తులు ఉపయోగించైనా సరే నిన్ను ఆ దుర్మార్గుడి బారినుంచి కాపాడుకుంటాను" అంటూ మాటల్ని ఒక్క క్షణికం పాటు ఆపింది వృద్ధురాలు.

"నువ్వు మాత్రం నేను చెప్పినట్లే చేయాలి. శౌర్యసాహసాల ప్రదర్శన అయితే నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించవచ్చుగానీ, మాండలీకుడిని ఎదిరించడం

అంటే మంత్రాలతోనూ, క్షుద్ర శక్తులతోనూ తలపట్లు పట్టటం... ఆ పని నీకు చేతకాదు” అంటూ మాటల్ని పూర్తిచేసింది.

వృద్ధురాలు చెప్పదలుచుకున్నది ఏమిటో యువరాణికి పూర్తిగా అర్థం అయింది. అప్పటి కప్పుడు ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టి అవతలికి పోవాలనే నిర్ణయం తీసుకోవటానికి కారణం తన ప్రవర్తన.

ముందుచూపు లేకుండా మందిరంలో నుంచి బయటికిపోయి, మాండలీకుడు పంపిన గూఢచారుల దృష్టిలో పడింది తాను. వృద్ధురాలు తనకు కాపలాగా పెట్టిన ఏదో మంత్రశక్తి తనను వద్దు వద్దని వారించినా వినిపించు కోలేదు.

భవిష్యత్తులో తిరిగి అటువంటి పనులు చేయకుండా, తల వంచుకుని బ్రతక గలిగితేనే తనకు రక్షణ.

దీర్ఘంగా నిట్టూర్చింది యువరాణి. “నేను చేసిన తప్పిదానికి సిగ్గుపడు తున్నాను అవ్వా... ఇక ముందు అలా ప్రవర్తించను. నువ్వు ఏం చెపితే అది చేస్తాను.” తల వంచుకుని చెప్పింది.

వృద్ధురాలి వదనంలోని ఆందోళన ఒక్కక్షణం పాటు మటుమాయం అయిపోయింది. చటుక్కున యువరాణి తలను పట్టుకుని, ముందుకు వంచి నుదుటిని చుంబించింది.

“నా తల్లి... నాకు తెలుసు... పరిస్థితులు ఎటువంటివో నీకు బాగా తెలుసు” అంటూ తన పూజా మందిరం దగ్గిర ముందుకు వంగి నేలను బలంగా తట్టింది. విప్పారిన కనులతో విచిత్రంగా చూస్తూనే ఉన్నది యువరాణి.

దడదడమని వినవచ్చింది గంభీరమైన శబ్దం. వృద్ధురాలు తట్టిన ప్రదేశంలో నేల రెండుగా చీలింది.

చిమ్మచీకటితో నిండి ఉన్న పెద్ద సొరంగం ప్రత్యక్షం అయ్యింది.

“అవ్వా... ఈ సొరంగం ఆ మాండలీకుడికి కనిపించి, వాడు మనల్ని తరుముకుంటూ వస్తే,” తన అనుమానాన్ని బహిర్గతం చేసింది యువరాణి.

“వాడు పంపిన వాయసభూతం నిన్ను మాత్రమే చూసింది. ఈ ప్రదేశాన్ని పూర్తిగా చూడటం దానికి చేతకాదు....” అంటూ యువరాణి చేతిని పట్టుకుని సొరంగంలోకి దిగింది వృద్ధురాలు.

"వాడు స్వయంగా ఇక్కడికి వస్తే?" మరో ప్రశ్న వేసింది యువరాణి.

"ఆ పని తప్పకుండా జరుగుతుంది. వాడు వస్తే మాత్రం మన గుట్టు బట్టబయలు అయిపోతుంది. ఆ పని జరిగే లోపల మనం సురక్షిత ప్రదేశంలోకి వెళ్ళిపోగలం" అంటూ వడివడిగా అడుగులు వేయటం మొదలు పెట్టింది వృద్ధురాలు.

చిమ్మచీకటితో నిండివున్నది ఆ సొరంగం. వృద్ధురాలు గనుక తన చేతిని వదిలితే, తనకు ఎటుపోవాలో తెలియక పోవచ్చనే అనుమానం కలిగి, ఆమె చేతిని తానే స్వయంగా చాలా గట్టిగా పట్టుకున్నది యువరాణి.

పావు ఘడియపాటు నడిచిన తర్వాత కూడా ఆ మార్గం అంతం అయ్యే సూచనలు కనిపించక పోవడంతో, "అవ్వా... నేను మాట్లాడవచ్చునా?" అని అడిగింది చిన్నకంఠంతో.

"నా సర్వశక్తులు ఉపయోగించి సృష్టించిన మార్గం ఇది. మనం ఆ దుర్మార్గుడి దృష్టిలో పడకుండా కాపాడుతుంది. నువ్వు నోటిని అదుముకుని తల వంచుకోవాల్సిన అవసరం లేదు. నీ అనుమానం ఏమిటో చెప్పు" వెంటనే సమాధానం ఇచ్చింది వృద్ధురాలు.

"శంబర దేవత ఆలయం ఎక్కడ ఉన్నదో తెలుసుకోవాలన్న కోరికతో చేయకూడని దుర్మార్గపు పనులన్నీ చేస్తున్నాడు మాండలీకుడు. వాడు క్షుద్ర మాంత్రికుడు కాబట్టి, ఆ దేవత అనుగ్రహంతో మరింత శక్తిమంతుడు కావాలన్నది అతడి కోరిక. మరి మనం చూసిన గజదొంగ శ్యామలుడికి ఆ దేవత ఆలయాన్ని వెతుకవలసిన అవసరం దేనికి? అతడు మాంత్రికుడు కాదు గదా?" తన మనసులోని ప్రశ్న బయటపెట్టింది యువరాణి.

"తల్లీ... కనులకు కనిపించే విషయాలు మాత్రమే మనం చూశాం. మనసుల్లోని మాటల్ని చూడలేదు. పట్టినపట్టు వదలకుండా ఆ దొంగ ఒక్కొక్క రహస్యాన్ని ఛేదించుకుంటూ రావటాన్ని చూస్తుంటే నాకు కూడా ఆశ్చర్యంగానే ఉంది" సాలోచనగా చెప్పింది వృద్ధురాలు.

"మనం చూసిన దృశ్యాలన్నీ గతంలో ఎప్పుడో జరిగిపోయినవి. ప్రస్తుతం అతను తన జతగాడితో కలిసి మన నగరంలోనే ఉన్నాడు. మాండలీకుడిని అతను తప్పకుండా ఎదిరిస్తాడు...." అన్నది యువరాణి.

గజదొంగ శ్యామలుడి ప్రసక్తి ఎందుకు వచ్చిందో అర్థమై చిన్నగా నవ్వింది వృద్ధురాలు.

"అతగాడికి అమితమైన బలం ఉన్నది. బలాన్ని మించిన ఆలోచన ఉన్నది. కాని మాండలీకుడి వంటి దుర్మార్గుడిని ఎదిరించటానికి అవి సరిపోవు. తప్ప కుండా మంత్ర తంత్రాల సాయం కావాలి... అవి అతనికి లేవు...." అన్నది.

"మనం అతనికి సాయం చేయవచ్చు కదా... అతని శౌర్యసాహసాలకు నీ మంత్ర శక్తులు తోడయితే మాండలీకుడి పని అయిపోతుంది కదా" అన్నది యువరాణి.

పది క్షణికాల పాటు ఆలోచించి తల అడ్డం తిప్పింది వృద్ధురాలు.

"దూరంగా ఉండి మాండలీకుడి ప్రయత్నాలకు అడ్డు తగలటమే తప్ప, ముఖాముఖీ ఎదురుపడి అతనితో పోరాడగల శక్తి నాకు లేదు. అందుకే సురక్షిత ప్రదేశానికి వెళ్ళిపోతున్నాం" అన్నది.

ఆపైన తన మనసులోని మాటల్ని బయటికి చెప్పలేదు యువరాణి. అలసట అధికం అయిపోతున్నా, ఆ విషయాన్ని బయటపెట్టకుండా ఆమెను అనుసరించింది.

* * * * *

ఆకాశాన్ని అంటుకునేటంత ఎత్తుగా ఉన్నది ఒక సన్నపాటి ఇరుకువీధిలో ఉన్న బిల్వవృక్షం. దానికి పాతిక ధనువుల దూరంలో నిర్మించబడి ఉన్నది చిన్న చెక్కల కట్టడం.

తనకు తోడుగా వచ్చిన రాజభటుల వంక చూశాడు మాండలీకుడు ఆ ఇరుకు వీధిలో నిలబడి.

"ఆ కట్టడంలో ఎవరు నివసిస్తున్నారో తెలుసుకోండి" అని ఆజ్ఞ ఇచ్చాడు.

పొడవాటి బరిశెలున్నాయి ఆ భటుల దగ్గర. వాటిని బిగించి పట్టుకుంటూ బిల్వవృక్షం ప్రక్కనుంచి ఆ కట్టడం దగ్గరికి పోయారు.

మూసివున్న తలుపుల్ని తమ బరిశెల మొనలతో పొడుస్తూ "ఎవరు ఈ కట్టడంలో? ఎవరు నివసిస్తున్నారీ ప్రదేశంలో?" అని అడిగారు పెద్ద కంఠాలతో.

కిర్రుమని శబ్దం చేస్తూ తెరుచుకున్నాయి కట్టడపు తలుపులు. భుజాల మీదికి వ్రేలాడుతున్న పొడవాటి జుట్టును ఎడమచేతితో వెనక్కి నెట్టుకుంటూ ద్వారంలో ప్రత్యక్షం అయ్యాడు ఒక మనిషి.

"అయ్యా... మహామాంత్రికుడైన మాండలీకుల వారు వచ్చారు. లోపలికి ఆహ్వానించండి... అతిధి మర్యాదలు చేసుకోండి" అతన్ని చూడగానే వినయంగా అన్నాడు ఒక భటుడు.

బిల్వవృక్షానికి సరిగ్గా పాతిక ధనువుల దూరంలో, ఒక పెద్ద పెంకుటింటి చాటున నిలబడి ఉన్నారు శ్యామల గదాధరులు.

"ఇతను ఎవరో చాలా పెద్దమనిషి మాదిరిగా ఉన్నాడు... మంత్ర తంత్రాలు నేర్చినవాడి మాదిరిగా కనిపించడం లేదు" చిన్నకంఠంతో అన్నాడు గదాధరుడు.

"మనం వచ్చింది ఇతన్ని చూడటం కోసమే. ఇతనికి మంత్రాలు వచ్చినా రాకపోయినా మనకు అనవసరం" అదేమాదిరి చాలా చిన్నగా సమాధానం ఇచ్చాడు శ్యామలుడు.

"మనం వచ్చిన పని పూర్తి అవుతుందనే నమ్మకం నాకులేదు. ఈ మాండలీకుడు ఏదో చెత్తవాగుడు వాగుతాడు. అతనికి కోపం వస్తుంది. అతను ఏదో మొండి సమాధానం చెపుతాడు. ఈ మాండలీకుడు అతన్ని కుక్కగానో, నక్కగానో మార్చి అవతలికి పోతాడు" అన్నాడు గదాధరుడు.

"నీకు ఈ మధ్య భవిష్యత్తు బాగా తెలిసినట్లు మాట్లాడటం బాగా అలవాటు అయింది. నోరు మూసుకుని ఏం జరుగుతుందో చూడు" విసుగు నిండిన కంఠంతో హెచ్చరించాడు శ్యామలుడు.

"మాండలీకుల వారు వచ్చారా? అయ్యయ్యో... వీధిలోనే నిలబడి ఉన్నారా? ఏరీ? ఎక్కడ??" భటుడి మాటలు వినగానే ఆదరబాదరాగా ఇంటిలో నుంచి బయటికి వచ్చాడు ఆ మనిషి.

బిల్వవృక్షం వైపే చూస్తూ నిలబడి ఉన్నాడు మాండలీకుడు. పెద్దపెద్ద అడుగులు వేస్తూ తన దగ్గరికి వచ్చిన ఆ మనిషిని ఆపాదమస్తకం పరిశీలించి చూశాడు.

తన శిష్యుడు అనుమానపడినట్లు, తమకు ప్రత్యర్ధి కాగల లక్షణాలు అతనిలో కనిపించటం లేదని తెలిసిపోయింది అతనికి.

"నువ్వు ఎవరివి?" తన దండాన్ని నేలకు బలంగా తాటిస్తూ గంభీరంగా అడిగాడు.

నోటి లోపలి దంతాలన్నీ బయటికి కనిపించేటట్టు పెద్దగా నవ్వాడు ఆ మనిషి.

“అయ్యా... మాంత్రికుల వారూ... నా పేరు దుహితుడు. గత పాతిక సంవత్సరాలుగా ఈ నగరంలోనే నివసిస్తున్నాను. నా గురించి నేను చెప్పుకోవడం బాగుండదు. ఈ చుట్టుపక్కల ఉన్న వారిని అడిగితే నేను ఎవరినో, ఎటువంటి వాడినో చెపుతారు” వినయంగానే సమాధానం ఇచ్చాడు.

తను వేసిన ప్రశ్నకు అతను సూటిగా సమాధానం చెప్పకుండా చుట్టుదారి మాటలు మాట్లాడటం నచ్చలేదు మాండలీకుడికి.

తన దండాన్ని మరింత బలంగా నేలకు అదిమాడు అతను. “నేను ఆజ్ఞాపిస్తున్నాను. సూటిగా సమాధానం చెప్పు” అంటూ ఆజ్ఞాపించాడు.

నలుపు రంగు పొగవంటిది మంత్రదండం చివరి భాగంలో నుంచి పైకి లేచి, ఆ మనిషి మీదికి ప్రసరించింది.

ఆ పొగను వాసన చూసిన మరుక్షణం, మైకం క్రమ్మినట్లు బిత్తరచూపులు చూస్తూ మాట్లాడవలసిన ఆ మనిషి, అటువంటి పనేమీ చేయలేదు. అసలు ఆ పొగ అతని సమీపంలోకి కూడా పూర్తిగా పోలేదు.

ఈదురుగాలి వీచినట్లు వేగంగా కదిలాయి బిల్వవృక్షపు కొమ్మలు... పొగ కూడా చెల్లాచెదురై కనిపించకుండా పోయింది.

తన ఎదుట సాధారణమైన పౌరుడి మాదిరి నిలబడి ఉన్న ఆ దుహితుడు ఎవరో గాని, ఎంతో కొంత శక్తి కలిగి ఉన్నటువంటి వాడేనని వెంటనే తెలిసిపోయింది మాండలీకుడికి.

కట్టడం దగ్గిరే నిలబడి ఉన్నారు రాజభటులు. కనులు పెద్దవిచేసి ఆ దృశ్యాలన్నిటినీ గమనిస్తూనే ఉన్నారు.

కంటికి కనిపించకుండా మటుమాయం అయిన రాజుగారి బావమరిదిని ఆ కట్టడంలో నివసించే దుర్మార్గుడే ఏదో చేసేశాడని తాము అందరికీ చెప్పారు.

ఇప్పుడు ఆ మాటను నిజం చేయటానికి తగిన అవకాశం లభించింది. తన సంతోషాన్ని అతి బలవంతంగా అదుముకున్నాడు మాండలీకుడు.

“శ్యాలక భూపతుల వారిని ఏం చేశావు నువ్వు? ఎక్కడ దాచి పెట్టావు?” ఖంగుమంటున్న కంఠంతో అడిగాడు.

ఒక్క క్షణికం పాటు తెల్లబోయినట్లు అయోమయంగా చూశాడు ఆ మనిషి. అంతలోనే తేరుకుని చిన్నగా నవ్వాడు.

“మాండలీకుల వారంటే సర్వశక్తి సమన్వితులని నేను అనుకున్నాను. తాము చేసిన అకార్యాలను ఇతరుల మీదికి నెట్టి ఆత్మరక్షణ చేసుకోవాల్సిన పరిస్థితుల్లో చిక్కుబడతారని మాత్రం అనుకోలేదు” వెక్కిరింపుగా అన్నాడు.

తన మందిరంలో జరిగింది ఏమిటో అతనికి అర్థం అయిందని తెలిసిపోయింది మాండలీకుడికి. తాను భావిస్తున్నట్టు అతను తన కంటే తక్కువ వాడు కాదని కూడా అవగతం అయింది.

శ్యాలక భూపతిని తానే మట్టుబెట్టినట్లు, తనకు తన శిష్యుడికి తప్ప దగ్గిర్లోనే ఉన్న రాజభటులకు కూడా తెలియదు. ఎక్కడో నగర మధ్యమంలో ఉన్న ఆ మనిషికి తెలిసిపోవటం అంటే – అతను సాధారణమైన వాడు కాదనేగా అర్థం??

“దుర్మార్గుడా... నువ్వు చేసిన అకృత్యానికి తగిన శిక్ష అనుభవించక తప్పదు” అంటూ కట్టడం దగ్గిర ఉన్న భటుల్ని పిలిచాడు అతను. “రండి... వచ్చి ఈ దుర్మార్గుడిని బంధించండి” అని ఆజ్ఞ ఇచ్చాడు.

తమ ఆయుధాలను మరింత గట్టిగా బిగించి పట్టుకుని వేగంగా వెనక్కి వచ్చారు వాళ్ళు. ఒక్కసారిగా ఆ మనిషిని చుట్టుముట్టి చేతులు వెనక్కి విరిచి పట్టుకోబోయారు.

మరోసారి కదిలాయి బిల్వవృక్షపు కొమ్మలు... కంటికి కనిపించని రాక్షస హస్తం ఏదో ఒకేసారి అందరినీ పట్టుకుని పైకి లేపినట్లు గాలిలోకి లేచారు వారందరూ.

ఆలస్యం చేస్తే వారి ప్రాణాలు పోతాయని తెలిసిపోయింది మాండలీకుడికి. తన దండాన్ని పైకి ఎత్తి పెద్ద కంఠంతో ఒక మంత్రాన్ని చదివాడు.

గాలిలోకి లేచిన భటులు గాలిలోనే ఉండిపోయారు. తీరికగా నిలబడి ఉన్న దుహితుడు మాత్రం – ఎవరో బలంగా నెట్టినట్లు వెల్లకిలా పడిపోయాడు.

అతను క్రింద పడిపోయిన వెంటనే, గాలిలో ఉన్న భటులకు ప్రమాదం తప్పిపోతుందని ఆశించాడు మాండలీకుడు.

అతను ఆశించినట్లు జరగలేదు. వడిశెలలో నుంచి విసిరి వేయబడిన రాళ్ళమాదిరి వేగంగా నేలకేసి దూసుకు వచ్చారు భటులు అందరూ.

బలంగా నేలకు పొదుచుకున్నాయి వారి తలలు. ఆ అదటుకు కుండ పెంకుల మాదిరి ముక్కలు చెక్కలైపోయాయి. ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి వస్తుండగా కనులు తేలవేసి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

మంత్ర దండాన్ని పట్టుకుని నిలబడి ఉన్న మాండలీకుడికి మతిపోయినంత పని అయింది.

తాను ప్రయోగించిన మంత్రశక్తిని తట్టుకోలేక వెల్లకిలా పడిపోయిన ఆ మనిషి ఒకేసారి పది మంది భటుల ప్రాణాల్ని ఎలా తీయగలిగాడు??

పళ్ళు బిగించి మరోసారి తన దండాన్ని గాలిలో ఊపాడు అతను. అంతకుముందు మాదిరిగానే బయటికి వచ్చింది నల్లటి పొగ. అది వేగంగా పోయి క్రింది నించి లేస్తున్న దుహితుడిని చుట్టు ముట్టకముందే, రివ్వున క్రిందికి వాలాయి రెండు బిల్వవృక్షపు కొమ్మలు. మాండలీకుడి నడుమును గట్టిగా పట్టుకుని గాలిలోకి లేపాయి.

చెమటలు ప్రత్యక్షం అయ్యాయి అతని ముఖం మీద. "నన్ను మించిన మొనగాడు ఈ చుట్టుపట్ల ఎవరూ లేడని గర్వించాను. నా కళ్ళముందే ఒకడు ఉన్నట్లు గమనించలేకపోయాను. ఎందుకు ఇలా జరుగుతోంది?" తనలో తాను అనుకుంటూ, "కరాళీ... కరాళీ...." అని బిగ్గరగా అరిచాడు.

నల్లటి పట్టు వస్త్రంలా మెరిసిపోతూ, చిన్నపాటి ముల్లు తునకమాదిరి అతని ఎదుట ప్రత్యక్షం అయింది కరాళి.

"ఏమిటిది? ఏమిటి నాకీ అవమానం?" జీరపడిన కంఠంతో అడిగాడు మాండలీకుడు.

"మాయమైపోయిన శంబరదేవత ఆలయం ఎక్కడ ఉన్నదో తెలుసు కోవటానికి ప్రయత్నిస్తున్నది నువ్వు ఒక్కడివే కాదు. ఈ దుహితుడు కూడా ఎన్నో తరాల నుంచీ అదే పనిమీద ఉన్నాడు. ఇతన్ని జయించటం నీకు చేతకాదని నా అనుమానం" తడబాటు అనేది కనిపించని కంఠంతో చెప్పింది కరాళి.

"ఈ సంగతి నువ్వు నాకు ముందే ఎందుకు చెప్పలేదు?" కోపంగా అడిగాడు మాండలీకుడు.

"నువ్వు అడగలేదు. నిన్ను మించినవాడు వేరే ఎవరూ ఉండరనే అహంకారం...." చెప్పింది కరాళి.

"ఇది... ఈ వృక్షం ఏమిటి? ఎందుకు ఇలా రెచ్చిపోతున్నది?" తనను పట్టుకున్న కొమ్మల్ని చూపిస్తూ అడిగాడు మాండలీకుడు.

"బహుశా ఇది దుహితుడికి రక్షణగా ఉండే మంత్ర వృక్షం అయి ఉండవచ్చు. అతన్ని నాశనం చేసిన వెంటనే ఇది కూడా శక్తిని కోల్పోయే ఏర్పాటు జరిగి ఉంటుంది" అన్నది కరాళి.

"అయితే ఆలస్యం దేనికి? అతని ఆయువును పీల్చేయ్. భూమిలోకి అణగద్రొక్కేయ్...." అన్నాడు మాండలీకుడు.

మబ్బుతునక మాదిరి ఉన్న కరాళి కాస్తా... మదగజం మాదిరి మరింత పెద్దదై పోయింది. రివ్వునపోయి చెట్టు క్రింద నిలబడి ఉన్న దుహితుడి నెత్తిమీద కొండరాయి మాదిరి పడింది.

మరోసారి వెల్లికిలా పడిపోవాల్సిన ఆ మంత్రవాది అలా తల్లక్రిందులు కాలేదు. కనుల్ని పైకి ఎత్తి భీకరంగా నవ్వాడు.

అతని శిరస్సు మీద పడబోతున్న కరాళి చుట్టూ చేపల వల మాదిరి చుట్టుకున్నాయి బిల్వవృక్షపు కొమ్మలు.

"మాండలీకా... మాండలీకా... మహాశక్తిమంతమైన వృక్షం ఇది. ఈ దుహితుడి మంత్రబలమంతా ఈ వృక్షంలోనే కేంద్రీకరించబడి ఉంది. ఇతన్ని జయించాలంటే ముందుగా ఈ చెట్టును నాశనం చేయాలి." బిగ్గరగా అరిచింది కరాళి.

"అయితే ఆలస్యం దేనికి? ఆ పని చేసి చూపించు" తాను కూడా పెద్దగానే అరిచాడు మాండలీకుడు.

అరవటం అయితే అరిచాడు గాని, తాను ఆశించినట్లు కరాళి ఆ చెట్టును ఏమీ చేయలేకపోతున్నదని వెంటనే అర్థం అయింది అతనికి.

గిలగిలా కొట్టుకున్నది ఆ క్షుద్రశక్తి. హూంకారం చేసి, ఆ కొమ్మల మధ్యలో నుంచి తప్పించుకున్నది. తప్పించుకున్న వెంటనే మటుమాయం అయి పోయింది.

తనకు అంత్య సమయం ఆసన్నమైనట్లు తెలిసిపోయింది మాండలీకుడికి. చెట్లుక్రింద ఉన్న దుహితుడు విజయగర్వంతో బిగ్గరగా నవ్వటం కనిపించింది అతనికి.

"శంబరదేవత ఆలయాన్ని నేను మాత్రమే చూస్తాను. ఆ తల్లి ఆశీస్సులు నాకు ఒక్కడికి మాత్రమే లభిస్తాయి... నీ ప్రయత్నాలన్నీ వృథా అయిపోవాల్సిందే...." అంటూ రెండు చేతులను గాలిలోకి ఎత్తాడు దుహితుడు.

సహాయం చేస్తుందని అనుకున్న కరాళి మటుమాయం అయిపోయే సరికి మతి పోయినంత పనిఅయింది మాండలీకుడికి.

ఆ సమయంలో చటుక్కున గుర్తుకు వచ్చాడు అతనికి తన శిష్యుడు. కరాళి విగ్రహం ఉన్న మందిరంలోని మందసంలో నుంచి బయటికి తీసుకు రమ్మని చెప్పిన తాళపత్ర గ్రంథం కనుల ముందు మెదిలింది.

మందసాన్ని మామూలు మనుష్యులు ఎవరూ తెరవలేరు. దమ్ముధైర్యం తెలివి తేటలు కలిగిన వారి వల్లనే సాధ్యం అవుతుంది ఆ పని.

తన శిష్యుడికి ఆ లక్షణాలు ఉండి ఉంటే, ఆ గ్రంధాన్ని తీసుకుని అక్కడికి వచ్చేస్తూ ఉండాలి. అతను రాగలిగితే తాను ప్రమాదం నుంచి బయట పడేందుకు అవకాశం ఉంటుంది.

"ఒరేయ్ శిష్యుడా... త్వరగా వచ్చేయ్" శరీరంలోని శక్తినంతా కూడ తీసుకుంటూ బిగ్గరగా అరిచాడు అతను.

పెంకుటింటి చాటున నిలబడి ఆ దృశ్యాలన్నీ తదేకంగా చూస్తున్న స్నేహితులిద్దరికీ వెంటనే కలిగింది విపరీతమైన ఆశ్చర్యం.

"వీడి పని అయిపోయిందనే అనుకున్నాను. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు వాడు ఇంకా కొత్త కొత్త అరుపులు మొదలు పెట్టాడు" శ్యామలుడితో అన్నాడు గదాధరుడు.

ఆ మాటలకు సమాధానం ఇవ్వకుండా చెట్టు క్రింద ఉన్న దుహితుడి వైపే చూస్తున్నాడు శ్యామలుడు. అతని శక్తిని అంచనా వేయటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

గాలిలోకి ఎత్తిన ఆ దుహితుడి చేతుల్లో నుంచి ఎటువంటి శక్తీ బయటికి రావటం లేదు. అలాగని చెప్పి అతను తన చేతుల్ని క్రిందికి దించటం లేదు.

"వాడు మాండలీకుడి కంటే తెలివైన వాడి మాదిరి కనిపిస్తున్నాడు...." అన్నాడు శ్యామలుడు.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

"వాడి మంత్రబలం వాడి మెదడులోగాని, వాడి చేతుల్లో గాని, వాడి శరీరంలోగాని లేదు. మొత్తం ఆ బిల్వ వృక్షంలో ఉన్నది... ఆ సంగతి మాండలీకుడికి తెలియటం లేదు."

"నాకు అర్ధం కాలేదు. వివరంగా చెప్పాలి" అన్నాడు గదాధరుడు.

"ఆ చెట్టును నాశనం చేయగలిగితే ఈ దుహితుడు నాశనం అయిపోతాడు. ఆ చెట్టు సజీవంగా ఉన్నంతవరకూ ఇతన్ని ఎవరూ జయించ లేరు...." వివరించి చెప్పాడు శ్యామలుడు.

అతను గమనించిన ఆ విషయాన్ని మాండలీకుడికి వినిపించేటట్లు బిగ్గరగా అరిస్తే పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆలోచించటం మొదలు పెట్టాడు గదాధరుడు.

"పిచ్చి ఆలోచనలు చేయబోకు. వాళ్ళు ఇద్దరూ మనకు పగవాళ్ళే. తమ అవసరం తీరిపోగానే మన అంతుచూడటానికి ప్రయత్నం చేస్తారు" అతని ఆలోచన ఏమిటో అర్ధమై విసురుగా అన్నాడు శ్యామలుడు.

అందుకు గదాధరుడు సమాధానం చెప్పకముందే, ఆయాసంతో వగరుస్తూ ఆ ఇంటి దగ్గరికి వస్తున్న మాండలీకుడి శిష్యుడు అతనికి అగుపించాడు.

గిలగిలలాడుతున్న మాండలీకుడికి ప్రాణం లేచి వచ్చినట్లు అయింది తన శిష్యుడిని చూడగానే. "నీ దగ్గర ఉన్న గ్రంధంలో మూడవ తాళ పత్రాన్ని తీయ్... నుదుటికి తాకించుకుని నేలకు విసిరికొట్టు" జీరపడిన కంఠంతో బిగ్గరగా అరిచాడు.

అతను చెప్పినట్లే తన చేతుల్లో ఉన్న గ్రంధాన్ని విచ్చదీసి, మూడవ తాళపత్రాన్ని బలవంతంగా బయటికి లాగాడు శిష్యుడు. భక్తిగా నుదుటికి తాకించుకుని, నేలకు విసిరి కొట్టాడు.

శక్తిమంతమైన ప్రేలుడు పదార్ధంతో నిండి ఉండే ఇనుప మందసం ఏదో బ్రద్దలైపోయినట్లు వినవచ్చింది బ్రహ్మాండమైన శబ్దం...

కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు ప్రత్యక్షం అయింది. తాళపత్రం నేలకు తాకిన ప్రదేశంలో నుంచి చివ్వున పైకి లేచింది ఒక అగ్నిజ్వాల. ఎత్తుగా కనులు మీదుగా ఉన్న బిల్వవృక్షాన్ని చుట్టుముట్టి, మాడ్చి మసి చేసివేసింది.

నల్లగా కమిలి పోయినయ్ మాండలీకుణ్ణి బంధించిన కొమ్మలు. జీవం నశించిపోయినట్లు క్రిందికి వ్రేలాడబడ్డాయి.

గింగిరాలు తిరుగుతూ వచ్చి నేలను తాకాడు మాండలీకుడు. ఆఖరి క్షణంలో నేర్పుగా తన దండాన్ని అడ్డుపెట్టుకుని, దెబ్బ తగలకుండా రక్షించుకున్నాడు.

చెట్టుక్రింద నిలబడి చేతుల్ని గాలిలోకి ఎత్తుతున్న దుహితుడు, తన అవయవాలు కూడా మంటల బారిన పడినట్టు గిలగిలలాడుతూ నేలకూలి పోయాడు.

ఆకాశాన్ని అంటుకునేటంత ఎత్తుగా ఉన్న బిల్వవృక్షం, చూస్తూ చూస్తూ ఉండగానే మాడి మసి అయిపోయింది. కుచించుకుపోయి కనిపించకుండా మాయం అయిపోయింది.

"సరైన సమయానికి వచ్చి నా ప్రాణాలను కాపాడావు. నువ్వే నిజమైన శిష్యుడివి. శంబరదేవి నాకు ప్రసన్నం కాగానే, నా శక్తుల్లో సగభాగం నీకు ప్రసాదిస్తాను. నా అంతటివాడివి కావాలి నువ్వు" క్రింది నించి లేచి తన శిష్యుడితో అన్నాడు మాండలీకుడు.

అయితే ఆ మాటల్ని ఆలకించటానికి సంతోషించటానికి అతని శిష్యుడు నిలబడి లేడు. తాళ పత్రాన్ని నేలకేసి కొట్టిన సమయంలో వెలువడిన శబ్దం అతని శిరస్సును వ్రయ్యలు చేసేసింది. నిలుచున్న ప్రదేశంలోనే నేల కూలి పోయాడు.

"మాండలీకుడు బాధతో విలవిలలాడి పోతాడంటావా మిత్రమా?" చిన్నకంఠంతో శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

"వాడు కర్కశ హృదయుడు. వాడికి వాడి ఆశయం సఫలం కావటమే ముఖ్యంలా కనిపిస్తోంది. పట్టించుకోడు" అన్నాడు శ్యామలుడు.

అతని మాటలే యధార్థం అయ్యాయి. ప్రాణాలు కోల్పోయిన తన శిష్యుడి శరీరం వంక చూసి, కొంచెంగా కూడా చలించలేదు మాండలీకుడు.

"నీ గురుదేవుడి ఋణం తీర్చుకున్నావు. ధన్యుడివి" అని మాత్రం ఆ ప్రాణం లేని శరీరానికి చెప్పి, వడివడిగా అడుగులు వేస్తూ ఆ వీధి చివరికి బయలుదేరాడు.

"ఏం చేద్దాం మిత్రమా... ఈ దుహితుడిని చూసి, ఇతను ఎటువంటి వాడో అర్థం చేసుకుని, శంబరదేవత ఆలయాన్ని వెతకటంలో మనకి సహాయం చేస్తాడేమో తెలుసుకోవటం కోసం మనం ఈ నగరంలోకి వచ్చాము. వాడు మాండలీకుడి కంటే మూర్ఖుడు అనిపించింది. ఇతన్ని కలుసుకోలేకపోవటం మన అదృష్టం అని కూడా నాకు తోచింది" అంటూ పెంకుటింటి చాటునించి ఇవతలికి వచ్చాడు గదాధరుడు.

అతని మాటల్ని వినిపించుకోలేదు శ్యామలుడు. వేగంగా అడుగులు వేస్తూ పోతున్న మాండలీకుడి వైపే చూస్తూ నిలబడ్డాడు.

"నువ్వు మళ్ళీ ఏదో కొత్త ఆలోచన చేస్తున్నట్లు నాకు అనిపిస్తోంది" ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు గదాధరుడు.

"ఆలోచన కొత్తది కాదు. పాతదే. వాడి వేగాన్ని చూస్తుంటే మనం వృద్ధురాలి ఇంటి దగ్గర వదిలిపెట్టి వచ్చిన ముదిత కోసం పోతున్నాడని అనిపిస్తోంది" అన్నాడు శ్యామలుడు.

"అయ్య బాబోయ్... ఒకసారి ఆ పిల్లని కాపాడాం మనం. మరోసారి రక్షించటం సాధ్యపడకపోవచ్చు...." అన్నాడు గదాధరుడు.

"పట్టుబడిన తర్వాత కాపాడటానికి అష్టకష్టాలు పడటం కంటే, అసలు ఆమె వాడి చేతికి చిక్కకుండా చూడటమే మంచిదని నాకు అనిపిస్తోంది. నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు శ్యామలుడు.

మాటవరసకు అలా అభిప్రాయం అడిగాడే గాని, ఆ పని చేయటానికి అతను పూర్తిగా సిద్ధమైపోయాడని తెలిసి పోయింది గదాధరుడికి.

"ఒకదాని తర్వాత ఒకటిగా మనకు సంబంధం లేని పనులన్నీ చేస్తూ వస్తున్నాము... గజదొంగలమని పెద్దపేరు సంపాదించుకున్నామే గాని, ఇంతవరకూ చిన్నపాటి కన్నపు దొంగ సంపాదించిన సొత్తును కూడా మనం సంపాదించలేదు... ఇలా అయితే ఎలా మిత్రమా?" చురుకుగా చూస్తూ అడిగాడు.

"ముందు ఆ యువతిని రక్షించాలి... అంతే" అంటూ మాండలీకుడు వెళ్ళిన మార్గంలో అడుగులు వేశాడు శ్యామలుడు.

*　　*　　*　　*　　*

సూటిగా నడిచాడు మాండలీకుడు. ఒక్కసారి కూడా పక్కచూపు చూడలేదు. నడిచి నడిచి తిన్నగా యువరాణికి ఆశ్రయం ఇచ్చిన ఇంటి ముందుకు పోయాడు.

సాధారణమైన పూరిపాక మాదిరిగా ఉన్న ఆ ఇంటిని చూడగానే, తాను పొరబడినట్లు అనిపించింది కాబోలు – నుదురు రుద్దుకుంటూ చుట్టూ చూశాడు. పది క్షణికాలపాటు తీవ్రంగా ఆలోచించి, తన దండంతో నేలను బలంగా అదిమాడు.

బరువైన శకటం ఏదో ఆ వీధిలోకి వచ్చినట్లు, దడదడమని కంపించింది భూమి. మాండలీకుడి కనుల ముందు తళుక్కున మెరిసి, అంతలోనే మాయమై పోయింది సుందరమైన భవంతి ఒకటి.

"ఆహా నీలమణీ... ఇంతకాలం నా కనులముందే ఉంటూ, నా శక్తులనే అపహాస్యం చేసిన నీ తెలివికి మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నాను... శక్తిమంతురాలివే నువ్వు. ఒప్పుకుంటున్నాను...." అంటూ గబగబా ఆ కట్టడంలోకి అడుగు పెట్టబోయాడు.

దడదడమని శబ్దం చేసింది ద్వారబంధం... అదిరిపడి వెనక్కి దూకాడు అతను. అలాచేసి ఉండకపోతే, అక్కడికక్కడ రెండుగా విచ్చిపోయి ఉండేది అతని శిరస్సు.

ఎందుకంటే – దడదడమని శబ్దం వినవచ్చిన రెండో క్షణికంలో, దభేలున విరిగి నేలమీద పడిందా ద్వారం.

"భళీ... నీలమణీ... భళాభళీ... మరింత ఆనందం అయిపోతున్నదే" అంటూ నిలబడిన ప్రదేశంలోనే చతికిలపడి, దండాన్ని తన చేతికి అందుబాటులో ఉంచుకుంటూ కనులు మూసుకున్నాడు అతను.

రంగురంగుల వలయం ఒకటి ప్రత్యక్షం అయింది అతని కనులముందు. ఆ వలయం మధ్యలో స్పష్టంగా కనిపించింది ఆ కట్టడంలోని పూజా మందిరం. ఆ మందిరం ఎదుట అస్పష్టంగా అగుపించింది నేలలో ఇమిడి ఉన్న సొరంగ మార్గం.

"శిష్యా... ఒరేయ్ శిష్యా...." బిగ్గరగా అరుస్తూ లేచి నిలుచున్నాడు అతను. అంతకు ముందు అలా పిలిచిన వెంటనే చేతులు కట్టుకుని ఎదుటికి వచ్చే శిష్యుడు ఇప్పుడు రాలేదు. బిల్వవృక్షం దగ్గర జరిగిన సంఘటన మాత్రం గుర్తుకు వచ్చింది.

"అయ్యో... శిష్యుడా.. అవసర సమయంలో లేకుండా దూరంగా వెళ్ళి పోయావు కదరా... ఈ నీలమణి మనదెబ్బను తట్టుకోలేక సొరంగమార్గం గుండా నగరం వెలుపలికి పారిపోయింది. వదిలిపెట్టేస్తానని కాబోలు దీని ఆలోచన...." అంటూ బయలుదేరాడు.

"వాడు మళ్ళీ ఎక్కడికో బయలుదేరాడు. ఏం చేయటానికో ఎలా తెలుసుకోగలం?" ఆ వీధి చివర ఒక గోడ చాటున నిలబడి శ్యామలుడిని అడిగాడు గదాధరుడు.

"ఏం చేస్తాడో సరిగ్గా చెప్పటం కష్టం. బహుశా తను కూడా నగరం వదిలి ప్రయాణం మొదలు పెట్టవచ్చు" అన్నాడు శ్యామలుడు.

అతని మాటలే యదార్ధం అయ్యాయి. నీలమణి నివసించే వీధిలో నుంచి సూటిగా నగర ద్వారాల దగ్గరికి పోయాడు మాండలీకుడు. అక్కడ ఉన్న భటులను హెచ్చరించి, ఒక అశ్వాన్ని తెప్పించుకున్నాడు.

"నగరపాలకుల వారు నాకోసం వెతికించటం మొదలుపెడితే చెప్పండి. శ్యాలక భూపతుల వారి జాడ తెలుసుకునేందుకు నేను నీలికొండల దగ్గరికి పోయి వస్తాను" అటూ అశ్వాన్ని అధిరోహించి వేగంగా ప్రయాణం మొదలు పెట్టాడు.

"ఎవరు? ఈ సమయంలో నగరం వదిలి వెళ్ళదలచుకున్నది ఎవరు? ఆగండి" క్రూరంగా హెచ్చరిస్తూ, స్నేహితుల దారికి అడ్డు వచ్చారు మాండలీకుడిని సగౌరవంగా వెలుపలికి పంపించిన ఆ భటులు.

"వాడు దూరంగా వెళ్ళిపోకముందే మనం ఇక్కడి నుంచి బయట పడాలి...." గదాధరుడిని హెచ్చరించాడు శ్యామలుడు.

"ఆ పని చేయటానికి ఏమంత కష్టపడాల్సిన పని లేదు" అంటూ తమను నిరోధించటానికి వచ్చిన భటుల మీద రాక్షసుడి మాదిరి తిరిగబడ్డాడు గదాధరుడు.

పదేపది క్షణికాల్లో తీవ్రంగా గాయపడి నేల కూలిపోయారు అందరూ.

"ఓపిక రాగానే నగరంలోని సైనికులందరినీ హెచ్చరిస్తారు. మనకోసం వలలు పట్టుకుని మరీ వెతుకులాట మొదలు పెడతారు" నగర ద్వారాల్లో నుంచి వెలుపలికి నడుస్తూ మందలించాడు శ్యామలుడు.

"మనం నగరంలోనే ఉండిపోతే నువ్వు చెప్పినట్లు జరుగుతుంది. నగరం విడిచిపెట్టిన తర్వాత వాళ్ళు ఎలా వెతుక్కుంటే ఎవడికి కావాలి?" అంటూ పరుగు మొదలు పెట్టబోయాడు గదాధరుడు.

"ఆయాసపడటం అనవసరం. తీరికగా నడిస్తే చాలు" అన్నాడు శ్యామలుడు.

ఆశ్చర్యంగా అతని వంక చూశాడు గదాధరుడు. "అవతల ఆ మాండలీకుడు అతివేగంగా పోతున్నాడు. వాడు దూరంగా వెళ్ళిపోకూడదని నువ్వు అన్నావు. మర్చిపోయావా?" అడిగాడు.

"మర్చిపోలేదు. మాట వరసకి చెప్పాను. వాడు వెళ్ళేది నీలికొండల దగ్గరికి మనం ఆ కొండల దగ్గరికిపోతే చాలు" అన్నాడు శ్యామలుడు స్థిమితంగా.

నగర ద్వారాల దగ్గరి భటుల్ని తాను ఎంత వేగంగా పడగొట్టాడో, ఆ పని చేయటానికి ఎంతగా ఆతృత చెందాడో గుర్తు చేసుకుంటూ గాఢంగా నిట్టూర్చాడు గదాధరుడు.

"నీతో వచ్చిన తంటా ఇదే మిత్రమా... ఏ పని ఎప్పుడు ఎలాచేయాలో నీకు తెలియదు. తెలిసినా బయటికి చెప్పవు. కాళ్ళక్రింద నిప్పులు పోసి మరీ కంగారు పెడతావు" కోపంగా అంటూ, తాపీగా నడవటం మొదలు పెట్టాడు.

* * * * *

ఒక పగలు మరొక రాత్రి అలుపు ఆయాసం అనే మాటలకు అర్థం తెలియనట్లు ప్రయాణం చేశాడు మాండలీకుడు.

నీలికొండల సమీపంలోకి పోయిన తర్వాత, కాళ్ళు మడతపడి ముందుకు తూలింది అతను తీసుకువచ్చిన అశ్వం.

"నీ పని అయిపోయింది. నీతో నాకు ఇక అవసరంలేదు" అంటూ దాన్ని వదిలి, కాలినడకన ప్రయాణం కొనసాగించాడు అతను.

కనిపించీ కనిపించనట్లుగా అగుపిస్తోంది అతనికి నేలలో ఉన్న సొరంగం... అతని మంత్ర దృష్టినించి తప్పించుకోలేకపోతున్నది.

"భూమి చివరి భాగం వరకూ వెళ్ళినా సరే... నిన్ను వదిలి పెట్టేది లేదు నీలమణీ... నిన్ను వధించి, యువరాణిని నేను స్వాధీనం చేసుకుని తీరతాను" తనలో తాను అనుకుంటూ అడుగులు వేయసాగాడు మాండలీకుడు

* * * * *

"అయ్యలూ... ఏ తల్లి కన్నబిడ్డలోగాని, చూడముచ్చటగా ఉన్నారు. పది కాలాల పాటు చల్లగా ఉండాలనే కోరిక వుంటే ఆ కొండల దగ్గరికి పోకండి" సూర్యుడు పడమటి దిశలో పడుతూ ఉన్న సమయంలో స్నేహితులిద్దరినీ హెచ్చరించారు కొందరు గ్రామీణులు.

నీలికొండల సమీపంలో ఉన్న అడవిలో కట్టెలు కొట్టుకోవడానికి వెళ్ళి వస్తున్నారు వాళ్ళు.

"ఎందుకని పోకూడదు?" చిరునవ్వుతో అడిగాడు గదాధరుడు.

"భయంకరమైన చారల మెకం తిరుగుతూ ఉంటుంది. కంటపడితే నమిలి మింగేస్తుంది" అన్నాడు ఒక గ్రామీణుడు.

తల ఊపాడు గదాధరుడు. ఆ గ్రామీణులు తమకు దూరంగా పోయిన వెంటనే తిరిగి నడక మొదలుపెట్టారు.

"వాళ్ళు చెప్పింది నిజమేనంటావా?" నెమ్మదిగా అడిగాడు శ్యామలుడు.

"పెద్దపులి అనేది చిన్నది అయినా పెద్దది అయినా మనం దాని కంటపడితే మనమీదికి దూకటం దూకటమే... నమిలి మింగేయటానికి తప్ప కుండా ప్రయత్నం చేస్తుంది. అడవుల్లో పులులు ఉండటం అతి సహజం. అనవసరంగా భయపడడం మాత్రం అసహజం" అన్నాడు గదాధరుడు.

"మనం సరైన దారిలోనే ప్రయాణం చేస్తున్నామా?" మరో ప్రశ్న వేశాడు శ్యామలుడు.

"ఇప్పటివరకూ సరియైన దారిలోనే ఉన్నాము... ఇక మీదట–" అంటూ చటుక్కున మాటల్ని ఆపాడు గదాధరుడు.

చెవులు చిల్లులు పడేటట్లు ఒక సకిలింపు వినబడటమే అందుకు కారణం. "మిత్రమా... అశ్వం... ఏదో అశ్వం భయంతో వణికిపోతూ శబ్దం చేస్తోంది" అంటూ ఆ చప్పుడు వినవచ్చిన వైపు పరుగు మొదలు పెట్టాడు అతను.

తన వరలో నుంచి కత్తిని బయటికి తీస్తూ వేగంగా అనుసరించాడు శ్యామలుడు.

ఎత్తయిన ఒక మట్టి గుట్టమీద నిలబడి చిందులు తొక్కుతోంది ఒక అశ్వం. ఆ గుట్టక్రింద నిలబడి దాని మీదికి దూకేందుకు సిద్ధం అవుతోంది ఒక చారల మెకం.

"మిత్రమా... అది మన మాండలీకుల వారు ఎక్కివచ్చిన అశ్వం... గుర్తుపట్టావా?" పరుగు ఆపకుండా అడిగాడు గదాధరుడు.

"ఇటుగా పోవటం మంచిది కాదని గ్రామస్థులు హెచ్చరించిన పెద్దపులి కూడా అదే అయిఉంటుంది" గుట్ట క్రింద వున్న క్రూరమృగాన్ని చూస్తూ అన్నాడు శ్యామలుడు.

"ఒకేసారి రెండు పనులు పూర్తి అయిపోతాయి. శ్రమ పడవలసిన అవసరం లేదు...." అంటూ మరింత వేగంగా పోయి ఆ పెద్దపులికి పది అడుగుల దూరంలో ఆగాడు గదాధరుడు.

గుట్టమీద చిందులు తొక్కుతున్న అశ్వం మీది నించి చూపుల్ని మరల్చింది ఆ దుష్ట మృగం. తోకను నేలకేసి కొడుతూ అతనివైపు తిరిగింది.

తన ఆయుధాన్ని తీసి సిద్ధంగా నిలుచున్నాడు గదాధరుడు. “వెనుకనుంచి మెడ తెగిపోయేటట్లు కొట్టు మిత్రమా. నేను గుండెల్ని గాయపరుస్తాను” అంటూ శ్యామలుడిని హెచ్చరించాడు.

వింటి నుంచి వెలువడిన బాణంలా పోయిన శ్యామలుడు – తన ఆయుధంతో ఆ మృగాన్ని ఎదిరించలేదు. తాచుపాము మాదిరి అటూ ఇటూ ఊగుతున్న దాని తోకను పట్టుకుని బలంగా వెనక్కి లాగాడు.

ముందు కాళ్ళను నేలకు తాటించి ఒక్క గంతులో గదాధరుడి మీదికి పోబోతున్న ఆ పెద్దపులి గావురుమని అరిచింది.

“వేసేయ్ మిత్రమా... దెబ్బవేసేయ్....” అని అరుస్తూ, ముందుకు దూకాడు గదాధరుడు.

గావురు గావురున అరుస్తున్న ఆ మృగం, అరవటమే తప్ప, పంజాలతో శ్యామలుడిని పడగొట్టడానికి మాత్రం ప్రయత్నించలేదు.

కత్తిని ముందుకు విసరబోతూ... ఆఖరి క్షణంలో ఆ విషయాన్ని గమనించి చటుక్కున ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు గదాధరుడు.

పట్టినపట్టు వదలకుండా పది అడుగుల దూరం బరబరా ఈడ్చి ఆ పులిని బలంగా ఒక చెట్టుకేసి నెట్టాడు శ్యామలుడు.

తొమ్మిది మూరల పొడవున్న ఆ మహామృగం మట్టి బొమ్మ మాదిరి పోయి ఆ చెట్టును కొట్టుకొని వెల్లకిలా పడిపోయింది.

వెంటనే పైకి లేచింది. పిల్లిపిల్ల మాదిరి చిన్న చిన్న శబ్దాలు చేస్తూ ముడుచుకు కూర్చున్నది.

“మిత్రమా... చూడటానికి మాత్రమే ఇది పులి. లక్షణాలు మాత్రం పిల్లివే....” కనులు చిట్లిస్తూ అన్నాడు గదాధరుడు.

“ఇది ఎవరో పెంచి పెద్దచేసిన మృగం....” అన్నాడు శ్యామలుడు.

గుట్టమీదికి పోయి, భయంతో వణికిపోతున్న అశ్వాన్ని గట్టిగా పట్టుకున్నాడు గదాధరుడు.

“మాండలీకుల వారు ఏమైపోయారు? ఎక్కడ నిన్ను వదిలేశారు?” అంటూ చుట్టూ చూశాడు.

నీలికొండల వైపు దృష్టిని మరలించిన వెంటనే కనిపించాడు అతనికి పెద్దపెద్ద అడుగులు వేస్తూ వస్తున్న ఒక సన్నపాటి మనిషి.

గుట్టక్రింద ఉన్న శ్యామలుడిని హెచ్చరించవలసిన అవసరం లేక పోయింది. పిల్లిపిల్ల మాదిరి ముడుచుకు కూర్చున్న పెద్దపులి ఒక్కసారిగా లేచి నిలబడింది. వేగంగా పరుగుతీస్తూ... ఆ మనిషికి ఎదురు వెళ్ళింది.

"ఇంతకాలం తర్వాత... ఇద్దరు సాహసవంతుల్ని చూడగలిగాను. నా జన్మ ధన్యమై పోయింది. ఎవరు మీరు?" గుట్ట దగ్గరికి వస్తూ సాదరంగా స్నేహితుల్ని అడిగాడు ఆ మనిషి.

సన్నగా పొడుగ్గా ఉన్నాడు అతను. పొడవాటి జుట్టు... నిగనిగలాడుతున్న పొడవాటి అంగీని ధరించి ఉన్నాడు. సన్నగా పొడవుగా ఉన్న వెదురు కర్ర ఉన్నది అతని చేతుల్లో.

పెంపుడు జంతువు మాదిరి అతని వెనుక నిలబడింది పెద్దపులి... ప్రేమగా అతని పాదాలను తన తలతో తడుముతున్నది.

"మేము బాటసారులం... ప్రమధ నగరానికి పోవాల్సి ఉంది...." ముక్తసరిగా అన్నాడు గదాధరుడు.

"అబ్బో చాలాదూరం... చీకటిలో ప్రయాణం చాలా కష్టం, నా ఆశ్రమానికి రండి... విశ్రాంతి తీసుకుని, తెల్లవారగానే వెళ్దురుగాని" అన్నాడు ఆ మనిషి.

"అయ్యా... మీరు ఎవరు?" నిర్మొహమాటంగా అడిగాడు గదాధరుడు.

"సందీపుడు నా పేరు... నా జనని నీలమణి... మేము కూడా ప్రమధరాజ్య పౌరులమే... రండి రండి" అంటూ వెనక్కి బయలుదేరాడు అతను.

ఉలిక్కిపడినట్లు శ్యామలుడి వైపు చూశాడు గదాధరుడు.

"పేరు ఒకటి అయినంత మాత్రాన – మనుష్యులు ఒకరే అయి ఉండవలసిన అవసరం లేదు... నోరు మూసుకుని నడవటం చాలా మంచిది" చిన్న కంఠంతో అతన్ని హెచ్చరించాడు శ్యామలుడు.

కొండల సమీపంలోకి తీసుకుపోయాడు సందీపుడు వారిద్దరినీ. చీకటిపడిన ఒక ఘడియ తరువాత చిన్న చెట్లతోపు మధ్యభాగంలో ఉన్న ఒక పర్ణశాల ముందు ఆగాడు.

"పరిస్థితి బాగోలేదు. ఆ మాండలీకుడు పసిగడితే ఎదిరించడం నీకు నాకు చాలా కష్టమైపోతుంది. ఎందుకు కొండల చుట్టూ తిరగటం?" సందీపుణ్ణి హెచ్చరిస్తూ పర్ణశాలలో నుంచి బయటికి వచ్చింది నీలమణి.

తెరిచిన నోరు తెరిచినట్లే ఉండిపోయింది గదాధరుడికి – నీలమణి వెనుకే బయటికి వచ్చిన యువతిని చూసేసరికి.

"అవ్వా... చూడు... ఎవరు వచ్చారో చూడు" తను కూడా అదిరిపడి, నీలమణితో చెప్పింది యువరాణి.

* * * * *

నీలికొండల పైభాగం వరకూ వెళ్ళాడు మాండలీకుడు. తన మంత్ర దండాన్ని గాలిలో ఊపుతూ నేల వంక తదేక దీక్షగా చూశాడు.

ఎంతగా చూసినా అతనికి కనిపించలేదు ఆ సొరంగ మార్గం. అతని అశ్వం క్రిందపడిపోయిన తర్వాత వంద అడుగుల దూరం వరకూ స్పష్టంగానే కనిపించింది అది. ఆ తరువాత మటుమాయం అయిపోయింది.

"నీలమణికి ఈ పర్వతాల్లోనే ఎక్కడో ఏదో బలమైన స్థావరం ఉండి ఉంటుంది. అందుకే నా మంత్ర దృష్టి పని చేయడం లేదు" తనలో తను అనుకుంటూ, ఒక బండరాయి మీద కూర్చున్నాడు అతను. మంత్ర దండాన్ని ఒడిలో పెట్టుకుని, కనులు మూసుకుని, మంత్ర జపం మొదలు పెట్టాడు.

* * * * *

మర్రి ఆకుల విస్తళ్ళల్లో వేడివేడి పదార్థాలను వడ్డించి, స్నేహితులిద్దరినీ సాదరంగా పిలిచింది నీలమణి.

"ముందు భోజనం చేయండి నాయనలారా..." అంటూ దగ్గిర కూర్చున్నది.

దూరంగా ఒక ద్వారం దగ్గిర ఆసీనురాలై తమ వైపే చూస్తున్న రాకుమారిని ఓరకంట గమనించి చిరునవ్వు నవ్వాడు శ్యామలుడు.

"మేము ఎవరిమో నీకు తెలిసిపోయింది కదూ?" అని నీలమణిని అడిగాడు.

ముడుతలు పడిన ముఖం నేతి దీపం మాదిరి ప్రకాశవంతం అవుతుండగా నవ్వింది ఆమె.

"తెలిసిపోయింది కొంతవరకే. మాకు సంబంధించిన ఈ గొడవలో మీరు ప్రవేశించడంలో దేనికో అర్థం కాలేదు" చిన్నగా అన్నది.

"మాకు సంబంధం లేని పనుల్లో వేళ్ళు పెట్టి లేనిపోని బాధలు పడటం మాకు బాగా అలవాటు అయిపోయింది అవ్వా... మా సంగతి వదిలేయ్... మీ గురించి చెప్పు..." అన్నాడు గదాధరుడు.

స్నేహితులతో పాటుగా భోజనం చేస్తున్న సందీపుడి వైపు చేతులు జాచింది నీలమణి.

"నా బిడ్డడు... నాతో పాటు ఈ ప్రమథ రాజ్యాన్ని కాపాడటం కోసం ఈ కొండల్లో కాపురం చేస్తున్నాడు" అన్నది.

"కొండల్లో కాపురం చేస్తే రాజ్యాన్ని కాపాడటం ఎలా సాధ్యం?" అడిగాడు గదాధరుడు.

"ప్రమథ రాజ్యాన్ని కాపాడాలంటే ముందు మాండలీకుడిని మట్టుబెట్టాలి. అతన్ని మట్టుబెట్టాలంటే శంబరదేవి అనుగ్రహం కావాలి. వట్టొట్టి మాటలతో అతన్ని జయించటం అసాధ్యం" అన్నది వృద్ధురాలు.

అర్థం కానట్టు మొఖం పెట్టాడు గదాధరుడు.

"నగరంలో ఉండి నేను యువరాణిని కాపాడటం కోసం ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. నాకు చేతకాలేదు. దేవుడి దయవల్ల మీరు మాకు సాయం చేశారు" చెప్పటం మొదలు పెట్టింది నీలమణి.

"మాండలీకుడికి తెలియకుండా ఈ కొండల్లో నివశిస్తూ, తనంట తానుగా ఆ ఆలయం ఎక్కడ ఉన్నదో తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు నా బిడ్డడు సందీపుడు."

వెంటనే తల ఎత్తి స్నేహితుల వైపు చూశాడు సందీపుడు. "ప్రాణాలను లక్ష్యపెట్టకుండా సాహసించగలిగిన వాళ్ళకే ఆ ఆలయాన్ని కనిపెట్టగలిగిన శక్తి ఉంటుందని నేను నా సాధన ద్వారా తెలుసుకున్నాను. అటువంటి వారి కోసమే గాలిస్తున్నాను. మొట్టమొదటిసారిగా మీ ఇద్దరినీ చూశాను" అన్నాడు.

"అంటే మీ ఉద్దేశం ఏమిటి అవ్వా?" ఆశ్చర్యంగా అడిగాడు గదాధరుడు.

"అంతగా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఇప్పటివరకూ మీకు తప్ప మరెవ్వరికీ ఆ ఆలయం గురించి, ఆ దేవిని చేరుకోవటానికి చేయవలసిన సాహసాలను గురించి తెలియలేదు" అన్నది నీలమణి.

అయోమయం అయిపోయింది గదాధరుడికి. తాము అంతవరకూ చేసిన పనులన్నీ ఆమెకు తెలిసిపోయాయని అర్థం అయిన వెంటనే, అతన్ని ఆవరించుకున్నది విపరీతమైన సిగ్గు.

"మీరు అతిగా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. మీ కదలికలన్నిటినీ మా అవ్వ తన మంత్రశక్తితో నాకు చూపించింది" ద్వారం అవతల కూర్చుని ఉన్న యువరాణి చెప్పేసరికి మరింత అధికం అయిపోయింది అతని సిగ్గు.

"అనవసరమైన మాటలతో సమయాన్ని వృథా చేయలసిన పనిలేదు. ఇంక ముందు ఏం జరగాలో ఆలోచన చేయటం మంచిది. ఆ మాండలీకుడు ఈ చుట్టుపట్లే సంచరిస్తున్న సంగతిని మర్చిపోవద్దు" ఉన్నట్లుండి అన్నాడు శ్యామలుడు.

"అవ్వా... మాండలీకుడు సరే క్షుద్రుడు. వాడు ఎటువంటి వాడో నీకు తెలుసు. మరి ఆ దుహితుడు కూడా మీ నగరంలోనే ఉన్నాడు కదా... అతన్ని గురించి ఎప్పుడయినా ఆలోచించావా?" నీలమణిని అడిగాడు గదాధరుడు.

"దుహితుడు కూడా శంబరదేవిని ప్రసన్నం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్న వాడే. అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే అతగాడు క్షుద్రుడు కాదు. చీకటి శక్తుల్ని ఆరాధించేవాడు కాదు. అతని ద్వారా రాజవంశానికి ఎటువంటి ప్రమాదం లేదు. అందుకనే అతన్ని గురించి మేము ఎన్నడూ భయపడలేదు" అంటూ తన కుమారుడి వైపు చూసింది నీలమణి.

"ఇంతకాలం మాండలీకుడు రాకుమారిని బలి ఇవ్వటం ద్వారానే ఆ దైవశక్తిని చేసుకోవాలని ఆశపడ్డాడు. ఆ శక్తిని చేరుకోవాలంలే ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. వాటిని అధిగమించి తాను ఆ దేవిని దర్శించుకోవటానికి దుహితుడు ప్రయత్నించాడు. కాని ఇద్దరూ ఇంతవరకూ తమ తమ ప్రయత్నాల్లో సఫలీకృతులు కాలేకపోయారు..." అన్నాడు అతను.

"దుహితుడిని గురించి మీరు మర్చిపోవచ్చు" అన్నాడు గదాధరుడు.

ఆశ్చర్యంగా చూసింది నీలమణి. "కుమారా అతన్ని తక్కువగా అంచనా వేయకు... అమితమైన శక్తి కలవాడు" అన్నది.

"అతని శక్తి మాండలీకుడి ముందు ఓడిపోయింది. దుహితుడిని మాండలీకుడు సంహరించాడు. మేము చూస్తూ ఉండగానే జరిగింది అది" అన్నాడు గదాధరుడు.

"మీరు దుహితుడి దగ్గరికి పోవాలని అనుకోవటానికి కారణం ఏమిటి?" సూటిగా అడిగింది నీలమణి.

నిమ్మతోటను గురించి చెప్పాడు గదాధరుడు. ఆ తోటలో తమకు దొరికిన తాళం చెవిని గురించి, దాని ద్వారా తాము తెరువ గలిగిన పేటిక గురించి, అందులో లభించిన కంకణాల గురించి, వాటిని ధరించగానే మాయం అయిన దేవతా విగ్రహాన్ని గురించి సవివరంగా చెప్పాడు.

"దారితప్పి ఎటెటో పోవాల్సిన మేము సూటిగా ఈ రాజ్యం వైపు రావటానికి కారణం ఆ కరకంకణాలే" అన్నాడు.

విచిత్రంగా చూస్తున్న సందీపుడికి గాని, ఆశ్చర్యంగా తల ఊపుతున్న నీలమణికి గాని, ఎటువంటి సందేహాలు రాలేదుగాని, ద్వారం ఆవలవున్న రాకుమారికి మాత్రం వెంటనే వచ్చేసింది అనుమానం.

"మీకు తెలియకుండానే శంబరదేవి ఆలయాన్ని చేరుకునే రహస్యాలను అనుసరించి రావటం బాగానే ఉన్నది. కాని, కంకణాలను ధరించిన దేవర మటుమాయం అయిన తర్వాత..." అని అంటూ ఉండగా.

"ఈ రాజ్యాన్ని గురించి, ఆ ఆలయం ఈ రాజ్యంలోనే ఉండటం గురించి మాకు తెలిసింది" అన్నాడు గదాధరుడు.

"మా రాజ్యం గురించి తెలియటం సహజమే కాని, అత్యంత శక్తి మంతుడైన మాండలీకుడి గురించిగాని, మా అవ్వ గురించి గాని మీకు ఎందుకు తెలియలేదు?" పట్టుదలగా అడిగింది ఆమె.

"మీ అవ్వ సహాయంతో మా కదలికలన్నిటినీ కనిపెట్టుకుంటూ ఉన్నట్లు చెప్పావు. మా గురించిన వివరాలన్నీ తెలిసినట్టు మాట్లాడావు. మరి ఈ సంగతి ఎందుకు తెలియలేదు?" ఎదురు ప్రశ్న వేశాడు గదాధరుడు.

తలవంచుకున్నది యువరాణి. ఆమెకు బదులుగా నీలమణి మాట్లాడింది. "అదేపనిగా మీ సాహసాలను చూస్తూ కూర్చున్నది మా యువరాణి. మధ్యలో కునికిపాట్లు పడి ఉంటుంది. ఆ సమయంలో దుహితుడి ప్రస్తావన వచ్చి ఉంటుంది" అన్నది.

"జరిగిపోయిన దానికి బాధపడటమో, అతిగా ఆలోచించటమో అనవసరం. ఇప్పుడు జరగవలసింది ఏమిటో చూడండి" ముక్తసరిగా అన్నాడు శ్యామలుడు.

"నువ్వే చెప్పు నాయనా. ఏం చేస్తే బాగుంటుంది?" ఎదురు ప్రశ్న వేసింది నీలమణి.

"మాండలీకుడు ఇప్పుడు మీ సమీపంలోనే ఎక్కడో తచ్చట్లాడుతూ ఉండి ఉంటాడు. వాడు చేతులు ముడుచుకుని కూర్చోడు. యువరాణిని తిరిగి తాను తీసుకుపోవటానికే చూస్తాడు" అన్నాడు శ్యామలుడు.

"ఇది వరకు ఒకసారి తీసుకుపోయి ఎవరికీ కనిపించకుండా దాచిపెట్టాడు. అప్పుడు ఏమీ చేయలేక పోయాడు, ఇప్పుడు మాత్రం ఏం చేయగలడు?" ఉన్నట్లుండి అడిగాడు సందీపుడు.

ఆశ్చర్యంగా చూశాడు గదాధరుడు అతని వంక.

"అవును వీరుడా... నా మాటలు నిజం. యువరాణిని తీసుకుపోయి – వాడు శంబరశక్తిని ఉద్దేశించి పూజలు చేయాలి... ఆ తరువాత ఈమెను బలియివ్వాలి. మాటలు చెప్పినంత త్వరగా జరిగే పని కాదు అది. సరయిన సమయం, సరియైన ముహూర్తం అన్నీ కలసి రావాలి. గతంలో అటువంటి సందర్భం లభించకపోవటం వల్లనే వాడు ఆమెను బంధించి ఉంచాడు..." తన అభిప్రాయాన్ని చెప్పాడు సందీపుడు.

సాలోచనగా తల ఊపాడు శ్యామలుడు. గదాధరుడు మాత్రం అలా చేయలేకపోయాడు. "వాడిని మట్టుబెట్టే విధానం ఏమిటో తెలుకోగలిగితే అసలు ఈ బాధలు బరువులు ఏమీ ఉండవుకదా" అన్నాడు.

"మాండలీకుడిని మట్టుబెట్టే శక్తి మాకు లేదు" నిర్మొహమాటంగా చెప్పింది నీలమణి.

"వాడు సమయం సందర్భం చూసుకునే లోపల మనం శంబరదేవిని ప్రత్యక్షం చేసుకోవటం ఒక్కటే సరైన పద్ధతి" అన్నాడు సందీపుడు.

అటుతిరిగి ఇటు తిరిగి విషయం మళ్ళీ మొదటికే రావటం గదాధరుడికి నచ్చలేదు.

"శంబరదేవతను ప్రసన్నం చేసుకుని ఏదో సాధించాలన్న కోరిక మాకులేదు. మా దారిన మేము పోతున్న సమయంలో మా తెలివి తేటలకు ఒక పరీక్ష మాదిరి ప్రత్యక్షం అయింది ఈ సమస్య. దుహితుణ్ణి కలుసుకోవడం ద్వారా ఆ ఆలయానికి సంబంధించిన విషయాలన్నీ రాబట్టి... మా దారిన

మేము వెళ్ళి పోవచ్చుని భావించాము... అతను మరణించటం మాకు అడ్డంకి అయింది” అన్నాడు.

“అనవసరమైన మాటలు వద్దు. అసలు విషయం ఏమిటో చెప్పు” విసుగు నిండిన కంఠంతో అన్నాడు శ్యామలుడు.

“ఆ దేవత ఆలయాన్ని కనిపెట్టడంలో మాకు మీరు చేయగలిగిన సహాయం ఏదైనా ఉన్నదా?” సూటిగా సందీపుడిని అడిగాడు గదాధరుడు.

మిలమిల మెరిశాయి అతని కనులు.

“ఈ మాటలు వినటం కోసమే నేను ఎంతో కాలం నుంచి నా పెంపుడు పులిని వెంట బెట్టుకుని ఈ అడవుల్లో సంచారం  చేస్తున్నాను. నా పులిని ఎదిరించగలిగిన సాహసవంతులే ఆ అలయం ఎక్కడ ఉన్నదో తెసుకోగలరు...” అన్నాడు ఆనందంగా.

“అయితే ఆలస్యం దేనికి? మేము చేయవలసినది ఏమిటో చెపితే ఆ పని పూర్తి చేసి మా దారిన మేము వెళ్ళిపోతాము” అన్నాడు గదాధరుడు.

“చీకట్లు బాగా ముదిరిపోయాయి. ఇప్పుడు ఎవరూ చేయగలిగింది ఏమీలేదు. రేపు సూర్యోదయం అయిన వెంటనే మీకు అన్నీ వివరంగా చెపుతాను” అన్నాడు సందీపుడు.

“అంతవరకూ ఆ మాండలీకుడు ఊరికే కూర్చుంటాడా? వాడికి కావాల్సింది నిశీధీ సమయమే...” అన్నది నీలమణి.

“మనం చేయవలసింది ఏమీలేదు...” అన్నాడు సందీపుడు.

స్నేహితులు ఇద్దరు విస్తళ్ళముందు నుంచి లేచి కరచరణాలను శుభ్ర పరుచుకోవటానికి ఆ పర్ణవాల వెనుక భాగంలో ఉన్న చిన్న నీటి మడుగు దగ్గరికిపోయారు.

“ఏమంటావు మిత్రమా?” సందీపుడి మాటల మీద శ్యామలుడి అభిప్రాయాన్ని తెలుసుకోదలిచాడు గదాధరుడు.

“నేను అనేదిగాని, నువ్వు చెప్పేదిగాని ఏమీ లేదు. మనకు ఎదురుగా కనిపించిన మార్గాన్ని అనుసరించి నడుస్తూ పోవటమే...” అన్నాడు శ్యామలుడు.

* * * * *

“ఇద్దరు... ఇద్దరే అసాధారణమైన మానవులు. మంత్ర తంత్రాలు తెలియని వాళ్ళు... వారిద్దరి కారణంగానే యువరాణి నీ చేతుల్లో నుంచి జారిపోయింది...”

అర్ధరాత్రి సమయంలో మాండలీకుడి ముందు ప్రత్యక్షం అవుతూ చెప్పింది ఒక నీడ వంటి ఆకారం.

"నేను తెలుకోదలిచింది ఎవరో అపరిచిత వ్యక్తుల గురించి కాదు... ఆ దుర్మార్గురాలు నీలమణిని గురించి... ఆమె తీసుకువచ్చిన యువరాణిని గురించి... వారిద్దరూ ఇప్పుడు తల దాచుకున్న ప్రదేశాన్ని గురించి..." కోపంగా అన్నాడు మాండలీకుడు.

"పిచ్చి మాంత్రికుడా... అహంభావం అనర్ధదాయకం... నిన్ను మించిన వారు ఈ చుట్టుపట్ల ఎవరూ లేరనే గర్వం వల్లనే దుహితుడిని గమనించలేక పోయావు... కుడి చేయివంటి నీ శిష్యుడిని కోల్పోయావు... ఇప్పటికి కూడా నీ అహంకారం అణిగిపోలేదు" అన్నది ఆ ఆకారం.

"నవ్వు ఏం చెప్పదలుచుకున్నావు?" అసహనంగా అడిగాడు మాండలీకుడు.

"నువ్వు తొందరపడకపోతే ఆ శంబరశక్తి ఆలయ రహస్యం బట్టబయలు కాబోతున్నది. నేను చెపుతున్న యువకులు చాలా సాహసవంతులు!" అన్నది ఆ ఆకారం. కనులు చిట్లించి చూశాడు మాండలీకుడు.

"నీ కంటే సాహసవంతులు ఈ ప్రపంచంలో మరొకరు ఉండరని భ్రమపడకు. నిన్ను మించిన ప్రజ్ఞావంతులు ఆ యువకులు. శౌర్యసాహసాల్లో వారిని వెనక్కినెట్టగల మానవుడు ఎవడూ లేడు..." నిరసనగా చూస్తూ చెప్పింది ఆ ఆకారం.

మలినపడిపోయింది మాండలీకుడి వదనం. విపరీతమైన అసూయతో పరమ వికృతంగా తయారయింది.

"మంత్ర తంత్రాల్లో నేనే మేటి. నా ఎదుట నిలబడగలిగే శక్తి ఎవరికీ ఉండదు" దర్పంగా చెప్పాడు.

ఫక్కున నవ్వింది ఆ ఆకారం. "పిచ్చి మాండలీకుడా... ఎంతో కాలంగా శంబరదేవి ఆలయం ఎక్కడ ఉన్నదో తెలుసుకోవాలనే కోరికతో తపించి పోతున్నావు. ఆ దేవికి ద్వారపాలకురాలైన కర్తారీ దేవి ఎక్కడ తల దాచుకున్నదో తెలుసుకోలేకపోయావు. ఆ దేవి తన కరకంకణాలను తిరిగి పొందగలిగిందని నీకు తెలియదు. ఆ కంకణాలను స్వహస్తాలతో ఆ దేవికి అలంకరించింది ఈ వీర కుమారులేనని కూడా నీకు తెలియదు" సూటిగా చూస్తూ చెప్పింది.

తెరిచిన నోరు తెరిచినట్టు ఉండిపోయింది మాండలీకుడికి. కనులు మాత్రం ఎరుపు జీరలు పులుముకున్నాయి.

"నీకు నువ్వుగా ఆవేశపడుతూ కూర్చోవటం వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. నీలమణినీ ఆమె రక్షించి తీసుకువచ్చిన యువరాణినీ వెతికే ఆలోచన వదిలేసి నీ దృష్టిని ఆ వీరులమీద కేంద్రీకరించు. ఎందుకంటే ఏ క్షణంలోనైనా వారిద్దరూ శంబరదేవి ఆలయాన్ని వెతికి పట్టుకోగలరు" అన్నది ఆ ఆకారం.

విపరీతమైన ఆగ్రహం మాండలీకుడిని వివశుడిని చేసి వేసింది. "వీలుపడదు. ఎన్నటికీ అటువంటి పని జరగదు. ఇప్పుడే నా దృష్టిని ఆ దుష్టుల మీద కేంద్రీకరిస్తాను" అని అరిచాడు.

"నీ ఆశయం సిద్ధించాలంటే అలాగే చెయ్యాలి. అంతకుమించి వేరు దారి లేదు" అన్నది ఆ ఆకారం. అన్న వెంటనే అదృశ్యమైపోయింది.

మంత్ర దండాన్ని బలంగా నేలలో గుచ్చాడు మాండలీకుడు. "ఎక్కడ? నా దారికి అడ్డు తగులుతున్న ఆ నీచ మానవులిద్దరూ ఎక్కడ?" అంటూ నేల వంక చూశాడు.

క్రింద వున్న నేల పెద్ద అద్దం మాదిరిగా తయారై, తనకు కావాల్సిన మానవులిద్దరూ ఆ అద్దంలో కనిపిస్తారని అనుకున్నాడు.

అంతకుముందు ఆ ప్రయోగం ఎప్పుడు చేసినా వెంటనే ఫలితం కనిపించి ఉండేది. ఒక్క నీలమణి విషయంలోనే అలా జరుగలేదు. కానీ ఇప్పుడు సాధారణ మానవులని అతను అనుకుంటున్న ఆ వీరుల విషయంలో కూడా అతని శక్తి పనిచేయటం మానివేసింది.

వట్టి నేల మాత్రమే అగుపించింది మాండలీకుడికి.

ఆవరించుకుని ఉన్న ఆగ్రహం నీళ్ళు జల్లిన మంట మాదిరి ఒక్కసారిగా ఆరిపోతుండగా తాను ఆవాహన చేసిన ఆకారం వారి గురించి ఎందుకంత గట్టిగా హెచ్చరికలు చేసిందో గుర్తు చేసుకున్నాడు మాండలీకుడు.

"స్వశక్తితోనే సాధిస్తాను. ఈ నల్లకొండలన్నిటినీ స్వయంగా శోధించి వారి జాడ తెలుసుకుంటాను" అనుకుంటూ ఆ ప్రదేశాన్ని వదిలి ముందుకు నడక మొదలు పెట్టాడు.

* * * * *

"అదిగో ఎర్ర కలువల కోన...." సూర్యోదయం అవుతున్న సమయంలో స్నేహితులు ఇద్దరినీ ఒక పెద్ద కొండలోయ దగ్గరికి తీసుకుపోయి ముందుకు చూపిస్తూ అన్నాడు సందీపుడు.

ఎత్తయిన కొండల మధ్యన ఉన్నది ఆ లోయ. నలుగురు మనుష్యులు పక్కపక్కన నడిచేటంత వెడల్పు మాత్రమే ఉన్నది అందులోకి దారి.

"నాకు తెలిసి పది పదిహేను తరాల నుంచీ ఎవరూ ఆ దారిలో ప్రయాణం చేసింది లేదు... తెగించి ముందుకుపోయిన వారెవరూ ప్రాణాలతో వెనక్కి వచ్చింది కూడా లేదు" అన్నాడు సందీపుడు.

"సాహసవంతుల కోసం నువ్వు వెతికేది ఇందుకేనా? ఈ మార్గంలో నుంచి వెళ్ళగలిగితే సరిపోతుందా?" ఉన్నట్లుండి అడిగాడు గదాధరుడు.

చిన్నగా నవ్వి తల అడ్డం తిప్పాడు సందీపుడు. "ఇది మొదటి అడుగు మాత్రమే. ఇటువంటి అడుగులు ఇంకా ఎన్నెన్నో వేస్తే తప్ప ఫలితం కనిపించదు" అన్నాడు.

"మంత్రవాదివి నువ్వు... దీని తర్వాత ఇంకా ఎటువంటి పరీక్షలు ఎదురుపడతాయో తెలుసుకోలేవా?" అడిగాడు శ్యామలుడు.

"ఈ పర్వత పంక్తిలో, ఈ ప్రదేశం దగ్గరికి వచ్చిన వెంటనే నా శక్తులు మౌనం వహిస్తున్నాయి. మంత్రాలు పని చేయటం మానుకున్నాయి. తల్లులకు తల్లియైన, శంబరదేవి ఈ ప్రదేశంలోనే దాగుకుని ఉన్నదనటానికి ఇంతకంటే ప్రబల సాక్ష్యం ఇంకేంకావాలి?" ఎదుకు ప్రశ్నవేశాడు సందీపుడు.

అర్థం అయినట్లు తల ఊపవలసిన తన జతగాడు మౌనంగా ఉండి పోవడం శ్యామలుడు గమనించాడు.

"ఏమిటి నీ సందేహం?" అని అడిగాడు.

"చెట్లు పుట్టలతో నిండి ఉన్న ఈ పర్వత ప్రదేశంలో ఆ ఆలయం ఉంటుందని ఈ సందీపుడు గట్టిగా చెపుతున్నాడు. ఈ మాత్రం తెలివి మాండలీకుడి చేతిలో హతమారిపోయిన దుహితుడికి ఎందుకు లేకపోయింది? నిమ్మతోటలు, సందుగాయ పేటికలు, కరకంకణాల కోసం ఎదురుచూస్తున్న దేవతలు వారందరూ ఎందుకు?" అడిగాడు గదాధరుడు.

సాలోచనగా తల ఊపాడు శ్యామలుడు. "ఆ మెలికలన్నిటికీ ఏదో ఒక పెద్ద కారణమే ఉండి ఉంటుంది. ఆ మెలికల్ని అనుసరించగల వాళ్ళే ఈ ప్రదేశంలో అడుగు పెట్టగలరని నాకు అనిపిస్తోంది" అన్నాడు.

"ఆ పని చేసింది మనమే... కాబట్టి మనం మాత్రమే లోపలికి వెళ్ళగలం అని అర్థం..." అంటూ ముందుకు అడుగు వేశాడు.

"విజయోస్తు, వీరకుమారులారా... మీ కోసం నేను ఇక్కడే ఎదురు చూస్తూ ఉంటాను..." అంటూ తాను నిలబడిన ప్రదేశంలోనే చతికిలపడి కూర్చున్నాడు సందీపుడు.

స్నేహితులు ఇద్దరూ సన్నపాటి మార్గంలో నుంచి లోయలోకి అడుగుపెట్టారు. పాతిక అడుగులు వేసిన తరువాత ఒక పెద్ద బండరాయి ప్రక్క భాగంలో నుంచి అవతలికి పోయి అదృశ్యం అయినారు.

* * * * *

"అయ్యా రక్షించండి... కాపాడండి... బాధ భరించలేక పోతున్నాను"

గుండెల్ని కలిచివేసేటట్లు దీనారావాలు వినిపించటంతో ఎక్కడివాడు అక్కడ ఆగిపోయాడు గదాధరుడు.

తలతిప్పి చూసిన శ్యామలుడికి కనిపించాడు నల్లగా బొగ్గు కణికె రంగులో ఉన్న ఒక ఆటవికుడు ఎత్తుగా ఎదిగి ఉన్న ఒక చెట్టుకు కట్టివేయబడి ఉన్నాడు అతను.

"ఎవరూ చేశారు ఈ పని?" అతని సమీపంలోకి పోతూ అడిగాడు గదాధరుడు.

"మానవులు ఎవరూ అడుగు పెట్టలేని ఈ లోయలో ఏముంటుందో చూడటానికి వచ్చాను... కంటికి కనిపించని శక్తి ఏదో నన్ను ఈ చెట్టుకు కట్టి పడవేసింది. దయచేసి రక్షించండి" వేడుకున్నాడు అతను.

ముందుకు అడుగు వేయబోయిన శ్యామలుడిని వెంటనే అడ్డుకున్నాడు గదాధరుడు. క్రిందికి చూడమని సైగ చేశాడు.

జీర్ణావస్థకి చేరుకుంటున్న ఎముకలతో, బొమికలతో అసహ్యకరంగా ఉంది ఆ ప్రదేశం.

"సాయం చేయటానికి దగ్గరికి పోగానే మనల్ని విరుచుకుతినే నరమాంస భక్షకుడు వాడు. నరుడు కాదు" అన్నాడు చిన్న కంఠంతో.

"నరుడైనా కాకపోయినా నోరు తెరిచి సాయం అడిగాడు. చేయవలసిందే" అంటూ తన కరవాలంతో ఆ మనిషి బంధనాల్ని ఛేదించాడు శ్యామలుడు.

గదాధరుడి అనుమానం యధార్థమేనని వెంటనే నిరూపితమైంది. వెర్రిగా నవ్వుతూ అతని మీదికి లంఘించాడు ఆ వ్యక్తి.

"నరికేయ్ మిత్రమా... ఆ తలమీద వేటు వేసేయ్" బిగ్గరగా హెచ్చరించాడు గదాధరుడు.

తన కరవాలాన్ని క్రిందికి వదిలి, వట్టి చేతులతోనే అతన్ని ఎదిరించాడు శ్యామలుడు. పావుఘడియ పట్టింది అతనికి, సరియైన దెబ్బ కొట్టడానికి. పిడికిలి బిగించి మొఖం మీద కొట్టిన మరుక్షణం – మోకాళ్ళ మీద కూలబడిపోయాడు అతను.

తన కత్తితో అతని తలను నరకబోయిన గదాధరుడిని బలవంతంగా ఆపాడు శ్యామలుడు. "సాయం చేయమని నోరు తెరిచి అడిగాడు. చేశాము. వదిలేయ్" అంటూ వెనక్కి నెట్టాడు.

"వాడు నిన్ను హతమార్చటానికి ప్రయత్నం చేశాడు మర్చిపోయావా?" అడిగాడు గదాధరుడు.

"ప్రయత్నం చేశాడు గాని, ఫలితం కనిపించలేదు గదా..." అంటూ ముందుకు నడిచాడు శ్యామలుడు. అతనితో పాటు పది అడుగులు వేసి వెనక్కి చుశాడు గదాధరుడు.

మోకాళ్ళ మీద కూలబడి ఉండవలసిన మనిషి స్థానంలో చిరునవ్వులు చిందిస్తూ నిలబడి ఉన్నది ఒక అందాల యువతి.

"సాహసవంతులకు అపజయం అనేది లేదు. మానవత్వం మూర్తీభవించిన వీరకుమారులకు లక్ష్య సాధన ఏమంత కష్టసాధ్యం కాదు" మృదుమధురంగా చెప్పింది ఆమె.

"ఎవరు నువ్వు? ఏమిటి ఈ పరీక్ష?" అంటూ ఆమె వైపు అడుగులు వేయబోయాడు గదాధరుడు.

నవ్వుతూనే మటుమాయం అయిపోయింది ఆ సుందరి.

"ఇదేదో చాలా విచిత్రంగా ఉన్నది మిత్రమా... నిజంగానే శంబరదేవి ఆలయం ఈ ప్రదేశంలో ఉండి ఉంటుందంటావా?" శ్యాములుడిని అడిగాడు గదాధరుడు.

"ఉంటుందనే అంటున్నాడు సందీపుడు. ఉన్నదో లేదో చూడటం కోసమే మనం బయలుదేరాము. మధ్యలో లేని పోని అనుమానాలు దేనికి?" అంటూ వేగంగా నడవటం మొదలు పెట్టాడు శ్యాములుడు.

ఉన్నట్లుండి అతని భుజం మీద చెయ్యివేసి, ముందుకు పోనీయకుండా ఆపాడు గదాధరుడు.

"మానవత్వం మరిచిపోని వీరకుమారులకు విజయం లభించటం సర్వసాధారణమని చెప్పింది ఆ మాయం అయిపోయిన సుందరి..." అన్నాడు.

తల ఊపాడు శ్యాములుడు.

"ఇప్పుడు గనుక ఇంకో పరీక్ష గనుక ఉంటే సరిగ్గా ఆ మాటలకు విరుద్ధంగా జరుగుతుందని నాకు అనిపిస్తోంది. ఆ సుందరి చెప్పిన మాటల్ని నమ్మి మనం మానవత్వం ప్రదర్శిస్తే చిక్కుల్లో పడటం తప్పనిసరి" చిన్నగా అన్నాడు గదాధరుడు.

"ఎందుకు నీకు అలా అనిపిస్తోంది?" అడిగాడు శ్యాములుడు.

చేతిని ఎత్తి చుట్టూ చూపించాడు గదాధరుడు. "ఈలోయ చాలా చిన్నది. గట్టిగా ఇంకో వంద ధనువుల దూరం పోగలిగితే అంతం అయిపోతుంది. కాబట్టి ఆ ఆలయం ఏదో దగ్గిర్లోనే ఉండి ఉండాలి. మనం ఎదుర్కోవాల్సిన పరీక్ష ఏదైనా ఉండి ఉంటే అది ఇప్పుడే మొదలు కావాలి...." అన్నాడు గదాధరుడు.

అతను ఆ మాటలు అంటున్న క్షణంలోనే వికటంగా నవ్వుతూ వారి ఎదుట ప్రత్యక్షం అయ్యాడు మంత్రవాది మాండలీకుడు. వంటరిగా లేడు అతను. ఒక చేత్తో నీలమణి జుట్టు పట్టుకుని ఉన్నాడు. రెండవ చేత్తో యువరాణి మెడను బిగించి ఉంచాడు.

"నేనే గెలిచాను. చేజారిపోయిందని అనుకున్న యువరాణి తిరిగి నాకు దక్కింది. ఇక్కడికిక్కడే యువరాణిని బలి ఇచ్చేస్తాను... ఆలయాన్ని దర్శించుకుని, అజేయుడిని అవుతాను. మీరు పడిన కష్టం వృధా అయిపోయింది. వెనక్కి తిరిగి వెళ్ళిపొండి" ఖంగుమంటున్న కంఠంతో చెప్పాడు.

"వెళ్ళకపోతే ఏం చేస్తావ్?" అడిగాడు శ్యామలుడు.

"సర్వనాశనం చేస్తాను. అగిజ్వాలల్లో భస్మం చేస్తాను...." అన్నాడు మాండలీకుడు.

గదాధరుడి వైపు చూశాడు శ్యామలుడు. తల ఊపాడు అతను. ఇద్దరూ కలిపి ఒకేసారి మాండలీకుడి మీదికి దూసుకుపోయారు.

తన మంత్ర దండాన్ని బలంగా నేలలో గుచ్చాడు మాండలీకుడు.

వికృతమైన శబ్దాలు చేస్తూ రెండుగా చీలింది నేల. లోతు ఎంతుందో తెలియని బ్రహ్మాండమైన గోయి ప్రత్యక్షం అయింది. భగభగమంటున్నాయి ఆ గోతిలో మంటలు... భరించరాని వేడిమి వాతావరణం నిండా అలుముకోవటం మొదలు పెట్టింది.

"పడిపోండి... మంటల్లో పడి భస్మమైపోండి" అంటూ మంత్ర దండాన్ని ఊపాడు మాండలీకుడు.

తల్లక్రిందులుగా పడిపోయారు స్నేహితులు ఇద్దరూ ఆ మంటల్లో...

"కరకంకణాలను ధరించిన దేవత పేరేమిటి మిత్రమా...." పడుతూ పడుతూ అడిగాడు గదాధరుడు శ్యామలుడుని.

"నాకు తెలియదు. కంకణాల దేవత అనుకోవచ్చు" అన్నాడు శ్యామలుడు.

"తల్లీ... ఒక్కసారి సాయం చేయ్... ఇంకెప్పుడు ఏదీ అడగబోను" బిగ్గరగా అరిచాడు గదాధరుడు.

పకపకమని నవ్వుతూ ప్రత్యక్షం అయింది ఆ దేవత... తన చేతుల్ని జాచి అతన్నీ, శ్యామలుడినీ నేల మీదికి చేర్చింది.

"వందనాలు తల్లీ... నీకు శతకోటి వందనాలు...." అంటూ చుట్టూ చూసి ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు గదాధరుడు.

ఎదుట ప్రత్యక్షమై ఉండవలసిన దేవత లేదు. నీలమణిని, యువరాణిని బంధించి తీసుకువచ్చిన మాండలీకుడు కూడా లేదు.

"నేను భ్రమ పడ్డానంటావా మిత్రమా?" అడిగాడు అతను.

"భ్రమ పడటం యదార్ధమే... కాని అది నువ్వు బయటికి చెపుతున్నమాట... నిజం ఏమిటంటే మాండలీకుడు ప్రత్యక్షం అయినట్లు నువ్వు నమ్మలేదు" అన్నాడు శ్యామలుడు.

తను ఆశ్చర్యపడుతున్నట్లు నటించటాన్ని వదిలేసి చిన్నగా నవ్వాడు గదాధరుడు.

“మనం కనిపించిన వెంటనే సర్వనాశనం చేయవలసిన మాండలీకుడు మనల్ని వెనక్కి వెళ్ళిపొమ్మని హెచ్చరించిన వెంటనే ఇది కూడా ఒక పరీక్ష అని నాకు అర్థం అయింది. అయితే కంకణాల తల్లి మనల్ని కాపాడటానికి వస్తుందని మాత్రం ఊహించలేదు” అన్నాడు.

“జరిగిపోయిన దాన్ని గురించి ఆలోచనలు వద్దు, జరగవలసింది ఏమిటో చూడు” అన్నాడు శ్యామలుడు.

“లోయ చివరి వరకుపోయి చూడటం మాత్రమే మిగిలి ఉంది.” అంటూ ముందుకు అడుగు వేశాడు గదాధరుడు.

పది అడుగుల దూరం కూడా పోకముందే వారిద్దరికీ వినిపించింది ఒక గాండ్రింపు. చెవులు చిల్లులు పడే స్థాయిలో ఉన్నది అది.

“క్రూరమృగం… సందీపుడి పెంపుడు పులి వంటిది కాకపోవచ్చు….” అంటూ తన కరవాలాన్ని వరలో నుంచి తీశాడు శ్యామలుడు.

ఎగుడు దిగుడుగా ఉన్నది ఆ ప్రదేశం. ఎత్తయిన బండరాళ్ళున్నాయి. ఆ బండల మధ్యలో నుంచి వారి మీదికి లంఘించింది ఒక శార్దూలం. తన గుండెల్ని గాయపరచబోయిన దాని ముంగాళ్ళ నుంచి తప్పించుకోవటానికి పక్కకు దూకాడు శ్యామలుడు.

ఎగుడు దిగుడుగా ఉన్న నేలమీద అడుగు తడబడింది. చేతిలోని ఆయుధం జారిపోయింది.

శ్యామలుడు తడబడటాన్ని చూసి అతనిమీదికి దుమకబోతున్న ఆ క్రూరమృగాన్ని ఎదిరించేందుకు తనూ ముందుకు దూకాడు గదాధరుడు.

శ్యామలుడి చేతిలోని ఆయుధం సూటిగా వచ్చి అతని గుండెలకు తగిలింది. ఎర్రటిరక్తం వెల్లువలా బయటికి వస్తూ ఉండగా, మొదలు నరికిన వృక్షం మాదిరి నేలకూలిపోయాడు అతను.

* * * * *

నిశ్చేష్టుడై పోయాడు శ్యామలుడు. తన కళ్ళు తనను ఏమారుస్తున్నాయో మోనని కూడా అనుకున్నాడు.

మడుగు కడుతున్నది గదాధరుడి గుండెల మీది నుంచి వెలువడుతున్న రక్తం. అతన్ని పడగొట్టింది తాను కాకపోయినా, అదే రకమైన విజయగర్వంతో భీకరంగా గర్జిస్తూ, మరోసారి శ్యామలుడి మీదికి దుమికింది ఆ క్రూరమృగం.

గదాధరుడిని మరిచిపోయాడు శ్యామలుడు. వట్టి చేతులతోనే ఆ మృగాన్ని ఎదుర్కొన్నాడు. మెడచుట్టూ చేతులు చుట్టి క్రిందికి దొర్లించాడు.

పంజాలతో కొట్టింది అది. ముఖం రక్తసిక్తమైనా, తన పట్టు వదలలేదు శ్యామలుడు. చురకత్తుల వంటి కోరలతో అతని చేతుల్ని కొరకటానికి చూసింది శార్దూలం.

అప్పుడు కూడా తన పట్టు సడలించలేదు శ్యామలుడు. పళ్ళు బిగించి, శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుంటూ మరింత పట్టు బిగించాడు.

తోకతో నేలను బాదుతూ గావురు గావురుమని అరిచింది ఆ మృగం. ఎగిరి ఎగిరి దూరంగా పారిపోవటానికి చూసింది. ఎంత ఎగిరినా, ఎంతగా అరిచినా శ్యామలుడి బాహువుల్ని వదిలించుకోవడం అసాధ్యమై ఆఖరికి మెడ వ్రేలాడ వేసింది.

దాని ఊపిరి ఆగిపోయిందని నిశ్చయం అయిన తరువాత వదిలి, తన జతగాడి దగ్గరికి దూకాడు శ్యామలుడు.

"అయిపోయింది మిత్రమా... నా పని అయిపోయింది. ఈ భూమిమీద నాకు నూకలు చెల్లిపోయినట్టున్నాయి" తడబడుతున్న కంఠంతో చెప్పాడు గదాధరుడు.

"పొరపాటు జరిగింది ఇలా అవుతుందని అనుకోలేదు ఒక్కక్షణం ఓపిక పట్టు" అంటూ తన దట్టీని తీసి అతని గాయం చుట్టు కట్టుకట్టాడు శ్యామలుడు.

"కత్తిమొన చాలా లోతుగా దిగింది మిత్రమా. అంత్యకాలం ఆసన్నమైనట్లే కనిపిస్తోంది. సందీపుడి దగ్గర ఏదైనా పరిష్కారం లభించవచ్చు...." అరమూసిన కనులతో అస్పష్టంగా అన్నాడు గదాధరుడు.

అతన్ని చేతుల్లోకి ఎత్తుకుని లోయముందు భాగంలోకి పరుగు తీయాలన్న కోరికను అతి బలవంతంగా అదుముకున్నాడు శ్యామలుడు.

ఆ ప్రదేశంలో శంబరదేవి కొలువై ఉండి ఉంటే కనిపెట్టటానికి సిద్ధమై వచ్చారు తాము ఇద్దరు. ఆ ప్రయత్నంలో తమ ప్రాణాలను పణంగా పెట్టటానికి

సిద్ధమైనారు. ఇప్పుడు ఒక ప్రమాదం ఎదురైన వెంటనే వెనుతిరగటం వీరత్వం అనిపించుకుంటుందా?

ఎగసుకు వస్తున్న ఆందోళనను అతి ప్రయత్నం మీద దిగ మ్రింగుతున్నాడు శ్యామలుడు. "చిన్నతనం నుంచీ ఒకే ప్రాణంగా పెరిగాం మనం ఇద్దరమూ, కష్టమైనా సుఖమైనా కలిసి అనుభవించాం. నువ్వు కొద్ది సేపు ఓపిక పట్టు. ఆ ఆలయం ఇక్కడ ఉన్నదో లేదో నేను తెలుసుకు వస్తాను. నువ్వు అనంతలోకాలకు వెళ్ళిపోయే పరిస్థితి వస్తే, నీతోపాటుగా నేను కూడా వస్తాను. తొందరపడకు" అంటూ గబుక్కున లేచి లోయ చివరి భాగంలోకి పరుగు తీశాడు.

*     *     *     *     *

"మాండలీకుడా... తొందరపడకపోతే నీకు ఆశాభంగం తప్పనిసరి...." అంటూ మాండలీకుడి ప్రక్కనే ప్రత్యక్షమైంది నీడవంటి ఆకారం.

నల్లకొండల్లో మూడవ వంతు భాగాన్ని జల్లెడ పట్టి తిరిగి చూశాడు మాండలీకుడు. మిట్టమధ్యాహ్నం అవుతూన్న సమయంలో ఒక చెట్టు క్రింద చతికిల పడ్డాడు.

"నేను నిన్ను ఆవాహన చేయలేదు" కోరగా చూస్తూ అన్నాడు ఆ ఆకారం వంక.

"ఒకసారి ఆవాహన చేసి ఒక మాట అడిగావు కాబట్టి, జాలితో నిన్ను హెచ్చరించటానికి వచ్చాను. నల్ల కొండల్లో రక్త తర్పణ జరిగింది" అన్నది ఆ ఆకారం.

"ఎవరి రక్తం? ఎక్కడ??" ఆతృత ఉదయిస్తుండగా అడిగాడు మాండలీకుడు.

"ఇంతకుముందు నీకు చెప్పిన వీరకుమారుల రక్తం. ఎక్కడో నేను సరిగ్గా చెప్పలేను. ఇక్కడికి సమీపంలోనే...." అన్నది ఆ ఆకారం.

కూర్చున్నవాడు కాస్తా గబుక్కున లేచాడు మాండలీకుడు. వేగంగా నడుస్తూ మరోసారి వెతకడం మొదలు పెట్టాడు.

పావుఘడియ తరువాత అతనికి కనిపించింది ఒక చెట్ల గుంపు. ఆ గుంపు మధ్యలో ఉన్న పర్ణశాల దగ్గిర, పిల్లి పిల్లలా ముడుచుకుని కూర్చున్న ఒక పెద్దపులిని ముద్దు చేస్తూ ప్రత్యక్షం అయింది యువరాణి.

తనను తాను నిగ్రహించుకోలేక పోయాడు మాండలీకుడు. బిగ్గరగా నవ్వుతూ గాలిలోకి ఎగిరి ఆమె ముందు నేలను తాకాడు.

అదిరిపడి అవతలికి పరిగెత్తబోయిన యువరాణి కేశాలను బిగించి పట్టుకుని, తన కేసి లాగాడు.

పిల్లిపిల్ల మాదిరిగా వగలు పోతున్న పెద్దపులి భీకరంగా గర్జిస్తూ ఎగిరి అతని మీదికి లంఘించే ప్రయత్నం చేసింది.

మంత్రదండాన్ని ఊపాడు మాండలీకుడు. తన ఎదుట ఏదో కొండరాయి ప్రత్యక్షం అయినట్లు దీనంగా అరుస్తూ వెనక్కి పడిపోయింది ఆ మృగం.

"యువరాణి నాకు దక్కింది నీలమణీ. నీ కుట్రలు ఇక్కడితో అంతం అయిపోయాయి. నీకు శక్తి ఉంటే వచ్చి రక్షించుకో" బిగ్గరగా అరిచాడు మాండలీకుడు.

విపరీతమైన ఆందోళనతో కంపించిపోతూ పర్ణశాలలో నుంచి బయటికి వచ్చింది నీలమణి. ద్వారాన్ని దాటి రెండు అడుగులు కూడా వేయకముందే ఆమె మీద పడింది బలమైన తాళ్ళతో తయారు చేయబడిన వల ఒకటి.

* * * * *

ఎంత ప్రయత్నించినా గాయపడి నేల కూలిపోయిన తన జతగాడి ముఖాన్ని కనుల ముందు నుంచి దూరంగా పెట్టలేకపోయాడు శ్యామలుడు.

ఆలస్యం అవుతున్న కొద్దీ అతని పరిస్థితి క్షీణించిపోతున్నదనే మాట అతన్ని అదేపనిగా కలవర పరచటం మొదలు పెట్టింది.

చెట్లు చేమలు బండలు, ముళ్ళపొదలు తప్ప మరేమీ కనిపించటం లేదు ఆ లోయ చివరి భాగంలో.

"నీలమణి కుమారుడు పొరపాటు పడ్డాడు. ఆలయం ఈ లోయలో ఉండి ఉండదు. గతంలో మాకు ఎదురైనట్లు ఏదో ఆధారం మాత్రమే లభిస్తుంది" తనలో తను అనుకుంటూ ఒక బండరాయి దగ్గిర నిలుచున్నాడు.

లోయనంతా గాలించటం పూర్తి అయింది కాబట్టి వెనుతిరిగి వెళ్ళి పోవటమే మంచిదని అనుకుంటూ ఉండగా – కనిపించింది అతనికి ఆ మాత్రం కను చివరల నుంచి.

అతను నిలబడిన బండరాయికి పాతిక అడుగుల దూరంలో మరో రాయి ఉన్నది. ఎవరో ఆడమనిషి తన చేతుల్ని జాచి నిలబడి ఉన్నట్లు.

ఝుల్లుమన్నది శ్యామలుడి శరీరం.

తమకు మాండలీకుడి భ్రమలో నుంచి బయటికి లాగిన కర కంకణాల దేవత స్వరూపం గుర్తుకు వస్తుండగా – పదే పది అంగల్లో ఆ బండను సమీపించాడు. ఆ దేవత చేతుల మాదిరిగానే ముందుకు పొడుచుకు వచ్చిన శిలా స్వరూపాలను స్పృశిస్తూ తల వంచి నమస్కరించాడు.

"శంబరదేవత ద్వారపాలకురాలివని, శక్తి సంపన్నురాలివని నిన్ను కొలుస్తూ ఉంటారు అందరూ. నీ కరుణా కటాక్ష వీక్షణాలు ఎటువంటివో, ఇంతకుముందే మేము తెలుసుకుని ఉన్నాము... దయచేసి మా అభిలాషను సఫలం చేయి తల్లీ...." అంటూ మోకరిల్లి శిరస్సును నేలకు ఆనించాడు.

దడదడమని శబ్దం చేసింది నేల. మోకాళ్ళమీద కూర్చోవటం అసాధ్యమై ముందుకు పడిపోయాడు శ్యామలుడు. తల ఎత్తి చూసేసరికి, కనులు మిరుమిట్లు గొలిపే నవరత్న ఖచితమైన ఆలయద్వారం అతని ఎదుట ప్రత్యక్షం అయింది.

* * * * *

"శంబరదేవత క్షుద్రశక్తి కాదు... యువరాణిని బలి ఇచ్చినంత మాత్రాన ఆ తల్లి నిన్ను కరుణించదు. మాండలీకుడా... మానవుడివని నిరూపించుకో... సాత్వికారాధనలతో ఆ తల్లిని ప్రసన్నం చేసుకోవటానికి ప్రయత్నించు...." తనను బంధించిన వలలో నుంచి బయట పడటానికి విఫల ప్రయత్నం చేస్తూ హితవు పలికింది నీలమణి.

"సమయాలు సందర్భాలు, ముహూర్తాలు, నక్షత్రాలు ఇక చూసేది లేదు... రక్త తర్పణ చేస్తే ఎటువంటి శక్తి అయినా ఎదుటికి వచ్చి తీరాలి. అది మంత్ర తంత్రాలను రచించిన మహామహుల శాసనం" అంటూ యువరాణిని క్రిందికినెట్టి తన మంత్ర దండాన్ని పెద్ద కరవాలంగా మార్చాడు మాండలీకుడు.

అదే సమయంలో భూకంపం వచ్చినట్లు చలించింది నేల. ఎంత ప్రయత్నించినా కాలు నిలదొక్కుకోలేక వెల్లకిలా పడిపోయాడు మాండలీకుడు.

* * * * *

తొమ్మిది మూరల ఎత్తున ఉన్నది శంబరదేవి బంగారు విగ్రహం. ఎవరు వెలిగించారో, ఎప్పుడు వెలిగించారో శ్యామలుడికి తెలియలేదు. ధగధగలాడుతూ దేదీప్యమానంగా వెలుగుతున్నాయి నేతి దీపాలు.

కరవాలాన్ని ఆలయం వెలుపలే వదిలి ఆ స్వరూపం దగ్గరికి పోయాడు అతను. సాష్టాంగ నమస్కారం చేశాడు.

"నరుడా... ఒకే ఒక కోరిక తీరుస్తాను. కోరుకో...." మృదు మధురంగా వినవచ్చింది ఒక కంఠం.

నెత్తురు మడుగులో పడి ఉన్న జతగాడి వదనం మరోసారి శ్యామలుడి కనుల ముందుకు వచ్చేసింది.

తరతరాలుగా ఎవరికీ అగుపించని ఆలయం తనకు కనిపించింది. కోరిన కోరికలను తీర్చే కల్పవల్లి ఒకే ఒక వరం కోరుకోమంటున్నది. తన జతగాడి గాయం నయమైపోవాలని అడిగితే అరక్షణికంలో జరిగిపోతుంది ఆ పని.

నాలుక చివరి వరకూ వచ్చిన ఆ కోరికను అతి బలవంతంగా అదుము కున్నాడు శ్యామలుడు.

"తల్లీ... నీ ఆలయం మరుగున పడటం వల్ల ప్రమథ రాజవంశం అల్లకల్లోలమై క్షీణదశకు వచ్చేసింది. వారి వల్ల అపరాధాలు ఏమైనా జరిగి ఉంటే వాటిని క్షమించి తిరిగి ఆ రాజవంశాన్ని రక్షించు. మాండలీకుడి వంటి దుష్ట మాంత్రికులు ఎవరూ ఎటువంటి దురాశకు లోను కాకుండా అనుగ్రహించు" చేతులు జోడిస్తూ వేడుకున్నాడు.

"నీకు నీ ప్రాణస్నేహితుడి కంటే ఈ విషయాలు ఎక్కువా? నీ జతగాడు క్షేమంగా ఉండాలన్న కోరిక లేదా?" మృదువుగా అడిగింది ఆ కంఠం.

"తల్లీ... మాట ఇచ్చాను. నీ ఉనికిని తెలుసుకోవటానికి నేను నా జతగాడు ఇద్దరమూ కష్టపడ్డాము. ఆ కష్టానికి ప్రతిఫలం ఉండాలి కదమ్మా...." అన్నాడు శ్యామలుడు.

కిలకిలా నవ్వింది ఆ కంఠం... "నిస్వార్థమైన నీ కోరిక నాకు చాలా నచ్చింది. ఈ క్షణం నుంచీ నా ఆలయం అందరికీ అగుపిస్తుంది" అన్నది.

ఆలయంలోని నేతి దీపాలు మరింత కాంతివంతం అయ్యాయి. తలవంచి నమస్కరించి, ఆలయం వెలుపలికి వచ్చాడు శ్యామలుడు.

"ఎందుకు ఇంత ఆలస్యం మిత్రమా... ఎంతసేపు ఎదురు చూడాలి? ఆకలితో నా కళ్ళు బైర్లు కమ్ముకున్నాయి." అంటూ అతనికి ఎదురు వచ్చాడు గదాధరుడు.

నిక్షేపంగా ఉన్నాడు అతను... గుండెల మీద ఉండవలసిన గాయం కనిపించలేదు.

“ఆ శార్దూలం కూడా ఈ శంబర దేవత సృష్టే. ఈ తల్లి పెట్టే పరీక్షల్లో భాగమే....” జరిగింది తలచుకుంటూ చెప్పాడు అతను.

* * * * *

## ముగింపు

భూకంపం వచ్చినట్లు నేల చలించటం వల్ల వెల్లకిలా పడిపోయిన మాండలీకుడి చేతిలోని కరవాలం కూడా అవతలకు విసిరి వేయబడింది. గబగబా పైకి లేచి దాని కోసం వెతకటం మొదలు పెట్టిన అతనికి నీలవేణిని పట్టి ఉంచిన వల మాయం అవటం కనిపించింది.

అదే సమయంలో దూరం నుంచి పరుగు పరుగున వస్తున్న సందీపుడు, అతనితోపాటుగా ఉన్న వీర కుమారులు కనిపించేసరికి మరింతగా మతిపోయి నంత పని అయింది.

“అందరినీ అంతం చేస్తాను. ఎవ్వరినీ వదిలిపెట్టను” మంత్ర దండాన్ని ఎత్తుతూ బిగ్గరగా అరవబోయాడు మాండలీకుడు.

“శంబర దేవత తిరిగి భూమి మీదికి వచ్చింది. నీ మంత్రాలు ఇక ఈ రాజ్యంలో పని చేయవు. ప్రాణాల మీద ఆశవుంటే పలాయనం చిత్తగించటం చాలా మంచిది” అతనికి మాత్రమే కనిపిస్తూ హెచ్చరించింది నీడవంటి ఆకారం.

మొండిగా నిలబడి తన ప్రతాపాన్ని ప్రదర్శించటం శ్రేయస్కరం కాదని అర్థమైంది మాండలీకుడికి. సాధారణమైన మానవుడి మాదిరి పరుగు మొదలు పెట్టాడు మాండలీకుడు.

సందీపుడు, అతనితోపాటుగా వస్తున్న శ్యామల గదాధరులు పర్ణశాలను సమీపించే సమయానికి చాలా దూరం వెళ్ళిపోయాడతడు.

నీలమణి నగరానికి తిరిగి వచ్చింది. శంబరదేవి ఆలయం తిరిగి వెలుగులోకి వచ్చిందని అందరికీ తెలిసిపోయింది. ఆనందోత్సాహాలతో ఆమెకు వెన్ను దన్నుగా నిలిచారు నగర ప్రజలు. పదవీచ్యుతుడైనాడు నగరపాలకుడు. కారాగారంలో ఉన్న చక్రవర్తి తిరిగి సింహాసనం మీదికి చేర్చబడ్డాడు.

ఒకనాటి సాయం సమయంలో నీలమణిని తన మందిరంలోకి పిలిపించుకుని శంబరదేవి ఆలయాన్ని భూమి మీదికి తీసుకువచ్చిన యువకుల గురించి అడిగాడు చక్రవర్తి.

ఆయనకు వచ్చిన ఆలోచన నల్లకొండల్లో ఉన్నప్పుడే వచ్చింది నీలమణికి. మాండలీకుడు పరిగెత్తి పారిపోయిన తర్వాత, నెమ్మదిగా శ్యామలుడిని కదిలించాలని అనుకున్నది ఆమె.

ఆ రోజు చీకటి పడే సమయం వరకూ పర్ణశాల ముందు భాగంలోని మట్టి అరుగుమీద కూర్చున్నారు స్నేహితులు ఇద్దరు. చీకటిపడిన పావుఘడియకు నీడల మాదిరి మాయం అయిపోయారు.

తన మంత్రశక్తిని ఉపయోగించి వారి కదలికల్ని పరిశీలించింది ఆమె. శంబరదేవి కొలువై ఉన్న ప్రదేశం కావటం వల్ల ఆమె మంత్ర ప్రయోగం నిష్ఫలమై పోయింది.

స్నేహితులు ఇద్దరూ ఎటుగా ప్రయాణం చేస్తున్నారో కూడా తెలుసు కోవడం ఆమెకు చేతకాలేదు.

"ఏదో ప్రయోజనాన్ని ఆశించి గజదొంగలుగా మారిన వాళ్ళు ఆ స్నేహితులు. ఆ ప్రయోజనం సిద్ధించే వరకు వారు ప్రశాంతంగా నిలబడటం జరగదు...." చక్రవర్తికి చెప్పింది ఆమె.

శ్యామల గదాధరుల కథ ఇక్కడితో పూర్తి అయినట్లు కాదు. ఇంకా చాలా ఉంటుంది. మరెప్పుడయినా ఇంకోసారి చెప్పుకోవచ్చు.

*-: అయిపోయింది :-*


NARUDU-2
Novel By
Madhubaabu